## మా ఇతర ప్రచురణలు

### బ్రహ్మర్షి సద్గురు శ్రీశ్రీశ్రీ స్వామి రామానంద విరచితములు

- యోగామృతం (తెలుగు మరియు ఇంగ్లీష్ భాషలలో)
- వేదాంత రహస్య విచారిణి
- యోగ జ్ఞాన ప్రకాశిక
- జ్ఞాన బోధిని
- జ్ఞాన సూత్రము
- శ్రీ సద్గురు పూజా విధానము

### సద్గురు శ్రీ అంతర్ముఖానంద విరచితము

- యోగం - ధ్యానం - జ్ఞానం


**శ్రీ స్వామి రామానంద యోగ జ్ఞానాశ్రమము**

కామన్నవలస, గజరాయనివలస పోస్టు, బాడంగి మండలం, విజయనగరం జిల్లా - 532 578

Website: www.sryogajnanashram.com
E-mail : info@sryogajnanashram.com
Phone : 08944-258254, 94926 19215, 89856 87634

భవానీపురం, విజయవాడ, కృష్ణాజిల్లా. ఫోన్ : 9441114988, 98480 76675

ఓం శ్రీగురుభ్యోనమః

ఓం సద్గురు శ్రీశ్రీశ్రీ స్వామి రామానంద పరబ్రహ్మణే నమః

ఓం సద్గురు శ్రీశ్రీశ్రీ స్వామి శివానంద పరబ్రహ్మణే నమః

ఓం సద్గురు శ్రీశ్రీశ్రీ కృష్ణ పరమాత్మనే నమః

ఓం సద్గురు శ్రీశ్రీశ్రీ శంకర భగవత్పాదాచార్యనే నమః

ఓం సద్గురు శ్రీశ్రీశ్రీ నిత్యానంద పరబ్రహ్మణే నమః

ఓం సద్గురు శ్రీశ్రీశ్రీ వేదవ్యాస భట్టారకాయనమః

# శ్రీమద్భగవద్గీత

**యోగ - జ్ఞాన సారాంశం**

– బ్రహ్మర్షి సద్గురు శ్రీశ్రీశ్రీ స్వామి రామానంద పరమహంస


## శ్రీ స్వామి రామానంద యోగ జ్ఞానాశ్రమము

**కామన్నవలస, గజరాయనివలస పోస్టు, బాడంగి మండలం, విజయనగరం జిల్లా - 532 578**

Website : www.sryogajnanashram.com
E-mail : info@sryogajnanashram.com
Phone : 08944-258254, 94926 19215, 89856 87634

**భవానీపురం, విజయవాడ, కృష్ణాజిల్లా. ఫోన్ : 9441114988, 98480 76675**

# శ్రీమద్భగవద్గీత

## (యోగ-జ్ఞాన సారాంశం)

– బ్రహ్మర్షి సద్గురు శ్రీశ్రీశ్రీ స్వామి రామానంద పరమహంస

ప్రథమ ప్రచురణ : 1975

ద్వితీయ ప్రచురణ : ఏప్రిల్, 1994

తృతీయ ప్రచురణ : 26-03-2016
(సద్గురు శ్రీ స్వామి రామానంద పరమహంసల వారి జయంతి)

వెల : అమూల్యం

## ధ్యాన శ్లోకము

యోగాత్సంజాయతే జ్ఞానం జ్ఞానాద్యోగః ప్రవర్తతే
యోగజ్ఞాన పరోనిత్యం స యోగీ న ప్రణశ్యతి

శ్రీ స్వామి రామానంద యోగ-జ్ఞానాశ్రమ ప్రచురణలు

# శ్రీమద్భగవద్గీత

## విషయ సూచిక

| క్రమ సంఖ్య | వివరము | పేజీ నెం. |
|---|---|---|
| (1) | శ్రీ సద్గురు స్తోత్రము | i |
| (2) | తృతీయ ప్రచురణకు ప్రస్తావన | ii |
| (3) | ముందుమాట | v |
| (4) | గీతాసారము | x |
| (5) | శ్రీ భగవద్గీతా పారాయణక్రమః | xiv |
| (6) | శ్రీ భగవద్గీతా మాహాత్మ్యము | xx |
| (7) | అర్జున విషాద యోగము | 1 |
| (8) | సాంఖ్య యోగము | 22 |
| (9) | కర్మ యోగము | 57 |
| (10) | జ్ఞాన యోగము | 77 |
| (11) | కర్మ సన్న్యాస యోగము | 97 |
| (12) | ఆత్మసంయమ యోగము (ధ్యాన యోగము) | 113 |
| (13) | విజ్ఞాన యోగము | 136 |
| (14) | అక్షర పరబ్రహ్మ యోగము | 149 |
| (15) | రాజవిద్యా రాజగుహ్య యోగము | 163 |
| (16) | విభూతి యోగము | 179 |
| (17) | విశ్వరూప సందర్శన యోగము | 195 |
| (18) | భక్తి యోగము | 221 |
| (19) | క్షేత్రక్షేత్రజ్ఞ విభాగ యోగము | 232 |
| (20) | గుణత్రయ విభాగ యోగము | 248 |
| (21) | పురుషోత్తమప్రాప్తి యోగము | 260 |
| (22) | దైవాసుర సంపద్విభాగ యోగము | 272 |
| (23) | శ్రద్ధాత్రయ విభాగ యోగము | 283 |
| (24) | మోక్ష సన్న్యాస యోగము | 294 |
| (25) | శ్లోకానుక్రమణిక | 332 |
| (26) | పరమపద సోపానములు | 345-350 |



'నవనీతచోర' శ్రీబాలకృష్ణుడు

# శ్రీ సద్గురు స్తోత్రం

## ఓం శ్రీ గురుభ్యోనమః

ఓం గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః
గురుస్సాక్షాత్ పరబ్రహ్మ తస్మైశ్రీ గురవే నమః

ఓం నారాయణ సమారంభాం శ్రీ శివానంద మధ్యమామ్
శ్రీ రామానందా వధిమహం వందే గురు పరంపరామ్

ఓం యోగీశ్వరం ప్రణమ్యాహం శ్రీ రామానందం మహామతిమ్
యోగాభ్యాసం సమారంభే మోక్షసామ్రాజ్య దాయినమ్

ఓం గురవే సర్వలోకానామ్ భిషజే భవరోగిణామ్
నిధయే సర్వవిద్యానాం శ్రీ దక్షిణామూర్తయే నమః

ఓం బ్రహ్మానందం పరమసుఖదం కేవలం జ్ఞానమూర్తిమ్
విశ్వాతీతం గగన సదృశం తత్త్వమస్యాది లక్ష్యం
ఏకం నిత్యం విమలం అచలం సర్వధీ సాక్షీభూతమ్
భావాతీతం త్రిగుణరహితం సద్గురుమ్ తం నమామి

ఓం భగవతే సద్గురు శ్రీ రామానంద పరబ్రహ్మణే నమః
ఓం భగవతే సద్గురు శ్రీ శివానంద పరబ్రహ్మణే నమః

ఓం కృష్ణాయ వాసుదేవాయ దేవకీ నందనాయ చ
నందగోప సుతం దేవం కంసచాణూర మర్దనమ్
దేవకీ పరమానందం కృష్ణం వందే జగద్గురుమ్

ఓం కృష్ణం కమలపత్రాక్షం పుణ్యశ్రవణ కీర్తనమ్
వాసుదేవం జగద్యోనిమ్ నౌమి నారాయణం హరిమ్
ఓం భగవతే శ్రీకృష్ణ పరమాత్మనేనమః

ఓం లోకోద్ధరణార్థం అద్వైత స్థాపకాయ నమః
శ్రీమచ్ఛంకర భగవత్పాదాచార్య సద్గురవే నమః
వ్యాసం వశిష్ఠ నప్తారం శక్తేః పౌత్రమకల్మషమ్
పరాశరాత్మజం వందే శుకతాతమ్ తపోనిధిమ్

హరిః ఓం తత్సత్



శ్రీగోవర్ధన గిరిధారి

# శ్రీమద్భగవద్గీత తృతీయ ప్రచురణకు ప్రస్తావన

శ్రీమద్భగవద్గీతను వ్యాఖ్యానము చేయువారు లెక్కకు మిక్కిలిగా గలరు. కాని యోగేశ్వరులగు శ్రీకృష్ణపరమాత్మ భావమును ప్రకటించువారు చాలా చాలా అరుదు. ఎందుచేతననగా ... ఉదాహరణకు ఆంగ్ల భాషలో బహు ప్రావీణ్యత గలవారైననూ ఆంగ్లభాషలో వ్రాయబడిన ఆధునిక వైద్యగ్రంథములను ఏ విధముగా అర్థం చేసుకొనలేరో అదేవిధముగా యోగవిద్యకు సంబంధించిన శ్రీమద్భగవద్గీతను యోగాభ్యాసం చేయువారు తప్ప కేవలం సంస్కృత భాషా ప్రావీణ్యత గలవారు కించిన్మాత్రము అర్థము చేసుకొనలేరని వేరుగా చెప్పనవసరము లేదు.

అయితే 'యోగ' శబ్దమునకు అనేక అర్థములు తీసి, చివరకు క్రియా రూపంలో చెప్పబడిన యోగమునకు క్రియ చేయకుండగనే ఇతర యోగముల పేరు చెప్పి అనుభవశూన్యముతో దాటవేయుచూ, జ్ఞానయజ్ఞముల పేరుతో భగవద్గీతను వ్యాఖ్యానము చేయుచున్నారు.

ఏషా తేఽ భిహితా సాంఖ్యే బుద్ధిర్యోగే త్విమాం శృణు
బుద్ధ్యా యుక్తో యయా పార్థ కర్మబంధం ప్రహాస్యసి (2-39)

ఓ అర్జునా! ఇంతవరకు సాంఖ్యము (ఆత్మతత్త్వ జ్ఞానము) ను చెప్పితిని. ఇప్పుడు బుద్ధియోగమును చెప్పుచున్నాను. వినుము. ఈ బుద్ధియోగముచే కర్మ బంధముల నుండి విడువడగలవు అని చెప్పుటచే బుద్ధియోగమనునది సాంఖ్యయోగమూ కాదు, ఇతర కర్మలూ కాదు. మూడవది యగు అనుభవ జ్ఞానమును కలగజేయు యోగకర్మ యని గ్రహించవలెను.

*తత్ స్వయం యోగ సంసిద్ధః కాలేనాత్మని విందతి (4-38)*
*యోగాత్ సంజాయతే జ్ఞానం (త్రిశిఖి బ్రాహ్మణోపనిషత్-16)*
*యోగేన రహితం జ్ఞానం నమోక్షాయ భవేద్విధే (యోగ శిఖోపనిషత్)*
యోగము వలననే నిర్విశేష అనుభవ జ్ఞానము కలుగుచున్నది.
*న కర్మణా మనారంభాత్ నైష్కర్మ్యం పురుషోశ్నుతే (3-04)*
కర్మనారంభించియే నిష్కామ కర్మ సిద్ధిని బడయవలెను.
*సన్న్యాసం కర్మణా కృష్ణ పునర్యోగం చ శంససి (5-1)*

కర్మ సన్న్యాసము చేయమని చెప్పి మరల యోగమును ఎందులకు ప్రోత్సహించుచున్నావని అర్జునుడు ప్రశ్నించుటచే యోగమనునది ఒక క్రియకు సంబంధించినదని గ్రహించవలెను.

*'తత్తే కర్మ ప్రవక్ష్యామి యదజ్ఞాత్వా మోక్షసేఽ శుభాత్ '*

అశుభమైన సంసారము నుండి విముక్తిని కలుగజేయు ప్రత్యేక కర్మను చెప్పుచున్నానని చెప్పుటలో 'యోగకర్మ' యే ఇమిడియున్నది.

రాజవిద్యా రాజగుహ్యం పవిత్రమిదముత్తమమ్
ప్రత్యక్షావగమం ధర్మ్యం సుసుఖం కర్తుమవ్యయం (9-2)

అనుటలో రహస్యమైన యోగవిద్య, ఆచరించుటకు అతి సుఖకరమైనదని చెప్పుటచే, ఇది జన బాహుళ్యానికి అందుబాటులో లేదని అర్థమగుచున్నది. ఇందులకు కారణం యోగవిద్యలో బాహ్యనాడీ శోధన మరియు అంతర్ ప్రాణాయామమను రెండు భాగములు కలవు. రెండు నాసాపుటములను ఒకదాని పిమ్మట ఒకటి మూయుచూ బాహ్య వాయువును స్వీకరించి, కుంభించి విడచుచూ భస్త్రిక, అనులోమ, విలోమ, కపాలభాతి మొదలగు క్రియలు చేయుచూ పైపైన శ్వాస మార్గములను శుద్ధి చేయునది బాహ్యనాడీ శోధన. దీనినే యావత్ ప్రపంచము, నేటి ఉపన్యాసకులు ప్రాణాయామమనియూ, యోగా అనియూ, ప్రచారము చేసుకొనుచూ, "మేము యోగులము" అని భావించుచున్నారు.

కాని, రెండవభాగమగు అంతర్ ప్రాణాయామమును ఎవరునూ ఆచరించుటలేదు. ఇది బ్రహ్మవిద్యా సాంప్రదాయ గురువుల వద్దనే లభించును. దీనితో పాటు ఆత్మ విషయశాస్త్ర పరిజ్ఞానము కూడ ఇట్టి గురువుల వద్దనే లభించును. గురుకులవాసము ద్వారా పొందిన యోగ-జ్ఞానముల కలయికయే 'బ్రహ్మవిద్య' యని పిలువబడును. అంతర్ ప్రాణాయామమును శ్రీకృష్ణ పరమాత్మ అతి స్పష్టముగా వివరించియున్నారు.

*స్పర్శాన్ కృత్వా .............. నాసాభ్యంతర చారిణౌ* (5-27)

ఈ సాధనకు బాహ్యనాడీశోధన అవసరం లేకయే సద్గురువులు నేరుగా అంతర్ ప్రాణాయామాన్ని ఉపదేశించగలరు. ఈ పద్ధతి నేడు కొరవడుటచే 'యోగా' పేరుతో బాహ్య వాయువుతో చేయు సాధనయే బహుళ ప్రచారములోనికి వచ్చి, నిజమైన సహజయోగ పద్ధతి, సరళమైన పద్ధతి అడుగంటిన ఈ తరుణములో మన గురుదేవులు బ్రహ్మర్షి సద్గురు శ్రీశ్రీశ్రీ స్వామి రామానంద పరమహంస' లవారు బ్రహ్మవిద్యను వారి గురుదేవులు 'బ్రహ్మర్షి సద్గురు శ్రీశ్రీశ్రీ స్వామి శివానంద పరమహంస లవారి వద్ద పొంది, అనుభవించి, సిద్ధిపొంది శ్రీమద్భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్మ చెప్పినది ఈ యోగవిద్యయే అని, ఉపనిషత్తులతో సహా ఉటంకించుచూ యోగపరంగా భగవద్గీతను వ్యాఖ్యానింప కంకణము కట్టుకున్నారు.

అయితే ఈ భగవద్గీత వ్యాఖ్యానం రెండవ ప్రచురణ తరువాత నేను (అంతర్ముఖానంద) శ్రీ గురుదేవుల పాద పద్మములను ఆశ్రయించి పదునాలుగు సంవత్సరములు గురుశుశ్రూష చేసి, ఇంకను అనేక యోగ రహస్యములను వారివద్ద వివరంగా తెలుసుకొంటిని. అందుచే ఈ మూడవ ప్రచురణలో ఆ వివరములన్నియు సందర్భం వచ్చిన చోట అదనంగా చేర్చి పొందుపరిచితిని. మరియు సామాన్యులకు కూడా అర్థమగురీతిలో వివరించితిని. శ్రీ గురుదేవుల

వద్ద గ్రహించిన యోగరహస్యములతో పాటు సంపూర్ణం గావింపబడిన ఈ భగవద్గీత వ్యాఖ్యానం సాధకులకు నిరంతరము సహకరించగలదని భావించుచున్నాము.

శ్లో॥ యఇమం పరమం గుహ్యం మద్భక్తేష్వభిధాస్యతి
భక్తిం మయి పరాం కృత్వా మామేవైష్యత్యసంశయః (18-68)

అనునట్లు ఈ అంతర్ముఖ యోగవిద్యను నా భక్తులకు తెలియజేయువారు నన్నే పొందుదురు అని చెప్పుటచే గురువచనానుసారం, బ్రహ్మవిద్యను ఆచరించి చెప్పినవారలకు ఆ భాగ్యము కలుగునని భావించుచూ ముముక్షు జనులందరు ఈ సదవకాశమును సద్వినియోగం చేసుకొని, 'స్వయం తరిత్వా పరస్తారయేత్' తాను తరిస్తూ ఇతరులను తరింపజేయగల స్థాయికి చేరుకొనగలరని శ్రీ గురుదేవులను పదే పదే ప్రార్థిస్తూ ....

శుభమ్

ఇట్లు
అంతర్ముఖానంద
(డా॥ వందాన వెంకటేశ్వరరావు)
బ్రహ్మర్షి సద్గురు శ్రీశ్రీశ్రీ స్వామి రామానంద పరమహంస
లవారి పాదరజో రేణువు

శ్రీస్వామి రామానంద యోగజ్ఞానాశ్రమం
కామన్నవలస
18-02-2016, గురువారం (భీష్మ ఏకాదశి)

# ముందుమాట

భగవద్గీత (The song divine) ను వ్యాఖ్యానము చేసినవారు కోకొల్లలు కలరు. కాని గీత యొక్క యథార్థ సారమును తెలియువారు చాలా అరుదు. ఎందుచేతననగా భగవద్గీతలో ప్రతి అధ్యాయము వెనుక *'బ్రహ్మ విద్యాయాం యోగశాస్త్రే'* అని చెప్పబడిన ప్రకారము బ్రహ్మవిద్య యగు యోగసాధన నభ్యాసము చేసెడి వారు మాత్రమే యోగీశ్వరులగు శ్రీ కృష్ణ పరమాత్ముని అభిప్రాయమును తెలిసికొనగలరు. అంతియేగాని కేవలం సంస్కృత భాషా పాండిత్యం వలన తెలిసికొనజాలరు. మద్గురువరేణ్యులగు శ్రీశ్రీశ్రీ స్వామి రామానంద పరమహంస లవారు ఆజన్మ బ్రహ్మచారిగా నుండి ఘోరారణ్యములలో, కొండగుహలలో ప్రాణాయామరూప యోగసాధనయను తీవ్ర తపమాచరించి మౌనములోనుంటూ అద్వైతానుభూతినొంది భగవద్గీతకు భాష్యం వ్రాసియున్నారు.

ఉత్తమాధికారులకు సాంఖ్యయోగము(జ్ఞానమార్గము) ద్వారాను, మధ్యమాధికారులకు కర్మయోగము (మనస్సును చలింపనీయక బంధించు ప్రాణాయామకర్మ. దీనినే చిత్తవృత్తిని నిరోధించు యోగ మందురు) ద్వారాను పై రెండు మార్గములనే మోక్ష మార్గములుగా పురాతనము నుండి శ్రీ కృష్ణుడు చెప్పుచున్నట్లుగా 'గీతాసార' మందు మా గురుదేవులు ఋజువు చేసియున్నారు. భగవద్గీతను పఠనము చేయకమునుపు మకుటమువంటి 'గీతాసారము' ను చదివినచో చదువరులెల్లరకు భగవద్గీతను గురించి తేటతెల్లము కాగలదు. గ్రంథము చదువునపుడు గ్రంథకర్త యొక్క తపో జీవనమును ఎరిగినచో గ్రంథ భాష్యమందలి వారి అనుభవ పటిమను మనమర్థము చేసికొనగలము.

శ్రీ స్వామి రామానంద పరమహంస వారి శైశవ నామధేయము 'కుంజప్ప నంబియార్'. కేరళ రాష్ట్రములో కన్ననూరు సమీపములో 'కళ్ళియాసేరి' అను గ్రామములో వారు జన్మించిరి. తే 27-3-1902 దీన సౌరమానము ప్రకారము 'మీన' మాసము 'స్వాతి' నక్షత్రమున జన్మించిరి. పార్వతమ్మ, కుంజకుట్టి ఎళుత్తచ్చన్ అను పుణ్యదంపతులు వారి జననీజనకులు. ఐదేళ్ళ చిరుప్రాయములోనే వారికి పితృవియోగము సంభవించినది. బ్రహ్మవిద్యా కోవిదులగు వారి జనకులు తమ శిష్యకోటి సమక్షములో అనేక జ్యోతులు వెలుగుచుండగా అంద్వైక్యమగుచూ శరీరత్యాగము చేయుటను ఐదేళ్ళ ప్రాయములోనే శ్రీ కుంజప్ప నంబియార్ తలుపుసందులో నుండి పరికించిరి. దేవీభక్తి పరాయణురాలగు పార్వతమ్మ గారి ఆజ్ఞాపాలనలో పెరుగుచూ ఆమె ద్వారా స్మృతి పురాణేతిహాసములను ఆకర్ణించుకొనుచూ బాల్యావస్థ నుండియే శ్రీ కుంజప్ప నంబియార్ తీవ్ర వైరాగ్య బీజములతో పెరుగదొడగిరి. పోలీసు ఇన్‌స్పెక్టరగు శ్రీ కన్నన్ నంబియార్ అను అగ్రజుల ఆజ్ఞానుసారము బలవంతముగా సర్వే డిపార్టుమెంటులో చేరి 'సర్వేయరు'గా ఉద్యోగము చేయదొడగిరి. ఉద్యోగము చేయుచూ ప్రాపంచిక భోగములందు అత్యంత వైరాగ్యముతో,

అఖండానంద ప్రాప్తి కొరకై సద్గురువులనాశ్రయింప వెదకుచూ, 'సిద్ధవేద' మను 'మోక్ష సూత్ర' గ్రంథకర్తయు మరియు 'అపర వాల్మీకి' యు నగు బ్రహ్మర్షి సద్గురు శ్రీశ్రీశ్రీ స్వామి శివానంద పరమహంస వారిని సద్గురువుగా నెన్నుకొని, సిద్ధవేద' పఠనమనంతరము ఉపదేశము లేకయే ప్రాణాయామమును అభ్యసింప మొదలిడిరి. ఇది వారి పూర్వజన్మ సంస్కారమునకును, నేటి శిష్యకోటికి సద్గురుప్రాప్తికి నిదర్శనము కాగలదు. తదుపరి కేవల సందేహ నివృత్యార్థము శ్రీ శివానంద పరమహంస వారి ముఖతః ఉపదేశమును బడసిరి. పిదప యోగాభ్యాస సాధనను అనతి కాలములోనే తీవ్రతరము చేయుచూ, అత్యంత వైరాగ్యముతో 'సర్వేయరు' ఉద్యోగమునకు రాజీనామా సమర్పించి, కొలది మాసములు వారి స్వగృహమునందే పై అంతస్తులో సాధన కొనసాగించుచూ ఒక రోజున తల్లి, సోదరులను వీడి, కొంతదూరము ప్రయాణమై శాశ్వతముగా వారిని విడిచిపెట్టుచున్నట్లు ఉత్తరము ద్వారా తెలియపరిచిరి.

ప్రాణాయామ రూప తపస్సును ఉధృతము చేయుటకై ఏకాంతము నిచ్ఛగించుచూ, తిరుపతి, ఏర్పేడు మొదలగు ప్రదేశములలో వెదకుచూ చివరకు ఉత్తర భారతదేశములోని హృషీకేశ్‌లో పంచామృతము మరియు లక్ష్మణఝూల అవతలి ఒడ్డున కాళీకంబలి అను స్థలములలో రెండు మాసములు గడపి, అచ్చట గల సాధుజనుల ఆహార విహార నియమముల నిచ్ఛగించక బొంబాయి మీదుగా తిరుగు ప్రయాణము గట్టిరి. మార్గ మధ్యములో తీవ్ర జ్వరపీడితులై ఆరు మాసముల వరకు 'బాణగంగా' అనునొక సత్రములో గడపిరి. అట నుండి దక్షిణ భారతదేశము వైపు గోదావరి నది మీదుగా ఆంధ్ర కోస్తా ప్రాంతమున సంచరించుచూ విజయనగర పట్టణమునకు వచ్చి, ఒక సత్రములో నొక సన్న్యాసి ద్వారా కాషాయాంబరమును స్వీకరించి, బ్రహ్మచర్యాశ్రమము నుండి నేరుగా సన్న్యాసాశ్రమము స్వీకరించి 'స్వామి రామానంద' గా మారిరి. తపస్సునకు అనువగుచోట ఆహారము లభింపకయు, ఆహారము లభించుచోట తపస్సునకు అనుకూలము కాకపోవుటవలననూ అనేక ప్రాంతములు సంచరించుచూ, చివరకు రాజమండ్రి సమీపమున రైలు మార్గము ప్రక్కన గల బ్రిటీషు వారి మందుకొట్టులో (ఫిరంగులు దాచు స్థలము) ఏక వస్త్రముతో చిరకాలము యోగసాధన చేసిరి. అచట కూడ జనసంచారము అధికమగుటచే కోనసీమ ప్రాంత మందలి పొలములలో అనేక చోట్ల కుటీరములు నిర్మించుకొని తపస్సు చేసిరి. ఆ సమయములోనే పాముల మధ్య నుండి దేహస్మృతి లేక పోవుటచే శరీరము చుట్టూ పాములు చరలాడుచుండెడివి. పొలములో రైతులను భయభ్రాంతులను చేయుచున్న సర్పరాజముగల పుట్టను కూడా కలుపుకొని కుటీరము నిర్మించుకొని, రైతుల భయమును పారద్రోలి, సర్పరాజుపై గల భూతదయను చాటుకొనిరి. అనాటి నుండియూ 'పాముల స్వామి' గా జన బాహుళ్యమునకు పరిచయమయిరి. భద్రాచలము వద్ద పాపికొండలలో తీవ్ర తపమాచరించు సమయములో పట్టపగలు మిట్టమధ్యాహ్న సమయములో రెండు పులులు ఒక ఆవును చంపితినుటను శ్రీ స్వామి వారు ప్రత్యక్షముగా గాంచినారు. పిదప

ఆహారము తీసుకొనవలయునను స్పృహ కూడా కోల్పోవుటచే నిర్జన ప్రదేశమగు గోదావరీ నది యొడ్డున గల ధవళేశ్వరములో యోగీ జనార్దన స్వామి వారి ఆలయము ప్రక్కన గల కొండగుహలో మూడు సంవత్సరములు కఠోర తపస్సు గావించిరి. ఆ గుహలో కూడా నొక నాగుబాముండుటయు, దాని సహవాసముతోనే తపస్సు చేయుటయు రాజమండ్రి భక్తులగు కీ॥ శే॥ శ్రీ వెంకట కృష్ణయ్య (Dist. Judge) తదితరులు ప్రత్యక్షముగా అనేకమారులు పరికించిరి. దీర్ఘకాలము మౌనములో నుండుటచే అచ్చటి ప్రజలు శ్రీ స్వామివారిని 'మౌనస్వామి' అని కూడా పిలుచుచుండెడివారు. ధవళేశ్వరమందలి ఆ కొండ గుహలోనే శ్రీ స్వామీజీ జీవబ్రహ్మైక్య సిద్ధిని బడసిరి. తదనంతరమే వారి అనుభవైక బోధామృతమును లోకకళ్యాణార్థమై తమదరి చేరువారికి పంచిపెట్టుచు శిష్యజనులుగా తీర్చిదిద్దిరి. ధవళేశ్వరము నుండి మద్రాసు ప్రయాణించుచూ, మార్గ మధ్యములో విజయవాడలోని బుద్ధవారి శివాలయములో కొలది దినములు బసచేసి, తమ సహజ వేదాంత ప్రబోధ ఝంఝామారుతముతో అచ్చటకు చేరు వేదపండితులను ప్రభావిత మొనర్చిరి. క్రమ క్రమముగా తత్వ జిజ్ఞాసులు అధికమగుటచే, విజయవాడలోని భవానీపురంలో కీ॥ శే॥ శ్రీ ఓగిరాల రామమూర్తి, శ్రీ కోట మల్లయ్య, శ్రీ సీతాపతి, శ్రీమతి లక్ష్మీనరసమ్మ మొదలగు ప్రధమ శిష్యుల సమర్పణలతో క్రీ॥ శ॥ 1958లో నొక పెద్ద యోగజ్ఞానాశ్రమ స్థాపన జరిగినది. ధవళేశ్వరములో నుండగా శ్రీమతి బత్తుల వెంకాయమ్మ గారి అఖండ, అచంచల సేవ మిక్కిలి కొనియాడదగినది. విజయవాడలో నొక పెద్ద ఆశ్రమము వెలసియూ, ఉత్తరాంధ్రజనుల పూర్వజన్మ సుసంస్కార ప్రభావమేమోగాని శ్రీ గురుదేవులకు విజయనగరంజిల్లా కామన్నవలసలో మరియొక ప్రశాంత స్థలము కావలసి వచ్చినది. అందులకై పురిపాక వేసికొనియున్న నొక బ్రాహ్మణుని వద్ద అడిగినదే తడవుగా స్థలమునుకొని వారి సద్గురువులు, మన పరమ గురుదేవులునగు శ్రీ స్వామి శివానంద పరమహంస వారి ఛాయా చిత్రమును స్థాపించి, యావత్ ప్రపంచమునకు మకుటాయమానమగు యోగ–జ్ఞానాశ్రమమును స్థాపించి, తమ స్వానుభవమును ప్రస్థానత్రయ గ్రంథ (బ్రహ్మ సూత్రములు, ఉపనిషత్తులు, భగవద్గీత) సారమును నిరంతరము తమ అసమాన వాక్ప్రజ్ఞా పరంపరల ద్వారా, అనతి కాలములోనే, అతి సులభశైలిలో, తమ నాశ్రయించిన బహువిధ ప్రజ్ఞా దురంధరులగు శిష్యులకు బోధించుచుండెడివారు. 'అద్వయం సమను ప్రాప్య జడవల్లోక మాచరేత్' అను శృతి ననుసరించి బ్రహ్మవిద్వరిష్టులగు శ్రీ గురుదేవులు సామాన్య జనులలో జడునిగాను, అజ్ఞాని గాను గాన్పించుచూ క్రీ॥ శ॥ 1963 నుండి 1975 వరకు సుమారు పండ్రెండు వత్సరములు 'కామన్నవలస'లో ప్రపంచమునకు దూరముగా గడిపిరి. పిదప వారి యోగామృత రససుగంధ మాధుర్యములను అనతి కాలములోనే మధులుబ్ధ శిష్యకోటి ఆఘ్రాణింప మొదలిడినది. వారి వేదాంత సందేశములు ఆధునిక సైంటిస్టులను, డాక్టర్లను, లాయర్లను, హేతువాదులను, నాస్తికులను, పండితులను, సకల విద్యాకోవిదులను తృప్తికరముగా, సహేతుకముగా, నిస్సందేహ జనకముగా

సమాధాన పరచుటచే ప్రాణాయామ విద్యోపదేశములు దినదినమునకు అధికములు కావచ్చినవి.

భగవద్గీత పారాయణమనగా కేవలము శ్లోక పఠనము కాదనియూ, ఓంకార స్వరము (ప్రాణాయామం ద్వారా జనించునది) లేక ప్రణవ ధ్వనిని సుషుమ్నా మార్గము గుండా పైనగల బ్రహ్మరంధ్రము వరకు ప్రయాణము చేయించి సమీరణము చేయించుట (రంగరించి ఆత్మయందు కలుపుట) యనియూ, అట్లు చేయుట ద్వారా అల్పశక్తి గల జీవుడు అనంత శక్తి గల ఈశ్వరునిగా తాదాత్మ్యము జెందుననియూ, తన ప్రాణము పైకి (ఊర్ధ్వమునకు) పోయినచో తన ఆత్మయే తనకు బంధువనియూ, క్రిందికి వచ్చినచో తన ఆత్మయే తనకు శత్రువు అనియూ *(ఉద్ధరేదాత్మనాత్మానం ... రిపురాత్మనః),* యోగియే కర్మ ఫలత్యాగము చేసి తానుజేయు కర్మలయందు తాదాత్మ్యము చెందక, మనస్సు నెల్లప్పుడునూ అంతర్ముఖము జేసి, తన యాత్మయందే బాదుకొలిపి, కర్మ ఫలత్యాగము చేయుట ద్వారా కర్మ ఫలమును అనుభవింప అనావశ్యకత కలుగుటచే పునర్జన్మ రహితుడు కాగలడనియూ, తన ప్రాణశక్తి యొక్క ఊర్ధ్వ అధోగమనములను అనుసరించి సత్వరజస్తమో గుణములు కలుగుచున్నవనియూ త్రిగుణాత్మకమగు మాయను దాటవలెనన్న ప్రాణాయామము ద్వారా ప్రాణమును సంపూర్ణముగా భ్రూమధ్యములో లయము చేయవలెననియూ, సర్వరోగములకు కారణం కఫమేననియూ, కఫ సంహారిణియగు యోగాగ్నియే సర్వరోగ వినాశిని యనియూ, జ్ఞానా జ్ఞానములు మనలో గల జ్ఞానజ్యోతిస్సు (Mental Energy) ననుసరించి యుండుననియూ, ప్రాణాపాన సంఘర్షణ ద్వారా అజ్ఞాన తమము నశింప, ఆదిత్యుని వంటి జ్ఞానజ్యోతియే మిగులుననియూ, ప్రాణచలనమే మనశ్చలనమునకు కారణమగుచుండ మూలకారణమగు ప్రాణవాయు నిరోధముకానిదే పూజ, స్తోత్ర, జప, ధ్యానాదులవలన మోక్షము కలుగదనియూ, భగవద్గీతయందలి పదునెనిమిది అధ్యాయములలో పదునెనిమిది మార్గములు చెప్పబడలేదనియూ, వివిధ నామములతో చెప్పబడు యోగమే ఏకైక మోక్ష సాధనమనియూ, శృతి, యుక్త్యానుభూతులతో శ్రీ స్వామి రామానంద యోగీంద్రులు తమనాశ్రయించు శిష్యులను పులకాంకితులుగా జేయుచూ, సమయ సందర్భోచితములుగా వారి సేవలనొందుచూ, ఆజన్మాంతము వారిని జ్ఞప్తి యందుంచుకొను విధముగా శిష్యులననేక నవనీత పదజాలములతో అనుగ్రహించుచూ, కామన్నవలస ను కలియుగబృందావనము గా జేసి, తమ శిష్యులనందరిని శాస్త్రానుభవ ప్రమాణములలో ఆరితేరునట్లుగా జేసి వారి వాగామృతము భావి యుగములలో దావానలము వలె వ్యాపించునని అనుగ్రహించి, తగు శిష్యులకు తగు బాధ్యతలను ఒప్పగించి, తొంబది యొక్క సంవత్సరములు వరకు జీవన్ముక్తునిగా జీవించి, తే. 9-3-1993 ది మంగళవారం నాడు సాయంత్రము గం॥ 6.33 ని॥లకు మహాసమాధి నొంది, సర్వ భూతాంతర్జ్యోతియై వెలుగొందుచున్నారు.

కావున మోక్షార్థులగు వారు అనుభవము లేని వారి యొక్క భగవద్గీతా వ్యాఖ్యలను చదివి

సంశయగ్రస్తులుగాక, ప్రాణాయామమునభ్యసించుచూ శ్రీ మద్గురువరేణ్యుల వారి భగవద్గీత ఆంధ్ర ప్రతిపదార్థ సహిత టీకా తాత్పర్యములను చదివి, ఆనందామృతమును గ్రోలుదురని ఆకాంక్షిస్తూ,

ఇట్లు
భగవత్పూజ్య పాదాచార్య బ్రహ్మర్షి సద్గురు
శ్రీశ్రీశ్రీ స్వామి రామానంద పరమహంస ల వారి
పాదరజో రేణువు
డా॥ వండాన వెంకటేశ్వరరావు
ఏప్రిల్ 1994



# గీతా సారము

మానవుడు స్వభావముచే సుఖాపేక్షకలవాడు. వాని ప్రయత్నములన్నియు సుఖమును కోరియే ప్రవృత్తములగును. కాని మానవుడు శాశ్వతముగా సుఖమనుభవించజాలకయున్నాడు. వానికి కలుగు ప్రతియొక సుఖము దుఃఖమును వెంటబెట్టికొనియే యుండుటవలన నిట్టి సుఖదుఃఖముల బారి నుండి తప్పుకొని ప్రవర్తించుటకు మేధావియగు మానవుడు చిరకాలము నుండి ప్రయత్నించుచున్నాడు. జన్మజరా మరణముల నుండి విడివడుటకు జరుగునట్టి ప్రయత్నమే మోక్ష మార్గము. మోక్షమనగా దుఃఖము వెంటాడు సుఖము కంటె పరమమగు సుఖము. మానవులకట్టి నిరతిశయమైన సుఖము (ముక్తి) కలుగుటకు ఋషులు బహువిధములగు ఋక్కులచే (మంత్రములచే) అనేకవిధములగు మార్గములుపదేశించిరి. వర్ణనాతీతమగు నిరతిశయ బ్రహ్మసుఖమునీయగల నిష్ఠామార్గమున యోగజ్ఞానములను ద్వివిధ పద్ధతులు కలిగినవని భారత సంహిత యందు శ్రీ కృష్ణపరమాత్మచే అర్జునునకు బోధింపబడినది.

శ్లో॥ లోకేఽస్మిన్ ద్వివిధా నిష్ఠా పురా ప్రోక్తా మయానఘ
జ్ఞానయోగేన సాంఖ్యానాం కర్మయోగేన యోగినామ్ (3-3)

ఇట్లు యోగజ్ఞానములకు ప్రాధాన్యమిచ్చినందున శ్రీకృష్ణ పరమాత్మ యితర మార్గములను నిరాకరించినట్లు విదితమగుచున్నది. ఈ మార్గద్వయమందును జ్ఞానయోగము ప్రాపంచిక విషయరతుడగు సామాన్య మానవునకు దురవగాహమై దుష్ప్రాపమై యుండును. సామాన్య మానవుని చిత్తము బహు ప్రకారముల వ్యాకులమై యుండుటచే జ్ఞానయోగము వలన మానవుడు సుఖదుఃఖముల బారినుండి మోక్షమందలేకయున్నాడు.

శ్లో॥ బహువ్యాకుల చిత్తానాం విచారాత్తత్త్వధీర్నహి
యోగోముఖ్యస్తరస్తేషాం ధీదర్పస్తేననశ్యతి (వేదాంత పంచదశి)

అనేక రీతుల మనస్సు వ్యాకులతజెంది యుండగా ఆత్మతత్త్వమును గూర్చి ఆలోచన చేయుటవలన తత్త్వజ్ఞాన మలవడదు. ఒక్క క్షణమైనను మానవుని మనస్సు ఏ కర్మను చేయక ఉండజాలదని విజ్ఞుల భావము. *'నహికశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠత్యకర్మకృత్'* అని గీత చెప్పుచున్నది. కర్మలాచరించినందువలన ఫలమవశ్య మనుభవించవలెను. ఆ కర్మల ఫలము జన్మమరణ ప్రవాహమున బడుట యగును. కర్మాచరణ స్వభావము కల మనస్సు నిష్క్రియమై బ్రహ్మసుఖమనుభవించుటకు, జ్ఞానయోగమవలంబింప అశక్తమైనదగుటచే ధీ దర్పనాశకమగు యోగము ముఖ్యమని వేదాన్త పంచదశియు, *'కర్మయోగేన యోగినామ్'* అని శ్రీకృష్ణ పరమాత్మ ముఖమున శ్రీమద్భగవద్గీతయు యోగమునకు ప్రాముఖ్యమిచ్చినవి. ఇందువలన జ్ఞానయోగమును

నిరాకరించినట్లు కాదు. బలదర్పములుకల వృషభము పట్టుకొననశక్యమైయున్నచో నాసారంధ్రముల ద్వారా రజ్జువును బిగించి పట్టినవానికి వశమైయున్న విధమున బహువ్యాకులత కలిగిన మనస్సు, నాసారంధ్రముల ద్వారా ప్రాణాపాన వాయువులను చరింపజేసిన, వివశమై, నిగ్రహింపబడును. మనస్సునకేకాగ్రత కలిగి, బుద్ధియందలి కాలుష్యము యోగము వలన నశించును. యోగమనగా మనస్సు శుద్ధమయి, ఆత్మరతమై యుండుటకు చేయు ప్రాణాయామమని భావము. శ్రీకృష్ణ భగవానుడు శ్రీమద్భవద్గీతయందు అర్జునునకు ఉపదేశరూపమున సామాన్య మానవుని ఉద్ధరించదలచి పైనుదహరించిన ప్రాణాయామ యోగమును బోధించిరి. బహు జన్మార్జిత సంస్కారాతిశయమున వివేక వైరాగ్యములు కలవానికి జ్ఞానయోగము తారకమగును. ఇట్లు జ్ఞానయోగము సంస్కార విశేషము కలవారికి ఉపయోగపడుచుండగా కర్మయోగము సామాన్య మానవునకుపయోగపడును. కర్మయోగమున 'బంధనం మనసో నిత్యం కర్మయోగస్స ఉచ్యతే' అను వాక్యాను సారము మనస్సుకు నిశ్చలత్వము కలుగజేయునది ప్రాణాయామమని తెలియవలెను. దేహప్రాణేన్ద్రియాదులచే చేయబడునది కర్మయనబడును. ప్రాణాయామమున దేహప్రాణేన్ద్రియాదుల సాయము కలదు కావున ప్రాణాయామమును కర్మయోగమనిరి. యోగనిష్ఠాపరుడై కర్మనాచరించిన యోగి గతసంగుటచే ఆ కర్మ నిష్కామ కర్మయగును. అందుచే యోగి కర్మబంధము నుండి ముక్తుడయి స్వయముగా బ్రహ్మను తెలిసిన వాడగును. యోగము (ప్రాణాయామము) చే చిత్తము సంస్కరింపబడి మాలిన్య రహితమగును.

శ్లో॥ ప్రాణాయామ విశుద్ధాత్మా యస్మాత్పశ్యతి తత్పరం
తస్మాన్నాతః పరంకించిత్ ప్రాణాయామా దితిశ్రుతేః

(హరదత్త గణ కారికకు బసర్వాజ్ఞ రత్నటీక)

అనుటవలన ప్రాణాయామమున అన్తఃకరణము శుద్ధమయి పరమాత్మను దర్శించ గలుగునని విదిత మగుచున్నది. భగవద్గీత యందు కూడ యోగనిష్ఠ వలన అంతఃకరణము శుద్ధమయి మనోనిగ్రహము, ఇన్ద్రియ జయము కలవాడగునని యున్నది.

శ్లో॥ యోగయుక్తో విశుద్ధాత్మా విజితాత్మా జితేన్ద్రియః (5-7)

ఇట్లు ప్రాణాయామరూప యోగమభ్యసించిన యోగి శుద్ధాన్తఃకరణుడయి సమ్యగ్దర్శనమను జ్ఞానము కలవాడగును. అపరోక్షానుభూతియన సమ్యగ్దర్శన జ్ఞానము. దీనిని విశేష జ్ఞానమందురు. శాస్త్రజన్యమైన జ్ఞానము సామాన్య జ్ఞానము.

శ్లో॥ 'సర్వం జ్ఞాన ప్లవేనైవ వృజినం సంతరిష్యసి' అనియు

శ్లో॥ యథైధాంసి సమిద్ధోగ్నిః భస్మసాత్కురుతేఽ ర్జున
జ్ఞానాగ్నిః సర్వ కర్మాణి భస్మసాత్కురుతే తథా

అనియు జ్ఞానము యొక్క మహత్వము, ప్రాధాన్యము స్పష్టముగా చెప్పబడినది. తాదృశ విశిష్ఠ జ్ఞానమార్జించుటకు విచార మార్గము (జ్ఞానయోగము) కంటె యోగమార్గము (ప్రాణాయామరూప కర్మయోగము) ఉత్తమ మార్గమని భగవద్గీత చెప్పుచున్నది.

శ్లో॥ నహి జ్ఞానేన సదృశం పవిత్రమిహ విద్యతే
తత్స్వయం యోగ సంసిద్ధః కాలేనాత్మని విన్దతి (4-38)

అను శ్లోకమున యోగముచే జ్ఞానలాభము కలుగునని శ్రీకృష్ణ భగవానుడు వ్యక్తము చేసెను. అందువలన యోగమార్గము ఉత్తమ మార్గమని యనబడుచున్నది. అటుల యోగ ప్రాముఖ్యమును పదే పదే శ్రీకృష్ణ భగవానులు చెప్పుచునేయున్నారు. *'యోగీ యుంజత సతత మాత్మానం రహసి స్థితః'* అనియు, *'యుంజాన్నేవం సదాత్మానం యోగీ విగత కల్మషః'* అనియు, *'యోగస్థఃకురు కర్మాణి'* అనియు, *'తస్మాద్యోగాయ యుజ్యస్వయోగః కర్మసు కౌశలమ్'* అనియు, *'ఉప విశ్వాసనే యుంజాత్ యోగమాత్మ విశుద్ధయే'* అనియు, *'యుక్త అసీతమత్పరః'* అనియు, *'తపస్విభ్యోధికో యోగీ జ్ఞానిభ్యోపి మతోఽ ధికః' 'కర్మిభ్యశ్చాధికో యోగీ తస్మాద్యోగీ భవార్జున'* అనియు ఇంకను పెక్కుచోట్ల నిస్సంశయముగా యోగమునకు ప్రాముఖ్యమీయబడుచున్నది. ఇట్లు ముఖ్యమని భావించిన ప్రాణాయామము గుహ్యాతి గుహ్యమగు బ్రహ్మవిద్య కావున గురు పరమ్పర మూలమున తెలిసికొని అభ్యసించు విధమున రహస్యముగా నుంచబడినది. భగవద్గీత యందు ప్రాణాయామ వివరమును తెలియజేయు శ్లోకములు రెండు మాత్రమే యున్నవి.

శ్లో॥ స్పర్శాన్ కృత్వా బహిర్బాహ్యాంశ్చక్షుశ్చైవాన్తరేభ్రువోః
ప్రాణాపానౌ సమౌకృత్వా నాసాభ్యన్తర చారిణౌ అనియు (5-27)

శ్లో॥ అపానే జుహ్వతి ప్రాణం ప్రాణేఽ పానం తథాఽ పరే
ప్రాణాపాన గతిరుద్ధ్వా ప్రాణాయామ పరాయణాః అనియు (4-29)

సామాన్య మానవునకీశ్లోకములందు చెప్పబడిన ప్రాణాయామ స్వరూపము అగమ్యగోచరముగా నుండును. గురువుపదేశించిననే ఈ ప్రాణాయామము బోధపడును. గురూపాదేశానన్తరమే ఈ శ్లోకద్వయము అర్థమగును. ఇక నిచ్చట ఈ యోగస్వరూపమును స్థూలముగా చెప్పుట వలన రహస్యమును బయలు పరచుట కాదనియు, యోగమును అభ్యసించుటయందర్హత కలవారికి శ్రద్ధాసక్తులు కలుగుననియు తలచి యోగమును గూర్చి వివరించుచున్నాను.

## యోగ మనగా నేమి?

సామాన్య మానవుల దేహమున సర్వ ప్రవృత్తులు ఉచ్ఛ్వాస నిశ్వాసములున్నంత వరకు జరుగుచున్నవి. ప్రాణశక్తి యొక్క లక్షణములగు ప్రాణాపాన వాయువుల గతుల వలన ఉచ్ఛ్వాస నిశ్వాసములు కలుగుచున్నవి. ప్రాణ వాయువు ఊర్ధ్వగతి శీలమైనను అపానశక్తిచే ఆకర్షితమై యధోముఖమగుచున్నది. అప్పుడీవాయువు అపానమను పేర బరగుచున్నది. ఈ ప్రాణాపాన వాయులక్షణములు శ్వాస నిశ్వాసములు. శ్వాస నిశ్వాసములకు మూలములగు ప్రాణాపాన వాయువులను వానికి మూలమైన ప్రాణశక్తి యందు లయము చేయుట 'యోగ' మని సంగ్రహముగా చెప్పబడును. ప్రాణాపాన వాయువులు ప్రాణశక్తి యందు లయమగుటను ప్రాణాపానముల ఐక్యమనియు, జీవాత్మ పరమాత్మల ఐక్యమనియు నందురు. ప్రాణాపానవాయువులు ఏకమై అనగా వాని స్వరూపములను కోలుపోయి వానికి మూలమయిన ప్రాణశక్తి రూపమున నున్నవి కనుక ప్రాణాపాన లక్షణములైన శ్వాస నిశ్వాసములంతరించును. అప్పుడు యోగి అమరుడై బ్రహ్మానందమనుభవించును. కావున యోగి జితశ్వాసుడగుటకు ప్రయత్నించును ఆ ప్రయత్నమే ప్రాణాయామము.

ప్రాణాయామము వలన జితశ్వాసుడగును. జితశ్వాసుడగు యోగి జితేన్ద్రియుడగును. శ్వాస జయమువలన ఇన్ద్రియములు ఇన్ద్రియార్థములందు ప్రవృత్తములు కానేరవు. ఇన్ద్రియముల ద్వారా విజృంభించు మనస్సు ప్రాణాపానముల ద్వారా బహిర్ముఖమై విషయాసక్తమగును. విషయాసక్తత బంధమునకు కారణము. ప్రాణాపానములు ప్రాణశక్తి యందు లయమయిన పిమ్మట మనస్సునకు అన్యథా విజృంభించుటకు శక్తి లేక వివశమై అన్తర్ముఖమగును. అన్తర్ముఖమగు మనస్సు నిర్విషయ సుఖరతమై విషయ సుఖమల్పమని యెఱిగి వైరాగ్యము కలదగును. వివేకవంతమైన మనస్సునకు ప్రపంచమును బ్రహ్మమయమగు దృష్టితో చూచు నేర్పు కలుగును. అప్పుడు యోగి వాస్తవిక త్యాగి యగును.

*శ్లో॥ 'న కర్మణా న ప్రజయా న ధనేన త్యాగేనైకే నామృతత్వ మానశుః'* *(మైత్రాయణ్యుపనిషత్)*

అను వాక్యానుసారము యోగి పరమశాన్తిని బొందును. ఇట్లు ప్రాణాయామమును అభ్యసించిన యోగి, జ్ఞానియై అనగా ఆత్మతత్త్వ విదుడయి అమృత స్వరూపుడగును.

– స్వామి రామానంద పరమహంస

ఓం శ్రీకృష్ణ పరమాత్మనే నమః

వసుదేవసుతం దేవం కంసచాణూరమర్దనం
దేవకీ పరమానన్దం కృష్ణంవన్దే జగద్గురుమ్

---

# శ్రీ భగవద్గీతా పారాయణ క్రమః

## అద్వైత సాంప్రదాయః

## శ్రీ గురుధ్యానమ్

గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వర
గురుస్సాక్షాత్పరం బ్రహ్మ తస్మై శ్రీగురవేనమః
స్వాచార్యపర్యంతం గురుపరంపరా మనుసంధాయ

ధ్యానశ్లోకాః

వ్యాసంవశిష్ఠ నప్తారం శక్తేః పౌత్ర మకల్మషం
పరాశరాత్మజం వందే శుకతాతం తపోనిధిమ్
వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయవిష్ణవే
నమోవై బ్రహ్మ నిధయే వాశిష్ఠాయ నమోనమః
మునిం స్నిగ్ధాంబుదా భాసం వేదవ్యాస మకల్మషం
వేదవ్యాసం సరస్వత్యావాసం వ్యాసం నమామ్యహమ్
అచతుర్వదనో బ్రహ్మాద్విబాహురపరోహరిః
అఫాలలోచన శ్శంభుర్భగవాన్ బాదరాయణః
కృష్ణం కమలపత్రాక్షం పుణ్యశ్రవణ కీర్తనం
వాసుదేవం జగద్యోనిం నౌమి నారాయణం హరిమ్
కృష్ణాయ యాదవేన్ద్రాయ జ్ఞానముద్రాయ యోగినే
నాధాయ రుక్మిణీశాయ నమో వేదాన్త వేదినే
ప్రపన్న పారిజాతాయ వేత్రతోత్త్రైక పాణయే
జ్ఞానముద్రాయ కృష్ణాయ గీతామృత దుహే నమః
సారథ్యమర్జున స్యాదౌకుర్వన్ గీతామృతం దదౌ
లోకత్రయోపకారాయ తస్మైకృష్ణాత్మనేనమః
సర్వోపనిషదో గావో దోగ్ధా గోపాల నన్దనః

పార్థో వత్సస్సుధీర్భోక్తా దుగ్ధంగీతామృతం మహత్
పార్థాయ ప్రతిబోధితాం భగవతా నారాయణేన స్వయం
వ్యాసేన గ్రథితాం పురాణ మునినా మధ్యే మహాభారతం
అద్వైతామృతవర్షిణీం భగవతీమ్ అష్టాదశాధ్యాయినీం
అంబ త్వామనుసందధామి భగవద్గీతే భవద్వేషిణీమ్
గీతాశాస్త్రమిదం పుణ్యం యః పఠేత్ప్రయతః పుమాన్
విష్ణోఃపద మవాప్నోతి భయశోకాదివర్జితః
భారతామృత సర్వస్వం విష్ణోర్వక్త్రా ద్వినిస్సృతమ్
గీతాగంగోదకం పీత్వా పునర్జన్మ న విద్యతే
గీతాసుగీతాః కర్తవ్యాః కిమన్యైః శాస్త్రసంగ్రహైః
యాః స్వయంపద్మ నాభస్య ముఖపద్మా ద్వినిస్సృతాః
గీతాధ్యయన శీలస్య ప్రాణాయామ పరస్యచ
నైవ సంతి హి పాపాని పూర్వజన్మ కృతాన్యపి
అకృత్యమపి కుర్వాణో భుంజానో వా యతస్తతః
ఘోరం వైవస్వత స్థానం గీతాధ్యాయీ న పశ్యతి
మలనిర్మోచనం పుంసాం జలస్నానం దినేదినే
సకృద్గీతామ్భసి స్నానం సంసారమల మోచనం
శ్లోకమేకం తదర్థం వా పాదం పాదార్థ మేవవా
నిత్యం పఠతి యోభక్త్యా సమోక్ష మధిగచ్ఛతి
సర్వశాస్త్రమయీగీతా సర్వవేదమయో హరిః
సర్వతీర్థమయీ గంగా సర్వధర్మ మయోమనుః
ఏకం శాస్త్రం దేవకీపుత్ర గీతమ్ ఏకోదేవో దేవకీ పుత్ర ఏవ
ఏకోమంత్రో దేవకీపుత్రనామ కర్మాప్యేకం దేవకీ పుత్రసేవా

అథ న్యాసః

ఓమ్ అస్య శ్రీ భగవద్గీతాశాస్త్ర మహామంత్రస్య ॥ వేదవ్యాసో భగవాన్ ఋషిః ॥ ప్రాయేణానుష్టుప్ ఛందః ॥ క్వచిన్నానా ఛందాంసి శ్రీకృష్ణ పరమాత్మా దేవతా 'అశోచ్యానన్వ శోచస్త్వ' మితిబీజమ్ ॥ 'సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజే'తి శక్తిః ॥ 'అహం త్వా సర్వ పాపేభ్యో మోక్షయిష్యామి మాశుచ' ఇతికీలకమ్ ॥ 'మచ్చిత్త స్సర్వదుర్గాణి మత్ప్రసాదాత్త రిష్యసీ'తి కవచమ్ ॥ 'కిరీటినం గదినం చక్రహస్త' మిత్యస్త్రమ్ ॥ 'అనాది మధ్యాంత మనంతవీర్య' మితి ధ్యానమ్ ॥ జ్ఞానయజ్ఞేన భగవదారాధనార్థే గీతాపారాయణే (జపేవా) వినియోగః ॥

ఓం జ్ఞానాత్మనే శ్రీకృష్ణాయ అంగుష్ఠాభ్యాం నమః
ఓం ఐశ్వర్యాత్మనే గోవిందాయ తర్జనీభ్యాం స్వాహా
ఓం శక్త్యాత్మనే వేదవ్యాసాయ మధ్యమాభ్యాం వషట్
ఓం బలాత్మనే బలభద్రాయ అనామికాభ్యాం హుమ్
ఓం తైజసాత్మనే వాసుదేవాయ కనిష్ఠికాభ్యాం వౌషట్
ఓం వీర్యాత్మనే గాండీవధన్వనే అర్జునాయ
కరతల కరపృష్ఠాభ్యాం ఫట్
ఓం జ్ఞానాత్మనే శ్రీకృష్ణాయ హృదయాయ నమః
ఓం ఐశ్వర్యాత్మనే గోవిందాయ శిరసేస్వాహా
ఓం శక్త్యాత్మనే వేదవ్యాసాయ శిఖాయై వషట్
ఓం బలాత్మనే బలభద్రాయ కవచాయ హుమ్
ఓం తైజసాత్మనే వాసుదేవాయ నేత్రత్రయాయ వౌషట్
ఓం వీర్యాత్మనే గాండీవధన్వనే అర్జునాయ అస్త్రాయఫట్
భూర్భువ స్సువరో మితి దిగ్బంధః

## అథ ధ్యానమ్

కరకమలనిదర్శితాత్మముద్రః ।
పరికలితోన్నత బర్హి బర్హ చూడః ।
ఇతరకరగృహీతవేత్రతోత్రో ।
మమహృదిసన్నిధి మాతనోతు కృష్ణః । 1

ఆతామ్రమపాణి కమలప్రణయప్రతోద ।
మాలోలహార మణికుండల హేమసూత్రమ్ ।
ఆవిశ్రమాంబుకణ మంబుదనీల మవ్యా ।
దాద్యం ధనంజయరథాభరణం మహోనః 2

అగ్రే కృత్వా కమపి చరణం జానునైకేన తిష్ఠన్ ।
పశ్చాత్పార్థం ప్రణయసజుషాచక్షుషాఽ వేక్షమాణః ।
సవ్యేతోత్రం కరసరసిజేదక్షిణే జ్ఞానముద్రా ।
మాబిభ్రాణో రథ మధివసన్ పాతు నః సూతవేషః 3

వందే కృష్ణా౽ర్జునౌ వీరౌ నరనారాయణావుభౌ
ధృతరాష్ట్రసుతోన్మత్త గజారోహణ వల్లభౌ 4
(అతః పరం యథార్థ్వం సంపూజ్య పారాయణాదికం కార్యమ్,
పారాయణాన్తే గీతా మాహాత్మ్యమనుసంధేయమ్)

విశిష్టా ద్వైత సాంప్రదాయః

శ్రీశైలేశదయాపాత్రం ధీ భక్త్యాది గుణార్ణవమ్
యతీన్ద్ర ప్రణవంవన్దే రమ్యజామాతరం మునిమ్
లక్ష్మీనాథసమారంభాం నాథయామునమధ్యమాం
అస్మదాచార్య పర్యంతాం వందేగురుపరంపరాం
(అస్మద్గురుసమారంభాం నాథయాముని మధ్యమాం
లక్ష్మీవల్లభ పర్యంతాం వన్దేగురుపరంపరాం)
శ్రీధరాది స్వాచార్య పర్యంతాం గురుపరం పరా మనుసంధాయ

ధ్యానశ్లోకాః

జయతు జయతు దేవో దేవకీ నందనోయమ్
జయతు జయతు కృష్ణో వృష్ణివంశప్రదీపః
జయతు జయతు మేఘశ్యామలః కోమలాంగో
జయతు జయతు పృథ్వీభారనాశో ముకున్దః

ఫుల్లేన్దీవరకాన్తి మిందువదనం బర్హావతంస ప్రియమ్
శ్రీవత్సాఙ్కముదార కౌస్తుభధరం పీతామ్బరం సుందరమ్
గోపీనాం నయనోత్పలార్చిత తనుం గోగోపసంఘావృతమ్
గోవిన్దం కలవేణువాదనరతం శ్రీరుక్మిణీశం భజే

కృష్ణోరక్షతు నోజగత్త్రయగురుః కృష్ణం నమస్యామ్యహం
కృష్ణే నామరశత్రవో వినిహతాః కృష్ణాయ తుభ్యం నమః
కృష్ణాదేవ సముత్థితం జగదిదం కృష్ణస్య దాసోస్మ్యహం
కృష్ణే తిష్ఠతి సర్వమేత దఖిలం హేకృష్ణ రక్షస్వ మామ్
తత్త్వం ప్రసీద భగవన్ కురు మయ్యనాథే
విష్ణో కృపాం పరమకారుణికః కిల త్వం

సంసార సాగర నిమగ్న మనంత దీన
ముద్ధర్తు మర్హసి హరే పురుషోత్త మోఽసి

నమో నమో వాఙ్మనసాతిభూమయే
నమో నమో వాఙ్మన సైకభూమయే
నమో నమోఽనన్త మహావిభూతయే
నమో నమోఽనన్త దయైకసిన్ధవే

వ్యాసంవసిష్ఠ నప్తారం శక్తేః పౌత్రమకల్మషం
పరాశరాత్మజం వందే శుకతాతం తపో నిధిం

అచతుర్వదనో బ్రహ్మా ద్విబాహు రపరోహరిః
అఫాలలోచన శ్శమ్భుర్భగవాన్ బాదరాయణః

సమ్య జ్న్యాయకలాపేన మహతా భారతేనచ
ఉపబృంహిత వేదాయ నమో వ్యాసాయ విష్ణవే

సారథ్య మర్జునస్యా దౌ కుర్వన్ గీతామృతందదౌ
లోకత్రయోపకారాయ తస్మై కృష్ణాత్మనే నమః

ప్రపన్న పారిజాతాయ వేత్రతోత్రైక పాణయే
జ్ఞానముద్రాయ కృష్ణాయ గీతామృతదుహే నమః
కరకమల నిదర్శితాత్మ ముద్రః
పరికలితోన్నత బర్హి బర్హ చూడః
ఇతరకరగృహీత వేత్రతోత్రో
మమహృది సన్నిధి మాతనోతు శౌరిః
అగ్రేకృత్వా కమపిచరణం జానునై కేన తిష్ఠన్
పశ్చాత్పార్థం ప్రణయసజుషా చక్షుషావేక్షమాణః
సవ్యేతోత్రం కరసరసిజే దక్షిణే జ్ఞానముద్రా
మాబిభ్రాణో రథమధివసన్ పాతున స్సూతవేషః
కృష్ణం కమలపత్రాక్షం పుణ్య శ్రవణకీర్తనం
వాసుదేవం జగద్యోనిం నౌమినారాయణం హరిమ్
కృష్ణాయ యాదవేంద్రాయ జ్ఞానముద్రాయ యోగినే
నాథాయ రుక్మిణీశాయ నమో వేదాన్త వేదినే

## అ థ న్యా సః

ఓం అస్య శ్రీభగవద్గీతా శాస్త్రమహామన్త్రస్య ॥ శ్రీభగవాన్ వేదవ్యాసో ఋషిః ॥ అనుష్టుప్ ఛన్దః ॥ శ్రీకృష్ణ పరమాత్మా దేవతా అశోచ్యా నన్వశోచస్త్వం ప్రజ్ఞావాదాం శ్చభాషసే ఇతి బీజమ్ ॥ సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ఇతిశక్తిః ॥ అహంత్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః ఇతికీలకం ॥ మచ్చిత్త సర్వదుర్గాణి మత్ ప్రసాదాత్ తరిష్యసి ఇతి కవచమ్ ॥ కిరీటినమ్ గదినమ్ చక్రహస్తమ్ ఇత్యస్త్రమ్ ॥ అనాదిమధ్యాన్తమనంతవీర్యమ్ ఇతి ధ్యానమ్ ॥ జ్ఞానయజ్ఞేన భగవదారాధనార్థే శ్రీకృష్ణ పరమాత్మ ప్రీత్యర్థే గీతాపారాయణే వినియోగః

## అథ కరన్యాసః

నైనంఛిన్దన్తి శస్త్రాణి నైనం దహతి పావకః ఇత్యంగుష్ఠాభ్యాం నమః
నచైనం క్లేదయన్త్యాపో న శోషయతి మారుతః ఇతి తర్జనీభ్యాం నమః
అచ్ఛేద్యోఽ యమదాహ్యోఽ యమక్లేద్యోఽ శోష్య ఏవచ ఇతి మధ్యమాభ్యాం నమః
నిత్య స్సర్వగతః స్థాణు రచలోఽ యం సనాతనా ఇత్యనామికాభ్యాం నమః
పశ్యమే పార్ధ రూపాణి శతశోఽ థ సహస్రశ ఇతికనిష్ఠికాభ్యాం నమః
నానావిధాని దివ్యాని నానావర్ణాకృతీని చ ఇతి కరతల కరపృష్ఠాభ్యాం నమః

## అథ హృదయాదిన్యాసః

నైనం ఛిన్దన్తి శస్త్రాణి నైనం దహతి పావకః ఇతి హృదయాయ నమః
నచైనం క్లేదయన్త్యాపో న శోషయతి మారుతః ఇతి శిరసే స్వాహా
అచ్ఛేద్యోఽ యమదాహ్యోఽ యమక్లేద్యోఽ శోష్య ఏవచ ఇతి శిఖాయై వషట్
నిత్యస్సర్వగతః స్థాణురచలోఽ యం సనాతనః ఇతి కవచాయ హుమ్
పశ్యమే పార్ధ రూపాణి శతశోఽ థ సహస్రశ ఇతినేత్రత్రయాయ వౌషట్
నానావిధాని దివ్యాని నానావర్ణాకృతీని చ ఇత్యస్త్రాయ ఫట్
శ్రీకృష్ణప్రీత్యర్థే పారాయణే వినియోగః అతః పరం యథార్హం సంపూజ్య పారాయణాదికం కార్యమ్ పారాయణాన్తే గీతామాహాత్మ్యం పఠేత్

పారాయణాన్త పఠనీయ

## శ్రీమద్భగవద్గీతా మాహాత్మ్యము

గీతాశాస్త్ర మిదం పుణ్యం యః పఠేత్ ప్రయతః పుమాన్
విష్ణోః పదమవాప్నోతి భయశోకాది వర్జితః 1
గీతాధ్యయనశీలస్య ప్రాణాయామ పరస్య చ
నైవసన్తి హి పాపాని పూర్వజన్మ కృతాని చ 2
మలనిర్మోచనం పుంసాం జలస్నానం దినే దినే
సకృద్గీతామ్భసి స్నానం సంసారమల మోచనమ్ 3
గీతా సుగీతా కర్తవ్యా కిమన్యైః శాస్త్రసంగ్రహైః
యా స్వయం పద్మనాభస్య ముఖపద్మాద్వినిః సృతా 4
భారతామృత సర్వస్వం విష్ణోర్వక్త్రాద్వినిః సృతం
గీతా గంగోదకం పీత్వా పునర్జన్మ న విద్యతే 5
సర్వోపనిషదో గావో దోగ్ధా గోపాలనన్దనః
పార్థోవత్సః సుధీర్భోక్తా దుగ్ధం గీతామృతం మహత్ 6
ఏకంశాస్త్రం దేవకీపుత్రగీతం ఏకోదేవో దేవకీపుత్ర ఏవ
ఏకో మన్త్రస్య నామాని యాని కర్మాప్యేకం తస్య దేవస్య సేవా 7

స్వస్తిప్రజాభ్యః పరిపాలయంతాం
న్యాయేన మార్గేణ మహీం మహీశాః
గోబ్రాహ్మణేభ్యః శుభమస్తు నిత్యం
లోకాస్సమస్తా స్సుఖినో భవన్తు
వేదాన్తాఖిల వేద్యాయ శ్రీకృష్ణ బ్రహ్మణే ముదా
రుక్మిణీ సత్యభామాభ్యాం సేవితాయాస్తు మంగళమ్

శ్రీకృష్ణ పరమాత్మనే నమః

శ్రీకృష్ణ పరమాత్మనే నమః

# శ్రీమద్భగవద్గీతా మాహాత్మ్యము

ధరోవాచ:

భగవన్ పరమేశాన భక్తిరవ్యభిచారిణీ
ప్రారబ్ధం భుంజమానస్య కథం భవతి హే ప్రభో 1

శ్రీ విష్ణు రువాచ:

ప్రారబ్ధం భుంజమానోఽపి గీతాభ్యాసరతస్సదా
సముక్తస్సుఖీ లోకే కర్మణా నోపలిప్యతే 2
మహాపాపాది పాపాని గీతాధ్యానం కరోతి చేత్
క్వచిత్ స్పర్శం న కుర్వంతి నళినీదళ మంభసా 3
గీతాయాః పుస్తకం యత్ర యత్ర పాఠః ప్రవర్తతే
తత్ర సర్వాణి తీర్థానీ ప్రయాగాదీని తత్రవై 4
సర్వే దేవాశ్చ ఋషయో యోగినః పన్నగాశ్చ యే
గోపాలగోపికా వాఽపి నారదోద్ధవ పార్షదైః
సహాయో జాయతే శీఘ్రం యత్ర గీతా ప్రవర్తతే 5
యత్ర గీతావిచారశ్చ పఠనం పాఠనం శ్రుతమ్
తత్రాహం నిశ్చితం పృథ్వి నివసామి సదైవహి 6
గీతాశ్రయోఽహం తిష్ఠామి గీతా మే చోత్తమం గృహమ్
గీతాజ్ఞాన ముపాశ్రిత్య త్రీన్లోకాన్పాలయామ్యహమ్ 7
గీతా మే పరమా విద్యా బ్రహ్మరూపా న సంశయః
అర్ధమాత్రాక్షరా నిత్యా స్వనిర్వాచ్య పదాత్మికా 8
చిదానందేన కృష్ణేన ప్రోక్తా స్వముఖతోఽర్జునమ్
వేదత్రయీ పరానందతత్త్వార్థజ్ఞానమంజసా 9
యోఽష్టాదశ జపేన్నిత్యం నరో నిశ్చలమానసః
జ్ఞానసిద్ధిం స లభతే తతో యాతి పరం పదమ్ 10
పాఠేఽసమర్థస్సంపూర్ణే తదర్థం పాఠ మాచరేత్
తదా గోదానజం పుణ్యం లభతే నాత్ర సంశయః 11

త్రిభాగం పఠమానస్తు గంగాస్నానఫలం లభేత్
షడంశం జపమానస్తు సోమయాగఫలం లభేత్ 12
ఏకాధ్యాయం తు యో నిత్యం పఠతే భక్తి సంయుతః
రుద్రలోకమవాప్నోతి గణో భూత్వా వసేచ్చిరమ్ 13
ఆధ్యాయశ్లోకపాదం వా నిత్యం యః పఠతే నరః
స యాతి నరతాం యావన్మనుకాలం వసుంధరే 14
గీతాయాః శ్లోకదశకం సప్త పంచ చతుష్టయమ్
ద్వౌత్రీనేకం తదర్ధం వా శ్లోకానాం యః పఠేన్నరః 15
చంద్రలోక మవాప్నోతి వర్షాణామయుతం ధ్రువమ్
గీతాపాఠసమాయుక్తో మృతోమానుషతాం వ్రజేత్ 16
గీతాభ్యాసం పునః కృత్వా లభతే ముక్తి ముత్తమామ్
గీతేత్యుచ్చారసంయుక్తో మ్రియమాణో గతిం లభేత్ 17
గీతార్థశ్రవణాసక్తో మహాపాపయుతోఽపివా
వైకుంఠం సమవాప్నోతి విష్ణునా సహ మోదతే 18
గీతార్థం ధ్యాయతే నిత్యం కృత్వా కర్మాణి భూరిశః
జీవన్ముక్తస్స విజ్ఞేయో దేహాంతే పరమం పదమ్ 19
గీతామాశ్రిత్య బహవో భూభుజో జనకాదయః
నిర్ధూతకల్మషా లోకే గీతా యాతాః పరం పదమ్ 20
గీతాయాః పఠనం కృత్వా మాహాత్మ్యం నైవ యః పఠేత్
వృథా పాఠో భవేత్తస్య శ్రమఏవ ఉదాహృతః 21
ఏతన్మాహాత్మ్యసంయుక్తం గీతాభ్యాసం కరోతి యః
స తత్ఫల మవాప్నోతి దుర్లభాం గతి మాప్నుయాత్ 22

సూత ఉవాచ

మాహాత్మ్య మేతద్గీతాయా మయాప్రోక్తం సనాతనమ్
గీతాన్తే చ పఠేద్యస్తు యదుక్తం తత్ఫలం లభేత్ 23

ఇతి శ్రీ వరాహ పురాణే శ్రీ గీతా మాహాత్మ్యం సంపూర్ణం



శ్రీకృష్ణ కాళీయమర్దనం

ఓమ్ సద్గురుమూర్తయే నమః

ఓం శ్రీకృష్ణ పరమాత్మనే నమః

# శ్రీ మ ద్భ గ వ ద్గీ త

## ప్రథమాధ్యాయము

## అర్జున విషాద యోగము

సర్వోపనిషత్సారమే భగవద్గీత. భగవంతునిచే ప్రతిపాదింపబడుటచే ఇది భగవద్గీతయని ప్రసిద్ధిబడసినది. ఉపనిషత్తులు బ్రహ్మపదప్రాప్త్యుపాయ బోధకములు. ఉపనిషత్సారభూతమైన భగవద్గీతయందు బ్రహ్మపద ప్రాప్తిహేతువగు యోగానుష్ఠానమునకు ప్రాధాన్యమీయబడినది.

యోగము వలననేగాని, అన్యథా బ్రహ్మత్వసిద్ధి బడయుట దుర్ఘటము. అట్టి యీ గీతయందిది తొలి అధ్యాయము. అర్జున విషాదయోగమను పేర ప్రఖ్యాతమైనది. విషాదము వైరాగ్య, యోగ, జ్ఞానములకు మూలము. యుద్ధరంగమున జరుగబోవు బంధువధను భావించిన అర్జునునకు అజ్ఞతామూలమున విషాదమొదవెను. భక్త రక్షాపరుడగు శ్రీ కృష్ణ భగవానుడు ప్రియ భక్తుడగు అర్జునుని రక్షింపనుద్యుక్తుడయి తత్త్వోపదేశముచేసి వాని దుఃఖము తుదముట్టింప బూనుకొనెను. శ్రీకృష్ణభగవానుని యొక్క ఈ పూనికకు ఫలముగా శ్రీమద్భగవద్గీత అవతరించినది.

**ధృతరాష్ట్ర ఉవాచ:**

శ్లో॥ ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేతా యుయుత్సవః
మామకాః పాండవాశ్చైవ కిమకుర్వత సంజయ 1

సంజయ = ఓ సంజయా, ధర్మక్షేత్రే = ధర్మక్షేత్రమైన, కురుక్షేత్రే = కురుక్షేత్రమునందు, సమవేతాః = చేరియున్నవారును, యుయుత్సవః = యుద్ధకాంక్ష గలవారును (యుద్ధసన్నద్ధులై యున్నవారును) అగు, మామకాః = నా వారు, చ = మఱియు, పాండవాః = పాండు కుమారులు, ఏవ = కలిసి, కిమ్ = ఏమి, అకుర్వత = చేసిరి

తా. ధృతరాష్ట్రుడు సంజయునితో నిట్లనియె. ఓ సంజయా! ధర్మక్షేత్రమైన కురుక్షేత్రమందు, యుద్ధోత్సాహులై కూడిన నా కుమారులగు దుర్యోధనాదులును, పాండురాజు కుమారులగు ధర్మరాజాదులును ఏమిచేసిరి?

వి. *'కిమకుర్వత సంజయ'* అని ప్రశ్నింపబడినది. యుద్ధమునకు సన్నద్ధులైన పిదప, యుద్ధరంగమున యుద్ధమే ప్రారంభింపబడును. కాని వారు యుద్ధోత్సాహులై కూడినది ధర్మక్షేత్రమగు కురుక్షేత్రము. క్షేత్ర మాహాత్మ్యమువలన రజోగుణము నశించి యుద్ధమునుండి మరలుటకు

అవకాశము కలదు. కావున యేమి చేసిరని ప్రశ్న ఉదయించినది. 'ధర్మక్షేత్రే' అనుటవలన కూడ, జ్ఞానాజ్ఞానములు కూడియున్న క్షేత్రమున జ్ఞానఫలముగా యుద్ధ విరామము, అజ్ఞాన కార్యముగా యుద్ధప్రవృత్తియు కలుగవచ్చును. కావున యేమి చేసిరను ప్రశ్న సమంజసమగును.

*'సహి ధర్మస్సుపర్యాప్తో బ్రహ్మణః పదవేదనే'* *(భారతం శాంతిపర్వం)*

అను వాక్యమును బట్టి ధర్మశబ్దమున జ్ఞాన నిష్ఠా రూపమైన ధర్మమభిలషితమైనట్లు విదితము.

## ఈ శ్లోకం భగవద్గీతకు పీఠిక వంటిది

*'ఇదం శరీరం కౌంతేయ క్షేత్రమిత్యభిధీయతే '* *(13-2)*

ఈ శరీరమే క్షేత్రముగా పిలువబడుచున్నది. కనుక ధర్మ, కురు అను విశేషణములు శరీరమునకు సంబంధించినవేయగును. అందుచే ఈ శ్లోక తాత్పర్యము యుద్ధ వివరణకు బదులుగా అధ్యాత్మ సంబంధమైయున్నది. కోర్టులో వ్యాజ్యము వేయునపుడు దానికి సంబంధించిన వివరములన్నియూ ప్రధమంలో ఉద్భవమునందే పొందుపరచవలసియున్నది. అటులనే భగవద్గీతలోని 701 శ్లోకముల భావమంతయూ ఈ మొదటి శ్లోకమునందే నిక్షిప్తమైయున్నది. 'ధర్మ' మనగా జ్ఞానము. 'కురు' అనగా కర్మ చేయుట. అజ్ఞానము చేతనే కర్మచేయుట జరుగును. ఈ శరీర సంబంధమై జీవరూపము దాల్చిన పరమాత్మయే తన ప్రకృతితో కూడుకొని జ్ఞానాజ్ఞాన రూపములలలో వెలయుచున్నాడు. ఇచ్చట జ్ఞానము రెండు విధములు.

**1. అపరోక్ష జ్ఞానము:**

నిత్య శుద్ధ బుద్ధ ముక్తమై, స్వతస్సిద్ధముగా స్వయం ప్రకాశమానమై తన స్వరూపంలో తానుండుటయే అపరోక్ష జ్ఞానము.

**2. పరోక్ష జ్ఞానము:**

సచ్ఛాస్త్ర పఠనము, సద్గురు బోధ, సాధనల ద్వారా జనించునది పరోక్ష జ్ఞానము. ఉషోదయ కాలంలో పొగమంచు, కోట్ల కొలదీ మైళ్ళ దూరంలో గల బాలసూర్యుని కప్పివేయుచూ ప్రకాశింపనీయకున్నది. అటులనే మనలోగల జ్ఞాన సూర్యుని అజ్ఞానపు చీకటి ఆవహించి కప్పివేయుచున్నది. ఇది మన శరీరములో కఫ రూపంలో నుండి యథార్థ జ్ఞానమును (బ్రహ్మమును) కప్పివేయుచూ విపరీత జ్ఞానము (వ్యతిరేక జ్ఞానము)ను కలుగజేయుచూ శరీర, జగత్తులుగా భాసింపజేయుచున్నది (రజ్జు సర్ప భ్రాంతి). ఇది పాలనుండి ఉత్పన్నమై పాలనే కప్పివేయు మీగడ వలే, నీటిలో ఉత్పన్నమైన నాచు నీటినే కప్పివేయు చందమున అంతర్లీనముగానున్న ఆత్మను గోచరింపనీయకున్నది.

*'ఆత్మనః ఏష ప్రాణో జాయతే'* *(ప్రశ్నోపనిషత్ 3-32)*

ఆత్మనుండి ప్రాణము పుట్టుచున్నది. అది వాయురూపంలో క్రిందకు నిశ్వాసరూపంలో ప్రయాణం చేసి జీవరూపము దాల్చుచున్నది. తల్లి గర్భంలోనున్నపుడు ప్రతిజీవియూ శ్వాసగతి లేకపోవుటచే పూర్వ జన్మల జ్ఞానమూ, ఈశ్వర స్మరణమూ చేయుచుండును. జనన సమయములో శిశువు తనలో ప్రాణశక్తిని మొమ్మొదట నిశ్వాసరూపంలో బహిర్గతం చేయుచూ జ్ఞానమునూ, ఈశ్వర స్మరణమునూ మొదటి శ్వాసలోనే కోల్పోవుచూ మాయలోపడి అంతయూ మరచి పోవుచున్నది.

''गर्भ् में जब योगी... गिर पर खाया माटी'' (राम प्रसाद् सेन्)

*"గర్భ్ మే జబ్ యోగీ. . . గిర్ పర్ ఖాయా మాటీ"* (రామ్ ప్రసాద్ సేన్)

తా: గర్భంలోనున్న శిశువు శ్వాసలేక యోగివలె నుండును. భూపతనమైన వెంటనే మట్టి గరచి తన పూర్వ జ్ఞానమును కోల్పోయి మాయలో పడుచున్నాడు. ఈ విధముగా నిశ్వాసముతో ప్రారంభమైన ప్రాణగతి ఊర్ధ్వ అధోగమనముల ద్వారా శ్వాసచేయుచూ నిశ్వాసములో అధికంగాను (12 అంగుళముల వరకు విడిచిపెడుతూ) ఉఛ్వాసములో అల్పంగాను (8 అంగుళముల నుండియే బయట గాలిని పీల్చుచూ) చివరకు నిశ్వాసముతోనే అంతమై తుదిశ్వాసను విడిచిపెట్టుచున్నాడు (మృత్యువు). ఈ కారణముచే భ్రూమధ్యములోనున్న జ్ఞానభాస్కరుని గానలేక జీవించినంతకాలమూ యథార్థం తెలుసుకొనలేక ప్రకృతి పరమై భౌతిక వాంఛలకు లోనై, తీవ్ర దుఃఖరూపములగు మానసిక, శారీరక వ్యధలకు (అధి, వ్యాధులు) లోనై అవశ్యముగా మరణమునొందుచున్నాడు. ఇచ్చట 'కురు' అనగా కర్మ చేయుట రెండు విధములుగానుండును. 1. పరధర్మమగు ప్రకృతి కర్మలు చేయుచూ జనన మరణ రూప సంసార చక్రములో పడుట. 2. స్వధర్మమగు నివృత్తిరూప అంతర్ముఖ యోగకర్మ చేయుచూ నైష్కర్మ్య సిద్ధిని బడసి ఆత్మజ్ఞానము ద్వారా భవరోగ విముక్తుడగుట. ఈ రెండవదియగు యోగకర్మను ప్రోత్సహించుటకు చెప్పబడినదియే ఈ భగవద్గీత. *(బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే)* ప్రాణాయామరూప యోగవిద్య ద్వారానే సాధకుడు పరోక్షజ్ఞానము పొంది, పిమ్మట అపరోక్ష జ్ఞానానుభూతి ద్వారా విముక్తుడగుట. యోగాగ్ని ద్వారా జ్ఞానసూర్యుని కప్పివేయుచున్న పొగమంచు (వెన్నవంటి కఫము) కరిగి జ్ఞాన సూర్యుడు యథాతథముగా ప్రకాశించును.

*శ్లో.* *జ్ఞానేన తు తదజ్ఞానం యేషాం నాశితమాత్మనః*
*తేషాం ఆదిత్యవత్ జ్ఞానం ప్రకాశయతి తత్పరమ్* *(5-16)*

కావున సూర్యుని (ఆత్మ) ప్రకాశము యోగాగ్ని యొక్క తీవ్రతననుసరించి (పరోక్ష జ్ఞానము) యుండును. నిజానికి ఆత్మప్రకాశము (ఆదిత్యవత్ జ్ఞానం) ఎప్పుడూ ఒకే విధముగానున్ననూ,

మనలో ఉత్పన్నమగుచున్న యోగాగ్ని ద్వారా కఫము కరుగుచున్నకొలదియూ, సర్వనాడులూ శుద్ధియగుచున్న కొలదియూ ఆత్మజ్ఞానము వృద్ధియగుచున్నట్లు అనుభూతమగును. దీనినే పరోక్ష జ్ఞానమందురు. యోగారూఢ స్థితికి చేరిన పిదప పరోక్షజ్ఞానము తారాస్థాయికి చేరి, అపరోక్షానుభూతి ద్వారా పరోక్షజ్ఞానము కూడా అంతరించిపోవును.

*శ్లో॥ ఆరురుక్షోర్మునేర్యోగమ్ కర్మకారణముచ్యతే*
*యోగారూఢస్య తస్యైవ శమః కారణముచ్యతే (6-3)*

- ఇట్టి యోగసాధనకే బుద్ధియోగమనియు (2-39, 18-57), బుద్ధియుక్తమనియు (2-50), యుక్తమనియు (5-12, 6-8), బ్రహ్మయోగమనియు (5-21), ఓంకారమనియు (8-13), ప్రణవమనియు (7-8) చెప్పబడినది.
- సూర్యునికి, మనువునకు, ఇక్ష్వాకుడు మొదలగు రాజులకు ఉపదేశించిన యోగం ద్వారానే ధర్మోద్ధారణ, దుష్టశిక్షణ, శిష్టరక్షణ కొరకు తానవతరింతునని పరమాత్మ (నాల్గవ ఆధ్యాయంలో) చెప్పిరి.
- యోగకర్మను ఆచరించిననే నైష్కర్మ్యసిద్ధి కలుగును (3-4).
- యోగస్థుడై యుద్ధము చేసినచో సమత్వబుద్ధి కలిగి, పాపమంటకుండా యుండగలడు (2-4, 38).
- యోగియే సుకృత, దుష్కృత కర్మల ఫలములనిచటనే విడిచి, జన్మరాహిత్యం పొందగలడు (2-50, 51).
- యోగియే ఇంద్రియ నిగ్రహము కలిగి స్థితప్రజ్ఞుడు కాగలడు (2-61).
- జ్ఞానమునకు సమానమైనది, పవిత్రమైనది మరిలేదు. దానిని స్వయంగా యోగసంసిద్ధుడై పొందగలడు (4-38).
- యోగమే కర్మయోగము. ఇది కర్మసన్న్యాసము కంటే అనుభవయోగ్యమైనది (5-2).
- యోగము లేని సన్న్యాసము దుఃఖమునే కలుగజేయును (5-6).
- యోగము వలననే మనశ్శుద్ధి, మనోనిగ్రహము తద్వారా ఇంద్రియ నిగ్రహము కలుగును (5-7).
- యోగముద్వారా అంతఃసుఖము, అంతరారామము, అంతర్జ్యోతి దర్శనమగును (5-21).
- యోగమనగా ... శరీరము, మెడ, శిరస్సులను (నిటారుగా) సమాంతరముగా నుంచి, ఉచితాసనముపై కూర్చొని, దృష్టిని కనుబొమ్మల మధ్యలో (భ్రూమధ్యమున) నుంచి, నాసాభ్యంతరమగు ముక్కులోపలి రంధ్రముల వద్ద గొంతులోనే ప్రాణాపాన సంఘర్షణ చేయుట (6-13, 11, 5-21).

## అర్జున విషాద యోగము

- సాధనను పూర్తిగా అభ్యసింపలేకపోయిననూ సాధకునకు దుర్గతి కలుగదు. యోగభ్రష్టుడై మరుజన్మలో తిరిగి కొనసాగించుకొనగలడు (2-40, 6-40, 41, 42, 43, 44, 45).
- యోగియే ఇతర తపస్వుల కంటెను, శాస్త్రజ్ఞానములు చెప్పు వేదాంతుల కంటెను, వేదోక్త ప్రవృత్తి కర్మలు చేయువారి కంటెను అధికుడు (6-46).
- యోగియే ఆత్మతత్త్వ సాంఖ్యమును శ్రవణము చేసికొని, మనన నిధిధ్యాసల ద్వారా కర్మబంధము నుండి విడువడగలడు (2-39).
- యోగము చేయుచూ విజ్ఞానము ద్వారా పరమాత్మను సమగ్రముగా పొందగలరు (7అ).
- అభ్యాసయోగము చేయుచూ, మనసులో పరమాత్మను ధ్యానించుచూ, ఆ దివ్యపురుషుని పొందగలరు (8-8).
- యోగము అన్ని విద్యలయందు రాజవిద్య, రహస్యమైనది, పవిత్రమైనది, ప్రత్యక్ష ఫలితమునిచ్చునది. ఆచరించుటకు అత్యంత సుఖకరమైనది (9-2).
- యోగసాధనయే అనన్య చింతన. తద్వారా సాధకుని యోగక్షేమములను పరమాత్మ చూచుకొనును (9-22).
- యోగమే అనన్య భక్తి. తద్వారానే 'విశ్వరూపసందర్శన' సాధ్యమయ్యేది (11అ).
- అనన్యభక్తుడగు యోగియే సగుణోపాసకుడు (12-12).
- దేహాత్మ బుద్ధి కలవానికి యోగమే శరణ్యము (12-5). ప్రకృతి పురుషుల, క్షేత్ర క్షేత్రజ్ఞుల, జ్ఞాన జ్ఞేయముల అంతరము యోగియే తెలుసుకొనగలడు (13అ).
- యోగియే త్రిగుణాతీతుడు కాగలడు (14అ).
- యోగప్రయత్నము ద్వారానే తనలోగల ఆత్మను దర్శించుకొనగలడు. ఇతర ప్రయత్నములన్నియు నిరర్థకములు (15-11).
- యోగియే దైవీసంపద కలిగి మోక్షమునకు అర్హుడగుచున్నాడు (16అ).
- శ్రద్ధాళువులైననూ శాస్త్రవిధిననుసరించక అనగా యోగ-జ్ఞానములు లేక ఎంత పురుష ప్రయత్నము చేసిననూ, యజ్ఞ దాన తపస్సులు చేసిననూ మోక్షమునొందలేరు (17అ).
- యోగియే సర్వకర్మ ఫలత్యాగము చేయగలడు. అట్టివానికే యజ్ఞ దాన తపఃకర్మలు పవిత్రములగును. యోగియే మనఃప్రాణేంద్రియములను స్వాధీనము చేసుకొని సాత్త్విక ధృతి ద్వారా పరమేశ్వరునియందు అత్యంత భక్తి కలిగి, ఆతని నిజస్వరూపమును తెలుసుకొని ఆతనియందైక్యం కాగలడు (18అ).
- యోగివద్దనే సకలైశ్వర్యములూ, విజయమూ, నీతి ధ్రువముగా నుండును (18-78).

**సంజయ ఉవాచ:**

శ్లో॥ దృష్ట్వా తు పాండవానీకం వ్యూఢం దుర్యోధనస్తదా
ఆచార్యముపసంగమ్య రాజా వచనమబ్రవీత్ 2

తదా = అప్పుడు, రాజా = రాజైన, దుర్యోధనః = దుర్యోధనుడు, వ్యూఢం = మోహరించియున్న, పాండవానీకమ్ = పాండవ సేనను, దృష్ట్వా = చూచి, తు = మరియు, ఆచార్యమ్ = ద్రోణాచార్యుని, ఉపసంగమ్య = సమీపమునకు చేరి, వచనమ్ = (ఈ) వచనమును అబ్రవీత్ = పలికెను

తా. రాజైన దుర్యోధనుడు వ్యూహాకారముగా రచింపబడిన పాండవ సైన్యమును చూచి, ఆచార్యుడైన ద్రోణుని సమీపించి యీ క్రింది విధముగా పలికెను.

వి. సంజయుడనగా ఇంద్రియ నిగ్రహము కలిగినవాడు. సమ్యక్ + జయుడు అనగా ఇంద్రియములను బాగుగా జయించినవాడు. అట్టివానికి యోగబుద్ధి కలిగి, తద్వార దూరశ్రవణ, దూరదర్శనాది సిద్ధులు కలుగుట సహజము. అదియుకాక, వ్యాసమహాముని యొక్క అనుగ్రహమునకు పాత్రుడగుటవలన యోగసిద్ధులు కలిగి సంజయుడు ధృతరాష్ట్రునకు యుద్ధరంగమున శ్రీకృష్ణభగవానుని తత్త్వోపదేశమును వినిపించెను.

శ్లో॥ పశ్యైతామ్ పాండుపుత్రాణామ్ ఆచార్య మహతీం చమూమ్
వ్యూఢాం ద్రుపదపుత్రేణ తవ శిష్యేణ ధీమతా 3

ఆచార్య = ఓ గురువరా!, తవ = నీ యొక్క, శిష్యేణ = శిష్యుడును, ధీమతా = బుద్ధిమంతుడును అగు, దృపద పుత్రేణ = దృపద పుత్రుని (ధృష్టద్యుమ్నుని)చే, వ్యూఢామ్ = వ్యూహాకృతిలో నిలుపబడిన, పాండు పుత్రాణామ్ = పాండవుల యొక్క, ఏతామ్ = ఈ, మహతీమ్ = గొప్పదియైన, చమూమ్ = సైన్యమును, పశ్య = చూడుము

తా. ఓ గురువర్యా! మీ శిష్యుడును, బుద్ధిచతురత కలవాడును, ద్రుపదపుత్రుడును అగు ధృష్టద్యుమ్నుని చేత వ్యూహాకారముగా నమర్చబడిన గొప్పదగు పాండవ సైన్యమును చూడుము.

శ్లో॥ అత్ర శూరా మహేష్వాసా భీమార్జునసమా యుధి
యుయుధానో విరాటశ్చ ద్రుపదశ్చ మహారథః 4

అత్ర = ఈ సేనయందు, మహేష్వాసాః = గొప్ప ధనుస్సులు గలవారును, చ = మరియు,

యుధి = యుద్ధమునందు, భీమార్జున సమాః = భీమార్జునులతో సమానులును, శూరాః = శూరులును అగు, యుయుధానః, చ = సాత్యకియును, విరాటః చ = విరాటుడును, మహారథః = మహారథుడగు, ద్రుపదః = ద్రుపదుడును

తా. ఆ పాండవ సేనయందు భీమార్జునులతో సమానముగా యుద్ధము చేయగలుగు శూరులు సాత్యకి, విరాటుడు, ద్రుపద మహారాజు, వీరు మహారథులు.

శ్లో॥ ధృష్టకేతుశ్చేకితానః కాశిరాజశ్చ వీర్యవాన్
పురుజిత్ కుంతిభోజశ్చ శైబ్యశ్చ నరపుంగవః 5

ధృష్టకేతుః, చ = ధృష్టకేతుడును, చేకితానః చ = చేకితానుడును, వీర్యవాన్ = పరాక్రమశాలియగు, కాశిరాజః = కాశీరాజు, పురుజిత్ = పురుజిత్తు, కుంతిభోజః చ = కుంతిభోజుడును, నరపుంగవః = మానవులలో శ్రేష్ఠుడైన, శైబ్యః = శైబ్యుడును

తా. ధృష్టకేతువు, చేకితానుడు, వీర్యవంతుడగు కాశీరాజు, పురుజిత్తు, కుంతిభోజుడు, నరశ్రేష్ఠుడగు శైబ్యుడును .....

శ్లో॥ యుధామన్యుశ్చ విక్రాంత ఉత్తమౌజాశ్చ వీర్యవాన్
సౌభద్రో ద్రౌపదేయాశ్చ సర్వ ఏవ మహారథాః 6

విక్రాంతః = పరాక్రమవంతుడగు, యుధామన్యుః, చ = యుధామన్యుడును, వీర్యవాన్ = వీరుడైన, ఉత్తమ మౌజాః = ఉత్తమౌజుడు, సౌభద్రః చ = సుభద్రా కుమారుడైన అభిమన్యుడు, ద్రౌపదేయాః = ద్రౌపదీ కుమారులు ఐదుగురును, సర్వే, ఏవ = అందఱును, మహారథాః = మహారథులు, (సంతి) = కలరు

తా. శూరుడైన యుధామన్యుడు, వీరుడైన ఉత్తమౌజుడు, అభిమన్యుడు, ద్రౌపదీ పుత్రులగు ఉపపాండవులు, వీరందరును మహారథులే.

శ్లో॥ అస్మాకం తు విశిష్టా యే తాన్నిబోధ ద్విజోత్తమ
నాయకా మమ సైన్యస్య సంజ్ఞార్థం తాన్ బ్రవీమి తే 7

ద్విజోత్తమ = ఓ బ్రాహ్మణోత్తమా!, అస్మాకమ్ తు = మనపక్షము వారైతే, యే = ఎవరు, విశిష్టాః (సంతి) = ప్రముఖులై ఉన్నారో, తాన్ = వారిని గూర్చి, నిబోధ = తెలిసికొనుడు తే =

మీ యొక్క, సంజ్ఞార్థమ్ = ఎఱుక కొఱకు, (యే) = ఎవరయితే, మమ = నా (యొక్క), సైన్యస్య = సేనకు, నాయకాః = నాయకులై యున్నారో, తాన్ = వారిని, బ్రవీమి = తెలిపెదను

తా. ఓ బ్రాహ్మణోత్తమా! మీకు జ్ఞాపకార్థము మన సేనానాయకులలో ఉత్తములైన వారిని తెలియజేసెదను.

శ్లో॥ భవాన్ భీష్మశ్చ కర్ణశ్చ కృపశ్చ సమితింజయః
అశ్వత్థామా వికర్ణశ్చ సౌమదత్తిస్తథైవ చ 8

భవాన్, చ = పూజ్యులైన మీరును, భీష్మః చ = భీష్మ పితామహుడును, కర్ణః చ = కర్ణుడును, సమితింజయః = సంగ్రామ విజయుడగు, కృపః చ = కృపాచార్యుడును, తథా, ఏవ = అట్లే, అశ్వత్థామా = అశ్వత్థామయు, వికర్ణః చ = వికర్ణుడును, సోమదత్తిః = సోమదత్తుని కుమారుడగు భూరిశ్రవుడును

తా. మీరు, భీష్ముడు, కర్ణుడు, జయశాలియగు కృపాచార్యులు, అశ్వత్థామయు, వికర్ణుడు, భూరిశ్రవుడు.

శ్లో॥ అన్యే చ బహవశ్శూరా మదర్థే త్యక్త జీవితాః
నానాశస్త్రప్రహరణాః సర్వే యుద్ధవిశారదాః 9

అన్యే, చ = ఇతరులైనవారు, మదర్థే = నా కొరకై, త్యక్త జీవితాః = (తమ), జీవితములను పణముగా ఒడ్డినవారు, బహవః = పెక్కుమంది, శూరాః = శూరులు, నానాశస్త్ర ప్రహరణాః = వివిధములగు శస్త్రాస్త్రములను కలిగియున్న వారును, సర్వే = అందరును, యుద్ధవిశారదాః = యుద్ధమున కుశలురైనవారు, (సంతి) = ఉన్నారు

తా. అనేకములైన ఆయుధములతో యుద్ధము చేయగలుగు శూరులు పెక్కుమంది నాకై ప్రాణములు విడిచిరి.

వి. యుద్ధమే ప్రారంభముకాక యుండగా వారందరు త్యక్త జీవితులని చెప్పుటచే ధర్మక్షేత్రమగు కురుక్షేత్రము యొక్క మాహాత్మ్యము వలన భవిష్యద్వాణి దుర్యోధనుని ముఖమునుండి వెలువడినది.

శ్లో॥ అపర్యాప్తం తదస్మాకం బలం భీష్మాభిరక్షితమ్
పర్యాప్తం త్విదమేతేషాం బలం భీమాభిరక్షితమ్ 10

భీష్మాభిరక్షితమ్ = భీష్మునిచే రక్షితమైన, అస్మాకమ్ = మనయొక్క, తత్ బలమ్ = ఆ సేన, అపర్యాప్తమ్ = అపరిమితమైనది (అజేయమైనది), తు, భీమాభిరక్షితమ్ = అయితే, భీమునిచే రక్షింపబడిన, ఏతేషామ్ = వీరియొక్క, ఇదమ్ బలమ్ = ఈ సైన్యము, పర్యాప్తమ్ = పరిమితమైనది (జయించుటకు సులభమైనది)

తా. సేనాధిపతియగు భీష్మాచార్యునిచే రక్షింపబడు మన సైన్యము సంఖ్యలో నెక్కువగానున్నది. భీమునిచే రక్షింపబడు పాండవసైన్యము సంఖ్యలో అల్పమైయున్నది.

వి. అపర్యాప్త, పర్యాప్త శబ్దప్రయోగము కురుసైన్యమధిక సంఖ్యాకమై యున్నను శత్రుజయమునకు తగునట్లు శక్తివంతము కాదని ధ్వనించుచున్నది.

శ్లో॥ అయనేషు చ సర్వేషు యథాభాగమవస్థితాః
భీష్మమేవాభిరక్షన్తు భవన్తః సర్వ ఏవ హి 11

చ = మరియు = (కావున), సర్వేషు అయనేషు చ = అన్ని వ్యూహద్వారముల యందును, యథాభాగమ్ = మీమీ స్థానములయందు, అవస్థితాః = నిలిచియున్నవారై, భవంతః = మీరు, సర్వే, ఏవ = అందరును, హి = నిస్సందేహముగా, భీష్మమ్ ఏవ = భీష్మపితామహునే, అభిరక్షంతు = (అన్నివైపుల నుండి) రక్షింతురుగాక

తా. మీరందరును నిర్ణయమైన మీమీ తావులందు స్థిరముగానున్నవారై సర్వ సేనాధిపతియగు భీష్ముని రక్షించుచుండవలయును. పాండవ పక్షపాతమున యుద్ధము చేయుచున్న భీష్మాచార్యునకు శత్రువులవలన ప్రమాదము సంభవింపవచ్చును. అట్టి ప్రమాదము కలుగకుండ భీష్ముని రక్షించవలెనని దుర్యోధనుడు ద్రోణాచార్యుడు మొదలగువారిని హెచ్చరించుచున్నాడు.

శ్లో॥ తస్య సంజనయన్ హర్షం కురువృద్ధః పితామహః
సింహనాదం వినద్యోచ్చైః శంఖం దధ్మౌ ప్రతాపవాన్ 12

కురువృద్ధః = కురువంశంవారిలో వృద్ధుడును, ప్రతాపవాన్ = పరాక్రమవంతుడును అయిన, పితామహః = భీష్మ పితామహుడు, తస్య = అతని (దుర్యోధనుని) యొక్క హృదయమునందు హర్షమ్ = సంతోషమును, సంజనయన్ = కలిగించుచు, ఉచ్చై = బిగ్గరగా, సింహనాదమ్ వినద్య = సింహగర్జనమొనర్చి, శంఖమ్ = శంఖమును, దధ్మౌ = మ్రోగించెను (పూరించెను)

తా. సమరోత్సాహము కలుగుటకై కురువృద్ధుడును, తాతగారును అగు భీష్ముడు బిగ్గరగా సింహనాదముచేసి, దుర్యోధన మహారాజుకు సంతోషమును కలిగించుచు తన శంఖమును పూరించెను.

శ్లో॥ తతశ్శంఖాశ్చ భేర్యశ్చ పణవానకగోముఖాః
సహసైవాభ్యహన్యంత స శబ్దస్తుములోఽ భవత్ 13

తతః = పిమ్మట, శంఖాః చ = శంఖములును, భేర్యః చ = నగారాలును, పణవానకగోముఖాః = డోళ్ళు, మృదంగములు, కొమ్ము వాయిద్యములు మొదలుగునవి, సహసా ఏవ = ఒక్కుమ్మడిగా, అభ్యహన్యంత = మ్రోగినవి, సః శబ్దః = ఆ శబ్దము, తుములః = మిక్కిలి భయంకరమైనదిగా, అభవత్ = ఆయెను

తా. అంతట, కౌరవ సేనయందలి వీరులందరును, శంఖనాదము చేయువారును, భేరీనాదము కలిగించువారును, పణవము, ఆనకము, గోముఖము మొదలగు యుద్ధవాద్యముల మ్రోగించువారును కాగా ఆ సమయమున యుద్ధరంగమున ఆ ధ్వని భయంకరమై యుండెను.

శ్లో॥ తతః శ్వేతైర్హయైర్యుక్తే మహతి స్యందనే స్థితౌ
మాధవః పాండవశ్చైవ దివ్యౌశంఖౌ ప్రదధ్మతుః 14

తతః = పిదప, శ్వేతైః = తెల్లని, హయైః = గుఱ్ఱములతో, యుక్తే = కూడియున్న మహతి = ఉత్తమమైన, స్యందనే = రథమునందు, స్థితౌ = కూర్చునియున్న, మాధవః చ = శ్రీకృష్ణపరమాత్ముడును, పాండవః ఏవ = పాండుకుమారుడైన అర్జునుడును, దివ్యౌ = దివ్యము (అలౌకికము) లైన, శంఖౌ = శంఖములను, ప్రదధ్మతుః = పూరించిరి

తా. అనంతరము పాండవ సైన్యమందు తెల్లని గుఱ్ఱములను పూన్చిన గొప్పదైన రథమునందు కూర్చుండియున్న శ్రీకృష్ణార్జునులు దివ్యములగు తమ తమ శంఖములను పూరించిరి.

శ్లో॥ పాంచజన్యం హృషీకేశో దేవదత్తం ధనంజయః
పౌణ్డ్రం దధ్మౌ మహాశంఖం భీమకర్మా వృకోదరః 15

హృషీకేశః = శ్రీకృష్ణుడు, పాంచజన్యమ్ = పాంచజన్యమను పేరుగల శంఖమును (పూరించెను), ధనంజయః = అర్జునుడు, దేవదత్తమ్ = దేవదత్తమను పేరుగల శంఖమును (పూరించెను), భీమకర్మా = భయంకర కృత్యములను చేయునట్టి, వృకోదరః = భీమసేనుడు, పౌణ్డ్రం = పౌణ్డ్రమను పేరుగల, మహాశంఖమ్ = మహా శంఖమును, దధ్మౌ = పూరించెను.

శ్లో॥ అనంతవిజయం రాజా కుంతీపుత్రో యుధిష్ఠిరః
నకులః సహదేవశ్చ సుఘోష మణిపుష్పకౌ 16

కుంతీపుత్రః = కుంతీదేవి యొక్క కుమారుడును, రాజా = రాజైన, యుధిష్ఠిరః = యుధిష్ఠిరుడు, అనంతవిజయమ్ = అనంతవిజయమను పేరుగల శంఖమును, నకులః = నకులుడు సహదేవః చ = సహదేవుడును, సుఘోష మణిపుష్పకౌ = సుఘోషము, మణిపుష్పకము అను పేర్లుగల శంఖములను (పూరించిరి)

శ్లో॥ కాశ్యశ్చ పరమేష్వాసః శిఖండీ చ మహారథః
ధృష్టద్యుమ్నో విరాటశ్చ సాత్యకిశ్చాపరాజితః 17

శ్లో॥ ద్రుపదో ద్రౌపదేయాశ్చ సర్వశః పృథివీపతే
సౌభద్రశ్చ మహాబాహుః శంఖాన్ దధ్ముః పృథక్ పృథక్ 18

పృథివీపతే = ఓ రాజా!, పరమేష్వాసః = శ్రేష్ఠమైన ధనుస్సుగల, కాశ్యః చ = కాశీరాజును మహారథః = మహారథుడైన, శిఖండీ చ = శిఖండియును,ధృష్టద్యుమ్నః చ = ధృష్టద్యుమ్నుడును విరాటః చ = విరాటరాజును, అపరాజితః = అజేయుడైన, సాత్యకిః = సాత్యకియు, ద్రుపదః చ = ద్రుపదమహారాజును, ద్రౌపదేయాః చ = ద్రౌపది యొక్క కుమారులు ఐదుగురును, మహాబాహుః = గొప్ప బాహువులు గలవాడైన, సౌభద్రః = అభిమన్యుడును, సర్వశః = అన్నివైపుల నుండి పృథక్ పృథక్ = వేర్వేరుగా, శంఖాన్ = శంఖములను, దధ్ముః = పూరించిరి

తా. శ్రీకృష్ణభగవానుడు దివ్యమైన తన పాంచజన్యమను శంఖమును పూరించగా ధనంజయుడు దేవదత్తమను శంఖమును, యుద్ధమునందు స్థిరముగానిలుచు స్వభావముగల ధర్మరాజు అనంతవిజయమను శంఖమును, భయంకరముగా యుద్ధముచేయు భీముడు పౌండ్రమను తన మహాశంఖమును, నకులుడు సుఘోషమను శంఖమును, సహదేవుడు మణిపుష్పకమను శంఖమును, మహా ధనుర్ధరుడగు కాశీరాజు, మహారథుడగు శిఖండియు, ధృష్టద్యుమ్నుడును, విరాటుడును, అపజయమెరుగని సాత్యకియు, ద్రుపద మహారాజును, ద్రౌపదీ పుత్రులును, అభిమన్యుడును తమ తమ శంఖములను వేరువేరుగా పూరించిరి.

శ్లో॥ స ఘోషో ధార్తరాష్ట్రాణాం హృదయాని వ్యదారయత్
నభశ్చ పృథివీం చైవ తుములో వ్యనునాదయన్ 19

చ = మరియు, సః = (ఆ) అట్టి, తుములః = భయంకరమైన, ఘోషః = నాదము, నభః చ = ఆకాశమును, పృథివీమ్ ఏవ = భూమిని గూడ, వ్యనునాదయన్ = ప్రతిధ్వనింపజేయుచు ధార్తరాష్ట్రాణామ్ = ధార్తరాష్ట్రుల యొక్క అనగా మీ వారి, హృదయాని = హృదయములను

వ్యదారయత్ = కకావికలము జేసెను

తా. పాండవ వీరులయొక్క శంఖారావములు ధార్తరాష్ట్రులకు హృదయవిదారకములగుచు భూనభోంతరాళముల మారుమ్రోగినవి.

శ్లో॥ అథ వ్యవస్థితాన్ దృష్ట్వా ధార్తరాష్ట్రాన్ కపిధ్వజః
ప్రవృత్తే శస్త్రసంపాతే ధనురుద్యమ్య పాండవః 20
శ్లో॥ హృషీకేశం తదా వాక్యమిదమాహ మహీపతే

**అర్జున ఉవాచ :**

సేనయోరుభయోర్మధ్యే రథం స్థాపయ మేఽచ్యుత 21

మహీపతే = ఓ రాజా!, అథ = అనంతరము, కపిధ్వజః = కపిధ్వజుడైన, పాండవః = అర్జునుడు, వ్యవస్థితాన్ = యుద్ధసన్నద్ధులై నిలిచియున్న, ధార్తరాష్ట్రాన్ = ధృతరాష్ట్రునకు సంబంధించినవారిని, దృష్ట్వా = చూచి, తదా = అప్పుడు, శస్త్రసంపాతే ప్రవృత్తే = శస్త్రములను ప్రయోగించుటకు సన్నద్ధుడైయున్న సమయమున, ధనుః = ధనుస్సును, ఉద్యమ్య = పైకెత్తి, హృషీకేశమ్ = శ్రీకృష్ణుని(తో), ఇదమ్ వాక్యమ్ = ఈ వాక్యమును, ఆహ = పలికెను, అచ్యుత = ఓ కృష్ణా!, మే రథమ్ = నా రథమును, ఉభయో = ఉభయపక్షములయొక్క, సేనయోః మధ్యే = సేనల మధ్య, స్థాపయ = నిలిపియుంచుము

శ్లో॥ యావదేతాన్ నిరీక్షేఽహం యోద్ధుకామానవస్థితాన్
కైర్మయా సహయోద్ధవ్యమ్ అస్మిన్ రణసముద్యమే 22

యావత్ = ఎంతవరకైతే, అహమ్ = నేను, అవస్థితాన్ = రణరంగమున నిలిచియున్నట్టి యోద్ధుకామాన్ = యుద్ధాభిలాషులైన, ఏతాన్ = ఈ ప్రతియోధులను, నిరీక్షే = చక్కగా చూడగలనో అస్మిన్ = ఈ, రణసముద్యమే = మహారణభూమియందు, మయా = నాతో (నాకు), కైః సహ = ఎవరితో, యోద్ధవ్యమ్ = యుద్ధము చేయవలసియున్నదో (అంతవరకును రథమును నిలిపియుంచుము)

తా. ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఈ విధముగా యుద్ధారంభమునకు సిద్ధముగా నున్న దుర్యోధనాదులను జూచి కపిధ్వజుడగు అర్జునుడు తన గాండీవమను విల్లు చేబట్టి శ్రీకృష్ణుని జూచి యిటుల పలికెను. అచ్యుతా! నా రథమును ఉభయసేనల మధ్యభాగమున నిలుపుము. ఈ సమరాంగణమున యుద్ధము చేయగోరి నిలచిన వీరులలో నేనెవరితో తలపడవలెనో వీక్షించెదను.

శ్లో॥ యోత్స్యమానాన్ అవేక్షేఽహం య యేతేఽత్ర సమాగతాః
ధార్తరాష్ట్రస్య దుర్బుద్ధేర్యుద్ధే ప్రియచికీర్షవః 23

దుర్బుద్ధేః = దుర్బుద్ధి గలవాడైన, ధార్తరాష్ట్రస్య = దుర్యోధనుని యొక్క, యుద్ధే = యుద్ధమునందు, ప్రియచికీర్షవః = ప్రియమును గూర్పదలచినట్టివారు, యే = ఎవరెవరు, ఏతే = (రాజులుగలరో) వీరు, అత్ర = ఇచ్చట (ఈ సమర భూమియందు), సమాగతాః = చేరియున్నారో యోత్స్యమానాన్ = యుద్ధ సన్నద్ధులై యున్నట్టి వారిని, అహమ్ = నేను, అవేక్షే = చూచెదనుగాక

తా. దుష్టబుద్ధియగు దుర్యోధనునకు సహాయము జేయ యుద్ధకాములై యిచ్చట కూడిన వారినందరిని జూడదలచుచున్నాను.

**సంజయ ఉవాచ:**

శ్లో॥ ఏవముక్తో హృషీకేశో గుడాకేశేన భారత
సేనయోరుభయోర్మధ్యే స్థాపయిత్వా రథోత్తమమ్ 24

శ్లో॥ భీష్మద్రోణప్రముఖతః సర్వేషాం చ మహీక్షితామ్
ఉవాచ పార్థ పశ్యైతాన్ సమవేతాన్ కురూనితి 25

భారత = ఓ ధృతరాష్ట్రా, గుడాకేశేన = అర్జునుని చేత, ఏవమ్ = ఈ విధముగా, ఉక్తః = చెప్పబడిన, హృషీకేశః = శ్రీకృష్ణుడు, ఉభయోః = ఉభయపక్షముల వారి, సేనయోః = సేనలయొక్క మధ్యే = మధ్య, భీష్మ ద్రోణ ప్రముఖతః = భీష్మద్రోణాదుల సమక్షమున, చ = మరియు, సర్వేషామ్ = సమస్త, మహీక్షితామ్ = రాజుల ఎదుట, రథోత్తమమ్ = ఉత్తమమైన రథమును, స్థాపయిత్వా = నిలిపి, ఇతి ఉవాచ = ఈ విధముగా పలికెను, పార్థ = ఓ అర్జునా!, సమవేతాన్ = (యుద్ధమునకై) చేరియున్న, ఏతాన్ = ఈ కౌరవులను, పశ్య = చూడుము,

తా. సంజయుడు ధృతరాష్ట్రునితో ఇట్లు పలుకుచున్నాడు. భరతకులోద్భవుడవగు ఓ రాజా! నిద్రను జయించిన అర్జునునితో శ్రీకృష్ణభగవానుడు ఈ తీరున పలికిన పిమ్మట రథమును, ఉభయ సేనలమధ్య, భీష్మద్రోణాది ప్రముఖులైన రాజుల ఎదుట నిలిపి, యిచ్చట సమావేశమైన కౌరవులనందరను జూడుమని పార్థునితో పలికెను.

శ్లో॥ తత్రాపశ్యత్ స్థితాన్ పార్థః పితౄనథ పితామహాన్
ఆచార్యాన్ మాతులాన్ భ్రాతౄన్ పుత్రాన్ పౌత్రాన్ సఖీంస్తథా 26

శ్లో॥ శ్వశురాన్ సుహృదశ్చైవ సేనయోరుభయోరపి
తాన్ సమీక్ష్య స కౌంతేయః సర్వాన్ బంధూనవస్థితాన్ 27

శ్లో॥ కృపయా పరయాఽఽవిష్టో విషీదన్నిద మబ్రవీత్

**అర్జున ఉవాచ :**

దృష్ట్వేమం స్వజనం కృష్ణ యుయుత్సుం సముపస్థితమ్ 28

శ్లో॥ సీదంతి మమ గాత్రాణి ముఖం చ పరిశుష్యతి
వేపథుశ్చ శరీరేమే రోమహర్షశ్చ జాయతే 29

అథ = తరువాత, పార్థః = అర్జునుడు, తత్ర = అచట (ఆ), ఉభయోః = ఉభయపక్షముల సేనయోః అపి = సేనలయందును, స్థితాన్ = నిలిచియున్న, పితౄన్ = పిన తండ్రులను, పెద తండ్రులను, పితామహాన్ = తాత ముత్తాతలను, ఆచార్యాన్ = గురువులను, భ్రాతౄన్ = సోదరులను, పుత్రాన్ = పుత్రులను, పౌత్రాన్ = మనుమలను, తథా = అట్లే, సఖీన్ = మిత్రులను శ్వశురాన్ = పిల్లనిచ్చిన మామలను, సుహృదః చ ఏవ = మొదలగు ఆత్మీయులందరిని అపశ్యత్ = చూచెను, అవస్థితాన్ = అట్లు చేరియున్న, తాన్ = వారైన, సర్వాన్ బంధూన్ = బంధువులందరిని సమీక్ష్య = పరికించి, సః కౌంతేయః = కుంతీపుత్రుడైన అర్జునుడు, పరయా కృపయా = మిక్కిలి కనికరముతో, అవిష్టః = కూడినవాడై, విషీదన్ = శోకించుచు, ఇదమ్ = ఈ వచనమును అబ్రవీత్ = పలికెను, కృష్ణ = ఓ కృష్ణా!, సముపస్థితమ్= (సమరభూమికి), చేరియున్న యుయుత్సమ్ = యుద్ధాభిలాషతోనున్న, ఇమమ్ స్వజనమ్ = ఈ స్వజన సముదాయమును, దృష్ట్వా = చూచి మమ = నా యొక్క, గాత్రాణి = అంగములు, సీదంతి = పట్టుతప్పుచున్నవి, చ = మరియు ముఖమ్ = నోరు, పరిశుష్యతి = ఎండిపోవుచున్నది, చ = ఇంకను, మే = నా యొక్క, శరీరే = శరీరమునందు, వేపథుః = కంపము, రోమహర్షః చ = గగుర్పాటు కూడ, జాయతే = కలుగుచున్నది

తా. పార్థుడు యుద్ధరంగమునను్న ఉభయ పక్షములందలి వీరులను జూచి తండ్రులు, తాతలు, మామలు, మేనమామలు, సోదరులు, పుత్రులు, పౌత్రులు, నిమిత్తము లేకనే పరోపకారపరులగు సజ్జనులు మొదలగు స్వజనమే యుద్ధముచేయ నిచ్చతో వచ్చియుండుట గాంచి దయార్ద్ర హృదయుడై అత్యంత విషాదమొదవ శ్రీకృష్ణునితో ఈవిధముగా పలికెను. కృష్ణా! నా అవయవములు శిథిలమగుచున్నవి. ముఖము వాడిపోవుచున్నది. శరీరమున కంపము కలుగుచున్నది. గగుర్పాటు జనించుచున్నది.

శ్లో॥ గాండీవం స్రంసతే హస్తాత్ త్వక్చైవ పరిదహ్యతే
న చ శక్నోమ్యవస్థాతుం భ్రమతీవ చ మే మనః 30

హస్తాత్ = చేతి నుండి, గాండీవమ్ = గాండీవ ధనుస్సు, స్రంసతే = జారిపోవుచున్నది చ, త్వక్ ఏవ = మరియు చర్మము కూడ, పరిదహ్యతే = తాపమునొందుచున్నది, చ, మే = అట్లే నా యొక్క, మనః = మనస్సు, భ్రమతి ఇవ = భ్రమకు లోనగుచున్నది, (అతః) = అందువలన అవస్థాతుమ్ చ = నిశ్చలముగా నిలిచి యుండుటకును, న శక్నోమి = సమర్థుడను కాకున్నాను

తా. గాండీవమను నా విల్లు చేతినుండి జారుచున్నది. శరీరము మండుచున్నది. నా మనస్సు భ్రాంతి చెందినట్లున్నది. నిలువలేకున్నాను.

శ్లో॥ నిమిత్తాని చ పశ్యామి విపరీతాని కేశవ
న చ శ్రేయోఽనుపశ్యామి హత్వా స్వజనమాహవే 31

కేశవ = ఓ కృష్ణా!, విపరీతాని = విపరీతములైన (అశుభ సూచకములైన), నిమిత్తాని, చ = శకునములను కూడ, పశ్యామి = చూచుచున్నాను, ఆహవే = యుద్ధమునందు, స్వజనమ్ = స్వజన సమూహమును (ఆత్మీయులను), హత్వా = చంపి, శ్రేయః చ = (ఎట్టి) శ్రేయస్సును కూడ, న అనుపశ్యామి = చూడజాలకున్నాను

తా. ఓ కృష్ణా! దుశ్శకునములను పెక్కింటిని చూచుచున్నాను. స్వజనమును యుద్ధమున చంపుకొని పొందదగు మేలెద్దియో నాకగపడుటలేదు.

శ్లో॥ న కాంక్షే విజయం కృష్ణ! న చ రాజ్యం సుఖాని చ
కిం నో రాజ్యేన గోవింద! కింభోగైర్జీవితేన వా 32

కృష్ణ = ఓ కృష్ణా!, విజయమ్ = విజయమును, న కాంక్షే = (నేను) కోరుటలేదు, (కోరను), చ రాజ్యమ్ = మరియు రాజ్యమును, న = సైతము (కోరను), సుఖాని చ (న) = సుఖములను కూడ (కోరను), నః = మాకు, రాజ్యేన = (అట్టి) రాజ్యముతో, గోవింద =ఓ కృష్ణా, కిమ్ = ఏమి ప్రయోజనము?, వా = అథవా (లేక), భోగైః = భోగములతో (గాని), జీవితేన = జీవితముతో (కాని), కిమ్ = ఏమి లాభము?

తా. ఓ కృష్ణా! నేను రాజ్య సుఖములను గాని, బంధువధ మూలమున కలుగు విజయమునుగాని కోరుటలేదు. బంధువులను కోలుపోయిన పిమ్మట మనకు రాజ్యమేల? గోవిందా! భోగముల వలనకాని, జీవితము వలనకాని ప్రయోజనమేమి?

శ్లో॥ యేషామర్థే కాంక్షితం నో రాజ్యం భోగాస్సుఖాని చ
త ఇమేఽవస్థితా యుద్ధే ప్రాణాంస్త్యక్త్వా ధనాని చ 33

యేషామ్ అర్థే = ఎవరికొరకైతే, రాజ్యమ్ = రాజ్యము, భోగాః = భోగములు, సుఖాని చ = సుఖములును, నః = మాకు, కాంక్షితమ్ = అభీష్టమో, (అభీష్టములో), తే = వారును, ఇమే = వీరును (అందరును), ధనాని = సంపదలపైనను, ప్రాణాన్ = ప్రాణములపైనను, త్యక్త్వా = (ఆశలు) వదులుకొని, యుద్ధే = యుద్ధమునందు, అవస్థితా = నిలిచి (సన్నద్ధులై) యున్నారు, చ = మరియు

శ్లో॥ ఆచార్యాః పితరః పుత్రాస్తథైవ చ పితామహాః
మాతులాః శ్వశురాః పౌత్రాః శ్యాలాః సంబంధినస్తథా 34

ఆచార్యాః = గురువులు, పితరః = పినతండ్రులు, పెదతండ్రులు, పుత్రాః చ = కుమారులును, తథా ఏవ = అట్లే, పితామహాః = తాతలు, మాతులాః = మేనమామలు, శ్వశురాః = పిల్లనిచ్చిన మామలు, పౌత్రాః = మనుమలు, శ్యాలాః = బావమరుదులు, తథా, సంబంధినః = అట్లే (ఇతర) బంధువులు (చేరియున్నారు)

తా. ఏ బంధువుల నిమిత్తము రాజ్యభోగాది సుఖములను కోరితిమో, ఆ యీ గురువులు, తండ్రులు, కొమరులు, తాతలు, మామలు, మేనమామలు, మనుమలు, బావమరదులు మొదలగు బంధుజనము యుద్ధమున మృత్యుముఖమున పడుటకు సిద్ధమై ప్రాణధనములను కోల్పోవ నిలచియున్నారు.

శ్లో॥ ఏతాన్నహంతుమిచ్ఛామి ఘ్నతోఽపి మధుసూదన
అపి త్రైలోక్యరాజ్యస్య హేతోః కిం ను మహీకృతే 35

మధుసూదన = ఓ మధుసూదనా!, ఘ్నతః అపి = (నేను) చంపబడినను, త్రైలోక్యరాజ్యస్య = (లేక) మూడు లోకముల రాజ్యాధిపత్యము, హేతోః అపి = నిమిత్తమైనను, ఏతాన్ = వీరిని (ఈ స్వజనులను), హంతుమ్ = చంపుటకు, న ఇచ్ఛామి = ఇష్టపడను, మహీకృతే = భూమండలము కొరకైతే, కిమ్ ను = చెప్పవలసినదేమి?

తా. ఓ మధుసూదనా! బంధువులు రాజ్యకాంక్షచే నాపై దండెత్తి వచ్చిన వచ్చెదరుగాక. త్రైలోక్యరాజ్య లాభమునకైనను వారిని చంపనొల్లను. అట్టి తఱి అల్పమగు భూలోకాధిపత్యమునకు బంధుజనమును చంపుదునా?

శ్లో॥ నిహత్య ధార్తరాష్ట్రాన్నః కా ప్రీతిః స్యాజ్జనార్దన
పాపమేవాశ్రయేదస్మాన్ హత్వైతానాతతాయినః 36

జనార్దన = ఓ జనార్దనా!, ధార్తరాష్ట్రాన్ = ధృతరాష్ట్ర కుమారులను, నిహత్య = చంపినచో, నః = మనకు, కా, ప్రీతిః స్యాత్ = ఎట్టి సంతోషము కలుగును?, ఏతాన్ = ఎట్టి (ఈ), ఆతతాయినః = ఆతతాయులను (దుష్టులను), హత్వా = చంపుటవలన, అస్మాన్ = మనలను పాపమ్ ఏవ ఆశ్రయేత్ = పాపమే చుట్టముట్టును

తా. ధార్తరాష్ట్రులగు దుర్యోధనాదుల వధవలన మనకు సుంతయైనను మనసున ప్రీతి కలుగదు. వారు ఆతతాయులే. అయినను వారిని వధించినందువలన మనకు పాపమే రాగలదు.

వి. *'సర్వారంభా హి దోషేణ ధూమేనాఽగ్నిరివావృతాః'* *(18-48)*

అను గీతావాక్య ప్రమాణమున ఆతతాయులను వధించినను పాపమేయని అర్జునుడు భావించుచున్నాడు. కాని ధర్మశాస్త్రము ఆతతాయులను వధించవలెనని చెప్పుచున్నది.

*శ్లో॥ నాతతాయివధే దోషో హంతుర్భవతి కశ్చన*
*ఆతతాయిన మాయాన్తం హన్యాదేవాఽవిచారయన్* *(మనుస్మృతి)*

దుష్టులైన వీరు కనుపడగనే యితర విషయముల ఆలోచింపకయే చంపనర్హులని భావము.

*శ్లో॥ అగ్నిదో గరదశ్చైన శస్త్రపాణిర్ధనాపహః*
*క్షేత్రదారాపహర్తాచ షడైతే హ్యాత తాయినః* *(వశిష్ఠ ధర్మసూత్రాలు 3-19)*

ఆతతాయులన.. ఇండ్లకు నిప్పు పెట్టువారు, గరళమిచ్చి వధించువారు, శస్త్రపాణియై నిరంకుశముగా తిరుగువారు, పరులధనము దోచువారు, పరుల భూమిని అపహరించువారు, పరభార్యాపహరణ చేయువారు.

*శ్లో॥ సుఖదుఃఖే సమే కృత్వా లాభాలాభౌ జయాజయౌ*
*తతో యుద్ధాయ యుజ్యస్వ నైవం పాప మవాప్స్యసి* *(2-38)*

అను గీతావాక్య ప్రమాణమున సమత్వబుద్ధితో చేయని యుద్ధమువలన పాపమే రాగలదు, అర్జునుడు రజోగుణ ప్రధానుడగుటచే సమత్వబుద్ధి యెట్లుల కలుగును ?

*'యోగయుక్తో విశుద్ధాత్మా విజితాత్మా జితేంద్రియః'* *(5-7)*

అను గీతావాక్య ప్రమాణమున యోగయుక్తుడగుటచేతనే అంతఃకరణశుద్ధి జరిగి మనోజయము కలుగునని చెప్పుటచే తద్వారానే సమత్వబుద్ధి కలుగునని గ్రహింపనగును. అట్టి

సమత్వబుద్ధి లేనివాడై, దేహాత్మభావనతో యుద్ధముచేయ సంసిద్ధుడై ఆతతాయులను వధించినందున పాపమే రాగలదు. ఆతతాయులను వధించుట ధర్మశాస్త్ర విహితమైనను యోగయుక్తుడయి అనగా అహంకారవర్జితుడయి యుద్ధమున వధించినను నీకు పాపమంటదని భగవానుడు అర్జునునకు ఉపదేశించెను.

'హత్వా పి స ఇమాన్ లోకాన్ స హంతి న నిబధ్యతే' అను గీతావాక్యముచే కూడ ఈ భావమునే బోధించెను.

శ్లో॥ తస్మాన్నార్హా వయం హంతుం ధార్తరాష్ట్రాన్ స్వబాంధవాన్
స్వజనం హి కథం హత్వా సుఖినః స్యామ మాధవ ? 37

తస్మాత్ = అందువలన, మాధవ = ఓ మాధవా!, స్వబాంధవాన్ = మన బంధువులైన, ధార్తరాష్ట్రాన్ = ధార్తరాష్ట్రులను, హంతుమ్ = హతమార్చుటకు, వయమ్ = మనము, న అర్హాః = అర్హులము కాము (మనము వారిని చంపదగదు), హి = ఏలనన, స్వజనమ్ = స్వజనులను, హత్వా = చంపి, కథం సుఖినః = ఎట్లు సుఖులము, స్యామ = కాగలము?

తా. ఆ కారణమున స్వజనమగు దుర్యోధనాదులను జంపుట పాడిగాదు. మాధవా! స్వజనమును చంపిన సుఖముగా మనమెట్లు జీవింపగలము ?

శ్లో॥ యద్యప్యేతే న పశ్యంతి లోభోపహతచేతసః
కులక్షయకృతం దోషం మిత్రద్రోహే చ పాతకమ్ 38

శ్లో॥ కథం న జ్ఞేయమస్మాభిః పాపాదస్మాన్నివర్తితుమ్
కులక్షయకృతం దోషం ప్రపశ్యద్భిర్జనార్దన 39

యద్యపి = ఒకవేళ, లోభోపహత చేతసః = లోభముచే భ్రష్టచిత్తులై, ఏతే = వీరు, కులక్షయ కృతమ్ = కుల నాశనము వలన కలుగు, దోషమ్ చ = దోషమును, మిత్రద్రోహే = మిత్రద్రోహ కారణముగా, పాతకమ్ చ = (కలుగు) పాపమును, న పశ్యంతి = చూడకున్నవారైనను, జనార్దన =ఓ జనార్దనా, కులక్షయ కృతమ్= కులక్షయము వలన కలుగు, దోషమ్ = దోషమును, ప్రపశ్యద్భిః = చక్కగా ఎరింగిన వారమైన, అస్మాభిః = మనచే, అస్మాత్ = ఇట్టి, పాపాత్ = పాపము నుండి, నివర్తితుమ్ = మరలుటకు, కథమ్ = ఏల, న జ్ఞేయమ్ = ఆలోచింపరాదు?

తా. ఓ జనార్దనా! దుర్యోధనాదులు లోభాకృష్ట మానసులయి, వివేకహీనులైరి. కులక్షయము, వలనను, మిత్రద్రోహము వలనను కలుగు పాతకము నెరుంగజాలరు. కులక్షయమున కలుగు

అనర్థమును నెరింగియుండియు మనమేల పాపకృత్యములనుండి మరలుటకు తగునుపాయము చేయకూడదు?

శ్లో॥ కులక్షయే ప్రణశ్యంతి కులధర్మాః సనాతనాః
ధర్మే నష్టే కులం కృత్స్నమ్ అధర్మోఽభిభవత్యుత 40

కులక్షయే = కులక్షయ కారణముగ, సనాతనాః = సనాతనములైన (పరంపరాగతములైన), కులధర్మాః = కులధర్మములు, ప్రణశ్యంతి = నశించిపోవును, ధర్మే నష్టే = ధర్మము అంతరించిపోవుచుండగా, కృత్స్నమ్ = సమస్తమైన (పూర్తిగా), కులమ్ = వంశము (నందు), అధర్మః ఉత = అధర్మమే, అభిభవతి = వ్యాపించును

శ్లో॥ అధర్మాభిభవాత్ కృష్ణ ప్రదుష్యంతి కులస్త్రియః
స్త్రీషు దుష్టాసు వార్ష్ణేయ జాయతే వర్ణసంకరః 41

కృష్ణ = ఓ కృష్ణా!, అధర్మాభిభవాత్ = అధర్మము (పాపము) అధికమగుట వలన, కులస్త్రియః = కులస్త్రీలు, ప్రదుష్యంతి = మిక్కిలి దూషితలగుదురు, వార్ష్ణేయ = కృష్ణా, స్త్రీషు = స్త్రీలు, దుష్టాసు = దూషితలైనపుడు, వర్ణ సంకరః = వర్ణ సాంకర్యము, జాయతే = ఉత్పన్నమగును.

తా. కులక్షయమున కులధర్మముల నెరింగిన పురుషులు నశించుదురు. వంశ పరంపరగా వచ్చుచున్న సనాతనములైన కులధర్మములును నశించును. అందుచే కులమంతయు అధర్మ భూయిష్ఠమయి కులస్త్రీలు దుష్టులగుదురు. అందుచే వర్ణసాంకర్యము కలుగును.

శ్లో॥ సంకరో నరకాయైవ కులఘ్నానాం కులస్య చ
పతంతి పితరో హ్యేషాం లుప్తపిండోదకక్రియాః 42

సంకరః = వర్ణ సాంకర్యము, కులఘ్నానామ్ చ = కులఘాతకులకును, కులస్య = కులమునకును, నరకాయ ఏవ = నరకము కొరకే (నరక ప్రాప్తియే) అగును, లుప్త పిండోదక క్రియాః = పిండోదక క్రియలు లుప్తమైనవారు(ను), ఏషామ్ = వీరియొక్క, పితరః హి = పితరులు కూడ, పతంతి = అధోగతి పాలయ్యెదరు.

తా. కులనాశమునకు హేతువైనవారలకు, వారి కులము వారికి వర్ణ సాంకర్యముచే నరకపాతమే సంభవించును. పితృదేవతలను ఉద్దేశించి చేయబడు పిండోదక క్రియలు కూడ, జన్మతః వర్ణసాంకర్యము కలవారిచే చేయబడుట వలన, పితరులు పతితులగుటకే కారణమగుచున్నవి. సద్గతులనీయజాలవు.

శ్లో॥ దోషైరేతైః కులఘ్నానాం వర్ణసంకరకారకైః
ఉత్సాద్యంతే జాతిధర్మాః కులధర్మాశ్చ శాశ్వతాః 43

ఏతైః = ఇట్టి, వర్ణసంకర కారకైః= వర్ణసాంకర్యములకు హేతువులైన,దోషైః = దోషములచే, కులఘ్నానామ్ = కుల ఘాతకులయొక్క, శాశ్వతాః = సనాతనములైన, కులధర్మాః చ = కుల ధర్మములును, జాతి ధర్మాః = జాతి ధర్మములును, ఉత్సాద్యంతే = నష్టములగును.

తా. వర్ణసాంకర్యమునకు మూలమైన ఈ దోషములచే సనాతనములైన జాతి ధర్మములు, కులధర్మములు భ్రష్టములగుచున్నవి.

శ్లో॥ ఉత్సన్నకులధర్మాణాం మనుష్యాణాం జనార్దన
నరకేఽ నియతం వాసో భవతీత్యనుశుశ్రుమ 44

జనార్దన = ఓ జనార్దనా!, ఉత్సన్నకుల ధర్మాణామ్ = కులధర్మములు నశించినవారైన, మనుష్యాణాం = మనుష్యులకు, అనియతమ్ = నిరవధికముగా, నరకే = నరకమునందు, వాసః = నివాసము, భవతి = అగును, ఇతి = అని, అనుశుశ్రుమ = వినుచున్నాము.

తా. ఓ జనార్దనా! కులధర్మములు పోయి, భ్రష్టులయిన వారలకు నరకమునందు బడియుండుట తప్పదని పెద్దలందురు.

శ్లో॥ అహో బత మహత్పాపం కర్తుం వ్యవసితా వయమ్
యద్రాజ్యసుఖలోభేన హంతుం స్వజనముద్యతాః 45

అహో = అయ్యో!, బత = ఎంత దారుణము!!, వయమ్ = మనము (బుద్ధిమంతులమై గూడ), మహత్పాపమ్ = మహాపాపమును, కర్తుమ్ = చేయుటకు, వ్యవసితాః = సిద్ధమైతిమి, యత్ = ఏదైతే (ఏ మహాపాపమునకైతే), రాజ్య సుఖలోభేన = రాజ్యసుఖ లోభముచే, స్వజనమ్ = స్వజనులను, హంతుమ్ = చంపుటకు, ఉద్యతాః = ఉద్యుక్తులమైతిమో (అట్టి మహాపాతకమునకు ఒడిగట్టితిమి).

తా. అక్కటా! రాజ్యసుఖాపేక్షచే బంధుమిత్రాదులను చంపబూని యెంత పాతకము నొడిగట్టినామో కదా.

శ్లో॥ యది మామప్రతీకారమశస్త్రం శస్త్రపాణయః
ధార్తరాష్ట్రా రణే హన్యుః తన్మే క్షేమతరం భవేత్ 46

యది = ఒకవేళ, అశస్త్రమ్ = శస్త్రములను త్యజించినట్టి, అప్రతీకారమ్ = ప్రతీకారము చేయనట్టి, మామ్ = నన్ను, శస్త్ర పాణయః = శస్త్రములను చేబూనిన, ధార్తరాష్ట్రాః = ధార్తరాష్ట్రులు, రణే = సమరమునందు, హన్యుః = చంపినవారైనను (చంపినను), తత్ నమే = అది నాకు, క్షేమతరమ్ = శ్రేయస్కరమే, భవేత్ = అగును.

తా. ఆయుధముల ధరించక వదలియున్న నన్ను యుద్ధమున ధార్తరాష్ట్రులు శస్త్రపాణులై వచ్చి చంపినను నాకు మిక్కిలి క్షేమమేయగును. కులనాశమునకు ధర్మనాశమునకును కారకుడను కాకయుందును.

**సంజయ ఉవాచ:**

శ్లో॥ ఏవముక్త్వార్జునః సంఖ్యే రథోపస్థ ఉపావిశత్
విసృజ్య సశరం చాపం శోకసంవిగ్నమానసః 47

సంఖ్యే = రణభూమి యందు, శోకసంవిగ్నమానసః = శోకాకుల మనస్కుడైన, అర్జునః = అర్జునుడు, ఏవమ్ = ఇట్లు, ఉక్త్వా = పలికి, సశరమ్ = బాణములతో కూడిన, చాపమ్ = ధనుస్సును, విసృజ్య = విసర్జించి, రథోపస్థే = రథము యొక్క ఉపరితల భాగమున, ఉపావిశత్ = చతికిలబడెను

తా. సంజయుడు ధృతరాష్ట్రునితో ఇట్లు పలికెను. ఓ మహారాజా! అర్జునుడు శోకాకుల మానసుడయి, బంధువధ నుండి విముఖుడగుచు, చాప శరంబులను జారవిడిచి రథోపరితలమున కూర్చుండిపోయెను.

ఇట్లు
శ్రీ పరమహంస పరివ్రాజకాచార్యులును,
బ్రహ్మర్షి సద్గురు **శ్రీశ్రీశ్రీ శివానంద** భగవత్పూజ్యపాద శిష్యులును నైన
బ్రహ్మర్షి సద్గురు **శ్రీశ్రీశ్రీ స్వామి రామానంద పరమహంస** వారిచే
రచింపబడిన గీతామృతమను టీక యందు
అర్జున విషాదయోగమను ప్రథమాధ్యాయము సమాప్తము

## శ్రీమద్భగవద్గీత

## ఓం శ్రీకృష్ణ పరమాత్మనే నమః

## ద్వితీయాధ్యాయము

# సాంఖ్యయోగము

అర్జునుడు రజోగుణ ప్రధానుడగుటవలన దేహాత్మబుద్ధి కలిగియున్నవాడై, బంధువధానంతరము సంప్రాప్తంబులగు రాజ్యసుఖాదుల వలన ప్రయోజనము శూన్యమని తలచి, బంధువులయెడ మమకారముచే యుద్ధవిముఖుడై శర చాపంబులను విసర్జించి, విషాదముతో నుండెను. అంతట దయాసముద్రుడైన శ్రీకృష్ణభగవానుడు అర్జునుని రజోగుణము నశింపజేయ సాంఖ్యయోగముల రహస్యములను ఉపదేశించెను. ఆత్మానాత్మ వివేకము కలిగి ఆత్మచింతారతుడు కాకున్న, కోటిజన్మలకైనను బంధవిచ్ఛిత్తి కలుగదు కదా!

*శ్లో: ఆత్మాऽనాత్మ వివేకేన పునస్సంసార నివృత్తిః*
*తద్వినా జన్మకోట్యాపి బంధచ్ఛేదో న సిద్ధ్యతి* *(మహోపనిషత్)*

**సంజయ ఉవాచ:**

శ్లో॥ తంతథా కృపయాऽవిష్ట మశ్రుపూర్ణాకులేక్షణం
విషీదంత మిదం వాక్యమువాచ మధుసూదనః 1

తథా = ఆ విధముగా, కృపయా, ఆవిష్టమ్ = కరుణతో నిండినవాడును, అశ్రుపూర్ణాకులేక్షణమ్ = అశ్రుపూర్ణములై, వ్యాకులపాటుతో గూడిన నేత్రములు గలవాడు, విషీదంతమ్ = శోకించుచున్నవాడును అగు, తమ్ = ఆ అర్జునుని గూర్చి

తా. పూర్వాధ్యాయమున చెప్పబడినట్లు 4దేహమే తానను అజ్ఞాన దోషము వలన కలిగిన విషాదాతిశయముచే కనులవెంట నీరుకార్చుచు వ్యాకులపడుచున్న అర్జునునితో శ్రీకృష్ణుడిట్లు పలికెను.

**శ్రీ భగవానువాచ:**

శ్లో॥ కుతస్త్వా కశ్మలమిదం విషమే సముపస్థితం
అనార్యజుష్టమస్వర్గ్యమకీర్తికరమర్జున 2

అర్జున = ఓ అర్జునా, విషమే = తగని సమయమున, ఇదమ్ కశ్మలమ్ = మోహము,

త్వా కుతః = నీకు ఎట్లు?, సముపస్థితమ్ = దాపురించినది?, యతః = ఏలనన, ఇది, అనార్యజుష్టమ్ = శ్రేష్ఠులచే ఆచరింప బడునదియు కాదు, అస్వర్గ్యమ్ = స్వర్గమును ఇచ్చునదియు కాదు, అకీర్తికరమ్ = కీర్తిని కలిగించునదియు కాదు

తా. పామరులకు కలుగునదియు, స్వర్గప్రదము కానిదియు, అపకీర్తిప్రదమైనదియునగు మోహము ఈ విషమ కాలమున అనగా యుద్ధము ప్రారంభము కానున్న చివరిక్షణములో ఎచ్చట నుండి వచ్చిపడినదియని శ్రీకృష్ణుడర్జునునితో పలికెను.

శ్లో॥ క్లైబ్యం మాస్మగమః పార్థ నైతత్త్వ య్యుపపద్యతే
క్షుద్రం హృదయ దౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరంతప 3

పార్థ! = ఓ అర్జునా!, క్లైబ్యమ్ = నపుంసకత్వమును (పిరికితనమున), మా, స్మ, గమః = పొందవద్దు, త్వయి = నీయందు (నీకు), ఏతత్ = ఇది (ఈ పిరికితనము), న, ఉపపద్యతే = కలుగరాదు (తగదు), పరంతప = ఓ పరంతపా!, క్షుద్రమ్ = తుచ్ఛమైన, హృదయ దౌర్బల్యమ్ = హృదయ దౌర్బల్యమును, త్యక్త్వా= త్యజించి, ఉత్తిష్ఠ = లెమ్ము (యుద్ధమునకై నడుము బిగింపుము)

తా. అర్జునా! నీవు శత్రువులను తపింపజేయువాడవు. శత్రువీరులను జూచి నపుంసకునివలె పౌరుష హీనుడవయి విషాదముతో నుండుట నీకు తగదు. హృదయ దౌర్బల్యమును విడిచి పెట్టుము. యుద్ధమునకు సంసిద్ధుడవగుము.

**అర్జున ఉవాచ:**

శ్లో॥ కథం భీష్మమహం సంఖ్యే ద్రోణం చ మధుసూదన
ఇషుభిః ప్రతియోత్స్యామి పూజార్హౌ వరిసూదన 4

మధుసూదన = ఓ మధుసూదనా!, అహమ్ = నేను, సంఖ్యే = రణమునందు, కథమ్ = ఏవిధముగా, ఇషుభిః = బాణములతో, భీష్మమ్ = భీష్మపితామహుని, చ = మరియు, ద్రోణమ్ = ద్రోణాచార్యుని, ప్రతియోత్స్యామి = ఎదుర్కొని పోరాడగలను?, యతః = ఏలననగా, అరిసూదన = ఓ అరిసూదన!, తౌ = ఆ ఇద్దరును, పూజార్హౌ = (నాకు) పూజింపదగినవారు

తా. అర్జునుడు భగవానునితో నిట్లుపలికెను. శత్రు సంహారకుడవగు కృష్ణా ! పూజార్హులగు భీష్మద్రోణులను యుద్ధమున బాణములచే నెట్లెదిరించగలను?

శ్లో॥ గురూ నహత్వా హి మహానుభావాన్
శ్రేయోభోక్తుం భైక్ష్యమపీహలోకే
హత్వార్థ కామాంస్తు గురూని హైవ
భుంజీయ భోగాన్ రుధిరప్రదిగ్ధాన్ 5

మహానుభావాన్ = మహానుభావులైన, గురూన్ = గురువులను, అహత్వా = చంపక, ఇహలోకే = (నేను) ఈ లోకమున, భైక్ష్యమ్ అపి = భిక్షాన్నమును ఐనను, భోక్తుమ్ = తినుటకు (తినుట), శ్రేయః = శ్రేయస్కరము (అని భావింతును), హి = ఎందులకనగా, గురూన్ = గురుజనులను, హత్వా (అపి) = చంపి ఐనను, ఇహ = ఈ లోకమున, రుధిరప్రదిగ్ధాన్ = రక్తసిక్తమైన, అర్థ కామాన్ = అర్థకామ రూపములైన, భోగాన్ ఏవ తు = భోగములనే, భుంజీయ = అనుభవింపవలసి యుండును గదా!

తా. మహాత్ములును, గురువులును, మహానుభావులునగు భీష్మద్రోణులను వధించి రుధిరార్ద్రములగు భోగములనుభవించుట కంటే ఈలోకమున భిక్షాటనచే జీవించుట శ్రేయస్కరము.

శ్లో॥ న చైతద్విద్మః కతరన్నోగరీయో
యద్వాజయేమ యదివానో జయేయుః
యానేవ హత్వానజిజీవిషామః
తేఽ వస్థితాః ప్రముఖే ధార్తరాష్ట్రాః 6

ఏతత్ చ = ఇదియును, న విద్మః = ఎరుగము, నః = మనకు (యుద్ధము చేయుట, చేయకుండుట అను), కతరత్ = రెండింటిలో ఏది, గరీయః = శ్రేష్ఠము?, యత్ వా = మరియు (దీనిని గూడ ఎరుగము), జయేమ = వారిని మనము జయించెదమా?, యది వా = లేక, నః = మనలను, జయేయుః = వారు జయింతురా?, యాన్ హత్వా = ఎవరిని చంపి (మేము), న, జిజీవిషామః = జీవించుటకును ఇష్టపడమో, తే ఏవ = వారే (ఆ ఆత్మీయులే) , ధార్తరాష్ట్రాః = ధార్తరాష్ట్రులు, ప్రముఖే = (మన) ఎట్టఎదుట, అవస్థితాః = నిలిచియున్నారు.

తా. మనము శత్రువులను జయించెదమో లేక వారే మనలను జయించుదురో ఎరుగము. ఏ దుర్యోధనాదులను చంపి నేను జీవింపజాలనో వారందరును వచ్చి యెదుట నిలబడియున్నారు.

శ్లో॥ కార్పణ్య దోషోపహత స్వభావః
పృచ్ఛామి త్వాం ధర్మ సంమూఢ చేతాః
యచ్ఛ్రేయః స్యాన్నిశ్చితం బ్రూహితన్మే
శిష్యస్తేఽ హం శాధిమాం త్వాం ప్రపన్నమ్ 7

కార్పణ్యదోషోప హతస్వభావః = పిరికితనమనెడి దోషమునకు లోనైన స్వభావము కలిగినవాడనై, ధర్మ సమ్మూఢచేతాః = ధర్మవిషయమున మూఢచిత్తుడనై, త్వామ్ = నిన్ను, పృచ్ఛామి = అడుగుచున్నాను, యత్ = ఏ (ఏ సాధన), నిశ్చితమ్ = నిశ్చయముగా, శ్రేయః, స్యాత్ = మేలు అగును?, తత్ = దానిని, మే = నాకు, బ్రూహి = తెలుపుము, అహమ్ = (ఏలనన) నేను, తే = నీకు, శిష్యః = శిష్యుడను, త్వామ్ = నిన్ను, ప్రపన్నమ్ = శరణు పొందినవాడను, మామ్ = (కనుక) నన్ను (నాకు), శాధి = శాసింపుము

తా. కార్పణ్య దోషముచేత నా మనస్సు ప్రహతమైనది. కనుక ధర్మాధర్మ పరిజ్ఞానము నశించినది. శరణాగతుడనగు నన్ను శిష్యునిగా గ్రహించుము. నాకు శ్రేయస్కరమని నీచే నిశ్చయింపబడిన దానిని ఉపదేశించి ప్రపన్నుడనైన నన్ను శాసింపుము.

వి. కార్పణ్య దోషమనగా ద్వంద్వబుద్ధి. ద్వంద్వభావము అనర్థములకు మూలము. తుచ్ఛమైనది. జన్మమరణహేతువు. అసత్యమైనది. ఇందుకు శృతి ప్రమాణము.

*శ్లో॥ అన్యోఽ న్యత్ పశ్యతి అన్యచ్ఛృణోతి*
*అన్యద్విజానాతి తదల్పం మర్త్యం అసత్* *(ఛాందోగ్యోపనిషత్ 7.24.1)*

అట్టి యన్యభావమే కార్పణ్యదోషమనబడును. అద్వైతమే పరమార్థమని శృతి చెప్పుచున్నది.

*శ్లో॥ మనోవృత్తి మయంద్వైతం అద్వైతం పరమార్థతః* *(మాండూక్య గౌడపాద కారిక)*

మనోవృత్తియనగా విషయ ప్రవృత్తి. ఇట్టి విషయప్రవృత్తి వలన ధర్మాధర్మ విచక్షణచేయు జ్ఞానము నశించును. కావున తనకేది శ్రేయస్సును కలుగ జేయునో అది నిశ్చయించి చెప్పుమని అర్జునుడడిగెను. శ్రేయమనగా మోక్షప్రాప్తి. మోక్షము జ్ఞానఫలము.

*'జ్ఞానాదేవహి కైవల్యం'* *(గరుడ పురాణం)*

శ్లో॥ న హి ప్రపశ్యామి మమాపనుద్యాత్
యచ్ఛోకముచ్ఛోషణ మిన్ద్రియాణాం
అవాప్య భూమా వసపత్నమృద్ధం
రాజ్యం సురాణామపిచాధిపత్యమ్ 8

హి = ఏలనన, భూమౌ = భూమియందు, అసపత్నమ్ = నిష్కంటకమైన, ఋద్ధమ్ = ధనధాన్య సంపన్నమైన, రాజ్యమ్ చ = రాజ్యమున, సురాణామ్ = దేవతలయొక్క, ఆధిపత్యమ్ = ఆధిపత్యమును, అవాప్య, అపి = పొందియు, యత్ = ఏదైతే, మమ = నాయొక్క, ఇంద్రియాణామ్, = ఇంద్రియముల యొక్క (ఇంద్రియములను), ఉచ్ఛోషణమ్ = శుష్కింపజేయునట్టి, శోకమ్ = శోకమును, అపనుద్యాత్ = దూరము చేయగలదో, (తత్), = దానిని (ఆ ఉపాయమును), న, పశ్యామి = చూడకున్నాను

తా. ఈ భూమియందు నిష్కంటకమై, ధనధాన్య సంపన్నమైన రాజ్యమును పొందినను, లేక దేవరాజ్యాధిపత్యము వహించినను, ఇంద్రియములను శోషింపజేయు శోకమును తొలగించగల ఉపాయము తెలియనైతిని.

వి. ఈ విధముగా విషయ సుఖపరాన్ముఖుడగు అర్జునుడు అధ్యాత్మబోధకు అర్హుడగుటచేత శ్రీకృష్ణ భగవానుడు వానికి ఆత్మతత్త్వోపదేశము చేయ ప్రారంభించెను.

**సంజయ ఉవాచ:**

శ్లో॥ ఏవముక్త్వా హృషీకేశం గుడాకేశః పరంతప
నయోత్స్య ఇతిగోవిందముక్త్వా తూష్ణీం బభూవహ 9

పరంతప = ఓ రాజా! (ఓ ధృతరాష్ట్రా!), గుడాకేశః = అర్జునుడు (నిద్రను జయించినవాడు), హృషీకేశమ్ = అంతర్యామియైన శ్రీకృష్ణుని (తో), (ఇంద్రియాధిపతియగు శుద్ధ మనోరూప పరమాత్మతో), ఏవమ్, ఉక్త్వా = ఈ విధముగా పలికి, గోవిందమ్ = గోవిందుని ఉద్దేశించి, న, యోత్స్యే = యుద్ధము చేయను, ఇతి = అని, హ = స్పష్టముగా, ఉక్త్వా = పలికి, తూష్ణీమ్ బభూవ = మౌనము వహించెను

తా. సంజయుడిట్లు ధృతరాష్ట్రునితో పలికెను. శత్రువులను తపింపచేయు ఓ రాజా! నిద్రను జయించిన అర్జునుడు హృదయాంతర్యామియగు శ్రీకృష్ణ భగవానునితో ఈ విధముగా బలికి, యుద్ధము చేయనని యూరకుండెను.

శ్లో॥ తమువాచ హృషీకేశః ప్రహసన్నివ భారత!
సేనయోరుభయోర్మధ్యే విషీదంత మిదం వచః 10

భారత = ఓ ధృతరాష్ట్రా!, హృషీకేశః = అంతర్యామియైన శ్రీకృష్ణ భగవానుడు, ఉభయోః సేనయోః మధ్యే = ఉభయసేనల మధ్యభాగమున, విషీదంతమ్ = శోకముతో పరితపించుచున్న, తమ్ = అతనిని (ఆ అర్జునునితో), ప్రహసన్, ఇవ = మందహాసముతో, ఇదమ్ = ఈ, వచః = వచనమును (మాటలను), ఉవాచ = పలికెను

తా. అప్పుడు రెండు సేనలమధ్య దుఃఖించుచున్న అర్జునుని చూచి శ్రీకృష్ణుడీవిధముగా మందహాసముతో బలికెను.

వి. జీవులు సంసారవాసనలచే దుఃఖించుచు, 'నేను, నాది' అను భ్రాంతిచే అజ్ఞానులగుట ప్రథమాధ్యాయము నుండి ద్వితీయాధ్యాయ దశమశ్లోకము వరకు వర్ణింపబడినది.

*శ్లో॥ ఆత్మానగ్ం రథినంవిద్ధి శరీరగ్ం రథమేవ తు*
*బుద్ధిం తు సారథిం విద్ధి మనః ప్ర గ్రహ మేవ చ (కఠోపనిషత్-57)*

*శ్లో॥ ఇన్ద్రియాణి హయాన్యాహుః విషయాం స్తేషు గోచరాన్*
*ఆత్మేంద్రియ మనోయుక్తం భోక్తే త్యాహుర్మనీషిణః (కఠోపనిషత్-58)*

అను ఉపనిషత్ వాక్యములననుసరించి యింద్రియ మనస్సులతో కూడిన శరీరియే భోక్తగా చెప్పబడుచున్నాడు. ఇచ్చటకూడ ఇంద్రియ మనోలక్షణములు కలిగియున్న అర్జునుడు దేహభ్రాంతిచే సుఖదుఃఖాది భోక్తయై బంధువధకు వాపోవుచున్నాడని ఆత్మతత్త్వోపదేశమునకు అవకాశము కల్పింపబడెను.

**శ్రీ భగవానువాచ:**

శ్లో॥ అశోచ్యానన్వశోచస్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే
గతాసూన గతాసూంశ్చ నానుశోచంతి పండితాః 11

త్వమ్ = నీవు, అశోచ్యాన్ = శోకింపదగని వారిని గురించి, అన్వశోచః = శోకించుచున్నావు, చ = మరియు, ప్రజ్ఞావాదాన్ = ప్రజ్ఞావంతుల వలె, భాషసే = పలుకుచున్నావు (కాని), గతాసూన్ = ప్రాణములు పోయిన వారిని గూర్చియు, చ = మరియు, అగతాసూన్ = ప్రాణములు పోని వారిని గూర్చియు, పండితాః = పండితులు, న అనుశోచంతి = శోకింపరు

తా. శ్రీ కృష్ణ భగవానుడిట్లు పలికెను. అర్జునా! నీవు దుఃఖింపదగని వారిని గురించి దుఃఖించుచున్నావు. మరల పండితునివలె మాటలాడుచున్నావు. పండితులైనవారు గతించిన వారిని గురించి కాని, జీవించి యున్నవారిని గురించి కాని విచారింపరు. చావు పుట్టుకలు శరీరమునకేకాని ఆత్మకు లేవు. ఆత్మను తెలిసిన వాడే జ్ఞానవంతుడని, పండితుడని చెప్పబడును.

శ్లో॥ నత్వేవాహం జాతు నాసం నత్వం నేమే జనాధిపాః
న చైవ న భవిష్యామః సర్వే వయమతః పరమ్ 12

అహమ్ = నేను, జాతు = ఒకప్పుడును, న, ఆసమ్ = లేను అనునది, న, తు ఏవ = లేనేలేదు, త్వమ్ = నీవు, న (ఆసీః) = లేవు అనునది లేదు, ఇమే = ఈ, జనాధిపాః = రాజులు న (ఆసన్) = లేరనునదియును లేదు, చ = మరియు, అతః, పరమ్ = ఇకమీదట, వయమ్, సర్వే = మనము అందరము, న, భవిష్యామః = లేకపోవుట యనునది, న, ఏవ = లేనే లేదు

తా. నేను, నీవు, ఈ భూపతులును ఒకప్పుడు లేక ఇప్పుడే ఉన్నవారము కాము. మనమెల్లప్పుడు ఉన్నవారమే. ఇక ముందుకాలమున కూడ ఉండువారమే. మన యీ దేహములకు అంతము కలదు. కాని మనమాత్మ స్వరూపులము. ఆత్మ నిత్యము. ఆత్మకు నాశము లేదు. సర్వకాలమందు ఉండునది ఆత్మయే.

శ్లో॥ దేహినోఽస్మిన్ యథాదేహే కౌమారం యౌవనం జరా
తథా దేహాంతర ప్రాప్తిః ధీరస్తత్ర న ముహ్యతి 13

యథా = ఎట్లయితే, దేహినః = ఆత్మకు, అస్మిన్, దేహే = ఈ దేహమునందు, కౌమారమ్ = కౌమారము (బాల్యము), యౌవనమ్ = యౌవనము, జరా = ముసలితనము (కలవో), తథా = అట్లే, దేహాంతర ప్రాప్తిః = మరియొక దేహము ప్రాప్తించుటయు (కల్గును), తత్ర = ఆ విషయమున, ధీరః = ధీరుడైనవాడు, న, ముహ్యతి = మోహమునకు గురికాడు

తా. దేహధారి అయిన దేహికి స్వాభావికముగా దేహమున మార్పులు కలుగు చుండును. ఈ మార్పులకు కౌమార, యౌవన, వార్ధక్యాది నామములు కలుగుచున్నవి. కౌమారాది అవస్థలను బట్టి దేహాంతరము కలిగిన సమయమున కూడ దేహాభిమానము కల జీవుడు వేరుకాదు. జీవునకు లేక ఆత్మకు మార్పు లేదు. కనుకనే ఆత్మను అవ్యయుడందురు. అందుచే ఆత్మజ్ఞాని ధీరుడై ఉండును. ఎట్టి వికారములకు వశుడు కాడు. అనగా మోహమును చెందడు.

శ్లో|| మాత్రాస్పర్శాస్తు కౌంతేయ! శీతోష్ణ సుఖదుఃఖదాః
ఆగమాపాయినోఽనిత్యాః తాంస్తితిక్షస్వ భారత 14

కౌంతేయ = ఓ కుంతీపుత్రా! (అర్జున!), శీతోష్ణ సుఖదుఃఖదాః = శీతోష్ణములను సుఖదుఃఖములను కల్గించునవియైన, మాత్రాస్పర్శాః, తు = విషయేంద్రియ సంయోగములయితే, ఆగమాపాయినః = ఉత్పత్తి వినాశ శీలములు (మరియు), అనిత్యాః = అనిత్యములు, భారత = (కావున) భారతా! (అర్జునా!), తాన్ = వాటిని (ఆ ద్వంద్వములను), తితిక్షస్వ = సహింపుము

తా. కుంతీ పుత్రుడవగు ఓ అర్జునా! శబ్దాది విషయ సంబంధముగల త్వగాదీంద్రియములు శీతోష్ణ సుఖదుఃఖాది ద్వంద్వములను గలిగించును. అట్టి ద్వంద్వములు నిత్యములు కావు. వచ్చుచు, పోవుచునుండు స్వభావము కలవి. కావున సహనశీలుడవై ద్వంద్వముల వలన హర్షవిషాదములు జెందకుము. జ్ఞానిని ద్వంద్వములు బాధించవు. కావున అజ్ఞానమును విడిచి జ్ఞానివగుమని భావము.

శ్లో|| యం హి న వ్యథయన్త్యేతే పురుషం పురుషర్షభ
సమ దుఃఖసుఖం ధీరం సోఽమృతత్వాయ కల్పతే 15

హి = ఏలనన, పురుషర్షభ = ఓ పురుషశ్రేష్ఠా!, సమదుఃఖ సుఖమ్ = సుఖదుఃఖములను సమానముగా చూచునట్టి, యమ్, ధీరమ్ పురుషమ్ = ఏ ధీరుడైన పురుషుని, ఏతే = ఇవి (విషయేంద్రియ సంయోగములు), న, వ్యథయంతి = వ్యాకులపరచవో, సః = అతడు, అమృతత్వాయ = మోక్షముకొరకు, కల్పతే = యోగ్యుడగును

తా. ఓ పురుష శ్రేష్ఠా! సుఖదుఃఖాది ద్వంద్వముల మూలమున బాధపడక, సుఖ దుఃఖముల యందు సమభావముతో నిర్వికారుడై యున్నవాడే ధీరుడు. అట్టివాడు మోక్షార్హుడు. పురమనగా దేహము. పురమందు నివసించువాడు పురుషుడు. అనగా అంతర్ముఖుడు కావలెనని భావము.

శ్లో|| నాసతో విద్యతే భావో నాభావో విద్యతే సతః
ఉభయోరపి దృష్టోఽన్తః త్వనయోస్తత్త్వ దర్శిభిః 16

అసతః = అసద్వస్తువునకు (లేనిదానికి), భావః =ఉనికి, న విద్యతే = లేదు, తు = అయితే, సతః = సద్వస్తువునకు (ఉన్నదానికి), అభావః = లేమి (లేకుండుట), న విద్యతే = లేదు, అనయోః ఉభయోః, అపి = ఈ రెండింటి యొక్కయు, అంతః = తత్వము తత్త్వదర్శిభిః = తత్వజ్ఞానులచేత, దృష్టః = తెలిసికొనబడినది.

తా. లేనిది ఉండుటకును, ఉన్నది లేకపోవుటకును సాధ్యముకాదు. ఉన్నది ఉన్నదియే యగును. లేనిది యెప్పటికిని ఉండబోదు. మరుభూమియందు జలము లేనట్లు దేహాది ప్రపంచము ఎప్పుడును లేనిదే. ఆత్మమాత్రమే నిత్యము.

*శ్లో॥ మరుభూమౌ జలగ్ం సర్వం మరుభూమాత్రమేవ తత్*
*జగత్త్రయ మిదం సర్వం చిన్మాత్రం స్వవిచారతః (వరాహోపనిషత్ 2.6)*

కాన చిత్తునందు మూడు లోకములున్నట్లు భాసించుచున్నవి. కాని సత్యమునకు లేవు. పరమార్థము తెలిసిన జ్ఞానులు సత్తు, ఆసత్తు అనెడి రెండిటియొక్క స్వరూప స్వభావముల గూర్చి పై విధముగా నిర్ణయము చేసిరి.

శ్లో॥ అవినాశితు తద్విద్ధి యేన సర్వ మిదం తతమ్
వినాశ మవ్యయస్యాస్య న కశ్చిత్కర్తుమర్హతి 17

అవినాశి = నాశరహితమైన, తత్, విద్ధి = దానిని తెలిసికొనుము, యేన, తు = దేనిచేనైతే, ఇదమ్, సర్వమ్ = ఈ జగత్తంతయు (దృశ్యవర్గము), తతమ్ = వ్యాప్తమైయున్నదో, అస్య అవ్యయస్య = శాశ్వతమైన దానియొక్క (ఆత్మయొక్క), వినాశమ్ = వినాశమును, కర్తుమ్ = చేయుటకు, కశ్చిత్ = ఎవ్వడును, న, అర్హతి = సమర్థుడు కాడు.

తా. చరాచరాత్మకమగు సకల జగత్తును వ్యాపించియున్న ఆత్మ నశించునది కాదు. సర్వత్ర వ్యాప్తమై యున్న ఆత్మ శాశ్వతమైనది. ఆత్మను నాశనము చేయు వాడెవడునులేడు. ఆత్మ అవినాశియని యెరుగుము.

వి. *'ఏన సర్వమిదం తతమ్'* అనగా.. దేనిచేత ఈ జగత్తు సర్వము వ్యాప్తమైనదో అని అనుటచే ఆత్మ ఒక్కటియే అనియు, అదియే పరమాత్మ అనియు, ఆత్మ అనగా 'వ్యష్టి జీవాత్మ' కాదనియు గ్రహించవలెను.

శ్లో॥ అంతవంత ఇమే దేహా నిత్యస్యోక్తాః శరీరిణః
అనాశినోఽప్రమేయస్య తస్మాద్యుధ్యస్వ భారత 18

భారతా = ఓ అర్జునా!, అనాశినః = నాశరహితమైనదియు, అప్రమేయస్య = అప్రమేయ (అనిర్వచనీయ) మైనదియు, నిత్యస్య = శాశ్వతమైనదియు అగు, శరీరిణః = ఆత్మ యొక్క, ఇమే దేహాః = ఈ దేహములన్నియును, అంతవంతః = నశించునవి అని, ఉక్తాః = చెప్పబడినవి, తస్మాత్ = అందువలన, యుధ్యస్వ = యుద్ధమొనరింపుము

తా. భరత వంశజుడవగు ఓ అర్జునా! ఎల్లప్పుడును ఏకరూపముగా నుండునదియు, నాశము లేనిదియు, ప్రత్యక్షాది ప్రమాణములచే తెలియరానిదియునగు ఆత్మను తెలియజాలక అనాత్మ లక్షణములను ఆత్మయందారోపించుట చేతనే యీ శరీరములు, ప్రపంచములు కలిగినవి. ఈ మిధ్యాభూతములగు శరీరములకు అంతము కలదు. కాని శరీరి నిత్యము ఉండువాడు. శరీరములు మాత్రమే నశించునవియని యెరింగి యుద్ధమొనర్పుము.

శ్లో॥ య ఏనం వేత్తి హంతారం యశ్చైనం మన్యతే హతమ్
ఉభౌతౌ న విజానీతో నాయం హంతి న హన్యతే 19

యః = ఎవడైతే, ఏవమ్ = దీనిని (ఈ ఆత్మను), హంతారమ్ = చంపునట్టి దానినిగా, వేత్తి = భావించునో, చ = అట్లే, యః = ఎవడైతే, ఏనమ్ = దీనిని (ఈ ఆత్మను), హతమ్ = చంపబడు దానినిగా, మన్యతే = భావించునో, తౌ ఉభౌ = ఆ ఉభయులను, న విజానీతః = తెలిసికొనిన వారు (జ్ఞానులు) కారు (ఏలనన), అయమ్ = ఇది (ఈ ఆత్మ) వాస్తవముగా, న హంతి = (ఎవ్వరినీ) చంపదు, న హన్యతే = (ఎవ్వరిచేతను) చంపబడదు

తా. ఆత్మ చంపునట్టిదియు కాదు. చంపబడునదియు కాదు. కార్యకారణ భావము లేనిదై యున్నది. ఆత్మకు భిన్నముగా వేరొకటి లేదు. కావున ఆత్మను హంతకునిగాను, లేక హతునిగాను భావించువారలు ఆత్మ నెరుంగని అజ్ఞానులే యగుదురు.

శ్లో॥ న జాయతే మ్రియతే వా కదాచిత్
నాయంభూత్వా భవితా వా న భూయః
అజోనిత్యః శాశ్వతోఽయం పురాణో
న హన్యతే హన్యమానే శరీరే 20

అయమ్ = ఇది (ఈ ఆత్మ), కదాచిత్ = ఏ కాలమునందైనను, న జాయతే = జన్మింపదు, వా = మరియు, న మ్రియతే = మరణింపదు, వా = అట్లే, భూత్వా భూయః భవిత న = ఉత్పన్నమై, అస్తిత్వమును పొందునది కాదు (ఏలనన), అయమ్ = ఇది (ఈ ఆత్మ), అజః = జన్మ లేనిది, నిత్యః = నిత్యమైనది, శాశ్వతః = శాశ్వతమైనది, పురాణః = సనాతనమైనది, శరీరే = శరీరము, హన్యమానే = చంపబడుచున్నను, న హన్యతే = (ఇది) చంపబడదు.

తా. ఆత్మకు చావుపుట్టుకలు లేవు. నిత్యమైనది, శాశ్వతమైనది, వికార రహితమైనది ఆత్మ. ఒకప్పుడు ఉండి మరొకప్పుడు ఉండనిదియు కాదు. అనాది సిద్ధమై యున్నది. అందుచే దేహములు నాశవంతములైనను దేహియగు ఆత్మకు నాశములేదు.

శ్లో॥ వేదావినాశినం నిత్యం య ఏన మజమవ్యయమ్
కథం స పురుషః పార్థ! కం ఘాతయతి హంతికమ్ 21

పార్థ = ఓ అర్జునా!, యః పురుషః = ఏ పురుషుడు, ఏనమ్ = దీనిని (ఈ ఆత్మను), అవినాశినమ్ = నాశరహితమైన దానినిగా, నిత్యమ్ = నిత్యమైన దానినిగా, అజమ్ = జన్మలేని దానినిగా, అవ్యయమ్ = మార్పులేని దానినిగా, వేద = తెలుసుకొనునో, సః = అతడు (ఆ పురుషుడు), కథమ్ = ఎట్లు (ఏ విధముగా), కమ్ = ఎవనిని, ఘాతయతి = చంపించును, కథమ్ = ఎట్లు (ఏ విధముగా), కమ్ = ఎవనిని, హంతి = చంపును ?

తా. ఆత్మ నాశము లేనిదనియు, నిత్యమైనదనియు, పుట్టుక లేనిదనియు వికారరహిత మైనదనియు తెలిసిన విద్వాంసుడు ఎవనినైనను, చంపుటగాని చంపించుటగాని ఎట్లు చేయును?

వి. ఆత్మజ్ఞానము కలవాడు విద్వాంసుడు. విద్వాంసుడు సర్వమును ఆత్మస్వరూపముగా భావించును. తనను కూడ ఆత్మగా తెలిసికొనును. ఆత్మకు కార్య కర్తృత్వాది గుణములు లేవు. కనుక జ్ఞానియైన పురుషుడు నిర్వికారుడై, నిష్క్రియుడై ఆత్మానుసంధానపరుడై, యుండును.

శ్లో॥ వాసాంసి జీర్ణాని యథావిహాయ నవాని గృహ్ణాతి నరో௨ పరాణి
తథాశరీరాణి విహాయజీర్ణా న్యన్యాని సంయాతి నవాని దేహీ 22

యథా = ఏ విధముగా, నరః = మానవుడు, జీర్ణాని = జీర్ణమైనట్టి (పాత), వాసాంసి = వస్త్రములను, విహాయ = త్యజించి, అపరాణి = ఇతరములైన, నవాని = నూతనములైన వానిని (కొత్త వస్త్రములను), గృహ్ణాతి = గ్రహించునో, తథా = అట్లే, దేహీ = ఆత్మ, జీర్ణాని = ప్రాత, శరీరాణి = శరీరములను, విహాయ = వీడి, అన్యాని = ఇతరములైన, నవాని = క్రొత్త శరీరములను, సంయాతి = పొందును

తా. జీర్ణమైన వస్త్రములను వదలి మానవుడు నూతన వస్త్రములను ధరించునట్లు ఆత్మ, జీర్ణములైన శరీరములను వదలి నూతన దేహములను ఉపాధిగా పొందును. పాతవానిని వదలి కొత్త వస్త్రములను ధరించిన వానికి వికారము లెట్లుండవో అట్లే ఆత్మ అవిక్రియుడని భావము.

వి. ఆత్మ, చినిగిన వస్త్రమును విడిచి నూతన వస్త్రమును ధరించుట అనగా సినిమా తెరపై బొమ్మలు మారుచుండునట్లు భావించవలెనే కాని, సర్వ వ్యాపకమైన ఆత్మకు అన్యంగా, పెద్దదిగా వేరొక వస్త్రమును ధరించునట్లు భావించరాదు. లేదా వ్యష్టి జీవాత్మ ఇంకొక దేహంలో ప్రవేశించినట్లు భావించరాదు.

శ్లో॥ నైనం ఛిందంతి శస్త్రాణి నైనం దహతి పావకః
న చైనం క్లేదయంత్యాపో న శోషయతి మారుతః 23

ఏనమ్ = దీనిని (ఈ ఆత్మను), శస్త్రాణి = శస్త్రములు, న ఛిందంతి = ఛేదింపజాలవు, ఏనమ్ = దీనిని, పావకః = అగ్ని, న దహతి = దహింపజాలదు, ఏనమ్ = దీనిని, ఆపః = నీరు, న క్లేదయంతి = తడుపజాలదు, చ = మరియు, మారుతః = గాలి, న శోషయతి = ఆరిపోవునట్లు చేయజాలదు.

తా. ఆత్మ పంచభూతములకంటె అతీతమగుటచే ఆ భూతములు ఆత్మనేమియు చేయజాలవు. ఆయుధములచే ఈ ఆత్మ ఛేదింపబడదు. అగ్నియు ఆత్మను దహింపజాలదు. అట్లే జలము, వాయువు ఆత్మను నాశము చేయజాలవు.

శ్లో॥ అచ్ఛేద్యోఽయమదాహ్యోఽయం అక్లేద్యోఽశోష్య ఏవ చ
నిత్యస్సర్వగతః స్థాణురచలోఽయం సనాతనః 24

అయమ్ = ఇది (ఈ ఆత్మ), అచ్ఛేద్యః = ఛేదించుటకు సాధ్యము కానిది, అయమ్ = ఇది, అదాహ్యః = దహింప వీలుకానిది, అక్లేద్యః = తడుపుటకు శక్యము కానిది, చ = మరియు, ఏవ = నిస్సందేహముగా, అశోష్యః = శోషింపజేయుటకు సాధ్యపడనిది, అయమ్ = ఇది, నిత్యః = నిత్యమైనది, సర్వగతః = సర్వవ్యాపి, అచలః = చలింపనిది, స్థాణుః = స్థిరముగా ఉండునది, సనాతనః = సనాతనమైనది.

తా. ఆత్మ ఎప్పుడును ఛేదింపబడదు, దహింపబడదు, తడుపబడదు, ఎండింపబడదు. అందుచే ఆత్మ నిత్యము, సర్వగతమై యుండుటచే అచలమై, స్థిరమై, సనాతనమై యున్నది. అట్టి సర్వవ్యాపకమైన ఆత్మకు రాకపోకలు సంభవింపవు.

శ్లో॥ అవ్యక్తోఽయమచింత్యోఽయమ్ అవికార్యోఽయముచ్యతే
తస్మాదేవం విదిత్వైనం నానుశోచితుమర్హసి 25

అయమ్ = ఇది (ఈ ఆత్మ), అవ్యక్తః = వ్యక్తము కానిది (ఇంద్రియ గోచరము కానిది), అయమ్ = ఇది, అచింత్యః = మనస్సునకును అందనిది, అయమ్ = ఇది, అవికార్యః = వికారములు లేనిది, ఉచ్యతే = (అని) చెప్పబడుచున్నది, తస్మాత్ = అందువలన ఓ అర్జునా!, ఏనమ్ = దీనిని (ఈ ఆత్మను), ఏవమ్ = ఈ రీతిగా (ఇంతవరకును తెల్పబడినట్లుగా), విదిత్వా = ఎరింగి, అనుశోచితుమ్ = శోకించుటకు, న అర్హసి = అర్హుడవు కావు (అనగా శోకించుట ఉచితము కాదు),

తా. సర్వగతమైన ఆత్మ అవ్యక్తముగా నుండుటచే ఇంద్రియ గోచరము కాదు. అచింత్యమగుటచే మనోవిషయము కాదు. అందుచే జ్ఞానేంద్రియ కర్మేంద్రియములకు, అతీతమైన ఆత్మ ఎట్టి వికారమునకు లోనుకాదు. ఇట్లు తెలిసిన విద్వాంసుడు ఆత్మను గురించి దుఃఖించదు.

శ్లో॥ అథ చైనం నిత్యజాతం నిత్యం వా మన్యసే మృతం
తథాపి త్వం మహాబాహో ! నైవం శోచితుమర్హసి 26

మహాబాహో = ఓ మహాబాహూ!, అథ చ = కాని ఒకవేళ, త్వమ్ = నీవు, ఏనమ్ = దీనిని (ఈ ఆత్మను), నిత్యజాతమ్ = సర్వదా జన్మించునట్టిది, వా = అట్లే, నిత్యమ్ = సతతము, మృతమ్ = మరణించునట్టిది, మన్యసే = (అని) భావించినను, తథాపి = అట్లైనను, ఏవమ్ = ఈ విధముగా, శోచితుమ్ = శోకించుటకు, న అర్హసి = అర్హుడవు కావు (శోకించుట తగదు)

తా. బాహుబలశాలివగు ఓ అర్జునా! నీవు ఆత్మను నిత్యము పుట్టుచు, చచ్చుచు నుండునదిగా భావించినచో ఆత్మను గురించి చింతించదగవు.

శ్లో॥ జాతస్య హి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్య చ
తస్మాదపరిహార్యేఽర్థే న త్వం శోచితుమర్హసి 27

హి = ఏలనన (ఇట్లు భావించినచో), జాతస్య = పుట్టిన వానికి, మృత్యుః = మరణము, ధ్రువః = నిశ్చయము (తప్పదు), చ = మరియు, మృతస్య = మరణించిన వానికి, జన్మ = పుట్టుక, ధ్రువమ్ = నిశ్చితము (తప్పదు), తస్మాత్ = అందువలన, అపరిహార్యే = పరిహరించుటకు సాధ్యము కాని, అర్థే = విషయమున, త్వమ్ = నీవు, శోచితుమ్ = శోకించుటకు, న అర్హసి = అర్హుడవు కావు (శోకించరాదు).

తా. పుట్టినవానికి మరణము, మరణించినవానికి పుట్టుకయు తప్పింపరానివి. సహజములు, అనివార్యములగు చావుపుట్టుకలకై నీవు చింతింపదగవు.

వి. జనన మరణములు ధ్రువమని చెప్పుట, ఆత్మను మరచి శరీరమే తానని భావించు అజ్ఞానులకే వర్తించును.

*శ్లో: అవిద్యయా మృత్యుం తీర్త్వా*
*విద్యయాఽమృత మశ్నుతే* *(ఈశావాస్యోపనిషత్-11)*

*శ్లో: న తస్య రోగో నజరా నమృత్యుః*
*ప్రాప్తస్య యోగాగ్నిమయం శరీరమ్* *(శ్వేతాశ్వతరోపనిషత్ 2-12)*

యోగసాధన (అవిద్య) ద్వారా మృత్యువును దాటి, జ్ఞానము ద్వారా అమృతత్వమును పొందుచున్నారు. యోగాగ్నిమయ శరీరులకు రోగ జరామరణములు సంభవించవని చెప్పుటచే, సాధకులు మాత్రము జనన మరణము లేని శాశ్వత బ్రహ్మస్వరూపులు కాగలరని గ్రహించనగును.

శ్లో॥ అవ్యక్తాదీని భూతాని వ్యక్తమధ్యాని భారత
అవ్యక్త నిధనాన్యేవ తత్ర కా పరిదేవనా 28

భారత = ఓ భారతా! (ఓ అర్జునా!), భూతాని = ప్రాణులన్నియును, అవ్యక్తాదీని = పుట్టటకు ముందు అవ్యక్త (అప్రకటిత) ములు, అవ్యక్తనిధనాని ఏవ = మరణించిన పిమ్మట గూడ అవ్యక్తములే, వ్యక్తమధ్యాని = (కేవలము) జనన మరణముల మధ్య కాలమున, మాత్రమే ప్రకటితములు (ఇంద్రియ గోచరములు), తత్ర = ఇట్టి స్థితియందు, కా పరిదేవనా = శోకించుట ఎందులకు (శోకించుట వ్యర్థము)

తా. ఈ జగత్తున కనపడు సకలభూతముల ఉత్పత్తికి పూర్వమందు ఉన్న రూపము వ్యక్తముకాదు. మరణమందిన పిమ్మట కలుగు రూపము కూడ తెలియబడక అవ్యక్తముగా నున్నది. జనన మరణముల మధ్య కాలమున నున్న రూపము మాత్రమే యెరుగబడును. ప్రారబ్ధానుయాతమై మారుచుండు క్షణభంగురమగు దేహమునకై విచారపడనేల?

శ్లో॥ ఆశ్చర్యవత్పశ్యతి కశ్చిదేనమ్ ఆశ్చర్యవద్వదతి తథైవ చాన్యః
ఆశ్చర్యవచ్చైనమన్యః శృణోతి శ్రుత్వాప్యేనం వేద న చైవ కశ్చిత్ 29

కశ్చిత్ = ఎవరో ఒక మహా పురుషుడే, ఏనమ్ = దీనిని (ఈ ఆత్మను), ఆశ్చర్యవత్ = ఆశ్చర్యమైన దానినిగా (అరుదుగా), పశ్యతి = చూచును, చ = మరియు, తథా ఏవ = అట్లే, అన్యః = మరియొక మహా పురుషుడు, ఆశ్చర్యవత్ = (దీని తత్వమును) ఆశ్చర్యకరముగా (అరుదుగా), వదతి = చెప్పును (వర్ణించును), చ = అట్లే, అన్యః = మరియొకడు (యోగ్యుడై వాడే), ఏనమ్ = దీనిని (ఈ ఆత్మను), ఆశ్చర్యవత్ = ఆశ్చర్యముగా (అరుదుగా), శృణోతి = వినును, చ = మరియు, కశ్చిత్ = ఒక్కొక్కడు, శృత్వా అపి = విన్నప్పటికిని, ఏనమ్ = దీనిని, న ఏవ వేద = తెలిసికొనజాలడు

తా. ఆత్మను చూచువారును, ఆత్మను గురించి చెప్పువారును, తత్త్వబోధను ఆసక్తితో వినువారును వేలకొలది ప్రజలలో నొక్కడు మాత్రమే యుండును. కావున ఆత్మ యొక్క యథార్థరూప మెరుగబడుటలేదు.

శ్లో॥ దేహీ నిత్యమవధ్యోఽయం దేహే సర్వస్య భారత
తస్మాత్సర్వాణి భూతాని న త్వం శోచితుమర్హసి 30

భారతా = ఓ అర్జునా!, అయమ్ దేహీ = ఈ ఆత్మ, సర్వస్య = ప్రతి ప్రాణియొక్క, దేహే = దేహమునందు, నిత్యమ్ = ఎల్లప్పుడును, అవధ్యః = వధింప వీలుకానిదియై యుండును, తస్మాత్ = అందువలన, సర్వాణి = సమస్తములైన, భూతాని = ప్రాణులను గూర్చి (ఏ ప్రాణి కొరకు) అయినను, తమ్ = నీవు, శోచితుమ్ = శోకించుటకు, న అర్హసి = అర్హుడవు కావు (శోకింపదగదు)

తా. భరత కులజుడవగు అర్జునా! దేహము నశించినను దేహియగు ఆత్మ నశించునది కాదు. ఎవని చేతను వధింపబడదు. అందువలన ఈ భూతాత్మకములైన దేహముల నాశనవిషయమై దుఃఖింపదగదు.

శ్లో॥ స్వధర్మమపి చావేక్ష్య న వికంపితుమర్హసి
ధర్మ్యాద్ధి యుద్ధాచ్ఛ్రేయోఽన్యత్ క్షత్రియస్య న విద్యతే 31

చ = ఇంకను, స్వధర్మమ్ = (నీ) స్వధర్మమును, అవేక్ష్య = చూచి, అపి = అయినను, వికంపితుమ్ = చలించుటకు (భయపడుటకు), న అర్హసి = అర్హుడవు కావు (భయపడదగదు), హి = ఏలనన, క్షత్రియస్య = క్షత్రియునకు, ధర్మ్యాత్ = ధర్మయుక్తమైన, యుద్ధాత్ = యుద్ధము కంటె, అన్యత్ = మరియొకటి, శ్రేయః = శ్రేయస్కరమైన కర్తవ్యము, న విద్యతే = ఉండదు.

తా. అర్జునా! స్వధర్మమును విచారించి నీవు యుద్ధమనిన చలింపదగవు. క్షత్రియునకు ధర్మమూలమగు యుద్ధముకంటే శ్రేయస్సు నొసగునది మరొకటి యుండదు. కావున నీకు యుద్ధము కర్తవ్యము.

శ్లో॥ యదృచ్ఛయా చోపపన్నం స్వర్గద్వారమపావృతం
సుఖినః క్షత్రియాః పార్థ ! లభన్తే యుద్ధమీదృశమ్ 32

పార్థ = ఓ పార్థా!, యదృచ్ఛయా = అనుకోకుండ (సంకల్పము లేకుండ), ఉపపన్నమ్ = ప్రాప్తించినట్టిదియును, అపావృతమ్ = తెరువబడిన, స్వర్గద్వారమ్ = స్వర్గద్వార (రూప) మైనట్టిదియు, ఈదృశమ్ = ఇట్టి, యుద్ధమ్ = యుద్ధమును, సుఖినః = అదృష్టవంతులైన, క్షత్రియాః = క్షత్రియులు మాత్రమే, లభంతే = పొందుదురు

తా. కోరకయే వచ్చు యుద్ధము వర్ణాశ్రమాచారములను బట్టి క్షత్రియులకు పరమ పవిత్రమైనది. ఇట్టి పరమ పవిత్రమగు యుద్ధమున పాల్గొనువారలకు స్వర్గద్వారములు తెరువబడియే యుండును.

వి. అట్టి స్వర్గఫలము క్షత్రియులకు ఇంద్రియ సుఖమే కాగలదు. వర్ణాశ్రమ ధర్మానుష్ఠానమువలన వచ్చు ఫలములు ఇహ పరలోక సుఖములు తప్ప ఆత్మసుఖమును కలుగజేయజాలవని యెరుంగవలెను.

*శ్లో॥ వర్ణాశ్రమాచారయుతా విమూఢా*
*కర్మానుసారేణ ఫలం లభంతే*
*వర్ణాది ధర్మం హి పరిత్యజన్తః*
*స్వానంద తృప్తా పురుషా భవంతి* (మైత్రేయ్యుపనిషత్1-17)

వర్ణాశ్రమ ధర్మములు శరీర సంబంధములు. ఆత్మధర్మములు కావు. సంగబుద్ధితో వర్ణాశ్రమాచారముల నాచరించువారు కర్మబంధముల పాలగుదురు. కావున మూఢులనబడుదురు. కావున వర్ణాశ్రమ ధర్మములను విడిచి పెట్టినవాడు ఆత్మభావమున నవద్వారపురమగు దేహమున ఆత్మావలోకనము చేయు పురుషుడైన ఆనంద స్వరూపుడగును. కావున సమబుద్ధితో స్వధర్మమనుష్ఠేయము గాన నీకు యుద్ధము చేయుటయే తగును. సత్త్వరజస్తమోగుణ ప్రభావితులై సంగబుద్ధితో కర్మలనాచరించువారు స్త్రీశబ్దవాచ్యులగుదురు. స్త్రీశబ్దముననున్న సకార తకార రేఫలు వరుసగా సత్త్వ, తమో, రజోగుణములను సూచించును.

శ్లో॥ అథ చేత్త్వమిమం ధర్మ్యం సంగ్రామం న కరిష్యసి
తతస్స్వధర్మం కీర్తిం చ హిత్వా పాప మవాప్స్యసి 33

అథ చేత్ = అయినను, ఒకవేళ, త్వమ్ = నీవు, ఇమమ్ = ఈ (ఇట్టి), ధర్మ్యమ్ = ధర్మయుక్తమైన, సంగ్రామమ్ = యుద్ధమును, న కరిష్యసి = చేయనిచో, తతః = పిమ్మట, స్వధర్మమ్ చ = స్వధర్మమునూ, కీర్తిమ్ = కీర్తినీ, హిత్వా = పోగొట్టుకొని, పాపమ్ = పాపమునే, అవాప్స్యసి = పొందెదవు

తా. అజ్ఞానముచే నా పలుకులను వినక యుద్ధము చేయుట మానుదువేని, నీవు క్షత్రియధర్మమును అతిక్రమించినవాడవగుదువు. ఇదియుగాక యిహమందు అపకీర్తి పాలగుదువు. పాపమును కూడ పొందగలవు.

శ్లో॥ అకీర్తిం చాపి భూతాని కథయిష్యంతి తేఽవ్యయామ్
సంభావితస్య చాకీర్తిర్మరణా దతిరిచ్యతే 34

చ = మరియు, భూతాని = సమస్త జనులు, తే = నీయొక్క, అవ్యయామ్ = కలకాలము నిలిచియుండు, అకీర్తిమ్ అపి = అపకీర్తిని గూర్చియు, కథయిష్యంతి = చెప్పుకొందురు, చ = మరియు, సంభావితస్య = మాన్యుడైన వానికి, అకీర్తిః = అపకీర్తి, మరణాత్ = మృత్యువు కంటెను, అతిరిచ్యతే = అధిక (బాధాకర) మైనది

తా. బహుకాలము వరకు లోకులు నీ అపకీర్తిని చెప్పుకొనుచుందురు. ధర్మాత్ముడని, శూరుడని ప్రతిష్ఠ సంపాదించిన వానికి అపకీర్తి మరణము కంటె మిక్కుటముగా బాధకలిగించును.

శ్లో॥ భయాద్రణాదుపరతం మన్యంతే త్వాం మహారథాః
యేషాం చ త్వం బహుమతో భూత్వా యాస్యసి లాఘవమ్ 35

చ = మరియు, ఏషామ్ = ఎవరి దృష్టిలో, త్వమ్ = నీవు, బహుమతః = మిక్కిలి మాన్యుడవు, భూత్వా = అయి (ఉంటివో), లాఘవమ్ = (ఇప్పుడు) చులకన, యాస్యసి = అయ్యెదవు, మహారథాః = ఆ మహారథులు, త్వమ్ = నిన్ను, భయాత్ = భయము వలన (భయకారణముగా), రణాత్ = యుద్ధము నుండి, ఉపరతమ్ = పారిపోయిన వానినిగా, మన్యంతే = తలంతురు

తా. ఈ యుద్ధమునందు చేరిన వీరులందరును నిన్నింతవరకు మహావీరుడవని గౌరవముతో చూచుచుండిరి. నీవిపుడు యుద్ధముచేయుట మానితివేని, నిన్ను గౌరవముగా జూచినవారు, యుద్ధభయమున యుద్ధమును మానితివనియు, సామర్థ్యము లేనివాడవనియు చులకనగా చూడగలరు.

శ్లో॥ అవాచ్యవాదాంశ్చ బహూన్ వదిష్యంతి తవాహితాః
నిందంతస్తవ సామర్థ్యం తతో దుఃఖతరం ను కిమ్ 36

తవ = నీయొక్క, అహితాః = శత్రువులు, తవ = నీ, సామర్థ్యమ్ = సామర్థ్యమును, నిందంతః = నిందించుచు, బహూన్ = అనేకములైన, అవాచ్యవాదాన్ చ = అనరాని మాటలను గూడ, వదిష్యంతి = పలికెదరు, తతః = అంతకంటెను, దుఃఖతరమ్ = అధికమైన దుఃఖము, కిమ్ ను = ఇంక ఏముండును?

తా. యుద్ధము చేయమానిన నిన్ను నీ శత్రువులు పలురకములుగా నిందలపాలు చేయుదురు. శత్రువుల నిందావాక్యములను వినుటకంటె వీరుడవగు నీకు దుఃఖప్రదమైనది వేరొకటి యుండదు.

శ్లో॥ హతో వా ప్రాప్స్యసి స్వర్గం జిత్వా వా భోక్ష్యసే మహీమ్
తస్మాదుత్తిష్ఠ కౌంతేయ యుద్ధాయ కృతనిశ్చయః 37

వా = ఒకవేళ, హతః = (నీవు) చంపబడినచో, స్వర్గమ్ = స్వర్గమును, ప్రాప్స్యసి = పొందగలవు, వా = లేక (అట్లుగాక), జిత్వా = (నీవు యుద్ధమున) జయించినచో, మహీమ్ = భూమండల రాజ్యమును, భోక్ష్యసే = అనుభవించెదవు, తస్మాత్ = అందువలన, కౌంతేయా = కుంతీ కుమారా! (అర్జునా!), యుద్ధాయ = యుద్ధము చేయుట కొరకు, కృత నిశ్చయః = తిరుగులేని నిశ్చయము గలవాడవై, ఉత్తిష్ఠ = లెమ్ము (కటిబద్ధుడవు కమ్ము)

తా. ఓ కుంతీపుత్రా! నీవీ ధర్మయుద్ధమున హతుడవగుదువేని నీకు వీరస్వర్గము లభించును. అట్లుగాక విజయుడవగుదువా రాజ్యసుఖ భోగములనుభవించగలవు. కావున యుద్ధము చేయుటకు కృతనిశ్చయుడవగుము. లెమ్ము.

శ్లో॥ సుఖదుఃఖే సమే కృత్వా లాభాలాభౌ జయాజయౌ
తతో యుద్ధాయ యుజ్యస్వ నైవం పాపమవాప్స్యసి 38

జయాజయౌ = జయాపజయములను, లాభాలాభౌ = లాభాలాభములను, సమే = సమమైన వానినిగా, కృత్వా = భావించి, తతః = అనంతరము, యుద్ధాయ = యుద్ధము (చేయుట) కొరకై, యుజ్యస్వ = సన్నద్ధుడవుకమ్ము, ఏవమ్ = ఈ విధముగా (యుద్ధము చేయుటవలన), పాపమ్ = పాపమును, న అవాప్స్యసి = (నీవు)పొందనే పొందవు

తా. సుఖదుఃఖములను, లాభాలాభములను, జయాపజయములను సమానముగా చూడగలిగి యుద్ధం చేయుదువేని నీకు పాపము కలుగదు. ఆ విధముగా కర్మలను సమబుద్ధితో చేయని యెడల అవి బంధహేతువులగును. సమబుద్ధియనగా ఫలాభిసంధిరహితముగా కర్మల నాచరించుటయని భావము. ఫలాభిసంధి రహిత కర్మాచరణవలన మోక్షము లభించును.

*శ్లో॥ కర్తృత్వాద్యహంకారతయా జన్మాదికారణం*
*నిత్య నైమిత్తిక యాగ వ్రత తపోదానాదిషు*
*ఫలాభి సంధానం యత్ తదకర్మ* *(నిరాలంబోపనిషత్-6)*

వి. ద్వంద్వములను సమభావముతో చూచుటయనగా నిత్య, నైమిత్తిక, యోగ, వ్రత, తపోదానాది కర్మలయందలి ఫలమగు స్వర్గాది భోగములపై ఆసక్తిని వదలి, ఆత్మరతుడు కావలెను.

*శ్లో॥ యుక్తః కర్మఫలం త్యక్త్వా . . . . .* *(5-12)*

యోగి అగువాడే కర్మఫలములను విడువగలడు. అట్టివాడు యుద్ధము చేసినను పాపము

పొందదు. కావున శ్రీకృష్ణపరమాత్మ అర్జునుని ప్రోత్సహించినది కేవలము యుద్ధకర్మ కాదు. యుద్ధ ఫలమంటకుండునట్లు చేయు ప్రాణాయామ రూప యోగకర్మనే. దీనినే తరువాత శ్లోకంలో 'బుద్ధియోగము' పేరిట చెప్పబోవుచున్నారు.

శ్లో॥ ఏషా తేఽభిహితా సాంఖ్యే బుద్ధిర్యోగే త్విమాంశృణు
బుద్ధ్యా యుక్తో యయా పార్థ కర్మబంధం ప్రహాస్యసి 39

పార్థ = ఓ పార్థా!, ఏషా బుద్ధిః = ఈ సమత్వ బుద్ధి, తే = నీకు, సాంఖ్యే = జ్ఞానయోగ విషయమునందు, అభిహితా = తెలుపబడినది, తు, ఇమామ్ = అయితే, ఈ, బుద్ధిర్యోగే = బుద్ధియోగమును, శృణు = వినుము, యయా = ఏ (ఆ), బుద్ధ్యా = బుద్ధితో (ఈ బుద్ధియోగముతో), యుక్తః = కూడినవాడవై, కర్మబంధమ్ = కర్మ బంధమును, ప్రహాస్యసి = పారద్రోలగలవు

తా. ఓ పార్థా! పరమార్థ వస్తు వివేక విషయమైన ఆత్మతత్త్వ జ్ఞానము నీకు చెప్పబడినది. యోగవిషయజ్ఞానమును అనగా బుద్ధియోగమును చెప్పుచున్నాను. వినుము. బుద్ధియోగముతో కర్మ లాచరించిన కర్మబంధములు తొలగును.

వి. బుద్ధియోగమనగా జ్ఞానకర్మలు రెండును కావని వ్యక్తమగుచున్నది. 'ఆత్మ తత్త్వజ్ఞానమును నీకు చెప్పితిని' అనుటవలనను, 'బుద్ధియోగము నాశ్రయించిన కర్మబంధ విచ్ఛేదమగును' అనుటచేతను, బుద్ధియోగమనగా సాంఖ్యము కాదనియు, కర్మాచరణ కాదనియు, వ్యక్తమగుచున్నది. కర్మబంధముల నుండి తప్పించుకొను మార్గమే బుద్ధియోగము.

*శ్లో॥ ప్రాణాఽపానౌ నిశ్చయ బుద్ధ్యా హృది రుద్ధ్వా*
*ఛిత్వా సర్వసంశయః బంధం విషయోత్థాన్* *(బ్రహ్మగీత)*

ప్రాణాపానములు ఏకమైనచో నిశ్చయ జ్ఞానము కలుగును. అనగా సత్యము గోచరించును. ఆ రెండునూ హృదయము నందు విడివడియున్నచో సర్వ సంశయములు, బంధములు, విషయములు కలుగుచున్నవి. అందుచే జ్ఞానమును కలుగజేయు యోగమునకు 'బుద్ధియోగ' మని సృష్టికర్తయగు బ్రహ్మయే పదప్రయోగం చేసిరి.

శ్లో॥ నేహాభిక్రమనాశోఽస్తి ప్రత్యవాయో న విద్యతే
స్వల్పమప్యస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్ 40

ఇహ = ఈ బుద్ధియోగము నందు, అభిక్రమనాశః = ఆరంభ (బీజ) నాశము, న అస్తి = ఉండదు, ప్రత్యవాయః = (మరియు దీనికి) విపరీత ఫలరూప దోషము గూడ, న విద్యతే = (ఏ

మాత్రము) ఉండదు, అస్య = ఈ (బుద్ధియోగ రూపమైన), ధర్మస్య = ధర్మముయొక్క, స్వల్పమ్ అపి = ఏ కొంచెము సాధనయైనను, మహతః భయాత్ = జన్మమృత్యు రూపమైన గొప్ప భయము నుండి, త్రాయతే = కాపాడును.

తా. మోక్షమార్గమగు ఈ బుద్ధియోగమున సిద్ధిని పొందజాలక మరణించినను ప్రత్యవాయ దోషము లేదు. కృష్యాదికర్మలవలె ప్రారంభముచేసి వదలినను బుద్ధియోగము నశించునది కాదు. తప్పక జన్మాంతరమునందును ఫలవంతమగును. కర్మలట్లుగాదు. బుద్ధియోగము స్వల్పముగా నాచరించినను, జరామరణరూప మహాభయము నుండి నివృత్తి పొందించి బ్రహ్మజ్ఞానసిద్ధికి మూలమగును. స్వల్పమాచరించి యోగభ్రష్టుడైననూ తదుపరి జన్మలో యోగమును పూర్తి చేసుకొని బ్రహ్మపదమును పొందగలరని రాబోయే ఆత్మసంయమ యోగము (6వ అధ్యాయం) లో చెప్పబోవుచున్నారు.

శ్లో॥ వ్యవసాయాత్మికా బుద్ధిరేకేహ కురునందన
బహుశాఖా హ్యనంతాశ్చ బుద్ధయోఽ వ్యవసాయినామ్ 41

కురునందన = ఓ అర్జునా!, ఇహ = ఈ బుద్ధియోగమునందు, వ్యవసాయాత్మికా = నిశ్చయాత్మకమైన, బుద్ధిః = బుద్ధి, ఏకా (భవతి) = ఒకటిగా ఉండును, అవ్యవసాయినామ్ = (కాని) స్థిరబుద్ధిలేని వివేకహీనులైన సకామ మనుష్యుల యొక్క, బుద్ధయః = బుద్ధులు, హి = నిశ్చయముగా, బహుశాఖాః = అనేక భేదములు గలిగినవై (చంచలములై), చ = మరియు, అనంతాః = అంతులేని (కోరికలుగల) వై (ఉండును)

తా. ఓ అర్జునా! బుద్ధియోగమున ప్రవృత్తి గలవారికి సర్వము బ్రహ్మమను అద్వైతభావన నిశ్చయముగా కలుగును. బుద్ధియోగమున రజోగుణము పోగొట్టబడి సత్త్వగుణము వృద్ధిచేయబడును. అందువలన మనసు చలింపక సుస్థిరముగా నుండును. వ్యవసాయాత్మికయగు బుద్ధి కలుగని వారికి రజోగుణ ప్రభావమున మనస్సు ఫలాసక్తమై యుండును. అనగా ఏకతారూపభావన లేక ద్వైతభావమే కలుగును. నిశ్చయాత్మికమగు ఏకతాబుద్ధి, బుద్ధియోగా భ్యాసముచే కలుగును. బుద్ధియోగము నాశ్రయింపనిచో బుద్ధి బహుశాఖలుగా మారి విషయచింతారతమైయుండును. బుద్ధియోగము విషయచింతలనరికట్టి మనసును ఆత్మ చింతారతము చేయుసాధనము.

శ్లో॥ యామిమాం పుష్పితాం వాచం ప్రవదంత్య విపశ్చితః
వేదవాదరతాః పార్థ నాన్యదస్తీతి వాదినః 42

శ్లో॥ కామాత్మానః స్వర్గపరాః జన్మకర్మ ఫలప్రదామ్
క్రియావిశేష బహుళాం భోగైశ్వర్యగతిం ప్రతి 43

శ్లో॥ భోగైశ్వర్య ప్రసక్తానాం తయాపహృత చేతసామ్
వ్యవసాయాత్మికా బుద్ధిః సమాధౌ న విధీయతే 44

పార్థ = ఓ పార్థా!, వేదవాదరతాః = వేదములలోని ఫలశృతియందు ప్రీతిగలవారు, అన్యత్ = అందు చెప్పబడిన స్వర్గాదుల కంటెను అధికమైన ఫలము వేరొకటి, న అస్తి ఇతి వాదినః = లేదని వాదించు వారును, కామాత్మనాః = = కోరికలతో నిండిన మనస్సులు గలవారును, స్వర్గపరాః = స్వర్గమే పరమ ప్రాప్యమనువారును అగు, అవిపశ్చతః = అవివేకులు, జన్మకర్మ ఫలప్రదామ్ = జన్మరూప కర్మఫలమును ఇచ్చునట్టిదియు, భోగేశ్వర్య గతిం ప్రతి = భోగైశ్వర్యములను సంపాదించుటకు, క్రియా విశేష బహులామ్ = వివిధ కార్యకలాపములతో కూడినదియు, పుష్పితామ్ = ఫలప్రదము కాని, కేవలము చూచుటకు మాత్రము రమ్యముగా, నుండునదియు అగు, యామ్ ఇమామ్ = ఏ ఈ, వాచమ్ = వాక్యమును, ప్రవదంతి = విశేషముగా చెప్పుచున్నారో, తయా = దానిచేత, అపహృత చేతసామ్ = అపహరింపబడిన మనస్సులు గలవారును, భోగైశ్వర్య ప్రసక్తానామ్ = భోగైశ్వర్యములయందు మిక్కిలి ఆశగలవారికి, వ్యవసాయాత్మికా బుద్ధిః = నిశ్చయమైన బుద్ధి (ఏకాగ్రబుద్ధి) లేక, సమాధౌ = బ్రహ్మానంద పదప్రాప్తి, న విధేయతే = కలుగదు (నిలువదు)

తా. ఓ పార్థా! వేదములందు కామ్యకర్మ ఫలములను తెలుపు అర్థవాదములగు మంత్రములు కలవు. అవి పుష్పము తత్కాలశోభను కలుగజేయునట్లు, తత్కాలమునకు రమణీయముగా నుండు పలుకులను చెప్పును. అనగా ఆ మంత్రములు చెప్పు స్వర్గాదిఫలములు తత్కాలమునకు అందముగా కనిపించును. విచారించగా అనర్థహేతువులని భావము. కామేచ్ఛతో స్వర్గాభిలాషపరులై క్రియా బాహుళ్యమున జన్మకర్మలతో కూడిన భోగైశ్వర్యములను పొందుచున్నారు. వేదములందలి పుష్పిత వాగ్జాలమున మనసు లగ్నమయినవారు భోగైశ్వర్యములను కోరుచు, బ్రహ్మానంద ప్రదమైన ఆత్మ నిష్ఠయందు స్థిరమైన బుద్ధిలేక జన్మపరంపరయందు చిక్కుకొని యుందురు.

శ్లో॥ త్రైగుణ్య విషయా వేదా నిస్త్రైగుణ్యో భవార్జున
నిర్ద్వంద్వో నిత్యసత్త్వస్థో నిర్యోగక్షేమ ఆత్మవాన్ 45

అర్జున = ఓ అర్జునా!, వేదాః = వేదములు, త్రైగుణ్య విషయాః = (పైన తెలుపబడినట్లు)

త్రిగుణ కార్యరూపములైన భోగములను, వాటి సాధనలను ప్రతిపాదించును, నిస్త్రైగుణ్యః = (కావున నీవు) ఆ భోగముల యందును, వాటి సాధనలయందును ఆసక్తి లేనివాడవై, నిర్ద్వంద్వః = హర్షశోకాది ద్వంద్వములు లేనివాడవై, నిత్యసత్వస్థః = నిత్యుడైన పరమాత్మయందే స్థితుడవై, నిర్యోగక్షేమః = యోగక్షేమములను ఆశింపక, ఆత్మవాన్ = అంతఃకరణమును స్వాధీనమొనర్చుకొనువాడవు, భవ = అగుము,

తా. ఓ అర్జునా! వేదములు త్రిగుణాత్మకములగు కర్మలను బోధించును. వీని వలన జనన మరణ ప్రవాహరూపమగు సంసారము కలుగును. కనుక నీవు గుణాతీతుడవగుము. అనగా సంసార బంధమునుండి విడివడుము. ఆత్మ నిష్ఠాపరుడవై ఉండుము. అప్పుడు యోగక్షేమముల చింతలేనివాడవై సుఖ దుఃఖాది ద్వంద్వములకు అతీతుడవై యుందువు.

వి. కర్మాసక్తులకు వేదములు కర్మలను చెప్పుచున్నవి. కర్మలు సంసార హేతువులు. నీవంటి మోక్షేచ్ఛ గలవానికి శుద్ధ సత్త్వ నిష్ఠ, యోగక్షేమములందనాసక్తత, ఆత్మనిష్ఠాపరత ఆవశ్యకములు. యోగమనగా అప్రాప్యమైన దానిని సంపాదించుట యనియు క్షేమమనగా సంపాదించిన దానిని భద్రముగనుంచుట యనియు భావము.

*శ్లో॥ అప్రాప్య ప్రాపణం యోగః క్షేమస్తద్రక్షణ మేవ చ (భగవద్గీత శంకర భాష్యం)*

కనుక యోగక్షేమములనుకూడ విడిచి ఆత్మనిష్ఠాపరుడవగుము.

శ్లో॥ యావానర్థ ఉదపానే సర్వతస్సంప్లుతోదకే
తావాన్ సర్వేషు వేదేషు బ్రాహ్మణస్య విజానతః 46

సర్వతః = అంతట, సంప్లుతోదకే = పరిపూర్ణమై జలాశయము, (ప్రాప్తే సతి) = ప్రాప్తించుచుండగా (అందుబాటులో ఉండగా), ఉదపానే = బావి, సరస్సు, తటాకములందు (మనుష్యునకు), యావాన్ అర్థః = ఎట్టి ప్రయోజనము, (అస్తి) = ఉండునో, విజానతః = బ్రహ్మతత్త్వమును ఎరింగిన, బ్రాహ్మణస్య = బ్రహ్మజ్ఞానికి, సర్వేషు వేదేషు = సమస్త వేదములయందు, తావాన్ = అంత ప్రయోజనమే (ఉండును)

తా. బావి, సరస్సు, తటాకము మున్నగు అల్ప జలాశయములందు స్నానపానాది ప్రయోజనములు సమకూడినట్లు, అన్ని వైపులనుండి ప్రవహించు జలప్రవాహము కల జలాశయమందు పైన చెప్పబడిన ప్రయోజనములన్నియును నెరవేరును. ఈ రీతిగా వేదములందు చెప్పబడిన సర్వకర్మల ఫలమును జ్ఞాన విజ్ఞానమూర్తియైన బ్రహ్మవిద్వరునకు కలుగును. *'సర్వం పదం హస్తిపదే నిమగ్నం'* అను శ్రుతి ప్రమాణముచే సర్వకర్మల ఫలమును జ్ఞానఫలమగు

మోక్షమునందిమిడియున్నది. ఏనుగు పాద చిహ్నమున సర్వజంతువుల పాదచిహ్నములిమిడి యుండునట్లు బ్రహ్మవేత్తయందు సర్వ కర్మల ఫలములు అంతర్భూతములై యున్నవని భావము. బుద్ధియోగము నాశ్రయించిన బ్రహ్మవేత్తయగును. బ్రహ్మజ్ఞానియైన వానికి వేదోక్తములైన సర్వకర్మల ఫలమును కలుగును.

శ్లో॥ కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన
మా కర్మఫల హేతుర్భూః మాతే సంగోఽస్త్వకర్మణి 47

తే = నీకు, కర్మణి ఏవ = కర్మయందే (కర్మాచరణమునందే), అధికారః = అధికారము కలదు, ఫలేషు = దాని ఫలములయందు, కదాచన మా = ఎన్నడును లేదు, కర్మఫల హేతుః = (నీవు) కర్మఫలమునకు హేతువు, మా భూః = కావలదు, తే = (అట్లే) నీకు, అకర్మణి = కర్మను మానుటయందును, సంగః = ఆసక్తి, మా అస్తు = ఉండరాదు

తా. అర్జునా నీవు దేహాత్మ బుద్ధికలవాడవగుటచే కర్మల జేయుటకే నీకధికారము కలదు. కాని పైజెప్పబడిన జ్ఞాననిష్ఠకు నీకధికారము లేదు. కర్మల నాచరించుచు వాని ఫలములను కోరు అధికారము నీకు లేదు. కర్మఫలము జన్మమరణములు మొదలైనవి. కర్మను ఆచరించుచు జనన మరణాదిఫలములకు నీవు నిమిత్తమైనవాడవు కాకూడదు. కర్మత్యాగమునందును నీకు సంగబుద్ధి కూడదు. కర్మల నాచరించుచును, కర్మఫలమునకు వివశుడు కాకుండునట్లు గీతాచార్యుడొక ఉపాయమును పై శ్లోకమున చెప్పదలచి నీవు కర్మఫలహేతువుగా ఉండరాదని చెప్పెను.

వి. కర్మల చేయుటయందు మాత్రమే నీ కధికారము కలదనియు, జ్ఞాననిష్ఠకు నీవధికారి కావని చెప్పుటకు కారణము పార్థుడు దేహాభిమానియగుట. దేహాత్మబుద్ధి గలవాడు చేయు ప్రతికర్మయు కర్తృత్వాద్యహంకార బుద్ధిపూర్వకమగును. అప్పుడు కర్త కర్మఫలహేతువు కాక తప్పదు. కర్మలు ఫలహేతువులు. కర్మఫలము జనన మరణాదులు. జన్మజరామరణజాలమున పడకుండ కర్మల నాచరించుమని గీతాచార్యుని బోధ. అగ్నియొక్క దాహకశక్తిని కొన్ని మూలికాప్రయోగముల ద్వారా, అందు కాలు ఉంచినను దహింపజేయక అరికట్టగలిగినట్లు, కర్మలను చేయుచున్నను కర్మఫలమంటక యుండు ఉపాయమును భగవానుడు చెప్పబోవుచున్నాడు.

శ్లో॥ యోగస్థః కురుకర్మాణి సంగం త్యక్త్వా ధనంజయ
సిద్ధ్యసిద్ధ్యోః సమో భూత్వా సమత్వం యోగ ఉచ్యతే 48

ధనంజయ = ఓ అర్జునా!, సంగమ్ = ఆసక్తిని, త్యక్త్వా = త్యజించి, సిద్ధ్యసిద్ధ్యోః =

సిద్ధించినను, సిద్ధించకపోయినను, సమః = సమబుద్ధి, భూత్వా = కలిగి, యోగస్థః = యోగము నందు స్థితుడవై, కర్మాణి = కర్మలను, కురు = చేయుము, సమత్వమ్ = సమత్వమే (సమత్వ బుద్ధియే), యోగః ఉచ్యతే = యోగమని చెప్పబడును

తా. ధనంజయా! కర్మఫలములందు మమత్వమును విడిచి యోగివై కర్మల నాచరింపుము. యోగమనగా చిత్తవృత్తి నిరోధము. యోగనిష్ఠచే ద్వంద్వముల యందు సమత్వమలవడును. అట్టి సమభావము యోగమని చెప్పబడినది. కార్యము సఫలమైనను, విఫలమైనను నిర్వికారుడుగా నుండుట సమత్వము.

వి. యోగస్థుడవై కర్మల నాచరించిన కర్మఫలములు నిన్ను బంధింపవు. యోగమున కర్మలయందు సంగబుద్ధిపోయి సమత్వబుద్ధి కలుగును.

*శ్లో॥ మనః ప్రశమనోపాయః యోగ ఇత్యభిధీయతే (యోగవాశిష్ఠం)*

*శ్లో॥ బహువ్యాకుల చిత్తానాం విచారాత్తత్త్వధీర్నహి*
*యోగో ముఖ్యతరస్తేషాం ధీదర్పస్తేన నశ్యతి (వేదాంత పంచదశి)*

దేహాత్మబుద్ధికలవారు వ్యాకులచిత్తము కలవారగుదురు. అట్టివారికి తత్త్వవిచారణ జేయనధికారము కలుగదు. యోగమభ్యసించిన, చిత్తవ్యాకులత తగ్గి అహంకార వర్జితులగుదురు. కర్మణి ఏవ అధికారస్తే = కర్మయందే అధికారము అను ఏకవచన ప్రయోగం 'యోగము' నకే వర్తించును.

యోగస్థః కురుకర్మాణి = పై విధంగా 'యోగము' చేయుచూ, ఇతర కర్మలు (కర్మాణి) చేయవలెను. *మా ఫలేషు కదాచన* అన్ననూ, *యుక్తః కర్మఫలం త్యక్త్వా* (5వ అధ్యాయం) అన్ననూ ఒకే అర్థము వచ్చును. కావున యోగి మాత్రమే కర్మఫలమునిచటనే విడిచి, కర్మఫల హేతువు కాకుండా రాబోవు జన్మలు నివారించగలుగుచూ సంసార చక్రమును దాటగలుగుచున్నాడు. కర్మఫల హేతువునకు ఒక ఉదాహరణ చెప్పవచ్చును. మనము మామిడిపండు తిని దానిలోని బీజమును (టెంక)ను పారవేయుదుము. అది మరల మొలకెత్తును. అటులనే మనము చేయు కర్మలన్నింటి యందు రాబోవు జన్మకు కారణమగు కర్మఫలము అంతర్భూతమై యున్నదని గ్రహించవలెను.

**శ్లో॥ దూరేణ హ్యవరం కర్మ బుద్ధియోగాద్ధనంజయ**
**బుద్ధౌ శరణ మన్విచ్ఛ కృపణాః ఫలహేతవః 49**

బుద్ధి యోగాత్ = (సమత్వ) బుద్ధి యోగము కంటెను, కర్మ = సకామకర్మ, దూరేణ అవరమ్ = మిక్కిలి నిమ్నశ్రేణికి చెందినది, అతః = కావున, ధనంజయ = ఓ ధనంజయా!,

బుద్ధౌ = సమత్వ బుద్ధియందే, శరణమ్ = తరణోపాయమును, అన్విచ్ఛ = వెదకుము (సమత్వ బుద్ధియోగమును ఆశ్రయింపుము), హి = ఏలనన, ఫలహేతవః = ఫలములను ఆసించువారు (ఫలాసక్తితో కర్మలను ఆచరించువారు), కృపణాః = అత్యంత దీనులు

తా. అర్జునా! ద్వంద్వములందు సమభావముతో (యోగముతో) చేసిన కర్మలు ఫలాపేక్షతో చేసిన కర్మలకంటె శ్రేష్ఠమైనవి. ఫలాపేక్షతో కర్మలనాచరించిన కర్మఫలముగా జన్మాదులు పొందుదురు. ఎవరు పరమాత్మనెరుగరో వారు స్వర్గాదిలోక భోగములు పొందుచు దేహాత్మబుద్ధికలవారై యుండుటచే కృపణులనబడుచున్నారు. అందువలన బుద్ధియోగము నాశ్రయింపుము. బుద్ధియోగమనగా జ్ఞానమును కలిగించు యోగము. తద్వారా చిత్తశుద్ధి కలిగి మోక్షము సిద్ధించును. కృపణుడనగా శృతి యిట్లు చెప్పుచున్నది.

*శ్లో॥ 'యో వా ఏతదక్షరం గార్గ్యవిదిత్వాఽ స్మాల్లోకాత్ప్రైతి స కృపణః'*

*(బృహదారణ్యకోపనిషత్-16)*

ఆత్మతత్త్వమెరుగక పరలోకగతుడగువాడు కృపణుడని భావము. అందుచే బుద్ధియోగము ద్వారా పరమాత్మను శరణు పొందుము.

శ్లో॥ బుద్ధియుక్తో జహాతీహ ఉభే సుకృత దుష్కృతే
తస్మాద్యోగాయ యుజ్యస్వ యోగః కర్మసు కౌశలమ్ 50

బుద్ధియుక్తః = సమత్వ బుద్ధిగల పురుషుడు, సుకృతదుష్కృతే = పుణ్యపాపములను, ఉభే = రెండింటిని, ఇహ = ఈ లోకమునందే, జహాతి = త్యజించును (వాటి నుండి విముక్తుడగును), తస్మాత్ = అందువలన, యోగాయ = సమత్వబుద్ధియోగము కొరకు, యుజ్యస్వ = (నీవు) ప్రయత్నింపుము (సాధన చేయుము), యోగః = సమత్వరూప యోగమే, కర్మసు = కర్మలయందు కౌశలమ్ = నేర్పును కలిగించును (కర్మ బంధములనుండి విడిపించును)

తా. బుద్ధియుక్తుడైనవాడు సుకృత దుష్కృతములను ఇచ్చటనే వదలును. అందుచే యోగనిష్ఠ కలిగి ఉండుము. యోగనిష్ఠ కర్మబంధమును విచ్ఛిన్నము చేయుటయందు సమర్థమై, కౌశలమును కలుగజేయును. అందువలన సమత్వబుద్ధితో యుక్తుడవై యుండుము.

శ్లో॥ కర్మజం బుద్ధియుక్తా హి ఫలం త్యక్త్వా మనీషిణః
జన్మబంధ వినిర్ముక్తాః పదం గచ్ఛన్త్యనామయమ్. 51

హి = ఏలనన, బుద్ధియుక్తాః = సమత్వబుద్ధి గల (బుద్ధియోగమును ఆశ్రయించిన)

వారైన, మనీషిణః = జ్ఞానులు, కర్మజమ్ = కర్మలవలన ఉత్పన్నమగు, ఫలమ్ = ఫలమును, త్యక్త్వా = త్యజించి, జన్మబంధ వినిర్ముక్తాః = జన్మరూప బంధములనుండి ముక్తులై, అనామయమ్ = వికార రహితమైన, పదమ్ = పరమపదమును, గచ్ఛంతి = పొందుదురు

తా. బుద్ధియుక్తుడు కర్మఫలములను కోరక వివేకము కలవాడగును. అట్టివాడు జన్మబంధము నుండి విముక్తినంది ఆద్యంతరహితమగు ఆనంద ధామమును చేరుచున్నాడు. దీనివలన బుద్ధియుక్తుడు మాత్రమే కర్మబంధ వినిర్ముక్తుడగుననియు, బుద్ధియోగము నాశ్రయించక, ఫలాపేక్ష కలిగి కర్మల నాచరించువారు భవబంధమును తప్పించుకొనజాలరనియు తెలియదగును.

శ్లో॥ యదా తే మోహకలిలం బుద్ధిర్వ్యతి తరిష్యతి
తదాగన్తాసి నిర్వేదం శ్రోతవ్యస్య శ్రుతస్య చ 52

యదా = ఎప్పుడైతే, తే బుద్ధిః = నీ బుద్ధి, మోహకలిలమ్ = మోహమనెడి ఊబిని (ఊబినుండి), వ్యతితరిష్యతి = పూర్తిగా బయటపడునో, తదా = అప్పుడే, శ్రుతస్య = వినినట్టి, చ = మరియు, శ్రోతవ్యస్య = వినబోవునట్టి (ఇహపర లోకములకు సంబంధించిన సమస్త భోగముల నుండి), నిర్వేదమ్ = వైరాగ్యమును, గంతాపి = పొందెదవు.

తా. ఎప్పుడు నీ బుద్ధియందు కల మోహమను కాలుష్యమును బుద్ధియుక్తుడవై వదలి సత్త్వశుద్ధి కలవాడవగుదువో అప్పుడు నీకు వినవలసిన దానివలన, వినినదానివలన ఫలము శూన్యమగును. మనస్సు నిశ్చలమై నిర్విషయమై స్వాధీనమయినచో ఏ ఉపదేశములతోను పనిలేదు. స్వయంప్రకాశమగు జ్ఞానమావిర్భవించును. అట్టి జ్ఞానము చేతనే కైవల్యప్రాప్తి. ఒక్కయోగము చేతనే మనోనైర్మల్యము, నిశ్చల స్థితి కలుగగలదు. నిర్మలమైన మనస్సు చేతనే ఆత్మ నెరుంగగలరు.

*శ్లో: శుద్ధాంతఃకరణం జ్ఞేయం వేదోక్తం ప్రకృతం ఖలు (ఋభుగీత)*

శుద్ధాంతఃకరణమే జ్ఞేయమగు వస్తువనియు, వేదోక్త కర్మకాండ అంతయు ప్రాకృతమనియు భావము.

శ్లో॥ శ్రుతి విప్రతిపన్నా తే యదా స్థాస్యతి నిశ్చలా
సమాధావచలా బుద్ధిః తదా యోగమవాప్స్యసి 53

శ్రుతి విప్రతిపన్నా = నానావిధ వచనములను వినుటవలన చలితమైన, తే = నీయొక్క, బుద్ధిః = బుద్ధి, యదా = ఎప్పుడైతే, సమాధౌ = పరమాత్మయందు, నిశ్చలా = నిశ్చలముగా, అచలా = స్థిరముగా, స్థాస్యతి = నిలుచునో, తదా = అప్పుడే, యోగమ్ = యోగమును (భగవత్ సాక్షాత్కారమును), అవాప్స్యసి = (నీవు) పొందగలవు.

తా. వేదాంత శ్రవణముచే చలించిన నీ మనస్సు ఎప్పుడు యోగముచే నిశ్చలమగునో, అప్పుడు జ్ఞానయోగమును, దానిచే సాయుజ్యమును పొందగలవు. కేవల వేదాంత శ్రవణముచే బుద్ధి నిశ్చలము కాదనియు, యోగానుష్ఠానము వలననే బుద్ధి నిశ్చలమగుననియు తెలియనగును.

*శ్లో: యోగజ్ఞాన పరోనిత్యం స యోగీ న ప్రణశ్యతి (త్రిశిఖి బ్రాహ్మణోపనిషత్-16)*

యోగము, జ్ఞానము రెంటియందును నిష్ఠ కలిగిన యోగియే మోక్షమందును.

**అర్జున ఉవాచ:**

శ్లో॥ స్థిత ప్రజ్ఞస్య కా భాషా సమాధిస్థస్య కేశవ
స్థితధీః కిం ప్రభాషేత కిమాసీత వ్రజేత కిమ్ 54

కేశవ = ఓ కేశవా!, సమాధిస్థస్య స్థితప్రజ్ఞస్య = సమాధియందు స్థితుడై పరమాత్మ ప్రాప్తినందిన స్థిరబుద్ధిగల పురుషుని యొక్క, భాషా కా = లక్షణమేమి?, స్థితధీః = స్థిరబుద్ధి గలవాడు, కిమ్ ప్రభాషతే = ఎట్లు మాట్లాడును?, కిమ్ ఆసీత = ఎట్లు కూర్చుండును, కిమ్ వ్రజేత = ఎట్లు సంచరించును?

తా. అర్జునుడిట్లడిగెను. ఓ కృష్ణా! నిశ్చల బుద్ధిద్వారా సమాధిస్థితిని పొందిన పురుషుని లక్షణమేమి? అతడేమి చేయును? ఎట్లు కూర్చుండును? ఎట్లు నడచును?

**శ్రీభగవానువాచ:**

శ్లో॥ ప్రజహాతి యదా కామాన్ సర్వాన్ పార్థ మనోగతాన్
ఆత్మన్యేవాత్మనా తుష్టః స్థితప్రజ్ఞస్తదోచ్యతే 55

పార్థ = ఓ పార్థా!, యదా = ఎప్పుడైతే, మనోగతాన్ = మనస్సునందున్న, సర్వాన్ = సమస్తములైన, కామాన్ = కోరికలను, ప్రజహాతి = (మనుజుడు) పూర్తిగా త్యజించునో (మరియు), ఆత్మనా = ఆత్మద్వారా, ఆత్మని ఏవ = ఆత్మయందే, తుష్టః = సంతుష్టుడగునో, తదా = అప్పుడే, స్థితప్రజ్ఞః = (అతడు) స్థితప్రజ్ఞుడు, ఉచ్యతే = అనబడును

తా. శ్రీ భగవానుడిట్లు చెప్పెను. ఓ అర్జునా! మనసునందుగల సర్వకామములను విడిచి ఆత్మసుఖముచే తుష్టిజెందినవాడు స్థితప్రజ్ఞుడనబడును. అనగా నిశ్చల జ్ఞాని.

వి. ఏలనన, రజోగుణము నశించినగాని విషయ నివృత్తి కలుగదు. యోగముచే రజోగుణము నశించగా మనస్సుకు విక్షేపశక్తి పోయి ప్రశాంతత కలుగును. అప్పుడు యోగి నిరతిశయ ఆనందము పొందును.

*శ్లో॥ యోగేన గత  కామానాం భావనా బ్రహ్మచక్షసే*          *(ఉత్తరగీత  1-19)*

యోగముచే కామము నశించి బ్రహ్మభావన కలుగును. *'ఉపైతి శాంత రజసం'* అను గీతా వాక్యముచే కూడ పైభావము వ్యక్తము. కోరికలను విడిచి ఆత్మయందు తృప్తి కలుగు వాడు స్థిరబుద్ధి కలవాడనబడును.

శ్లో॥ దుఃఖేష్వనుద్విగ్నమనాః సుఖేషు విగతస్పృహః
వీతరాగభయక్రోధః స్థితధీర్మునిరుచ్యతే  56

దుఃఖేషు = దుఃఖములు ప్రాప్తించినప్పుడు, అనుద్విగ్నమనాః = మనస్సునందు ఉద్వేగమునకు లోనుకానివాడును, (క్రుంగిపోనివాడును), సుఖేషు = సుఖములు కలిగినప్పుడు, విగతస్పృహః = ఆసక్తి రహితుడును (పొంగిపోనివాడును), మునిః = ముని (మనన శీలుడు), స్థితధీః = స్థితప్రజ్ఞుడు, ఉచ్యతే = అనబడును

తా. దుఃఖములు కలిగినపుడు కలత పడనివాడై, సుఖానుభవమున నిర్లిప్తుడై, రాగము, భయము, క్రోధములను విడిచియుండువాడే మునియనబడును. పై చెప్పబడిన రాగాదులు రజోగుణ లక్షణములు. అవి లేనివాడు స్థితప్రజ్ఞుడు.

శ్లో॥ యస్సర్వత్రానభిస్నేహః తత్తత్ ప్రాప్య శుభాశుభమ్
నాభినందతి న ద్వేష్టి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా  57

యః = ఏ మనుష్యుడైతే, సర్వత్ర = అంతట, న అభినందతి = ప్రసన్నుడు కాడో, అనభిస్నేహః = మమతాసక్తులు లేనివాడై, తత్ తత్ = ఆయా, శుభాశుభమ్ = శుభాశుభములను, ప్రాప్య = పొంది, న ద్వేష్టి = ద్వేషింపడో, తస్య = అతనియొక్క, ప్రజ్ఞా = బుద్ధి, ప్రతిష్ఠితా = స్థిరమైయుండును

తా. ఏ పురుషుడు దేహప్రాణాదులపైన స్నేహము (మమకారము) లేనివాడై ప్రారబ్ద ప్రాప్తములైన శుభాశుభములందు హర్ష విషాదములనుభవింపక యుండునో అట్టి పురుషుడే స్థితప్రజ్ఞుడు. సమత్వ యోగముననే ప్రాప్యము.

శ్లో॥ యదా సంహరతే చాయం కూర్మోఽఙ్గానీవ సర్వశః
ఇన్ద్రియాణీన్ద్రియార్థేభ్యః తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా  58

చ = మరియు, కూర్మః = తాబేలు, సర్వశః = అన్నివైపుల నుండి, అంగాని = (తన)

అంగములను, సంహరతే ఇవ = ముడుచుకొనునట్లు, యదా = ఎప్పుడైతే, అయమ్ = ఇతడు (ఈ పురుషుడు), ఇంద్రియార్థేభ్యః = ఇంద్రియార్థముల నుండి, ఇంద్రియాణి = ఇంద్రియములను, (సంహరతే) = అన్ని విధముల ఉపసంహరించుకొనునో, తస్య = (అప్పుడు) అతని యొక్క, ప్రజ్ఞా = బుద్ధి, ప్రతిష్ఠితా = స్థిరమైనది (అని భావింపవలెను)

తా. శత్రుభయము కలిగినపుడు తాబేలు తన సర్వాంగములను తన లోనికి యేరీతి లాగుకొనునో అటులనే యింద్రియార్థములగు విషయములనుండి తన ఇంద్రియములను మరలించగలిగిన ప్రజ్ఞాశాలియే స్థితప్రజ్ఞుడు. సర్వేంద్రియముల ద్వారా వ్యాపించిన మనస్సును ఒకేసారి మరలించి అంతర్ముఖుడైన యోగియే స్థితప్రజ్ఞుడని భావము.

శ్లో॥ విషయా వినివర్తన్తే నిరాహారస్య దేహినః
రసవర్జం రసోఽప్యస్య పరం దృష్ట్వా నివర్తతే 59

నిరాహారస్య = ఇంద్రియముల ద్వారా విషయములను గ్రహింపని, దేహినః = పురుషుని యొక్క (పురుషుని నుండి), విషయాః = శబ్దాది విషయములు, వినివర్తంతే = నివృత్తములగును, రసవర్జమ్ = (కాని) వాటియందలి ఆసక్తి మాత్రము పోదు, అస్య = ఈ స్థితప్రజ్ఞుని యొక్క, రసః అపి = ఆసక్తి కూడ, పరమ్ = పరమాత్మను, దృష్ట్వా = చూచి (సాక్షాత్కారము పొంది), నివర్తతే = నివృత్తమగును

తా. ఇంద్రియములకు విషయములే ఆహారములు. కావున ఇంద్రియముల ద్వారా విషయములను గ్రహింపనివారే నిరాహారులు. అట్టి నిరాహారులకు కూడ విషయములు నివృత్తములైనను విషయాభిలాష నశించదు. విషయముల నుండి మనసును మరలించుటకు యోగమే శరణ్యము. అందుచే యోగియై ఆత్మను దర్శించిననే కోరికలు నశింపగలవు.

*శ్లో॥ యథా పర్వత ధాతూనాం దహ్యంతే దహనాన్మలాః*
*తథేంద్రియ కృతాదోషాన్ దహ్యంతే ప్రాణ నిగ్రహాత్ (యోగవాశిష్ఠం)*

దావాగ్ని పర్వత ధాతువులను (గైరికాది గడ్డిమొక్కలను) ఎట్లు దహన పరచునో, ప్రాణాయామరూప యోగాగ్నిచే ఇంద్రియ కృత దోషములు (అనగా ఇంద్రియముల ద్వారా ఏర్పడిన వాసనా రసములు) అట్లు దహింపబడును.

*శ్లో: విషందృష్ట్వా అమృతం దృష్ట్వా విషం త్యజతి బుద్ధిమాన్*
*ఆత్మానమపి దృష్ట్వాహం అనాత్మానామ్ త్యజామ్యహమ్ (ఆత్మబోధోపనిషత్-17)*

విషమును, అమృతమును ఈ రెండింటిని చూచి విషమును విడిచినట్లు, ఆత్మను దర్శించి అనాత్మయగు ఇంద్రియ విషయములను త్యజించుచున్నాడు.

శ్లో॥ యతతో హ్యపి కౌంతేయ పురుషస్య విపశ్చితః
ఇన్ద్రియాణి ప్రమాథీని హరంతి ప్రసభం మనః 60

కౌంతేయ = ఓ అర్జునా!, హి = ఆసక్తి నశింపని కారణమున, ప్రమాథీని = ప్రమథన శీలమున, ఇంద్రియాణి = ఇంద్రియములు, యతతః = ప్రయత్నించునట్టి, విపశ్చితః = బుద్ధిమంతుడైన, పురుషస్య = పురుషుని యొక్క, మనః అపి = మనస్సును గూడ, ప్రసభమ్ = బలవంతముగా, హరంతి = లాగికొనిపోవును

తా. ఓ అర్జునా! ఇంద్రియములకుగల బలము అత్యధికమైనది. విషయములు తుచ్ఛములనియు, అనర్థమును కలిగించునవనియు తెలిసి వివేకముతో తత్త్వజ్ఞానమునకై, ప్రయత్నించు విద్వాంసుని సైతము వ్యాకులునిజేయ సమర్థత కలవి. ఇంద్రియములు తమ నాయకుడగు మనస్సును సునాయాసముగ తమ వశము చేయగలుగును. ఆ విధమున దుష్టములైన యింద్రియములను వశపరచుకొనుటకు యోగనిష్ఠ అవసరమని తరువాత శ్లోకమున చెప్పబోవుచున్నాడు.

శ్లో॥ తాని సర్వాణి సంయమ్య యుక్త ఆసీత మత్పరః
వశే హి యస్యేంద్రియాణి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా 61

తాని సర్వాణి = ఆ సమస్తములైన ఇంద్రియములను, సంయమ్య = వశమునందుంచుకొని, యుక్తః = సమాహిత చిత్తుడైనవాడు (యోగి), మత్పరః = మత్పరాయణుడై, ఆసీత = యోగనిష్ఠయందు కూర్చొనవలెను, హి = ఏలనన, యస్య = ఎవనియొక్క, ఇంద్రియాణి = ఇంద్రియములు, వశే = వశమునందు (ఉండునో), తస్య = అతనియొక్క, ప్రజ్ఞా = బుద్ధియే, ప్రతిష్ఠితా = స్థిరమైయుండును

తా. సకలేంద్రియములను బాగుగా స్వాధీనము చేసికొని, నాయందాసక్తి కలిగి యుండుటకు యుక్తుడు కావలెను. అనగా యోగనిష్ఠాపరునకు ఇంద్రియవశము, తత్త్వప్రాప్తిలాభము కలుగును. ఇంద్రియములను నిగ్రహించగలవాడే స్థితప్రజ్ఞుడు కాగలడు.

శ్లో॥ ధ్యాయతో విషయాన్ పుంసః సంగస్తేషూపజాయతే
సంగాత్సంజాయతేకామః కామాత్క్రోధోఽభిజాయతే 62

విషయాన్ = శబ్దాది విషయములను, ధ్యాయతః = చింతన చేయుచుండునట్టి, పుంసః

= పురుషునకు, తేషు = ఆ (శబ్దాది) విషయములయందు, సంగః = ఆసక్తి, ఉపజాయతే = ఏర్పడును, సంగాత్ = ఆసక్తి వలన, కామః = కామము (విషయవాంఛ), సంజాయతే = ఉత్పన్నమగును, కామాత్ = కోరిక వలన (ఆ కోరిక తీరనప్పుడు), క్రోధః = కోపము , అభిజాయతే = కలుగును.

తా. విషయచింతారతుడైన వానికి విషయసంబంధమేర్పడును. అట్టి సంబంధమున కోరికలు జనించును. ఆ కోరికలు ఫలించుటకు అవరోధము కల్గిన, క్రోధము పుట్టును.

శ్లో॥ క్రోధాద్భవతి సమ్మోహః సమ్మోహాత్ స్మృతి విభ్రమః
స్మృతిభ్రంశాద్బుద్ధినాశో బుద్ధినాశాత్ప్రణశ్యతి 63

క్రోధాత్ = క్రోధము వలన, సమ్మోహః = అత్యంతమైన మోహము, భవతి = ఉత్పన్నమగును, సమ్మోహాత్ = ఆ వ్యామోహము వలన, స్మృతివిభ్రమః = స్మృతి (జ్ఞాపకశక్తి) భ్రమ ఏర్పడును, స్మృతిభ్రంశాత్ = స్మృతిభ్రమ వలన, బుద్ధినాశః = బుద్ధి (జ్ఞానశక్తి) నశించును, బుద్ధి నాశాత్ = బుద్ధి (బలము) నశించుట వలన, ప్రణశ్యతి = (ఆ పురుషుడు తన స్థితినుండి) పతనమగును.

తా. క్రోధము వలన మోహము, మోహము వలన జ్ఞాన నాశము కలుగును. జ్ఞాననాశమనగా తానెవరో మరచుట సంభవించును. ఈ ఆత్మవిస్మృతి వలన బుద్ధినాశమగును. బుద్ధి నాశమగుట వలన ఆత్మచింతా విముఖత కలిగి తద్వారా అనర్థము కలుగును.

శ్లో॥ రాగద్వేష వియుక్తైస్తు విషయానింద్రియైశ్చరన్
ఆత్మవశ్యైర్విధేయాత్మా ప్రసాదమధిగచ్ఛతి 64

తు = కాని, విధేయాత్మా = అంతఃకరణము అదుపులోగల సాధకుడు, ఆత్మవశ్యైః = తన వశములోనున్న, రాగద్వేష వియుక్తైః = రాగద్వేష రహితములైన, ఇంద్రియైః = ఇంద్రియముల ద్వారా, విషయాన్ = విషయములను, చరన్ = సేవించుచున్ననూ, ప్రసాదమ్ = అంతఃకరణ ప్రసన్నతను, అధిగచ్ఛతి = పొందును.

తా. రాగద్వేష వర్జితములగు ఇంద్రియముల ద్వారా అనివార్యములగు విషయములను అనుభవించుచు మనస్సును స్వాధీనము చేసికొనిన యోగికి ప్రసన్నత, స్వాస్థ్యము కలుగును.

శ్లో॥ ప్రసాదే సర్వ దుఃఖానాం హానిరస్యోపజాయతే
ప్రసన్న చేతసోహ్యాశు బుద్ధిః పర్యవతిష్ఠతే 65

ప్రసాదే = అంతఃకరణ ప్రసన్నత ప్రాప్తించినంతనే, అస్య = ఇతనియొక్క, సర్వ దుఃఖానామ్ = సమస్త దుఃఖములకును, హానిః ఉపజాయతే = అభావము కలుగును, సమస్త దుఃఖములు తొలగిపోవును, ప్రసన్న చేతసః = ప్రసన్న మనస్కుడైన కర్మయోగి యొక్క, బుద్ధిః = బుద్ధి, ఆశు హి = శీఘ్రముగానే, పర్యవతిష్ఠతే = పరమాత్మయందే పూర్తిగా స్థిరమగును.

తా. మనస్సు ప్రశాంతత కలిగి ఉన్నచో అధ్యాత్మిక అధిభౌతిక అధిదైవికములగు దుఃఖములు ఉపశమించుటయేకాక బ్రహ్మచింతారతి గలిగి బుద్ధి ఆత్మస్వరూపమున నిశ్చలమగును. ఆత్మాకారమున బుద్ధి నిలబడుటకు యుక్తుడు కావలెను. యుక్తుడు కానియెడల కలుగు అనర్థము తరువాత శ్లోకమున జెప్పబడినది.

శ్లో॥ నాస్తి బుద్ధిరయుక్తస్య న చాయుక్తస్య భావనా
న చాభావయతః శాన్తిః అశాన్తస్య కుతః సుఖమ్ 66

అయుక్తస్య = ఇంద్రియములను, మనస్సును వశమునందుంచుకొనని వానియందు (యోగికాని వానియందు), బుద్ధి = నిశ్చయాత్మక బుద్ధి, న అస్తి = ఉండదు, చ = మరియు, అయుక్తస్య = అయుక్తుడైన వానియొక్క (అంతఃకరణమునందు), భావనా = పరమాత్మ భావనయును, న = కలుగదు, చ = మరియు, అభావయతః = పరమాత్మభావన లేనివానికి, శాంతిః = శాంతి, న = లభింపదు, అశాంతస్య = శాంతి లేనివానికి, సుఖమ్ = సుఖము, కుతః = ఎట్లు లభించును?

తా. యుక్తుడు కాకున్న యెడల ఆత్మ స్వరూప విషయమైన ఆలోచనయే కలుగదు. యోగాభ్యాస పాటవముచేత ఏకాగ్రత జెందిన మనసు కలిగిన మనిషికి బ్రహ్మభావన కలుగును. బ్రహ్మభావన లేకున్న శాన్తియలవడదు. శాంతిరహితునికి సుఖము శూన్యము. యోగియైన వానికే ఆత్మసుఖము కలుగునని భావము.

శ్లో॥ ఇంద్రియాణాం హి చరతాం యన్మనోఽ ను విధీయతే
తదస్య హరతి ప్రజ్ఞాం వాయుర్నావ మివామ్భసి 67

హి = ఏలనన, ఇవ = ఎట్లయితే, అంభసి = నీటియందు (సంచరించు), నావమ్ = నావను, వాయుః హరతి ఇవ = వాయువు ఎట్లు హరించునో (నెట్టి వేయునో), చరతామ్ = (అట్లే) శబ్దాది విషయముల యందు చరించుచున్నట్టి, ఇంద్రియాణామ్ = ఇంద్రియములలో, మనః = మనస్సు, యత్ అను విధీయతే = ఏ ఇంద్రియముతో కూడి యుండునో, తత్ = ఆ

ఒక్క ఇంద్రియమే, అస్య = ఈ అయుక్తుడైన పురుషుని యొక్క, ప్రజ్ఞామ్ (హరతి) = బుద్ధిని హరించును

తా. ఇష్టము వచ్చినట్లు విషయములందు ప్రవర్తించు ఇంద్రియములకు మనస్సు వశమగుచో అట్టిమనస్సు, సముద్రమున ప్రయాణముచేయు నావను పెనుగాలి ఉన్మార్గమున ప్రవర్తింప చేయునటుల, పురుషుని ఆత్మజ్ఞానమపహరించి విషయవశమై దుఃఖములపాలగును.

శ్లో॥ తస్మాద్యస్య మహాబాహో నిగృహీతాని సర్వశః
ఇంద్రియాణీంద్రియార్థేభ్యః తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా 68

తస్మాత్ = అందువలన, మహాబాహో = ఓ అర్జునా!, యస్య = ఎవనియొక్క, ఇంద్రియాణి = ఇంద్రియములు, ఇంద్రియార్థేభ్యః = ఇంద్రియ విషయముల నుండి, సర్వశః = అన్ని విధముల, నిగృహీతాని = నిగ్రహింపబడునో, తస్య = అతని యొక్క, ప్రజ్ఞా = బుద్ధి, ప్రతిష్ఠితా = స్థిరమగును

తా. కావున ఓ అర్జునా! ఎవడు తన సకలేన్ద్రియములను విషయములనుండి నిగ్రహించునో వాని బుద్ధి నిశ్చలమయి ఆత్మయందు స్థిరమగును.

శ్లో॥ యా నిశా సర్వభూతానాం తస్యాం జాగర్తి సంయమీ
యస్యాం జాగ్రతి భూతాని సా నిశా పశ్యతో మునేః 69

సర్వ భూతానామ్ = సమస్త ప్రాణులకును, యా = ఏదైతే, నిశా = రాత్రియో (రాత్రితో సమానమో), తస్యామ్ = దానియందు (ఆ నిత్యజ్ఞానస్వరూప పరమానంద ప్రాప్తియందు), సంయమీ = స్థితప్రజ్ఞుడైన యోగి, జాగర్తి = మేల్కొనియుండును, యస్యామ్ = నశ్వరమైన ఏ సంసారిక సుఖప్రాప్తి యందు, భూతాని = సకల ప్రాణులును, జాగ్రతి = మేల్కొని యుండునో, పశ్యతః = పరమాత్మ తత్త్వము నెరింగిన, మునేః = మునికి, సా = అది, నిశా = రాత్రి (రాత్రితో సమానము)

తా. సర్వప్రాణులకు పరమార్థతత్త్వము అంధకారబంధురమగు రాత్రి వంటిది. ఎట్లు రాత్రికాలము చీకటిచే ఆవృతమైయుండి ఏ పదార్థమును తెలియనీయక యుండునో అట్లే పరతత్త్వము చీకటి వంటి అజ్ఞానముచే ఆవృతమై యుండుటచే ఆత్మజ్ఞానము కలుగదు. కనుక పరతత్త్వము సర్వప్రాణులకు రాత్రివంటిది. అనగా పరతత్త్వమును భూతములేమాత్రము గ్రహించజాలవు. ఆ రీతిగా సర్వప్రాణులకు తెలియక రాత్రివలెనున్న పరతత్త్వము నందు యోగి జితేంద్రియుడై రమించుచున్నాడు. సర్వవ్యవహారములకు మూలమైన అవిద్యారూప ప్రపంచము, ఆత్మచింతారతుడై యోగనిష్ఠతో ఆత్మావలోకనము చేయుచున్న మునికి రాత్రివంటిదియై యుండును.

అనగా యోగి యెల్లప్పుడు అద్వయమైన బ్రహ్మను చూచుచుండును. కాని ప్రపంచదృష్టి యుండదు.

శ్లో॥ ఆపూర్య మాణమచల ప్రతిష్ఠం సముద్రమాపః ప్రవిశంతియద్వత్
తద్వత్కామాయం ప్రవిశంతి సర్వే స శాంతి మాప్నోతి న కామకామీ 70

యద్వత్ = ఎట్లయితే, ఆపః = (వేర్వేరు నదుల యొక్క) జలములచే, ఆపూర్య మాణమ్ = సంపూర్ణము గావింపబడదో, అచల ప్రతిష్ఠమ్ = నిశ్చలముగానున్న, సముద్రమ్ = సముద్రమును, ప్రవిశంతి = (ఏ మాత్రము చలింపజేయకుండగనే) ప్రవేశించునో, తద్వత్ = అట్లే, సర్వే కామాః = సకల భోగములు, యమ్ = ఏ స్థితప్రజ్ఞుని యందు, ప్రవిశంతి = (ఎట్టి వికారములు కల్గింపకయే) లీనమగునో, సః = ఆ పురుషుడు, శాంతిమ్ = పరమశాంతిని, ఆప్నోతి = పొందును, కామకామీ = భోగేచ్ఛగలవాడు, న = శాంతిని పొందజాలడు

తా. సముద్రమున నిత్యము నదనదీ జలములు చేరుచునేయున్నవి. కాని సముద్రము వికారము జెందక నిశ్చలమగు స్థితిని కలిగి యుండును. అదే విధముగా బ్రహ్మణ్యుడగు మహాత్ముడు యోగనిష్ఠాబలముచే విషయ సాన్నిధ్యమున నలువైపులనుండి వచ్చుకామములను స్వస్వరూపస్థితి కలిగి తనలో లీనము చేయునే కాని ఆ కామములచే వానియాత్మ క్షుబ్ధముకాదు.

శ్లో॥ విహాయ కామాన్ యస్సర్వాన్ పుమాంశ్చరతి నిస్పృహః
నిర్మమో నిరహంకారః స శాంతి మధిగచ్ఛతి 71

యః పుమాన్ = ఏ పురుషుడు, సర్వాన్ కామాన్ = సమస్తమైన కోరికలు, విహాయ = త్యజించి, నిర్మమః = మమతారహితుడై, నిరహంకారః = అహంకార రహితుడై, నిః స్పృహః = స్పృహా రహితుడై, చరతి = చరించునో, సః = అతడే, శాంతిమ్ = శాంతిని, అధిగచ్ఛతి = పొందును

తా. ఏ పురుషుడు సర్వభోగములయందు నిస్పృహుడు, నిర్మముడునగుచు, అహంకారవర్జితుడై ఆత్మరతుడగునో వాడే శాంతిని బడయగలడు.

శ్లో॥ ఏషా బ్రాహ్మీ స్థితిః పార్థనైనాం ప్రాప్య విముహ్యతి
స్థిత్వాస్యామంతకాలేఽ పి బ్రహ్మ నిర్వాణమృచ్ఛతి 72

పార్థ = ఓ పార్థా!, ఏషా = ఇదియే, బ్రాహ్మీ స్థితిః = బ్రహ్మప్రాప్తి నందిన పురుషుని యొక్క స్థితి, ఏనామ్ = దీనిని, ప్రాప్య = పొంది (పొందిన పిదప), న విముహ్యతి = (యోగి

ఎన్నడును) మోహితుడు కాడు, అంతకాలే అపి = అంత్యకాలము నందును, అస్యామ్ = ఈ బ్రాహ్మీస్థితి యందు, స్థిత్వా = స్థితమైయుండిన వాడు, బ్రహ్మ నిర్వాణమ్ = బ్రహ్మానందమును, ఋచ్ఛతి = పొందును

తా. ఓ పార్థా! పైన చెప్పబడిన బ్రాహ్మీభూతస్థితిని పొందినవాడు ఎన్నడును మోహము జెందడు. అంతకాలమున యైనను ఈ బ్రాహ్మీస్థితియందు ఉన్న పురుషుడు బ్రహ్మ నిర్వాణమును అనగా మోక్షమును పొందును.

ఇట్లు
శ్రీ పరమహంస పరివ్రాజకాచార్యులును,
బ్రహ్మర్షి సద్గురు **శ్రీశ్రీశ్రీ శివానంద** భగవత్పూజ్యపాద శిష్యులును నైన
బ్రహ్మర్షి సద్గురు **శ్రీశ్రీశ్రీ స్వామి రామానంద పరమహంస** వారిచే
రచింపబడిన గీతామృతమను టీక యందు
సాంఖ్యయోగమను ద్వితీయాధ్యాయము సమాప్తము.

ఓం శ్రీకృష్ణ పరమాత్మనే నమః

తృతీయాధ్యాయము

# కర్మయోగము

**అర్జున ఉవాచ:**

శ్లో॥ జ్యాయసీ చేత్కర్మణస్తే మతా బుద్ధిర్జనార్దన

తత్కిం కర్మణి ఘోరే మాం నియోజయసి కేశవ ! 1

జనార్దన = ఓ జనార్దనా!, కర్మణః = కర్మకంటెను, బుద్ధిః = జ్ఞానము, జ్యాయసీ = శ్రేష్ఠమైనదని, తే మతా చేత్ = నీ అభిప్రాయమైనచో, తత్ = అట్టిస్థితిలో, కేశవ! = ఓ కేశవ!, మామ్ = నన్ను, ఘోరే = భయంకరమైన, కర్మణి = (ఈ) యుద్ధకార్యము నందు, కిమ్ = ఎందులకు, నియోజయసి = నియోగించుచున్నావు ?

తా. ఓ కృష్ణా! కర్మకంటె జ్ఞానమే ఎక్కువయని నీ భావమైన యెడల నన్ను హింసారూపమైన యీ యుద్ధమను కర్మను చేయుటకేల నియోగించెదవు?

వి. *'జ్యాయసీ చేత్కర్మణస్తే'* అని అర్జునుడు అడుగుటచేత ఇంతవరకు చెప్పినదానిని అనుసరించి కర్మకంటె జ్ఞానమధికమైనదని అర్జునుడు గ్రహించినటులను, తననేల కర్మ చేయుమందువని ప్రశ్నించుటకు అదియే కారణమనియు గ్రహించదగును.

శ్లో॥ వ్యామిశ్రేణేవ వాక్యేన బుద్ధిం మోహయసీవ మే

తదేకం వదనిశ్చిత్య యేనశ్రేయోఽహమాప్నుయామ్ 2

వ్యామిశ్రేణ ఇవ = కలగాపులగము వలె ఉన్న, వాక్యేన = (నీ) మాటలతో, మే = నా, బుద్ధిమ్ = బుద్ధిని, మోహయసి ఇవ = భ్రమింపజేయుచున్నట్లు ఉన్నావు, యేన = దేనిచేత, అహమ్ = నేను, శ్రేయః = శ్రేయస్సును, ఆప్నుయామ్ = పొందుదునో, తత్ ఏకమ్ = అట్టి ఒక మార్గము (కర్మమునో, జ్ఞానమునో), నిశ్చిత్య = నిశ్చయముగా, వద = చెప్పుము

తా. కర్మలు చేయవలనా? లేక జ్ఞాననిష్ఠ సాధింపవలెనా? యను సంశయమును కలిగించుచు వ్యాకులపరచునట్లున్న నీవాక్యముచే నా బుద్ధికి మోహము కలుగుచున్నది. నాకెట్లాచరించిన మోక్షము కలుగునో ఆ తీరున జ్ఞాన, కర్మనిష్ఠలలో నేది కర్తవ్యమనునది నిశ్చయించి నీవే యీ రెండిటిలో శ్రేయస్కరమగు ఒకదానిని మాత్రమే బోధింపుము.

**శ్రీభగవానువాచ:**

శ్లో॥ లోకేఽస్మిన్ ద్వివిధా నిష్ఠా పురాప్రోక్తా మయానఘ

జ్ఞానయోగేన సాంఖ్యానాం కర్మయోగేన యోగినామ్ 3

అనఘా = పాపరహితుడా!, అస్మిన్ లోకే = ఈ లోకము నందు, ద్వివిధా నిష్ఠ = రెండు విధములగు నిష్ఠలు, మయా = నా చేత, పురా ప్రోక్తా = ఇంతకుముందే చెప్పబడినవి (సృష్ట్యాది కాలము నుండి), సాంఖ్యానామ్ = సాంఖ్య యోగులకు, జ్ఞాన యోగేన = జ్ఞానయోగము ద్వారా (మరియు), యోగినామ్ = యోగులకు, కర్మయోగేన = కర్మయోగము ద్వారా (నిష్ఠ కలుగును)

తా. పాప రహితుడవైన ఓ అర్జునా! సృష్ట్యాదికాలమున అర్హతననుసరించి రెండు రకములైన నిష్ఠలు చెప్పబడినవి. సాంఖ్యులకు అనగా ఆత్మానాత్మ వివేకశీలురగు తత్త్వవేత్తలకు జ్ఞానయోగమును, యోగులైనవారలకు కర్మయోగమును రెండు విధములుగా చెప్పిరి.

*'తదేకం వద నిశ్చిత్యయేన శ్రేయోఽ హమాప్నుయామ్'* అని అర్జునుడడిగిన ప్రశ్న. ఓ కృష్ణా! కర్మకంటె జ్ఞానము ఉత్తమమైనదని చెప్పుచు ఘోరమగు కర్మమార్గమున నన్నేల నియోగించుచున్నావు. పరస్పర విరుద్ధములగు ఈ రెండుమార్గములలో నాకు శ్రేయస్కరమగు నొకదానిని నిశ్చయించి చెప్పుము. ఈ మార్గద్వయమున ఏ మార్గమనుసరించవలెనను విషయము, మోహము చెందియున్న నా బుద్ధికి గోచరమగుటలేదు. అర్జునుని ప్రశ్న ఇది. దీనికి సమాధానముగా నిష్ఠను ద్వివిధముగా విభజించి చెప్పుటవలన అర్జునుని సంశయము నివృత్తము కాదు కదా! కావున ఈ మార్గద్వయము ఏకరూపమై యుండవలయును. అందుచే కర్మయోగమనగా

*"బంధనం మనసో నిత్యం కర్మయోగస్స ఉచ్యతే"* *(త్రిశిఖి బ్రాహ్మణోపనిషత్తు-18)*

అను ప్రమాణముచే మనసు విషయములందు ప్రవృత్తముకాక ఆత్మపరమయి సమబుద్ధి కలిగియుండుట కర్మయోగమనబడుచున్నది. కావుననే తరువాత చెప్పు *'నకర్మణా మనారంభాత్ నైష్కర్మ్యం పురుషోశ్నుతే'* అను శ్లోకమున నైష్కర్మ్య నిర్వచనము సమంజసమగును. మనోబంధహేతువగు యోగమభ్యసించిననే నైష్కర్మ్యము సిద్ధించునని భావము. జ్ఞానయోగ ప్రాప్యమగునదియు నైష్కర్మ్యమే కాన ఈ మార్గద్వయము ఏకరూపమేయని గ్రహించదగును. *'కర్మయోగేన యోగినాం'* అనుటచేత యోగులు కానివారికి కర్మలు ఫలప్రదములై జనన మరణ ప్రవాహమున బడుటకు హేతువగుననియును, యోగులైనవారు సమబుద్ధితో కర్మలు చేయుదురు కావున వారికి చిత్తశుద్ధి ద్వారా పరమపద ప్రాప్తి కలుగుననియు తెలియనగును.

*శ్లో॥ యత్తు చిత్తస్య సతతమర్థే శ్రేయసి బంధనమ్*
*జ్ఞాన యోగస్స విజ్ఞేయో సర్వసిద్ధి కరశ్శివః* *(త్రిశిఖి బ్రాహ్మణోపనిషత్-19)*

యోగమను కర్మయోగము ద్వారా ఏకాగ్రత చెందిన మనస్సు ఏది కలదో, అట్టి మనస్సును నిరంతరం ఆత్మయందు పాదుకొలుపుటయే జ్ఞానయోగమందురు. అట్టి వానికి సర్వము సిద్ధించును.

## కర్మయోగము

శ్లో॥ పఠతాం శృణ్వతాం చైవ విష్ణోర్మాహాత్మ్యముత్తమమ్
అష్టాదశ పురాణాని నవ వ్యాకరణాని చ
క్షణమాత్రస్య యోగస్య కళాం నార్హన్తి షోడశీం (ఉత్తరగీత)

పరమాత్మ యొక్క మాహాత్మ్యమును చెప్పు అష్టాదశ పురాణములను, ఆ పురాణములను అవగాహన చేసికొనుటకుపయోగించు నవ వ్యాకరణ శాస్త్రములను చదువుట వలన లేక వినుటవలన కలుగు చిత్తసంస్కారము, యోగనిష్ఠలో క్షణమాత్రమున్నందువలన కలుగు సంస్కారములో పదునాఱవ భాగమునకు కూడ సమముకాదు. కావున ప్రాణాయామరూప కర్మయోగమునాచరించిన పిమ్మటనే జ్ఞానయోగము సాధ్యమగుటచే అర్జునుడడిగిన ప్రశ్నను కర్మయోగము, జ్ఞానయోగములు రెండును ఒక మార్గములోని రెండు మెట్లుగా పరమాత్మ చెప్పెనని రూఢియగుచున్నది.

శ్లో॥ న కర్మణామనారంభాన్నైష్కర్మ్యం పురుషోఽశ్నుతే
న చ సన్న్యసనాదేవ సిద్ధిం సమధిగచ్ఛతి 4

పురుషః = మానవుడు, కర్మణామ్ = కర్మలను, అనారంభాత్ = ఆచరింపకుండుట వలన, నైష్కర్మ్యమ్ = నైష్కర్మ్యమును అనగా యోగనిష్ఠాస్థితిని, న అశ్నుతే = పొందడు, చ = మరియు, సన్న్యసనాత్ ఏవ = కర్మలను త్యజించినంత మాత్రమున, సిద్ధిమ్ = సిద్ధిని (సాంఖ్యయోగనిష్ఠను), న సమధిగచ్ఛతి = పొందజాలడు

తా. పురుషుడు కర్మ నాచరింపక వదలిన మాత్రమున నైష్కర్మ్యసిద్ధిని బడయజాలడు. జ్ఞానరహిత సన్న్యాసమున నైష్కర్మ్యసిద్ధి లభింపదు. నైష్కర్మ్యసిద్ధి యనగా క్రియారహిత, భావరూపమైన కర్మ శూన్యత. జ్ఞానము కలిగి కర్మసన్న్యాసము చేసిన నైష్కర్మ్య భావము కలుగును.

శ్లో॥ *'కర్మణా వర్తతే కర్మ తత్త్యాగాచ్ఛాన్తి మాప్నుయాత్'* *(త్రిశిఖి బ్రాహ్మణోపనిషత్-15)*

అని చెప్పుటవలన కర్మ ప్రవృత్తిని కలుగజేయుననియు, దానిని త్యాగము చేసిన శాంతి కలుగుననియు తెలియుచున్నది. ఇచ్చట ఈ శ్రుతికిని, *'నకర్మణా మనారంభాత్'* శ్లోకము యొక్క పూర్వార్థమునకును అన్యోన్య విరోధము కలదు. శ్రుతికి విరోధముగా నున్న భావమును గీత బోధించునా! కావున విరోధపరిహారము కర్తవ్యము. అందుచే ఈ విధముగా అర్థము చేసికొనవలెను. కర్మ నాచరించనందువలన నిష్కర్ముడయి నైష్కర్మ్య సిద్ధిని పొందవలెను. కాని ఈ శ్లోకమున కర్మనాచరించియే నైష్కర్మ్యము పొందవలెనని గీతాచార్యుని భావము.

కర్మనాచరించియూ కర్మనాచరించని వాడగుట యెట్లు?

ఇచ్చటకల విరోధ మిది. ఇక పరిహారము చెప్పబడుచున్నది. కర్మ ద్వివిధము. ప్రవృత్తిని కలుగజేయునది, నివృత్తిని కలుగజేయునది. యోగనిష్ఠారూపమైన క్రియామార్గము నివృత్తి కర్మయనియు, యుక్తుడుకాక చేయు సకామకర్మలు ప్రవృత్తి కలిగించు కర్మలనియు తెలియవలెను.

*శ్లో॥ ప్రవృత్తిం చ నివృత్తిం చ ద్వివిధం కర్మవైదికమ్ (మనుస్మృతి)*

నివృత్తిని కలుగజేయు 'యోగనిష్ఠ' అను కర్మను ఆచరించినందువలననే నైష్కర్మ్య సిద్ధి కలుగును.

*శ్లో: యోగేనాంతర్ముఖీ బుద్ధిస్తతో నాశయతే తమః (కఠోపనిషత్ శంకర భాష్యం)*

అను ప్రమాణముచే యోగనిష్ఠవలన బుద్ధి ఆత్మభావనాపరమగుననియు, అందువలన బ్రహ్మభావనకు ప్రతిబంధకమగు అవిద్యారూప ప్రాక్తనకర్మ నష్టమగుననియు తెలియుచున్నది. ఇందుచే బ్రహ్మభావమునకు యోగనిష్ఠ ఆవశ్యకమైనదని శంకరాచార్యుల వారి భావము. శ్రేయః ప్రాప్తికి యుక్తుడై చేయు యోగాభ్యాస క్రియలకే భగవానుడు ప్రాధాన్యమిచ్చినాడని తెలియవలెను. శోకమోహములతో కూడిన జీవునకు యోగముతో కూడిన కర్మలయందే అధికారము కలదు. జ్ఞాననిష్ఠకు అధికారి కాడని భావము. జ్ఞానరహితుడు కర్మసంన్యాసము చేసినను నైష్కర్మ్యమేల సిద్ధించదు అను ప్రశ్నకు సమాధానము గీతాచార్యుడు తరువాత శ్లోకమున చెప్పుచున్నాడు.

**శ్లో॥ న హి కశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠత్యకర్మకృత్**
**కార్యతే హ్యవశః కర్మ సర్వః ప్రకృతి జైర్గుణైః 5**

హి = నిస్సందేహముగా, కశ్చిత్ = ఏ మనుష్యుడైనను, జాతు = ఒకానొకప్పుడును, క్షణమ్ అపి = క్షణకాలము గూడ, అకర్మకృత్ = కర్మను చేయనివాడై, న తిష్ఠతి = ఉండజాలడు, హి = ఏలననగా, సర్వః = ప్రతి మనుష్యుడును (మనుష్యులందరునూ), ప్రకృతి జైః = ప్రకృతి జనితములైన, గుణైః = గుణముల చేత, అవశః = అవశుడై (అవశముగనే), కర్మ = కర్మను (చేయుటకు), కార్యతే = బాధ్యుడగుచున్నాడు,

తా. అవిద్యా మోహితులగు జీవులకు క్షణకాలమైనను కర్మలాచరించకయుండుట ఎన్నటికిని సాధ్యముకాదు. నిష్కర్ములై యుండుట అసంభవమని భావము. ప్రకృతి జన్యములైన రాగద్వేషాది గుణములకు వశుడై జీవుడు కర్మలనాచరించుచునే యుండును. జ్ఞాని రాగద్వేషాది గుణవర్జితుడు.

వి. *'చిత్ స్పందనం భవతి కర్మ' (యోగవాశిష్ఠం)*

మనసు కదులుటయే కర్మయనబడును.

## కర్మయోగము

*శ్లో॥ 'యః ప్రాణపవన స్పందః చిత్తస్పందస్స ఏవహి'* *(యోగవాశిష్ఠం)*

ఏది ప్రాణవాయు కదలికయో అదియే చిత్త కదలిక. కనుక జీవుడిగానున్నంతకాలము శ్వాసక్రియ జరుగుచునే ఉండును. అందుచే ప్రతిక్షణము కూడ చిత్తస్పందనము ద్వారా కర్మ జరుగుచునే యుండును.

శ్లో॥ కర్మేంద్రియాణి సంయమ్య య ఆస్తే మనసా స్మరన్
ఇంద్రియార్థాన్ విమూఢాత్మా మిథ్యాచారస్స ఉచ్యతే 6

యః =ఎవడైతే, కర్మేంద్రియాణి = సమస్త ఇంద్రియములను, సంయమ్య = బాహ్యముగా అదుపుచేసి, మనసా = మనస్సు ద్వారా, ఇంద్రియార్థాన్ = శబ్దాది విషయములను, స్మరన్ = చింతించుచు, ఆస్తే = ఉండునో, స విమూఢాత్మా = ఆ మూఢుడు, మిథ్యాచారః = డంభాచారము కలవాడు అని, ఉచ్యతే = చెప్పబడుచున్నాడు

తా. కర్మేంద్రియములను నిగ్రహించి మనస్సుచేత శబ్దాది విషయములను చింతించుచున్నవాడు కపటాచారముగల దాంభికుడు. ఆత్మజ్ఞాన శూన్యుడు. ఆత్మజ్ఞానము లేనిచో కర్మలను విడువరాదు. అట్లు విడిచిన పాపాచారుడని యెరుంగవలెను. కనుక జీవుల మనస్సును బట్టి కర్మలను ఆచరించినను ఒకప్పుడు చేయనివారగుచున్నారు. కర్మలను ఆచరించకపోయినను కర్మలను చేసినవారే యగుచున్నారు. మనస్సునకు ప్రాధాన్యముకాని యింద్రియములకు కాదు.

శ్లో॥ యస్త్వింద్రియాణి మనసా నియమ్యారభతేఽర్జున
కర్మేంద్రియైః కర్మయోగమసక్తః స విశిష్యతే 7

తు = కాని, అర్జున = ఓ అర్జునా!, యః = ఎవడైతే, మనసా = మనస్సు ద్వారా, ఇంద్రియాణి = ఇంద్రియములను, నియమ్య = వశపరుచుకొని, అసక్తః = అనాసక్తుడై, కర్మేంద్రియైః = సమస్త ఇంద్రియముల చేత, కర్మయోగమ్ = కర్మయోగమును (యోగస్థుడై ఇతర కర్మలను), ఆరభతే = ఆచరించునో, సః = అతడు, విశిష్యతే = శ్రేష్ఠుడగును

తా. ఎవడు జ్ఞానేంద్రియములను మనస్సుచే నిగ్రహించి కర్మేంద్రియములచే చేయబడు కర్మలందనాసక్తుడై ఆత్మనిష్ఠయందు ఉండునో అట్టివాడు ఉత్తముడు. అట్టివానినే కర్మయోగి అనవలెను.

శ్లో॥ నియతం కురు కర్మ త్వం కర్మ జ్యాయో హ్యకర్మణః
శరీరయాత్రాఽపి చ తే న ప్రసిద్ధ్యేదకర్మణః 8

త్వమ్ = నీవు, నియతమ్ = విధ్యుక్తమైన, కర్మ = కర్తవ్య కర్మను, కురు = చేయుము, హి = ఏలననగా, అకర్మణః = కర్మలనాచరింపకుండుట కంటే, కర్మ = కర్మలను చేయుటయే, జ్యాయః = శ్రేష్ఠము, చ = మరియు, అకర్మణః = కర్మలనాచరించక పోవుటచే, తే శరీర యాత్రా = నీ శరీర నిర్వహణ, అపి = కూడ, న ప్రసిద్ధ్యేత్ = కొనసాగదు

తా. ఓ అర్జునా! నీవు ఫలాకాంక్షారహితుడవై కర్మల నాచరింపుము. కర్మలు చేయనివానికంటె స్వధర్మరూప కర్మాచరణుడు గొప్పవాడు. ఏలనన కర్మల నాచరించనిచో శరీరయాత్ర గడచుట కష్టతరమగును.

శ్లో॥ యజ్ఞార్థాత్కర్మణోఽ న్యత్ర లోకోఽ యం కర్మబంధనః
తదర్థం కర్మ కౌంతేయ ముక్తసంగః సమాచర 9

కౌంతేయ = ఓ కౌంతేయా (అర్జునా!), యజ్ఞార్థాత్ = యజ్ఞార్థము చేయబడు, కర్మణః = కర్మలు గాక, అన్యత్ర = ఇతర కర్మలలో నిమగ్నులగుట వలన, అయమ్ లోకః = ఈ లోకము (మనుష్య సముదాయము), కర్మ బంధనః = కర్మబంధములలో చిక్కుకొనును, ముక్త సంగః = (కనుక) ఆసక్తి రహితుడవై, తదర్థమ్ = యజ్ఞార్థము, కర్మ = కర్తవ్య కర్మను, సమాచర = చక్కగా ఆచరింపుము

తా. **అవతారిక:** కర్మ బన్ధకము. కావున కర్మచేయరాదను శంకను పరిహరించుచున్నాడు. కర్మఫలమునపేక్షింపక ఈశ్వర ప్రాప్తికై చేయు కర్మ బన్ధహేతువు కాదు. అట్లుగాక ఫలాపేక్ష బుద్ధితో చేయు కర్మ బంధాపాదకమగును. *'అయుక్తః కామకారేణ ఫలే సక్తో నిబద్ధ్యతే' (5-12)* అను గీతావాక్య మీభావమునే చెప్పుచున్నది. అందుచేత బన్ధాపాదకములగు ఇతర కర్మలనాచరించునపుడు సంగబుద్ధిని వదలి, సిద్ధించినను, సిద్ధించకపోయినను, సమభావము కలవాడై యోగనిష్ఠతో కర్మనాచరింపవలెను. అట్లు చేసినకర్మ ఫలహేతువు కాదు.

వి. ఇచ్చట 'యజ్ఞార్థాత్' అని సంబోధించుటలో విశేషార్థము దాగియున్నది. ఈ లోకములో కర్మబంధము నుండి విముక్తి చేయు *'బుద్ధ్యాయుక్తో యయా పార్థ కర్మబంధమ్ ప్రహాస్యసి' (2-39)* అని బుద్ధియోగమునే యజ్ఞమని ప్రస్తావించియున్నారు. ఈ యోగయజ్ఞమునే రాబోవు రెండు శ్లోకములలో ఏకవచనముతో 'అనేన' అని ప్రయోగించియున్నారు.

శ్లో॥ సహయజ్ఞాః ప్రజాః సృష్ట్వా పురోవాచ ప్రజాపతిః
అనేన ప్రసవిష్యధ్వమ్ ఏషవోఽ స్త్విష్టకామధుక్ 10

ప్రజాపతిః = ప్రజాపతియైన బ్రహ్మ, పురా = కల్పాదియందు, సహ యజ్ఞాః = యజ్ఞ సహితముగ, ప్రజాః = ప్రజలను, సృష్ట్వా = సృజించి, ఉవాచ = పలికెను, (యూయమ్) = మీరు, అనేన = ఈ యజ్ఞము ద్వారా, ప్రసవిష్యధ్వమ్ = వృద్ధి చెందుడు, ఏషః = ఈ యజ్ఞము వః = మీకు, ఇష్ట కామధుక్ = ఇష్ట భోగములను ఇచ్చునది, అస్తు = అగుగాక!

తా. మున్ను ప్రజాపతి ప్రజల సృజించుటతో పాటు యజ్ఞమును కూడ సృజించి వారిని ఉద్దేశించి యిట్లనెను. ఈ యజ్ఞము మూలమున అభ్యుదయమును పొందుడు. అనాసక్తిరూపమగు యోగయజ్ఞము ద్వారా ఇష్ట కామములను పొందవలెను. పూర్వశ్లోకమున బంధహేతువుకాని యజ్ఞమును చెప్పి ముక్తసంగుడవై చేయవలెనని బోధించెను. ఈ శ్లోకమున ఆ యజ్ఞమునే ప్రస్తావించుచున్నాడు. ఈ శ్లోకమున 'అనేన' అను ఏకవచన పదప్రయోగముచే పైజెప్పిన 'యజ్ఞముచే' అను అర్థము గ్రాహ్యము.

శ్లో॥ దేవాన్ భావయతానేన తే దేవా భావయంతు వః
పరస్పరం భావయంతః శ్రేయః పరమవాప్స్యథ 11

అనేన = ఈ యజ్ఞముద్వారా (మీరు), దేవాన్ = దేవతలను, భావయత = తృప్తిపరచుడు, తే, దేవాః = ఆ దేవతలు, వః = మిమ్ములను, భావయంతు = వృద్ధిపరచుదురుగాక!, (ఏవమ్) = ఈ విధముగా, పరస్పరమ్ = పరస్పరము, భావయంతః = సంతృప్తిపఱచుకొనుచు, (యూయమ్) = మీరు, పరమ్, శ్రేయః = పరమ శ్రేయస్సును, అవాప్స్యథ = పొందగలరు.

తా. ఓ జనులారా! ఈ యజ్ఞముద్వారా ఇంద్రాది దేవతలను గౌరవించుడు. ఆ దేవతలు మిమ్ములను వర్షాదుల ద్వారా సుఖవంతులను చేయుదురు. ఇట్లు పరస్పర సత్కారములచే జ్ఞానప్రాప్తిద్వారా పరమమగు శ్రేయస్సును పొందగలరు. ఇచ్చట యోగయజ్ఞము ఉద్దేశింపబడినది. అజ్ఞులకు యోగము జ్ఞానప్రాప్తి ద్వారా మోక్షహేతువు.

శ్లో॥ ఇష్టాన్ భోగాన్ హి వో దేవా దాస్యన్తే యజ్ఞభావితాః
తైర్దత్తానప్రదాయైభ్యో యో భుంక్తే స్తేన ఏవ సః 12

యజ్ఞభావితాః = యజ్ఞములద్వారా సంతృప్తిచెందిన, దేవాః =దేవతలు, వః = మీకు, ఇష్టాన్ = ఇష్టములైన, భోగాన్ = భోగములను, హి = నిశ్చయముగా, దాస్యంతే = ప్రసాదించెదరు, తైః = ఆ దేవతలచే, దత్తాన్ = ఇయ్యబడిన భోగములను, యః = ఎవడైతే, ఏభ్యః = వీరికి, అప్రదాయ = ఇయ్యకయే, భుంక్తే = అనుభవించునో, సః = అతడు, స్తేనః, ఏవ = దొంగయే

తా. దేవతలను యజ్ఞములందు సంతోషపెట్టిన మీకభిలషితములగు కోరికలనిత్తురు. వారిచే ఈయబడిన సంపదాదులను మరల వారికిచ్చి సంతృప్తులను చేయక తామే అనుభవించిన వారు దొంగలగుదురు.

శ్లో॥ యజ్ఞశిష్టాశినః సంతో ముచ్యంతే సర్వకిల్బిషైః
భుంజతే తే త్వఘం పాపా యే పచంత్యాత్మకారణాత్ 13

యజ్ఞశిష్టాశినః = యజ్ఞశిష్టాన్నమును భుజించునట్టి, సంతః = సత్పురుషులు, సర్వకిల్బిషైః = సర్వ పాపములనుండి, ముచ్యంతే = ముక్తులగుదురు, యే పాపః తు = ఏ పాపాత్ములైతే, ఆత్మ కారణాత్ = తమ శరీరపోషణ కొరకే, పచంతి = (అన్నమును) వండుకొందురో, తే తు = వారైతే, అఘమ్ = పాపమునే, భుంజతే = భుజింతురు.

తా. యజ్ఞములందు దేవతలను అతిధులను గౌరవించిన తరువాత అవశిష్టమగు ఆహారమును భుజించు శీలముగల సత్పురుషులు సర్వపాపముల నుండి విముక్తులగుదురు. అట్లుకాక తమ ఉదర పోషణార్థమే వంటచేయువారు, ఆ ఆహారమును భుజించువారును, పాపాత్ములగుదురు. వారు పాపము భుజించువారగుదురు.

శ్లో॥ అన్నాద్భవంతి భూతాని పర్జన్యాదన్నసంభవః
యజ్ఞాద్భవతి పర్జన్యో యజ్ఞః కర్మసముద్భవః 14

శ్లో॥ కర్మ బ్రహ్మోద్భవం విద్ధి బ్రహ్మాక్షర సముద్భవమ్
తస్మాత్సర్వగతం బ్రహ్మ నిత్యం యజ్ఞే ప్రతిష్ఠితమ్ 15

భూతాని = ప్రాణులన్నియును, అన్నాత్ = అన్నము నుండి, భవంతి = ఉత్పన్నములగును, పర్జన్యాత్ = వర్షము వలన, అన్న సంభవః = అన్నోత్పత్తి యగును, పర్జన్యః = వర్షము, యజ్ఞాత్ భవతి = యజ్ఞము వలన కలుగును, యజ్ఞః = యజ్ఞము, కర్మ సముద్భవః = విహితకర్మల వలన ఏర్పడును, కర్మ = కర్మ (సముదాయము), బ్రహ్మోద్భవమ్ = వేదముల నుండి ఉత్పన్నములైనవనియు, బ్రహ్మ = వేదము (లు), అక్షర సముద్భవమ్ = నాశరహితుడైన పరమాత్మ నుండి ప్రకటితములైనవనియు, విద్ధి = ఎరుంగుము, తస్మాత్ = అందువలన, సర్వగతమ్ = సర్వవ్యాపి అయిన, బ్రహ్మ = పరమాత్మ, నిత్యమ్ = సర్వదా, యజ్ఞే = యజ్ఞము నందు, ప్రతిష్ఠితమ్ = ప్రతిష్ఠితుడైన వానినిగా (ఎరుంగుము)

తా. ఆహారము వలన రజోరేతస్సులు కలుగును. వానివలన జీవులు కలుగుదురు. వర్షమువలన అన్నము కలుగుచున్నది. యజ్ఞములను ఆచరించుటచే దేవతలు తృప్తులగుదురు. తృప్తులై వారు వర్షములనిత్తురు. కర్మలచే యజ్ఞములు జరుగును. కర్మ వేదముచే ఉద్భవించుచున్నది. ఆ వేదము బ్రహ్మము నుండి కల్గినది. అందుచే నిత్యము, సర్వగతమునగు వేదము యజ్ఞమందు ప్రతిష్ఠింపబడినది.

శ్లో॥ ఏవం ప్రవర్తితం చక్రం నానువర్తయతీహ యః
అఘాయురింద్రియారామో మోఘం పార్థ స జీవతి 16

పార్థ = ఓ పార్థా!, యః = ఎవడైతే, ఇహ = ఈ లోకమున, ఏవం = ఈ విధముగా (పరంపరగా), ప్రవర్తితమ్ = ప్రచురితమైన, చక్రమ్ = సృష్టి చక్రమును, న అనువర్తయతి = అనుసరింపడో (తన కర్తవ్యమును పాటింపడో), సః = అతడు (అట్టి), ఇంద్రియారామః = ఇంద్రియ సుఖలోలుడైనవాడు, అఘాయుః = పాపాత్ముడు, మోఘమ్ జీవతి = వ్యర్థముగా జీవించును.

తా. అర్జునా! ఎవడు పూర్వోక్తమగు ఈ జగచ్చక్రమును అనువర్తింపడో వాడు పాపజీవి, విషయాసక్తుడు గాన వ్యర్థజీవితము గడుపువాడు కాగలడు.

శ్లో॥ యస్త్వాత్మరతిరేవస్యాత్ ఆత్మతృప్తశ్చమానవః
ఆత్మన్యేవ చ సంతుష్టః తస్య కార్యం న విద్యతే 17

తు = కాని, యః మానవః = ఏ మనుజుడు, ఆత్మరతిః ఏవ = ఆత్మయందే, రమించునో, చ = మరియు, ఆత్మ తృప్తః = ఆత్మయందే తృప్తి చెందునో, చ = అట్లే, ఆత్మని ఏవ సంతుష్టః = ఆత్మయందే సంతుష్టుడై, స్యాత్ = ఉండునో, తస్య = అతనికి, కార్యమ్ = ఎట్టి కర్తవ్యము, న విద్యతే = (మిగిలి) ఉండదు

తా. ఏ మానవుడు ఆత్మయందే ఆసక్తి కలవాడును, ఆత్మయందే తృప్తిచెందువాడును, ఆత్మయందే తుష్టి పొందువాడును అగుచున్నాడో అట్టి ఆత్మవేత్తకు చేయవలసిన పనియేమియు లేదు. అనగా పైన జెప్పబడిన ప్రవృత్తి కరములగు యజ్ఞములతో ఆత్మనిష్ఠాపరునకు నిమిత్తము లేదని భావము.

శ్లో॥ నైవ తస్య కృతేనార్థో నాకృతేనేహ కశ్చన
న చాస్య సర్వ భూతేషు కశ్చిదర్థవ్యపాశ్రయః 18

తస్య = అట్టి మహాపురుషునకు, ఇహ = ఈ లోకమున, కృతేన = కర్మాచరణము వలన, కశ్చన అర్థః = ఎట్టి ప్రయోజనము, న (అస్తి) = ఉండదు, అకృతేన = కర్మ చేయకుండుట వలననూ, ఏవ న (అస్తి) = (ప్రయోజనమూ) ఉండదు, చ = అట్లే, సర్వ భూతేషు = సమస్త ప్రాణుల యందును, అస్య = ఇతనికి, కశ్చిత్ = ఎట్టి, అర్థవ్యపాశ్రయః = స్వార్థ సంబంధమూ, న (అస్తి) = ఉండదు

తా. అట్టి బ్రహ్మనిష్ఠునకు ఇహలోకమున కర్మ చేయుటవలన పుణ్యముకాని, చేయనందువలన దోషము కాని లేదు. బ్రహ్మజ్ఞుడగు వానికి జగత్తున కల ఏ ఒక్కరితోను ప్రయోజనము లేదు. పంచభూతాత్మక ప్రపంచముతో ప్రయోజనము నపేక్షించువానికి సత్త్వశుద్ధి కలుగదు.

శ్లో॥ తస్మాదసక్తః సతతం కార్యం కర్మ సమాచర
అసక్తో హ్యాచరన్ కర్మ పరమాప్నోతి పూరుషః 19

తస్మాత్ = అందువలన, సతతమ్ = ఎల్లప్పుడును, అసక్తః = ఆసక్తి రహితుడవై, కార్యమ్ కర్మ = కర్తవ్యకర్మను (యోగయుక్తుడై కర్మను చేయుట), సమాచర = చక్కగా ఆచరింపుము, హి = ఏలనన, పూరుషః = మనుష్యుడు, అసక్తః = ఆసక్తి రహితుడై, కర్మ = కర్మ (ల) ను, ఆచరన్ = ఆచరించుచూ, పరమ్ = పరమాత్మను, ఆప్నోతి = పొందును

తా. జ్ఞాన విషయమును చెప్పిన భగవానుడు ముముక్షువైనను చిత్తశుద్ధి లేనివాని విషయమై చెప్పుచున్నాడు. "అంతఃకరణ శుద్ధిలేనివాడు ఆత్మారాముడును, ఆత్మతృప్తుడును కాజాలడు. కనుక మోక్షప్రాప్తికి చేయదగు కర్మను ఆచరింపుము". అనగా యోగబుద్ధితో కర్మను ఆచరించుమని భావము. యోగబుద్ధి లేనిచో అసక్తత దుర్లభము కనుక అసక్తుడై కర్మను చేయువాడు పరమపదమును పొందును.

శ్లో॥ కర్మణైవ హి సంసిద్ధిమ్ ఆస్థితా జనకాదయః
లోకసంగ్రహమేవాపి సంపశ్యన్ కర్తుమర్హసి 20

జనకాదయః = జనకుడు మొదలగు జ్ఞానులు గూడ, కర్మణా, ఏవ = (ఆసక్తిరహిత), కర్మాచరణము ద్వారానే, సంసిద్ధిమ్ = పరమసిద్ధిని, ఆస్థితాః = పొందియుండిరి, హి = కావున లోకసంగ్రహమ్ = లోకహితమును, సంపశ్యన్, అపి = దృష్టియందుంచు కొనుచూ, కర్తుమ్, ఏవ = (కర్మ) చేయుటకే, అర్హసి = (నీవు) తగియున్నావు

తా. జనకుడు మొదలగు రాజులు నైష్కర్మ్యసిద్ధి మూలముననే మోక్షమందిరి. కాన నీవు లోకసంగ్రహము కొరకై కర్మ చేయదగుదువు. సిద్ధియనగా శుద్ధాంతఃకరణము కలిగి యుండుట.

శ్లో॥ యద్యదాచరతి శ్రేష్ఠః తత్తదేవేతరో జనః
స యత్ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే 21

శ్రేష్ఠః = శ్రేష్ఠ పురుషుడు, యత్, యత్ = ఏమేమి, ఆచరతి = ఆచరించునో, ఇతరః, జనః = ఇతర జన సముదాయము, తత్, తత్, ఏవ = ఆయా కర్మలనే, (ఆచరతి) = ఆచరించును, సః = ఆతడు, యత్, ప్రమాణమ్ = దేనిని ప్రమాణముగా, కురుతే = చేయునో (స్వీకరించునో), లోకః = లోకము, తత్, అనువర్తతే = దానిననుసరించి ప్రవర్తించును

తా. పురుష శ్రేష్ఠుడు ఏయే కర్మల నాచరించునో యితర జనులును ఆయాకర్మలను ఆచరించు వారగుదురు. మరియు శ్రేష్ఠుడైనవాడు దేనిని ప్రమాణముగా భావించునో లోకముకూడ దానినే ప్రమాణముగాదలచి వర్తించును.

శ్లో॥ న మే పార్థాస్తి కర్తవ్యం త్రిషులోకేషు కించన
నానవాప్తమవాప్తవ్యం వర్త ఏవ చ కర్మణి 22

పార్థ! = ఓ పార్థ!, మే = నాకు, త్రిషు, లోకేషు = ముల్లోకముల యందును, కించన, కర్తవ్యమ్, న, అస్తి = ఎట్టి కర్తవ్యమూ లేదు, చ = మరియు, అవాప్తవ్యమ్ = పొందదగిన వస్తువేదియునూ, అనవాప్తమ్, న = పొందబడకుండా లేదు, కర్మణి, ఏవ = (ఐనను నేను) కర్మయందే, వర్త = ప్రవర్తిల్లుచున్నాను.

తా. ఓ అర్జునా! నాకు మూడు లోకములందును చేయదగిన కార్యమేదియు లేదు. నేను పొందని కర్మఫలము కాని పొందదగిన కర్మఫలము కాని లేదు. అయినను నేను కర్మల నాచరించుచునే యున్నాను. అనగా జ్ఞాని కర్మల నాచరించినను దోషము లేదని భావము.

శ్లో॥ యది హ్యహం న వర్తేయం జాతు కర్మణ్యతంద్రితః
మమ వర్త్మానువర్తన్తే మనుష్యాః పార్థ సర్వశః 23

హి = ఏలనన, పార్థ = ఓ పార్థ!, యది = ఒకవేళ, జాతు = ఎప్పుడైనను, అహమ్ = నేను, అతంద్రితః = సావధానుడనై, కర్మణి = కర్మయందు, న, వర్తేయమ్ = ప్రవర్తింపకున్నచో (గొప్ప హాని కలుగును, ఏలనన), మనుష్యాః = మనుజులు, సర్వశః = అన్నివిధములా, మమ = నా, వర్త్మ = మార్గమునే, అనువర్తంతే = అనుసరించెదరు.

తా. ఓ అర్జునా! నేను సావధానుడనై కర్మల నాచరింపనిచో జనులు సర్వవిధముల నా మార్గమునే అనుసరించుదురు.

శ్లో॥ ఉత్సీదేయురిమే లోకా న కుర్యాం కర్మ చేదహమ్
సంకరస్య చ కర్తా స్యామ్ ఉపహన్యామిమాః ప్రజాః 24

చేత్, అహమ్ = ఒకవేళ నేను, కర్మ = కర్మను, న, కుర్యామ్ = చేయనిచో, ఇమే, లోకాః = ఈ లోకములు, ఉత్సీదేయుః = కష్టనష్టముల పాలగును, చ = మరియు (నేను), సంకరస్య = సాంకర్యమునకు, కర్తా = కర్తను, స్యామ్ = అగుదును, ఇమాః, ప్రజాః = ఈ ప్రజలందరినీ, ఉపహన్యామ్ = కష్టములపాలు చేసిన వాడనగుదును.

తా. నేను కర్మలను చేయనిచో ఈ లోకములన్నియు నాశమొందును. వర్ణసంకర కారకుడ నగుదును. వర్ణ సాంకర్యమున ప్రజలను చెడగొట్టిన వాడనగుదును.

శ్లో॥ సక్తాః కర్మణ్యవిద్వాంసో యథా కుర్వంతి భారత
కుర్యాద్విద్వాం స్తథాఽ సక్తః చికీర్షుర్లోకసంగ్రహమ్ 25

భారత! = ఓ అర్జునా!, కర్మణి, సక్తాః = కర్మయందు ఆసక్తులైన, అవిద్వాంసః = అజ్ఞానులు, యథా = ఎట్లు, కుర్వంతి = (కర్మలను) ఆచరింతురో, అసక్తః = ఆసక్తి రహితుడైన, విద్వాన్ = విద్వాంసుడు కూడ, లోకసంగ్రహమ్ = లోకహితమును, చికీర్షుః = చేయగోరువాడై, తథా = అట్లే, కుర్యాత్ = (కర్మలను) ఆచరింపవలెను.

తా. అర్జునా! ఆత్మజ్ఞానము లేనివారు కర్మలందెట్లు ఆసక్తి కలవారై యుందురో అట్లే ఆత్మజ్ఞానియు లోక సంగ్రహము కొఱకై అనాసక్తుడై కర్మల నాచరించును. ఆసక్తి బంధమునకు, అనాసక్తి బంధమోక్షమునకు హేతువు.

శ్లో॥ న బుద్ధిభేదం జనయేదజ్ఞానాం కర్మసంగినామ్
జోషయేత్సర్వకర్మాణి విద్వాన్ యుక్తః సమాచరన్ 26

యుక్తః = పరమాత్మ స్వరూపమునందు నిశ్చలముగా ఉండునట్టి, విద్వాన్ = జ్ఞాని, కర్మసంగినామ్ = శాస్త్రోక్త కర్మలయందు ఆసక్తులైన, అజ్ఞానామ్ = అజ్ఞానులకు, బుద్ధిభేదమ్ = బుద్ధియందు భ్రమను (కర్మలయందు అశ్రద్ధను), న, జనయేత్ = కల్గింపరాదు, సర్వకర్మాణి = (స్వయముగా) విధ్యుక్త కర్మలను అన్నింటిని, సమాచరన్ = చక్కగా ఆచరించుచు, జోషయేత్ = (వారిచే గూడ అట్లే) ఆచరింపజేయవలెను.

తా. పండితుడైనవాడు కర్మాసక్తులగు అజ్ఞానులకు కర్మలందు వైముఖ్యము కలుగజేయక సమాహితచిత్తుడై స్వయముగా కర్మల నాచరించుచు ఇతరులచే కూడ చేయించుచుండవలెను.

శ్లో॥ ప్రకృతేః క్రియమాణాని గుణైః కర్మాణి సర్వశః
అహంకార విమూఢాత్మా కర్తాఽహమితి మన్యతే 27

కర్మాణి = కర్మలన్నియును, సర్వశః = అన్ని విధముల, ప్రకృతేః, గుణైః = ప్రకృతి గుణముల ద్వారా, క్రియమాణాని = చేయబడుచుండును, అహంకార విమూఢాత్మా = అంతఃకరణమునందు అహంకార మోహితుడైన అజ్ఞాని, అహం, కర్తా, ఇతి = నేనే కర్త అని, మన్యతే = తలంచును

తా. సకల కర్మలు ప్రకృతి వికారములగు సత్త్వరజస్తమో గుణముల ద్వారా చేయబడుచున్నవి. అట్లు గుణములు సకల కర్మలకు కారణమై యుండగా ఆత్మజ్ఞాన విహీనుడు అహంకారమువలన మోహితుడై తనను కర్తగా భావించుచున్నాడు.

శ్లో॥ తత్త్వవిత్తు మహాబాహో గుణ కర్మ విభాగయోః
గుణాగుణేషు వర్తంత ఇతి మత్వా న సజ్జతే 28

తు = అయితే, మహాబాహో! = ఓ మహాబాహూ!, గుణకర్మ విభాగయోః = గుణవిభాగ, కర్మవిభాగములయొక్క, తత్త్వవిత్ = తత్త్వమునెఱింగిన జ్ఞానయోగి, గుణాః = గుణములన్నియును, గుణేషు = గుణములయందే, వర్తంతే = ప్రవర్తిల్లును, ఇతి, మత్వా = అని తలంచి, న, సజ్జతే = ఆసక్తుడు కాదు

తా: ఓ అర్జునా! సత్త్వాది గుణత్రయముచే నాచరింపబడు కర్మల విధము తెలిసిన జ్ఞాని, గుణ లక్షణములైన కర్మలను గుణములద్వారా కలుగుచున్నవిగా నెరింగి స్వయముగా కర్తృత్వాద్యభిమాన వర్జితుడై యుండును.

శ్లో॥ ప్రకృతేర్గుణ సంమూఢాః సజ్జంతే గుణకర్మసు
తానకృత్స్నవిదో మందాన్ కృత్స్నవిన్న విచాలయేత్ 29

ప్రకృతేః = ప్రకృతియొక్క, గుణసమ్మూఢాః = గుణములచే మోహితులైన వారు, గుణకర్మసు = గుణములయందును, కర్మలయందును, సజ్జంతే = ఆసక్తులైయుందురు, తాన్ = అట్టి, అకృత్స్నవిదః = మిడిమిడి జ్ఞానముగల, మందాన్ = మందబుద్ధులను, కృత్స్నవిత్ = సంపూర్ణజ్ఞాని, న, విచాలయేత్ = భ్రమకు గురిచేయరాదు

తా. ప్రకృతి గుణములగు సత్వరజస్తమో గుణములచే మోహము చెంది, ఆ గుణకర్మలయందు సంగబుద్ధితో నున్నవారు ఆత్మజ్ఞాన శూన్యులు, మందబుద్ధులు. వారికి జ్ఞాని బుద్ధిభేదము కలిగించకూడదు.

శ్లో॥ మయి సర్వాణి కర్మాణి సంన్యస్యాధ్యాత్మచేతసా
నిరాశీర్నిర్మమో భూత్వా యుధ్యస్వ విగతజ్వరః 30

అధ్యాత్మచేతసా = అంతర్యామినైన నాయందులగ్నమైన మనస్సుద్వారా, సర్వాణి, కర్మాణి = సమస్తకర్మలను, మయి = నాయందు, సన్న్యస్య = సమర్పించి, నిరాశీః = ఆశా రహితుడవు, నిర్మమః = మమతా రహితుడవు, విగతజ్వరః = సంతాప రహితుడవు, భూత్వా = అయి, యుధ్యస్వ = యుద్ధమొనర్పుము

తా. ఆత్మస్వరూపుడనైన నాయందు సమస్త కర్మలను సమర్పించి, జ్ఞానముచే అహంకారమును విడిచి నిష్కాముడవు, దుఃఖరహితుడవును అయి యుద్ధము చేయుము. ఆత్మబుద్ధిచే సకల కర్మలను నాకు సమర్పించి ఆశారహితుడవయి యుద్ధము చేయుము.

*శ్లో॥ యదేవ విద్యయా కరోతి శ్రద్ధయా*
*ఉపనిషదిదమ్ తదేవ వీర్యవత్తరం భవతి (ఛాందోగ్యోపనిషత్)*

శ్రద్ధయు, జ్ఞానము కలిగి ఆచరించు సమస్త కర్మలు వీర్యవంతములై యుండును. ఏలనన జ్ఞానియగువాడు కర్తృత్వ భోక్తృత్వాద్యహంకారములు లేక యుండును. కాన వానిచే ఆచరితములగు కర్మలు బంధహేతువులు కానేరవు.

శ్లో॥ యే మే మతమిదం నిత్యమనుతిష్ఠంతి మానవాః
శ్రద్ధావంతోఽనసూయంతోముచ్యంతే తేఽపి కర్మభిః 31

యే, మానవాః = ఏ మనుష్యులు, అనసూయంతః = దోషదృష్టిలేనివారై, శ్రద్ధావంతః = శ్రద్ధగలవారై, మే, ఇదమ్, మతమ్ = నా, ఈ మతమును, నిత్యమ్ = సర్వదా, అనుతిష్ఠంతి = అనుసరింతురో, తే, అపి = వారును, కర్మభిః = కర్మలనుండి, ముచ్యంతే = ముక్తులయ్యెదరు

తా. ఏ మనుష్యుడు నాయీ మతమును శ్రద్ధావంతుడై, అసూయాభావము లేక యెల్లప్పుడు అనుష్ఠించునో అట్టివాడు కూడ కర్మబంధమునుండి ముక్తుడగును.

శ్లో॥ యే త్వేతదభ్యసూయంతో నానుతిష్ఠంతి మే మతమ్
సర్వజ్ఞాన విమూఢాంస్తాన్విద్ధి నష్టానచేతసః 32

తు = కాని, యే = ఎవరైతే, అభ్యసూయంతః = దోషారోపణ చేయువారై, మే, ఏతత్, మతమ్ = నా, ఈమతమును (ఉపదేశమును), న, అనుతిష్ఠంతి = ఆచరింపరో, తాన్, అచేతసః = అట్టి మూర్ఖులను, సర్వజ్ఞాన, విమూఢాన్ = విపరీత జ్ఞానోపహతులైన వారినిగా, నష్టాన్ = భ్రష్టులైనవారినిగా, విద్ధి = తెలిసికొనుము

తా. ఎవరు నాకు సమ్మతమైన యీ మార్గమును నిందించుచు, అవివేకులై అనుష్ఠింపరో వారు మాయా మోహితులును, జ్ఞానరహితులునై యున్నారు. కనుక నశించిన వారుగా గ్రహింపుము.

శ్లో॥ సదృశం చేష్టతే స్వస్యాః ప్రకృతేః జ్ఞానవానపి
ప్రకృతిం యాంతి భూతాని నిగ్రహః కిం కరిష్యతి 33

భూతాని = ప్రాణులన్నియును, ప్రకృతిమ్, యాంతి = నిజస్వభావములకు లోబడి కర్మలను చేయుచుండును, జ్ఞానవాన్, అపి = జ్ఞానియును, స్వస్యాః, ప్రకృతేః, సదృశమ్ = తన ప్రకృతికి తగినట్లుగా, చేష్టతే = క్రియలను ఆచరించును, నిగ్రహః = (అర్థములేని) పట్టుదల, కిమ్, కరిష్యతి = ఏమిచేయును?

తా. జ్ఞానవంతుడైనను స్వకీయ జన్మాంతర వాసనా బలముచే ప్రకృతికి అనుగుణముగా ప్రవర్తించుచున్నాడు. సర్వప్రాణులు ప్రకృతికి వశులగుచున్నారు. ఇక నిగ్రహమేమి చేయగలదు? అనగా అట్టివానికి నిగ్రహము సులభము కాదని భావము. అనగా ప్రకృతినెదిరించుట నిగ్రహము కాదు. యోగసాధన ద్వారా జ్ఞానము పొంది కర్తృత్వాద్యహంకారములు వదలి ప్రకృతిని అనుసరించుట అని అర్థము.

శ్లో॥ ఇంద్రియస్యేంద్రియస్యార్థే రాగద్వేషౌ వ్యవస్థితౌ
తయోర్న వశమాగచ్ఛేత్ తౌ హ్యస్య పరిపన్థినౌ 34

ఇంద్రియస్య, ఇంద్రియస్య, అర్థే = ప్రతి ఇంద్రియార్థము నందు, రాగద్వేషౌ = రాగద్వేషములు, వ్యవస్థితౌ = దాగియుండును (మనుష్యుడు), తయోః వశమ్ = వాటి వశమునకు, న, ఆగచ్ఛేత్ = లోనుకారాదు, హి, తౌ = ఏలనన ఆ రెండును, అస్య = ఇతనియొక్క (హితమునకు), పరిపన్థినౌ = విఘ్నములను కల్గించే శత్రువులు,

తా. ప్రకృతివశుడగు పురుషునకు ఇంద్రియార్థము ప్రియమైనచో దానియందు రాగము, ఇంద్రియార్థము అప్రియమగుచో దానియందు అయిష్టము కలుగును. రాగద్వేషములకు జ్ఞాని వశుడు కాకూడదు. ఈ రెండును జ్ఞానికి శత్రువులు.

శ్లో॥ శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్ స్వనుష్ఠితాత్
స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః 35

స్వనుష్ఠితాత్ = బాగుగా ఆచరింపబడిన, పరధర్మాత్ = ఇతరుల ధర్మము కంటెను, విగుణః = గుణరహితమే ఐనను, స్వధర్మః = స్వధర్మము, శ్రేయాన్ = అత్యుత్తమమైనది, స్వధర్మే = స్వధర్మమునందు, నిధనమ్ = మరణము (ఐనను), శ్రేయః = శ్రేయస్కరము, పరధర్మః = ఇతరుల ధర్మము, భయావహః = భయమును గొలుపునది

తా. లెస్సగా ఆచరింపబడిన పరధర్మముకంటె, గుణవంతము కాకున్నను స్వధర్మానుష్ఠానము వలన శ్రేయస్సు కలుగును. స్వధర్మమనుష్ఠించుచు సిద్ధిని పొందక మరణమొందినను మేలు కలుగును. పరధర్మాచరణ నరక హేతువు. ఆత్మప్రాప్తికై చేయు తపస్యాదులు స్వధర్మమనియు, దేవతల నిమిత్తమై చేయుకర్మలు పరధర్మములనియు భావము. (స్వధర్మ పరధర్మ శబ్దములకీయర్థము యోగ వాశిష్ఠమున చెప్పబడినది)

**అర్జున ఉవాచ:**

శ్లో॥ అథ కేన ప్రయుక్తోఽయం పాపం చరతి పూరుషః
అనిచ్ఛన్నపి వార్ష్ణేయ బలాదివ నియోజితః 36

వార్ష్ణేయ! = ఓ కృష్ణా!, అథ = మఱి, అయమ్, పూరుషః = ఈ పురుషుడు, అనిచ్ఛన్, అపి = ఇష్టపడకున్నను, బలాత్ ఇవ నియోజితః = బలవంతము చేయబడినట్లుగా, కేన, ప్రయుక్తః = ఎవరిచే ప్రేరితుడై, పాపమ్ = పాపము(ల)ను, చరతి = ఆచరించును

తా. ఓ కృష్ణా! పురుషుడు తనకిష్టములేకున్నను, బలవంతముగా ఎవనిచేతనో ప్రేరేపింపబడినట్లు పాపము చేయుచున్నాడు. అట్లు ప్రేరేపించువాడెవడు?

**శ్రీ భగవానువాచ:**

శ్లో॥ కామ ఏష క్రోధ ఏష రజోగుణ సముద్భవః
మహాశనో మహాపాప్మా విద్ధ్యేనమిహ వైరిణమ్ 37

రజోగుణ సముద్భవః = రజోగుణమునుండి ఉత్పన్నమైన, ఏషః, కామః = ఈ కామమే, క్రోధః = క్రోధము, ఏషః = ఇది, మహాశనః = ఎంత తిన్నను తృప్తిలేనిది (తిండిపోతు), మహాపాప్మా =మిక్కిలి పాపిష్ఠిది, ఇహ = ఈ విషయమున, ఏనమ్ = దీనిని, వైరిణమ్ = శత్రువుగా, విద్ధి = ఎఱుంగుము

తా. పాపకర్మాచరణకు ప్రేరేపించి పురుషునకు శత్రువులై యున్నవి కామ క్రోధములు. ఈ కామక్రోధములు రజోగుణము వలన కలుగును. ఎంత అనుభవించినను కామక్రోధములు తృప్తి చెందవు. ఇవి మిక్కిలి పాపవంతములు. కనుక జ్ఞానికి వీనిని శత్రువులని భావింపుము. రజోగుణము వలన పాపమే చేయబడును.

*శ్లో॥ 'సాత్త్వికీ పుణ్యనిష్ఠాతు పాపోత్పత్తిశ్చ రాజసీ'* *(మనుస్మృతి)*

సత్త్వగుణము కలవాడే పుణ్య కర్మలనాచరింపగలడు. రజోగుణయుతుడు పాపమే చేయును.

శ్లో॥ ధూమేనావ్రియతే వహ్నిర్యథాఽదర్శో మలేన చ
యథోల్బేనావృతో గర్భస్తథా తేనేదమావృతమ్ 38

యథా = ఏవిధముగా, ధూమేన = పొగతో, వహ్నిః, చ = అగ్నియు, మలేన = దుమ్ముతో, ఆదర్శః = అద్దము, ఆవ్రియతే = కప్పబడియుండునో, యథా = ఎట్లు, ఉల్బేన = మావి (మాయ) చే, గర్భః = గర్భస్థ శిశువు, ఆవృతః = కప్పబడియుండునో, తథా = అట్లే, తేన = ఆ కామముచే, ఇదమ్ = ఈ జ్ఞానము, ఆవృతమ్ = కప్పబడి యుండును

తా. పొగచే అగ్నియు, మురికిచేత అద్దము, మావిచేత గర్భస్థ శిశువు ఆవృతమై యుండునటుల కామముచే జ్ఞానము కప్పబడియున్నది.

శ్లో॥ ఆవృతం జ్ఞానమేతేన జ్ఞానినో నిత్యవైరిణా
కామరూపేణ కౌంతేయ దుష్పూరేణానలేన చ 39

చ = మఱియు, కౌంతేయ = ఓ అర్జునా!, అనలేన = అగ్నివంటిదియు, దుష్పూరేణ = పూరింప సాధ్యముకానిదియు, కామరూపేణ = కామరూపాత్మకమైనదియు, జ్ఞానినః = జ్ఞానికి, నిత్యవైరిణా = నిత్యశత్రువైన, ఏతేన = ఈ కామముచే, జ్ఞానమ్ = జ్ఞానము, ఆవృతమ్ = కప్పబడియుండును

తా. తృప్తినెరుగని యీ కామము జ్ఞానియైనవానికి నిత్యశత్రువగుచు వాని జ్ఞానమునకు ప్రతిబంధకమగుచున్నది. జ్ఞానమునకు శత్రువగు అజ్ఞానమే కామమని తెలియుము.

శ్లో॥ ఇంద్రియాణి మనోబుద్ధిరస్యాధిష్ఠాన ముచ్యతే
ఏతైర్విమోహయత్యేష జ్ఞానమావృత్య దేహినమ్ 40

ఇంద్రియాణి = ఇంద్రియములు, మనః = మనస్సు, బుద్ధిః = బుద్ధి, అస్య = దీనికి, అధిష్ఠానమ్ = వాసస్థానము అని, ఉచ్యతే = చెప్పబడును, ఏషః = ఇది (ఈ కామము), ఏతైః =

వీటిద్వారా, జ్ఞానమ్ = జ్ఞానమును, ఆవృత్య = కప్పివేసి, దేహినమ్ = జీవాత్మను, విమోహయతి = మోహితముగా జేయును

తా. ఇంద్రియములు, మనస్సు, బుద్ధి, కామమునకు ఆశ్రయ స్థానములు. కామము ఈ ఇంద్రియముల మూలమున జ్ఞానమును కప్పిపుచ్చి పురుషుని మోహపెట్టుచున్నది.

శ్లో॥ తస్మాత్ త్వమింద్రియాణ్యాదౌ నియమ్య భరతర్షభ
పాప్మానం ప్రజహి హ్యేనం జ్ఞాన విజ్ఞాన నాశనమ్ 41

తస్మాత్ = అందువలన, భరతర్షభ! = ఓ అర్జునా!, త్వమ్ = నీవు, ఆదౌ = మొదట, ఇంద్రియాణి = ఇంద్రియములను, నియమ్య = అదుపుచేసి, జ్ఞానవిజ్ఞాన నాశనమ్ = జ్ఞానవిజ్ఞానములను నశింపజేయునట్టి, ఏనమ్, పాప్మానమ్ = మహాపాపియైన ఈ కామమును, హి = అవశ్యముగా, ప్రజహి = సంహరింపుము

తా. ఓ అర్జునా! అందువలన నీవు ముందుగా ఇంద్రియములను నిగ్రహించి, పాపాచరణ కలిగి జ్ఞాన విజ్ఞానములను నాశముచేయు కామమను శత్రువును నశింపజేయుము. జ్ఞానమనగా ఆత్మ విషయక శాస్త్రీయమైన జ్ఞానము. ఆచార్యోపదేశపూర్వకమైన ధ్యాన నిదిధ్యాసల సంబంధమైన జ్ఞానమును విజ్ఞానమందురు. అనుభవజన్య జ్ఞానమని భావము.

*శ్లో॥ 'తమేవ ధీరో విజ్ఞాయ ప్రజ్ఞాం కుర్వీత' (బృహదారణ్యకోపనిషత్ 4.4.21)*

శ్లో॥ ఇంద్రియాణి పరాణ్యాహుః ఇంద్రియేభ్యః పరం మనః
మనసస్తు పరాబుద్ధిః యో బుద్ధేః పరతస్తు సః 42

ఇంద్రియాణి = ఇంద్రియములు, పరాణి = (స్థూలశరీరముకంటేను) శ్రేష్ఠములు, బలీయములు, సూక్ష్మములు, ఆహుః = (అని) అందురు, ఇంద్రియేభ్య = ఇంద్రియముల కంటెను, మనః = మనస్సు, పరమ్ = శ్రేష్ఠమైనది, సూక్ష్మమైనది, మనసః, తు = మనస్సు కంటెను, బుద్ధిః, పరా = బుద్ధి శ్రేష్ఠమైనది, తు = మఱియు, యః = ఏదైతే, బుద్ధేః, పరతః = బుద్ధికంటెను శ్రేష్ఠమైనదో, సః = అది (ఆత్మ)

తా. దేహముకంటె శ్రోత్రాదీన్ద్రియములు శ్రేష్ఠములు. ఇన్ద్రియముల కంటె మనస్సు శ్రేష్ఠము. మనస్సుకంటె బుద్ధి శ్రేష్ఠమైనది, బుద్ధికంటె సాక్షిరూపుడైన ఆత్మ శ్రేష్ఠము. కాన ఆత్మనిష్ఠారూప యోగముద్వారా కామక్రోధములను జయింపవలెను.

శ్లో॥ ఏవం బుద్ధేః పరం బుద్ధ్వా సంస్తభ్యాత్మానమాత్మనా
జహి శత్రుం మహాబాహో కామరూపం దురాసదమ్ 43

ఏవమ్ = ఈ విధముగా, బుద్ధేః = బుద్ధికంటెను, పరమ్ = సూక్ష్మము, బలీయము శ్రేష్ఠమైనది ఆత్మయని, బుద్ధ్వా = తెలిసికొని, ఆత్మానా = బుద్ధి ద్వారా, ఆత్మానమ్ = మనస్సును, సంస్తభ్య = వశపఱచుకొని, మహాబాహో = ఓ మహాబాహూ!, దురాసదమ్ = దుర్జయమైన, కామరూపమ్ = కామమనెడి, శత్రుమ్ = శత్రువును, జహి = నిర్మూలింపుము

తా. ఓ అర్జునా! ఈ విధముగా బుద్ధికంటెను పరమైన ఆత్మను యోగివై యెరింగి అందే మనస్సును నిశ్చలముచేసి జయింపరాని కామరూప శత్రువును జయింపుము.

ఇట్లు
శ్రీ పరమహంస పరివ్రాజకాచార్యులును,
బ్రహ్మర్షి సద్గురు **శ్రీశ్రీశ్రీ శివానంద** భగవత్పూజ్యపాద శిష్యులును నైన
బ్రహ్మర్షి సద్గురు **శ్రీశ్రీశ్రీ స్వామి రామానంద పరమహంస** వారిచే
రచింపబడిన గీతామృతమను టీక యందు
కర్మయోగమను తృతీయాధ్యాయము సమాప్తము

## కర్మయోగమను తృతీయాధ్యాయమునకు

# అనుబంధం

ఈ కర్మయోగమను అధ్యాయమున శ్రీకృష్ణపరమాత్మ యుద్ధముతో పాటు ఇతర కర్మలను ప్రోత్సహించుటకు ఉద్దేశించునది కాదు. యోగస్థుడై కర్మలు చేసినచో అవి కర్మఫలాపేక్షతో చేయబడకుండా కర్మఫలానుభవమునకై మరల జన్మలెత్తకుండ ఉండుటకు యోగమను కర్మనే ప్రోత్సహించిరి. ఈ విషయమును *"బుద్ధియుక్తో జహాతీహ ఉభే సుకృత దుష్కృతే"* అని రెండవ అధ్యాయమున ఉటంకించిరి. ఈ అధ్యాయంలో *"కర్మయోగేన యోగినామ్"* అనియూ, *"నకర్మణామనారంభాత్ నైష్కర్మ్యం పురుషోశ్నుతే"* అనియూ, *"యజ్ఞాత్ కర్మణో అన్యత్ర"* అనియు, *"అనేన ప్రసవిష్యధ్వ"* అనియు, *"దేవాన్ భావయతానేన"* అనియు, *"యజ్ఞాత్ భవతి పర్జన్యో యజ్ఞః కర్మ సముద్భవం"* అనియు *"శ్రేయాన్ స్వధర్మో విగుణ"* అనియు ప్రాణాయామ రూప యోగ కర్మనే ప్రోత్సహించిరి. మరియు *"కామ ఏష క్రోధ ఏష రజోగుణ సముద్భవ"* కామక్రోధములు రజోగుణము నుండి పుట్టినవగుటచే రజోగుణమును శాంతింపజేయు *"ప్రశాంత మనసస్యేనం యోగినమ్ సుఖముత్తమమ్"* *"ఉపైతిశాంత రజసం బ్రహ్మభూతమకల్మషం"* (6–27) యోగకర్మనే ప్రోత్సహించిరి. మరియు నాల్గవ అధ్యాయం ప్రారంభములో *"ఇమమ్ వివస్వతేయోగం"* ఈ యోగాన్ని నేను సూర్యుడు మొదలగు వారికి ఉపదేశించితినని చెప్పుటచే మూడవ అధ్యాయమగు 'కర్మయోగ' సారాంశం యోగకర్మయే గాని ఇతర కర్మలు కావని గ్రహించవలెను. కాని, బాహ్యనాడీ శోధనను యోగవిద్యగా భ్రమించి ఈ రెండిటి తారతమ్యం తెలియకపోవుటచే కొందరు ఉపన్యాసకులు యోగమును ఒక శ్వాసకు సంబంధించిన ప్రక్రియగాను, అది కేవలం శారీరక ఆరోగ్య నిమిత్తమై ఉపయోగపడునే తప్ప, జ్ఞానమును, మోక్షమును ఈయజాలదను అసంపూర్ణ జ్ఞానంతో యధార్థమగు యోగవిద్యను నిందించుచున్నారు. సద్గురువుల వద్ద ఉపదేశము పొందినవారు మాత్రమే, యోగవిద్యను బ్రహ్మవిద్యగా నెరింగి శారీరక మానసిక వికాసాన్ని పొంది మోక్షమునొందగలరు.

ఓం శ్రీకృష్ణ పరమాత్మనే నమః

చతుర్థాధ్యాయము

# జ్ఞానయోగము

**శ్రీ భగవానువాచ:**

శ్లో॥ ఇమం వివస్వతే యోగం ప్రోక్తవానహమవ్యయమ్
వివస్వాన్మనవే ప్రాహ మనురిక్ష్వాకవేఽబ్రవీత్ 1

అహం = నేను, ఇమం, అవ్యయం, యోగం = ఈ శాశ్వతమైన యోగమును, వివస్వతే = సూర్యునకు, ప్రోక్తవాన్ = చెప్పియుంటిని, వివస్వాన్ = సూర్యుడు, మనవే = (తన కుమారుడైన వైవస్వత) మనువునకు, ప్రాహ = చెప్పెను, మనుః = (ఆ) మనువు, ఇక్ష్వాకవే = తన కుమారుడైన ఇక్ష్వాకునకు, అబ్రవీత్ = చెప్పెను

తా. నాశమెరుగని యీ యోగవిద్యను ఆదికాలమున నేను సూర్యునకు ఉపదేశించితిని. సూర్యుడు తన కుమారుడైన వైవస్వత మనువునకు ఉపదేశించెను. ఆ మనువు ఇక్ష్వాకునకు ఉపదేశించెను. ఈ యోగవిద్య అనాది కాలమునుండి యిప్పటివరకు ప్రధానవిద్యగానున్నది.

శ్లో॥ ఏవం పరంపరా ప్రాప్తమిమం రాజర్షయో విదుః
స కాలేనేహ మహతా యోగో నష్టః పరంతప 2

పరంతప = ఓ పరంతపా! (అర్జునా!), ఏవమ్ = ఈ విధముగా, పరంపరాప్రాప్తమ్ = పరంపరగా ప్రాప్తించిన, ఇమమ్ = ఈ యోగమును, రాజర్షయః = రాజర్షులు, విదుః = ఎఱింగిరి, సః, యోగః = ఆ యోగము, మహతా, కాలేన = చాలాకాలము క్రిందటనే, ఇహ = ఈ భూలోకమునందు, నష్టః = లుప్త ప్రాయమాయెను

తా. ఈ విధముగా వంశపరంపరగా ఉపదేశింపబడిన యీ యోగవిద్యను రాజర్షుల సాంప్రదాయికముగా నెరుంగుదురు. బహుకాలము గడువగా గడువగా ఈ లోకమున యీ యోగవిద్యాప్రచారము తగ్గినది.

శ్లో॥ స ఏవాయం మయాతేఽద్య యోగః ప్రోక్తః పురాతనః
భక్తోఽసి మే సఖా చేతి రహస్యం హ్యేతదుత్తమమ్ 3

(త్వమ్) = (నీవు), మే, భక్తః = నా భక్తుడవు, చ = మఱియు, సఖా, అసి, ఇతి = ప్రియసఖుడవు కనుక, సః, పురాతనః, యోగః, ఏవ = ఆ ప్రాచీనమైన యోగమే, అయమ్ = ఇది

(ఈ యోగము), అద్య = నేడు, మయా = నా చేత, తే = నీకు, ప్రోక్తః = చెప్పబడుచున్నది హి = ఎందువలననగా, ఏతత్ = ఇది ఉత్తమమైనది, రహస్యమ్ = గోప్యమైనది,

తా. ఓ అర్జునా! నీవు నా భక్తుడవు, సఖుడవు. కాన రహస్యమైనదియు, మిగుల ఉత్తమమైనదియునగు యీ యోగవిద్యను నీకుపదేశించుచున్నాను.

**అర్జున ఉవాచ:**

శ్లో॥ అపరం భవతో జన్మ పరం జన్మ వివస్వతః
కథమేతద్విజానీయాం త్వమాదౌ ప్రోక్తవానితి 4

భవతః, జన్మ = మీజన్మ, అపరమ్ = ఇటీవలిది, వివస్వతః, జన్మ = సూర్యుని జన్మ, పరమ్ = అతి ప్రాచీనమైనది (కల్పాదియందు జరిగినది), త్వమ్ = నీవు, ఆదౌ = కల్పాదియందు (సూర్యునకు), ఏతత్ = ఈ యోగమును, ప్రోక్తవాన్ = చెప్పియుంటివి, ఇతి = అని, కథమ్ = (నేను) ఎట్లు, విజానీయామ్ = తెలిసికొనగలను

తా. "ఓ కృష్ణా! సూర్యుడు నీకన్న ముందు పుట్టినాడు. నీవు తరువాత పుట్టినవాడవు. ఇట్లుండగా నీవీ యోగవిద్యను సర్గాదియందు సూర్యునకు ఉపదేశించితివనుటను నేనెట్లు నమ్మగల"నని అర్జునుడు తన సంశయమును చెప్పుకొనెను.

**శ్రీ భగవానువాచ:**

శ్లో॥ బహూని మే వ్యతీతాని జన్మాని తవచార్జున
తాన్యహం వేద సర్వాణి న త్వం వేత్థ పరంతప 5

పరంతప! = ఓ పరంతపా!, అర్జున! = ఓ అర్జునా!, మే, చ, తవ = నావియు, నీవియు, బహూని, జన్మాని = పెక్కుజన్మలు, వ్యతీతాని = గతించినవి, తాని, సర్వాణి = వాటినన్నింటిని, త్వమ్, న, వేత్థ = నీవెఱుంగవు, అహమ్, వేద = నేను ఎఱుగుదును

తా. ఓ అర్జునా! నాకును, నీకును అనేక జన్మలు గడచినవి. ఆ జన్మలనన్నిటిని నేనెరుగుదును నీ వెరుంగవు.

శ్లో॥ అజోఽపి సన్నవ్యయాత్మా భూతానామీశ్వరోఽపి సన్
ప్రకృతిం స్వామధిష్ఠాయ సంభవామ్యాత్మమాయయా 6

(అహమ్) = (నేను), అజః = జన్మరహితుడను, అవ్యయాత్మా సన్, అపి = శాశ్వతుడను,

ఐనప్పటికిని, భూతానామ్ = సమస్త ప్రాణులకు, ఈశ్వరః, సన్, అపి = ఈశ్వరుడును ఐనప్పటికిని, స్వామ్, ప్రకృతిమ్ = నా ప్రకృతిని, అధిష్ఠాయ = అధీనములో ఉంచుకొని, ఆత్మమాయయా = నా యోగమాయచే, సంభవామి = అవతరించుచుందును

తా. నేను పుట్టుక లేని వాడను. అవికారుడను. ప్రాణులకు నియంతను. ఐనను నాయొక్క శుద్ధ సత్త్వ ప్రకృతిని స్వీకరించి, నాకధీనమైన మాయను నిమిత్తముగా జేసికొని, అవతరించుచున్నాను.

వి. 'సంభవామి' అనగా పుట్టుటయనిగాదు. సంభవించుట యనగా సర్వవ్యాపకమైన ఆత్మ, సర్వవ్యాపకమైన ఆకాశముగా వ్యక్తమగుట.

*'ఆత్మనః ఆకాశ సంభూతః'* *(పైంగలోపనిషత్ 1-4)*

శ్లో॥ యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత
అభ్యుత్థానమధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్ 7

భారత! = ఓ అర్జునా!, యదా, యదా = ఎప్పుడెప్పుడు, ధర్మస్య = ధర్మమునకు, గ్లానిః = హానియు, అధర్మస్య = అధర్మమునకు, అభ్యుత్థానమ్ = వృద్ధియు, భవతి = అగునో, తదా, హి = అప్పటికి అప్పుడే, అహమ్ = నేను, ఆత్మానమ్ = నా రూపమును, సృ జామి = ప్రకటించుచుందును

తా. ఓ భరతకుల సంభవా! ఎప్పుడు ధర్మానుష్ఠానమునకు కీడు వాటిల్లునో, అధర్మమునకు వృద్ధి కలుగునో అప్పుడు నేనవతరించుచున్నాను.

వి. *"ఈ యోగమును సూర్య, మను, ఇక్ష్వాకులు మొదలగు రాజర్షులకు ఉపదేశించితి"* నని ఈ అధ్యాయము ప్రారంభమునందే చెప్పుటచే ఈ యోగము ద్వారానే ధర్మోద్ధారణ గావించుటకు నేను యోగమునుపదేశించు గురువులను సృజించుచుందునని అర్థము. ధర్మమనగా జ్ఞానమని అర్థం.

*శ్లో॥ సహిధర్మసు పర్యాప్తో బ్రహ్మణః పదవేదనం* *(మహాభారతం)*

బ్రహ్మపద ప్రాప్తియే ధర్మము కనుక ఆత్మానుభవ జ్ఞానమే ధర్మం. అది యోగం ద్వారానే సాధ్యమగును.

*'యోగాత్సంజాయతే జ్ఞానం'* *(త్రిశిఖి బ్రాహ్మణోపనిషత్ -19)*

శ్లో॥ పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్
ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే 8

సాధూనామ్ = సత్పురుషుల యొక్క, పరిత్రాణాయ = పరిరక్షణము కొరకు, దుష్కృతామ్ = దుష్టులయొక్క, వినాశాయ = వినాశము కొఱకు, చ = మఱియు, ధర్మసంస్థాపనార్థాయ = ధర్మమును (జ్ఞానమును) సుస్థిర మొనర్చుటకు, యుగే, యుగే = ప్రతియుగము నందును లేదా ప్రతిక్షణమునందును, సంభవామి = (నేను) అవతరింతును

తా. సాధు పురుషుల (ఆత్మజ్ఞానుల) యొక్క రక్షణము కొఱకును, పాపాత్ములను నశింపజేయుటకును, ఆత్మనిష్ఠారూప ధర్మమును స్థాపన చేయుటకును యుగయుగమున నేనవతరించుచుందును.

వి. *'సంభవామి యుగే యుగే'* అనగా ప్రతియుగమునకొకసారి అవతరింతునని కాదు. యుగే యుగే అని అనుటలో ప్రతి క్షణమునందు కూడా అని అర్థం చేసుకొనవలసి యున్నది. యుగం, యుగళం, యుగ్మం అని పిలవబడు ఈ మూడు పర్యాయ పదములకు 'రెండు' అని అర్థం. ఈ 'రెండు' అను భావమును ప్రకటించు యుగమునకు విశేషార్థము 'మనుస్మృతి' లో ఈ విధముగా వివరించబడినది. సూర్యుని గమనములో ధ్రువనక్షత్రమునకు దూరమగుచున్న కొలది అవరోహణ కృత, త్రేతా, ద్వాపర, కలి యుగములు సంభవించుచున్నవనియు, తిరుగు ప్రయాణములో దగ్గరగుచున్నకొలది ఆరోహణ కలియుగ, ద్వాపర, త్రేతా, కృత యుగములు సంభవించు చున్నవనియు చెప్పబడినది. అవరోహణ (క్రిందకు), ఆరోహణ (పైకి) యుగములు ఏర్పడుటచే ఈ రెంటికి 'యుగము' లని పేరు వచ్చెను.



ఈ విధముగా సూర్యుడు క్రిందకు పయనించుసరికి 12 వేల సంవత్సరములు, పైకి పయనించి ధృవనక్షత్రము దరి చేరుసరికి 12 వేల సంవత్సరములు మొత్తము ఒక పరిభ్రమణకు 24 వేల సంవత్సరములు పట్టునని, అవి తేజస్సునకు సంబంధించినవి అగుటచే దివ్య సంవత్సరములని చెప్పిరి. కాని యోగానుభవ రహితులగు పండితులు సరిగా అర్థము చేసుకొనలేక దేవతల సంవత్సరములుగా భావించి ఈ యుగములను లక్షల సంవత్సరములుగా గణించిరి. యుగములకు అర్థములిట్లుండగా ప్రతి యుగమునకు అవతరింతునని అర్థము చేసుకొనవచ్చును. అది ఎట్లనగా... భ్రూమధ్యము నుండి ప్రతిశ్వాస యందు ప్రాణశక్తి అధోగమనము చేయుచున్నది. ప్రాణశక్తి క్రిందికి దిగునపుడు జ్ఞానశక్తి కోల్పోవుటచే జీవుడు అధర్మపరుడగుటయు, శ్వాస పైకి పోవునపుడు అధిక జ్ఞానం కలిగి, ధర్మపరుడగుటయు సంభవించుచున్నది. కావున దుష్టశిక్షణ కొరకు, ధర్మరక్షణ కొరకు పరమాత్మ వేరుగా మూడవ వ్యక్తిగా అవతరించుట కాదనియు, శ్వాసను అధోగతి పాలు చేయువాడు దుష్టుడై శిక్షను అనుభవించుట, యోగసాధన ద్వారా శ్వాసను ఊర్ధ్వమునకు పంపుటచే శిష్టుడై రక్షింపబడుచుండుననియు, అట్టి యోగమును ఉద్ధరించుటకు, తద్వారా ధర్మోద్ధారణ కొరకు గురువులు గాను, అవతార పురుషుని గాను, ఏకాలమందైనను, ఎన్నిసార్లైనను వ్యక్తమగుచుండునని భావం. గీత ప్రారంభంలో 'అద్వైతామృత వర్షిణీం' అని సంబోధించుటచే బ్రహ్మవిద్యయందు గురుశిష్యులుగా, ధర్మోద్ధారకులుగా, అవతార పురుషులుగా పరమాత్మయే (తానే) వ్యక్తీకరింప బడుచుండునని అర్థము.

శ్లో॥ జన్మ కర్మ చ మే దివ్యం ఏవం యో వేత్తి తత్త్వతః
త్యక్త్వా దేహం పునర్జన్మ నైతి మామేతి సోఽర్జున 9

అర్జున = ఓ అర్జునా!, మే, జన్మ = నాయొక్క జన్మయును, కర్మ, చ = కర్మయును, దివ్యమ్ = దివ్యము(లు), ఏవమ్, యః = ఇట్లు ఎవడైతే, తత్త్వతః = తాత్త్వికముగా, వేత్తి = ఎరుంగునో, సః = అతడు, దేహమ్, త్యక్త్వా = తనువును వీడిన పిమ్మట, పునః, జన్మ, న, ఏతి = మరల జన్మను పొందడు, మామ్, ఏతి = నన్నేపొందును.

తా. ఎవడు ప్రకృతి సంబంధములేని నా జన్మకర్మల యథార్థమెరుగునో ఆ పురుషుడు తన శరీరత్యాగానంతరము మరల జన్మనందడు. నన్ను చేరును.

శ్లో॥ వీతరాగభయక్రోధా మన్మయా మాముపాశ్రితాః
బహవో జ్ఞానతపసా పూతా మద్భావమాగతాః 10

వీతరాగ, భయక్రోధాః = రాగ భయ క్రోధ రహితులు, మన్మయాః = నాయందే అనన్యభక్తితో స్థితమైనవారు, మామ్, ఉపాశ్రితాః = నన్ను ఆశ్రయించిన వారు (అగు), బహవః = పెక్కుమంది భక్తులు జ్ఞానతపసా = జ్ఞానరూప తపస్సుచే, పూతాః = పవిత్రులై, మద్భావమ్, ఆగతాః = నా స్వరూపమును పొందియుండిరి.

తా. అనురాగమును, భయమును, క్రోధమును విడిచి, నాయందే మనస్సు కల్గి నన్నే ఆశ్రయించిన పురుషులు పెక్కుమంది జ్ఞానమనెడి తపస్సుచేత పరిశుద్ధులై నా స్వరూపమును పొందిరి.

శ్లో॥ యే యథా మాం ప్రపద్యన్తే తాంస్తథైవ భజామ్యహమ్
మమ వర్త్మానువర్తంతే మనుష్యాః పార్థ సర్వశః 11

పార్థ = ఓ పార్థా!, యే = ఎవరు, మామ్ = నన్ను, యథా ప్రపద్యంతే = ఎట్లు సేవింతురో? అహమ్ = నేను, తాన్ = వారిని, తథా, ఏవ = అట్లే, భజామి = అనుగ్రహింతును, మనుష్యాః = మనుష్యులు, సర్వశః = అన్ని విధముల, మమ = నాయొక్క, వర్త్మ = మార్గమును, అనువర్తంతే = అనుసరించుచుందురు

తా. ఎవరెట్టుల నన్ను శరణమని వేడుకొనుచున్నారో, నేనును వారినట్లే అనుగ్రహించుచున్నాను. మనుష్యులు సర్వవిధముల నన్నే అనుసరించుచున్నారు.

శ్లో॥ కాంక్షంతః కర్మణాం సిద్ధిం యజంత ఇహ దేవతాః
క్షిప్రం హి మానుషే లోకే సిద్ధిర్భవతి కర్మజా 12

ఇహ మానుషే లోకే = ఈ మనుష్య లోకమునందు, కర్మణామ్ = కర్మలయొక్క, సిద్ధమ్ = ఫలమును, కాంక్షంతః = కోరుకొనువారు, దేవతాః = (ఇతర) దేవతలను, యజంతే = పూజింతురు, హి = ఏలనన, కర్మజా సిద్ధిః = కర్మలను ఆచరించుటవలన కలుగు ఫలితము, క్షిప్రమ్ భవతి = (వారికి) శీఘ్రముగా లభించును

తా. ఈ మనుష్య లోకమున కర్మల ఫలప్రాప్తిని కోరెడి వారు ఇంద్రాది దేవతలను ఉపాసించుచున్నారు. ఏలననగా, మానవలోకమున కర్మలు త్వరగా ఫలించును.

శ్లో॥ చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మ విభాగశః
తస్య కర్తారమపి మాం విద్ధ్యకర్తారమవ్యయమ్ 13

గుణకర్మవిభాగశః = గుణ, కర్మల విభజనను అనుసరించి, చాతుర్వర్ణ్యమ్ = బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర రూప నాలుగు వర్ణముల సమూహము, మయా = నాచేత, సృష్టమ్ = సృష్టింపబడినది, తస్య = ఆ సృష్టికి, కర్తారమ్ అపి = కర్తను ఐనప్పటికిని, అవ్యయమ్ = శాశ్వతుడ(పరమేశ్వరుడ)నైన, మామ్ = నన్ను, అకర్తారమ్ = అకర్తనుగా, విద్ధి = ఎరుంగుము

తా. గుణప్రేరితులై జీవులు చేయు కర్మాచరణననుసరించి నాచే నాలుగు వర్ణములు సృష్టింపబడినవి. అట్టి సృష్టికి నేను కారణమైనను, నేను కర్తను కాదనియు, నాశరహితుడననియు తెలియుము.

*శ్లో॥ జన్మనా జాయతే శూద్రః కర్మణా జాయతే ద్విజః*
*వేదపారాయణే విప్రః బ్రహ్మజ్ఞానేన బ్రాహ్మణః* *(మహాభారతం శాంతిపర్వం-188)*

అనునట్లు కర్మానుసారమే వర్ణవిభాగమని యెరుంగవలెను. మరియు... విద్యుత్ వలననే వివిధ పరికరములు పనిచేయుచున్ననూ, ఆయా పరికరముల పనితనానికి విద్యుత్తుకు సంబంధము లేనట్లు పరమాత్మకు ఆయా వర్ణములతో సంబంధం లేదు.

శ్లో॥ నమాం కర్మాణి లింపంతి న మే కర్మఫలే స్పృహా
ఇతి మాం యోఽభిజానాతి కర్మభిర్న స బధ్యతే 14

కర్మఫలే = కర్మఫలమునందు, మే స్పృహా న = నాకు ఆసక్తి లేదనియు, మామ్ = నన్ను, కర్మాణి = కర్మలు, న లింపంతి ఇతి = అంటవు అనియు, యః = ఎవడైతే, మామ్ = నన్ను, అభిజానాతి = తెలిసికొనునో, సః కర్మభిః = అతడు కర్మలచేత, న బధ్యతే = బంధింపబడడు

తా. నన్ను కర్మలంటవు. నాకు కర్మఫలేచ్ఛ లేదు. ఈ ప్రకారముగా నన్నెరింగిన జ్ఞాని కర్మబంధమునకు వశుడుకాడు. (ఇచ్చట కూడ పరమాత్మకు చాతుర్వర్ణములతో సంబంధం లేదని గ్రహింపనగును)

శ్లో॥ ఏవం జ్ఞాత్వా కృతం కర్మ పూర్వైరపి ముముక్షుభిః
కురు కర్మైవ తస్మాత్త్వం పూర్వైః పూర్వతరం కృతమ్ 15

పూర్వైః = ప్రాచీనులైన, ముముక్షుభిః అపి = ముముక్షువులచేత గూడ, ఏవమ్ = ఈ విధముగా, జ్ఞాత్వా = తెలిసికొనబడి, కర్మ కృతమ్ = కర్మలు చేయబడినవి, తస్మాత్ = అందువలన, త్వమ్ = నీవును, పూర్వైః = ప్రాచీనులచేత, పూర్వతరమ్ కృతమ్ = నిరంతరము చేయబడుచు వచ్చిన, కర్మ ఏవ = కర్మలనే, కురు = చేయుము

తా.  ఈ విధమెరిగి పూర్వము ముముక్షువులు కర్మల నాచరించిరి. నీవు కూడ పూర్వులవలె కర్మల నాచరింపుము.

శ్లో॥ కిం కర్మ కిమకర్మేతి కవయోఽప్యత్ర మోహితాః
తత్తే కర్మ ప్రవక్ష్యామి యజ్ఞాత్వా మోక్ష్యసేఽశుభాత్ 16

కర్మ కిమ్ = కర్మ అనగానేమి?, అకర్మ కిమ్ = అకర్మ అనగానేమి?, ఇతి అత్ర = (అను) ఈ విషయమును నిర్ణయించుటలో, కవయః అపి = బుద్ధిమంతులును, మోహితాః = మోహితులగుచున్నారు, యత్ జ్ఞాత్వా = (కావున) దేనిని తెలిసికొని (నీవు), అశుభాత్ = కర్మబంధము నుండి, మోక్ష్యసే = విముక్తి పొందుదువో, తత్ కర్మ = ఆ కర్మతత్త్వమును, తే = నీకు, ప్రవక్ష్యామి = విశదపరుచుచున్నాను

తా.  ఎట్లాచరించిన కర్మయగును? ఎట్లాచరించిన అకర్మ యనబడును? అను విషయమున పండితులు కూడ మోహము చెందుచున్నారు. అట్టి కర్మాకర్మలను నీకు చెప్పబోవుచున్నాను. నీవు దాని నెరింగిన, అనర్థాపాదకమైన సంసారము నుండి మోక్షమును పొందుదువు. వేదశాస్త్రములందు కర్మలను విశేషించి చెప్పినను పండితులైనవారు కూడ మోహము చెందుచున్నారనుటచే ఇది రహస్యమని గ్రహించవలెను.

వి.  *'తత్తేకర్మ ప్రవక్ష్యామి'* అనగా ఆకర్మనే చెప్పుచున్నాననియూ, *'యద్ జ్ఞాత్వా మోక్షసేఽ శుభాత్'* అనగా "దేనిని తెలుసుకొని అశుభమైన సంసారమునుండి ముక్తి పొందెదవో" అని చెప్పుటలో అన్నికర్మలు అన్ని జ్ఞానములు ముక్తినీయలేవనియూ, ప్రత్యేకంగా ఒక కర్మను చెప్పుచున్నారు.

*శ్లో. కర్మాత్మ విజ్ఞానమపిక్రమేణ*
*సంపాద్యమేకేన నరేనవేద*
*యకర్మణా చిత్త విశుద్ధిమాప్య*
*స విద్యయాప్నోత్యమృతం హి విద్వాన్* *(శృతి)*

కర్మ, ఆత్మ విజ్ఞానము ఈ రెంటినీ ఒకే నరుడు తెలుసుకొనవలెను. ఏ కర్మచే చిత్తశుద్ధి కలుగునో ఆ కర్మను, ఏ జ్ఞానముచే అమృతత్త్వము కలుగునో ఆ జ్ఞానమును ఒకే నరుడు తెలుసుకొనవలెను.

*"యోగయుక్తో విశుద్ధాత్మా విజితాత్మా జితేంద్రియ"* *(5-7)*

యోగయుక్తుడే చిత్తశుద్ధిని, ఇంద్రియ మనో నిగ్రహములను పొందగలవాడు కనుక ప్రాణాయామ రూప యోగకర్మనే ప్రత్యేకంగా చెప్పబోవుచున్నారు.

శ్లో॥ కర్మణో హ్యపి బోద్ధవ్యం బోద్ధవ్యం చ వికర్మణః
అకర్మణశ్చ బోద్ధవ్యం గహనా కర్మణోగతిః 17

కర్మణః, అపి = కర్మ యొక్క తత్త్వముగూడ, బోద్ధవ్యమ్ = తెలిసికొనదగినది, చ, అకర్మణః, అపి = అట్లే అకర్మ యొక్క స్వరూపము గూడ, బోద్ధవ్యమ్ = ఎఱుంగదగినది, వికర్మణః, చ = వికర్మ లక్షణము గూడ, బోద్ధవ్యమ్ = తెలిసికొనదగినది, హి = ఏలనన, కర్మణః, గతిః = కర్మయొక్క గతి (తత్త్వము), గహనా = అతినిగూఢమైనది

తా. ఇది శాస్త్రోచితకర్మ అనియు, ఇది శాస్త్రవిరుద్ధకర్మ అనియు, ఇది కర్మాభావస్థితి అనియు ఈ మూడు స్థితులను చక్కగా నెరుంగవలెను. 'గహనా కర్మణోగతిః' అనుటచే కర్మస్థితి నెరుంగుట చాల కష్టము.

శ్లో॥ కర్మణ్యకర్మ యః పశ్యేదకర్మణి చ కర్మ యః
స బుద్ధిమాన్ మనుష్యేషు స యుక్తః కృత్స్నకర్మకృత్ 18

యః = ఎవరయితే, కర్మణి = కర్మయందు, అకర్మ పశ్యేత్ = అకర్మను దర్శించునో, యః చ = ఎవరయితే, అకర్మణి = అకర్మయందు, కర్మ = కర్మను (దర్శించునో), సః = అతడు, మనుష్యేషు = మనుష్యులలో, బుద్ధిమాన్ = బుద్ధిశాలి, సః యుక్తః = అట్టి యోగి, కృత్స్న కర్మకృత్ = సమస్త కర్మలను చేయువాడు

తా. కర్మయందు అకర్మను చూచుట, అకర్మయందు కర్మను చూచుట అనునవి ఎవరు తెలిసికొనుచున్నారో, వారే బుద్ధిమంతులు, యోగులు, సర్వ కర్మానుష్ఠాన ఫలమును పొందినవారు అగుచున్నారు. కర్మయందు అకర్మను చూచుట అనగా. . . కర్మ అనగా క్రియ. అకర్మ యనగా క్రియారాహిత్యము. ఈ రెండును అన్యోన్య విరుద్ధమైనవి. కాన కర్మయందకర్మను చూచుటెట్లు? కర్మాకర్మలు రెండును ఒకటే అయిన అట్లు చూచుట సమంజసమగును. అది ఎట్లనగా....

సముద్ర జలమున ఒకభాగము చలించుటచేత అనేక వికారములు అనగా నురుగు, బుడగలు, తరంగములు కలుగును. వేరొక భాగము ప్రశాంతమై యుండును. అయినను అంతయు జలమే యగును. అటులనే సంవిత్ (జ్ఞానము) చలనముచే ... కర్మయు, చలన రాహిత్యముచే, బ్రహ్మపదార్థము అయినది.

*శ్లో: సంవిత్ స్పందరసశ్చైవ దైవ కర్మనరాదయః*
*పర్యాయ శబ్దానపునః పృథక్కర్మాదయః స్థితాః* (యోగవాశిష్ఠం)

చైతన్య స్పందమనురసమే దైవము, కర్మ, మనుష్యులు మొదలగు జగత్తు. ఇవన్నియు చైతన్య స్పందమునకు పర్యాయపదములు. కావున సంవిత్ కంటె దైవకర్మాదులు వేరుకావు. శుభాశుభ కర్మలను చేయుచున్నను, చేయకున్నను మనస్సు వానియందు (ఆ కర్మలందు) లగ్నము కాకుండుటయే అసంగము. ఇదియే అకర్మ అనియు విజ్ఞులు పలుకుచున్నారు. కావున మనస్సు యొక్క చలనమే కర్మ అనియును, మనస్సు యొక్క చలనరాహిత్యమే అకర్మ అనియును నెరుంగవలెను. ఈ రీతిగా అకర్మయందు కర్మను, కర్మయందకర్మను చూచుటకు యుక్తుడు కావలెను. అట్లెరింగిన వాడు సర్వకర్మల ఫలమును పొందువాడగునని భావము.

శ్లో॥ యస్య సర్వే సమారంభాః కామసంకల్పవర్జితాః
జ్ఞానాగ్నిదగ్ధకర్మాణం తమాహుః పండితం బుధాః 19

యస్య సర్వే సమారంభాః = ఎవనియొక్క శాస్త్రసమ్మతములైన కర్మల ప్రారంభమునందే, కామ సంకల్ప వర్జితాః = కామసంకల్ప రహితములై (జరుగునో), జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణం = ఎవనియొక్క కర్మలన్నియును జ్ఞానాగ్నిచే భస్మమగునో, తం = ఆ మహాపురుషుని, బుధాః = జ్ఞానులు, పండితం (ఇతి) = పండితుడని, ఆహుః = అందురు

తా. ఎవని సర్వ ప్రయత్నములు కామరహితములగుచున్నవో వానిని విద్వాంసులు 'జ్ఞానాగ్నిచే దగ్ధమయిన సకల కర్మలుకల పండితు'డని అనుచున్నారు.

శ్లో॥ త్యక్త్వా కర్మఫలాసంగం నిత్యతృప్తో నిరాశ్రయః
కర్మణ్యభిప్రవృత్తోఽపి నైవ కించిత్కరోతి సః 20

కర్మఫలాసంగం = సమస్త కర్మలయందును వాటి ఫలముల యందును ఆసక్తిని, త్యక్త్వా = (సర్వథా) వీడి, నిరాశ్రయః = ప్రాపంచిక ఆశ్రయ రహితుడై, నిత్య తృప్తః = పరమాత్మయందే నిత్య తృప్తిని పొందిన, సః = అట్టి పురుషుడు, కర్మణి = కర్మలయందు, అభిప్రవృత్తః ఇతి = పూర్తిగా ప్రవృత్తుడు అయినప్పటికిని, కించిత్ ఏవ = ఏ కొంచెము గూడ, న కరోతి = వాస్తవముగా చేయువాడు కాడు

తా. కర్తృత్వాభిమానము విడిచి, నిత్యతృప్తుడయి ఎప్పుడును కర్మాభిలాష లేక కర్మలందు ప్రవర్తించినవాడు కర్మను చేయనివాడే యగుచున్నాడు.

శ్లో॥ నిరాశీర్యతచిత్తాత్మా త్యక్తసర్వపరిగ్రహః
శారీరం కేవలం కర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషమ్ 21

యత చిత్తాత్మా = అంతఃకరణమును, శరీరేంద్రియములను జయించిన వాడును, త్యక్త సర్వ పరిగ్రహ = సమస్త భోగసామగ్రిని పరిత్యజించిన వాడును, నిరాశిః = ఆశారహితుడైన వాడును, కేవలమ్ = కేవలము, శారీరమ్ కర్మ = శారీరక కర్మలను, కుర్వన్ = ఆచరించుచును కిల్బిషమ్ = పాపములను, న ఆప్నోతి = పొందడు

తా. కోరికలు లేనివాడును, మనోనిగ్రహము కలవాడును, ప్రాపంచిక విషయములందు అభిమానశూన్యుడు అయినవాడు శరీర పోషణకు ఉపయుక్తమైన కర్మలాచరించినను ఫలముతో ఎట్టి సంబంధము లేనివాడు కనుక పాపదూరుడగును.

వి. యోగి అభ్యాసవశమున శరీరముతో కర్మాచరణ చేయుచున్నను ఆత్మరతుడై యుండునని భావము.

శ్లో॥ యదృచ్ఛాలాభసంతుష్టో ద్వంద్వాతీతో విమత్సరః
సమః సిద్ధావసిద్ధౌ చ కృత్వాపి న నిబధ్యతే 22

యదృచ్ఛాలాభ సంతుష్టః = అప్రయత్నముగా అమరిన లాభములతో, ద్వంద్వాతీతః = హర్షశోకాది ద్వంద్వములకు అతీతుడు, సిద్ధౌ అసిద్ధౌచ = సిద్ధి అసిద్ధులయందును, సమః = సమదృష్టి కలిగియుండువాడు అగు కర్మయోగి, కృత్వా అపి = కర్మలను చేయుచునూ, న నిబధ్యతే = బంధింపబడడు

తా. అయాచితముగా సంప్రాప్తములగు అన్నాదికముచే తృప్తినందుచు, శీతోష్ణాది ద్వంద్వముల సహించినవాడై, యే ప్రాణియందును వైరబుద్ధి లేక సిద్ధ్యసిద్ధులయందు సమభావము చెందియుండు జ్ఞాని కర్మల నాచరించినను, తత్కర్మ ఫలముచే బంధింపబడడు.

శ్లో॥ గత సంగస్య ముక్తస్య జ్ఞానావస్థిత చేతసః
యజ్ఞాయాచరతః కర్మ సమగ్రం ప్రవిలీయతే 23

గత సంగస్య = సర్వథా ఆసక్తి రహితుడును, ముక్తస్య = దేహాభిమానము, మమకారము ఏమాత్రము లేనివాడును, జ్ఞానావస్థిత చేతసః = పరమాత్మ జ్ఞానమునందే నిరంతరము మనస్సును లగ్నము ఒనర్చిన వాడును, యజ్ఞాయ = కేవలము యజ్ఞార్థమే, ఆచరతః = కర్మలను

ఆచరించువాడును అగు పురుషుని యొక్క, సమగ్రం కర్మ = కర్మలన్నియును, ప్రవిలీయతే = విలీనములగును

తా. బ్రహ్మజ్ఞానము నందు చిత్తము కల్గి 'యజ్ఞాయా చరతః కర్మ' అను వాక్యానుసారము వాసుదేవార్పిత బుద్ధితో కర్మలు చేయుచున్న వాని యొక్క కర్మలు పూర్తిగా నాశముచెంది ఫలహేతువులు కాజాలవు.

శ్లో॥ బ్రహ్మార్పణం బ్రహ్మ హవిర్బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతమ్
బ్రహ్మైవ తేన గంతవ్యం బ్రహ్మకర్మ సమాధినా 24

అర్పణం బ్రహ్మ = యజ్ఞకర్మలయందు ఉపయుక్తములగు, స్రువాది సాధనములు బ్రహ్మము హవిః బ్రహ్మ = హోమద్రవ్యము బ్రహ్మము, బ్రాహ్మణా = బ్రహ్మరూప కర్త ద్వారా, బ్రహ్మాగ్నౌ = బ్రహ్మరూపాగ్నియందు, హుతమ్ = హోమము చేయబడినదియు బ్రహ్మము, తేనః బ్రహ్మకర్మ సమాధినా = అట్టి బ్రహ్మరూప కర్మయందు, స్థితుడైన యోగి ద్వారా గంతవ్యమ్ = పొందదగినది (ఫలము) కూడ బ్రహ్మ ఏవ = బ్రహ్మమే

తా. యజ్ఞ పాత్రలు బ్రహ్మమే! హోమ ద్రవ్యము బ్రహ్మమే! వేదిక యందుగల అగ్నియు బ్రహ్మమే. హోమము చేయువాడును బ్రహ్మమే. ఇట్టి బ్రహ్మకర్మల ద్వారా పొందు ఫలముకూడ బ్రహ్మమేనని జ్ఞాని సమాధిభావన చెందును.

శ్లో॥ దైవమేవాపరే యజ్ఞం యోగినః పర్యుపాసతే
బ్రహ్మాగ్నావపరే యజ్ఞం యజ్ఞేనైవోపజుహ్వతి 25

అపరే = ఇతరులు కొందరు, యోగినః = యోగులు, దైవమ్ యజ్ఞమ్ ఏవ = దైవ పూజా యజ్ఞమునే, పర్యుపాసతే = చక్కగా అనుష్ఠింతురు, అపరే = మరికొందరు, బ్రహ్మాగ్నౌ = పరబ్రహ్మ పరమాత్మ రూపాగ్నియందు, యజ్ఞేన ఏవ = అభేద దర్శన రూప యజ్ఞము ద్వారానే, యజ్ఞమ్ ఉప జుహ్వతి = ఆత్మ రూప యజ్ఞమును ఆచరింతురు

తా. కొందరు యోగులు దేవపూజారూప యజ్ఞమునాచరించుచున్నారు. మరి కొందరు జ్ఞానులు బ్రహ్మమను అగ్నియందు పరమార్థముతో గూడిన ఆత్మను హోమము చేయుచున్నారు. అనగా మనస్సు బ్రహ్మమునందుంచుచున్నారు.

శ్లో॥ శ్రోత్రాదీనీంద్రియాణ్యన్యే సంయమాగ్నిషు జుహ్వతి
శబ్దాదీన్విషయానన్యే ఇంద్రియాగ్నిషు జుహ్వతి 26

అన్యే = కొందరు యోగులు, శ్రోత్రాదీని ఇంద్రియాణి = శ్రోత్రాది సమస్త ఇంద్రియములను, సంయమాగ్నిషు = సంయమన రూపాగ్నులందు, జుహ్వతి = హోమము చేయుదురు, అన్యే = మరికొందరు యోగులు, శబ్దాదీన్, విషయాన్ ఇంద్రియాగ్నిషు = శబ్దాది సమస్త విషయములను, ఇంద్రియ రూపాగ్నులయందు, జుహ్వతి = హవనము చేయుదురు

తా. కొందరు శ్రోత్రాది ఇంద్రియములను సంయమమను అగ్నియందు హోమముజేసి నశింపజేయుచున్నారు. మరికొందరు ఇంద్రియములను అగ్నియందు శబ్దాది విషయములను హోమముచేసి నశింప జేయుచున్నారు.

శ్లో॥ సర్వాణీంద్రియకర్మాణి ప్రాణకర్మాణి చాపరే
ఆత్మసంయమయోగాగ్నౌ జుహ్వతి జ్ఞానదీపితే 27

అపరే = మరికొందరు యోగులు, సర్వాణి ఇంద్రియ కర్మాణి = ఇంద్రియ కర్మలను అన్నింటిని, చ = మరికొందరు, ప్రాణకర్మాణి = ప్రాణక్రియలను అన్నింటిని, జ్ఞానదీపితే = ప్రాణముచే ప్రకాశితమైన, ఆత్మ సంయమ యోగాగ్నౌ = ఆత్మ సంయమ యోగరూపాగ్నియందు జుహ్వతి = హవనము చేయుచుందురు.

తా. కొందరు సర్వ జ్ఞానేంద్రియ కర్మలను, శబ్దాది విషయములను ప్రాణవాయు నిరోధము ద్వారా ఇంద్రియ నిగ్రహమనెడి జ్ఞానాగ్నియందు హోమము చేయుచున్నారు.

*శ్లో॥ యథా పర్వతధాతూనాం దహ్యంతే దహనాన్మలాః*
*తథేంద్రియకృతా దోషా దహ్యంతే ప్రాణ నిగ్రహాత్* *(యోగవాశిష్ఠం)*

ఏ ప్రకారము పర్వతమందుగల మాలిన్యము అగ్నిచే దహింపబడి నశించుచున్నదో అట్లే ఇంద్రియ కృతదోషములన్నియు ప్రాణవాయు నిరోధముచే దహింపబడుచున్నవి. తరువాత జ్ఞానోత్పత్తి కలుగును.

శ్లో॥ ద్రవ్యయజ్ఞాస్తపోయజ్ఞా యోగయజ్ఞాస్తథాపరే
స్వాధ్యాయజ్ఞానయజ్ఞాశ్చ యతయః సంశితవ్రతాః 28

అపరే = కొందరు, ద్రవ్యయజ్ఞాః = ద్రవ్య సంబంధ యజ్ఞములను, తపోయజ్ఞాః =

(కొందరు) తపోరూప యజ్ఞములను, తథా = అట్లే, యోగయజ్ఞాః = (కొందరు) యోగరూప యజ్ఞములను, చ = మరియు, సంశితవ్రతాః = అహింసాది తీక్ష్ణ వ్రతములను చేపట్టిన, యతః = యత్నశీలురైనవారు, స్వాధ్యాయజ్ఞాన యజ్ఞాః = స్వాధ్యాయరూప జ్ఞానయజ్ఞములను ఆచరింతురు.

తా. కొందరు పుణ్యక్షేత్రాదులందు సత్పాత్రదానమనెడు యజ్ఞమును ఆచరించుచున్నారు. మరికొందరు కృచ్ఛ్ర చాంద్రాయణాది తపములనెడి యజ్ఞములాచరించుచున్నారు. మరికొందరు యమనియమాది అష్టాంగయోగ యజ్ఞమునాచరించుచున్నారు. కొందరు వేదపారాయణాది స్వాధ్యాయ యజ్ఞములు చేయుచున్నారు. మరికొందరు సమస్తము వాసుదేవమయాభ్యాస జ్ఞానయజ్ఞమాచరించుచున్నారు. ఇట్లు ఇంద్రియ నిగ్రహము ద్వారా తపోనియమములను పాటించువారలై యున్నారు.

శ్లో॥ అపానే జుహ్వతి ప్రాణం ప్రాణేஉపానం తథాపరే
ప్రాణాపాన గతీరుద్ధ్వా ప్రాణాయామ పరాయణాః 29

శ్లో॥ అపరే నియతాహారాః ప్రాణాన్ ప్రాణేషు జుహ్వతి
సర్వేஉప్యేతే యజ్ఞవిదో యజ్ఞక్షపితకల్మషాః 30

అపరే = కొందరు యోగులు, అపానే = అపాన వాయువునందు, ప్రాణమ్ = ప్రాణవాయువును. జుహ్వతి = హోమము చేయుదురు, తథా = అట్లే మరికొందరు యోగులు, ప్రాణే = ప్రాణవాయువు నందు, అపానమ్ = అపానవాయువును (హవనము చేయుదురు), అపరే = మరికొందరు, నియతాహారాః = నియమిత ఆహారనిష్ఠితులై, ప్రాణాయామ పరాయణాః = ప్రాణాయామ పరాయణులైన వారు, ప్రాణాపాన గతీ = ప్రాణాపాన గమనములను, రుద్ధ్వా = నిలిపి, ప్రాణాన్ = ప్రాణములను, ప్రాణేషు = ప్రాణముల యందు, జుహ్వతి = హోమము చేయుదురు, ఏతే యజ్ఞవిదః = యజ్ఞవిదులైన ఈ సాధకులు, సర్వే అపి = అందరునూ, యజ్ఞక్షపిత కల్మషాః = యజ్ఞముల ద్వారా పాపములను రూపుమాపినవారు

తా. కొందరు అపాన వాయువునందు ప్రాణవాయువును, ప్రాణ వాయువునందు అపాన వాయువును వ్రేల్చుచు ప్రాణ, అపాన వాయువులను నిరోధించి ప్రాణాయామము ఆచరించుచున్నారు. ప్రాణాయామము వలన శరీరశుద్ధియు, చిత్తశుద్ధియు కలుగును. మరికొందరు నియతాహార పరులై వాయు విశేషములను వశీకృత ప్రాణవాయువునందు వ్రేల్చుచున్నారు. ఇట్లు యజ్ఞముల నెరిగినవారు ఇట్టి యజ్ఞములద్వారా తమ పాపములను నశింప జేసికొనుచున్నారు.

శ్లో॥ యజ్ఞశిష్టాऽమృతభుజో యాంతి బ్రహ్మ సనాతనమ్
నాయం లోకోऽస్త్యయజ్ఞస్య కుతోऽన్యః కురుసత్తమ 31

కురుసత్తమ! = కురుశ్రేష్ఠుడవైన ఓ అర్జునా!, యజ్ఞ శిష్టామృత భుజః = యజ్ఞపూతశేషమైన అమృతమును అనుభవించు యోగులు, సనాతనమ్ = సనాతనుడైన, బ్రహ్మ = పరబ్రహ్మమును యాంతి = పొందుచున్నారు, అయజ్ఞస్య = యజ్ఞము చేయనివానికి, అయమ్, లోకః, న, అస్తి = ఈ లోకమే సుఖప్రదము కాదు, అన్యః = (ఇంక) పరలోక (విషయ) ము, కుతః = ఎట్లు?(ఎక్కడిది?)

తా. ఓ కురుకులోత్తమా! ఇట్లు యజ్ఞాచరణము ద్వారా యజ్ఞశేషామృతమును భుజించువారు సనాతనమైన బ్రహ్మమును పొందుదురు. ఈ యజ్ఞములనెరుంగక ఆచరింపక యున్నవారికి ఈ లోకమున సుఖము కలుగదు. పరలోక ప్రాప్తియు నుండదు. యజ్ఞావశేషమును భుజించుట ద్వారా సనాతన బ్రహ్మమును పొందుదురనగా యోగయజ్ఞముచే జనించు జ్ఞానామృతమును భుజించువారని అర్థము.

శ్లో॥ ఏవం బహువిధా యజ్ఞా వితతా బ్రహ్మణో ముఖే
కర్మజాన్విద్ధి తాన్ సర్వానేవం జ్ఞాత్వా విమోక్ష్యసే 32

ఏవమ్ = ఇట్లు, బహువిధాః = బహువిధములైన, యజ్ఞాః = యజ్ఞములు, బ్రహ్మణః, ముఖే = వేదము(ల) ద్వారా, వితతాః = విశదపఱచబడినవి, తాన్, సర్వాన్ = అవియన్నియు, కర్మజాన్ = మనోవాక్కాయ కర్మల ద్వారా సుసంపన్నమగునని, విద్ధి = తెలిసికొనుము, ఏవమ్, జ్ఞాత్వా = ఇట్లు తెలిసికొని, విమోక్ష్యసే = విముక్తుడవయ్యెదవు

తా. ఈ ప్రకారముగా నానా విధములైన యజ్ఞములు వేదములందు విస్తారముగా చెప్పబడినవి. సమస్త యజ్ఞములును కర్మలవలన నేర్పడినవి. ఇట్లు తెలిసిన వానికి కర్మ బంధమునుండి మోక్షము కలుగును.

శ్లో॥ శ్రేయాన్ ద్రవ్యమయాద్యజ్ఞాత్ జ్ఞానయజ్ఞః పరంతప
సర్వం కర్మాऽఖిలం పార్థ జ్ఞానే పరిసమాప్యతే 33

పరంతప! పార్థ! = ఓ పరంతపా! ఓ పార్థా!, ద్రవ్యమయాత్ = ద్రవ్యములతో ఆచరింపబడు, యజ్ఞాత్ = యజ్ఞము కంటెను, జ్ఞానయజ్ఞః = జ్ఞానయజ్ఞము, శ్రేయాన్ = మిక్కిలి శ్రేష్ఠమైనది, అఖిలమ్, సర్వమ్, కర్మ = కర్మలన్నియును, జ్ఞానే = జ్ఞానమునందు, పరిసమాప్యతే = పరిసమాప్తమగును.

తా. శత్రుతాపనా! ద్రవ్యసాధ్యములగు నానావిధ యజ్ఞములకంటె జ్ఞాన స్వరూపమగు ఆత్మయజ్ఞము శ్రేయస్కరమయినది. సర్వకర్మలు ఆత్మ జ్ఞానమునందు అంతర్భూతములు.

వి. *"సర్వం పదం హస్తిపదే నిమగ్నం"* *(శృతి)*

అన్ని జంతువుల పాదములు ఏనుగు పాద చిహ్నము నందు ఇమిడియుండునట్లు, ద్రవ్య యజ్ఞములన్నియునూ, అనగా మనశ్చలనముచే చేయు క్రియలన్నియూ, నిశ్చల మనోస్థితి యందు అనగా జ్ఞానమునందు ఇమడి యుండునని అర్థము.

శ్లో॥ తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా
ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానినస్తత్త్వదర్శినః 34

తత్త్వదర్శినః = పరమాత్మ తత్త్వమును ఎఱింగిన (అనుభవ జ్ఞానము గలవారు), జ్ఞానినః = జ్ఞానులు (శాస్త్ర జ్ఞానమునెరిగినవారు), జ్ఞానమ్ = తత్త్వ జ్ఞానమును, తే = నీకు, ఉపదేక్ష్యంతి = ఉపదేశించెదరు, ప్రణిపాతేన = (వారికి) దండ ప్రణామములను ఆచరించుట ద్వారా, సేవయా = సేవలొనర్చుట ద్వారా, పరిప్రశ్నేన = వినయముతో ప్రశ్నించుట వలన (సందర్భోచిత ప్రశ్నల ద్వారా), తత్ = ఆ తత్త్వ జ్ఞానమును, విద్ధి = (నీవు) తెలిసికొనుము.

తా. ఇట్టి బ్రహ్మజ్ఞానమును, తత్త్వవేత్తలగు జ్ఞానులనాశ్రయించి, వారికి సాష్టాంగ నమస్కారములొనరించి, సేవచేయుట ద్వారా సమయమెరిగి ప్రశ్నించుటచే వారు నీకు ఉపదేశించుదురు.

శ్లో॥ యజ్ఞాత్వా న పునర్మోహమేవం యాస్యసి పాండవ
యేన భూతాన్యశేషేణ ద్రక్ష్యస్యాత్మన్యథోమయి 35

పాండవా = ఓ అర్జునా!, యత్ జ్ఞాత్వా = దేనిని తెలిసికొని, పునః = మరల, ఏవమ్ మోహమ్ = ఇట్టి మోహమును, న యాస్యసి = పొందవో, యేన = ఎట్టి జ్ఞాన ప్రభావము చేత, భూతాని = సమస్త భూతములను, అశేషేణ = నిశ్శేషముగా, ఆత్మని = (మొదట) నీ ఆత్మయందును (పిండాండము నందు), అథో = పిమ్మట, మయి = పరమాత్మనైన నా యందును (బ్రహ్మాండము నందు), ద్రక్ష్యసి = చూడగలవో (దానిని ఎరుంగుము)

తా. ఓ పాండునందనా! ఏది తెలిసికొనుటచే మరల మాయామోహితుడగుటకు వీలుకలుగదో, ఏ జ్ఞానముచే ప్రాణికోటిని నీయందు చూచి, పరమేశ్వరుడను, మాయాధీశుడను అగు నాయందును చూచి సర్వమును వాసుదేవమయముగా గ్రహించగలవో ఆ జ్ఞానమును తత్త్వవిదులగు మహాత్ములు ఉపదేశించుదురు.

శ్లో॥ అపి చేదసి పాపేభ్యః సర్వేభ్యః పాపకృత్తమః
సర్వం జ్ఞానప్లవేనైవ వృజినం సం తరిష్యసి 36

(త్వమ్) = నీవు, సర్వేభ్యః, పాపేభ్యః అపి = పాపులందరి కంటెను, పాపకృత్తమః, అసి, చేత్ = అధికముగ పాపములను చేసినవాడవైనచో, జ్ఞాన ప్లవేన, ఏవ = జ్ఞానమనెడి నౌక ద్వారా, సర్వమ్, వృజినమ్ = సమస్త పాప సముద్రమును, సంతరిష్యసి = పూర్తిగా దాటగలవు

తా. పాపాత్ములందరికంటె మహా పాపవర్తనుడవైనను, అటువంటి సర్వవిధ పాపములను, సర్వము బ్రహ్మమయమను జ్ఞానముచేతనే తరించగలవు. ఇచ్చట సకల పాపములు జ్ఞానమను తెప్పచే తరింపవచ్చునని యున్నది. *'యేషాం త్వంతగతం పాపం జనానాం పుణ్యకర్మణాం'* అను గీతావాక్యమున పుణ్య కర్మల ఫలము పాపనాశమని, ద్వంద్వ రాహిత్యమని, తద్వారా వ్యవసాయాత్మికయైన బుద్ధి జనించి యోగనిష్ఠాపరులై ఆత్మ స్వరూపుడనగు నన్ను భజింతురనియు చెప్పబడినది. ఈ శ్లోకమున సర్వ పాపములు జ్ఞానము చేతనే నశించునని చెప్పబడినది. ఇచ్చట పరస్పర విరుద్ధములగు జ్ఞాన కర్మలకు ఒకే ఫలము చెప్పిరి. శాస్త్రములలో కర్మత్యాగము వలన శాంతి కలుగునని యుండగా ఇచ్చట పుణ్యకర్మల వలన పాపనాశమగునని చెప్పబడుటచే పుణ్య కర్మయనగా నివృత్తి జనకమైన యోగ కర్మయని అర్థము గ్రాహ్యము.

*శ్లో॥ యోగాత్ సంజాయతే జ్ఞానం జ్ఞానాత్ యోగః ప్రవర్తతే (త్రిశిఖి బ్రాహ్మణోపనిషత్)*

ఇట్లు బోధించుటవలన సాధకునకు యోగజ్ఞానములు రెండును ప్రధానములై యున్నవి.

*శ్లో॥ యత్సాంఖ్యైః ప్రాప్యతే స్థానం, తద్యోగై రపి గమ్యతే*
*ఏకం సాంఖ్యంచ యోగంచ యః పశ్యతి స పశ్యతి (5-5)*

అనుటచే యోగ జ్ఞానములు మోక్షమునీయగలుగుటలో సంశయములేదు.

శ్లో॥ యథైధాంసి సమిద్ధోఽగ్నిః భస్మసాత్కురుతేఽర్జున
జ్ఞానాగ్నిః సర్వకర్మాణి భస్మసాత్కురుతే తథా 37

అర్జునా = ఓ అర్జునా!, యథా = ఎట్లైతే, సమిద్ధః, అగ్నిః = ప్రజ్వలించుచున్న అగ్ని, ఏధాంసి = ఇంధనములను, భస్మసాత్, కురుతే = భస్మమొనర్చునో, తథా = అట్లే, జ్ఞానాగ్నిః = జ్ఞానమనెడి అగ్ని, సర్వ కర్మాణి = కర్మలను అన్నింటిని, భస్మసాత్ కురుతే = భస్మమొనరించును

తా. బాగుగా ప్రజ్వలించు అగ్ని, కట్టెలనన్నిటిని భస్మము చేయునటుల నిశ్చలమగు జ్ఞానాగ్ని శుభాశుభ కర్మలనన్నిటిని భస్మము చేయును.

శ్లో॥ న హి జ్ఞానేన సదృశం పవిత్రమిహ విద్యతే
తత్స్వయం యోగసంసిద్ధః కాలేనాత్మని విందతి 38

ఇహ = ఈ జగత్తునందు, జ్ఞానేన సదృశం = జ్ఞానముతో సమానముగ, పవిత్రమ్ = పవిత్రమైనది, హి = నిస్సందేహముగ, న విద్యతే = (ఏదియును) లేదు, తత్ = ఆ జ్ఞానమను, కాలేన = దీర్ఘ కాలము వరకును, యోగ సంసిద్ధః = యోగము ద్వారా శుద్ధాంతఃకరణము గలవాడు, స్వయమ్ = స్వయముగానే, ఆత్మని = ఆత్మయందు, విందతి = పొందును

తా. జ్ఞానమువంటి పవిత్రమైన వస్తువు మరొకటిలేదు. అట్టి జ్ఞానము యోగనిష్ఠచే స్వయముగా తనయందే కలుగును. *'యోగాత్సంజాయతే జ్ఞానం'* అను త్రిశిఖి బ్రాహ్మణోపనిషత్ వాక్యము ఈ భావమునే చెప్పుచున్నది. త్వమేవాహం, అహమేవత్వం అను జీవేశ్వర అభేద జ్ఞానము కలుగును. సోఽ హంభావమేర్పడునని భావము.

వి. ఇంతకు పూర్వము చెప్పిన ద్రవ్యమయ యజ్ఞములలో యోగయజ్ఞము కూడ చెప్పబడియున్నది. మరల యోగము ద్వారానే జ్ఞానమును పొందవలెనని చెప్పుటలో అవియన్నియు అభ్యాస క్రియలనియు, ఇచ్చట యోగమనగా యోగారూఢస్థితియనియు గ్రహించనగును.

శ్లో *ఆరురుక్షోర్మునేర్యోగం కర్మకారణముచ్యతే*
*యోగారూఢస్యతస్యైవ శమ కారణముచ్యతే* *(6–3)*

మోక్షము కోరువారికి యోగకర్మ తప్పనిసరి. యోగారూఢ స్థితిని జేరువారు జ్ఞానమును పొందుదురు. కనుక యోగోపశమము చేయుదురు.

శ్లో॥ శ్రద్ధావాన్ లభతే జ్ఞానం తత్పరస్సంయతేంద్రియః
జ్ఞానం లబ్ధ్వా పరం శాంతిమచిరేణాధిగచ్ఛతి 39

సంయతేంద్రియః = జితేంద్రియుడు, తత్పరః = సాధనా పరాయణుడు, శ్రద్ధావాన్ = శ్రద్ధగలవాడు, జ్ఞానమ్ = ఈ తత్త్వజ్ఞానమును, లభతే = పొందును, జ్ఞానమ్, లబ్ధ్వా = (ఈ) జ్ఞానమును పొంది, అచిరేణ = తత్ క్షణముననే, పరామ్, శాంతిమ్ = పరమశాంతిని, అధిగచ్ఛతి = పొందును

తా. శ్రద్ధయనగా గురుశాస్త్రవచనములయందు అత్యంత విశ్వాసము. గురూపదేశమును శ్రద్ధతో అనుష్ఠించుచు జ్ఞానసిద్ధియందు తత్పరతతో ఇంద్రియ నిగ్రహము కలిగి ఉన్న, జ్ఞానలాభము కలుగును. *'సత్త్వాత్ సంజాయతే జ్ఞానం' (14–17)* సత్త్వగుణ లక్షణము జ్ఞానము. శుద్ధమగు

మనస్సుకు సత్త్వ మనిపేరు. *'ప్రబుద్ధం సత్త్వముచ్యతే'* జ్ఞానము కలిగిన మనస్సుకు సత్త్వమనిపేరు. అట్టి మనస్సున జ్ఞానమే ప్రకాశించును. జ్ఞానలాభముచే అచిరకాలమున చిత్తోపరతి కలిగి పరమశాంతి లభించును.

శ్లో॥ అజ్ఞశ్చాశ్రద్దధానశ్చ సంశయాత్మా వినశ్యతి
నాయం లోకో౽స్తి న పరో న సుఖం సంశయాత్మనః 40

అజ్ఞః = వివేక హీనుడును, చ = మరియు, అశ్రద్దధానః = శ్రద్ధారహితుడు, సంశయాత్మా = సంశయగ్రస్తుడైనవాడు, వినశ్యతి = భ్రష్టుడై నశించును, సంశయాత్మనః = సంశయాత్మునకు, అయమ్, లోకః = ఈ లోకము, న, అస్తి = ఉండదు, న, పరః, చ = పరలోకమూ ఉండదు, న, సుఖమ్ = సుఖమూ ఉండదు

తా. అజ్ఞుడును, శ్రద్ధాసక్తి రహితుడును, ఆత్మోపరతి కలుగునో లేదో యను సంశయము కలవాడును చెడిపోవుదురు. సంశయాత్మునకు ఇహమందేకాక పరలోకమందును సుఖము కలుగదు.

శ్లో॥ యోగసన్న్యస్తకర్మాణం జ్ఞానసంఛిన్న సంశయమ్
ఆత్మవంతమ్ న కర్మాణి నిబధ్నంతి ధనంజయ 41

ధనంజయ = ఓ ధనంజయా! అర్జునా!, యోగసన్న్యస్త కర్మాణం = యోగముచే నైష్కర్మ్య సిద్ధి, జ్ఞానసంఛిన్నసంశయమ్ = వివేకము ద్వారా సంశయములను, అన్నింటినీ తొలగించుకొనిన వాడును, ఆత్మవంతమ్ = అంతఃకరణమును వశమునందు ఉంచుకొనినవాడును అగువాడిని, కర్మాణి = కర్మలు, న, నిబధ్నంతి = ఏమాత్రము బంధింపవు,

తా. యోగముచే నైష్కర్మ్యసిద్ధి కలుగగా బ్రహ్మజ్ఞానముచే సంశయములు తీరును. అట్టి యోగి బుద్ధి బ్రహ్మయందు స్థిరమై పుణ్యపాప కర్మలవలన కలుగు ఫలము నుండి తప్పించుకొనును. కర్మలు వానిని బంధించజాలవు. నైష్కర్మ్యసిద్ధి యోగము ద్వారా కలుగును. రజోగుణము, కర్మలందు ఫలాపేక్షచే సంగము కలిగించును. *'ఉపైతి శాంతరజసం'* అను గీతావాక్యముచే యోగబలముచే రజోగుణము శాంతమై తత్ఫలముగా నైష్కర్మ్య భావమేర్పడును. *'ప్రశాంత మనసం హ్యేనం యోగినం సుఖముత్తమమ్'* అను గీతావాక్యము కూడా పై భావమునే వ్యక్తము చేయును.

శ్లో॥ తస్మాదజ్ఞానసంభూతం హృత్స్థం జ్ఞానాసినాత్మనః
ఛిత్త్వైనం సంశయం యోగమాతిష్ఠోత్తిష్ఠ భారత 42

తస్మాత్ = అందువలన, భారత = ఓ అర్జునా!, హృత్స్థమ్ = (నీ) హృదయమునందున్న, ఏనమ్, అజ్ఞాన సంభూతమ్ = ఈ అజ్ఞాన జనితమైన, ఆత్మనః, సంశయమ్ = నీ సంశయమును, జ్ఞానాసినా = వివేకమనెడి ఖడ్గముచే, ఛిత్త్వా = ఛేదించి, యోగమ్ = సమత్వరూప యోగమునందు, ఆతిష్ఠ = స్థితుడవు కమ్ము, ఉత్తిష్ఠ = (యుద్ధమునకై) లెమ్ము.

తా. ఓ అర్జునా! ఆ కారణముచే అజ్ఞాన మూలమున నీకు కలిగిన సంశయమును జ్ఞానమనెడి కత్తిచే తెగగొట్టి యోగనిష్ఠాపరుడవగుము. లెమ్ము.

ఇట్లు
శ్రీ పరమహంస పరివ్రాజకాచార్యులును,
బ్రహ్మర్షి సద్గురు **శ్రీశ్రీశ్రీ శివానంద** భగవత్పూజ్యపాద శిష్యులును నైన
బ్రహ్మర్షి సద్గురు **శ్రీశ్రీశ్రీ స్వామి రామానంద పరమహంస** వారిచే
రచింపబడిన గీతామృతమను టీక యందు
జ్ఞానయోగమను చతుర్థాధ్యాయము సమాప్తము.

ఓం శ్రీకృష్ణ పరమాత్మనే నమః

పంచమాధ్యాయము

# కర్మ సన్న్యాస యోగము

**అర్జున ఉవాచ**

శ్లో॥ సన్న్యాసం కర్మణాం కృష్ణ పునర్యోగం చ శంససి
యచ్ఛ్రేయ ఏతయోరేకం తన్మే బ్రూహి సు నిశ్చితమ్ 1

కృష్ణ = ఓ కృష్ణా!, కర్మణామ్, సన్న్యాసమ్ = (ఒకసారి) కర్మసన్న్యాసమును, పునః = మరియొకసారి, యోగమ్ చ = యోగమునూ (యోగకర్మను), శంససి = ప్రశంసించుచున్నావు, ఏతయోః = ఈ రెండింటిలో, యత్ = ఏది, సునిశ్చితమ్ = నిశ్చయముగా, మే, శ్రేయః = నాకు శ్రేయస్కరమో, తత్, ఏకమ్ = ఆ ఒక్కదానిని, బ్రూహి = తెలుపుము.

తా. ఓ కృష్ణా! సర్వకర్మలను విడిచి పెట్టుమనియును, మరల యోగము నాచరించవలెననియు చెప్పుచున్నావు. ఈ రెండు మార్గములలో నేది శ్రేయస్సును కలిగించునో దానిని నాకు లెస్సగా నిశ్చయించి చెప్పుము.

**శ్రీ భగవానువాచ:**

శ్లో॥ సంన్యాసః కర్మయోగశ్చ నిః శ్రేయస కరావుభౌ
తయోస్తు కర్మ సంన్యాసాత్కర్మయోగో విశిష్యతే 2

సన్న్యాసః = సన్న్యాసము, చ = మరియు, కర్మయోగః = కర్మయోగము, ఉభౌ = (అను) ఈ రెండును, నిః శ్రేయసకరౌ = పరమశ్రేయస్సును గూర్చునవియే, తు = అయితే, తయోః = ఆ రెండింటిలో, కర్మసన్న్యాసాత్ = కర్మ సన్న్యాసము కంటెను, కర్మయోగః = (సాధన సులభమైన) కర్మయోగము, విశిష్యతే = శ్రేష్ఠమైనది

తా. సంన్యాసము, కర్మయోగము ఈ రెండును మోక్షమును కలుగజేయును. ఈ రెంటిలో యోగరహితమగు కర్మ సంన్యాసము కంటె, యోగ రూపమగు కర్మ అనగా నిష్కామకర్మయోగము ఉత్తమమైనది.

వి. కర్మయోగమనగా. . .

*శ్లో॥ బంధనం మనసో నిత్యం కర్మయోగస్స ఉచ్యతే (త్రిశిఖి బ్రాహ్మణోపనిషత్-18)*

*శ్లో॥ యత్తు చిత్తస్య సతతం అర్థే శ్రేయసి బంధనం*
*జ్ఞానయోగః స విజ్ఞేయః సర్వసిద్ధి కరశ్శివః (త్రిశిఖి బ్రాహ్మణోపనిషత్-19)*

శ్రేయోదాయకమగు యోగమున మనస్సును సదా రమించునట్లు చేయుటకు కర్మయోగమనియు, యోగనిష్ఠవలన కలుగు **'వాసుదేవస్సర్వం'** అను జ్ఞానము సర్వసిద్ధికరమైన జ్ఞానయోగమను పేరను బరగుచున్నవి. ఇంద్రియ నిగ్రహము లేని సన్న్యాసము కంటె చిత్తవృత్తి నిరోధ జనకమగు కర్మయోగము శ్రేయఃప్రదమగును. చలనముగల మనశ్శక్తియే కర్మయగుచున్నది. కాన మనస్సు నిశ్చలమైన స్వస్థానమున నిర్విషయ స్థితియందు నిలుపుట నివృత్తిని కలిగించు కర్మ. ఇదియే కర్మయోగము.

శ్లో॥ జ్ఞేయస్స నిత్య సంన్యాసీ యోనద్వేష్టి న కాంక్షతి
నిర్ద్వంద్వో హి మహాబాహో సుఖం బంధాత్ప్రముచ్యతే 3

మహాబాహో = ఓ అర్జునా!, యః = ఎవడైతే, న, ద్వేష్టి = (ఎవరినీ) ద్వేషింపడో, న, కాంక్షతి = (దేనినీ) ఆశింపడో, సః అట్టి కర్మయోగి, నిత్య సన్న్యాసీ = సదా సన్న్యాసిగా, జ్ఞేయః = తెలిసికొనదగినవాడు, హి = ఏలనన, నిర్ద్వంద్వః = రాగద్వేషాది ద్వంద్వ రహితుడు, సుఖమ్ = సుఖముగ, బంధాత్ = సంసార బంధముల నుండి, ప్రముచ్యతే = ముక్తుడగును.

తా. మహాబాహువగు ఓ అర్జునా! ఇచ్ఛాద్వేషములు రజోగుణ దోషములు. రాగద్వేషాది ద్వంద్వరహితుడగువాడు సన్న్యాసియని తెలియుము. రజోగుణ దోషములు తొలగుటకు బుద్ధియోగమను సిద్ధిని బడయుట తప్ప మార్గాంతరము లేదు.

శ్లో॥ సాంఖ్యయోగౌ పృథక్ బాలాః ప్రవదంతి న పండితాః
ఏకమప్యాస్థితః సమ్యక్ ఉభయోర్విందతే ఫలమ్ 4

బాలాః = మూర్ఖులు, సాంఖ్యయోగౌ = సన్న్యాసయోగము, కర్మయోగము, పృథక్ = వేర్వేరు ఫలములను ఇచ్చునవిగా, ప్రవదంతి = చెప్పుచుందురు, న, పండితాః = పండితులు అట్లు చెప్పరు, (హి) = ఎందుకనగా, ఏకమ్, అపి = ఆ రెండింటిలో ఏ ఒక్కదానియందైనను, సమ్యక్, ఆస్థితః = బాగుగా స్థితుడైనవాడు, ఉభయోః, ఫలమ్ = రెండింటి ఫలమగు పరమాత్మను, విందతే = పొందును

తా. జ్ఞానయోగమువేరు, కర్మయోగము వేరు అని బాలురందురు కాని వివేకవంతులనరు. జ్ఞాన యోగమార్గముల రెండింటిలో ఏయొక్క మార్గమును చక్కగా అనుష్ఠించినను పరమపదప్రాప్తి రూపమైన ఫలమును పొందుదురు.

శ్లో॥ యత్సాంఖ్యైః ప్రాప్యతే స్థానం తద్యోగై రపి గమ్యతే
ఏకం సాంఖ్యంచ యోగంచ యః పశ్యతి స పశ్యతి 5

యత్, స్థానమ్ = ఏ పరంధామము, సాంఖ్యైః = జ్ఞానయోగుల చేత, ప్రాప్యతే = పొందబడునో, తత్ = ఆ స్థానము, యోగైః, అపి = కర్మయోగుల చేతను, గమ్యతే = పొందబడును, యః = ఏ పురుషుడు, సాంఖ్యమ్ = జ్ఞానయోగమును, చ = మరియు, యోగమ్ = కర్మయోగమును, ఏకమ్ = ఫలవిషయమున ఒక్కదానినిగా, పశ్యతి = చూచునో, సః, చ = అతడే, పశ్యతి = నిజముగా చూచువాడు (నిజమైన ద్రష్ట)

తా. జ్ఞానయోగమాశ్రయించి యే స్థానము పొందనగునో ఆ స్థానమే యోగానుష్ఠానముచే కూడ పొందనగును.

*శ్లో॥ యత్ ప్రాణాపానయోరైక్యం స్వరజో రేతసస్తథా*
*సూర్యచంద్రమసోరైక్యం జీవాత్మ పరమాత్మనో*
*ఏవం హి ద్వంద్వ జాలస్య సంయోగో యోగ ఉచ్యతే* *(యోగశిఖోపనిషత్1-12)*

ప్రాణాపానముల ఐక్యమే రజోరేతస్సుల ఐక్యము. అట్లే సూర్యచంద్రుల ఐక్యము, జీవాత్మ పరమాత్మల ఐక్యము. ఈ విధముగా ద్వంద్వముల సంయోగమునకు యోగమని వ్యవహారము. అనగా జీవాత్మ పరమాత్మలకు అభేదమే కాని భేదమెన్నటికిని లేదను జ్ఞానము యోగమున అనుభవసిద్ధమగును. ఈ లక్షణము కలిగియున్న యోగమునకును, సాంఖ్యయోగమునకు భేదము లేదని గ్రహించుట యుక్తము. కావున జ్ఞానయోగమునకును యోగమునకును భేదమెన్నక యొకటిగా భావించువాడు సత్యము నెరిగిన వాడగును.

శ్లో॥ సన్న్యాసస్తు మహాబాహో దుఃఖ మాప్తు మయోగతః
యోగ యుక్తో మునిర్బ్రహ్మ నచిరేణాధి గచ్ఛతి 6

తు = అయితే, మహాబాహో = ఓ మహాబాహూ!, అయోగతః = కర్మయోగమును అనుష్ఠింపక, సన్న్యాసః = సన్న్యాసము (శరీరేంద్రియ మనస్సుల ద్వారా జరుగు, కర్మలన్నింటియందును కర్తృత్వమును త్యజించుట), ఆప్తుమ్ = పొందుట, దుఃఖమ్ = కష్టము, మునిః = భగవత్ స్వరూపమును మననము చేయు, యోగయుక్తః = యోగయుక్తుడైనవాడు, బ్రహ్మ = పరబ్రహ్మ పరమాత్మను, నచిరేణ = శీఘ్రముగా, అధిగచ్ఛతి = పొందును

తా. ఓ అర్జునా! యోగమభ్యసించి సమభావమును పొంది కర్మలను సన్న్యసించినవాడు అచిరకాలమున ఆత్మనిష్ఠకలవాడై బ్రహ్మపదము పొందును. యుక్తుడగువాడు సన్న్యాసమున కర్హుడనియు, యుక్తుడుకాక కర్మసన్న్యాసము చేసిన దుఃఖ భాజనుడగుననియు భావము.

వి. పరమపదము యోగగమ్యము. యుక్తుడుకాక కర్మలను సన్న్యసించిన దుఃఖమే కలుగును. 'సమ్యక్ న్యాసః సన్న్యాసః' అనగా బుద్ధిని ఆత్మయందు స్థిరముగా బాదుకొనునట్లు చేయుట. రజోగుణ దోషములు నశించిననే సన్న్యాసము సాధ్యము. యోగానుష్ఠాన బలమున రజోగుణనాశానంతరము మనస్సు ఆత్మయందు నిశ్చలము కాగలదు. అట్టి యోగియే అచిర కాలములో బ్రహ్మపదమును పొందును.

శ్లో॥ యోగ యుక్తో విశుద్ధాత్మా విజితాత్మా జితేంద్రియః
సర్వభూతాత్మ భూతాత్మా కుర్వన్నపి న లిప్యతే 7

విజితాత్మా = మనస్సును వశమునందుంచుకొనిన వాడును, జితేంద్రియః = జితేంద్రియుడును, విశుద్ధాత్మా = అంతఃకరణశుద్ధి కలవాడును, సర్వ భూతాత్మ, భూతాత్మా = సర్వ ప్రాణులలో ఆత్మ స్వరూపుడైన పరమాత్మను, తన ఆత్మగా కలవాడునగు, యోగయుక్తః = యోగసాధన చేయువాడు, కుర్వన్, అపి = కర్మలను ఆచరించుచున్నను, న, లిప్యతే = ఆ కర్మలు వానిని అంటవు

తా. యోగమునవలంబించి నిర్మలాంతఃకరణుండయి ఇంద్రియ నిగ్రహము కలవాడు సర్వభూతాత్మయగు పరమాత్మను తన ఆత్మగా తెలిసికొనును. అట్టివాడు కర్మల నాచరించినను వాని ఫలమునొందడు. ఆ విధమున నైష్కర్మ్య సిద్ధిని బడసిన మహాయోగి దేనిని చూచినను తన ఆత్మగనే చూచును. అనగా వానికి సార్వాత్మ్య భావము సిద్ధించును.

శ్లో॥ నైవ కించిత్కరోమీతి యుక్తో మన్యేత తత్త్వవిత్
పశ్యన్ శృణ్వన్ స్పృశన్ జిఘ్రన్నశ్నన్ గచ్ఛన్ స్వపన్ శ్వసన్ 8

శ్లో॥ ప్రలపన్ విసృజన్ గృహ్ణనున్మిషన్ నిమిషన్నపి
ఇంద్రియాణీంద్రియార్థేషు వర్తంత ఇతి ధారయన్ 9

తత్త్వవిత్, యుక్తః = తత్త్వజ్ఞుడైన సాంఖ్యయోగి, పశ్యన్ = చూచుచు, శృణ్వన్ = వినుచు, స్పృశన్ = స్పృశించుచు, జిఘ్రన్ = ఆఘ్రాణించుచు, అశ్నన్ = తినుచు, గచ్ఛన్ = నడుచుచు,

స్వపన్ = నిద్రించుచు, శ్వసన్ = శ్వాసక్రియలను నడుపుచు, ప్రలపన్ = భాషించుచు, విసృజన్ = త్యజించుచు, గృహ్ణన్ = గ్రహించుచు, ఉన్మిషన్ = కనులు తెరచుచు, నిమిషన్, అపి = మూయుచునూ, ఇంద్రియాణి = ఇంద్రియములు, ఇంద్రియార్థేషు = తమ తమ శబ్దాది విషయములందు, వర్తంతే, ఇతి = ప్రవర్తించుచున్నవని, ధారయన్ = తలంచుచు, కించిత్, న, ఏవ, కరోమి = నేను ఏ కొంచెమూ (ఏమియు) చేయుటలేదు, ఇతి, మన్యతే = అని భావించును

తా. యోగాభ్యాసపరుడు ఆత్మానాత్మ వివేక జ్ఞానము కలవాడై యింద్రియార్థములగు విషయములందు అనగా దర్శన, శ్రవణ, స్పర్శ, ఘ్రాణ, భోజన, గమన, స్వాప, శ్వాసాదులందు ఇంద్రియములు వర్తించుచున్నవని భావించుచు స్వయముగా ఆత్మానుసంధాన పరుడై తానేమి చేయువాడు కాదని తలచును. అనగా నైష్కర్మ్య సిద్ధి కలిగినదని భావము.

శ్లో॥ బ్రహ్మణ్యాధాయ కర్మాణి సంగం త్యక్త్వా కరోతియః
లిప్యతే న స పాపేన పద్మపత్ర మివామ్భసా 10

యః = ఎవడైతే, కర్మాణి = కర్మలన్నింటిని, బ్రహ్మణి, ఆధాయ = భగవదర్పణము గావించి, సంగమ్, త్యక్త్వా = ఆసక్తిని త్యజించి, కరోతి = (కర్మలను) ఆచరించుచున్నాడో, సః = ఆ పురుషుడు, అంభసా పద్మపత్రమ్ ఇవ = జలబిందువులచే పద్మపత్రము వలె (తాకబడకుండనట్లు), పాపేన = పాపము(ల)చే, న, లిప్యతే = తాకబడడు (పాపములు ఆ పురుషుని ఏ మాత్రము అంటవు)

తా. కర్మయోగి తనచే చేయబడు కర్మలను బ్రహ్మమందుంచిన బుద్ధితో ఫలాపేక్షారహితుడై ఆచరించును. కావున పద్మపత్రముపై నీరు ఉన్నను ముత్యమువలె ప్రకాశించుచు, వాయువశమున పత్రము చలించిన నీరు పోవునే కాని ఆ తామరాకుపై నీటిబొట్టు యొక్క లక్షణములేవి యుండనట్లు కర్మయోగికి, కర్మలాచరించినను నిస్సంగబుద్ధి కలవాడు కాన పాపలేశము కూడ అంటదని భావము.

వి. యోగి మాత్రమే ఆత్మయందు మనస్సును లయము చేయగలడు. సర్వకర్మలను చేయ సంకల్పించునది మనస్సు. యుక్తుడైనవాడు ఆ మనస్సును ఆత్మయందు రమింపజేయును. కర్తృత్వాద్యహంకారముగల మనస్సు ఆత్మయందు లయమగుటచే కర్మాచరణయున్నను కర్మఫలమంటదు.

శ్లో॥ కాయేన మనసా బుద్ధ్యా కేవలైరింద్రియైరపి
యోగినః కర్మకుర్వంతి సంగం త్యక్త్వాత్మ శుద్ధయే 11

యోగినః = కర్మయోగులు, సంగమ్ = మమతాసక్తులను, త్యక్త్వా = వీడి, కేవలైః = కేవలము, ఇంద్రియైః = ఇంద్రియముల చేతను, మనసా = మనస్సు చేతను, బుద్ధ్యా = బుద్ధి చేతను, కాయేన, అపి = శరీరము చేతను, ఆత్మశుద్ధయే = ఆత్మశుద్ధి కొరకు మాత్రమే, కర్మ, కుర్వంతి = కర్మలను ఆచరించుచుందురు

తా. యోగులు తాము చేయు కర్మలను ఫలాపేక్షారహితులై అనగా సంగభావ వర్జితులై చిత్తశుద్ధి కలుగునట్లు ఈశ్వరార్పితముల నొనర్చుదురు. కాయిక, మానసిక, బౌద్ధికములగు కర్మలను వేనిని చేసినను మమతా వర్జితులై చేసి చిత్తశుద్ధిని పొందుదురని భావము.

శ్లో॥ యుక్తః కర్మఫలం త్యక్త్వా శాంతి మాప్నోతి నైష్ఠికీం
అయుక్తః కామకారేణ ఫలేసక్తో నిబధ్యతే 12

యుక్తః = యోగి, కర్మఫలమ్ = కర్మఫలము(ల)ను, త్యక్త్వా = త్యజించి, నైష్ఠికమ్, శాంతిమ్ = భగవత్ ప్రాప్తిరూపమైన శాంతిని, ఆప్నోతి = పొందును, అయుక్తః = సకామ పురుషుడు, కామకారేణ = వాంఛల ప్రేరణలచే, ఫలే, సక్తః = ఫలాసక్తితో (కర్మలనాచరించి), నిబధ్యతే = బంధింపబడును (బద్ధుడగును)

తా. *'యుక్త ఇత్యుచ్యతే యోగీ' (6-8)* అనుటవలన యుక్తుడన యోగియని భావము. యుక్తుడు కర్మఫలత్యాగము చేయగలడు. కర్మ ఈశ్వరార్పిత బుద్ధితో చేయబడును. కాన చిత్తశుద్ధి హేతువగును. చిత్తశుద్ధి ద్వారా జ్ఞానప్రాప్తి, జ్ఞానముచే శాశ్వతముగా శాంతియు కలుగును. యుక్తుడు కాని వానిచే చేయబడు కర్మలు బంధాపాదకములగును. అయుక్తుడు రజోగుణ దోషములచే ఫలాపేక్షను వదలలేక జనన మరణముల పాలగుచున్నాడు.

*శ్లో: ప్రాణాద్యనిల సంశాంతౌ యుక్త్యాయే పదమాగతాః*
*అనామయమనాద్యంత తే స్మృతా యోగయోగినః (అన్నపూర్ణోపనిషత్ 5-6)*

ప్రాణాది పంచవాయువులు (ప్రాణాపానవ్యానోదానసమాన వాయువులు) బాగుగా శాంతించిన వానిని యుక్తుడందురు. ఆద్యంతములు లేక అనామయమమగు పదమునొందిన వానిని యోగులకు యోగిగా పిలుతురు.

శ్లో॥ సర్వకర్మాణి మనసా సన్న్యస్యాస్తే సుఖం వశీ
నవద్వారే పురేదేహీ నైవ కుర్వన్ న కారయన్ 13

వశీ, దేహీ = అంతఃకరణమును వశమునందుంచుకొని యోగమును ఆచరించు పురుషుడు, న, కుర్వన్ = కర్మలను ఆచరింపక, న, కారయన్, ఏవ = ఆచరింపజేయకయే, నవద్వారే, పురే = నవద్వారములుగల శరీరమను పురమునందు, సర్వకర్మాణి = సమస్త కర్మలను, మనసా = మానసికముగా, సన్న్యస్య = త్యజించి, సుఖమ్ = సుఖముగా, ఆస్తే = (సచ్చిదానంద పరమాత్మ స్వరూపమున) స్థితుడైయుండును.

తా. నవరంధ్రములను నవద్వారములుగను, దేహమును పురముగను, భావించి చెప్పుచున్నాడు. యుక్తుడు, నవద్వారములు కలిగియున్న దేహమను పురమందు, జితేంద్రియుడు కాన ఫలాపేక్షారహితుడై, కర్తృత్వాద్యభిమాన శూన్యుడు కాన కర్తయుకాక కారయితయును కాక సర్వకర్మ సంన్యాసము చేసి సుఖముగా నుండును. *'మనసా సన్న్యస్య' (5-13)* అనుటచే రజోగుణ వర్జితమైన మనస్సు చేతనే సర్వకర్మలను యుక్తుడగువాడు విడిచి పెట్టగలడు. *'రజః కర్మణి భారత'* యను గీతావాక్యముచే రజోగుణ దూషితమైన మనస్సు కర్మల నాచరించుటయందే సక్తమై యుండును. యుక్తుడయినవాడు రజోగుణ వర్జితమైన మనస్సు కలిగియుండును. కావున కర్మలనాచరించినను సంగబుద్ధి లేనివాడగుటచే మనసార సర్వకర్మలను సంన్యసించినవాడే యగును. యోగి మనస్సు సర్వకాలములందును ఆత్మరతమై యుండుటచే వానిచే చేయబడు సర్వకర్మలను మనసా సన్న్యసించినవాడే యగును. మనః ప్రేరితములుకాక స్వభావముచే, ఇంద్రియములచే చేయబడు కర్మల ఫలము మనస్సుకు జెందదు. కావున అట్టి మనః ప్రవృత్తికల యోగి కర్మల నాచరించినను, ఆచరించనివాడే యగుచున్నాడు.

శ్లో॥ న కర్తృత్వం న కర్మాణి లోకస్య సృజతి ప్రభుః
న కర్మఫల సంయోగం స్వభావస్తు ప్రవర్తతే 14

ప్రభుః = పరమేశ్వరుడు, లోకస్య, కర్తృత్వమ్ = మానవుల కర్తృత్వమును, న, సృజతి = సృజింపడు, కర్మాణి = (వారి) కర్మలను, న (సృజతి) = సృజింపడు, కర్మఫల సంయోగమ్ = కర్మఫల సంయోగమును, న (సృజతి) = సృజింపడు, తు = అయితే, స్వభావః = (ఈ అన్నింటియందును) ప్రకృతియే, ప్రవర్తతే = వర్తిల్లును,

తా. సర్వభూత మహేశ్వరుడగు పరమాత్మకు ఎట్టి ప్రవృత్తియు లేదు. లోకమున ఏ ఒకనికిని కర్మ కర్తృత్వమును కాని, కర్మలను కాని ఆత్మ విధించుట లేదు. కర్మఫల ప్రాపణ రూపమగు కర్మయు పరమాత్మచే చేయబడుటలేదు. లోక వ్యవహారమంతయు ప్రకృతి మూలమున జరుగుచున్నది.

వి. కర్తృత్వాభిమానము కర్మఫలానుభవమునకు హేతువగును. ఆ అభిమానము రజోగుణ దోషమువలన గలుగును. రజోగుణ నాశమునకు యోగము నాశ్రయింపవలెను.

శ్లో॥ నాదత్తే కస్యచిత్పాపం న చైవ సుకృతం విభుః
అజ్ఞానేనావృతం జ్ఞానం తేన ముహ్యంతి జంతవః 15

విభుః = సర్వవ్యాపియైన భగవంతుడు, కస్యచిత్ = ఏ ఒక్కనియొక్క, పాపమ్, న ఆదత్తే = పాపకర్మమును గ్రహింపడు, చ = మరియు, సుకృతమ్, ఏవ, న, ఆదత్తే = పుణ్యమును కూడా గ్రహింపడు, అజ్ఞానేన = అజ్ఞానము చేత, జ్ఞానమ్ = జ్ఞానము, ఆవృతమ్ = ఆవరింపబడును, తేన = ఆ కారణము చేత, జంతవః = ప్రాణులు (మానవులు), ముహ్యంతి = మోహితులగుచున్నారు.

తా. పరమాత్మ సాక్షిభూతుడు. ఏవిధమైన ప్రవృత్తియు లేక స్వస్వరూప స్థితుడై యుండును. లోకము యొక్క పుణ్యపాపములను గ్రహించుట కాని పరిహరించుటకాని చేయడు. పరమాత్మ నిష్క్రియుడు. అవిద్యా మోహితులై ప్రజలు, పుణ్యము నిచ్చునని, పాపము హరించునని తలచుచున్నారు. యథార్థమెఱుంగజాలరు. వారి జ్ఞానము అజ్ఞానముచే ఆవృతమైయున్నందున లోకులు భ్రమచెందుచున్నారు.

శ్లో॥ జ్ఞానేన తు తదజ్ఞానం యేషాం నాశితమాత్మనః
తేషామాదిత్యవత్ జ్ఞానం ప్రకాశయతి తత్పరమ్ 16

తు = అయితే, ఏషామ్ = ఎవరియొక్క, తత్, అజ్ఞానమ్ = ఆ అజ్ఞానము, ఆత్మనః జ్ఞానేన = పరమాత్మ తత్త్వజ్ఞానము చేత, నాశితమ్ = నశింపజేయబడునో, తేషామ్ = వారికి, జ్ఞానమ్ = ఆ జ్ఞానము, తత్పరమ్ = సచ్చిదానంద ఘన పరమాత్మను, ఆదిత్యవత్ = సూర్యునివలె (సూర్యప్రభవలె), ప్రకాశయతి = ప్రకాశింప (దర్శింప) జేయును

తా. జ్ఞానము కలుగగనే అజ్ఞానము తొలగును. అజ్ఞానము తొలగిన వెంటనే మేఘావరణనుండి విముక్తుడైన సూర్యునివలె తత్పదవాచ్యమైనట్టియు, పరమమైనట్టియు, జ్ఞాన స్వరూపమగు ఆత్మ స్వయముగా ప్రకాశించును.

వి. జ్ఞానముచే అజ్ఞానము నశించినవానికి, గాలిచే మేఘము తొలగగా... స్వయం ప్రకాశ స్వరూపుడైన సూర్యుడు ప్రకాశించిన విధముననే (అజ్ఞానముచే ఆవృతమై సూర్యుడువలె), స్వయం ప్రకాశకమై ఆత్మ ప్రకాశించుచునే యుండును. మేఘమను ఆవరణ తొలగుటకు గాలితోడుగా నున్నట్లు, అజ్ఞానమను ఆవరణ తొలగుటకు పరోక్ష జ్ఞానము అనగా గురూపదేశము, శాస్త్ర

జ్ఞానము, యోగనిష్ఠ వీనివలన కలిగిన కల్పిత జ్ఞానము సహాయపడును. మేఘములు తొలగిన సూర్యప్రకాశము వెలుగునట్లు, అజ్ఞానము నశించినవానికి స్వయంప్రకాశ స్వరూపుడగు పరమాత్మ ప్రకాశించును.

*శ్లో॥ అకల్పిత మజం జ్ఞానం జ్ఞేయాదభిన్నం ప్రచక్షతే*
*బ్రహ్మజ్ఞేయమజం నిత్య మజే నాజం విబుధ్యతే* (గౌడపాదకారిక)

అకల్పితమైనదియు, పుట్టుకలేనిదియునగు జ్ఞానము బ్రహ్మకంటే వేరుకాదు. బ్రహ్మాభిన్నమైన అకల్పిత జ్ఞానము నిత్యమైనదియు నిజమైనదియునగు బ్రహ్మను ప్రకాశింపజేయును. అకల్పితం, అజం అనుటచే, కల్పితమై, పుట్టుక కల జ్ఞానము వేరొకటి కలదని భావము.

*శ్లో॥ ప్రజ్ఞాయాం కల్పితం ప్రజ్ఞ ప్రజ్ఞయైవ విహాయయః*
*ప్రజ్ఞామాత్రేణ సంతిష్ఠేత్ ప్రజ్ఞావాని తీరితం* (గౌడపాదకారిక)

ప్రజ్ఞయందనగా జ్ఞానమందు కల్పిత జ్ఞానమొకటి కలదు. అట్టి జ్ఞానమును త్యజించినవాడే ప్రజ్ఞావంతుడు. అనగా జ్ఞానియగును. *'జ్ఞానేన తు తదజ్ఞానం'* అను శ్లోక భాగమున కల జ్ఞానము కల్పిత జ్ఞానము. అట్టి కల్పితజ్ఞానము, జ్ఞానమూర్తియగు పరమాత్మకు ఆవరణగా ఉన్న అజ్ఞానము తొలగుటకు సాధనమైనది. ఈ కల్పిత జ్ఞానము సూర్యునకు ఆవరణగానున్న మేఘమును తొలగించిన గాలి, తాను కూడ ఛిన్నాభిన్నమైనట్లు, అజ్ఞానమును నాశముచేసి తానును నశించును. అప్పుడు ప్రకాశించు జ్ఞానమే ఆదిత్యునివలె స్వయం ప్రకాశమైనది. అజము, నిత్యము, అకల్పితము అనుపదములచే బోధింపబడునది ఆత్మతత్త్వము.

శ్లో॥ తద్బుద్ధయస్త దాత్మాన స్తన్నిష్ఠాస్తత్పరాయణా
గచ్ఛన్త్య పునరావృత్తిం జ్ఞాన నిర్ధూత కల్మషాః 17

తదాత్మానః, తద్బుద్ధయః = తద్రూపము పొందిన మనోబుద్ధులు గలవారు, తన్నిష్ఠాః = ఆ సచ్చిదానంద ఘన పరమాత్మయందే నిరంతరము, ఏకీభావముతో స్థితులైనవారును, తత్పరాయణాః = తత్పరాయణులును అగు పురుషులు, జ్ఞాన నిర్ధూత కల్మషాః = జ్ఞానసాధనతో పాపరహితులై, అపునరావృత్తిమ్ = పునరావృత్తి రహితమైన పరమగతిని, గచ్ఛంతి = పొందుదురు

తా. జ్ఞానియై సమస్త కల్మషములను నశింపజేసి బ్రహ్మభావనయందభిరుచి కలవాడై పరమాత్మయే తన ఆత్మగా నుండి సర్వము బ్రహ్మమయమను భావమున అచంచల స్థితి కలిగియుండును. ఇంతియేకాక బ్రహ్మకంటె వేరు గతిలేదనియు ఆత్మయే పరమ గమ్యమగు పదమనియు తెలిసి మరల జన్మ జరా మరణరూప సంసారమున పడడు. బ్రహ్మనిష్ఠ యోగనిష్ఠ కలవానికే లభ్యమగును.

శ్లో॥ విద్యావినయసంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని
శుని చైవ శ్వపాకే చ పణ్డితాః సమదర్శినః 18

పండితాః = జ్ఞానులు, విద్యావినయ సంపన్నే = విద్యతో, వినయముతో ఒప్పుచున్న, బ్రాహ్మణే, చ = బ్రాహ్మణుని యందును, గవి = గోవునందును, హస్తిని = ఏనుగునందును, శుని = కుక్కయందును, శ్వపాకే చ = (కుక్కమాంసము తిను) చండాలుని యందును, సమదర్శినః, ఏవ = సమదృష్టినే కలిగియుందురు

తా. విద్యయు, వినయము బాగుగా కలిగియున్న బ్రాహ్మణుని, గోవును, ఏనుగును, శునకమును, కుక్కమాంసము తిను చండాలుని పండితులు అనగా ఆత్మనిష్ఠాపరులు, బ్రహ్మభావముతో జూచుదురు. ఉపాధి లక్షణముల పరిశీలన చేయరనియు 'సర్వభూతస్థ, మాత్మానం' అను గీతావచన ప్రకారము ఆత్మను సర్వభూతములయందున్న దానినిగా చూడగలుగుచున్నారు. సమభావ దర్శనమునకు నరుడు యోగపరుడు కావలెను. రజోగుణ లక్షణమగు అహంకారము నశించుటకు యోగానుష్ఠానమే కర్తవ్యము.

శ్లో॥ ఇహైవతైర్జితః సర్గో యేషాం సామ్యే స్థితం మనః
నిర్దోషం హి సమంబ్రహ్మ తస్మాద్బ్రహ్మణి తేస్థితాః 19

యేషాం, మనః = ఎవరి మనస్సు, సామ్యే, స్థితమ్ = సమభావమునందు స్థితమైయుండునో, తైః = వారిచే, ఇహ, ఏవ = ఈ జన్మయందే, సర్గః = జగత్తంతయు, జితః = జయింపబడినది యగును, హి = ఏలనన, బ్రహ్మ = సచ్చిదానంద ఘన పరమాత్మ, నిర్దోషమ్, సమమ్ = దోషరహితుడు, సముడు, తస్మాత్ = అందువలన, తే = వారు (అట్టి జ్ఞానులు), బ్రహ్మణి, స్థితాః = సచ్చిదానంద ఘన పరమాత్మయందు స్థితులు అనగా వారు త్రిగుణాతీతులు, జీవన్ముక్తులు

తా. సమత్వభావమందు యోగులు స్థిరముగా నుందురు. కావున వారు సంసరణ నధిగమించి పరమపదమును పొందుదురు. ముక్తులగుదురని భావము. గో, బ్రాహ్మణ, చణ్డాల, శ్వపాకాదులందు ఉపాధి గత దోషములను చూడక దోషరహితమై, అద్వయమైన బ్రహ్మను చూచుచుండు సమదర్శులగు పండితులు సర్వకాలములందును బ్రహ్మనిష్ఠాపరులే యగుచున్నారు. యోగబుద్ధి లేక మూఢులగువారు గుణాతీతమగు బ్రహ్మను ఉపాధి దోషజుష్టమైనట్లు భావించెదరు. కాన యోగనిష్ఠాపరుడవగుము.

శ్లో॥ న ప్రహృష్యేత్ప్రియం ప్రాప్యనోద్విజే త్ప్రాప్య చాప్రియమ్
స్థిరబుద్ధి రసం మూఢో బ్రహ్మవిద్బ్రహ్మణి స్థితః 20

ప్రియమ్ ప్రాప్య = ప్రియమును పొంది, న, ప్రహృష్యేత్ = పొంగిపోని వాడును, చ = అట్లే, అప్రియమ్, ప్రాప్య = అప్రియమును పొంది, న, ఉద్విజేత్ = ఉద్వేకమునకు లోనుకానివాడును, స్థిరబుద్ధిః = నిశ్చలమైన బుద్ధిగలవాడును, అసమ్మూఢః = మోహ వివశుడు కానివాడును అగు, బ్రహ్మవిత్ = బ్రహ్మవేత్త, బ్రహ్మణి = సచ్చిదానంద ఘనపరబ్రహ్మమునందు, స్థితః = ఏకీభావస్థితుడై యుండును

తా. ఆత్మతత్త్వమెఱిగి సమదర్శియగు పండితుడు బ్రహ్మయందు స్థిరమైన బుద్ధికలవాడై యుండును. సర్వత్ర బ్రహ్మదర్శనము చేయు యోగికి మోహకారణమైన అజ్ఞానము దూరమగును. కాన ఆ యోగి మాయా సంమోహితుడు కాక యుండును. అందువలన ప్రియకార్యములు సంభవించినప్పుడు సంతోషపడుట కాని, అప్రియములు సంభవించినపుడు దుఃఖము నందుటకాని యుండదని భావము. కనుక ఆత్మవంతుడవగుమని భావము.

శ్లో॥ బాహ్యస్పర్శేష్వసక్తాత్మా విందత్యాత్మనియత్సుఖమ్
స బ్రహ్మ యోగ యుక్తాత్మా సుఖమక్షయ మశ్నుతే 21

బాహ్యస్పర్శేషు = ప్రాపంచిక విషయములయందు, అసక్తాత్మా = అనాసక్తమైన అంతః కరణముగల సాధకుడు, ఆత్మని యత్, సుఖమ్ = ఆత్మయందు (స్థితమైన) ధ్యాన జనితమైన ఏ (తత్) = సాత్త్వికానందము కలదో దానిని, విందతి = పొందును, సః = (పిదప) అతడు, బ్రహ్మయోగయుక్తాత్మా = సచ్చిదానందఘన పరబ్రహ్మ పరమాత్మ ధ్యానయోగమునందు అభిన్న భావస్థితుడై, అక్షయమ్, సుఖమ్ = అక్షయానందమును, అశ్నుతే= పొందును (అనుభవించును)

తా. అవిచలితమగు బ్రహ్మభావనమునకు బ్రహ్మయోగమనిపేరు. నిరంతరము ఆత్మరతుడగు యోగి శాశ్వతాత్మానందమనుభవించును. అట్టియోగి, బాహ్యసుఖములందు మనస్సు లగ్నము చేయక ఆత్మసుఖానుభవరతుడై యుండి

*'బ్రహ్మవిద్ బ్రహ్మైవ భవతి'* *(ముండకోపనిషత్ 3-2-10)*

యను వాక్యము ప్రకారము బ్రహ్మమేయగుచున్నాడు.

శ్లో॥ యే హి సంస్పర్శజా భోగా దుఃఖ యోనయ ఏవతే
ఆద్యంత వంతః కౌంతేయ న తేషు రమతే బుధః 22

కౌంతేయ! = ఓ అర్జునా!, యే, సంస్పర్శజాః, భోగాః = విషయేంద్రియ సంయోగము వలన ఉత్పన్నములగు, భోగములు ఏవి గలవో, తే = (భోగలాలసులకు సుఖములుగ భాసించు) ఆ భోగములు అన్నియును, హి = నిస్సందేహముగా, దుఃఖయోనయః, ఏవ = దుఃఖహేతువులే, ఆద్యంతవంతః = (అవి) ఆదియు, అంతము గలవి (అనిత్యములు), బుధః = వివేకులు, తేషు = వాటియందు, న, రమతే = రమింపరు

తా. ఓ కుంతీపుత్రా! సకలభోగములు విషయేంద్రియ సంయోగమువలన జనించుచున్నవి. కనుక వీనికి ఆదియు, అంతము కలదు. అందుచే నిత్యములు కావు. భోగములు అంతమొందిన దుఃఖము కలుగును. కావున అశాశ్వతములును, దుఃఖహేతువులునగు భోగములపై కాంక్ష వదలి బుధులాత్మారాములగుదురు.

శ్లో॥ శక్నోతీ హైవయః సోఢుం ప్రాక్శరీర విమోక్షణాత్
కామ క్రోధోద్భవం వేగం స యుక్తః స సుఖీనరః 23

యః = ఏ సాధకుడు, ఇహ = ఈ జన్మయందు, శరీరవిమోక్షణాత్, ప్రాక్, ఏవ = శరీరమును విడువకముందే, కామక్రోధోద్భవమ్, వేగమ్ = కామక్రోధాదులవలన కలిగిన ఉద్వేగమును, సోఢుమ్ = సహించుటకు, శక్నోతి = సమర్థుడగుచున్నాడో, సః, నర ః = ఆ సాధకుడు, యుక్తః = నిజమైన యోగి, సః = అతడే, సుఖీ = నిజమైన సుఖి

తా. దేహ త్యాగమునకు ముందుగా నెవడు జితేంద్రియుడై కామక్రోధముల వలన కలుగు మనః క్షోభమును సహించగలుగునో వాడు యుక్తుడనబరగును. వాడే సుఖవంతుడగును.

వి. *'సంకల్ప ప్రభవాన్ కామాన్'* అను గీతావాక్యమును బట్టి, కామము మనస్సంకల్పము వలన జనించును. *'కామాత్ క్రోధోஉభిజాయతే'* అను గీతావచనానుసారము క్రోధమునకు కామము కారణమగుచున్నది. ఈ తీరున కామక్రోధములు మనస్సంకల్ప జాతములు. కనుక మనస్సును నిరతిశయమైన ఆత్మానందమున రమించునట్లు చేయగలుగు యోగాభ్యాస పాటవముచే తుచ్ఛములగు కామములపై మనస్సును చలింపనీయక యుండవచ్చును. యోగియైనచో పై జెప్పినరీతి మనసును జయించినవాడై, కామక్రోధముల వల్ల కలుగు వ్యధను సులభముగా శమింపజేయగలడు. అందుచేత నరుడు యోగరతుడై యుండవలెను.

శ్లో॥ యోఽ న్తః సుఖోఽ న్తరారామస్తథాన్తర్జ్యోతిరేవయః
స యోగీ బ్రహ్మనిర్వాణం బ్రహ్మభూతోఽ ధిగచ్ఛతి 24

యః = ఏ పురుషుడు, ఏవ = నిశ్చయముగా, అంతఃసుఖః = సమష్టి అంతరాత్మ యందు సుఖించు వాడును, అంతరారామః = ఆత్మయందు రమించువాడును, తథా = అట్లే, యః = ఎవడు, అంతర్జ్యోతిః = లోపల ఆత్మజ్యోతిని, సః = ఆ (అట్టి), బ్రహ్మభూతః = సచ్చిదానందఘన పరబ్రహ్మ పరమాత్మ యందు ఏకీభావస్థితుడైన, యోగీ = యోగి, బ్రహ్మనిర్వాణమ్ = బ్రహ్మనిర్వాణ (పరమపద) మును, అధిగచ్ఛతి = పొందును

తా. బాహ్యవిషయ సుఖమును తృణీకరించిన యోగి తన అంతరాత్మయందు నిర్విషయ సుఖమనుభవించుచు ఆత్మయందు రమించుచుండును. అట్టి యోగి, జ్ఞాననేత్రము ద్వారా జ్యోతిస్స్వరూపాత్మను దర్శించుచు బ్రహ్మభూతుడై బ్రహ్మానందమును పొందును.

శ్లో॥ లభంతే బ్రహ్మనిర్వాణమ్ ఋషయః క్షీణ కల్మషాః
ఛిన్న ద్వైధా యతాత్మానః సర్వభూత హితే రతాః 25

క్షీణకల్మషాః = పాపరహితులును, ఛిన్నద్వైధాః = జ్ఞాన ప్రభావమున సమస్త సంశయముల నివృత్తిని సాధించిన వారును, సర్వభూత హితే, రతాః = సర్వప్రాణుల హితమును గోరువారును, యతాత్మానః = నిశ్చల స్థితిలో మనస్సును పరమాత్మ యందు, లగ్నము చేసినవారును అగు, ఋషయః = బ్రహ్మవేత్తలు, బ్రహ్మ నిర్వాణమ్ = బ్రహ్మ నిర్వాణమును (శాంత బ్రహ్మను), లభంతే = పొందుదురు

తా. ఆత్మ సంయమము కలిగి సర్వకాలములందును సర్వభూతములకు హితమాచరించుట యందు తాత్పర్యము కల ఋషులు ద్వైతభావము నశించిన వారగుటచే సర్వకల్మషములు నశించిన వారగుటయేకాక బ్రహ్మపదమును పొందుదురు. అనగా మోక్షము కలవారగుదురు.

వి. ద్వైతభావము నశించి అద్వైతభావము అనగా...ఆత్మదర్శనము కలుగుటయే జ్ఞానము.

*'అభేద దర్శనం జ్ఞానం'* *(స్కందోపనిషత్ -11)*

అను శ్రుతిననుసరించి ఆత్మయే సర్వమను అభేదదృష్టి యోగయుక్తుడగు జ్ఞానికి మాత్రమే కలుగును. *'యోగయుక్తో మునిర్బ్రహ్మ నచిరేణాధి గచ్ఛతి'* అను గీతావాక్య మీభావమునే చెప్పుచున్నది. అభేద దర్శనముకల యోగి సర్వభూతహితరతుడై యుండును. సర్వము బ్రహ్మస్వరూపమైనందున అహింసా బ్రహ్మచర్య వ్రతముల నవలంబించినవాడునగును.

శ్లో॥ కామక్రోధ వియుక్తానాం యతీనాం యత చేతసామ్
అభితో బ్రహ్మనిర్వాణం వర్తతే విది తాత్మనామ్ 26

కామక్రోధ వియుక్తానామ్ = కామక్రోధ రహితులును, యతచేతసామ్ = చిత్తమును జయించినవారును, విదితాత్మనామ్ = పరబ్రహ్మ పరమాత్మ సాక్షాత్కారమును పొందినవారును అగు, యతీనామ్ = జ్ఞానులకు, అభితః = అంతట (జీవన్ముక్త స్థితిలోనే కాక, దేహ పతనానంతరము కూడా), బ్రహ్మనిర్వాణమ్ = శాంత పరబ్రహ్మ పరమాత్మయే, వర్తతే = పరిపూర్ణుడై యుండును (గోచరించును)

తా. కామక్రోధ రహితులును, జితేంద్రియులును అగు సంన్యాసులు సమ్యక్ దర్శన నిష్ఠచే ఇహపరలోకములందు బ్రహ్మానందానుభవమును పొందుదురు.

వి. 'విదితాత్మనాం' అనుటచే సమ్యక్ దర్శియగు యోగికే బ్రహ్మానంద ప్రాప్తియుండును. జీవించియుండగా జీవన్ముక్తుడై ఆత్మానంద సుఖమనుభవించును. దేహపాతానన్తరము స్వరూపమాత్రావస్థితి కలుగును.

శ్లో॥ స్పర్శాన్ కృత్వా బహిర్బాహ్యాంశ్చక్షుశ్చైవాంతరేభ్రువోః
ప్రాణాపానౌ సమౌకృత్వా నాసాభ్యంతర చారిణౌ 27

శ్లో॥ యతేంద్రియ మనోబుద్ధిః మునిర్మోక్ష పరాయణః
విగతేచ్ఛా భయక్రోధో యః సదాముక్త ఏవసః 28

బాహ్యాన్, స్పర్శాన్ = (శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములను) బాహ్యవిషయ భోగములను బహిః, ఏవ, కృత్వా = బయటికి పారద్రోలి, చ = మఱియు, చక్షుః = దృష్టిని, భ్రువోః, అంతరే = భ్రూమధ్యమున (నిలిపి), నాసాభ్యంతర చారిణౌ = (నోటిలోపలగల) నాసికా రంధ్రముల యందు చరించుచున్న, ప్రాణాపానౌ = ప్రాణాపానవాయువులను, సమౌ, కృత్వా = సమముగాచేసి, యతేంద్రియమనోబుద్ధిః = మనోబుద్ధీంద్రియములను జయించినట్టి, యః = ఎవడైతే, మోక్షపరాయణః = మోక్షపరాయణుడై, మునిః = మననశీలుడై, విగతేచ్ఛా భయక్రోధః = ఇచ్ఛా భయ క్రోధ రహితుడైనవాడును అగునో, సః = అతడు, సదా = సర్వదా, ముక్తః, ఏవ = ముక్తుడే యగును

తా. బాహ్యములగు శబ్దాదింద్రియ విషయములను బహిష్కరించి, భ్రూమధ్యస్థానమున దృష్టిని నిలిపి ప్రాణాపాన వాయువులను సమముగా నోటి లోపలగల నాసా రంధ్రముల ద్వారా

సంచరించునట్లు చేసి (మోక్షపరుడై యున్న యోగయుక్తుడగు ముని) మనోబుద్ధీంద్రియములను నియమించినవాడును, ఇచ్ఛాభయక్రోధములు పోయినవాడును అయి ముక్తుడగుచున్నాడు. సందియములేదు.

వి. *శ్లో॥ ముహూర్తమపి యోగేచ్ఛా నాసాగ్రేమనసా సహ*
*సర్వం తరతి పాప్మానం తస్య జన్మశతార్జితమ్* *(ఉత్తరగీత)*

ముహూర్తమాత్రమైనను (48 నిమిషములు) యోగయుక్తుడై నాసాగ్రమున మనస్సును, దృష్టిని నిలుపు యోగి వందలకొలది జన్మలనుండి పేరుకొనిన పాప సముచ్చయమును నశింప జేయును.

***నాస = ముక్కుకు, అభి = ఎదురుగా, అంతరము = గొంతులోపల***

ప్రాణాయామము చేయువారు ముక్కును స్పర్శింపకయే ముక్కు వెనుక గొంతులోపల (Nasopharynx) గల రంధ్రముల వద్దనే ఘర్షణ లేక మధనక్రియ చేయుదురు. దాని వల ననే యోగాగ్ని జనించి శిరసులోని భ్రూమధ్యమునకు పిమ్మట శరీరమంతయూ వ్యాపించి, సర్వనాడీ శుద్ధి జరిగి, శరీరశుద్ధియూ, తదనుగుణంగా మనశ్శుద్ధియూ ఒకేసారి సిద్ధించును.

*'చక్షుశ్చైవాంతరే భ్రువోః'* కంటిద్వారా ఆత్మజ్యోతి బాహ్యవస్తు ప్రకాశకమై యుండగా, వివేకశీలియగు యోగి ఆత్మజ్యోతిని అనగా కంటిచూపును భ్రూమధ్య స్థానమున త్రిప్పి నిలిపి దృష్టి ద్వారా అన్తర్ముఖము చేయును. అప్పుడు యోగి యోగాభ్యాస పాటవముచే జ్ఞాననేత్రము వికసింపజేసి ఆత్మదర్శనము చేయగలుగును. శరీరాన్తర్గతములగు ప్రాణాపాన వాయువులను నాసాభ్యంతరగత రంధ్రములద్వారా సమముగా మూలాధారమునుండి భ్రూమధ్యస్థానము వరకును, మరల భ్రూమధ్య స్థానమునుండి మూలాధార స్థానము వరకును ఊర్ధ్వాధోగతుల నడిపించుచున్న యోగి, శరీరమందలి సర్వకల్మషములను నశింపజేసిన వాడగును. అందుచే శరీరము, మనోబుద్ధీంద్రియములు పరిశుద్ధములగును. అప్పుడాత్మజ్యోతి దర్శనము యుక్తుడగు యోగికి సులభమగును. పరిశుద్ధమైన శరీరేంద్రియముల ద్వారా ఆత్మప్రకాశము ప్రసరించుటచే బాహ్యవస్తువులన్నియు ప్రకాశమయములై గోచరించును. సర్వత్ర ఆత్మదర్శనమే యోగికి కలుగుచుండునని భావము.

*శ్లో: యత్ర యత్ర మనోయాతి తత్ర తత్ర సమాధయః* *(దృక్దృశ్య వివేక వాక్యసుధ -30)*

సర్వత్ర ఆత్మదర్శనము సమాధియనబడును. మనోగోచరమగు ప్రతివస్తువు యోగికి ఆత్మాకారముగా కనిపించును.

శ్లో॥ భోక్తారం యజ్ఞతపసాం సర్వలోక మహేశ్వరమ్
సుహృదం సర్వభూతానాం జ్ఞాత్వామాం శాంతి మృచ్ఛతి 29

మామ్ = నన్ను, యజ్ఞతపసామ్ = యజ్ఞములకును, తపస్సులకును, భోక్తారమ్ = భోక్తనుగాను, సర్వలోక మహేశ్వరమ్ = సమస్త లోకములకును, లోకేశ్వరులకును అధిపతినిగాను, సర్వభూతానామ్ = సకల ప్రాణులకును, సుహృదమ్ = ఆత్మీయునిగాను, జ్ఞాత్వా = తెలిసికొని (తత్త్వ జ్ఞానముతో గ్రహించి), శాంతిమ్ = (భక్తుడు) పరమశాంతిని, ఋచ్ఛతి = పొందును,

తా. యజ్ఞమునకు, తపస్సునకు కల ఫలమును అనుభవించువాడనుగా నన్నెఱుంగుము. సర్వలోకములందు ఉన్న ప్రాణకోటికి శుభాశుభ ఫలదాతనగుచున్న సర్వనియామకుడను నేనేయని తెలిసికొనుము. కోరకపోయినను సర్వభూతములకు వారి వారి కర్మఫలముల ననుసరించి వ్యవహరించుటకు ఇంద్రియములను ప్రచోదన చేయుచు వారికి సుఖభోగాదులను కలుగజేయుచు పరమోపకారమును చేయు సుహృత్తముడను నేనేయని గ్రహించినవాడు శాంతిని పొందుచున్నాడు.

ఇట్లు
శ్రీ పరమహంస పరివ్రాజకాచార్యులును,
బ్రహ్మర్షి సద్గురు **శ్రీశ్రీశ్రీ శివానంద** భగవత్పూజ్యపాద శిష్యులును నైన
బ్రహ్మర్షి సద్గురు **శ్రీశ్రీశ్రీ స్వామి రామానంద పరమహంస** వారిచే
రచింపబడిన గీతామృతమను టీక యందు
కర్మ సన్న్యాస యోగమను పంచమాధ్యాయము సమాప్తము.

ఓం శ్రీకృష్ణ పరమాత్మనే నమః

షష్ఠాధ్యాయము

# ఆత్మ సంయమ యోగము

(ధ్యాన యోగము)

**శ్రీ భగవానువాచ:**

శ్లో॥ అనాశ్రితః కర్మఫలం కార్యం కర్మ కరోతి యః
స సన్న్యాసీ చ యోగీ చ న నిరగ్నిర్నచాక్రియః 1

యః = ఏ పురుషుడు, కర్మఫలమ్ = కర్మఫలమును, అనాశ్రితః = ఆశ్రయింప (ఆశింప) నివాడై, కార్యం, కర్మ = కర్తవ్య కర్మను, కరోతి = ఆచరించునో, సః = అతడే, సన్న్యాసీ = నిజమైన సన్న్యాసి, చ = మరియు, యోగీ = నిజమైన యోగి, చ = కాని, నిరగ్నిః = కేవలము అగ్ని కార్యములను త్యజించిన వాడు, న = సన్న్యాసి కాడు, చ = అట్లే, అక్రియః = కేవలము క్రియలను త్యజించినవాడు, న = (యోగియు) కాడు

తా. ఎవడు కర్మఫలమునపేక్షింపక విహితకర్మల నాచరించునో వాడు సర్వ కర్మలను విడిచినవాడును, చిత్త సమాధానముకల యోగియు అగుచున్నాడు. కాని నిత్యనైమిత్తికాగ్నిహోత్రాది కార్యముల చేయక మానుటవలన కాని లేక కర్మలనే చేయక యుండుటవలన కాని, సన్న్యాసి కాజాలడు.

వి. అగ్నిహోత్రాది నిత్యకర్మలననుష్ఠింపక మానినవాడు సన్న్యాసియు, యోగియు కాజాలడు. 'కార్యం కర్మ' అనుటకు చిత్తశుద్ధి హేతువగు కర్మయని భావము. చిత్తశుద్ధిని కలిగించునది యోగాభ్యాస రూపమైన కర్మ యగుటవలన 'కార్యం కర్మ' యనగా యోగాభ్యాసమని భావము. యోగాభ్యాసమువలన రజోగుణము నశించి చిత్తశుద్ధి కలుగును.

శ్లో॥ యం సన్న్యాసమితి ప్రాహుః యోగం తం విద్ధి పాండవ
న హ్యసన్న్యస్తసంకల్పో యోగీ భవతి కశ్చన 2

పాండవ = ఓ అర్జునా!, యమ్ = దేనిని, సన్న్యాసమ్, ఇతి = సన్న్యాసము అని, ప్రాహుః = చెప్పుదురో, తమ్, యోగమ్, విద్ధి = దానిని యోగమని ఎరుంగుము, హి = ఏలనన, అసన్న్యస్త సంకల్పః = సంకల్ప త్యాగము చేయనివాడు, కశ్చన = ఎవ్వడును, యోగి, న, భవతి = యోగి కాలేడు

తా. ఓ పాండుపుత్రా! ప్రాజ్ఞులు దేనిని సంన్యాసమందురో అదియే యోగమని గ్రహింపుము. సర్వ సంకల్పములను సన్న్యసించిన వాడే యోగియగును. కర్మలను సన్న్యసించినను వాని సంబంధములైన సంకల్పములు కలిగియున్నవాడు యోగి కాజాలడని భావము.

వి. చిత్తస్పందనమే సంకల్పమునకు మూలము. చిత్తస్పందమునకు కారణమైన రజోగుణము యోగాభ్యాసము వలన నశించును. రజోగుణనాశముచే చిత్త స్పందనాశము, చిత్త స్పందనాశముచే సంకల్పనాశము కలుగును. సంకల్పత్యాగియే సన్న్యాసి. అట్టి సన్న్యాసి యోగి యని పిలువబడును. కనుక కర్మలను ఆరంభించకనే యుండుట సన్న్యాసము కాజాలదు. యోగాభ్యాసమున చిత్తసమాధానము కలిగియుండుటను సన్న్యాసమందురు.

శ్లో॥ ఆరురుక్షోర్మునేర్యోగం కర్మ కారణముచ్యతే
యోగారూఢస్య తస్యైవ శమః కారణముచ్యతే 3

ఆరురుక్షోః = యోగారూఢ స్థితిని పొందగోరు (ముముక్షువునకు), మునేః = మనన శీలుడైన పురుషునకు, యోగం కర్మ = యోగాభ్యాసకర్మ, కారణమ్ = కారణమని, ఉచ్యతే = చెప్పబడుచున్నది, యోగారూఢస్య, తస్య = యోగారూఢుడైన ఆ పురుషునకు, శమః, ఏవ = యోగకర్మ నుండి ఉపరమము, కారణమ్ = (మోక్షప్రాప్తికి) మూలము (సాధన) గా, ఉచ్యతే = చెప్పబడుచున్నది

తా. యోగి, యోగాభ్యాసమను కర్మనాచరించుటవలన యోగారూఢ స్థితిని పొందును.

*శ్లో॥ 'ముముక్షుభిః ప్రాణజయః కర్తవ్యో మోక్ష హేతవే'* *(యోగశిఖోపనిషత్-66)*

యోగారూఢస్థితి కలిగిన పిమ్మట శమము కర్తవ్యము. శమమనగా సర్వ కర్మలనుండి ఉపరమము. జ్ఞానేంద్రియములను నిగ్రహించి సర్వకాలము చిత్తమాత్మయందు సమాహితమై స్వస్వరూపస్థితి యందుండుట శమమని తెలియనగును.

శ్లో॥ యదా హి నేంద్రియార్థేషు న కర్మస్వనుషజ్జతే
సర్వసంకల్పసన్న్యాసీ యోగారూఢస్తదోచ్యతే 4

యదా = ఎప్పుడైతే, ఇంద్రియార్థేషు = శబ్దాది విషయములయందు, న, అనుషజ్జతే = ఆసక్తుడు కాడో, కర్మసు, హి = కర్మలయందును, న, (అనుషజ్జతే) = ఆసక్తుడు కాడో, తదా =

అప్పుడు, సర్వ సంకల్ప సన్న్యాసి = సమస్త సంకల్పములను త్యజించిన పురుషుడు, యోగారూఢః, ఉచ్యతే = యోగారూఢుడు అనబడును

తా. సమాహిత చిత్తుడైన యోగి ఇంద్రియార్థములగు శబ్దాదులందును, పూర్వకాలమునుంచి అభ్యస్తములగు కామ్యాది కర్మలందును, కర్తవ్యతాబుద్ధిని వదలి, ఆత్మారాముడును ఆత్మతృప్తుడును అయివుండును. అట్టి యోగి సర్వసంకల్పములను సన్న్యసించిన వాడగుచున్నాడు. అట్టి స్థితిలోనున్న యోగి యోగారూఢుడు.

శ్లో॥ ఉద్ధరేదాత్మనాత్మానం నాత్మానమవసాదయేత్
ఆత్మైవ హ్యాత్మనో బంధుః ఆత్మైవ రిపురాత్మనః 5

ఆత్మనా = (ప్రతివ్యక్తియు) తనచేత, ఆత్మానమ్ = తనయొక్క ప్రాణమును, ఉత్ + హరేత్ = ఊర్ధ్వమునకు తీసుకుపోవలెను, ఆత్మానమ్ = తనయొక్క ప్రాణమును, న, అవసాదయేత్ = క్రిందకు రానీయవలదు, హి = ఏలనన, ఆత్మ, ఏవ = (మనుష్యుడు) తానే, ఆత్మనః = తనకు, బంధుః = బంధువు, ఆత్మ, ఏవ = తానే, ఆత్మనః = తనకు, రిపుః = శత్రువు

తా. సంసార సాగరమగ్నమైయున్న మనస్సును, ఆత్మభావనారూపమై బుద్ధియొక్క బలముచే ఊర్ధ్వమునకు తీసికొనిపోయి ఆత్మరతము చేయవలెను. అట్లుగాక ఇంద్రియములద్వారా బహిర్ముఖమగు మనస్సు ఇంద్రియార్థములందు లగ్నమై అధోగతి పాలగుచున్నది.

ఉద్ధరేత్ =అనిన, ఉత్ + హరేత్. ఉత్ అనగా ఊర్ధ్వమనియు, హరేత్ అనగా తీసికొనిపోవలెననియు అర్థము. ప్రాణాయామ పరాయణుడగు యోగి మనస్సును ఊర్ధ్వమునకు తీసికొని పోగలుగును. మనస్సు ఊర్ధ్వగమనమున ఆత్మరతమగును. అప్పుడు యోగికి మనస్సు శ్రేయస్సును కలుగజేయును. కాన ఆ మనస్సు వానికి బంధువైనది. అధోగతికలవడిన మనస్సు బహిర్ముఖమై విషయాసక్తమగుటచే అనర్థములను కలుగజేయును. కావున ఆ మనస్సు శత్రువగుచున్నది. శత్రువైన మనస్సు వలన బాధలు కలుగును. బంధువు వలన సుఖసంతోషములు కలుగునట్లు సాత్త్వికమగు మనస్సు వలన ఆత్మసుఖము ప్రాప్తమగును. విషయసంగమను మాలిన్యము లేనిది యగుటచే మనస్సునకు విషయ సంగజనితములగు అనర్థములుండనేరవు. నిర్విషయమగు ఆత్మానందమే కలుగును. కావున బహిర్ముఖమై విషయరతమగు మనస్సు శత్రువై పాపరతమగును. అంతర్ముఖమై నిర్విషయమగు మనస్సు బంధువై ఆత్మానందమిచ్చును. అందుచే ఆత్మరతమగు మనస్సు కలవాడు కనుక యోగి పరమోత్కృష్టజీవి. అధోగతి శీలమైన మనస్సుగల మానవుడు నికృష్టుడు కావున యోగియై తనను తానుద్ధరించుకొనవలెను.

శ్లో॥ బంధురాత్మాత్మనస్తస్య యేనాత్మైవాత్మనా జితః
అనాత్మనస్తు శత్రుత్వే వర్తేతాత్మైవ శత్రువత్ 6

ఏన, ఆత్మనః, ఆత్మ = ఏ జీవాత్మ ద్వారా మనస్సుతో, ఇంద్రియములతో కూడిన శరీరము, జితః = జయిపబడినది యగునో, తస్య, ఆత్మనః = అట్టి జీవాత్మకు, ఆత్మ, ఏవ = తానే, బంధుః = మిత్రుడు, తు = మరియు, అనాత్మనః = మనస్సుతో, ఇంద్రియములతో కూడిన శరీరమును జయింపని వానికి, ఆత్మ, ఏవ = తానే, శత్రువత్ = శత్రువు వలె, శత్రుత్వే = శత్రుత్వమునందు (లక్ష్యసాధనకు అవరోధముగా), వర్తేత = వర్తించును

తా. జితేంద్రియుడగు యోగికి మనస్సు బంధువగును, ఇంద్రియార్థముల వెంటబడిన మనస్సు గలవాడు ప్రజ్ఞావిహీనుడగును. *'తదస్య హరతి ప్రజ్ఞాం'* (2-67) అను గీతవాక్యము ప్రమాణము. జితేంద్రియుడు కానిచో తనయాత్మయే తనకు శత్రువై అనర్థాపాదకమగును.

శ్లో॥ జితాత్మనః ప్రశాంతస్య పరమాత్మా సమాహితః
శీతోష్ణసుఖదుఃఖేషు తథా మానావమానయోః 7

శీతోష్ణ సుఖ దుఃఖేషు = శీతోష్ణ సుఖ దుఃఖముల యందును, తథా = అట్లే, మానావమానయోః = మాన అవమానముల యందును, ప్రశాంతస్య = అంతఃకరణ వృత్తులు నిశ్చలముగ ఉన్నట్టి, జితాత్మనః = స్వాధీనమైన మనస్సు గలవానియొక్క (జ్ఞానమునందు), పరమాత్మా = సచ్చిదానంద ఘనపరమాత్మ, సమాహితః = చక్కగా స్థితుడై ఉండును

తా. ఇంద్రియాదులను జయించిన యోగి ప్రసన్నాంతఃకరణుడగును. అట్టి యోగి ఆత్మావలోకనపరుడై శీతోష్ణములు మానావమానములు మొదలగు ద్వంద్వముల యెడ మనస్సులేక వాని బాధలెరుగనివాడగును. అనగా ద్వంద్వాతీతుడగునని భావము.

శ్లో॥ జ్ఞానవిజ్ఞానతృప్తాత్మా కూటస్థో విజితేంద్రియః
యుక్త ఇత్యుచ్యతే యోగీ సమలోష్టాశ్మకాంచనః 8

జ్ఞానవిజ్ఞాన తృప్తాత్మా = అంతఃకరణము నందు జ్ఞానవిజ్ఞానములు (శాస్త్రజ్ఞానము మరియు అనుభవ జ్ఞానము) నిండియున్నట్టి, కూటస్థః = వికార రహితుడును, జితేంద్రియః = ఇంద్రియములను జయించిన వాడును, సమలోష్టాశ్మ కాంచనః = మట్టిని, రాతిని, బంగారమును

సమానముగా, చూచువాడును అగు, యోగి = యోగిని, యుక్తః, ఇతి = యుక్తుడని, ఉచ్యతే = చెప్పబడును

తా. శాస్త్రములందు చెప్పబడిన విషయములను తెలిసి యోగానుష్ఠాన బలముచే స్వానుభవము సంపాదించిన యోగి శాస్త్రవిషయములందు విశేషజ్ఞానము కలవాడగును. అట్టి యోగికి ఆత్మరతి పెరిగి జితేంద్రియత్వము సిద్ధించును. ఆత్మనిష్ఠకు పరమశత్రువగు విక్షేపశక్తి నశించును. కాన అవికారుడై సమాహితుడై యుండును. పరిపూర్ణ వైరాగ్యము కలిగి యుక్తుడగు యోగి మట్టి, రాయి, బంగారములను సమభావముతో చూడగలుగును. అట్టి యోగిని యుక్తుడని, కూటస్థుడని యందురు. బంగారు పనిచేయునపుడు స్వర్ణకారులు ఉపయోగించు ఇనుపదిమ్మను కూటము అందురు. దాని పైనున్న బంగారము వికారము జెంది నానారూపముల ధరించును. ఎన్ని దెబ్బలు తిన్నను ఆ దిమ్మ వికారము చెందకయుండును. ఆ రీతిగానే మనఃక్షోభ కారణములున్నను, మనస్సు బంధువై ఆత్మానందమిచ్చును. అందుచే ఆత్మరతమగు మనస్సు సమాహితమై యుండునుకాన ఆ యోగి కూటమువలె అవ్యయుడును, అవికారియునై నిశ్చలుడై యుండును. అందుచే సమాహితుడైయున్న యోగి కూటస్థుడని యనబడును. వీనినే అక్షరుడనియు నందురు.

*"కూటస్థోఽక్షర ఉచ్యతే" (15-16)* బుద్ధిని ప్రకాశింపజేయు చైతన్యమును అక్షరుడందురు.

శ్లో॥ సుహృన్మిత్రార్యుదాసీనమధ్యస్థద్వేష్యబంధుషు
సాధుష్వపి చ పాపేషు సమబుద్ధిర్విశిష్యతే 9

సుహృన్మిత్రార్యుదాసీన మధ్యస్థద్వేష్య బంధుషు = సుహృదులు (అడుగకయే ఉపకారము చేయువారు), మిత్రులు, శత్రువులు, ఉదాసీనులు, మధ్యస్థులు, ద్వేషింప దగినవారు, బంధువులు మొదలగువారియందును, సాధుషు, చ = సత్పురుషుల యందును, పాపేషు, అపి = పాపులయందును, సమబుద్ధిః = సమాన భావము గలవాడు, విశిష్యతే = మిక్కిలి శ్రేష్ఠుడు.

తా. ఉపకారియందును, మిత్రుని యందును, శత్రువునందును, తటస్థుడై యున్న వానియందును, మధ్యవర్తియందును, తనపై పగపూనిన వానియందును, బంధువుపైనను, సత్పురుషులయందును, పాపాత్ములయందును, సమబుద్ధిగలిగి ఆత్మదర్శియైున వానిని జ్ఞానియందురు. అట్టిజ్ఞానియే యోగారూఢుడనబడును. సమభావ సిద్ధికి యోగాభ్యాసి కావలయును.

శ్లో॥ యోగీ యుంజీత సతతమాత్మానం రహసి స్థితః
ఏకాకీ యతచిత్తాత్మా నిరాశీరపరిగ్రహః 10

యత చిత్తాత్మా = శరీరేంద్రియ మనస్సులను వశమునందుంచుకొనిన వాడును, నిరాశీః = ఆశారహితుడును, అపరిగ్రహః = భోగసామగ్రిని ప్రోగుచేయని వాడును అగు, యోగీ = యోగి, ఏకాకి = ఒంటరిగా, రహసి = నిర్జన ప్రదేశమున, స్థితః = ఉన్నవాడై, ఆత్మానమ్ = తన మనస్సును, సతతమ్ = నిరంతరము, యుంజీత = పరమాత్మయందు లగ్నము చేయవలెను

తా. యోగాభ్యాస పరుడగు యోగి సర్వకాలములందును రహస్య ప్రదేశమందు ఏకాకిగానుండి, ఆశారహితుడై, యింద్రియములద్వారా విషయ పరిగ్రహమును త్యజించి, శుద్ధాన్తఃకరణుడయి ఆత్మధ్యానపరుడై యుండవలెను.

శ్లో॥ శుచౌ దేశే ప్రతిష్ఠాప్య స్థిరమాసనమాత్మనః
నాత్యుచ్ఛ్రితం నాతినీచం చేలాజినకుశోత్తరమ్ 11

శుచౌ, దేశే = పరిశుభ్రమైన ప్రదేశమున, చేలాజిన కుశోత్తరమ్ = కమముగా దర్భాసనమును, జింక చర్మమును, వస్త్రమును (ఒకదానిపైనొకటి) పరచబడినట్టియు, న, అత్యుచ్ఛ్రితమ్ = మిక్కిలి ఎత్తుగా లేనట్టియు, న అతి నీచమ్ = మిక్కిలి నిమ్నముగా లేనట్టిదియు అయిన, ఆత్మనః, ఆసీనమ్ = తన ఆసనమును, స్థిరమ్ = స్థిరముగ, ప్రతిష్ఠాప్య = ఏర్పరచుకొని

తా. శుచిగానున్న ప్రదేశమున మిక్కిలి ఎత్తుగను లేక మిక్కిలి పల్లముగను కాక యున్నచోట నిశ్చలముగా నుండునట్లు ఆసనము నేర్పరచుకొని, దానిపై దర్భాసనమును, దర్భాసనముపై మృగచర్మమును(జింకతోలు), దానిపై వస్త్రమును పరచి దానిమీద కూర్చుండవలయును.

శ్లో॥ తత్రైకాగ్రం మనః కృత్వా యతచిత్తేన్ద్రియక్రియః
ఉపవిశ్యాసనే యుంజ్యాత్ యోగమాత్మవిశుద్ధయే 12

తత్ర, ఆసనే = ఆ ఆసనముపై, ఉపవిశ్య = కూర్చుండి, యతచిత్తేంద్రియ క్రియః = చిత్తేంద్రియ క్రియలను వశమునందుంచుకొని, మనః = మనస్సును, ఏకాగ్రమ్, కృత్వా = ఏకాగ్రమొనర్చి, ఆత్మ విశుద్ధయే = అంతఃకరణ శుద్ధి కొరకు, యోగమ్ = యోగమును, యుంజ్యాత్ = అభ్యసింపవలెను.

తా. పై విధముగా నమర్చబడిన ఆసనమందు కూర్చుండి చిత్తేంద్రియ క్రియలు లేకుండునట్లు మనస్సునేకాగ్రముగా నుంచి, చిత్తశుద్ధి హేతువైన ప్రాణాయామరూప యోగమభ్యసింప వలయును.

వి. యోగాభ్యాస పాటవము వలన విషయ నిర్ముక్తమగు మనస్సు పరిశుద్ధమగును. అట్టి మనస్సు నివాతదీపమువలె నిశ్చలమై, ఆత్మయందు ప్రతిష్ఠిత మగును.

శ్లో॥ సమం కాయశిరోగ్రీవం ధారయన్నచలం స్థిరః
సంప్రేక్ష్య నాసికాగ్రం స్వం దిశశ్చానవలోకయన్ 13

కాయ శిరో గ్రీవమ్ = శరీరమును, శిరస్సును, మెడను, సమమ్ = నిటారుగా, అచలమ్ = నిశ్చలముగా, ధారయన్ = ఉంచుచూ (ఉంచి), చ = మరియు, స్థిరః = స్థిరముగా ఉన్నవాడై, స్వమ్ నాసికాగ్రమ్ = నాసిక మొదటి భాగమగు భ్రూమధ్యంపై, సంప్రేక్ష్య = దృష్టిని ఉంచి, దిశః, అనవలోకయన్ = చూపులను దిక్కులవైపు పోనీయక ఉంచవలెను.

తా. శరీరమును శిరస్సును, మెడను సమముగాను, నిశ్చలముగానుంచి స్థిరుడగుచు తన నాసికాగ్రభాగమున అనగా భ్రూమధ్య స్థానమున దృష్టిని నిలిపి దిక్కులను చూడక ఆత్మదర్శనపరుడై యుండవలయును.

వి. ఆత్మదర్శనము భ్రూమధ్య స్థానమున కలుగును. కనుక 'సంప్రేక్ష్యనాసికాగ్రం స్వం' అని చెప్పబడినది. ఈ వాక్యాంశమును 'చక్షుశ్చైవాంతరే భ్రువో' అని వేరుమాటలలో చెప్పిరి. 'సమంకాయ...గ్రీవం...న్నచలం' అనుటచేతను, 'దిశశ్చానవలోకయన్' అనుటచేతను ఆత్మదర్శనమునకు ఏకాగ్రతయొక్క ప్రాధాన్యము చూపబడినది. దిక్కులు చూడకుండా భ్రూమధ్యములో దృష్టిని నిలుపుటయనునది తన రెండు కళ్ళను పూర్తిగా తెరిచియే పైకి చూడవలెను. కళ్ళుమూయువానికి 'దిక్కులు చూడవలదు' అని చెప్పవలసిన అవసరమే లేకపోవును. కనుక యోగసాధకులు ఈ విషయమును గమనింపవలెను. కండ్లు తెరచియే కండ్లలోని నల్లగ్రుడ్డును పైకి తిప్పి, ఆత్మజ్యోతిని తనలోపల దర్శించుకొనవలెను.

శ్లో॥ ప్రశాంతాత్మా విగతభీః బ్రహ్మచారివ్రతే స్థితః
మనః సంయమ్య మచ్చిత్తో యుక్త ఆసీత మత్పరః 14

యుక్తః = యోగి, బ్రహ్మచారి వ్రతే = బ్రహ్మచర్య వ్రతమునందు, స్థితః = ఉన్నవాడై, విగతభీః = భయములేనివాడై, ప్రశాంతాత్మ = ప్రశాంతమైన అంతఃకరణము గలవాడు, మనః = మనస్సును, సంయమ్య = వశమునందుంచుకొని, మచ్చిత్తః = నాయందే చిత్తము గలవాడును, మత్పరః = మత్పరాయణుడును అయి, ఆసీత = ఉండవలెను

తా. మిక్కిలి శాంతిని పొందిన మనస్సు కలవాడై నిర్భయుడై బ్రహ్మచారి వ్రతమును పాటించుచు, మనస్సును ప్రాణాయామముచే విషయ విముఖము చేసి సర్వాత్మనగు నాయందు చిత్తమును నిల్పినవాడగుచు నాకంటె వేరుగా ఎవరు లేరని, నన్నే సర్వశ్రేష్ఠునిగా భావించుచు సమాహితుడై యుండవలెను.

శ్లో॥ యుంజన్నేవం సదాత్మానం యోగీ నియతమానసః
శాంతిమ్ నిర్వాణపరమాం మత్సంస్థామధిగచ్ఛతి 15

నియతమానసః యోగి = మనోనిగ్రహము గలవాడగు యోగి, ఏవమ్ = ఈ ప్రకారముగా, ఆత్మానమ్ = తన మనస్సును, సదా = నిరంతరము, యుంజన్ = (పరమేశ్వరుడనైన నా స్వరూపమునందే) లగ్నమొనర్చుచూ, మత్సంస్థామ్ = నాయందు స్థితమైయున్న, నిర్వాణ పరమామ్, శాంతిమ్ = పరమానందమునకు పరాకాష్ఠ రూపమైన శాంతిని, అధిగచ్ఛతి = పొందును.

తా. ఈ విధమున మనోనిగ్రహముకల యోగనిష్ఠారతుడగు యోగి ఆత్మధ్యాన పరుడగుచు, ఆత్మగతమైన పరమానంద సుఖమును పొందుచున్నాడు. అట్టియోగి మనస్సు బహిర్ముఖముగాక ఆత్మయందే నిశ్చలమై యుండును.

శ్లో॥ నాత్యశ్నతస్తు యోగోఽస్తి న చైకాంతమనశ్నతః
న చాతిస్వప్నశీలస్య జాగ్రతో నైవ చార్జున 16

అర్జున = ఓ అర్జునా!, యోగః = యోగము, అతి, అశ్నతః, తు = అతిగా భుజించువానికిని, న, అస్తి = కలుగనేరదు, ఏకాంతమ్, అనశ్నతః, చ = ఏమాత్రము భుజింపని వానికిని, న = కలుగనేరదు, అతి, స్వప్న శీలస్య, చ = మిక్కిలి నిద్రించువానికిని, జాగ్రతః, చ = పూర్తిగా మేల్కొని యుండువానికిని, న, ఏవ = కలుగనే కలుగదు

తా. ఓ అర్జునా! ఆహారలోలుడై అధికముగా తినువానికి, బొత్తిగా భుజించని వానికిని, అధికముగా నిద్రించువానికిని, నిద్రించక యెల్లప్పుడు మేల్కొని యుండువానికి యోగము సిద్ధించదు.

శ్లో॥ యుక్తాహారవిహారస్య యుక్తచేష్టస్య కర్మసు
యుక్తస్వప్నావబోధస్య యోగో భవతి దుఃఖహా 17

యుక్తాహార విహారస్య = యుక్తమైన (తగిన) ఆహార విహారములు కలవాడును, కర్మసు = కర్మాచరణములయందు, యుక్త చేష్టస్య = యోగ్యముగా ప్రవర్తించువాడును, యుక్త

స్వప్నావబోధస్య = నిద్రయందును, మేల్కొనియుండుట యందును యథా యోగ్యముగా ఉండువాడును - అగు మనుష్యునకు, దుఃఖహా = దుఃఖ నాశకమగు, యోగః = యోగము, భవతి = అగును (సిద్ధించును)

తా. ఉచితాహార విహారములు కలిగి, తగుమాత్రమే చేష్టలను చేయుచు, శరీరమునకు అలసట కలుగు కర్మల నాచరించక ఉచితరీతిని నిద్రించుచు, మేల్కొనుచు యున్నవానికి యోగము సిద్ధిని కలుగజేసి దుఃఖమును హరించును.

వి. 'రస్యాఃస్నిగ్ధాఃస్థిరా హృద్యా ఆహారా సాత్వికా ప్రియాః' అను వాక్యానుసారము భుజించుట యుక్తాహారమగును. యోగియొక్క ఆహారమితిని గూర్చి.....

శ్లో: పూరయేదశనేనార్థం తృతీయ ముదకేన తు
వాయోస్సంచరణార్థం తు చతుర్థమవ శేషయేత్ (సన్న్యాసోపనిషత్- 59)

ఆహారకోశమున సగభాగమన్నముతోను, మూడవభాగము జలముతోను నింపి, వాయు సంచారణ నిమిత్తము నాలుగవ భాగమును శూన్యముగా నుంచవలెను.

శ్లో॥ యదా వినియతం చిత్తమ్ ఆత్మన్యేవావతిష్ఠతే
నిఃస్పృహః సర్వకామేభ్యో యుక్త ఇత్యుచ్యతే తదా 18

వినియతమ్ = బాగుగా నిగ్రహింపబడిన, చిత్తమ్ = చిత్తము, యదా = ఎప్పుడు, ఆత్మని, ఏవ = పరమాత్మయందే, అవతిష్ఠతే = స్థిరముగానుండునో, తదా = అప్పుడు, సర్వకామేభ్యః = సమస్త భోగముల నుండి, నిఃస్పృహః = స్పృహ (వాంఛ) రహితుడైన, (పురుషః) = పురుషుడు, యుక్తః, ఇతి = యోగయుక్తుడు అని, ఉచ్యతే = చెప్పబడును

తా. ఏకాగ్రత కలిగిన చిత్తము బహిర్ముఖత్వమను దోషముచే విముక్తమై యుండును. కాన సర్వకామములయందును తృష్ణ లేక కేవలమాత్మరతమై యుండును. అట్లాత్మయందు స్థిరచిత్తుడగు యోగిని యుక్తుడందురు.

శ్లో॥ యథా దీపో నివాతస్థో నేంగతే సోపమా స్మృతా
యోగినో యతచిత్తస్య యుంజతో యోగమాత్మనః 19

నివాతస్థః = వాయుప్రసారము లేనిచోట ఉన్న, దీపః = దీపము, యథా = ఎట్లు, న, ఇంగతే = చలింపకయుండునో, స = అట్టి, ఉపమా = పోలిక (దృష్టాంతము), ఆత్మనః =

పరమేశ్వరుని యొక్క, యోగమ్ = యోగము, యుంజతః = అనుష్ఠించుచున్న, యోగినః = యోగి యొక్క, యతచిత్తస్య = నిగ్రహింపబడిన చిత్తమునకు, స్మృతా = భావింపబడినది

తా. సంయత చిత్తుడైన యోగి, తన చిత్తమును ఆత్మరతముజేసి యోగరతుడై నిశ్చలముగానుండి వాయుసంచార రహితమైన ప్రదేశమందలి దీపమువలె కదలక మెదలక యుండును.

శ్లో॥ యత్రోపరమతే చిత్తం నిరుద్ధం యోగసేవయా
యత్ర చైవాత్మనాత్మానం పశ్యన్నాత్మని తుష్యతి 20

యోగసేవయా = యోగసాధనచే, నిరుద్ధమ్ = నిగ్రహింపబడిన, చిత్తమ్ = చిత్తము, యత్ర = ఏ స్థితియందు, ఉపరమతే = ఉపరతిని పొందునో, చ = మరియు, యత్ర = ఏ స్థితియందు (పరమాత్మను ధ్యానించుట వలన పవిత్రమైన), ఆత్మన = సూక్ష్మబుద్ధి ద్వారా, ఆత్మానమ్ = పరమాత్మను, పశ్యన్ = (యోగి) చూచుచూ (సాక్షాత్కరింపజేసుకొనుచు), ఆత్మని ఏవ = సచ్చిదానంద ఘన పరమాత్మయందే, తుష్యతి = సంతుష్టుడగునో

తా. యోగాభ్యాసపరుడగు వాని చిత్తము ఇంద్రియ వ్యాపారముల నుండి ఉపరతము కాగా యోగి, ఆత్మదర్శనము చేయుచు ఆత్మానందానుభూతిచే తృప్తుడై యుండును.

శ్లో॥ సుఖమాత్యంతికం యత్తత్ బుద్ధిగ్రాహ్యమతీంద్రియమ్
వేత్తి యత్ర న చైవాయం స్థితశ్చలతి తత్త్వతః 21

అతీంద్రియమ్ = ఇంద్రియాతీతమైనది, బుద్ధి గ్రాహ్యమ్ = పవిత్రమైన సూక్ష్మబుద్ధి ద్వారా మాత్రమే గ్రహింపదగినదియు, ఆత్యంతికమ్ = నిరవధికమైన, యత్, సుఖమ్ = ఏ బ్రహ్మానందము కలదో, తత్ = దానిని (ఆ బ్రహ్మానందమును), యత్ర = ఏ స్థితియందు, వేత్తి = అనుభవించునో, చ = మరియు, (యత్ర) స్థితః = దేనియందు స్థితుడైన, అయమ్ = ఈ యోగి, తత్త్వతః = పరమాత్మ స్వరూపము నుండి, న, ఏవ, చలతి = ఎన్నడునూ విచలితుడు కాడో

తా. ఇంద్రియాతీతమైనది, బుద్ధిచే గ్రాహ్యమైనది, అనంతమైనదియునగు బ్రహ్మానందము నెరిగిన యోగి ఆ స్థితినుండి ఎన్నటికిని చలింపడు. విషయసుఖము తుచ్ఛమైనది. కావున, నిరతిశయ బ్రహ్మానందానుభూతి కలయోగి తుచ్ఛసుఖముల మీద ఆశపడడని భావము.

శ్లో॥ యం లబ్ధ్వా చాపరం లాభం మన్యతే నాధికం తతః
యస్మిం స్థితో న దుఃఖేన గురుణాపి విచాల్యతే 22

శ్లో॥ తం విద్యాద్దుఃఖసంయోగవియోగం యోగసంజ్ఞితమ్
స నిశ్చయేన యోక్తవ్యో యోగోఽ నిర్విణ్ణచేతసా 23

యమ్, లాభమ్ = ఏ ప్రయోజనమును, లబ్ధ్వా = పొంది, తతః, అధికమ్ = దానికంటే అధికముగా, అపరమ్ = మరియొక దానిని, న, మన్యతే = విశ్వసింపడో, చ = మరియు, యస్మిన్ = పరమాత్మ ప్రాప్తి రూపమైన ఏ అవస్థయందు, స్థితః = స్థితుడైయుండు యోగి, గురుణా, దుఃఖేన, అపి = తీవ్రమైన దుఃఖము వలన కూడా, న, విచాల్యతే = చలింపబడడో, దుఃఖ సంయోగ వియోగమ్ = దుఃఖరూప సంసార బంధముల నుండి విముక్తిని కలిగించు, తమ్ = అట్టి స్థితిని, యోగసంజ్ఞితమ్ = యోగమను పేరుతో, విద్యాత్ = ఎరుంగవలెను, సః, యోగః = ఆ యోగము, అనిర్విణ్ణచేతస = విసుగులేని చిత్తముతో (ధైర్యోత్సాహములతో), నిశ్చయేన = నిశ్చయముగా, యోక్తవ్యః = సాధన చేయదగినది.

తా. ఆత్మలాభము కలిగిన యోగి మరి ఏ ఇతర లాభములను, ఆత్మలాభము కంటె అధికములని కాని సమములని కాని తలచడు.

*'ఆత్మలాభాన్నపరం విద్యతే' (ఆపస్తంభ సూత్రమ్-ఆధ్యాత్మ విచారం 1.8.22.2)*

అనుటచే ఆత్మానంద ప్రాప్తి నిరతిశయమని గ్రహించదగును. పరమోత్కృష్టమగు బ్రహ్మానందము అనుభవించు యోగి ఎటువంటి గొప్ప దుఃఖము వచ్చినను చలింపడు. కావున యోగమనగా లవలేశమైన దుఃఖమును కూడ స్పృశింపజేయక ఎల్లకాలముల నిరతిశయమైన బ్రహ్మసుఖమిచ్చునదియని గ్రహింపనగును. కాన చిత్తమున పరితాపమును పొందక యోగయుక్తుడయి యుండవలెనని భగవానుని భావము.

శ్లో॥ సంకల్పప్రభవాన్ కామాన్ త్యక్త్వా సర్వానశేషతః
మనసైవేంద్రియగ్రామం వినియమ్య సమంతతః 24

సంకల్ప ప్రభవాన్ = సంకల్పముల నుండి ఉత్పన్నములగు, సర్వాన్, కామాన్ = కోరికలనన్నింటినీ, అశేషతః = నిశ్శేషముగా, త్యక్త్వా = త్యజించి, మనసా = మనస్సు ద్వారా, ఇంద్రియ గ్రామమ్ = ఇంద్రియ సముదాయమును, సమంతతః, ఏవ = అన్నివైపుల నుండియు, వినియమ్య = చక్కగా (పూర్తిగా) నిగ్రహించి

తా. సంకల్పముచే కోరికలు జనించుచున్నవి. వాటినన్నిటికి నిశ్శేషముగా త్యజించవలెను. ఇంద్రియార్థములవైపు సంచరించు ఇంద్రియములను చిత్తవృత్తి నిరోధజనకమైన యోగముద్వారా వివేకయుక్తమగు మనస్సును ఆత్మరతము చేయవలెనని భావము.

వి. సంకల్పమునకు మూలము మనస్సు. 'సంకల్పమూలః కామోవై' అను ప్రమాణముచే సంకల్పమువలన కామాదులు కలుగుచుండును. యోగి మనస్సంయమమునకు కారణమైన యోగము ద్వారా మనస్సును అంతర్ముఖము గావించి యాత్మానందరతుడై యుండును. మనస్సు బహిర్ముఖత్వమును కోలుపోయి విషయవాంఛను త్యజించును.

శ్లో॥ శనైః శనైరుపరమేత్ బుద్ధ్యా ధృతిగృహీతయా
ఆత్మసంస్థం మనః కృత్వా న కించిదపి చింతయేత్ 25

శనైః = క్రమక్రమముగా (అభ్యసించుచూ), ఉపరమేత్ = ఉపరతిని పొందవలెను, ధృతిగ్రహీతయ = ధైర్యయుక్తమైన, బుద్ధ్యా = బుద్ధి ద్వారా, మనః = మనస్సును, ఆత్మసంస్థమ్, కృత్వా = పరమాత్మయందు స్థితమొనర్చి, కించిత్, అపి = పరమాత్మను తప్ప మరిదేనిని కూడ, న, చింతయేత్ = స్మరింపరాదు

తా. ధైర్యముతో కూడియున్న బుద్ధి ద్వారా క్రమక్రమముగా విషయోపరమము గావించిన పిమ్మట నిర్విషయమైన మనస్సును ఆత్మయందుంచి బుద్ధితో ఏమియు ఆలోచన చేయక యోగి ఆత్మరతుడై యుండును.

వి. ప్రాణవాయు స్పందనము నిరోధింపబడనిచో మనోనిగ్రహము దుర్ఘటము. ప్రాణస్పందమే మనశ్చాంచల్యమునకు హేతువు. మనోనిగ్రహము క్రమక్రమముగా అభ్యసింపవలయును. సాత్త్విక ధైర్యముచే ఇంద్రియములను విషయములనుండి విరమింపజేసి యోగబలముచే ఇతర చింతలకు అవకాశమీయక ఆత్మస్థానమగు బుద్ధిగుహయందు ప్రవేశించి ఆత్మయందు మనస్సును జొప్పింపవలెను.

*శ్లో: ధృత్యాయయా ధారయతే మనఃప్రాణేన్ద్రియ క్రియాః*
*యోగేనావ్యభిచారిణ్యా ధృతి స్సాపార్థసాత్త్వికీ* *(18-33)*

అను గీతావాక్యానుసారము సాత్త్వికి ధృతివలన మనస్సుకు ఆత్మనిష్ఠ కలుగును.

శ్లో॥ యతో యతో నిశ్చరతి మనశ్చంచలమస్థిరమ్
తతస్తతో నియమ్యైతత్ ఆత్మన్యేవ వశం నయేత్ 26

అస్థిరమ్ = స్థిరముగా నిలువనట్టి, చంచలమ్ = చలించునట్టి, ఏతత్, మనః = ఈ మనస్సు, యతః, యతః = ఏయే శబ్దాది విషయముల కారణముగా, నిశ్చరతి = (విశృంఖలముగా) సంచరించునో, తతః, తతః = ఆయా విషయముల నుండి (దానిని), నియమ్య = నియమించి

(మరల్చి), ఆత్మని, ఏవ = పరమాత్మయందే, వశమ్, నయేత్ = (పదే పదే) స్థిరపరచవలెను.

తా. మనస్సు చంచలమైనది. స్థిరముగా ఒకచోటనుండజాలదు. ఏయే విషయములపై మనస్సు తిరుగుచుండునో ఆయా విషయములనుండి మనస్సును మరలించి యోగజ్ఞాన బలముచే ఆత్మవశము చేయవలెను. అనగా ఆత్మసంస్థమైయున్న మనస్సుకు విషయవైరాగ్యము సహజముగా కలుగును. అందువలన ఆత్మరతమై యుండును. యోగి యోగాభ్యాసపాటవమున ఆత్మసంస్థుడై యుండి పరమశాంతిని పొందును.

*'శాంతిం నిర్వాణ పరమాం మత్సంస్థామధి గచ్ఛతి'* *(6-15)*

శ్లో॥ ప్రశాంతమనసం హ్యేనం యోగినం సుఖముత్తమమ్
ఉపైతి శాంతరజసం బ్రహ్మభూతమకల్మషమ్ 27

హి = ఏలనన, ప్రశాంత మనసమ్ = ప్రశాంతమైన మనస్సు కలవాడును, అకల్మషమ్ = పాపరహితుడు, శాంత రజసమ్ = ప్రాపంచిక విషయములయందు ఆసక్తి తొలగిన వాడును, (శాంతించిన రజోగుణము కలవాడును), బ్రహ్మభూతమ్ = సచ్చిదానంద ఘనపరమాత్మయందు ఏకీభావము పొందినవాడును అగు, ఏనమ్, యోగినమ్ = ఈ యోగిని, ఉత్తమమ్ = సర్వశ్రేష్ఠమైన, సుఖమ్ = బ్రహ్మానందము, ఉపైతి = పొందును.

తా. ఆత్మసంస్థమగు మనస్సుకు పరమశాంతి లభ్యమగును *'ఉపైతి శాంత రజసం'* యోగి రజోగుణము శమించిన పిమ్మట ప్రశాంతమైన మనస్సు కలవాడై, నిరతిశయమగు ఆత్మానందమును బొందును. అట్టియోగి కల్మషరహితుడై యుండును, ఆ యోగి సర్వము బ్రహ్మయే అని నిశ్చయముగా నెరిగినవాడై బ్రహ్మమేయగుచున్నాడు. *'బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి'*

*శ్లో: విక్షేపోయస్య నాస్త్యస్య బ్రహ్మవిత్త్వం నమన్యతే*
*బ్రహ్మైవాయమితి ప్రాహుఃమునయః పారదర్శినః* *(వేదాంత పంచదశి)*

అను ప్రమాణమునకు కూడ భావమిదియే. యోగబలమున రజోగుణము శమించి కల్మష విముక్తుడయి ప్రశాంతమానసుడగును.

శ్లో॥ యుంజన్నేవం సదాత్మానం యోగీ విగతకల్మషః
సుఖేన బ్రహ్మసంస్పర్శమత్యంతం సుఖమశ్నుతే 28

విగత కల్మషః = పాప రహితుడగు, యోగీ = (ఆ) యోగి, ఏవమ్ = ఇట్లు, సదా =

సంతతము, ఆత్మానమ్ = తన మనస్సును, యుంజన్ = (పరమాత్మయందే) లగ్నమొనర్చుచు, సుఖేన = సుఖముగా (హాయిగా), బ్రహ్మ సంస్పర్శమ్ = పరబ్రహ్మ పరమాత్మ ప్రాప్తిరూపమైనదియు, అత్యంతమ్ = అనంతమైనదియునగు, సుఖమ్ = ఆనందమును, అశ్నుతే = అనుభవించును.

తా. ఈ రీతిగా కల్మష విముక్తుడయి ప్రశాంత మానసుడైన యోగి ఆత్మరతుడగును. కావున అనాయాసముగా నిరతిశయమైన బ్రహ్మానందముననుభవించును.

శ్లో॥ సర్వభూతస్థమాత్మానం సర్వభూతాని చాత్మని
ఈక్షతే యోగయుక్తాత్మా సర్వత్ర సమదర్శనః 29

యోగయుక్తాత్మా = సర్వవ్యాపమైన అనంత చైతన్యమునందు ఏకీభావ స్థితిరూప యోగయుక్తమైన ఆత్మగలవాడును, సర్వత్ర = అంతటనూ (అన్నింటినీ), సమదర్శనః = సమభావంతో చూచువాడును అగు యోగి, ఆత్మానమ్ = తన ఆత్మను, సర్వభూతస్థమ్ = సర్వ ప్రాణులయందును స్థితమైయున్నట్లుగను, చ = మరియు, సర్వభూతాని = ప్రాణులను అన్నింటినీ, ఆత్మని ఈక్షతే = తనాత్మయందు (కల్పితములుగను) చూచును

తా. చరాచరములగు సర్వభూతములందు సమభావము కలిగియున్న సమాహితచిత్తుడగు యోగి, పరమాత్మను సర్వభూతములకు ఆధారమైయున్న వానినిగను, పరమాత్మ ఆధారముగా సర్వభూతములున్నట్లును చూచుచు సమ్యక్ దర్శన సంపన్నుడగును.

వి. *'ఈక్షతే యోగయుక్తాత్మా'* అనుటచే సమాహిత చిత్తుడగు యోగియే సమ్యక్ దర్శనము చేయగలడని భావము. సమ్యక్ దర్శనమనిన సర్వత్ర ఆత్మదర్శన లాభము. *'అంతర్బహిశ్చతత్ సర్వం'* అను శృత్యర్థమిచ్చట ప్రతిపాదింపబడినది. సర్వభూతముల లోపల ఆత్మకలదు. అవ్యక్తముగా నున్న ఆత్మయందు ఈ చరాచరాత్మక జగత్తుకలదు.

*శ్లో: 'సంపశ్యన్ బ్రహ్మపరమం యాతి నాన్యేనహేతునా'* *(కైవల్యోపనిషత్-10)*

ఇచ్చట యోగమువలన జ్ఞానము కలుగుననియు జ్ఞానమువలన కైవల్యప్రాప్తియనియు బోధింపబడినది. యోగము కంటె మరొక హేతువు సమ్యక్ దర్శనమునకు లేదని స్పష్టముగా చెప్పబడినది.

శ్లో॥ యో మాం పశ్యతి సర్వత్ర సర్వం చ మయి పశ్యతి
తస్యాహం న ప్రణశ్యామి స చ మే న ప్రణశ్యతి 30

యః = ఏ పురుషుడైతే, సర్వత్ర = సకల ప్రాణులయందును, మామ్ = ఆత్మ రూపమున వ్యాపించియున్న నన్ను (వాసుదేవుని), పశ్యతి = చూచునో, చ, సర్వమ్ = అట్లే సమస్త ప్రాణులను, మయి = నాయందు (అంతర్గతములైయున్నట్లు), పశ్యతి = చూచునో, తస్య = ఆ పురుషునకు, అహమ్ = నేను, న, ప్రణశ్యామి = అదృశ్యుడను కాను, సః, చ = అతడును, మే = నాకు, న, ప్రణశ్యతి = అదృశ్యుడు కాడు

తా. పై శ్లోకార్థమున చెప్పిన భావమే మరల యిచ్చటను ప్రతిపాదింపబడినది. అతి ముఖ్యమైన విషయము మరల బోధింపబడును. ఉత్తరార్థమున భగవానుడు భక్తవాత్సల్యమును ప్రకటించుచున్నాడు. "సమ్యగ్దర్శన సంపన్నుడగు యోగికి నేనెల్లకాలముల ప్రత్యక్షముగనే యుందును. అట్లే ఆ యోగియు నా కత్యంతప్రియుడు కాన పరోక్షముగా నుండడు. వానిని నేను రక్షించుదు" నని భావము.

శ్లో॥ సర్వభూతస్థితం యో మాం భజత్యేకత్వమాస్థితః
సర్వథా వర్తమానోఽపి స యోగీ మయి వర్తతే 31

యః = ఏ పురుషుడు (యోగి), ఏకత్వమ్, ఆస్థితః = భగవంతునియందు ఏకీభావ స్థితుడై, సర్వభూతస్థితమ్ = సమస్త భూతములయందును ఆత్మరూపమున స్థితుడైయున్న, మామ్ = సచ్చిదానంద ఘనవాసుదేవుడనైన నన్ను, భజతి = భజించునో, సః, యోగీ = అట్టి యోగి, సర్వథా, పరమాత్మనః, అపి = సర్వవ్యవహారములయందు ప్రవర్తించుచున్ననూ, మయి = (వాసుదేవుడనైన) నాయందే, వర్తతే = ప్రవర్తించును

తా. భూతములు నానావిధములైనను సర్వభూతాంతర్యామియగు ఆత్మ ఒక్కటియని ఎరిగి భజించు యోగి అనేక విధములుగా వర్తించుచున్ననూ, సర్వాత్మనగు నాయందున్నవాడే యగుచున్నాడు. అనగా ఏకభావముల ఆత్మను ఉపాసించువాడు నిత్యముక్తుడే యగును.

వి. 'వాసుదేవస్సర్వమితి' అను గీతావచన ప్రకారం యెవడు సర్వము భగవంతుడే యను అభేదజ్ఞానము కలిగి ఎవనిని సేవించినను, వాడు అద్వయము, అవ్యయమునగు సర్వాత్మను సేవించినవాడగును. అట్టివాడు నిత్యముక్తుడనియు, సమ్యగ్దర్శియనియు చెప్పబడును.

శ్లో॥ అత్మౌపమ్యేన సర్వత్ర సమం పశ్యతి యోఽర్జున
సుఖం వా యది వా దుఃఖం స యోగీ పరమో మతః 32

అర్జున = ఓ అర్జునా!, యః = ఏ యోగి, సర్వత్ర = అంతట (సమస్త ప్రాణులను), ఆత్మౌపమ్యేన = తనవలె (తనతో), సమమ్ = సమానముగా, పశ్యతి = చూచునో, సుఖమ్, వా యది, వా దుఃఖమ్ = సుఖమునుగాని దుఃఖమునుగాని (సమానముగా భావించునో), సః యోగి = అట్టి యోగి, పరమః మతః = పరమశ్రేష్ఠుడని భావింపబడును.

తా. ఓ అర్జునా ! ఎవడితరులకు కలుగు సుఖదుఃఖములు తనకు కలుగు సుఖదుఃఖములవలె ఇష్టానిష్టములను కలుగజేయునని తలచి సర్వభూతములను హింసించక సమభావముతో చూడకలుగునో అట్టియోగి ఉత్తముడని శ్రీకృష్ణభగవానుడు చెప్పుచున్నాడు.

**అర్జున ఉవాచ:**

శ్లో॥ యోఽయం యోగస్త్వయా ప్రోక్తః సామ్యేన మధుసూదన
ఏతస్యాఽహం న పశ్యామి చంచలత్వాత్ స్థితింస్థిరామ్ 33

మధుసూదన = ఓ మధుసూదనా!, సామ్యేన = సమభావంతో (సమభావమును గూర్చి), యః = ఏదైతే, అయమ్, యోగః = ఈ యోగము, త్వయా = నీచేత, ప్రోక్తః = చెప్పబడినదో, చంచలత్వాత్ = మనస్చాంచల్య కారణమున, అహమ్ = నేను, ఏతస్య = ఈ యోగము యొక్క, స్థిరామ్ స్థితిమ్ = శాశ్వత స్థితిని, న, పశ్యామి = తెలిసికొన (దర్శింప) లేకున్నాను

తా. అర్జునుడు కృష్ణభగవానునితో ఇట్లు పలికెను. ఓ మధుసూదనా! సర్వత్ర సమభావములను కలుగజేయు యోగమును నీవు చెప్పితివి. కాని నా మనస్సు చంచలమైయున్నది. కనుక సర్వమాత్మయేయను భావమును కలుగజేయు బుద్ధియోగమున నా మనస్సు స్థిరముగా నుండజాల కున్నది.

శ్లో॥ చంచలం హి మనః కృష్ణ ప్రమాథి బలవద్దృఢమ్
తస్యాహం నిగ్రహం మన్యే వాయోరివ సుదుష్కరమ్ 34

హి = ఏలనన, కృష్ణ = ఓ కృష్ణా!, మనః = మనస్సు, చంచలమ్ = మిక్కిలి చంచలమైనది, ప్రమాథి = ప్రమథన శీలమైనది, దృఢమ్ = దృఢమైన, బలవత్ = మిక్కిలి బలీయమైనది, (అతః) = అందువలన, తస్య, నిగ్రహమ్ = దానిని నిగ్రహించుట, వాయోః, ఇవ = వాయువును నిగ్రహించుట వలె, సుదుష్కరమ్ = అతి దుష్కరము అని, అహమ్, మన్యే = నేను తలంతును

తా. ఓ కృష్ణా! మనస్సు చంచలమైనది. క్షోభను కలిగించునట్టిది. ఎక్కువ బలము కలది. ఛేదించుటకనువైనది కాక దృఢమైనది. అటువంటి మనస్సును నిగ్రహించుట వాయువును

నిగ్రహించుటవలెనే కడు దుష్కరమైనది.

**శ్రీ భగవానువాచ:**

శ్లో॥ అసంశయం మహాబాహో మనో దుర్నిగ్రహం చలమ్
అభ్యాసేన తు కౌంతేయ వైరాగ్యేణ చ గృహ్యతే 35

మహాబాహో = ఓ అర్జునా!, అసంశయమ్ = నిస్సందేహముగ, మనః = మనస్సు, చలమ్ = చంచలమైనదే, దుర్నిగ్రహమ్ = నిగ్రహింప శక్యము కానిదే, తు = అయిననూ, కౌంతేయ = ఓ కుంతీసుతా!, అభ్యాసేన, చ = అభ్యాసము చేతను, వైరాగ్యేణ = వైరాగ్యము వలనను, గృహ్యతే = నిగ్రహింపబడును (నిగ్రహించుట సాధ్యమే)

తా. శ్రీకృష్ణభగవానులిట్లుచెప్పిరి. అర్జునా! మనస్సు చంచలమైనందున నిగ్రహించుటకలవి కానిది. ఇది నిక్కము. ఇందు సంశయములేదు. కాని మనోనిగ్రహరూపమైన యోగమభ్యసించుట చేతను, వైరాగ్యము చేతను మనస్సును జయించవచ్చును.

వి. *శ్లో॥ యః ప్రాణపవనస్పందశ్చిత్త స్పందః స ఏవహి* *(యోగవాశిష్ఠమ్)*

ప్రాణవాయుచలనము వలన చిత్తచాంచల్యము కలుగుచున్నది.

*శ్లో॥ చలేవాతే చలోబిందుః నిశ్చలే నిశ్చలో భవేత్'* *(యోగచూడామణ్యుపనిషత్-20)*

ప్రాణవాయు చలనమువలన మనస్సు చలించుచున్నది. ప్రాణవాయువు నిశ్చలమైనచో మనస్సు నిశ్చలమగునని శాస్త్రము చెప్పుచున్నది. కావున ప్రాణవాయు నిరోధమవశ్య కర్తవ్యము. ప్రాణవాయు నిరోధము ప్రాణాయామ యోగముద్వారా సాధ్యము. ఆ యోగాభ్యాసముచే యోగి స్థాణువువలె నిశ్చల భావమును పొందును. అటువంటి యోగమునభ్యసించియు, దాని వలన కలిగిన జ్ఞానమువల్ల నిష్పన్నమైన వైరాగ్యబలము చేతను, దుష్కరమగు మనోనిగ్రహము సాధ్యమని భగవానుని మతము.

శ్లో॥ అసంయతాత్మనా యోగో దుష్ప్రాప ఇతి మే మతిః
వశ్యాత్మనా తు యతతా శక్యోఽవాప్తుముపాయతః 36

అసంయతాత్మనా = మనస్సును వశపరచుకొనని వానికి, యోగః = యోగము (యోగసిద్ధి), దుష్ప్రాపః = దుష్ప్రాప్యము (పొందుట అశక్యము), తు = అయితే, వశ్యాత్మనా = మనస్సు వశమైన, యతతా ఉపాయతః = ప్రయత్నశీలునకు సాధన ద్వారా, అవాప్తుమ్ = (దానిని) పొందుట, శక్యః ఇతి = శక్యమే అని, మే, మతిః = నా అభిప్రాయము

తా. ఆత్మ సంయమము లేనివానికి సార్వాత్మ్యరూపమైన యోగము పొందనలవికానిదని 'నాభావ'మని శ్రీకృష్ణభగవానులు చెప్పిరి. యోగోపాయము ద్వారా ప్రయత్నించు పురుషునకు ఆత్మసంయమము కలిగి సార్వాత్మ్య సిద్ధి కలుగును.

**అర్జున ఉవాచ:**

శ్లో॥ అయతిః శ్రద్ధయోపేతో యోగాచ్చలిత మానసః
అప్రాప్య యోగ సంసిద్ధిం కాం గతిం కృష్ణ గచ్ఛతి 37

కృష్ణ = ఓ కృష్ణా!, శ్రద్ధయా, ఉపేతః = (యోగము నందు) శ్రద్ధాదరములు గలవాడైనను, అయతిః = సంయమి కానివాడై, యోగాత్, చలిత మానసః = యోగము నుండి చలించిన మనస్సుకలవాడైన (సాధకుడు), యోగసంసిద్ధమ్ = యోగసిద్ధిని, అప్రాప్య = పొందక, కామ్, గతిమ్ = ఎట్టి గతిని, గచ్ఛతి = పొందును ?

తా. అర్జునుడు శ్రీకృష్ణభగవానుని ఈ రీతిగా ప్రశ్నించెను. ఓ కృష్ణా! శ్రద్ధాసక్తులుండియు తీవ్రప్రయత్నములేక యోగనిష్ఠనుండి మనస్సు చలించినవాడు యోగమున సిద్ధిని పొందజాలక యే గతిని పొందినవాడగును? సమ్యగ్దర్శనము యోగసిద్ధియని తెలియనగును.

శ్లో॥ కచ్చిన్నోభయవిభ్రష్టః ఛిన్నాభ్రమివ నశ్యతి
అప్రతిష్ఠో మహాబాహో విమూఢో బ్రహ్మణః పథి 38

మహాబాహో = ఓ కృష్ణా!, బ్రహ్మణః, పథి = భగవత్ ప్రాప్తిరూప మార్గము నందు, విమూఢః = మోహితుడై, అప్రతిష్ఠః = ఆశ్రయ రహితుడై, ఛిన్నాభ్రమ్, ఇవ = ఛిన్నాభిన్నమైన మేఘము వలె, ఉభయవిభ్రష్టః =ఉభయభ్రష్టుడై, కచ్చిత్, న, నశ్యతి = అధోగతిపాలు కాడుగదా

తా. బ్రహ్మపద ప్రాప్తిమార్గమున ఉనికి లభించక నిరాశ్రయుడైన సాధకుడు కర్మమార్గ యోగమార్గముల రెండిటి యొక్క ఫలము పొందలేక ఉభయభ్రష్టుడగును. ఆ యోగి వాయువశమై ఛిన్నాభిన్నములైన మేఘ ఖండములవలె నశించునా యేమి? వానికెట్టి గతిపట్టును? యోగమునందలి శ్రద్ధచే ఇహలోక పరలోక ప్రాప్తి హేతువగు కర్మలను త్యజించును. కాన కర్మభ్రష్టుడగును. యోగమార్గమున స్థితిలభించక యోగభ్రష్టుడునయి దేహాన్తమగు నెడల నట్టివాని గతి యేమియని అర్జునుని ప్రశ్నభావము.

వి. యోగియై ఆత్మసాక్షాత్కారముచేయ తలంపులో కర్మత్యాగము చేసినవాడగుటచే

కర్మఫలమునందదు. యోగమభ్యసించుచున్నను తత్త్వజ్ఞాన విమూఢుడగుటచే జ్ఞానఫలమగు ఆత్మసాక్షాత్కారమునూ పొందజాలక ఉభయభ్రష్టుడగునా ఏమియని తన సంశయమును తెలిపెను.

శ్లో॥ ఏతన్మే సంశయం కృష్ణ ఛేత్తుమర్హస్యశేషతః
త్వదన్యః సంశయస్యాస్య ఛేత్తా న హ్యుపపద్యతే 39

కృష్ణ = ఓ కృష్ణా!, మే = నాయొక్క, తత్, సంసయమ్ = ఈ సందేహమును, అశేషతః = పూర్తిగా, ఛేత్తుమ్ = ఛేదించుటకు (తొలగించుటకు), అర్హసి = (నీవే) అర్హుడవు, హి = ఏలనన, తదన్యః = నీవు తప్ప మరి ఎవ్వడును, అస్య, సంశయస్య, ఛేత్త = ఈ సంశయమును తొలగింపగలవాడు, న, ఉపపద్యతే = లభింపడు

తా. ఓ కృష్ణా! నాయీ సంశయమును శేషము లేకుండా పోగొట్టుటకర్హుడవు నీవు. నీ కంటె నితరులెవ్వరును నా సంశయమును పోగొట్టజాలరు. కాన నా సంశయమును రూపుమాపుము.

వి. 'తదన్యః' 'నీవు తప్ప మరి ఎవ్వరును నాప్రశ్నకు సమాధానమీయలే' రనుటలో !!! అర్జునుడు వేసిన ప్రశ్న యోగసంబంధమైనది. యోగసాధకుని ప్రశ్నకు యోగీశ్వరుడైన శ్రీకృష్ణపరమాత్మయే సమాధానమీయ అర్హుడనియు, యోగికానివారు అనర్హులనియు అర్జునుని భావము.

**శ్రీ భగవానువాచ:**

శ్లో॥ పార్థ నైవేహ నాముత్ర వినాశస్తస్య విద్యతే
న హి కల్యాణ కృత్కశ్చిద్దుర్గతిం తాత గచ్ఛతి 40

పార్థ = ఓ పార్థ!, తస్య = అట్టి పురుషునకు, ఇహ = ఈ లోకమున, వినాశః = వినాశము, న, విద్యతే = ఉండదు, అముత్ర, ఏవ = పరలోకము నందును, న (విద్యతే) = (వినాశము) ఉండదు, హి = ఏలనన, తాత = ఓ నాయనా!, కళ్యాణకృత్ = భగవత్ ప్రాప్తికై కర్తవ్య కర్మలను ఆచరించువాడు, కశ్చిత్ = ఎవ్వడును, దుర్గతిమ్, న గచ్ఛతి = దుర్గతిపాలుకాడు

తా. యోగభ్రష్టుడగువానికి ఈ లోకమునకాని పరలోకమునకాని చెరుపు కలుగదు. ఓ అర్జునా! శుభప్రదమైన ఆచరణ కలవాడెన్నడును దుర్గతిని బొందదని భగవానుడగు కృష్ణుడు పలికెను. కల్యాణకృత్ అనగా శుభాచరణుడని యర్థము. యజ్ఞదాన తపోవ్రతాది కర్మలను కామహతులై యాచరించువారు *'గతాగతం కామకామాలభన్తే'* అను గీతావచన ప్రకారము సంసార ప్రవాహమున

పరిభ్రమించుచుదురు. ఇష్టా పూర్త కర్మలను శ్రేయఃప్రదములని భావించు మూఢాత్ములు జన్మపరంపరను బొందుచుచున్నారు. ఇట్లు నానా జన్మలకు హేతువులగు ఇష్టా పూర్త కర్మలు కల్యాణప్రదములు కావని భావము. 'జ్ఞానం సమ్యగవేక్షితం' అనినట్లు యోగనిష్ఠ ద్వారా సమ్యక్ దర్శన రూప జ్ఞానలాభమే కల్యాణప్రదమని తెలియనగును. కావున కల్యాణకృత్ అనగా యోగియని భావము.

శ్లో॥ ప్రాప్య పుణ్యకృతాం లోకానుషిత్వా శాశ్వతీః సమాః
శుచీనాం శ్రీమతాం గేహే యోగభ్రష్టోఽభిజాయతే 41

యోగభ్రష్టః = యోగభ్రష్టుడైన పురుషుడు, పుణ్యకృతామ్, లోకాన్ = పుణ్యాత్ములు పొందు లోకమును అనగా, స్వర్గాది ఉత్తమ లోకములను, ప్రాప్య = పొంది (అచట), శాశ్వతీః, సమాః ఉషిత్వా = పెక్కు సంవత్సరములు గడిపి, శుచీనామ్, శ్రీమతాం = పవిత్రులైన సంపన్నుల యొక్క, గేహే = గృహమునందు, అభిజాయతే = జన్మించును

తా. యోగనిష్ఠకు అంతరాయములు కలిగిన యోగభ్రష్టుడు, పుణ్యకర్మలు చేసినవారికి ప్రాప్యములగు భోగప్రధానములగు లోకములకు జని బహుకాలము వరకు అచ్చట భోగము లనుభవించిన పిమ్మట, సదాచార సంపన్నులును, శ్రీమంతులును ఐన వారియింట జన్మించు చున్నాడు.

శ్లో॥ అథవా యోగినామేవ కులే భవతి ధీమతాం
ఏతద్ధి దుర్లభతరం లోకే జన్మ యదీదృశమ్ 42

అథవా = అథవా (విరాగియైన పురుషుడు ఆ పుణ్యలోకములకు పోకుండగనే), ధీమతాం = జ్ఞానులైన, యోగీనామ్, కులే ఏవ = యోగుల కుటుంబములోనే, భవతి = జన్మించును, ఈదృశమ్ = ఈ విధమైన జన్మ, యత్ = ఏది కలదో, ఏతత్ = ఇదియే, లోకే = లోకమునందు (లభించుట), హి = నిస్సందేహముగ, దుర్లభమ్ = మిక్కిలి దుర్లభము

తా. అట్లు కానిచో యోగభ్రష్టుడగువాడు యోగాభ్యాస పరులయి నిశ్చయాత్మక జ్ఞానము కలవారి యింట జన్మించును. ఈ విధమగు జన్మ మిగుల దుర్లభమైనది. యోగసిద్ధికై ఇట్టి జన్మ అనువైనదని భావము.

వి. శుచిమంతులైన శ్రీమంతుల ఇంట జన్మించు యోగభ్రష్టులు కొందరు, బుద్ధిమంతులగు యోగుల ఇంట జన్మకలుగు యోగభ్రష్టులు కొందరని ద్వివిధములుగ యోగభ్రష్టులు పేర్కొనబడిరి.

1) శ్రద్ధయున్నను నియమనిష్ఠలేక విషయాసక్తులై యోగభ్రష్టులైనవారు ఒక విధము.

2) శ్రద్ధానియమముల పాటించియు ఆత్మసాక్షాత్కార ప్రాప్తికి పూర్వమే ప్రారబ్ధవశులై దేహాంతమునందిన యోగభ్రష్టులు మరొక విధము. ఈ రెండవ కోవకు జెందిన యోగభ్రష్టులు *'యోగినామేవకులే భవతి ధీమతాం'* అని చెప్పబడినట్లు ఉత్తమమైన జన్మకలవారగుదురని భావము.

శ్లో॥ తత్ర తం బుద్ధిసంయోగం లభతే పౌర్వదైహికం
యతతే చ తతో భూయః సంసిద్ధౌ కురునందన 43

కురునందన = ఓ అర్జునా!, తత్ర = అచ్చట, పౌర్వ దేహికమ్ = పూర్వ దేహమున సాధించిన, తమ్, బుద్ధి సంయోగమ్ = ఆ బుద్ధి యోగమును (అనగా సమత్వ బుద్ధిరూప యోగ సంస్కారములను), లభతే = (అనాయాసముగా) పొందును, చ = మరియు, తతః = దాని ప్రభావమున, సంసిద్ధౌ = పరమాత్మ ప్రాప్తికై, భూయః యతతే = మునుపటికంటే ఎక్కువగా మరల ప్రయత్నించును

తా. ఓ అర్జునా! అట్లు జన్మించిన యోగభ్రష్టుడైన పురుషుడు, పూర్వజన్మకు సంబంధించిన యోగబుద్ధిని కలిగియుండి, మరల యోగమున సిద్ధిని పొందుటకు మిక్కుటముగా ప్రయత్నించు వాడగును.

శ్లో॥ పూర్వాభ్యాసేన తేనైవ హ్రియతే హ్యవశోఽపి సః
జిజ్ఞాసురపి యోగస్య శబ్దబ్రహ్మాతివర్తతే 44

సః = అతడు, తేన, పూర్వాభ్యాసేన, ఏవ = ఆ పూర్వాభ్యాస ప్రభావముననే, అవశః, అపి = వశుడై, హి = నిస్సందేహముగా, హ్రియతే = (భగవంతుని వైపు) ఆకర్షితుడగును, యోగస్య, జిజ్ఞాసుః, అపి = అట్లే సమబుద్ధిరూప యోగ జిజ్ఞాసువు కూడా, శబ్దబ్రహ్మ = వేదములలో తెలుపబడిన సకామకర్మ ఫలములను, అతివర్తతే = అధిగమించును

తా. యోగభ్రష్టుడు పూర్వజన్మమందు ఆచరించిన యోగాభ్యాసబలముచే ఆకర్షితుడై మరల యోగనిష్ఠకు పూనిక కలవాడగును. యోగరతుడు కాకున్నను యోగమననేమో తెలియగోరి యోగమార్గ ప్రవృత్తుడైనవాడు వేదోక్త కర్మానుష్ఠానపరులు భోగముల నతిశయించిన సుఖము కలవాడగునని భావము.

శ్లో॥ ప్రయత్నాద్యతమానస్తు యోగీ సంశుద్ధకిల్బిషః
అనేక జన్మ సంసిద్ధస్తతో యాతి పరాం గతిమ్ 45

తు = అయితే, ప్రయత్నాత్ = ప్రయత్న పూర్వకముగా, యతమానః, యోగీ = అభ్యాసముచేయు యోగి, అనేక జన్మ సంసిద్ధః = అనేక జన్మల సంస్కారముల ప్రభావమున, ఈ జన్మయందే సిద్ధిని పొంది, సంశుద్ధ కిల్బిషః = సంపూర్ణముగా పాపరహితుడై, తతః = తక్షణమే, పరామ్, గతిమ్ = పరమగతిని, యాతి = పొందును

తా. ప్రయత్నముచేత యోగనిష్ఠను కలిగియున్న యోగి, పాపపంకమునుండి ఉద్ధరింపబడి అనేక జన్మలనుండి ఆర్జితమైన పుణ్యబలముచే సమ్యగ్దర్శన రూప సిద్ధిని బడసినవాడై బ్రహ్మపదప్రాప్తి యను నిరతిశయమైన స్థితిని పొందును.

శ్లో॥ తపస్విభ్యోఽధికో యోగీ జ్ఞానిభ్యోఽపి మతోఽధికః
కర్మిభ్యశ్చాధికో యోగీ తస్మాద్యోగీ భవార్జున 46

యోగీ = యోగి, తపస్విభ్యః = తాపసుల కంటెను, అధికః = శ్రేష్ఠుడు, జ్ఞానిభ్యః, అపి = శాస్త్రజ్ఞానుల కంటెను, అధికః = శ్రేష్ఠుడు అని, మతః = భావింపబడును, చ = మరియు, యోగీ = యోగి, కర్మిభ్యః = సకామకర్మలను ఆచరించు, అధికః = వారికంటెను శ్రేష్ఠుడు, తస్మాత్ = అందువలన, అర్జున = ఓ అర్జునా!, యోగీ, భవ = యోగివికమ్ము

తా. ఓ అర్జునా! కృచ్ఛ్ర చాంద్రాయణాది వ్రతములు నాచరించు తపస్సులకంటెను, కేవల శాస్త్ర జ్ఞానముకల విద్వాంసులకంటెను, నిత్యనైమిత్తికాగ్నిహోత్రాది కర్మాచరణ పరులకంటెను, యోగి అధికుడు కాన నీవు యోగపరుడవగుము.

శ్లో॥ యోగినామపి సర్వేషాం మద్గతేనాన్తరాత్మనా
శ్రద్ధావాన్ భజతే యో మాం స మే యుక్తతమో మతః 47

సర్వేషామ్, యోగీనామ్, అపి = యోగులందరిలోను (యోగములు అనేకములు కలవు. వారిలో), యః = ఎవరైతే, శ్రద్ధావాన్ = శ్రద్ధగలవాడై, మద్గతేన, అంతరాత్మనా = నాయందు లగ్నమైన అంతరాత్మతో, మామ్ = నన్ను, భజతే = నిరంతరము భజించునో, సః = అట్టి యోగి, మే = నాకు, యుక్తతమః = పరమశ్రేష్ఠుడు అని, మతః = భావింపబడును

తా. శ్రద్ధాసక్తులతో సర్వాత్మయైన నాయందు మనస్సును స్థిరముగానుంచి, నన్ను సేవించు యోగి సకలయోగులకంటెను ఉత్కృష్టుడగు యోగియని నా భావము.

వి. *'సర్వేషాం యోగినాం'* అనుటచేత యోగములు నానా విధములైనవి కలవనియు, భగవంతునియందాసక్తమైన మనస్సుచే పరమాత్మను సేవించు యోగియే ఇతర యోగులకంటె

శ్రేష్ఠుడని భావము. ఇట్లు చెప్పుటవలన భగవంతుని భజించుటకు తగు ఉపాయముకల యోగమున సిద్ధిపొందిన యోగియే గొప్పవాడని తాత్పర్యము. కనుక యోగములన్నియు సమ్యగ్దర్శనము గలిగించనేరవనియు తెలియనగును. ఈ విధముగా ప్రాణాయామరూప యోగము జ్ఞానమునిచ్చును కనుక ముఖ్యమని నిర్ణయింపబడినది.

*శ్లో. 'జ్ఞానంతు జన్మనై కేనయోగాదేవ ప్రజాయతే'* *(యోగశిఖోపనిషత్-53)*

అను వాక్యము యోగము వలన జ్ఞానము కలగునని చెప్పుచున్నది.

ఇట్లు
శ్రీ పరమహంస పరివ్రాజకాచార్యులును,
బ్రహ్మర్షి సద్గురు **శ్రీశ్రీశ్రీ శివానంద** భగవత్పూజ్యపాద శిష్యులును నైన
బ్రహ్మర్షి సద్గురు **శ్రీశ్రీశ్రీ స్వామి రామానంద పరమహంస** వారిచే
రచింపబడిన గీతామృతమను టీక యందు
ఆత్మ సంయమ యోగమను షష్ఠాధ్యాయము సమాప్తము.

ఓం శ్రీకృష్ణ పరమాత్మనే నమః

సప్తమాధ్యాయము

# విజ్ఞానయోగము

**శ్రీ భగవానువాచ:**

శ్లో॥ మయ్యాసక్తమనాః పార్థ యోగం యుంజన్ మదాశ్రయః
అసంశయం సమగ్రం మాం యథా జ్ఞాస్యసి తచ్ఛృణు 1

పార్థ = ఓ పార్థా!, మయి, ఆసక్తమనాః = అనన్య భక్తితో నాయందే ఆసక్తమైన మనస్సు కలవాడవై, మదాశ్రయః = మత్పరాయణుడవై, యోగమ్, యుంజన్ = యోగమునందు నిమగ్నుడవగుచు, సమగ్రమ్ = సంపూర్ణ విభూతి, బలము, ఐశ్వర్యాది గుణయుక్తుడను, సర్వ ప్రాణులకు, ఆత్మస్వరూపుడును ఐన, మామ్ = నన్ను, యథా = ఎట్లు (నీవు), అసంశయమ్ = నిస్సందేహముగ, జ్ఞాస్యసి = తెలిసికొనగలవో, తత్ = దానిని (ఆ విధమును), శృణు = వినుము

తా. శ్రీకృష్ణభగవానుడు పార్థునితో నిట్లనెను. ఓ పార్థ! నాయందాసక్తి కలిగి, నన్నే ఆశ్రయించి యోగమనుష్ఠించుచు పరిపూర్ణుడనగు నన్ను నిస్సంశయముగా ఎట్లు తెలిసికొనగలవో ఆ జ్ఞానమార్గమును చెప్పుచున్నాను వినుము.

శ్లో॥ జ్ఞానం తేఽహం సవిజ్ఞానమ్ ఇదం వక్ష్యామ్యశేషతః
యత్జ్ఞాత్వా నేహ భూయోఽన్యత్ జ్ఞాతవ్యమవశిష్యతే 2

యత్ = దేనిని, జ్ఞాత్వా = ఎరింగినచో, ఇహ = ఈ లోకమున, భూయః = మరల, అన్యత్ = మరియొకటి, జ్ఞాతవ్యమ్ = తెలిసికొనదగినది, న, అవశిష్యతే = మిగిలియుండదో అట్టి విజ్ఞాన సహితమైన, సవిజ్ఞానమ్, ఇదమ్, జ్ఞానమ్ = అనుభవజ్ఞానముతో కూడియున్న తత్త్వ జ్ఞానమును, అహమ్ = నేను, తే = నీకు, అశేషతః = సంపూర్ణముగా, వక్ష్యామి = తెలిపెదను

తా. నేను నీకనుభవజ్ఞానముతో కూడియున్న తత్త్వజ్ఞానమును సమగ్రముగా చెప్పుదును. ఈ జ్ఞానము కలిగియున్న మరల నీకు ఈ లోకమున పురుషార్థమును సాధించుటకు మరియొక సాధనము తెలిసికొనదగినదేదియు కానరాదు. (అనగా నాత్మతత్త్వజ్ఞుడగును.)

శ్లో॥ మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే
యతతామపి సిద్ధానాం కశ్చిన్మాం వేత్తి తత్త్వతః 3

మనుష్యాణామ్, సహస్రేషు = వేలకొలది మనుష్యులలో, కశ్చిత్ = ఒకానొకడు మాత్రమే, సిద్ధయే = భగవత్ ప్రాప్తి సిద్ధించుటకై, యతతి = ప్రయత్నించును, యతతామ్ సిద్ధానామ్, అపి = (అట్లు) ప్రయత్నించినట్టి యోగులలో కూడా, కశ్చిత్ = ఒకానొకడు మాత్రమే (మత్ పరాయణుడై), మామ్ = నన్ను, తత్త్వతః = నా యథార్థ స్వరూపమును, వేత్తి = ఎరుంగును.

తా. వేలకొలది మనుష్యులలో ఒక్కడు మాత్రము తత్త్వజ్ఞాన సిద్ధికై ప్రయత్నించుచుండును. అట్లు ప్రయత్నించు సిద్ధపురుషులలో నన్ను యథార్థముగా తెలిసికొనువాడు ఏ ఒక్కడో ఉండును.

వి. యోగమునభ్యసించుట వలన తత్త్వజ్ఞాన సిద్ధికలుగును. ఇట్టి యోగమభ్యసించువారు విరళముగా నుందురు. అట్లు యోగనిష్ఠలోనున్న యోగులలో ఆత్మదర్శనమయి తన ఆత్మకంటె బ్రహ్మము వేరు కాదనియు, అదియే తన యందును, అన్నింటియందును కలదనియు, కావున ఆత్మకంటె భిన్నమైనది కించిత్తయినను లేదనియు నెరింగిన వారరుదని శ్రీకృష్ణపరమాత్మ భావము.

శ్లో॥ భూమిరాపోஉనలో వాయుః ఖం మనో బుద్ధిరేవ చ
అహంకార ఇతీయం మే భిన్నా ప్రకృతిరష్టధా 4

శ్లో॥ అపరేయమితస్త్వన్యాం ప్రకృతిం విద్ధి మే పరామ్
జీవభూతాం మహాబాహో యయేదం ధార్యతే జగత్ 5

భూమిః = భూమి, ఆపః = నీరు, అనలః = అగ్ని, వాయుః = వాయువు, ఖమ్ = ఆకాశము, మనః = మనస్సు, బుద్ధిః = బుద్ధి, చ = మరియు, అహంకారః, ఏవ = అహంకారమూ, ఇతి = అని, మే = నాయొక్క, ఇమమ్ = ఇట్టి (ఈ), ప్రకృతిః = ప్రకృతి, అష్టధా, భిన్న = ఎనిమిది విధములుగా కలదు, మహాబాహో = ఓ అర్జునా!, ఇమమ్, తు = ఈ అష్టవిధ ప్రకృతి ఐతే, అపరా = అపరా ప్రకృతి లేక జడ ప్రకృతి అనియు (చెప్పబడుచున్నది), యయ = దేనిచేత, ఇదమ్, జగత్ = ఈ జగత్తు, ధార్యతే = ధరింపబడుచున్నదో, మే = నాయొక్క, జీవభూతామ్ = జీవరూపమైన, పరామ్, ప్రకృతిమ్ = పరాప్రకృతిని, ఇతః, అన్యామ్ = ఈ అష్టవిధ ప్రకృతి కంటెను వేరైన దానినిగా, విద్ధి = ఎరుంగుము.

తా. పృథివ్యాపస్తేజో వాయురాకాశములను ఐదును, మనో బుద్ధ్యహంకారములను మూడును కలిసి ఎనిమిది విధములుగా ప్రకృతి వేరైయున్నది. ఇదియే ఈశ్వరమాయ, దైవీమాయయని చెప్పబడెను. మహాబలశాలివగు ఓ అర్జునా! ఈ పై చెప్పబడిన ఎనిమిది విధములుగా వేరుగా

ఉన్న ప్రకృతిని అపరాప్రకృతి యందురు. ఈ ప్రకృతికంటె భిన్నమై వేరొక ప్రకృతి కలదు. దీనిని పరాప్రకృతి యందురు. ఇది ప్రాణులకాధారమైనది. ఇదియే ఉత్కృష్టమైయున్న నా చైతన్య ప్రకృతి. ఈ ఉత్తమ ప్రకృతి ద్వారా జగత్తు నిలబడుచున్నది. జగత్తుయొక్క ఉనికికి ఇదియే ముఖ్యాధారము.

శ్లో॥ ఏతద్యోనీని భూతాని సర్వాణీత్యుపధారయ
అహం కృత్స్నస్య జగతః ప్రభవః ప్రలయస్తథా 6

సర్వాణి, భూతాని = సమస్త ప్రాణులును, ఏతద్యోనీని = ఈ రెండు ప్రకృతుల నుండియే ఉత్పన్నములు అగుచున్నవి, అహమ్ = (మరియు) నేను, కృత్స్నస్య, జగతః = సమస్త జగత్తునకు, ప్రభవః = పుట్టుక స్థానము, తథా = అట్లే, ప్రలయః = విలీనస్థానము (అనగా సమస్త జగత్తునకు నేనే మూలకారణము), ఇతి, ఉపధారయ = అని, ఎరుంగుము.

తా. సర్వభూతాత్మకమైన జగత్తంతయు ఈ రెండు ప్రకృతుల వలన కలుగుచున్నది. కావున నేను సమస్త జగత్తు పుట్టుటకు కాని, గిట్టుటకు కాని కారణము.

శ్లో॥ మత్తః పరతరం నాన్యత్ కించిదస్తి ధనంజయ
మయి సర్వమిదం ప్రోతం సూత్రే మణిగణా ఇవ 7

ధనంజయ = ఓ ధనంజయా!, మత్తః = నాకంటెను, అన్యత్, కించిత్ = వేరైనదేదియును, పరతరమ్ = పరమకారణమైనది, నా, అస్తి = లేదు, ఇదమ్, సర్వమ్ = ఈ సంపూర్ణ జగత్తు, సూత్రే = సూత్రమునందు (దారమందు), మణిగణాః, ఇవ = మణులవలె, మయి = నాయందు, ప్రోతమ్ = కూర్చబడినది.

తా. ఓ అర్జునా! ఈ జగత్తుయొక్క ఉనికికి నా కంటె వేరైనది లేక శ్రేష్ఠమైనది ఏదియు లేదు. సూత్రమున మణిగణములు కూర్చబడినట్లు సర్వాత్మయగు నేను జగత్తుకు ఆధారభూతుడనై యున్నాను. నా యందే సమస్తము కలదు.

శ్లో॥ రసోఽహమప్సు కౌన్తేయ ప్రభాస్మి శశిసూర్యయోః
ప్రణవః సర్వవేదేషు శబ్దః ఖే పౌరుషం నృషు 8

కౌంతేయ = ఓ అర్జునా!, అహమ్ = నేను, అప్సు = నీటి యందు, రసః = రస తన్మాత్రను, శశి సూర్యయోః = సూర్యచంద్రుల యందు, ప్రభా = ప్రకాశమును, సర్వ వేదేషు = వేదములన్నింటియందును, ప్రణవః = ఓంకారమును, ఖే = ఆకాశమునందు, శబ్దః = శబ్దమును, నృషు = మానవులయందు, పౌరుషమ్ = పౌరుషమును, అస్మి = అయి యున్నాను.

తా. ఓ కున్తీపుత్రా! జలమందలి రస స్వభావమగు రుచి నేను. సూర్యచంద్రుల కాంతినినేను. వేదములన్నిటియందుకల ప్రణవమును నేను. ఆకాశమందలి శబ్దమును నేను. నరులయందు పురుషభావము నేను.

శ్లో॥ పుణ్యో గంధః పృథివ్యాం చ తేజశ్చాస్మి విభావసౌ
జీవనం సర్వభూతేషు తపశ్చాస్మి తపస్విషు 9

పృథివ్యామ్ = పృథ్వియందు, పుణ్యః, గంధః = పవిత్రమైన గంధతన్మాత్రను, చ = మరియు, విభావసౌ = అగ్నియందు, తేజః = తేజస్సును, అస్మి = అయి యున్నాను, చ = మరియు, సర్వభూతేషు = సమస్త ప్రాణులయందు, జీవనమ్ = జీవశక్తిని (చైతన్యమును), చ = మరియు, తపస్విషు = తాపసులయందు, తపః = తపస్సును, అస్మి = అయి యున్నాను

తా. భూమియందుకల పవిత్రమైన వాసనను నేను. అగ్నిహోత్రమున తేజస్సును నేను. సర్వ భూతములందు చైతన్యరూపమైన జీవనమును నేను. తపోధనుల యొక్క తపస్సును నేను.

శ్లో॥ బీజం మాం సర్వభూతానాం విద్ధిపార్థ సనాతనమ్
బుద్ధిర్బుద్ధిమతామస్మి తేజస్తేస్వినామహమ్ 10

పార్థ = ఓ పార్థా!, సర్వభూతానామ్ = సమస్త భూతములకును, సనాతనమ్ = శాశ్వతమైన, బీజమ్ = బీజముగా, మామ్ = నన్ను, విద్ధి = ఎరుంగుము, అహమ్ = నేను, బుద్ధిమతామ్ = ప్రజ్ఞావంతులలో, బుద్ధిః = ప్రజ్ఞను, తేజస్వినామ్ = తేజోవంతులలో, తేజః = తేజస్సును, అస్మి = అయి యున్నాను.

తా. ఓ అర్జునా! సర్వభూతోత్పత్తికి సనాతనుడగు నేనే బీజమని యెరుంగుము. జ్ఞానులయొక్క జ్ఞానమును నేను. తేజోవంతుల తేజస్సును నేను.

శ్లో॥ బలం బలవతాం చాహం కామరాగవివర్జితమ్
ధర్మాఽవిరుద్ధో భూతేషు కామోఽస్మి భరతర్షభ 11

భరతర్షభ = ఓ అర్జునా!, అహమ్ = నేను, బలవతామ్ = బలవంతులలో, కామరాగ వివర్జితమ్ = కామరాగ రహితమైన, బలమ్ = బలమును, చ = మరియు, భూతేషు = సమస్త ప్రాణులయందును, ధర్మావిరుద్ధః = ధర్మమునకు విరుద్ధము కాని (శాస్త్రానుకూలమైన), కామః = కామమును (మోక్షేచ్ఛ), అస్మి = అయి యున్నాను.

తా. ఓ భరతకుల శ్రేష్ఠా! కామరాగములచే దూషితముకాని బలవంతుల సాత్త్విక బలమును నేను. ధర్మవిరుద్ధముకాని సర్వభూతస్థమగు కామమును నేను.

శ్లో॥ యే చైవ సాత్త్వికా భావా రాజసాస్తామసాశ్చ యే
మత్త ఏవేతి తాన్విద్ధి న త్వహం తేషు తే మయి 12

యే, చ, ఏవ = ఏవైతే, సాత్త్వికాః, భావాః = సాత్త్విక భావములు గలవో, యే, చ, రాజసాః = రాజస భావములేవి గలవో, తామసాః = తామస భావములేవి గలవో, తాన్ = వాటిని, మత్తః, ఏవ, ఇతి = నానుండియే కలుగుచున్నవిగా, విద్ధి = ఎరుంగుము, తు = అయితే, అహమ్, = నేను, న తేషు = ఈ త్రిగుణములయందు లేను, తే = అవి, మయి = నాయందు గలవు

తా. సత్త్వగుణ ప్రధానములైన శమదమాదులును, రజోగుణ ప్రధానములైన దంభదర్పాదులును, తమోగుణ ప్రధానములగు శోకమోహాదులును, నా మూలముననే కలుగుచున్నవనియును, వానికి నేనధీనుడను కాననియు, ఆ గుణములు నాకు వశములై నాయందున్నవనియు నెరుంగుము.

శ్లో॥ త్రిభిర్గుణమయైర్భావైః ఏభిః సర్వమిదం జగత్
మోహితం నాభిజానాతి మామేభ్యః పరమవ్యయమ్ 13

గుణమయైః = గుణముల యొక్క కార్యరూపములైన, ఏభిః, త్రిభిః, భావైః = మూడు విధములైన సాత్త్విక, రాజస, తామస భావములచే, ఇదమ్, సర్వమ్, జగత్ = ఈ సమస్త జగత్తు (ప్రాణి సముదాయము), మోహితమ్ = మోహితమగుచున్నది, ఏభ్యః = (కనుక) ఈ మూడు గుణముల కంటెను, పరమ్ = శ్రేష్ఠుడనైన, అవ్యయమ్ = శాశ్వతుడనైన, మామ్ = నన్ను, న, అభిజానాతి = (ఆ ప్రాణి సముదాయము) తెలిసికొనలేకున్నది.

తా. సమస్తమగు ఈ జగత్తు సత్త్వరజస్తమో గుణాత్మకములైన యీ భావములచే మోహము జెందినదై యీ భావములకు అతీతుడనై అవ్యయుడనగు నన్నెఱుగజాలకున్నది.

శ్లో॥ దైవీ హ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా
మామేవ యే ప్రపద్యన్తే మాయామేతాం తరన్తి తే 14

హి = ఏలననగా, ఏషా = ఈ, మమ, మాయా = నా మాయ, దైవీ = అలౌకికమైనది, గుణమయీ = త్రిగుణాత్మకమైనది, దురత్యయా = అధిగమింప సాధ్యము కానిది, యే = ఎవరైతే,

మామ్, ఏవ = కేవలము, నిరంతరము నన్నే, ప్రపద్యంతే = భజించుచున్నారో, తే = వారు, ఏతామ్, మాయామ్ = ఈ మాయను, తరంతి = ఉల్లంఘించి, సంసార సముద్రము నుండి బయటపడుదురు.

తా. ఈ త్రిగుణాత్మక ప్రకృతి ఈశ్వరుడనగు నా యొక్క మాయ. ఇది సామాన్యులగు జీవులకు అతిక్రమింప శక్యము కాదు, సర్వేశ్వరుడనగు నన్ను సర్వాత్మ భావముచే నెవరు ( 'ఈశ్వరస్సర్వ భూతానాం హృద్దేశేఽ ర్జునతిష్ఠతి' అను గీతావచన ప్రమాణమున) శరణు పొందుదురో వారే యీ విష్ణుమాయనతిక్రమింపగలరు. ఆత్మదర్శన లాభపరుడగు మహాత్మునకే శరణాగతి సులభమైనది. **ఆత్మదర్శనమునకు యోగమే శరణ్యము. వేరు మార్గము లేదు.**

శ్లో॥ న మాం దుష్కృతినో మూఢాః ప్రపద్యన్తే నరాధమాః
మాయయాఽ పహృతజ్ఞానాః ఆసురం భావమాశ్రితాః 15

మాయయా = మాయచేత, అపహృతజ్ఞానాః = అపహృతమైన జ్ఞానము గలవారును, ఆసురమ్, భావమ్ = అసుర స్వభావమును, ఆశ్రితాః = ఆశ్రయించిన వారును, నరాధమాః = నరులలో అధములును, దుష్కృతినః = దుష్కర్మలను ఆచరించువారును అగు, మూఢాః = మూర్ఖులు, మామ్ = నన్ను, న, ప్రపద్యంతే = భజింపరు.

తా. పాపాచరణులును, నరాధములునైన మూఢులు పరమేశ్వరుడనగు నన్ను శరణాగతి పొందరు. వారు దైవీమాయచే జ్ఞానము కోల్పోయినవారగుచు హింస, అసత్యము మొదలగు లక్షణములు కల అసురభావమునకు వశులై నన్ను శరణు పొందరు.

శ్లో॥ చతుర్విధా భజన్తే మాం జనాః సుకృతినోఽ ర్జున
ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ 16

భరతర్షభ = ఓ భరతశ్రేష్ఠా!, అర్జున = అర్జునా!, సుకృతినః = శుభకర్మలను ఆచరించువారై, అర్థార్థీ = సంపదలను కోరువారును, ఆర్తాః = (శారీరక, మానసిక సంతాపములకు గురైన) ఆర్తులును, జిజ్ఞాసుః = ఐహిక విషయములపై ఆసక్తిని వీడి, పరమాత్మ, తత్త్వజ్ఞానమును పొందుటకు ఇచ్ఛగలవారును (ప్రయోజనాపేక్ష గలవారు), చ = మరియు, జ్ఞానీ = పరమాత్మ ప్రాప్తినందిన జ్ఞానులును అయిన, చతుర్విధాః = నాలుగు విధములైన, జనాః = భక్తులు, మామ్ = నన్ను, భజంతే = భజింతురు.

తా. ఈ క్రింద చెప్పబడు నాలుగు తెగల పుణ్యాత్ములు, ఓ భరతకుల శ్రేష్ఠా! నన్ను సేవించుదురు. వారు ఆర్తులు, జిజ్ఞాసువులైనవారు, ప్రయోజనాపేక్షగలవారు, జ్ఞానులు అని నాలుగు విధములుగా కీర్తింపబడుదురు. ఆర్తులు మున్నగు నలుగురు పరమాత్మను భజించుటకై చేయు ప్రయత్నము సుకృత కర్మయని గ్రాహ్యము. తదితరములైన కర్మలు దుష్కృతములు కావున బంధహేతువులగుచున్నవి.

శ్లో॥ తేషాం జ్ఞానీ నిత్యయుక్త ఏకభక్తిర్విశిష్యతే
ప్రియో హి జ్ఞానినోఽత్యర్థమ్ అహం స చ మమప్రియః 17

తేషామ్ = వారిలో, నిత్యయుక్తః = నిరంతరము నాయందే ఏకీభవస్థితుడును, ఏకభక్తిః = అనన్యమైన భక్తిగల, జ్ఞానీ = జ్ఞానియైనవాడు, విశిష్యతే = శ్రేష్ఠుడు, హి = ఏలనన, జ్ఞానినః = యథార్థముగా నా తత్త్వమును ఎరింగిన జ్ఞానికి, అహమ్ = నేను, అత్యర్థమ్ = అత్యంతము, ప్రియః = ఇష్టుడను, చ = మరియు, సః, మమ = అతడును నాకు, ప్రియః = ఇష్టుడు.

తా. ఆర్తులు, జిజ్ఞాసువులు, అర్థార్థులు, జ్ఞానులను ఈ నాలుగు తెగలలోను... సర్వము వాసుదేవుడేయని ఆత్మకంటే జగత్తునన్యముగా చూడనివాడు జ్ఞాని. నిత్యము ఈశ్వర దర్శనపరుడై యుండుటచే యుక్తుడై యుండి ఆత్మయే నేనను నిశ్చయ జ్ఞానముచే జ్ఞానియగువాడు ఏకరూపభక్తి కలిగి యుండును. కావున సర్వాధికుడని కీర్తింపబడుచున్నాడు. అట్టి నిత్యయుక్తుడగు జ్ఞానికి నేను మిక్కిలి యిష్టుడను. అట్లే నాకును జ్ఞాని యిష్టుడై ఉన్నాడు. ఇతరులకు ఫలాపేక్ష కలదు గాన వారు జ్ఞానివలె ఇష్టులుకారు.

శ్లో॥ ఉదారాః సర్వ ఏవైతే జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్
ఆస్థితః స హి యుక్తాత్మా మామేవానుత్తమాం గతిమ్ 18

ఏతే = ఈ చతుర్విధ భక్తులు, సర్వే, ఏవ = అందరును, ఉదారాః = మహాత్ములే, తు = కాని, జ్ఞానీ = జ్ఞానిఅయినవాడు మాత్రము, ఆత్మా, ఏవ = (సాక్షాత్తుగా) నా స్వరూపమే అని, మే, మతమ్ = నా అభిప్రాయము, హి = ఏలనన, సః = అట్టి భక్తుడు, యుక్తాత్మా = తన మనస్సును, బుద్ధిని నాయందే స్థిరముగా నిలిపినవాడై, అనుత్తమామ్, గతిమ్ = అత్యుత్తమ గతిస్వరూపమైన, మామ్, ఏవ = నాయందే, ఆస్థితః = స్థితుడైయున్నవాడు.

తా. పై చెప్పబడిన వారందరును మహాత్ములే యగుదురు. వారందరిలో జ్ఞాని నన్ను తన ఆత్మగా భజించువాడు కావున నాకు ఆ జ్ఞానియు ఆత్మయే. అనగా నాకును వానికిని భేదము

లేదు. సర్వత్ర ఆత్మదర్శనము చేయు జ్ఞాని యుక్తాత్ముడైయుండును కనుక నిరతిశయమగు బ్రహ్మపదమునే పొందును. సర్వాత్మనగు నేనే వానికి ప్రాప్యమునై యున్నాను.

శ్లో॥ బహూనాం జన్మనామన్తే జ్ఞానవాన్ మాం ప్రపద్యతే
వాసుదేవః సర్వమితి స మహాత్మా సుదుర్లభః 19

బహూనామ్ = అనేకములైన, జన్మనామ్ = జన్మములయొక్క, అంతే = అంతమున (పిదప) జ్ఞానవాన్ = భగవత్ తత్త్వమును ఎరింగిన జ్ఞాని, సర్వమ్ = సమస్తము, వాసుదేవః ఇతి = వాసుదేవమయమే అని భావించి, మామ్ = నన్ను, ప్రపద్యతే = భజించును, సః, మహాత్మా = అట్టి మహాత్ముడు, సుదుర్లభః = లభించుట అరుదు.

తా. శాస్త్రజన్య జ్ఞానముకల పండితుడు బహుజన్మలనందుచు ఆయా జన్మలందు తనచే నార్జింపబడిన జ్ఞానప్రాప్తి హేతువులగు సంస్కారముల బలముచే వాసనలు క్షీణింప చేయుచు అంతిమ జన్మయందు పరిపక్వమైన జ్ఞానము కలవాడగును. అప్పుడు దృశ్యమానమైన ఈ జగత్తంతయు వాసుదేవుడే యనియు, కాన 'నేను ఆ వాసుదేవుడ' నను నిశ్చయ జ్ఞానము కలవాడగును. 'సర్వము వాసుదేవమయ' మను అనన్యభక్తికల మహాత్ముడు చాల అరుదుగా నుండును.

వి. *శ్లో॥ జన్మాన్తరైశ్చ బహుభిః యోగో జ్ఞానేనలభ్యతే*
*జ్ఞానంతు జన్మనై కేన యోగాదేవ ప్రజాయతే* *(యోగచూడామణ్యుపనిషత్)*

అనేక జన్మలలో శాస్త్రజన్య జ్ఞానమునార్జించిన జ్ఞానయోగాభ్యాసి అంతిమ జన్మమున యోగము చేపట్టును. యోగము ద్వారా నిర్విశేష జ్ఞానము, అందుచే మోక్షము కలుగును.

*శ్లో॥ శుద్ధేచేతసి తస్యైవ స్వాత్మజ్ఞానం ప్రకాశతే*
*తస్మాత్ జ్ఞానం భవేత్ యోగాత్ జన్మనై కేన పద్మజ* *(యోగశిఖోపనిషత్ 1-65)*

శుద్ధాన్తఃకరణము గలవానికే ఆత్మజ్ఞానము ప్రకాశించును. కాన యోగసిద్ధునకు ఒక జన్మయందే నిర్విశేష జ్ఞానము కలుగును.

శ్లో॥ కామైస్తైస్తైర్హృతజ్ఞానాః ప్రపద్యన్తేఽన్యదేవతాః
తం తం నియమమాస్థాయ ప్రకృత్యా నియతాః స్వయా 20

తైః,తైః, కామైః = నానా విధములైన అయా భోగవాంఛలచే, హృతజ్ఞానాః = అపహృతమైన జ్ఞానముగలవారు, స్వయా, ప్రకృత్యా = తమ స్వభావములచే, నియతాః = ప్రేరితులై, తమ్,

తమ్, నియమమ్ = వారివారి (ఆయా) నియమములను, ఆస్థాయ = పాటించి, అన్యదేవతాః = ఇతర దేవతలను, ప్రపద్యంతే = ఆరాధింతురు

తా. ఇహలోకమున కామహతులై వివేకహీనులగువారు భేదబుద్ధిచే దేవతల నాశ్రయించి ప్రకృతివశులగుటచే ఆయా నియమములతో సేవించెదరు. కామహతులగుటచే అనన్యభావమున పరమాత్మను భజించ జాలకున్నారు. తత్ఫలము వారికి సంసార చక్రమునబడి నశించుట యగును.

శ్లో॥ యో యో యాం యాం తనుం భక్తః శ్రద్ధయార్చితుమిచ్ఛతి
తస్య తస్యాచలాం శ్రద్ధాం తామేవ విదధామ్యహమ్ 21

యః, యః, భక్తః = ఏయే సకామ భక్తులు, యామ్, యామ్, తనుమ్ = ఏయే దేవతా స్వరూపమును, శ్రద్ధయా = శ్రద్ధతో, అర్చితుమ్ = పూజించుటకు, ఇచ్ఛతి = కోరుకొనునో, తస్య తస్య = ఆయా భక్తుల, శ్రద్ధామ్ = శ్రద్ధను, తామ్, ఏవ = ఆ దేవతను గూర్చియే (ఆ దేవతయందే), అచలామ్ = స్థిరమైన దానినిగా, అహమ్ = నేను, విదధామి = చేయుదును.

తా. కామాభిలాషచే ఎవరైనను యే దేవతనైనను భక్తిశ్రద్ధలతో భజింపదలచినచో వానికి ఆయా దేవతా శరీరములందత్యధిక శ్రద్ధ నిచ్చుదును.

శ్లో॥ స తయా శ్రద్ధయా యుక్తః తస్యారాధనమీహతే
లభతే చ తతః కామాన్ మయైవ విహితాన్ హి తాన్ 22

సః = ఆ భక్తుడు, తయా, శ్రద్ధయా = అట్టి శ్రద్ధతో, యుక్తః = కూడినవాడై, తస్య, ఆరాధనమ్ = ఆ దేవతారాధనమునే, ఈహతే = ఇష్టముతో చేయును, చ = మరియు, తతః = ఆ దేవత నుండి, మయ, ఏవ = నా అనుగ్రహము వలననే, విహితాన్ = విహితములైన, తాన్, కామాన్ = ఆ భోగములను, హి = నిస్సందేహముగ, లభతే = పొందును

తా. నాచే ఈయబడిన శ్రద్ధాభక్తులతో కామ కామియగువాడు తన యభీష్ట దేవత నారాధించి ఆయా కామములను బొందును. సర్వదేవతలందును చైతన్య రూపమున అంతర్యామియగు నేను, వారివారి కోరికలను నిచ్చుచున్నాను.

శ్లో॥ అన్తవత్తు ఫలం తేషాం తద్భవత్యల్పమేధసామ్
దేవాన్ దేవయజో యాన్తి మద్భక్తా యాన్తి మామపి 23

తు = అయితే, తేషామ్, అల్పమేధసామ్ = ఆ అల్పబుద్ధుల యొక్క, తత్, ఫలమ్ = ఆ ఫలము, అంతవత్ = నశ్వరము, భవతి = అగును, దేవయజః = దేవతలను పూజించువారు, దేవాన్ = ఆ దేవతలనే, యాంతి = పొందుదురు, మద్ భక్తాః = నా భక్తులు, మామ్, అపి = (కడకు) నన్నే, యాంతి = పొందుదురు

తా. కామహతులైన అల్పప్రజ్ఞులు అన్యదేవతోపాసన చేయుదురు. వారికి కలుగు ఫలము స్వల్పము. అట్టివారు ఆయా దేవతలను పొంది తుదకు జన్మ మరణముల పాలగుదురు. నా భక్తులు నన్ను భజించి పునరావృత్తిరహిత బ్రహ్మపదమును పొందుచున్నారు.

శ్లో॥ అవ్యక్తం వ్యక్తిమాపన్నం మన్యన్తే మామబుద్ధయః
పరం భావమజానన్తో మమావ్యయమనుత్తమమ్ 24

మమ = నాయొక్క, అనుత్తమమ్ = అత్యుత్తమము, అవ్యయమ్ = శాశ్వతము ఐన, పరమ్, భావమ్ = పరమ భావమును, అబుద్ధయః = బుద్ధి హీనులు, అజానంతః = ఎరుంగనివారై, అవ్యక్తమ్ = ఇంద్రియములకును, మనస్సునకును గోచరింపని వాడనైన, మామ్ = సచ్చిదానంద ఘనపరమాత్ముడనైన నన్ను, వ్యక్తిమ్ = సామాన్య వ్యక్తినిగా, అపన్నమ్ మన్యతే = తలంచెదరు.

తా. వివేకహీనులు నిరతిశయమును, దివ్యమునగు నా ఆత్మస్వరూపమును తెలియజాలరు. నేను అవ్యక్తుడను, అవ్యయుడను. అటువంటి నా పరమాత్మ స్వరూపము తెలియనివారు నాకు నామరూపములు కల్పించి నన్ను సాకారునిగను, సగుణునిగను భావించుదురు.

శ్లో॥ నాహం ప్రకాశః సర్వస్య యోగమాయా సమావృతః
మూఢోఽయం నాభిజానాతి లోకో మామజమవ్యయమ్ 25

యోగమాయా సమావృతః = నా యోగమాయచే కప్పబడినవాడనై, అహమ్ = నేను, సర్వస్య = ప్రతివ్యక్తికిని, ప్రకాశః, న = ప్రత్యక్షముగా గోచరించువాడను కాను, అయమ్ = ఈ, మూఢః, లోకః = మూఢలోకము (అజ్ఞానులు), మామ్ = నన్ను, అజమ్ = జన్మరహితునిగా, అవ్యయమ్ = శాశ్వతునిగా, న, అభిజానాతి = తెలిసికొనలేదు (తెలిసికొనలేరు)

తా. జ్ఞాన స్వరూపుడనగు నన్ను అవిద్యారూప యోగమాయ ఆవరించి యుండుటచే లోకమునకు నా నిజరూపము తెలియకున్నది. అజుడును, అవ్యయుడుననగు పరమాత్మను తత్త్వదృష్టితో గ్రహించలేక లోకము మూఢమైయున్నది. అజ్ఞానాంధకారమున మగ్గుచున్న వారు యోగసేవచే జ్ఞానభాస్కరుని ప్రకాశముపొంది ఆత్మజ్ఞానులగుదురు.

శ్లో॥ వేదాహం సమతీతాని వర్తమానాని చార్జున
భవిష్యాణి చ భూతాని మాం తు వేద న కశ్చన 26

అర్జున = ఓ అర్జునా!, సమతీతాని = గతించిపోయినట్టివియు, చ= మరియు, వర్తమానాని = ప్రస్తుత కాలమునందు ఉన్నట్టివియు, చ = మరియు, భవిష్యాణి = రాబోవు కాలమున జన్మించునట్టివియు అయిన, భూతాని = ప్రాణులన్నింటిని గూర్చి, అహమ్ = నేను, వేద = ఎరుంగుదును, తు = అయితే, మామ్ = నన్ను, కశ్చన = నాయందు శ్రద్ధలేని వాడు ఎవ్వడును, న వేద = ఎరుంగడు.

తా. ఓ అర్జునా! గతకాలమందలి సర్వ భూతములను, వర్తమాన కాలమందలి సర్వభూతములను, అట్లే భవిష్యత్కాలమందలి సర్వభూతములను నేనెరుగుదును. కాని వీరిలో ఒక్కరును నన్నెఱుగజాలరు. నా యందు భక్తికలవాడు మాత్రమే నన్ను తెలియగలడు.

వి. శ్రీ కృష్ణ పరమాత్మ యోగేశ్వరుడు. యోగులు త్రికాలజ్ఞానము కలవారు. యోగులకీశ్వరుడగు శ్రీకృష్ణపరమాత్మకు అట్టి జ్ఞానము కలదనుట అతిశయోక్తి కాదు.

శ్లో॥ ఇచ్ఛాద్వేషసముత్థేన ద్వన్ద్వమోహేన భారత
సర్వభూతాని సమ్మోహం సర్గే యాన్తి పరంతప 27

భారత = ఓ భరతవంశీ!, పరంతప = ఓ అర్జునా!, సర్గే = (ఈ) జగత్తునందు, ఇచ్ఛాద్వేష సముత్థేన = రాగద్వేషముల వలన కలిగిన, ద్వంద్వ మోహేన = సుఖదుఃఖాది ద్వంద్వముల ప్రభావమున మోహకారణముగ, సర్వభూతాని = సమస్త ప్రాణులును, సమ్మోహమ్ = అంతులేని వ్యామోహమును, యాంతి = పొందుచున్నవి

తా. ఓ అర్జునా! రాగద్వేషాది ద్వంద్వములు మోహజనకములు. సర్వభూతములు ద్వంద్వవశీకృత చిత్తులు. అందుచే మోహమున యథార్థమును గ్రహించజాలరు. సృష్టియందు సర్వభూతములకు ద్వంద్వమోహము సహజమై యున్నది. ద్వంద్వాతీతులగుటకు యోగమే శరణ్యము.

శ్లో॥ యేషాం త్వన్తగతం పాపం జనానాం పుణ్యకర్మణామ్
తే ద్వంద్వమోహనిర్ముక్తాః భజన్తే మాం దృఢవ్రతాః 28

తు = కాని, పుణ్యకర్మాణామ్ = నిష్కామభావముతో పుణ్యకర్మలను ఆచరించు, ఏషామ్, జనానామ్ = ఏ పురుషుల యొక్క, పాపమ్ = పాపము (లు), అంతగతమ్ = నశించిపోవునో,

తే = అట్టివారు (అట్టిభక్తులు), ద్వంద్వ మోహనిర్ముక్తాః = రాగద్వేష జనితములైన సుఖదుఃఖాది రూపమోహముల నుండి విముక్తులై దృఢవ్రతాః = దృఢనిశ్చయము గలవారై మామ్ = నన్ను భజంతే = భజింతురు.

తా. పుణ్యకర్మలనాచరించిన వారి పాపము అంతమగును. అప్పుడు ద్వంద్వముల వలన కలుగు మోహము నశించును. అట్టివారు నన్ను ధృఢవ్రతులై సేవించెదరు.

వి. ద్వంద్వ మోహమును నిర్మూలించి సమత్వ భావమును కలుగజేయు కర్మ పుణ్యకర్మ యగును. కావున యోగనిష్ఠయే పుణ్యకర్మయగును. *'ఉపైతిశాన్తరజసం'* అనుటచే యోగియే ద్వంద్వాతీతుడయి బ్రహ్మసుఖమందగలడని భావము. 'యోగనిష్ఠ' యే పుణ్యకర్మయని గ్రహింపదగును.

*శ్లో॥ యోగాగ్నిర్దహతి క్షిప్రమశేషం పాప పంజరమ్*
*ప్రసన్నం జాయతే జ్ఞానం జ్ఞానాన్నిర్వాణమృచ్ఛతి* (కూర్మపురాణము)

ఈ ప్రమాణమున యోగము పాపభంజకమయి జ్ఞానప్రదమగుచు మోక్షము నిచ్చును. కావున యోగనిష్ఠ అత్యావశ్యకము. యోగమే పుణ్యకర్మయని భావము.

శ్లో॥ జరామరణమోక్షాయ మామాశ్రిత్య యతన్తి యే
తే బ్రహ్మ తద్విదుః కృత్స్న మధ్యాత్మం కర్మ చాఖిలమ్ 29

యే = ఏ పురుషులు, మామ్ = నన్ను, ఆశ్రిత్య = ఆశ్రయించి (శరణుపొంది), జరామరణమోక్షాయ = జరామరణములనుండి ముక్తికై, యతంతి = ప్రయత్నింతురో, తే = వారు (ఆ పురుషులు), తత్, బ్రహ్మ = ఆ బ్రహ్మను, కృత్స్నమ్, అధ్యాత్మమ్ = సంపూర్ణ అధ్యాత్మమును, చ = మరియు, అఖిలమ్, కర్మ = సంపూర్ణ కర్మమును, విదుః = తెలిసికొందురు

తా. జరామరణములనుండి ముక్తిని పొందుటకు యోగయుక్తాత్ములై పరమేశ్వరుడనగు నన్ను ఆశ్రయించి ప్రయత్నించినవారు సచ్చిదానంద స్వరూపుడగు పరమాత్మను తెలిసికొన గలుగుదురు. కావున సర్వజ్ఞులగుచున్నారు. కనుక సర్వకర్మల నెరింగినవారగుచున్నారు.

వి. జన్మించిన వానికి జరామరణములు తప్పవు. కనుక జరామరణ మోక్షమునకై జ్ఞానప్రదమగు యోగమభ్యసింపవలెను. యోగముచే సార్వాత్మ్యసిద్ధి కలిగి ద్వంద్వాతీతుడగును. అనగా సమతాభావమేర్పడును. కర్మలు ఫలాపేక్ష కలిగియున్నవి. కనుక జన్మ మరణములు కలుగుచునే యుండును. తత్త్వజ్ఞాన ప్రాప్తికి ఉత్తమోత్తమ సాధనము యోగనిష్ఠయే.

'ముముక్షుభిః ప్రాణజయః కర్తవ్యో మోక్షహేతవే' (యోగవాశిష్ఠమ్)

శ్లో॥ సాధిభూతాధిదైవం మాం సాధియజ్ఞం చ యే విదుః
ప్రయాణకాలేఽపి చ మాం తే విదుర్యుక్తచేతసః 30

యే = ఏ పురుషులు, సాధిభూతాధి దైవతమ్ = అధిభూత అధిదైవములతో, చ = మరియు, సాధియజ్ఞమ్ = అధియజ్ఞముతో గూడిన (అందరికినీ ఆత్మరూపుడనైయున్న), మామ్ = నన్ను, ప్రయాణకాలే అపి = ప్రయాణకాలమునందైనను (అవసాన సమయముననైనను), విదుః = ఎరుంగుదురో, తే = వారు (ఆ పురుషులు), యుక్తచేతసః = నిశ్చలబుద్ధిగలవారై (యోగనిష్ఠచే), మామ్, చ = నన్నే, విదుః = ఎరుంగుదురు (పొందుదురు).

తా. అధిభూత, అధిదైవ, అధియజ్ఞ రూపములు కలిగియున్న నన్ను తెలిసిన జ్ఞానులు దేహాంతకాలమందు పరమాత్మనగు నాయందు లగ్నచిత్తులై యుందురు. కాన వారు చ్యుతులుగారు. 'యుక్తచేతసః' అనుటవలన యోగనిష్ఠచే సమాహిత చిత్తులగు వారని భావము.

ఇట్లు
శ్రీ పరమహంస పరివ్రాజకాచార్యులును,
బ్రహ్మర్షి సద్గురు **శ్రీశ్రీశ్రీ శివానంద భగవత్పూజ్యపాద** శిష్యులును నైన
బ్రహ్మర్షి సద్గురు **శ్రీశ్రీశ్రీ స్వామి రామానంద పరమహంస** వారిచే
రచింపబడిన గీతామృతమను టీక యందు
**విజ్ఞాన యోగ**మను సప్తమాధ్యాయము సమాప్తము

ఓం శ్రీకృష్ణ పరమాత్మనే నమః
అష్టమాధ్యాయము

# అక్షర పరబ్రహ్మ యోగము

**అర్జున ఉవాచ:**

శ్లో॥ కిం తద్బ్రహ్మ కిమధ్యాత్మం కిం కర్మ పురుషోత్తమ
అధిభూతం చ కిం ప్రోక్తమ్ అధిదైవం కిముచ్యతే 1

శ్లో॥ అధియజ్ఞః కథం కోఽత్ర దేహేఽస్మిన్ మధుసూదన
ప్రయాణ కాలే చ కథం జ్ఞేయోఽసి నియతాత్మభిః 2

పురుషోత్తమా = ఓ పురుషోత్తమా!, తత్ = ఆ, బ్రహ్మ = బ్రహ్మము అనగా, కిమ్ = ఏమి?, అధ్యాత్మమ్ = అధ్యాత్మము అనగా, కిమ్ = ఏమి?, కర్మ = కర్మ అనగా, కిమ్ = ఏమి?, అధిభూతమ్ = అధిభూతము అని, కిమ్ ప్రోక్తమ్ = ఏది చెప్పబడినది, చ = మరియు, అధిదైవమ్ = అధిదైవము అని, కిమ్, ఉచ్యతే = ఏది చెప్పబడును?, మధుసూదన = ఓ మధుసూదనా!, అత్ర = ఇచట, అధియజ్ఞః = అధియజ్ఞము అనగా, కః = ఎవరు?, అస్మిన్ = ఈ, దేహే = దేహమునందు, కథమ్ = (అది) ఎట్లుండును?, చ = మరియు, ప్రయాణకాలే = అంత్యకాలమున, నియతాత్మభిః = మనసును పరమాత్మునియందు లగ్నముచేసిన యోగులచే, కథమ్ = ఎట్లు, జ్ఞేయః, అసి = (నీవు) తెలిసికొనబడుదువు

తా. అర్జునుడు కృష్ణునితో నిట్టుల ప్రశ్నించెను. పురుషోత్తమా! బ్రహ్మమన నేమి? అధ్యాత్మమనగానేమి? కర్మయననేమి? అధిభూతమనగానేమి? అధిదైవమననేమి? మధుసూదనా! ఈ దేహమందు అధియజ్ఞుడన ఎవరు? ఎట్లుండును? మనోజయము కలిగియున్న యోగులు మరణకాలమందు సర్వాత్మవగు నిన్నెట్లు తెలిసికొనగలరు?

**శ్రీ భగవానువాచ:**

శ్లో॥ అక్షరం బ్రహ్మ పరమం స్వభావోఽధ్యాత్మముచ్యతే
భూతభావోద్భవకరో విసర్గః కర్మసంజ్ఞితః 3

పరమమ్ = సర్వశ్రేష్ఠుడైన, అక్షరమ్ = శాశ్వతుడైన, పురుషోత్తముని, బ్రహ్మ = బ్రహ్మము అని అందురు, స్వభావః = స్వ స్వరూపము అనగా జీవాత్మ, అధ్యాత్మమ్ = అధ్యాత్మము అని, ఉచ్యతే = చెప్పబడును, భూతభావోద్భవకరః = సకల ప్రాణుల ఉత్పత్తి అభ్యుదయములకు కారణమైన, విసర్గః = త్యాగ (సృష్టించు) క్రియయే, కర్మ సంజ్ఞితః = కర్మయనబడును.

తా. భగవానుడగు శ్రీకృష్ణుడు అర్జునుని ప్రశ్నలకు సమాధానము చెప్పుచున్నాడు. నిరతిశయమును అవ్యయమును అయియున్న పరమాత్మయే అక్షరశబ్దమునకు అర్థము.

'ఓ మిత్యేకాక్షరం బ్రహ్మ' అను శ్లోకమున వలె బ్రహ్మశబ్దమిచ్చట ఓంకార పరముకాదు. 'పరమం' అను విశేషణము బ్రహ్మశబ్దమునకు అన్వయించి, 'బ్రహ్మ పరమం' అను పదములకు పరమాత్మ అనియే అర్థమని తెలియదగును. స్వభావము అధ్యాత్మమని చెప్పబడును. ప్రతి ప్రాణికిని పరమాత్మ అంతరాత్మగానుండుట స్వభావమందురు. స్వభావమనినను అధ్యాత్మమనినను వేరు కాదు. చరాచరాత్మకజగత్తు యొక్క సృష్టికి కారణమైన యజ్ఞాదికర్మ, కర్మయనబడుచున్నది.

శ్లో॥ అధిభూతం క్షరో భావః పురుషశ్చాధిదైవతమ్
అధియజ్ఞోఽ హమేవాత్ర దేహే దేహభృతాం వర 4

దేహభృతామ్ వర! = దేహధారులలో శ్రేష్ఠుడైన ఓ అర్జునా!, భావః, క్షరః = ఉత్పత్తి, వినాశ శీలములైన పదార్థములన్నియును, అధిభూతమ్ = అధిభూతములు అనబడును, పురుషః = హిరణ్మయుడైన పురుషుడు, అధిదైవతమ్ = అధిదైవము, చ = మరియు, అత్ర, దేహే = ఈ దేహము (ల) లో అంతర్యామిగానున్న, అహమ్, ఏవ = నేనే (వాసుదేవుడనే), అధియజ్ఞః = అధియజ్ఞము

తా. ప్రాణి మాత్రమునాశ్రయించియున్న జడమైన దేహమును అధిభూతమందురు. క్షీణించునది కాన దీనిని క్షరమందురు. శాశ్వతమైనదికాదు. అధిదైవతమనగా ఆదిత్యమండలాంతర్గతుడై యున్న ఆత్మయే. అధిదైవతమనినను, పురుషుడనినను, హిరణ్యగర్భుడనినను ఒక్కటియే యగును. ఈ దేహమున అధియజ్ఞుడనగా పరమేశ్వరుడనగు 'నేను'. ఈ దేహముచే నిర్వర్తింపబడు యజ్ఞమునకు కర్తగను, కారయితగను, ఫలభోక్తగను, ఫలదాతగను యుండి భూతమహేశ్వరుడనైయున్న నేను అధియజ్ఞుడను.

శ్లో॥ అంతకాలే చ మామేవ స్మరన్ ముక్త్వా కలేవరమ్
యః ప్రయాతి స మద్భావం యాతి నాస్త్యత్ర సంశయః 5

యః = ఎవడు, అంతకాలే, చ = అంత్యకాలమునందు, మామ్, ఏవ = నన్నే, స్మరన్ = స్మరించుచూ, కలేవరమ్ = శరీరమును, ముక్త్వా = వీడి, ప్రయాతి = పోవునో, సః = ఆ పురుషుడు, మద్భావమ్ = నా స్వరూపమునే (నన్నే), యాతి = పొందును, అత్ర = ఈ విషయమున, సంశయః = సందేహము, న, అస్తి = లేదు.

తా. ప్రయాణ కాలమున నియతాత్ములైనవారు "నిన్నెట్లు చేరగలరు" అను ప్రశ్నకు జవాబిచ్చుచున్నారు. "చిరకాలమభ్యసించినను అవసానకాలమందు విడువక పరమాత్మనగు నన్ను చింతించుచు కళేబరమును వదలినవాడు పరమపదమును పొందును. సంశయింప పనిలేదు".

వి. *"యాఽన్తే మతిస్సాగతిః"* అనురీతిన పరమాత్మనగు నన్ను తన అంతఃకరణంబున ధ్యానించుచు ఉపాధిని వదలిన యోగి నన్నే పొందును".

శ్లో॥ యం యం వాపి స్మరన్ భావం త్యజత్యంతే కలేవరమ్
తం తమేవైతి కౌంతేయ సదా తద్భావభావితః 6

కౌంతేయ! = ఓ కుంతీసుతా!, అంతే = (ఏ మనుష్యుడు) అంత్యకాలమునందు, యమ్, యమ్ = ఏ, యే, భావమ్, వా, అపి = భావము(ల)ను, స్మరన్ = స్మరించుచు, కలేవరమ్ = శరీరమును, త్యజతి = త్యజించునో, తమ్, తమ్, ఏవ = ఆయా స్వరూపములనే, ఏతి = పొందును, సదా = (ఏలనన) నిరంతరము, తద్భావభావితః = (అతడు) ఆభావములచే ప్రభావితుడు అగును

తా. అవసానకాలమున ఏ దేవతను స్మరించుచు దేహము వదలునో ఆ దేవతను పొందును. ఎల్లప్పుడు ఆ దేవతనే భక్తితో మనసునందు భావించుటచే ఆ దేవతనే పొందుచున్నాడు.

వి. *'త్యజత్యన్తే కలేవరమ్'* అనుటచే దేహత్రయమును విడచిన జీవుడు 'తురీయ' మను భ్రూమధ్య స్థానమును చేరి 'ఆత్మస్వరూపు' డగునని గ్రహించవలెను.

*శ్లో॥ యథాజలం జలేక్షిప్తం క్షీరం క్షీరే ఘృతం ఘృతే*
*అవిశేషోభవేత్తద్వత్ జీవాత్మ పరమాత్మనో (పైంగలోపనిషత్ 3-10)*

నీటిలో నీరు, పాలలో పాలు, నేతియందు నేయి యే విధమున కలియునో అట్లే జీవాత్మ పరమాత్మైక్యము పొందును. అనగా ఆత్మభూతుడయి జీవుడు ముక్తుడు కాగలడని భావము.

శ్లో॥ తస్మాత్ సర్వేషు కాలేషు మామనుస్మర యుధ్య చ
మయ్యర్పితమనోబుద్ధిః మామేవైష్యస్యసంశయః 7

తస్మాత్ = అందువలన (ఓ అర్జునా!), సర్వేషు = సమస్తమైన, కాలేషు = కాలములయందును, మామ్ = నన్ను, అనుస్మర = స్మరించుచుండుము, చ = మఱియు, యుధ్య = యుద్ధమును చేయుము, మయి = నాయందే, అర్పితమనోబుద్ధిః = మనస్సును, బుద్ధిని నిమగ్నమొనర్చిన వాడవై, అసంశయమ్ = నిస్సందేహముగా, మామ్, ఏవ = నన్నే, ఏష్యసి = పొందగలవు.

తా. ఆ కారణమున సర్వకాల సర్వావస్థలందును నన్ను చింతించుచుండుము. యుద్ధము చేయుము. నీవు నాయందుంచబడిన మనోబుద్ధులు కలవాడవగుటచే నన్ను పొందగలవు. సంశయింపకుము.

శ్లో॥ అభ్యాసయోగయుక్తేన చేతసా నాన్యగామినా
పరమం పురుషం దివ్యం యాతి పార్థానుచింతయన్ 8

పార్థా! = ఓ పార్థా!, అభ్యాసయోగయుక్తేన = పరమేశ్వరుని యోగసాధన యందే నిమగ్నమైన, న, అన్యగామినా = మఱియొక విషయమునే చింతింపనట్టి, చేతసా = మనస్సుతో, పురుషః = మనుష్యుడు, అనుచింతయన్ = అనుక్షణము స్మరించుచు, పరమమ్ = సర్వశ్రేష్ఠుడైన, దివ్యమ్, పురుషమ్ = ఆ పురుషోత్తముని, యాతి = పొందును

తా. యోగమునభ్యసించుచు యుక్తుడవగుదువు కాన ఆత్మేతరభావముతో చలింపని చిత్తముచే నిరంతరము పరమపురుషుడనగు నన్ను చింతించుచుండుటచే నన్నే పొందగలుగుదువు.

శ్లో॥ కవిం పురాణమనుశాసితారమ్
అణోరణీయాంసమనుస్మరేద్యః
సర్వస్య ధాతారమచింత్యరూపమ్
ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్ 9

శ్లో॥ ప్రయాణకాలే మనసాచలేన
భక్త్యా యుక్తో యోగబలేన చైవ
భ్రువోర్మధ్యే ప్రాణమావేశ్య సమ్యక్
స తం పరం పురుషముపైతి దివ్యమ్ 10

యః = ఏ పురుషుడు, కవిమ్ = సర్వజ్ఞుడును, పురాణమ్ = అనాదియు, అనుశాసితారమ్ = అందరినీ శాసించువాడును, అణోః = అణువుకంటెను, అణీయాంసమ్ = సూక్ష్మమైనవాడును, సర్వస్య, ధాతారమ్ = సకల ప్రాణులను ధరించి, పోషించువాడును, అచింత్య రూపమ్ = అచింత్యరూపుడును, ఆదిత్యవర్ణమ్ = సూర్యునివలె నిత్యచేతన ప్రకాశరూపుడును, తమసః, పరస్తాత్ = పెనుచీకటికవ్వల ఏకాకృతిగా వెలుగువాడగు పరమాత్మను, అనుస్మరేత్ = అనుక్షణము స్మరించునో, సః = అట్టి, భక్త్యా, యుక్తః = భక్తిగల పురుషుడు, ప్రయాణకాలే = అంత్యకాలమున, యోగబలేన = యోగబలముచే, భ్రువోః, మధ్యే = భ్రూమధ్య ప్రదేశమున, ప్రాణమ్ = ప్రాణమును,

సమ్యక్ = చక్కగా, ఆవేశ్య = నిలిపి, చ = మరియు, అచలేన = నిశ్చలమైన, మనసా = మనస్సుతో, (స్మరన్) = స్మరించుచూ, తమ్ = ఆ, దివ్యమ్ = దివ్యుడును, పరమ్, పురుషమ్, ఏవ = పరమపురుషుడును అయిన పరమాత్మనే, ఉపైతి = పొందు (చేరు)ను.

తా. భూత భవిష్యద్వర్తమానముల నెరింగినట్టియు, పురాతన కాలమునుంచి యుండియు భవిష్యత్కాలమున కూడా నూతనముగా నుండునట్టియు, చరాచరాత్మక సర్వప్రాణికోటికి, శుభా శుభములను కలుగజేయువాడు కాన శాసకుడైనట్టియు, సూక్ష్మముకంటెను సూక్ష్మమైనవాడును, కర్మఫల ప్రదాతయగుటచే సర్వపోషకుడును, నానా రూపముల ధరించియూ ఒకనిచేతను తెలియబడక యున్నవాడును, అవిద్యారూపమైన పెనుజీకటి కవ్వల ఆదిత్యాకారమున వెలుగునట్టి ఆ పరమాత్మను ప్రతిక్షణము స్మరించుచున్న యోగి అవసానకాలమున నిర్మలమై నిశ్చలమైన మనస్సుతో ఆత్మానుసంధానము చేయుచు, యోగబలముతో తన ప్రాణశక్తిని భ్రూమధ్య భాగమున చక్కగా బాదుకొలిపి దివ్యమైన పరమపురుషుని పొందుచున్నాడు.

శ్లో॥ యదక్షరం వేదవిదో వదంతి విశన్తి యద్యతయో వీతరాగాః
యదిచ్ఛంతో బ్రహ్మచర్యం చరంతి తత్తే పదం సంగ్రహేణ ప్రవక్ష్యే 11

వేదవిదః = వేదవిదులైన విద్వాంసులు, యత్ = ఏ సచ్చిదానంత ఘనపరమాత్మను, అక్షరమ్ = శాశ్వతునిగా, వదంతి = చెప్పుదురో, వీతరాగాః = ఆసక్తి రహితులైన, యతయః = యత్నశీలురైన సన్న్యాసులు, యత్ = ఏ పరమ పదమును, విశంతి = ప్రవేశించుచున్నారో, యత్ = ఏ పరమ పదమును, ఇచ్ఛంతః = కోరుకొనువారై బ్రహ్మచారులు, బ్రహ్మచర్యమ్ = బ్రహ్మచర్యవ్రతమును, చరంతి = ఆచరించుచున్నారో, తత్ =అట్టి, పదమ్ = పరమపదమును గూర్చి, తే = నీకు, సంగ్రహేణ = సంక్షిప్తముగా, ప్రవక్ష్యే = చెప్పెదను

తా. వేదవేత్తలగువారు ఏపదమును అక్షరమని చెప్పుదురో, సమ్యగ్దర్శన లాభమునకై వైరాగ్య సంపన్నులగు యతీశ్వరులు ఏ పరమపదమున ప్రవేశించుచున్నారో, ఏ బ్రహ్మపదమును కోరి బ్రహ్మచర్యవ్రతము నాచరించుదురో అట్టి ఆత్మధామమును గూర్చి సంగ్రహముగా చెప్పెదను.

శ్లో॥ సర్వద్వారాణి సంయమ్య మనో హృది నిరుధ్య చ
మూర్ధ్న్యాధాయాత్మనః ప్రాణమాస్థితో యోగధారణామ్ 12

శ్లో॥ ఓమిత్యేకాక్షరం బ్రహ్మ వ్యాహరన్ మామనుస్మరన్
యః ప్రయాతి త్యజన్ దేహం స యాతి పరమాం గతిమ్ 13

సర్వద్వారాణి = సర్వేంద్రియములను, సంయమ్య = నిగ్రహించి, చ = అట్లే, మనః = మనస్సును, హృది = హృదయమునందు, నిరుధ్య = స్థిరమొనర్చి, మూర్ధ్ని = మూర్ధస్థానము (సహస్రారము) నందు, ఆత్మనః = తనయొక్క, ప్రాణమ్ = ప్రాణమును, ఆధాయ = స్థిరముగా ఉంచి, యోగధారణామ్ = యోగనిష్ఠయందే, ఆస్థితః = నిమగ్నుడై, యః = ఏ పురుషుడు, ఓం, ఇతి, ఏకాక్షరమ్, బ్రహ్మ = ఓం అను ఏకాక్షరరూప బ్రహ్మమును, వ్యాహరన్ = ఉచ్చరించుచూ, మామ్ = నిర్గుణపరబ్రహ్మనైన నన్ను, అనుస్మరన్ = చింతనచేయుచు, దేహమ్ = శరీరమును, త్యజన్ = త్యజించుచూ, ప్రయాతి = వెళ్ళిపోవుచున్నాడో, సః = ఆ పురుషుడు, పరమామ్, గతిమ్ = పరమగతిని, యాతి = పొందును.

తా. "జ్ఞానము బహిర్ముఖమగుటకు ద్వారభూతములగు ఇంద్రియములను సంయమము చేసి, మనస్సును హృత్పుండరీకమున నిలిపి, ప్రాణమును మూర్ధ స్థానమున యుంచి యోగనిష్ఠ యందుండవలెను. యోగ బలమున సహస్రారమునందు ప్రాణమును నిలిపి పరమేశ్వరుడనైన నన్ను తలచుచు, అద్వయమును, అక్షరమును యగు బ్రహ్మను ప్రాప్తింపజేయు ప్రణవమును ఊర్ధ్వమునకు చరింపజేయుచు స్థూల సూక్ష్మ కారణ దేహత్రయ భంగము గావించుకొని ప్రయాణించువాడు నిరతిశయమైన బ్రహ్మపదమును పొందును".

వి. ఇచ్చట హృదయ పుండరీకమనగా సహస్రార కమలమని తెలియదగును.

*శ్లో॥ సహస్రదళ మధ్యస్థం యః కరోతి మనఃస్థిరమ్*
*సతృష్ణాక్షుజ్జరా జన్మమృత్యుభిర్ననిబధ్యతే* *(దేవీ భాగవతము)*

సహస్రారకమల మధ్యమున మనస్సును స్థిరముగా నిలుపగలవానికి జన్మజరామరణములు కలుగవని భావము.

*శ్లో॥ ఓం కారం ప్రణవం విద్యాత్ ప్రణవో బ్రహ్మ నిర్భయమ్*
*ప్రణవే నిత్యయుక్తస్య న భయం విద్యతే క్వచిత్* *(మాండూక్య గౌడపాద కారిక)*

ప్రణవమున నిత్యయుక్తుడగు వానికి ఎన్నడు భయము కలుగదు. భయములేని స్థానము బ్రహ్మమే *'ప్రణవో బ్రహ్మనిర్భయమ్'* అని ప్రమాణవాక్యము కలదు. *'ఓమిత్యేకాక్షరం బ్రహ్మ వ్యాహరన్'* ఓం అనగా పరబ్రహ్మ వాచకమైన ప్రణవము, ఏకము, క్షరము కానిది, బ్రహ్మయనుటచే 'ఓం' వర్ణము కాదని తెలియవలెను. ఇది స్వరము. 'వ్యాహరన్' అనగా పైకి తీయుచు అని అర్థము. నోటితో పలుకుట కాదు. అంతర్గతమైన స్వరమును పైకి తీసికొని పోవుచు ఈశ్వరుని అనగా సర్వాత్మను ధ్యానించవలెను.

శ్లో॥ సకృదుచ్చారిత మాత్ర స ఏష
ఊర్ధ్వ మున్నామ యతీత్యోంకారః (అధర్వ శిఖోపనిషత్-1)

ఒక పర్యాయము పైకి చరింపజేసిన మాత్రమున పైన సహస్రార కమలమున అనగా ఆత్మస్థానమునకు తీసికొనిపోవునని భావము.

శ్లో॥ యోవేదా దౌ స్వరః ప్రోక్తః వేదాన్తేచ ప్రతిష్ఠితః
తస్య ప్రకృతి లీనస్య యః పరః స మహేశ్వరః (ఉత్తరగీత 1-22)

అదియే బ్రహ్మ. ఆ స్వరరూపమగు ఓంకారము వేదమునకాదియందును, వేదాంతమందును ప్రతిష్ఠితమై యున్నది. ప్రాణాయామ పరుడగు యోగి ప్రణవోపాసన చేయువాడగుచున్నాడు.

శ్లో॥ అనన్యచేతాః సతతం యో మాం స్మరతి నిత్యశః
తస్యాహం సులభః పార్థ నిత్యయుక్తస్య యోగినః 14

పార్థ = ఓ పార్థా!, యః = ఏ యోగి, మయి = నాయందు, అనన్యచేతాః = అనన్యచిత్తుడై, నిత్యశః = సర్వదా, సతతమ్ = నిరంతరము, మామ్ = పురుషోత్తముడనైన నన్ను, స్మరతి = స్మరించునో, తస్య = అట్టివానికి, నిత్యయుక్తస్య = సంతతము మత్పరాయణుడైన, యోగినః = యోగికి, అహమ్ = నేను, సులభః = సులభుడను (సులభముగా లభింతును)

తా. ఆత్మకంటె అన్యముగా మరొకటి లేదని తలచువాడై, దీర్ఘకాలము నిరంతరము పరమాత్మను తలచుచు, సమాహితచిత్తుడైన యోగికి నేను సుఖముగా పొందదగిన వాడనగుదును.

వి. 'అత్యాశ్రమస్థః సకలేన్ద్రియాణి నిరుధ్య భక్త్యా స్వగురుం ప్రణమ్య' అనియు 'సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ' అనియు చెప్పుట 'అనన్యచేతాః' అని చెప్పుటయే యగుచున్నది. 'యోమాంస్మరతి నిత్యశః' అనుటచే .......

శ్లో॥ శుచిర్వాప్యశుచిర్వాపి యో జపేత్ప్రణవం సదా
నసలిప్యతి పాపేన పద్మపత్రమివామ్భసా (శృతి)

అను వాక్యానుసారము ఎవడు సర్వకాల సర్వావస్థలందును ప్రణవమును జపించునో వాడు పాపవిముక్తుడై బ్రహ్మను పొందునని భావము.

శ్లో॥ మాముపేత్య పునర్జన్మ దుఃఖాలయమశాశ్వతమ్
నాప్నువంతి మహాత్మానః సంసిద్ధిం పరమాం గతాః 15

పరమామ్ = అత్యుత్తమమైన, సంసిద్ధిమ్ = సిద్ధిని, గతాః = పొందినట్టి, మహాత్మానః = మహాత్ములు, మామ్ = నన్ను, ఉపేత్య = పొంది (పొందిన పిమ్మట), దుఃఖాలయమ్ = దుఃఖములకు నిలయమైన, అశాశ్వతమ్ = క్షణభంగురమైన, పునర్జన్మ = పునర్జన్మను, న, ఆప్నువంతి = పొందనే పొందరు

తా. పరమేశ్వరుడనుగు నన్ను ఆత్మగాదలచు మహాత్ములు పరమోత్తమమగు మోక్షమును నొందుదురు. అట్టివారు మరల అస్థిరమును, దుఃఖములకు నిలయమునగు జన్మజరామరణరూప సంసారమున పడరు.

శ్లో॥ ఆబ్రహ్మభువనాల్లోకాః పునరావర్తినోఽ ర్జున
మాముపేత్య తు కౌంతేయ పునర్జన్మ న విద్యతే 16

అర్జున = ఓ అర్జునా!, ఆ బ్రహ్మ భువనాత్ = బ్రహ్మలోక పర్యంతము గల, లోకాః = సమస్త లోకములును, పునరావర్తినః = పునరావృత్తములు, తు, కౌంతేయ = అయితే ఓ అర్జునా!, మామ్ = నన్ను, ఉపేత్య = పొందుట వలన, పునర్జన్మ = పునర్జన్మ, న, విద్యతే = ఉండదు.

తా. తాను ఆత్మయేయని భావించక భోగాభిలాషచే కర్మలనాచరించువారు ఏ లోకములను చేరినను సుఖభోగానంతరము మరల జన్మించువారే యగుచున్నారు. సర్వత్ర ఆత్మదర్శనము చేయు మహాత్ములు అక్షయ బ్రహ్మానందానుభూతి కలవారై పునరావృత్తి రహితమైన బ్రహ్మపదము నందగలరు. బ్రహ్మపదప్రాప్తికి యోగరతుడు కావలెను.

శ్లో॥ సహస్రయుగపర్యంతమ్ అహర్యద్బ్రహ్మణో విదుః
రాత్రిం యుగ సహస్రాంతామ్ తేఽ హోరాత్రవిదో జనాః 17

యత్ = ఏది, సహస్రయుగ పర్యంతమ్ = వేయి చతుర్యుగముల కాలము, బ్రహ్మణః = బ్రహ్మకు, అహః = పగలు అనియు, (యామ్) = ఏది, యుగసహస్రాంతామ్ = అట్టి వేయి చతుర్యుగముల కాలమును, రాత్రిమ్ = రాత్రినిగాను, యే = ఏ పురుషుడు, విదుః = ఎరుంగుదురో, తే, జనాః = అట్టి యోగులు, అహోరాత్ర విదః = రాత్రిందివముల కాలతత్త్వమును నిజముగానెరిగినవారు.

తా. రాత్రిందివముల తత్త్వమెరింగిన యోగులు వేయి యుగముల పరిమితమైన కాలము బ్రహ్మకు ఒక్కపగలనియు, అట్లే వేయి యుగముల కాలము బ్రహ్మకు ఒక్క రాత్రికాలమనియు చెప్పుదురు. ఈ తీరున బ్రహ్మలోకము కూడ పరిమితకాలము గలది యగుచున్నది. అందుచే అశాశ్వతమైనది.

శ్లో॥ అవ్యక్తాద్వ్యక్తయః సర్వాః ప్రభవంత్యహరాగమే
రాత్ర్యాగమే ప్రలీయంతే తత్రైవావ్యక్తసంజ్ఞకే 18

సర్వాః, వ్యక్తయః = సమస్త చరాచర ప్రాణులన్నియును, అహరాగమే = బ్రహ్మయొక్క పగటికాలము ప్రారంభము కాగానే, అవ్యక్తాత్ = అవ్యక్తము నుండి, ప్రభవంతి = ఉత్పన్నములు (ప్రకటితములు) అగును మరియు, రాత్ర్యాగమే = బ్రహ్మయొక్క రాత్రి కాలము ప్రారంభము కాగానే, తత్ర, అవ్యక్త సంజ్ఞకే, ఏవ = అవ్యక్తమను పేరుగల బ్రహ్మము యొక్క సూక్ష్మ శరీరమునందే ప్రలీయంతే = లీనమగును.

తా. బ్రహ్మకు పగటికాలము ప్రారంభము కాగానే సృష్టి ప్రారంభమయి సర్వజీవులు ఉద్భవించుచున్నవి. అట్లే రాత్రి కాలమురాగా అవ్యక్తమను పేరు కలిగిన ప్రకృతియందు సమస్త భూతములు లీనమగుచున్నవి.

శ్లో॥ భూతగ్రామః స ఏవాయం భూత్వా భూత్వా ప్రలీయతే
రాత్ర్యాగమేఽ వశః పార్థ ప్రభవత్యహరాగమే 19

పార్థ = అర్జునా!, సః, ఏవ = అట్టి ఉపర్యుక్తమైన, అయమ్ = ఈ, భూతగ్రామః = భూతసముదాయము, భూత్వా, భూత్వా = మరల మరల ఉత్పన్నమగుచు, అవశః = ప్రకృతి వశమున, రాత్ర్యాగమే = రాత్రి ప్రవేశ కాలమునందు, ప్రలీయతే = లీనమగును మరియు, అహరాగమే = దినప్రవేశ కాలమునందు, ప్రభవతి = (మరల) ఉత్పన్నమగును

తా. స్థావర జంగమ రూపమైన భూతసముదాయము పగటి సమయమున పుట్టుటకును, రాత్రికాలమున గిట్టుటకును అనగా అవ్యక్తమగు ప్రకృతి యందు లీనమగుటకును పరతంత్రమైయున్నది. ఏవిధమైన స్వాతంత్ర్యము భూతములకు లేదు.

శ్లో॥ పరస్తస్మాత్తు భావోఽ న్యోఽ వ్యక్తోఽ వ్యక్తాత్ సనాతనః
యః స సర్వేషు భూతేషు నశ్యత్సు న వినశ్యతి 20

తు = అయితే, తస్మాత్, అవ్యక్తాత్ = ఆ అవ్యక్తము కంటెను, పరః = అత్యంత పరమైనది, అన్యః = విలక్షణమైన మరియొకటి, యః = ఏ, సనాతనః = సనాతనమైన, అవ్యక్తః = అవ్యక్తమైన, భావః = భావముగలదో, సః = ఆ పరమదివ్య పురుషుడు, సర్వేషు = సమస్తమైన, భూతేషు = భూతములు, నశ్యత్సు = నశించిపోవుచున్నను, న, వినశ్యతి = నశించిపోడు

తా. సర్వభూతములకును ఆశ్రయముగానుండి, అవిద్యారూప ప్రకృతికంటె వేరైనదియు సనాతనముగా ఉన్నదియునగు అక్షరపరబ్రహ్మయే సచ్చిదానందరూపమై సర్వభూతములకు ఆత్మయైయున్నది. ఆ ఆత్మ నశించునదికాదు.

శ్లో॥ మహతః పరమవ్యక్తం అవ్యక్తాత్ పురుషః పరః' (శృతి)

అను ప్రమాణముచే చెప్పబడిన పరమపురుషుడే 'అవ్యక్తావ్యక్తః' అని చెప్పబడెను.

శ్లో॥ అవ్యక్తోఽక్షర ఇత్యుక్తః తమాహుః పరమాం గతిమ్
యం ప్రాప్య న నివర్తంతే తద్ధామ పరమం మమ 21

అవ్యక్తః = ఈ అవ్యక్తమే, అక్షరః, ఇతి = అక్షరమనియు, ఉక్తః = చెప్పబడును, తమ్ = అక్షరము అని వ్యవహరింపబడు ఆ అవ్యక్తభావమునే, పరమామ్, గతిమ్ = పరమగతి అనియు, ఆహుః = పలుకుదురు (వ్యవహరింతురు), యమ్ = ఏ పరమగతిని, ప్రాప్య = పొంది, న, నివర్తంతే = (మరల) తిరిగిరారో, తత్ = అది, మమ = నాయొక్క, పరమమ్, ధామ = పరంధామము

తా. "అవ్యక్తుడని, అక్షరుడని చెప్పబడునదియే పరమపదము. ఆ పరమపదము చేరిన వానికి పునరావృత్తి యుండదు. పునరావృత్తి రహితమగు ఆ పరమపదము పరమాత్మ పదమని తెలిసికొనుము".

శ్లో॥ పురుషః సః పరః పార్థ భక్త్యా లభ్యస్త్వనన్యయా
యస్యాంతఃస్థాని భూతాని యేన సర్వమిదం తతమ్ 22

పార్థ = ఓ అర్జునా!, భూతాని = సమస్త భూతములును, యస్య, అంతఃస్థాని = ఏ సచ్చిదానంద ఘనపరమాత్మయందు అంతర్గతములైయున్నవో, యేన = ఏ సచ్చిదానంద ఘనపరమాత్మచేత, ఇదమ్ = ఈ, సర్వమ్ = సమస్తమైన జగత్తు, తతమ్ = పరిపూర్ణమై ఉన్నదో, సః = ఆ, పరః = సర్వశ్రేష్ఠుడైన, పురుషః తు = పురుషోత్తముడు (అనగా సనాతన అవ్యక్తపరమాత్మ) అయితే, అనన్యయా, భక్త్యా = అనన్యమైన భక్తితో మాత్రమే, లభ్యః = లభ్యుడు (అగును).

తా. పురమువంటి శరీరమున నుండుటచే పురుషుడనబడును లేక సర్వత్ర నిండియుండి పరిపూర్ణుడై యుండుటచేత పురుషుడందురు. ఆ పురుషుడు సృష్టికి కారణమైన మాయకు అతీతుడుగాన పరుడనబడును. కావున 'పరఃపురుషః' యనిన పరమాత్మయని భావము. పరమాత్మ అనన్య భక్తిచే లభ్యమగును. ఆత్మకంటే వేరైనది ఏదియు లేదనియు, సర్వము ఆత్మయే యని తలచుట అనన్యభక్తి యగును. 'సర్వంవాసుదేవః' యను జ్ఞానము అనన్యభక్తి యగుటచే అట్టి భక్తిచేతనే నిరతిశయుడగు

పరమపురుషుడు లభ్యమగును. సర్వత్ర పూర్ణుడైయున్న పురుషునియందు చాలా స్వల్పమగు భాగమున మాత్రమే సచరాచరమగు సకల జగత్తు కలదు. 'విష్టభ్యాహ మిదం కృత్స్నమేకాంశేనస్థితోజగత్' అను గీతావాక్యమునకిదియే భావము. సకల జగత్తు పరమాత్మచే వ్యాప్తమై యుండుటయేకాక, జగత్తుకు ఊర్ధ్వాధోభాగములందును సకల దిశలందును ఆత్మ అనంతముగా వ్యాపించియున్నది.

శ్లో॥ యత్ర కాలే త్వనావృత్తిమ్ ఆవృత్తిం చైవ యోగినః
ప్రయాతా యాంతి తం కాలం వక్ష్యామి భరతర్షభ 23

భరతర్షభ = ఓ అర్జునా!, యత్ర, కాలే = ఏ కాలమునందు, ప్రయాతాః=శరీర త్యాగము చేసి, వెళ్ళిపోవునట్టి, యోగినః = యోగులు, తు = అయితే, అనావృత్తిమ్ = తిరిగిరాని గతిని (చేరుదురో), చ = మరియు, ఆవృత్తిమ్, ఏవ = తిరిగివచ్చు గతినే, యాంతి = పొందుదురో తమ్, కాలమ్ = ఆ కాలమును అనగా రెండు మార్గములను గూర్చి, వక్ష్యామి = చెప్పెదను.

తా. ఓ అర్జునా! ఏ కాలమున మృతిచెందిన యోగులు పునర్జన్మను పొందరో, ఏ కాలమున మరణించిన మరల జన్మించుదురో ఆ కాలమును గూర్చి చెప్పుదును.

శ్లో॥ అగ్నిర్జ్యోతిరహః శుక్లః షణ్మాసా ఉత్తరాయణమ్
తత్ర ప్రయాతా గచ్ఛన్తి బ్రహ్మ బ్రహ్మవిదో జనాః 24

జ్యోతిః = జ్యోతిర్మయమగు మార్గమునకు, అగ్నిః = అగ్ని అభిమానదేవత, బ్రహ్మవిదః = బ్రహ్మవేత్తలైన, జనాః = యోగులు, ప్రయాతాః = మృతిచెందిన వారై, అహః = పగలు, శుక్లః = శుక్లపక్షము, షణ్మాసాః = ఆరునెలలు గల ఉత్తరాయణము (వీటియొక్క అభిమాన దేవతలుగల), తత్ర = ఆ మార్గముద్వారా, బ్రహ్మ = పరబ్రహ్మ (పరమపదమును), గచ్ఛంతి = పొందుచున్నారు

తా. అగ్ని, జ్యోతి, అహస్సు, శుక్లపక్షము, ఉత్తరాయణమందలి షణ్మాసములు కాలాభిమాన దేవతలుగా గ్రహింపబడుచున్నారు. బ్రహ్మోపాసనాపరులయి సమ్యగ్దర్శన సిద్ధినొందక దేహము వదలిన యోగులు, అగ్ని మొదలగు కాలాభిమాన దేవతల ద్వారా ఆయా లోకములకు పోవుదురు. ఈ మార్గమునే అర్చిరాది మార్గమందురు. ఈ మార్గమున పయనించిన వారు క్రమముక్తిని పొందుదురు.

వి. సమ్యగ్దర్శన నిష్ఠాపరులైన బ్రహ్మవేత్తలు గమనాగమనములు లేనివారు కాన వారు బ్రహ్మమయులై ఉన్నవారే. దేహపతనమే కాని ప్రాణోత్క్రమణ యుండదని భావము. 'నతస్యప్రాణా ఉత్క్రామన్తి' అను శృతికి –బ్రహ్మభూతులకు ప్రాణము బ్రహ్మయందు లయము పొందుననియు, ఉపాధి నాశమైన పిదప నీటిలో పోయబడిన నీరువలె ఐక్యము చెందుననియు తాత్పర్యము.

శ్లో॥ ధూమో రాత్రిస్తథా కృష్ణః షణ్మాసా దక్షిణాయనమ్
తత్ర చాంద్రమసం జ్యోతిః యోగీ ప్రాప్య నివర్తతే 25

ధూమః = ధూమాభిమాన దేవత, రాత్రి = రాత్రి అభిమాన దేవత, తథా = అట్లే, కృష్ణ = కృష్ణపక్ష అభిమాన దేవత, దక్షిణాయనమ్ = దక్షిణాయనము యొక్క, షణ్మాసాః = ఆరు మాసముల అభిమాన దేవత ఈ దేవతల ద్వారా, తత్ర = ఆ మార్గమున (ధూమ మార్గమున), యోగీ = సకామ కర్మలను ఆచరించుయోగి (పైన పేర్కొనబడిన, అభిమాన దేవతల ద్వారా కొనిపోబడినవాడై), చాంద్రమసమ్, జ్యోతిః = చాంద్రమస జ్యోతిని, ప్రాప్య = పొంది (స్వర్గలోకాది ఫలములను అనుభవించి), నివర్తతే = తిరిగి భూలోకమునకు చేరును

తా. ధూమము, రాత్రి, కృష్ణపక్షము దక్షిణాయనపు షణ్మాసములు కాలాభిమాన దేవతా వాచకములు. ఆయా కాలములందు మృతులగువారు యోగమున అచలస్థితిని పొందని కారణముచే పునరావృత్తి కలిగినవారగుదురు. ఆయా లోకములకేగి పుణ్యఫల భోగానంతరము మరల జన్మించుదురు. జ్యోతిర్మయమగు చంద్రలోకమున భోగములను అనుభవించి తిరిగి జన్మింతురు.

శ్లో॥ శుక్లకృష్ణే గతీ హ్యేతే జగతః శాశ్వతే మతే
ఏకయా యాత్యనావృత్తిమ్ అన్యయావర్తతే పునః 26

హి = ఏలనన, జగతః = జగత్తులోని, ఏతే = ఈ రెండు విధములైన, శుక్ల కృష్ణే, గతీ = శుక్ల కృష్ణ మార్గములు, లేక దేవయాన పితృయాన మార్గములు, శాశ్వతే = సనాతనములైనవిగా, మతే = భావింపబడుచున్నవి, ఏకయా = ఒకదాని (దేవయాన మార్గము) ద్వారా వెళ్ళువాడు, అనావృత్తిమ్ = తిరిగిరాని స్థితిని (పరమగతిని), యాతి = పొందును, అన్యయా = మరియొకదాని (పితృయాన మార్గము) ద్వారా వెళ్ళువాడు అయితే, పునః, ఆవర్తతే = తిరిగివచ్చును (జననమరణ చక్రములో పడును)

తా. శుక్లమార్గము, కృష్ణమార్గము అను రెండు మార్గములు ప్రాణికోటికి శాశ్వతములై యున్నవి. జ్ఞాన ప్రకాశకమగుచు, యోగపరులు పోవు మార్గము కాన శుక్లమార్గమని పిలువబడుచున్నవి. ఈ మార్గమున పయనించు పుణ్యాత్ములగు యోగులు పునరావృత్తి చెందరు. జ్ఞానరహితులు పోవు మార్గమునకు కృష్ణమార్గమని పేరు. ఈ మార్గమున చరించునట్టి యోగులు, పునర్జన్మ కలిగి ఉందురు.

వి. జీవునకు లేక ప్రాణమునకు ఊర్ధ్వగతి కలిగిన ఉత్తరాయణమనియు, అధోగతి కలిగిన దక్షిణాయనమనియు ఎరుగవలెను. ప్రాణము ఊర్ధ్వగతినందిన వానికి జన్మరాహిత్యము కలుగును. ప్రాణము అధోగతిశీలమైనచో జన్మము కలుగును.

శ్లో॥ నైతే సృతీ పార్థ జానన్ యోగీ ముహ్యతి కశ్చన
తస్మాత్ సర్వేషు కాలేషు యోగయుక్తో భవార్జున 27

పార్థ = అర్జునా!, యేతే = ఈ రెండు, సృతీ = మార్గములను, జానన్ = తెలుసుకొనిన, కశ్చన యోగి = ఏ యోగియు, న, ముహ్యతి = మోహితుడు కాడు, తస్మాత్ = అందువలన, అర్జున = ఓ అర్జునా!, సర్వేషు, కాలేషు = సర్వ కాలములయందును, యోగయుక్త = (నీవు) సమబుద్ధి రూప యోగయుక్తుడవు, భవ = కమ్ము (నిరంతరము నన్నే పొందుటకు యత్నింపుము)

తా. పైజెప్పబడిన మార్గములలో శుక్లమార్గము మోక్షమార్గమనియు, కృష్ణమార్గము సంసార మార్గమనియు తెలిసిన యోగి, పునరావృత్తి రహిత శుక్లమార్గమునే అనుసరించును. కనుక మోహము చెందదు. అనగా కృష్ణమార్గమున పయనించుటకు కారణమైన ప్రవృత్తి మార్గమును అవలంబించడని భావము. అందుచే ఓ అర్జునా! నీవు సర్వకాలములందును యోగనిష్ఠ కలిగియుండుము.

శ్లో॥ వేదేషు యజ్ఞేషు తపస్సు చైవ దానేషు యత్పుణ్యఫలం ప్రదిష్టమ్
అత్యేతి తత్సర్వమిదం విదిత్వా యోగీ పరం స్థానముపైతి చాద్యమ్ 28

యోగీ = యోగి అయిన పురుషుడు, ఇదమ్ = ఈ తత్త్వ రహస్యమును, విదిత్వా = తెలిసికొని, వేదేషు = వేద (పఠన)ముల యందును, చ = మరియు, యజ్ఞేషు = యజ్ఞముల (చేయుట) యందును, తపస్సు = తపస్సుల (ఆచరించుట) యందును, దానేషు = దానముల (చేయుట) యందును, యత్ = ఏ, పుణ్యఫలమ్ = పుణ్యఫలము, ప్రదిష్టమ్ = చెప్పబడినదో, తత్, సర్వమ్ = ఆ సమస్త ఫలమును, ఏవ = నిస్సందేహముగా, అత్యేతి = అధిగమించును, చ = మరియు, ఆద్యమ్ = సనాతనమైన, పరమ్, స్థానమ్ = పరమపదమును, ఉపైతి = పొందును

తా. శ్రద్ధాపూర్వకముగా వేదాధ్యయనమందు, విధివిహితముగా నాచరింపబడిన యజ్ఞములందు నానావిధ తపోవ్రతముల నాచరించుటయందు, పాత్రోచిత దానములందును శాస్త్ర ప్రచోదితమై ఏ పుణ్యఫలము లభ్యమగునో ఆ పుణ్యఫలము కంటె అతిశయమైన ఫలమును ఆత్మతత్త్వమంతయు బాగుగా తెలిసిన యోగి పొందుటయే కాక సర్వమునకు మూలమైన పరమపదమును కూడ పొందుచున్నాడు.

వి.	వేదాధ్యయనాది కర్మల వలన కలుగు ఫలములు నశించునవి. కావున అనిత్యములని భావము. అట్లుగాక యోగము వలన కలుగు ఫలము ఆత్మపదప్రాప్తి కాన శాశ్వతమై అక్షయముగా నుండును. అందువలననే 'సర్వేషు కాలేషు యోగయుక్తోభవార్జున' అను వాక్యముచే యోగపరుడై యుండుట ఆవశ్యకమని చెప్పబడినది.

ఇట్లు
శ్రీ పరమహంస పరివ్రాజకాచార్యులును,
బ్రహ్మర్షి సద్గురు **శ్రీశ్రీశ్రీ శివానంద భగవత్పూజ్యపాద** శిష్యులును నైన
బ్రహ్మర్షి సద్గురు **శ్రీశ్రీశ్రీ స్వామి రామానంద పరమహంస** వారిచే
రచింపబడిన గీతామృతమను టీక యందు
**అక్షర పరబ్రహ్మ యోగ**మను అష్టమాధ్యాయము సమాప్తము.

ఓం శ్రీకృష్ణ పరమాత్మనే నమః

నవమాధ్యాయము

# రాజవిద్యా రాజగుహ్య యోగము

**శ్రీ భగవానువాచ:**

శ్లో॥ ఇదం తు తే గుహ్యతమం ప్రవక్ష్యామ్యనసూయవే
జ్ఞానం విజ్ఞానసహితం యత్ జ్ఞాత్వా మోక్ష్యసేఽశుభాత్ 1

యత్, తు = దేనినయితే, జ్ఞాత్వా = తెలిసికొనుట వలన, అశుభాత్ = దుఃఖరూప సంసారము నుండి, మోక్ష్యసే = ముక్తుడవయ్యెదవో, (తత్) = అట్టి, గుహ్యతమమ్ = పరమగోప్యమైన, విజ్ఞాన సహితమ్ = విజ్ఞాన సహితమైన, జ్ఞానమ్ = జ్ఞానమును, అనసూయవే = దోషదృష్టి లేనివాడవైన, తే = నీకు, ప్రవక్ష్యామి = (మరల) సమగ్రముగా వివరించెదను.

తా. కృష్ణ భగవానుడిట్లు మరల చెప్పెను. అర్జునా! అసూయాది భావములచే కలుషచిత్తుడవు కాని నీకు అతిరహస్యమైనదియు, సంసార రూపమైన అశుభమును తొలగించునదియు, ప్రత్యక్షానుభవ సహితమైనదియునగు ఆత్మ జ్ఞానమును చెప్పెదను.

వి. ఆత్మతత్త్వ మెరిగినవాడు సంసారమునుండి మోక్షము పొందును. సంసారమనగా అనర్థ ప్రదమైన బంధము. ఈ బంధమును శాశ్వతముగా తొలగించునది జ్ఞానము. ఆ ఆత్మజ్ఞానము యోగము వలన కలుగును. *'తత్స్వయం యోగ సంసిద్ధః కాలే నాత్మని విన్దతి'* , *'యోగజ్ఞాన పరోనిత్యం స యోగీ న ప్రణశ్యతి'* అను ప్రమాణములు యోగ జ్ఞానముల ఆవశ్యకతను చాటుచున్నవి. ముముక్షువు చిత్తశుద్ధికి ప్రాణాయామ రూప యోగపరుడై యుండవలెను. ధారణా ధ్యాన సమాధులకు జ్ఞానమునభ్యసింపవలెను. కావున యోగమును గూర్చి చెప్పిన వెంటనే పరమాత్మ తత్త్వమును బోధించుచున్నాడు.

శ్లో॥ రాజవిద్యా రాజగుహ్యం పవిత్రమిదముత్తమమ్
ప్రత్యక్షావగమం ధర్మ్యం సుసుఖం కర్తుమవ్యయమ్ 2

ఇదమ్ = ఈ విజ్ఞానసహిత జ్ఞానము, రాజవిద్యా, రాజగుహ్యమ్ = అన్ని విద్యలకును తలమానికము, సమస్త గోప్య విషయములకును శిరోభూషణము, పవిత్రమ్ = మిక్కిలి పవిత్రమైనది, ఉత్తమమ్ = అత్యుత్తమమైనది, ప్రత్యక్షావగమమ్ = ప్రత్యక్షముగా ఫలమునిచ్చునది, ధర్మ్యమ్ = ధర్మయుక్తము, కర్తుమ్ = సాధనచేయుటకు, సుసుఖమ్ = మిక్కిలి సుగమమైనది, అవ్యయమ్ = శాశ్వతమైనది.

తా. సర్వవిద్యలకును బ్రహ్మవిద్య మకుటాయమానమైనది. కనుక రాజవిద్య యనబడుచున్నది. అనర్హులకు ఉపదేశించిన శ్రేయోభంగము కలుగును. అందుచే గుప్తముగా నుంచదగిన వానిలో ఇది మొదటిది. కనుక ఈ విద్యను రాజగుహ్యమనిరి. సర్వభూతాత్మయగు పరమాత్మను గూర్చి బోధించునది. కాన పవిత్రమైనదియు, శ్రేష్ఠమైనదియు అగుచున్నది, ప్రత్యక్షముగా అనుభవము ద్వారా తెలియదగినది. బ్రహ్మను తెలిసికొనుటయే ఉత్తమ ధర్మము కావున ధర్మ్యమైనది. అనేకమైన సుగుణములను కలిగియున్ననూ, ఆచరించుటకు కించిత్తయిన కష్టములేక యుండుటచే సుఖముగా నాచరించుటకు తగినదని భావము. ఏకొంచెమాచరించిన తగిన ఫలము నిచ్చునది కాన అవ్యయ మనియు తెలియదగును.

వి. 'సుసుఖం కర్తుమవ్యయమ్' అనుటచే క్రియను సూచించుచున్నది. కాన అభ్యాసయోగమని భావము. జ్ఞానమన శాస్త్రగ్రంథ పఠనార్జిత జ్ఞానము కాదనియు, ఆత్మజ్ఞానప్రదమైన యోగక్రియను సుఖముగా నాచరింపవలెననియు స్పష్టమగుచున్నది. 'యోగీ నిశితధారేణ క్షురేణైవ నికృంతయేత్' అనుటచే యోగక్రియచేతనే జ్ఞాన ప్రతిబంధములను తొలగించుకొనవలెనని విశదమగుచున్నది.

శ్లో॥ అశ్రద్ధధానాః పురుషా ధర్మస్యాస్య పరంతప
అప్రాప్య మాం నివర్తన్తే మృత్యుసంసారవర్త్మని 3

పరంతప = ఓ పరంతపా!, అస్య = (పైన పేర్కొనబడిన) ఈ, ధర్మస్య = ధర్మమార్గమునందు, అశ్రద్ధధానాః = శ్రద్ధారహితులైన, పురుషాః = పురుషులు, మామ్ = నన్ను, అప్రాప్య = పొందక, మృత్యుసంసార వర్త్మని = మృత్యురూప సంసార చక్రమున, నివర్తంతే = పరిభ్రమించుచుందురు.

తా. ఆత్మజ్ఞాన రూపధర్మమును విశ్వసింపని దేహాభిమానులగు నాస్తికులు మృత్యుమార్గమగు సంసారమున బడి అనేక హీనయోనులందు పుట్టుచు, చచ్చుచునుందురు కాని పరమేశ్వరుడనగు నా అనుగ్రహమునకు పాత్రులు కాజాలరు. కావున శ్రేయోమార్గము నవలంబించజాలరు.

శ్లో॥ మయా తతమిదం సర్వం జగదవ్యక్తమూర్తినా
మత్స్థాని సర్వభూతాని న చాహం తేష్వవస్థితః 4

అవ్యక్తమూర్తినా = నిరాకార బ్రహ్మనైన, మయా = నాచేత, ఇదమ్ = ఈ, సర్వమ్ = సమస్తమైన, జగత్ = జగత్తు, తతమ్ = (నీటితో మంచువలె) పరిపూర్ణమై యున్నది, చ = మరియు, సర్వభూతాని = ప్రాణులన్నియును, మత్స్థాని = (నా సంకల్పమును ఆధారముగాగొని) నాయందే,

అంతర్గతములై యున్నవి (కాని), అహమ్ = నేను, తేషు = వాటియందు, న అవస్థితః = (వాస్తవముగా) స్థితుడనుగాను.

తా. ఈ జగత్తంతయు ఇంద్రియగోచరము కాని నా స్వరూపముచే వ్యాప్తమైయున్నది. సర్వభూతములు సర్వభూత మహేశ్వరుడనగు నన్ను ఆధారముగా గైకొని సర్వకర్మలందు వ్యవహరించుచున్నారు. అనగా సర్వ భూతములకు నేనాశ్రయమై యున్నాను. నాకు భూతములాశ్రయము కాజాలవు. 'సచాహం తేష్వవస్థితం' అనగా నా యునికికి భూతములెంతమాత్రము ఆధారముగా నుండజాలవు. నా ఆధారమే భూతముల స్థితికి కారణము అని భావము.

శ్లో॥ న చ మత్స్థాని భూతాని పశ్య మే యోగమైశ్వరమ్
భూతభృన్న చ భూతస్థో మమాత్మా భూతభావనః 5

భూతాని = ఆ ప్రాణులన్నియును, న చ మత్స్థాని = నాయందు స్థిరముగా లేవు, కాని, మే = నాయొక్క, ఐశ్వర్యమ్ = ఈశ్వరీయమైన, యోగమ్ = యోగశక్తిని, పశ్య = చూడుము, భూతభావనః = భూతములను సృష్టించువాడను, చ = మరియు, భూతభృత్, చ = భూతములను ధరించువాడను, భరించువాడను నేనేయైనను, మమ, ఆత్మా = నా ఆత్మ (వాస్తవముగా), భూతస్థః, న = ఆ భూతములయందు స్థితమైయుండదు

తా. సర్వ ప్రాణులును సర్వేశ్వరుడనగు నా మాయచే మోహితులై యున్నవి. సర్వాత్మనగు నన్నెరుంగక యున్నవి. కావున ఆ భూతములు నాయందున్నవి కావు. నా మాయచే సర్వభూతములు ఇంద్రియవశములై, ఇంద్రియార్థ భోగపరములై యున్నవి. సర్వ భూతములకు ఆశ్రయ భూతుడను. వానినన్నిటిని పోషించి రక్షించువాడను. కాని నాకెన్నటికిని భూతములాశ్రయములు కానేరవు. సర్వాత్మనగు నావలననే భూతముల యుత్పత్తి, వృద్ధి జరుగుచున్నవి.

శ్లో॥ యథాకాశస్థితో నిత్యం వాయుః సర్వత్రగో మహాన్
తథా సర్వాణి భూతాని మత్స్థానీత్యుపధారయ 6

సర్వత్రగః = అంతటను సంచరించునట్టి, మహాన్ = మిక్కిలి విస్తృతమైన, వాయుః = (ఆకాశమునుండియే ఉత్పన్నమైన) వాయువు, యథా = ఎట్లు, నిత్యమ్ = నిరంతరము, ఆకాశస్థితః = ఆకాశమునందే స్థితమైయుండునో, తథా = అట్లే, భూతాని = నా సంకల్పమువలననే ఉత్పన్నములైన భూతములు (ప్రాణులు), సర్వాణి = అన్నియును, మత్స్థాని = నా యందే స్థితమైయున్నవి, ఇతి = అని, ఉపధారయ = ఎరుంగుము.

తా. సర్వత్ర వ్యాపించియున్న వాయువు నిత్య మాకాశమందున్నను, ఆకాశమునకు వాయు సంసర్గము లేనటుల సర్వభూతములు నాయందున్నను సూక్ష్మాతి సూక్ష్మమైయున్న నాకు భూతములతో నెట్టి సంగము లేదు.

శ్లో॥ సర్వభూతాని కౌంతేయ ప్రకృతిం యాంతి మామికామ్
కల్పక్షయే పునస్తాని కల్పాదౌ విసృజామ్యహమ్ 7

కౌంతేయ = ఓ కౌంతేయా!, కల్పక్షయే = కల్పాంతమునందు, సర్వభూతాని = భూతములన్నియును, మామికామ్, ప్రకృతిమ్ = నా ప్రకృతినే, యాంతి = చేరును (లీనమగును), కల్పాదౌ = (మరియు) కల్పాదియందు, తాని = వాటిని, పునః = మరల, అహమ్ = నేను, విసృజామి = సృష్టించుచుందును.

తా. అర్జునా! కల్పావసానకాలమున సర్వభూతములు సత్త్వరజస్తమోగుణాత్మికయైన ఈశ్వర మాయను చేరుచున్నవి. మరల కల్పారంభకాలమున ఆ భూతములనన్నిటిని సృష్టించుదును.

శ్లో॥ ప్రకృతిం స్వామవష్టభ్య విసృజామి పునః పునః
భూతగ్రామమిమం కృత్స్నమ్ అవశం ప్రకృతేర్వశాత్ 8

(అహమ్) = నేను, స్వామ్, ప్రకృతిమ్ = స్వీయప్రకృతిని (నా మూల ప్రకృతిని), అవష్టభ్య = స్వీకరించి, ప్రకృతేః, వశాత్ = తమతమ స్వభావ వశమున, అవశమ్ = పరతంత్రమైయున్న, ఇమమ్ = ఈ, కృత్స్నమ్ = సమస్తమైన, భూతగ్రామమ్ = భూత సముదాయమును, పునః, పునః = మాటిమాటికిని, విసృజామి = (వాటి కర్మానుసారము) సృష్టించుచుందును,

తా. సర్వేశ్వరుడనగు నేను నాకు వశమైయున్న మాయద్వారా, ప్రకృతి వశములై స్వాతంత్ర్యమును కోల్పోయిన చరాచర సకల భూతములను మరల మరల సృష్టించుచుందును.

శ్లో॥ న చ మాం తాని కర్మాణి నిబధ్నంతి ధనంజయ
ఉదాసీనవదాసీనమ్ అసక్తం తేషు కర్మసు 9

ధనంజయ = ఓ అర్జునా!, తేషు, కర్మసు = ఆ కర్మలయందు, అసక్తమ్ = ఆసక్తి రహితుడనైన, చ = మరియు, ఉదాసీనవత్ = ఉదాసీనునివలె, అసీనమ్, మామ్ = ఉన్నట్టి నన్ను, తాని కర్మాణి = ఆ కర్మలు, న, నిబధ్నంతి = బంధిపవు.

తా. ఓ అర్జునా! భూతవర్గమునకు సంబంధించిన కార్యములన్నియు నా మూలమున జరుగుచున్నవి. అయినను ఆయా కర్మలందు ఔదాసీన్యము వహించి యుండువాడను. కావున వానియందు ఏ మాత్రము సంగభావము లేనివాడను. కేవలము ద్రష్టగా నుండుట వలన ఆయా కర్మలు నన్ను బంధించజాలవు.

శ్లో॥ మయాధ్యక్షేణ ప్రకృతిః సూయతే సచరాచరమ్
హేతునానేన కౌంతేయ జగద్విపరివర్తతే 10

కౌంతేయ = ఓ కుంతీసుతా!, అధ్యక్షేణ = అధ్యక్షుడనైయున్న, మయా = నా చేత (నా ద్వారా), ప్రకృతిః = ప్రకృతి, సచరాచరమ్ = ఈ చరాచరజగత్తును, సూయతే = సృష్టించుచున్నది, అనేన = ఈ, హేతునా = కారణమున, జగత్ = సంసారచక్రము, విపరివర్తతే = పరిభ్రమించు చున్నది

తా. సర్వథా ద్రష్టగానుండి నిర్వికారుడనైన నాయొక్క సాన్నిధ్యమున చరాచరాత్మక సకల జగత్తు మాయచే కలుగుచున్నది. ఇంతియేకాక, నానావిధ కార్యకలాపములు ద్రష్టనగు నావలన జరుగుచున్నది. అయినను సర్గాది రూపమైన ప్రకృతి కార్యమందు సంగము లేనివాడను.

శ్లో॥ అవజానంతి మాం మూఢా మానుషీం తనుమాశ్రితమ్
పరం భావమజానంతో మమ భూతమహేశ్వరమ్ 11

మమ = నాయొక్క, పరమ్, భావమ్ = పరమభావమును, అజానంతః = ఎరుగనివారై, మూఢాః = అజ్ఞానులు, భూత మహేశ్వరమ్ = సకల ప్రాణులకును మహేశ్వరుడను, మానుషీమ్, తనుమ్ = (లోకకళ్యాణార్థము) మానుష శరీరమును, ఆశ్రితమ్ = ఆశ్రయించిన (స్వీకరించిన) వాడను అయిన, మామ్ = నన్ను, అవజానంతి = తక్కువగా ఊహింతురు

తా. సర్వభూతములకు మహేశ్వరుడనగు నా యొక్క నిరతిశయమగు దివ్యరూపమును వివేకహీనులు ఎరుగలేకున్నారు. కావున వారు నన్ను మానవ శరీరధారునిగా మాత్రమే భావించుచు అవమానించుచున్నారు.

శ్లో॥ మోఘాశా మోఘకర్మాణో మోఘజ్ఞానా విచేతసః
రాక్షసీమాసురీం చైవ ప్రకృతిం మోహినీం శ్రితాః 12

మోఘాశా = వ్యర్థములైన ఆశలు గలవారును, మోఘకర్మణః = వ్యర్థములైన కర్మలను

ఆచరించువారును, మోఘజ్ఞానాః = విపరీత జ్ఞానము గలవారును, విచేతసః = విక్షిప్తములైన మనస్సులు గలవారును అగు రాక్షసులు, రాక్షసీమ్ = రాక్షసీ, ఆసురీమ్ = ఆసురీ, చ = మరియు, మోహినీమ్ = మోహినీ, ప్రకృతిమ్, ఏవ = స్వభావములనే, శితాః = ఆశ్రయింతురు (కల్గియుందురు)

తా. పరమాత్మయొక్క నిరతిశయ స్వరూపము తెలియని వివేకహీనులు దేహాత్మవాదులై, ఇంద్రియ వశులగుదురు. అట్టివారి ఆశలు, కర్మలు, జ్ఞానములు 'దేహమే ఆత్మ' యను భ్రాంతిచే కలిగినవి కాన నిష్ప్రయోజనములు, దేహాత్మవాదులు వివేకహీనులు కావున మోహాపాదకమగు రాక్షసీ ప్రకృతినీ, ఆసురీ ప్రకృతిని ఆశ్రయించిన వారగుచున్నారు.

*"మోహాదనీశ్వరతాం ప్రాప్యమగ్నో వపుషి శోచతి"* *(శృతి)*

రాక్షసీ ప్రకృతి మోహమును కలుగజేసి ఇంద్రియ తృప్తికై ప్రేరేపించును.

శ్లో॥ మహాత్మానస్తు మాం పార్థ దైవీం ప్రకృతిమాశ్రితాః
భజంత్యనన్యమనసో జ్ఞాత్వా భూతాదిమవ్యయమ్ 13

తు = కాని, పార్థ = ఓ పార్థా!, దైవీమ్, ప్రకృతిమ్ = దైవీ ప్రకృతిని, ఆశ్రితాః = ఆశ్రయించిన, మహాత్మానః = మహాత్ములు, మామ్ = నన్ను, భూతాదిమ్ = సకలప్రాణులకును మూలముగను, అవ్యయమ్ = అక్షర స్వరూపునిగను, జ్ఞాత్వా = గ్రహించి, అనన్యమనసః = నిశ్చల (ఏకాగ్రతగల) మనస్సులు గలవారై, భజంతి = నిరంతరము భజింతురు

తా. దైవీ ప్రకృతితో జన్మించినవారు ఓ అర్జునా! మహాత్ములు. వారు పరమేశ్వరుని, సృష్టికి పూర్వమేయున్న వానినిగను, నిర్వికారునిగను తెలిసికొని, మనస్సును చలింపనీయక, ఏకాగ్ర చిత్తమున నన్నే భజించుదురు. *'బ్రహ్మైవాగ్ర ఆసీత్'* అను శ్రుతి, సృష్టికి పూర్వమే బ్రహ్మయుండెనని చెప్పుచున్నది. కనుక పరమాత్మ 'భూతాది' యని చెప్పబడెను.

శ్లో॥ సతతం కీర్తయంతో మాం యతంతశ్చ దృఢవ్రతాః
నమస్యంతశ్చ మాం భక్త్యా నిత్యయుక్తా ఉపాసతే 14

దృఢవ్రతాః = అట్టి దృఢ నిశ్చయము గల భక్తులు, సతతమ్ = నిరంతరము, కీర్తయంతః, చ = (నా నామ గుణములను) కీర్తించుచుందురు, యతంతః, చ = (నన్ను చేరుటకు) యత్నించుచుందురు, మామ్ = నన్నుగూర్చి, నమస్యంతః = నమస్కరించుచుందురు, నిత్యయుక్తాః = నాధ్యానము నందే నిమగ్నులగుచుందురు, భక్త్యా = అనన్యభక్తితో, మామ్ = నన్ను, ఉపాసతే = ఉపాసించుచుందురు.

తా. సమాహిత చిత్తులైన యోగులు నిరంతరము పరమాత్మనగు నన్ను కీర్తించుచు, ఈశ్వరుని సేవించవలెనను స్థిరబుద్ధితో సమ్యగ్దర్శన సిద్ధికై యోగానుష్ఠాన పరులగుచు, భక్తిభావమున సర్వాత్మనగు నాకు నమస్కరించుచు భగవంతుని ఆరాధించుదురు.

శ్లో॥ జ్ఞానయజ్ఞేన చాప్యన్యే యజంతో మాముపాసతే
ఏకత్వేన పృథక్త్వేన బహుధా విశ్వతోముఖమ్ 15

అన్యే = మరికొందరు జ్ఞానయోగులు, మామ్ = నన్ను, జ్ఞానయజ్ఞేన = జ్ఞానయజ్ఞము ద్వారా, ఏకత్వేన = అభేదభావముతో, యుంజంతః = పూజింతురు, అపి, చ = మరికొందరు, బహుధా = అనేక విధములుగా నన్ను, విశ్వతోముఖమ్ = నా విరాట్ స్వరూపమును, పృథక్త్వేన = పృథక్ భావముతో, ఉపాసతే = ఉపాసింతురు

తా. తత్త్వమును బోధించుట, మననము చేయుట, సమ్యగ్దర్శనము, జ్ఞానయోగమనబడును. జ్ఞానులు బహువిధములుగా సర్వత్ర వ్యాపించియున్న పరమాత్మను ఏకరూపముగాను, వేరు వేరు రూపములు కలవానినిగను సేవించుదురు. అనగా సర్వభూతాంతరాత్మయగు పరమాత్మ 'ఏకరూపమే' యనియు, పరమాత్మయే సర్వభూతముల రూపమున యున్నాడనియు, తెలిసిన జ్ఞానులు పరమాత్ముని ఆదిత్యరూపమున, చంద్రరూపమున, రామకృష్ణాది రూపముల సేవించుచున్నారని భావము.

శ్లో॥ అహం క్రతురహం యజ్ఞః స్వధాహమహమౌషధమ్
మన్త్రోఽహమహమేవాజ్యం అహమగ్నిరహం హుతమ్ 16

అహమ్ ఏవ = నేనే, క్రతుః = క్రతువును, అహమ్ = నేనే, యజ్ఞః = యజ్ఞమును, అహమ్ = నేనే, స్వధా = స్వధయును (అన్నమును), అహమ్ = నేనే, ఔషధమ్ = ఔషధమును అహమ్ = నేనే, మంత్రః = మంత్రమును, అహమ్ ఏవ = నేనే, అజ్యమ్ = ఘృతమును, అహమ్ = నేనే, అగ్నిః = అగ్ని (ని), అహమ్ = నేనే, హుతమ్ = హోమక్రియయును

అవ. ఈ శ్లోకమున పరమాత్మను బహువిధముల సేవించు విధము చెప్పబడినది.
తా. యజ్ఞము, క్రతువు, సర్వప్రాణులకాహారమగు అన్నము, ఔషధము, మంత్రము, ఆజ్యము, అగ్నిహోత్రము, హోమద్రవ్యము మొదలగునన్నియు నేనే యగుచున్నాను.

శ్లో॥ పితాహమస్య జగతో మాతా ధాతా పితామహః
వేద్యం పవిత్రమోంకార ఋక్సామ యజురేవ చ 17

అస్య = ఈ, జగతః = జగత్తునకు, ధాతా = ధాతయు (ధరించువాడను, కర్మఫలముల నిచ్చువాడను), పితా = తండ్రియు, మాతా = తల్లియు, పితామహః = తాతయు (బ్రహ్మ), వేద్యమ్ = తెలిసికొనదగినవాడను, పవిత్రమ్ = పవిత్రమైనవాడను, ఓంకారః = ఓంకారమును, ఋక్ = ఋగ్వేదమును, సామ = సామవేదమును, చ = మరియు, యజుః = యజుర్వేదమును, అహమ్ ఏవ = నేనే.

తా. చరాచర జగత్తుకు తల్లియు, తండ్రియు నేనే. సర్వ భూతములకు కర్మఫలప్రదాతయగు బ్రహ్మను నేనే. అందరను పవిత్రము చేయునట్టిదియు కనుకనే తప్పక తెలియదగినదియు నగు ఓంకారము నేనే. ప్రణవము నాధారముగా జేసికొని వ్యక్తమైన ఋక్సామయజుర్వేదములును నేనే. నాకు అన్యములు కావు.

శ్లో॥ గతిర్భర్తా ప్రభుః సాక్షీ నివాసః శరణం సుహృత్
ప్రభవః ప్రలయః స్థానం నిధానం బీజమవ్యయమ్ 18

గతిః = పరమగతియైన పరంధామమును, భర్తా = భరించి, పోషించువాడను, ప్రభుః = అందరికినీ స్వామిని, సాక్షీ = అందరి మంచి చెడ్డలను చూచువాడను, అహమ్ ఏవ = నేనే, నివాసః = నివాస స్థానమును, శరణమ్ = శరణు పొందదగినవాడను, సుహృత్ = సుహృత్తును, ప్రభావః, ప్రలయః = అందరి ఉత్పత్తి, ప్రలయములకు హేతువును, స్థానమ్ = వారి స్థితికి ఆధారమును, నిధానమ్ = నిధానమును (పెన్నిధిని), అవ్యయమ్ = శాశ్వతమైన, బీజమ్ = కారణమును, (అహమ్ ఏవ) = నేనే

తా. సర్వకర్మలద్వారా ఫలరూపమున ప్రాప్యమగు సర్వము (గతి) పరమాత్మయే. సర్వ ప్రాణులను అన్నాదులచే పోషించు భర్తను నేనే. సర్వ భూతములకును వారివారి అర్హతను బట్టి ఆయా గతులను కల్పించు సర్వేశ్వరుడను నేనే. నిఖిలకర్మలు ఆత్మ మూలములైనను వానియందు సంగభావము లేక ఉదాసీనుడనై సాక్షిగా నుండువాడను నేను. సమస్త జగత్తుకు నివాసమైన వాడను నేనే. అనన్య భావమున భజించు మహాత్ముల యోగక్షేమముల జూచి రక్షించువాడను నేనే. ఉత్పత్తి స్థితిలయములకు హేతువగు ఆత్మయు నేనే. నిధివలె అక్షయ సుఖమునిచ్చు పరమాత్మయు నేనే. సంసారమునకు అనశ్వరమైన బీజమువంటివాడను ఈశ్వరుడనగు నేనే.

శ్లో॥ తపామ్యహమహం వర్షం నిగృహ్ణామ్యుత్సృజామి చ
అమృతం చైవ మృత్యుశ్చ సదసచ్చాహమర్జున 19

అర్జున = ఓ అర్జునా!, అహమ్ = నేను, తపామి = సూర్యరూపమున తపింపజేయుచున్నాను, వర్షమ్ = (సముద్రములనుండి) వర్షజలములను, నిగృహ్ణామి = ఆకర్షించుచున్నాను, చ = మరియు, ఉత్సృజామి = వర్షించుచున్నాను, అహమ్ ఏవ = నేనే, అమృతమ్ = అమృతమును, చ = మరియు, మృత్యుః, చ = మృత్యువును, సత్, అసత్, చ = సత్తును, అసత్తును గూడ, అహమ్ ఏవ = నేనే

తా. తీవ్ర తాపముచే తపింపజేయు ఆదిత్యుడను నేనే. మేఘముల ద్వారా వర్షమునిచ్చువాడను, కాలక్రమమున వర్షాభావమును కలుగజేయువాడను నేనే. దేవతలకు అమృతత్వము కలిగించు అమృతమును, మర్త్యులకు మర్త్యత్వము నిచ్చు మృత్యువును నేనే. సద్రూపమున నున్నవాడను, అసద్రూపమున దృశ్యమానమగు ప్రకృతియు నేనే యగుచున్నాను.

శ్లో॥ త్రైవిద్యా మాం సోమపాః పూతపాపా
యజ్ఞైరిష్ట్వా స్వర్గతిం ప్రార్థయంతే
తే పుణ్యమాసాద్య సురేంద్రలోకమ్
అశ్నంతి దివ్యాన్ దివి దేవభోగాన్ 20

త్రైవిద్యాః = ఋగ్యజుస్సామ వేదములచే ప్రోక్తములైన సకామకర్మలను ఆచరించువారును, సోమపాః = సోమరసపానము చేయువారును, పూతపాపాః = పాపరహితులును అగు పురుషులు, యజ్ఞైః = యజ్ఞముల ద్వారా, మామ్ = నన్ను, ఇష్ట్వా = పూజించి, స్వర్గతిమ్ = స్వర్గప్రాప్తిని, ప్రార్థయంతే = అర్థించుచుందురు, తే = ఆ పురుషులు, పుణ్యమ్ = పుణ్యఫలరూపమైన, సురేంద్రలోకమ్ = స్వర్గలోకమును, ఆసాద్య = పొంది, దివి = స్వర్గమునందు, దివ్యాన్ = దివ్యములైన, దేవభోగాన్ = దేవభోగములను, అశ్నంతి = అనుభవింతురు

తా. వేదత్రయోక్త కర్మానుష్ఠానపరులు యజ్ఞములనాచరించి సోమపానముచేసి కామహతులగుటచే స్వర్గాదిలోకముల సుఖములను కోరుదురు. అట్టివారు పుణ్యబలముచే స్వర్గలోకమందు దివ్యభోగము లనుభవించుదురు కాని, నన్ను ఆత్మగా తెలియజాలరు.

శ్లో॥ తే తం భుక్త్వా స్వర్గలోకం విశాలం క్షీణే పుణ్యే మర్త్యలోకం విశన్తి
ఏవం త్రయీధర్మమనుప్రపన్నా గతాగతం కామకామా లభన్తే 21

తే = ఆ పురుషులు, తమ్ = ఆ, విశాలమ్ = విశాలములైన, స్వర్గలోకమ్ = స్వర్గలోక భోగములను, భుక్త్వా = అనుభవించి, పుణ్యే = పుణ్యములు, క్షీణే = క్షీణింపగనే, మర్త్యలోకమ్ =

మనుష్యలోకమును, విశంతి = ప్రవేశింతురు, ఏవమ్ = ఈ ప్రకారముగా, త్రయీధర్మమ్ = (స్వర్గప్రాప్తి సాధనములైన) వేదత్రయ విహిత సకామ కర్మఫలము(ల)ను, అనుప్రపన్నాః = ఆశ్రయించువారును, కామకామాః = భోగములను ఆశించువారై, గతాగతమ్ = స్వర్గమర్త్యలోకముల మధ్య రాకపోకలను, లభంతే = పొందుదురు (సాగింతురు) (పుణ్యప్రభావముచే స్వర్గమునకు పోవుదురు. పుణ్యము క్షీణింపగానే మర్త్యలోకమునకు వచ్చెదరు)

తా. కామాభిలాష కలవారు యజ్ఞాది కర్మలద్వారా స్వర్గ భోగములననుభవించిన పిమ్మట పుణ్యము క్షీణింపగా తిరిగి మానవలోకమున జన్మించుదురు. ఈ విధముగా వేదోక్తమగు ప్రవృత్తి మార్గము నవలంబించిన వారు జన్మమరణములను పొందుచునే యుందురు. కాన ఈ కర్మల వలన పునరావృత్తి రహితమైన పరమపదమును పొందజాలరు. నివృత్తి మార్గమైన యోగనిష్ఠయే పరమపదము నీయగలుగును.

శ్లో॥ అనన్యాశ్చిన్తయన్తో మాం యే జనాః పర్యుపాసతే
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ 22

యే, అనన్యాః, జనాః = అనన్యభక్తులైన ఏ పురుషులు, మామ్ = పరమేశ్వరుడనైన నన్ను, చింతయంతః = నిరంతరము చింతించుచు (ఉన్నవారై), పర్యుపాసతే = (నిష్కామభావముతో) సేవింతురో, నిత్యాభియుక్తానామ్ = నిరంతరము నన్నే చింతించునట్టి, తేషామ్ = ఆ పురుషుల యొక్క, యోగక్షేమమ్ = యోగక్షేమములను, అహమ్ = నేనే (స్వయముగా), వహామి = వహింతును.

తా. కామహతులు కానివారు పరమేశ్వరుడనగు నన్ను తమకంటె వేరుగా తలచరు. తమ యాత్మగా నన్ను భావించుచు నిత్యమారాధించుచుందురు. అట్టి యోగులకప్రాప్తమైయున్న యోగసిద్ధిని కలుగజేయుచు, ప్రాప్తమైయున్న యోగస్థితి యందు స్థైర్యమును కలుగజేయుదునని భగవానుని ప్రతిజ్ఞ.

వి. ఆత్మకంటె తాను వేరుకాదను అనన్యభావమున భగవంతుని తలచువారు నిత్యయుక్తులగుదురు. 'వాసుదేవస్సర్వం' అను భావన కలుగు మహాత్ములు యోగనిష్ఠయందు స్థిరచిత్తులై యుందురు. కావున వారికప్రాప్తమగు యోగసిద్ధిని కలుగజేయుట, ప్రాప్తమైయున్న యోగసిద్ధిని స్థిరముగా నుండునట్లు చేయుట అను యోగక్షేమములను నేనే చూచుకొందును. అట్టివారు నాకాత్మవలె ప్రియతములై యుందురు.

శ్లో॥ యేఽప్యన్యదేవతా భక్తా యజన్తే శ్రద్ధయాన్వితాః
తేఽపి మామేవ కౌన్తేయ యజన్త్య విధిపూర్వకమ్ 23

కౌంతేయ! = ఓ కుంతీసుతా!, అపి = అయినప్పటికిని, యే = ఏ, భక్తాః = సకామ భక్తులు, శ్రద్ధయాన్వితాః = శ్రద్ధాదరములుగలవారై, అన్యదేవతాః = ఇతర దేవతలను, యజంతే = పూజింతురో, తే, అపి = వారుకూడ, మామ్, ఏవ = నన్నే, యజంతి = పూజించుచున్నారు కాని, వారి పూజలు, అవిధిపూర్వకమ్ = విధ్యుక్తములు కావు.

తా. కామాపేక్షచే ఆత్మేతరభావముతో దుర్గ, కాళి మొదలగు దేవతలను భజించువారు కూడ వాస్తవమునకు నన్నే భజించుచున్నారు. పరమాత్మనగు నేనే సర్వదేవతా రూపమున ఉన్నవాడను. అయినను ఆత్మభావముతో కాక అన్యభావముతో భజించుట విధి విహితము కాదు. కాన అన్యదేవతా భక్తులు భ్రాంతిమూలమున అట్లుపాసన చేయుదురు. కాన ఫలము జన్మపరంపరా ప్రాప్తియే.

శ్లో॥ అహం హి సర్వయజ్ఞానాం భోక్తా చ ప్రభురేవ చ
న తు మామభిజానన్తి తత్త్వేనాతశ్చ్యవంతి తే 24

హి = ఏలనన, సర్వయజ్ఞానామ్ = సకల యజ్ఞములకును, భోక్తా = భోక్తయును, చ = మఱియు, ప్రభుః, చ = స్వామియును, అహమ్, ఏవ = నేనే, తు = కాని, తే = వారు, మామ్ = పరమేశ్వరుడనైన నన్ను, తత్త్వేన = తత్త్వపూర్వకముగా (నాపరమేశ్వర తత్త్వమును), న, అభిజానంతి = ఎఱుంగరు, అతః = అందువలన, చ్యవంతి = పతనమగుదురు (పునర్జన్మను పొందుదురు)

తా. సర్వయజ్ఞములకు అధిదేవతలగు ఇంద్రాది దేవతలకు ఆత్మ భూతుడను నేనే. కనుక ఆయా దేవతల రూపమున పురోడాశాది భోక్తను నేనే. ఆయా దేవతారూపమున యజ్ఞ ఫలమునిచ్చువాడను నేనే. అన్యదేవతా భావనచే ఈశ్వరతత్త్వము తెలియనివారు కాన సమ్యక్ దర్శన రూప ఫలసిద్ధిని పొందరు. అందుచే భ్రష్టులగుచున్నారు.

శ్లో॥ యాంతి దేవవ్రతా దేవాన్ పితౄన్ యాంతి పితృవ్రతాః
భూతాని యాంతి భూతేజ్యా యాంతి మద్యాజినోఽపి మాం 25

దేవవ్రతాః = దేవతలను పూజించువారు, దేవాన్ = దేవతలను, యాంతి = పొందుదురు, పితృవ్రతాః = పితరులను సేవించువారు, పితౄన్ = పితృలోకములను, యాంతి = పొందుదురు, భూతేజ్యాః = భూతప్రేతములను అర్చించువారు, భూతాని = భూతప్రేతరూపములను, యాంతి = పొందుదురు, మద్యాజినః = నన్ను ఆరాధించు భక్తులు, మామ్, అపి = నన్నే, యాంతి = పొందుదురు

తా. 'ఆత్మకంటె అన్యము' అను భావముతో దేవతలను ఉపాసించువారు శాశ్వతములు కాని ఆయా దేవతల లోకమును చేరుదురు. అట్లే పితృదేవతలను శ్రద్ధగా ఆరాధించువారు పితృలోకముల కేగుదురు. వినాయకాది భూతములనారాధించువారు భూతావాసమగు లోకములకు పోయెదరు. పరమాత్మనగు నన్ను సర్వాత్మభావముతో సేవించువారు నన్నే చేరుదురు.

శ్లో॥ పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి
తదహం భక్త్యుపహృతం అశ్నామి ప్రయతాత్మనః 26

యః = ఏ పురుషుడు, మే = నాకు, భక్త్యా = భక్తితో, పత్రమ్ = పత్రమునుగాని, పుష్పమ్ = పుష్పమునుగాని, ఫలమ్ = ఫలమునుగాని, తోయమ్ = జలమునుగాని, ప్రయచ్ఛతి = సమర్పించుచున్నాడో, ప్రయతాత్మనః = నిర్మలబుద్ధి, నిష్కామ భావముగల భక్తునిచే, భక్త్యుపహృతమ్ = భక్తిపూర్వకముగా సమర్పితమైన, తత్ = ఆ పత్ర, పుష్పాదులను, అహమ్ = నేను (సగుణరూపమున), అశ్నామి = స్వయముగా, ప్రీతితో ఆరగింతును.

తా. నియమ పూర్వముగా నన్ను భక్తితో ఆరాధించువాడు పత్ర పుష్ప ఫల తోయములలో ఏదేని నాకర్పించినను నేను స్వీకరించుచున్నాను.

వి. ఇచ్చట పత్రపుష్ప ఫలాదులచే నుద్దేశింపబడినవి పత్రాదులు కావు. కారణమేమనగా ఈశ్వరుని మానుషదేహధారిగా భావించుట ఈశ్వరుని అవజ్ఞ చేయుటయని గీతలో చెప్పబడినది. *'అవజానన్తి మాం మూఢా మానుషీం తను మాశ్రితమ్' (9-11).* పరమాత్మను సేవించుట మహాత్ములే యెరుగుదురని భగవంతుడు గీతలో చెప్పియున్నాడు.

*శ్లో॥ మహాత్మానస్తు మాంపార్థదైవీం ప్రకృతిమాశ్రితాః*
*భజన్త్యనన్యమనసో జ్ఞాత్వా భూతాది మవ్యయమ్ (9-13)*

సర్వ భూతములకు మూలమై అవ్యయమైయున్న వానినిగా తెలిసికొనుటయే పరమాత్మ సేవయని భావము. అట్లు సేవించగలవారు మహాత్ములనియు, దైవీ ప్రకృతిని ఆశ్రయించిన వారనియు గీతా భావము. అందుచే పత్రపుష్పాదులన వేరు.

*శ్లో॥ 'విషయైః పత్రవాంస్తథా ధర్మాధర్మ సుపుష్పశ్చ సుఖదుఃఖ ఫలోదయ' (మహాభారతమ్ 14-47)*

అను ప్రమాణముచే విషయములు పత్రములనియు, ధర్మాధర్మములు పుష్పములనియు, సుఖదుఃఖములు ఫలములనియు గ్రహించవలెను. ఇట్లే సంసారమనగా జలమనియు చెప్పబడినది. విషయాదులను త్యజించినవాడే పరమేశ్వరోపాసకుడని, అట్టివాడే మహాత్ముడని భావము.

శ్లో॥ యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్
యత్తపస్యసి కౌంతేయ తత్కురుష్వ మదర్పణమ్ 27

కౌంతేయ = ఓ కుంతీపుత్రా!, యత్ = ఏ కర్మను, కరోషి = ఆచరించుదువో, యత్ = ఏ పదార్థమును, అశ్నాసి = తినెదవో, యత్ = ఏ హవ్యమును, జుహోషి = హోమము చేయుదువో, యత్ = దేనిని, దదాసి = దానము చేయుదువో, యత్ = దేనినిగూర్చి, తపస్యసి = తపమొనరించుదువో, తత్ = ఆ కర్మలనన్నింటినీ, మదర్పణమ్, కురుష్వ = నాకే అర్పింపుము

తా. యజ్ఞ దాన తపో వ్రతములాచరించినను, ఏ కర్మ నాచరించినను, ఏది భుజించినను, ఆత్మయగు నాకర్పింపుము. అప్పుడు కర్తృభావమును, ఫలహేతు భావమును వదలిన వాడగుదువు. అట్లు కానిచో కర్మ, బంధహేతువగును.

శ్లో॥ శుభాశుభ ఫలైరేవం మోక్ష్యసే కర్మబంధనైః
సంన్యాసయోగయుక్తాత్మా విముక్తో మాముపైష్యసి 28

ఏవమ్ = ఈ ప్రకారముగా, సన్న్యాసయోగయుక్తాత్మా = సన్న్యాసయోగముతో యుక్తమైన ఆత్మకలవాడవై అనగా సమస్త కర్మలను భగవంతుడనైన నాకే అర్పించి, శుభాశుభఫలైః = శుభాశుభ ఫలరూపములైన, కర్మబంధనైః = కర్మబంధముల నుండి, మోక్ష్యసే = ముక్తుడవయ్యెదవు విముక్తః = విముక్తుడవైన పిదప, మామ్ (ఏవ) = నన్నే, ఉపైష్యసి = చేరగలవు.

తా. పై శ్లోకమున చెప్పబడినట్లు బ్రహ్మార్పణ భావమున కర్మలనాచరించినచో బన్ధాపాదకములగు శుభాశుభ ఫలములు నిన్నంటవు. అట్లు కర్మపాశ విముక్తుడవగుదువు కాన నిరంతరాయముగా సన్న్యాసయోగముల ద్వారా సమాహిత చిత్తుడవయి నన్నే చేరుదువు.

వి. 'నాయందు' అనగా పరమాత్మయందు మనోబుద్ధులనర్పించుట సన్న్యాసము. అనగా అద్వయభావన కల్గియుండుట. అద్వయ భావనకు హేతువగు ప్రాణమనోజయమును కల్గించునది యోగము. ఈ రెంటిని ముముక్షువు ఆశ్రయించవలెను.

శ్లో॥ సమోఽహం సర్వభూతేషు న మే ద్వేష్యోఽస్తి న ప్రియః
యే భజంతి తు మాం భక్త్యా మయి తే తేషు చాప్యహమ్ 29

అహమ్ = నేను, సర్వభూతేషు = సమస్త ప్రాణులయందును, సమః = సమభావముతో వ్యాపించియుందును, మే = నాకు, ద్వేష్యః = అప్రియమైనవాడును, న, అస్తి = లేదు, ప్రియః =

ప్రియమైనవాడును, న, అస్తి = లేదు, తు = కాని, యే = ఏ భక్తులు, మామ్ = నన్ను, భక్త్యా = భక్తితో, భజంతి = భజింతురో, తే = వారు, మయి = నాయందు (స్థితులైయుందురు) చ = మరియు, అహమ్, అపి = నేనును, తేషు = వారియందు (ప్రత్యక్షముగా ఉందును)

తా. సర్వభూతములయందును నేను సమభావము కలవాడను. ఇందెవరును నాకు శత్రువులు కారు. ఇష్టులు కారు. భక్తిచే నన్నెవరు భజించినను వారికి ఏడుగడనై వారియందు ఎల్లకాలములలో నుందును. వారును నాయందు నిశ్చల మనస్కులై యుందురు.

వి. నా భక్తుడు నాకాత్మ స్వరూపుడు. నేనును వానికాత్మ స్వరూపుడనే. **'యే భజన్తి తు మాం భక్త్యా'** అనుటచే జాతి మతములతోకాని, స్త్రీ పురుషాది భేదభావముతో కాని నిమిత్తము లేదు. భగవంతుని ఎవరైనను భక్తితో భజింపవచ్చునని భావము.

శ్లో॥ అపి చేత్ సుదురాచారో భజతే మామనన్యభాక్
సాధురేవ స మన్తవ్యః సమ్యగ్వ్యవసితో హి సః 30

సుదురాచారః = మిక్కిలి దురాచారుడైన, అపి = వాడును, అనన్యభాక్ = అనన్యభావముతో నా భక్తుడై, మామ్ = నన్ను, భజతే, చేత్ = భజించినట్లయితే, సః = అతడు, సాధుః, ఏవ = సత్పురుషుడుగానే, మంతవ్యః = భావింపదగినవాడు, హి = ఏలనన, సః = అతడు, సమ్యక్ = యథార్థముగా, వ్యవసితః = నిశ్చయబుద్ధిగలవాడు.

తా. అతి దుష్టుడై మెలగుచున్నను, నన్ను ఆత్మభావమున సేవించువాడైనచో సత్పురుషుడనియే పరిగణింపబడును. అట్టివాడు దురాచారము వదలి ఉత్తమ ధర్మాచరణ చేయువాడగును కాన వాస్తవమునకు శుభనిశ్చయము కలవాడేయగును.

వి. ఆత్మతత్త్వ మెరింగినవాడు సదాచారుడు. భేదభావము గలవాడు దురాచారుడు. ఆత్మభక్తునకు ఆత్మస్థితియే కలుగును. ఆత్మ భక్తుడు పునరావృత్తిని పొందక ఆత్మ పదమున నిత్యుడై యుండును. భేదభావము కలవాడు పునరావృత్తిని పొందును. 'క్షీణేపుణ్యే మర్త్యలోకం విశన్తి' అను ప్రమాణమున సంసారియగును.

శ్లో॥ క్షిప్రం భవతి ధర్మాత్మా శశ్వచ్ఛాంతిం నిగచ్ఛతి
కౌన్తేయ ప్రతిజానీహి న మే భక్తః ప్రణశ్యతి 31

కౌంతేయ = ఓ కుంతీసుతా!, (సః) = అతడు, క్షిప్రమ్ = శీఘ్రముగా, ధర్మాత్మా =

ధర్మాత్ముడు, భవతి = అగును, శశ్వత్ = శాశ్వతమైన, శాంతిమ్ = పరమశాంతిని, నిగచ్ఛతి = పొందును, మే, భక్తః = నా భక్తుడు, న, ప్రణశ్యతి = ఎన్నడును నాశమునొందదు అని, ప్రతిజానీహి = నిశ్చయముగా ఎరుంగుము.

తా. దురాచారుడైనను స్వస్వరూపానుసంధానమను ధర్మమాచరించుటచే అచిరకాలములో ధర్మాత్ముడగుచున్నాడు. అందుచేత శాశ్వతమైన శాంతిని పొందుచున్నాడు. పుణ్యాచరణుడు దుర్గతిని పొందడు.

*శ్లో॥ 'నహి కల్యాణకృత్ కశ్చిత్ దుర్గతిం తాత గచ్ఛతి' (6-40)*

అందుచే నా భక్తునకు నాశము కలుగదని గ్రహించుము.

శ్లో॥ మాం హి పార్థ వ్యపాశ్రిత్య యేఽపి స్యుః పాపయోనయః
స్త్రియో వైశ్యాస్తథా శూద్రాః తేఽపి యాంతి పరాం గతిమ్ 32

హి = ఏలనన, పార్థ = ఓ పార్థా!, స్త్రియః = స్త్రీలు, వైశ్యాః = వైశ్యులు, శూద్రాః, తథా = శూద్రులు అట్లే, పాపయోనయః = చండాలాది పాపయోనిజులు, యే, అపి, స్యుః = ఎవ్వరైనను, తే, అపి = వారందరును, మామ్ = నన్ను, వ్యపాశ్రిత్య = శరణుపొంది, పరామ్, గతిమ్ = పరమగతినే, యాంతి = పొందుదురు.

తా. జన్మతః పాపాత్ములైనవారు కూడ నన్ను సేవించిన స్త్రీజాతివారు కాని, వైశ్యులుకాని, శూద్రులు కాని ఉత్తమగతిని పొందుచున్నారు.

వి. భగవానుని ఆశ్రయించిన భక్తులందరును భగవత్పదమందగలరనియు, వారి ఉపాధులు పాపకారణములైనను వానితో నిమిత్తము లేదనియు భగవానునిచే చెప్పబడినది. *'క్షిప్రం భవతి ధర్మాత్మా'* అని చెప్పుటచే ఎట్టి పాపియైనను, అనన్యముగా ఆత్మోపాసన చేయువాడు ధర్మాత్ముడగునని భావము.

శ్లో॥ కిం పునర్బ్రాహ్మణాః పుణ్యా భక్తా రాజర్షయస్తథా
అనిత్యమసుఖం లోకమ్ ఇమం ప్రాప్య భజస్వ మామ్ 33

పుణ్యాః = పుణ్యాత్ములైన, బ్రాహ్మణాః = బ్రాహ్మణులును, తథా = అట్లే, రాజర్షయః = రాజర్షులును అయిన, భక్తాః = భక్తులు (వీరు భగవంతుని శరణు పొందినచో), పరమపదమును పొందుదురను విషయమున, కిం, పునః = చెప్పవలసినది ఏమున్నది?, అసుఖమ్ = సుఖరహితమైన, అనిత్యమ్ = క్షణభంగురమైన (అయినను దుర్లభమైన), ఇమమ్ = ఈ, లోకమ్

= మనుష్య లోకమును (మనుష్య శరీరమును), ప్రాప్య = పొంది (నిరంతరము), మామ్ = నన్ను, భజస్వ = భజింపుము

తా. పుణ్యాచరణులగు బ్రాహ్మణులు, భక్తి సంపద కలిగిన రాజర్షులు, నన్నాశ్రయించి ఉత్తమగతిని పొందుదురని ప్రత్యేకముగా చెప్పనక్కరలేదు. ఈ లోకమనిత్యమైనదనియు, దుఃఖప్రదమనియు గ్రహించి, నిత్యము ఉండువాడను, సుఖమునిచ్చు వాడను, పరమాత్మను అయిన నన్ను చేరి భజింపుము.

శ్లో॥ మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు
మామేవైష్యసి యుక్త్వైవమ్ ఆత్మానం మత్పరాయణః 34

మన్మనాః = నాయందు మనస్సు కలవాడవు, భవ = కమ్ము (అగుము), మద్భక్తః = నా భక్తుడవు, (భవ) = కమ్ము (అగుము), మద్యాజీ = నన్ను పూజించువాడవు, (భవ) = కమ్ము (అగుము), మామ్ = నన్ను (నాకు), నమస్కురు = నమస్కరింపుము, ఏవమ్ = ఈ విధముగా, ఆత్మానమ్ = ఆత్మను, యుక్త్వా = (నాయందే) నిలిపి, మత్పరాయణః = మత్పరాయణుడవై, మామ్, ఏవ = నన్నే, ఏష్యసి = పొందగలవు.

తా. నీవు నాయందే మనస్సునుంచి తత్త్వమును మననము చేయుము. నాయందు భక్తి కలిగి నన్ను పూజించుచుండుము. నాకు నమస్కరించుచుండుము. సర్వాత్మనగు నన్ను ఇట్లన్నికాలములలో సేవించుచు సమాహిత చిత్తుడవగుచో నన్నే పొందుదువు.

వి. స్వస్వరూపానుసంధానము భక్తి యనబడును. కాన ఆత్మావలోకనమే ఆత్మార్చనయని భావము.

ఇట్లు
శ్రీ పరమహంస పరివ్రాజకాచార్యులును,
బ్రహ్మర్షి సద్గురు **శ్రీశ్రీశ్రీ శివానంద భగవత్పూజ్యపాద** శిష్యులును నైన
బ్రహ్మర్షి సద్గురు **శ్రీశ్రీశ్రీ స్వామి రామానంద పరమహంస** వారిచే
రచింపబడిన గీతామృతమను టీక యందు
**రాజవిద్యా రాజగుహ్య యోగ**మను నవమాధ్యాయము సమాప్తము.

ఓం శ్రీకృష్ణ పరమాత్మనే నమః

దశమాధ్యాయము

# విభూతి యోగము

శ్లో॥ భూయ ఏవ మహాబాహో శృణు మే పరమం వచః
యత్తేఽహం ప్రియమాణాయ వక్ష్యామి హితకామ్యయా 1

మహాబాహో = ఓ అర్జునా!, యత్, వచః = ఏ మాట(ల)ను, ప్రియమాణాయ = నాపై ప్రేమాదరములు (భక్తివిశ్వాసములు) గలవాడవైన, తే = నీకు, హితకామ్యయా = హితమును చేయు కోరికతో, భూయః = మరల, అహమ్, వక్ష్యామి = నేను చెప్పబోవుచున్నానో, మే = నా యొక్క, తత్, పరమమ్, వచః, ఏవ = ఆ సర్వశ్రేష్ఠములైన మాటలనే, శృణు = వినుము.

తా. అర్జునా! అమృతపానము చేసినట్లు తృప్తినందుచున్న నీకు హితము కలుగవలెనని కోరికచే మరల మరల ఉత్తమోత్తమమైన ఆత్మతత్త్వమును చెప్పుదును. వినుము.

శ్లో॥ న మే విదుః సురగణాః ప్రభవం న మహర్షయః
అహమాదిర్హి దేవానాం మహర్షీణాం చ సర్వశః 2

మే = నాయొక్క, ప్రభవమ్ = పుట్టుక(ల)ను (లీలావతారము(ల)ను గూర్చి), సురగణాః = దేవతలు, న, విదుః = ఎరుంగరు, మహర్షయః = మహర్షులును, న, విదుః = ఎరుంగరు, హి = ఏలనన, అహమ్ = నేను, సర్వశః = అన్ని విధములుగను, దేవానామ్, చ = దేవతలకును, మహర్షీణామ్, చ = మహర్షులకును, ఆదిః = ఆది (మూల) కారణమైనవాడను.

తా. నేను దేవతలకును, మహర్షులకును, సర్వ విధముల ఆదికారణమైయున్నాను. దేవతలుకాని, మహర్షులుకాని నన్ను, నా ప్రాభవమును తెలియజాలరు.

శ్లో॥ యో మామజం అనాదిం చ వేత్తి లోకమహేశ్వరమ్
అసమ్మూఢః స మర్త్యేషు సర్వపాపైః ప్రముచ్యతే 3

మర్త్యేషు = మానవులలో, యః = ఏ పురుషుడు, మామ్ = నన్ను, అజమ్ = జన్మరహితునిగను, అనాదిమ్ = అనాదియైన వానినిగను, చ = మరియు, లోకమహేశ్వరమ్ = సకలలోక మహేశ్వరునిగను, వేత్తి = ఎరుంగునో, అసమ్మూఢః = జ్ఞానియైన, సః = అతడు, సర్వపాపైః = సర్వ పాపముల నుండియు, ప్రముచ్యతే = విముక్తుడగును.

తా. బ్రహ్మాది దేవతలకును ఆదికారణమైయున్న నేను పుట్టుకలేనివాడను కనుక అజుడని, అనాదియని, లోకములయందలి సకల జీవులకును కలుగు గతులకు ప్రభుత్వము వహించి యున్నానని, మహేశ్వరుడననియు, నన్నెరిగిన నరుడు మోహమెరుగనివాడు. కావున వాడు సర్వపాప విముక్తు డగుచున్నాడు. పరమాత్మనగు నన్ను తెలిసినవాడే జ్ఞాని. నన్నెరుగజాలనివాడు మూఢుడు.

శ్లో॥ బుద్ధిర్ జ్ఞానమసమ్మోహః క్షమా సత్యం దమః శమః
సుఖం దుఃఖం భవో௨ భావో భయం చాభయమేవ చ 4

శ్లో॥ అహింసా సమతా తుష్టిః తపో దానం యశో௨ యశః
భవంతి భావాః భూతానాం మత్త ఏవ పృథగ్విధాః 5

బుద్ధిః = బుద్ధి (నిశ్చయాత్మక శక్తి), జ్ఞానమ్ = యథార్థ జ్ఞానము, అసమ్మోహః = మోహరాహిత్యము, క్షమా = క్షమ, సత్యమ్ = సత్యము, దమః = (బాహ్య) ఇంద్రియ నిగ్రహము, శమః, ఏవ = మనో (అంతరింద్రియ) నిగ్రహము, అట్లే, సుఖమ్, దుఃఖమ్ = సుఖదుఃఖములు, భవః, అభావః = ఉత్పత్తి, ప్రళయములు, భయమ్, అభయమ్ = భయము, అభయము, చ = మరియు, అహింసా = అహింస, సమతా = సమత్వము, తుష్టిః = సంతోషము, తపః = తపస్సు, దానమ్ = దానము, యశః = కీర్తి, అయశః = అపకీర్తి, ఏవమ్ = ఈ మొదలగునవి, భూతానామ్ = ప్రాణులయొక్క, పృథగ్విధాః = వివిధములగు, భావాః = భావములన్నియును, మత్తః, ఏవ = నా నుండియే, భవంతి = కలుగుచున్నవి

తా. బుద్ధి (సూక్ష్మమైన వానిని గూడ గ్రహించు నేర్పు), జ్ఞానము (ఆత్మ మున్నగు వానిని తెలిసికొనుట), అసమ్మోహము (తెలిసికొనదగిన వానియందు వివేకముతో ప్రవర్తించుట), క్షమ (పరాభూతుడైనచో మనస్సున వికారము చెందకుండుట), సత్యము (ఉన్నదానిని యథాతథముగా నొరులకు చెప్పుట), దమము (బాహ్యేంద్రియములను విషయవశము కానీయక నిగ్రహించుట), శమము (అంతఃకరణమున ఏకారణముచేతను కలత జెందక యుండుట), సుఖము, దుఃఖము, భవము(ఉత్పత్తి), అభావము (నాశము), భయము, అభయము, అహింస (ప్రాణులకు హింసను తలపకయుండుట), సమత (సుఖదుఃఖములయందు మనసున ఏ వికారచిహ్నము లేకుండుట), తుష్టి (ఉన్నదానితో తృప్తిచెందుట), తపస్సు, దానము, యశస్సు, అపయశస్సు ఈ మొదలగు నానావిధ భావములు నా వలననే సర్వ ప్రాణులకు కలుగుచున్నవి.

వి. పై జెప్పబడిన భావములన్నియు మాయాకార్యములు. కనుక భావములందు నానాత్వము కలదు. మాయయై యుండియు పరమేశ్వరుని సాన్నిధ్యమున శక్తి కలిగి నానారూపముల దృశ్యమానయై యున్నది.

శ్లో॥ మహర్షయః సప్త పూర్వే చత్వారో మనవస్తథా
మద్భావా మానసా జాతా యేషాం లోక ఇమాః ప్రజాః 6

లోకే = లోకమునందుగల, ఇమాః, ప్రజాః = ఈ ప్రజలు, యేషామ్ = ఎవరి యొక్క సంతానమో, పూర్వే = (అట్టి) ప్రాచీనులైన, సప్త మహర్షయః = సప్త మహర్షులును, తథా = అట్లే వారికంటెను పూర్వులైన, చత్వారః = సనకాది మహామునులు నలుగురును, మనవః = చతుర్దశ మనువులు (మొదలగు వారందరును), మద్భావాః = నాయందు భక్తి భావములుకలిగిన వారై, మానసాః, జాతాః = నా సంకల్పము వలననే జన్మించిరి.

తా. వశిష్ఠ మహర్షి మొదలగు సప్తమహర్షులును వారి పూర్వీకులగు సనక సనందాది బ్రహ్మ మానసపుత్రులును అతీతకాలమందలి పదునలుగురు మనువులును నాచే మనసా సృష్టింపబడి నాయందు భక్తి కలిగియుండిరి. లోకములోని ఈ ప్రజలు ఆ మహర్షులచేతను, మనువుల చేతను సృష్టింపబడిరి.

శ్లో॥ ఏతాం విభూతిం యోగం చ మమ యో వేత్తి తత్త్వతః
సోఽవికంపేన యోగేన యుజ్యతే నాత్ర సంశయః 7

యః = ఏ పురుషుడు, మమ = నాయొక్క, ఏతామ్ = ఈ, విభూతిమ్ = పరమైశ్వర్యరూప విభూతిని, చ = మరియు, యోగమ్ = యోగశక్తిని, తత్త్వతః = యథార్థముగా, వేత్తి = ఎరుంగునో, సః = ఆ పురుషుడు, అవికంపేన = నిశ్చలమైన, యోగేన = భక్తియోగముచే, యుజ్యతే = యుక్తుడగును, అత్ర = ఈ విషయమున, న, సంశయః = సంశయములేదు.

తా. పైన చెప్పబడిన పరమేశ్వర విభూతిని, యోగైశ్వర్యమును యదార్థముగా తెలిసినవాడు నిరంతరము సమ్యగ్దర్శన నిష్ఠను కలిగియుండును. సత్యము.

శ్లో॥ అహం సర్వస్య ప్రభవో మత్తః సర్వం ప్రవర్తతే
ఇతి మత్వా భజంతే మాం బుధా భావసమన్వితాః 8

అహమ్ = నేనే, సర్వస్య = సమస్త జగత్తు యొక్క, ప్రభవః = ఉత్పత్తికి మూల కారణమును, మత్తః = నా వలననే, సర్వమ్ = జగత్తంతయు, ప్రవర్తతే = నడుచుచున్నది, ఇతి, మత్వా =అని తెలుసుకొని, భావ సమన్వితాః = భక్తిశ్రద్ధలు కలిగిన, బుధాః = బుద్ధిమంతులైన భక్తులు మామ్ = నన్నే, భజంతే = నిరంతరము సేవింతురు.

తా. నేను సర్వ జగత్తునకు మూలకారణమును. నా వలన జగత్తు యొక్క సర్వ వ్యవహారము జరుగుచున్నది. నేను పరమేశ్వరుడనగుటచే పండితులు పరతత్వాభినివేశమున నన్నే సేవించుచున్నారు.

శ్లో॥ మచ్చిత్తా మద్గతప్రాణాః బోధయంతః పరస్పరమ్
కథయంతశ్చ మాం నిత్యం తుష్యంతి చ రమంతి చ 9

మచ్చిత్తాః = నిరంతరము నాయందే చిత్తములను నిలిపిన వారును, మద్గతప్రాణాః = తమ జీవితములను నాకే అంకిత మొనర్చిన వారును, అగు భక్తులు, పరస్పరమ్, బోధయంతః = నా మహాత్మ్యమును గూర్చి పరస్పరము తెలుపుకొనుచు, చ = అట్లే, (నా గుణ ప్రభావములను గూర్చి), కథయంతః, చ = కథలు కథలుగా చెప్పుకొనువారై, నిత్యమ్ = సంతతము, తుష్యంతి = సంతుష్టులగుదురు, చ = మరియు, మామ్, రమంతి = నా యందే ఆనందించుచుందురు

తా. యోగనిష్ఠ యందు స్థైర్యము కలవారు నిరంతరము నాయందు చిత్తమును లగ్నము చేతురు. వారి ప్రాణ మనో బుద్ధులను నాకర్పితముచేసి, అన్యోన్యము నన్నుగూర్చి చెప్పుకొనుచును, నొండొరులకు తెలియజేసికొనుచును, నిత్యము సంతుష్టులై ఆత్మారాములై యుందురు.

వి. మనో బుద్ధి ప్రాణములను యోగసంపన్నులే ఈశ్వరార్పితము చేయగలుగుదురు. కావున యోగనిష్ఠ కలిగియున్నచో మచ్చిత్తులని, మద్గత ప్రాణులని చెప్పుటకు వీలగును. కాన యోగనిష్ఠయే ముముక్షువునకు కర్తవ్యమై యున్నది.

శ్లో॥ తేషాం సతతయుక్తానాం భజతాం ప్రీతిపూర్వకమ్
దదామి బుద్ధియోగం తం యేన మాముపయాంతి తే 10

సతత యుక్తానామ్ = నిరంతరము యోగమునందే నిమగ్నులైన వారును, ప్రీతిపూర్వకమ్ భజతామ్ = ప్రీతితో నన్నే భజించువారును అగు, తేషామ్ = అట్టి నాభక్తులకు, యేన = ఏ బుద్ధి యోగము ద్వారా, తే = వారు, మామ్ = నన్ను, ఉపయాంతి = చేరుదురో, తమ్, బుద్ధి యోగమ్ = అట్టి తత్త్వజ్ఞానరూప యోగమును, దదామి = ప్రసాదింతును

తా. యోగ నిష్ఠాపరులై నిర్వ్యాజ్య ప్రేమతో నన్ను భజించువారలకు సమ్యగ్దర్శనోపాయమును తెలియజేయుదును. వారు సతతము నాయందు యుక్తాత్ములై యుందురు. కాన నన్ను తప్పక చేరుదురు.

శ్లో॥ తేషామేవానుకంపార్థమ్ అహమజ్ఞానజం తమః
నాశయామ్యాత్మభావస్థో జ్ఞానదీపేన భాస్వతా 11

తేషామ్ అనుకంపార్థమ్ = వారిని అనుగ్రహించుట కొరకై, ఆత్మ భావస్థః = వారి అంతఃకరణముల యందు స్థితుడనైయున్న, అహమ్, ఏవ = నేనే, అజ్ఞానజమ్, తమః = (వారి) అజ్ఞాన జనితమైన అంధకారమును, భాస్వతా = ప్రకాశించుచున్న, జ్ఞానదీపేన = తత్త్వజ్ఞానరూప దీపము ద్వారా, నాశయామి = నశింపజేయుదును.

తా. సతతము భక్తి భావమున నన్ను భజించువారిపై దయకలవాడను. కావున వారి అజ్ఞానాంధకారమును సమూలముగా నిర్మూలించుటకు వారి హృత్పుండరీకమున సదా స్ఫురించుచు సర్వప్రకాశకమగు జ్ఞానదీప ప్రకాశమును కలుగజేయుదును.

**అర్జున ఉవాచ:**

శ్లో॥ పరం బ్రహ్మ పరంధామ పవిత్రం పరమం భవాన్
పురుషం శాశ్వతం దివ్యమ్ ఆదిదేవమజం విభుమ్ 12

శ్లో॥ ఆహుస్త్వామ్ ఋషయః సర్వే దేవర్షిర్నారదస్తథా
అసితో దేవలో వ్యాసః స్వయం చైవ బ్రవీషి మే 13

భవాన్ = పూజ్యుడవైన నీవు, పరమ్, బ్రహ్మ = పరబ్రహ్మవు, పరమ్, ధామ = పరంధాముడవు, పరమమ్, పవిత్రమ్ = పరమ పవిత్రుడవు, సర్వే, ఋషయః = మహర్షులందరును, త్వామ్ = నిన్నే, శాశ్వతమ్ = సనాతనుడనియు, దివ్యమ్, పురుషమ్ = దివ్య పురుషుడవనియు, ఆదిదేవమ్ = దేవాది దేవుడవనియు, అజమ్ = జన్మ రహితుడవనియు, విభుమ్ = సర్వ వ్యాపివనియు, ఆహుః = తెలిపియున్నారు, తథా = అట్లే, దేవర్షిః, నారదః = దేవర్షియైన నారదుడును, అసితః = అసితుడును, దేవలః = దేవలుడును, వ్యాసః, చ = వ్యాసమహర్షియును (తెలిపిరి), స్వయమ్, ఏవ = నీవే స్వయముగా, మే = నాకు, బ్రవీషి = తెలుపుచున్నావు.

అవ: అర్జునుడు శ్రీకృష్ణపరమాత్మచే చెప్పబడిన యోగ విభూతులను విని, భగవానుని స్తుతించుచున్నాడు.

తా. ఓ కృష్ణా ! నీవు పరమాత్మవు. పరమపదము నీవే. కనుక పవిత్రమైనవాడవు. శాశ్వతుడవై యున్న పరమ పురుషుడవు. దేవతలకాదిభూతుడవు. జన్మమరణ వర్జితుడవు. పరమేశ్వరుడవు. పై రీతిగా సకల మునులు, నారద మహర్షియు, అసిత మహామునియు, దేవల మహామునియు, వ్యాస మహామునియు చెప్పుదురు. ఓ కృష్ణా! స్వయముగా నీవును ఇట్లే చెప్పుచున్నావు.

శ్లో॥ సర్వమేతదృతం మన్యే యన్మాం వదసి కేశవ
న హి తే భగవన్ వ్యక్తిం విదుర్దేవా న దానవాః 14

కేశవ = ఓ కేశవా!, యత్ = దేనిని, మామ్ = నన్ను (నాకు), వదసి = చెప్పుచున్నావో, ఏతత్, సర్వమ్ = ఇదియంతయును, ఋతమ్, మన్యే = సత్యమని తలంతును, భగవన్ = ఓ కృష్ణా!, తే = నీయొక్క, వ్యక్తిమ్ = లీలామయ స్వరూపమును, దానవాః = దానవులు, న, విదుః = ఎరుంగరు, దేవాః, హి = దేవతలును, న, (విదుః) = ఎరుంగరు.

తా. ఓ కృష్ణా! నీవు నాతో చెప్పుచున్న తత్త్వమంతయు యథార్థమైనది. దేవతలు కాని, దానవులు గాని నిన్ను తెలియజాలరు.

శ్లో॥ స్వయమేవాత్మనాత్మానం వేత్థ త్వం పురుషోత్తమ
భూతభావన! భూతేశ! దేవ దేవ! జగత్పతే! 15

భూతభావన = ఓ జగదుత్పత్తి కారకా!, భూతేశ = ఓ సర్వభూతేశా!, దేవదేవ = ఓ దేవాదిదేవా!, జగత్పతే = ఓ జగన్నాథా!, పురుషోత్తమ = ఓ పురుషోత్తమా!, త్వమ్ = నీవు, ఆత్మానమ్ = నిన్ను (స్వస్వరూపమును), స్వయమ్ = స్వయముగా, ఆత్మనా, ఏవ = నీ చేతనే (నీవే), వేత్థ = ఎరుంగుదువు

తా. సర్వభూతములను ఉత్పత్తి చేయు ఓ జగత్ప్రభూ! దేవతలకు దేవుడవైన ఓ కృష్ణా! సర్వ భూతముల శుభాశుభములకు కారకుడవగు ఓ ఈశ్వరా! నీవే నిన్ను తెలిసికొనగలుగుచున్నావు. సర్వభూతాత్మవగుటచే నీవే స్వయముగా అవ్యక్తముగానున్న నిర్గుణ పరబ్రహ్మను తెలిసికొనగలవు. కాని జీవుడు తెలియనేరడు.

శ్లో॥ వక్తుమర్హస్యశేషేణ దివ్యాహ్యాత్మవిభూతయః
యాభిర్విభూతిభిర్లోకాన్ ఇమాంస్త్వం వ్యాప్య తిష్ఠసి 16

యాభిః = ఎట్టి (ఏ), విభూతిభిః = (దివ్య) విభూతుల ద్వారా, ఇమాన్, లోకాన్ = ఈ

సమస్త లోకములను, వ్యాప్య = వ్యాపించి, తిష్ఠసి = స్థితుడవై ఉన్నావో అటువంటి, దివ్యాః = దివ్యములైన, ఆత్మ విభూతయః = నీ విభూతులను గూర్చి, అశేషేణ = సంపూర్ణముగా, వక్తుమ్ = చెప్పుటకు (విశదపరచుటకు), త్వమ్ హి = నీవే, అర్హసి = అర్హుడవు (తగుదువు)

తా. ఓ కృష్ణా! నీ దివ్య విభూతులను చక్కగా చెప్పుటకు నీవే తగుదువు. విశేష మహత్త్వము కల సూర్యాది రూపములచే నానా విధములుగా ఈ లోకములన్నిటిని వ్యాపించి పరిపూర్ణుడవై యున్నావు.

శ్లో॥ కథం విద్యామహం యోగిన్ త్వాం సదా పరిచింతయన్
కేషు కేషు చ భావేషు చిన్త్యోఽసి భగవన్ మయా 17

యోగిన్ = ఓ యోగీశ్వరా!, అహమ్ = నేను, కథమ్ = ఎట్లు, సదా = నిరంతరము, పరిచింతయన్ = బాగుగా చింతన చేయుచు, త్వామ్ = నిన్ను, విద్యామ్ = ఎరుంగుదును, చ = మరియు, భగవన్ = ఓ దేవా!, కేషు కేషు భావేషు = ఏయే భావముల ద్వారా, మయా = నా చేత, చింత్యః, అసి = చింతన చేయదగినవాడవు ?

తా. సత్త్వరజస్తమోగుణాత్మకమై యున్న యోగమాయకధీశ్వరుడవగు ఓ కృష్ణా! సర్వత్ర నిండియున్న చిత్ స్వరూపుడవగు నిన్నెట్లు చింతించుచు తెలిసికొని సర్వకాలములయందు తత్పరుడనగుదునో ఆ విధము చెప్పుము.

శ్లో॥ విస్తరేణాత్మనో యోగం విభూతిం చ జనార్దన
భూయః కథయ తృప్తిర్హి శృణ్వతో నాస్తి మేఽమృతమ్ 18

జనార్దన = ఓ జనార్దనా!, ఆత్మనః = పరమాత్మవైన నీయొక్క, యోగమ్ = యోగశక్తిని గూర్చియు, విభూతిమ్, చ = విభూతుల వైభవములను గూర్చియు, భూయః = ఇంకను, విస్తరేణ = విస్తృతముగా, కథయ = తెలుపుము, హి = ఏలనన, అమృతమ్ = (నీ) అమృతమయ వచనములను, శృణ్వతః = వినుచున్న, మే = నాకు, తృప్తిః = సంతృప్తి (తనివియే), న, అస్తి = లేదు (తీరదు).

తా. సర్వవ్యాపివగుచు పరిపూర్ణుడవై యున్న నీయొక్క మాయాకృత మహాత్త్వమును, నీ విభూతిని విస్తారముగా నామరూపాది భేదములతో చెప్పుము. నీ వాగమృత పానమునందభిరుచి నాకధికమగుచున్నది. అమృతము వంటి నీ వాక్కులు వినుచున్నకొలది నాకు తృప్తి లేకున్నది.

**శ్రీ భగవానువాచ:**

శ్లో॥ హంత తే కథయిష్యామి దివ్యా హ్యాత్మవిభూతయః
ప్రాధాన్యతః కురుశ్రేష్ఠ! నాస్త్యంతో విస్తరస్య మే 19

కురుశ్రేష్ఠ = ఓ అర్జునా!, మే = నాయొక్క, విస్తరస్య = విభూతుల విస్తృతికి, అంతః న అస్తి = అంతము లేదు, హి = అందువలన, విద్యాః = ఆ దివ్యములైన, ఆత్మ విభూతయః = నా విభూతులను, ప్రాధాన్యతః = ముఖ్యమైన కొన్నింటిని మాత్రము, హంత = ఇప్పుడు, తే = నీ కొరకై, కథయిష్యామి = తెలుపుదును.

తా. శ్రీ కృష్ణభగవానుడు పార్థునితో ఇట్లు పలికెను. అర్జునా! మాయాకృతములగు విభూతులు నానావిధములై అనంతములుగా నున్నవి. అందు ముఖ్యముగా కొన్ని దివ్యములగు విభూతులను నీకు చెప్పెదను.

శ్లో॥ అహమాత్మా గుడాకేశ సర్వ భూతాశయస్థితః
అహమాదిశ్చ మధ్యం చ భూతానామంత ఏవ చ 20

గుడాకేశ = ఓ అర్జునా!, సర్వ భూతాశయ స్థితః = సమస్త ప్రాణుల హృదయముల యందున్న, ఆత్మా = ఆత్మను, అహమ్ = నేను, చ = మరియు, భూతానామ్ = సకల భూతము (ప్రాణు) లకు, ఆదిః = ఆదియు, మధ్యమ్ = మధ్యస్థితియు, చ = ఇంకను, అంతః, చ = అంతమునూ (ప్రాణుల సృష్టి స్థితి లయ కారణము), అహమ్, ఏవ (అస్మి) = నేనే

తా. జితేంద్రియుడవైన ఓ అర్జునా! నేను ఆత్మను, అసంగుడను. ప్రత్యగాత్మ రూపమున సర్వప్రాణుల యొక్క బుద్ధిగుహయందుండి ముముక్షువులకుపాస్యుడనై యున్నాను. పరమాత్మనగునేను భూతముల ఉత్పత్తి, స్థితి, లయములకు కారణమైన వాడను.

వి. నేనద్వయుడను. కాని యోగ మహిమచే పెక్కుగానున్న సర్వభూతములయందు ఆత్మ స్వరూపుడనై భాసించుదును.

శ్లో॥ ఆదిత్యానామహం విష్ణుః జ్యోతిషాం రవిరంశుమాన్
మరీచిర్మరుతామస్మి నక్షత్రాణామహం శశీ 21

ఆదిత్యానామ్ = ఆదిత్యులలో, విష్ణుః = విష్ణువును, జ్యోతిషామ్ = జ్యోతిర్మయ స్వరూపులలో, అంశుమాన్ = గొప్ప కిరణములు గల, రవిః = సూర్యుడను, అహమ్, అస్మి = నేనే, మరుతామ్

= (49 మంది) వాయుదేవతలలో, మరీచిః = మరీచిని (తేజమును), నక్షత్రాణామ్ = నక్షత్రములకు అధిపతియైన, శశీ = చంద్రుడను, అహమ్, అస్మి = నేనే

అవ. సర్వభూతముల యందు పరమాత్మయొక్క వైభవము కలదు. కాని కొన్నిటి మహత్త్వము అధికము. అందుచే ప్రధానమైన విభూతి విశేషములను పేర్కొనుచున్నారు.

తా. ఆదిత్యులలో విష్ణువను వాడను నేను. జ్యోతిశ్చక్రమున సహస్ర కిరణుడనై రవిగానున్నాను. మరుత్తులనబడు దేవతలలో మరీచియనువాడను. నక్షత్రములలో చంద్రుడను.

వి. విశేష మహత్వము కల విష్ణువు, అంశుమంతుడు, మరీచి, చంద్రుడు పరమాత్మ భావనచే ఉపాసింపదగిన వారని భావము.

శ్లో॥ వేదానాం సామవేదోఽస్మి దేవానామస్మి వాసవః
ఇన్ద్రియాణాం మనశ్చాస్మి భూతానామస్మి చేతనా 22

వేదానామ్ = వేదములలో, సామవేదః, అస్మి = సామవేదమును నేను, దేవానామ్ = దేవతలలో, వాసవః, అస్మి = ఇంద్రుడను నేను, ఇంద్రియాణామ్ = ఇంద్రియములలో, మనః, అస్మి = మనస్సును నేను, చ = మరియు, భూతానామ్ = ప్రాణులలో, చేతనా, అస్మి = చైతన్యమును నేను

తా. వేదములలో సామవేదము నేను. దేవతలలో ఇంద్రుడను నేను. ఇంద్రియములలో మనస్సును నేను. సకల భూతములలో చైతన్యము నేను.

శ్లో॥ రుద్రాణాం శంకరశ్చాస్మి విత్తేశో యక్షరక్షసామ్
వసూనాం పావకశ్చాస్మి మేరుః శిఖరిణామహమ్ 23

రుద్రాణామ్ = ఏకాదశ రుద్రులలో, శంకరః, అస్మి = నేను శంకరుడను, చ = మరియు, యక్ష, రక్షసామ్ = యక్ష రాక్షసులలో, అహమ్ = నేను, విత్తేశః = ధనాధిపతియైన కుబేరుడను, వసూనామ్ = అష్టవసువులలో, పావకః అస్మి = నేను అగ్నిని, చ = మరియు, శిఖరిణామ్ = శిఖరములుగల పర్వతములలో, మేరుః (అస్మి) = నేను సుమేరు పర్వతమును

తా. రుద్రులలో శంకరుడను. యక్ష రాక్షసులలో కుబేరుడను. వసువులలో అగ్నిహోత్రుడను. అత్యున్నత పర్వతములలో మేరు పర్వతము నేను.

శ్లో॥ పురోధసాం చ ముఖ్యం మాం విద్ధి పార్థ బృహస్పతిమ్
సేనానీనామహం స్కందః సరసామస్మి సాగరః 24

పార్థ = ఓ పార్థా!, పురోధసామ్ = పురోహితులలో, ముఖ్యమ్ = ముఖ్యుడైన, బృహస్పతిమ్ = బృహస్పతినిగా, మామ్ = నన్ను, విద్ధి = తెలిసికొనుము, అహమ్ = నేను, సేనానీనామ్ = సేనాధిపతులలో, స్కందః = కుమారస్వామిని, చ = మరియు, సరసామ్ = జలాశయములలో, సాగరః అస్మి = నేను సముద్రుడను

తా. పురోహితులలో ముఖ్యుడగు బృహస్పతి నేను. సేనా నాయకులలో కుమార స్వామిని నేను. పుణ్యతీర్థములలో సాగరుడను నేను.

శ్లో॥ మహర్షీణాం భృగురహం గిరామస్మ్యేకమక్షరమ్
యజ్ఞానాం జపయజ్ఞోఽస్మి స్థావరాణాం హిమాలయః 25

మహర్షీణామ్ = మహర్షులలో, భృగుః, అహమ్ = భృగువును నేను, గిరామ్ = శబ్దములలో, ఏకమ్, అక్షరమ్, అస్మి = ఏకాక్షరమైన ఓంకారమును నేను, యజ్ఞానామ్ జపయజ్ఞః = యజ్ఞములన్నింటిలోను, జపయజ్ఞమును, స్థావరాణామ్ = స్థావరములలో, హిమాలయః, అస్మి = హిమాలయమును నేనే.

తా. మహర్షులలో నేను భృగువను మహర్షిని. అర్థవంతములైన శబ్దములలో ఏకాకారముగ నుండి అక్షరమైయున్న ప్రణవము నేను. యజ్ఞములలో జప యజ్ఞము నేను. స్థావరములైన వానిలో హిమాలయము నేను.

శ్లో॥ అశ్వత్థః సర్వవృక్షాణాం దేవర్షీణాం చ నారదః
గన్ధర్వాణాం చిత్రరథః సిద్ధానాం కపిలో మునిః 26

సర్వ వృక్షాణామ్ = సమస్త వృక్షములలో, అశ్వత్థః = రావిచెట్టును నేను, దేవర్షీణామ్ = దేవర్షులలో, నారదః = నారదమునిని, గంధర్వాణామ్ = గంధర్వులలో, చిత్రరథః = చిత్రరథుడను, చ = మరియు, సిద్ధానామ్ = సిద్ధులలో, కపిలః, మునిః (అస్మి) = కపిల మునిని నేను

తా. వృక్షములన్నిటయందు అశ్వత్థ వృక్షము నేను. దేవర్షులలో నారద మహర్షిని నేను. గంధర్వులలో చిత్రరధుడను నేను. సిద్ధులలో నేను కపిల మునిని.

శ్లో॥ ఉచ్చైఃశ్రవసమ్ అశ్వానాం విద్ధి మామమృతోద్భవమ్
ఐరావతం గజేంద్రాణాం నరాణాం చ నరాధిపమ్ 27

అశ్వానామ్ = గుఱ్ఱములలో, అమృతోద్భవమ్ = అమృతముతో పాటు ఉత్పన్నమైన, ఉచ్చైఃశ్రవసమ్ = 'ఉచ్చైఃశ్రవ' మును, గజేంద్రాణామ్ = భద్ర గజములలో, ఐరావతం చ = ఐరావతమును, నరాణామ్ = మానవులలో, నరాధిపమ్ = రాజును, మామ్ = నన్నుగా, విద్ధి = తెలిసికొనుము

తా. అశ్వములలో అమృత మథన కాలమున పుట్టిన 'ఉచ్చైఃశ్రవస్సు' అను గుఱ్ఱమును నేను గజేంద్రములలో ఐరావతమను గజము నేను. నరులలో శాసనకర్త యగు రాజును నేను.

శ్లో॥ ఆయుధానామహం వజ్రం ధేనూనామస్మి కామధుక్
ప్రజనశ్చాస్మి కందర్పః సర్పాణామస్మివాసుకిః 28

ఆయుధానామ్ = ఆయుధములలో, వజ్రమ్, అహమ్ = వజ్రాయుధమును నేను, ధేనూనామ్ = పాడియావులలో, కామధుక్, అస్మి = కామధేనువును నేను, ప్రజనః = సంతానోత్పత్తికి కారణమైన, కందర్పః, అస్మి = మన్మథుడను నేను, చ = మరియు, సర్పాణామ్ = సర్పములలో, వాసుకిః అస్మి = వాసుకిని నేను,

తా. ఆయుధములలో వజ్రమను ఆయుధము నేను. పాడియావులలో సర్వకామముల నీయగలిగిన కామధేనువు నేను. సర్పములలో ఉత్తమ సర్పమైన వాసుకి నేను. సర్వభూతముల ఉత్పత్తికి హేతుభూతమైన కామదేవుడను నేను.

శ్లో॥ అనన్తశ్చాస్మి నాగానాం వరుణో యాదసామహమ్
పితౄణామర్యమా చాస్మి యమః సంయమతామహమ్ 29

నాగానామ్ = నాగజాతి వారిలో, అనంతః, అహమ్ = ఆదిశేషుడను నేను, చ = మరియు, యాదసామ్ = జలచరములకు అధిపతియైన, వరుణః, అహమ్, అస్మి = వరుణుడను నేను, చ = మరియు, పితౄణామ్ = పితరులలో, అర్యమా = అర్యముడను, సంయమతామ్ = శాసించువారిలో, (అహమ్) యమః, అస్మి = నేను యముడను.

తా. నాగులయందనంతుడను నేను. జలజంతువులలో జలాధిపతియగు వరుణుడను నేను. పితృదేవతలయందు పితృదేవపతియగు అర్యముడను నేను. సంయమము కలవారిలో యమధర్మరాజు నేను.

శ్లో॥ ప్రహ్లాదశ్చాస్మి దైత్యానాం కాలః కలయతామహమ్
మృగాణాం చ మృగేంద్రోఽహం వైనతేయశ్చ పక్షిణామ్ 30

దైత్యానామ్ = దైత్యులలో, అహమ్, ప్రహ్లాదః = నేను ప్రహ్లాదుడను, చ = మరియు, కలయతామ్ = గణకులలో, కాలః, అస్మి = నేను కాలమును, చ = మరియు, మృగాణామ్ = మృగములలో, మృగేంద్ర = మృగరాజైన సింహమును నేను, చ = మరియు, పక్షిణామ్ = పక్షులలో, అహమ్ = నేను, వైనతేయః (అస్మి) = గరుత్మంతుడను.

తా. దితి వంశజులలో ప్రహ్లాదుడను నేను. గణికులలో నేను కాలరూపుడను. మృగములలో మృగరాజగు సింహము నేను. పక్షులలో వినతాపుత్రుడగు గరుడుడు నేను.

శ్లో॥ పవనః పవతామస్మి రామః శస్త్రభృతామహమ్
ఝషాణాం మకరశ్చాస్మి స్రోతసామస్మి జాహ్నవీ 31

పవతామ్ = పవిత్రమొనర్చు వానిలో, పవనః, అహమ్ = వాయువును నేను, శస్త్రభృతామ్ = శస్త్రధారులలో, రామః, అస్మి = శ్రీరాముడను నేను, ఝషాణామ్ = మత్స్యములలో, మకరః, అస్మి = మొసలిని నేను, చ = మరియు, స్రోతసామ్ = నదులలో, జాహ్నవీ, అస్మి = గంగానదిని నేను.

తా. పవిత్రము చేయు వాటన్నిటియందు వాయువును నేను. శస్త్రధారులలో నేను దశరథ రాముడను. మత్స్యజాతిలో మకరము నేను. ప్రవాహములలో గంగానది నేను.

శ్లో॥ సర్గాణామాదిరన్తశ్చ మధ్యం చైవాహమర్జున
అధ్యాత్మవిద్యా విద్యానాం వాదః ప్రవదతామహమ్ 32

అర్జున = ఓ అర్జునా!, సర్గాణామ్ = సృష్టి పరంపరకు, ఆదిః, మధ్యమ్, అంతశ్చ = ఆదిమధ్యాంతములు, అహమ్, ఏవ = నేనే, విద్యానామ్ = విద్యలలో, అధ్యాత్మ విద్యా = అధ్యాత్మ (బ్రహ్మ) విద్యను నేను, ప్రవదతామ్ = పరస్పర వాద వివాదములలో, వాదః, అహమ్ = తత్త్వ నిర్ణయమునకై చేయు వాదమును నేను.

తా. సృష్టి యందలి సర్వభూతములకు ఉత్పత్తి స్థితిలయములు నేను. అనగా సర్వభూతములు పరమేశ్వరునియందుత్పన్నమగుచు, ఆత్మయందే తమసత్తను కలిగియున్నవై, అంతమున

పరమేశ్వరునియందే లయమగుచున్నవి. విద్యలలో అధ్యాత్మ విద్య నేను. వాదము చేయు వారిలో నున్న వాదన శక్తి నేను.

వి. అధ్యాత్మవిద్య మోక్ష పురుషార్థము నిచ్చునది కాన ఆత్మ విద్యకు ప్రాధాన్యమీయబడినది. వాదము యుక్తిసహమై అర్థ నిర్ణాయకమగును. కాన, వాద, జల్ప, వితండములలో వాదము శ్రేష్ఠమయినది.

శ్లో॥ అక్షరాణామకారోఽస్మి ద్వంద్వః సామాసికస్య చ
అహమేవాక్షయః కాలో ధాతాహం విశ్వతోముఖః 33

అక్షరాణామ్ = అక్షరములలో, అకారః అహమ్ = 'అ'కారమును నేను, చ = మరియు, సామాసికస్య = సమాసములలో, ద్వంద్వః అస్మి = ద్వంద్వ సమాసమును నేను, అక్షయః, కాలః = మహాకాలమును నేను, విశ్వతోముఖః = సర్వతోముఖుడనైన విరాట్ పురుషుడను నేను, ధాతా, అహమ్, ఏవ (అస్మి) = ధరించి, పోషించువాడను నేనే.

తా. అక్షరములలో 'అ' కారము నేను. సమాసములలో ద్వంద్వ సమాసము నేను. క్షణాది భేదముల ప్రసిద్ధమైన అక్షయమగు కాలరూపము నేను. సర్వ జగత్తున సర్వతోముఖముగా నుండి సర్వభూత ములకు కర్మఫల విధాతను నేను.

శ్లో॥ మృత్యుః సర్వహరశ్చాహమ్ ఉద్భవశ్చ భవిష్యతామ్
కీర్తిః శ్రీర్వాక్చ నారీణాం స్మృతిర్మేధా ధృతిః క్షమా 34

సర్వహరః = సర్వ ప్రాణులను హరించునట్టి, మృత్యుః, అహమ్ = మృత్యువును నేను, భవిష్యతామ్ = పుట్టబోవుచున్న సమస్త ప్రాణుల యొక్క, ఉద్భవః = ఉత్పత్తి హేతువును నేను, చ = మరియు, నారీణామ్ = స్త్రీలలో, కీర్తిః = కీర్తిని, శ్రీః = లక్ష్మిని, వాక్ = వాక్కును, స్మృతిః = స్మృతిని, మేధా = మేధను, ధృతిః = ధృతిని, చ = మరియు, క్షమా = క్షమను, అహమ్ అస్మి = నేను

తా. ధనప్రాణాదులను దూరము చేసి ప్రాణిని గొంపోవు మృత్యువు నేను. అభ్యుదయము కలిగించు వానినన్నిటను అభ్యుదయ ప్రాప్తి హేతువగు ఉత్కర్ష (మహత్త్వము) నేను. స్త్రీలలో కీర్తి, శ్రీ, వాక్, స్మృతి, మేధ, ధృతి, క్షమ నేనయియున్నాను.

శ్లో॥ బృహత్సామ తథా సామ్నాం గాయత్రీ ఛందసామహమ్
మాసానాం మార్గశీర్షోఽ హమ్ ఋతూనాం కుసుమాకరః 35

తథా = అట్లే, సామ్నామ్ = గానము చేయుటకు అనువగు శృతులలో, బృహత్సామ = బృహత్సామమును, ఛందసామ్ = ఛందస్సులలో, గాయత్రీ = గాయత్రీ ఛందస్సును, మాసానామ్ = మాసములలో, మార్గశీర్షః = మార్గశీర్షమును, ఋతూనామ్ = ఋతువులలో, కుసుమాకరః = వసంత ఋతువును, అహమ్, (అస్మి) = నేనే

తా. సామవేదములోని మంత్రములలో 'బృహత్సామ' అను భాగము నేను. ఛందో విశేషములచే చెప్పబడిన ఋక్ మంత్రము నేను. మాసములలో మార్గశీర్షమాసము నేను. ఋతువులలో వసంత ఋతువు నేను.

శ్లో॥ ద్యూతం ఛలయతామస్మి తేజస్తేజస్వినామహమ్
జయోఽ స్మి వ్యవసాయోఽ స్మి సత్త్వం సత్త్వవతామహమ్ 36

ఛలయతామ్ = వంచకులలో, అహమ్, ద్యూతమ్ = నేను జూదమును, తేజస్వినామ్ = ప్రభావశాలురలో, తేజః అస్మి = తేజమును నేను, (జేతౄణామ్) = విజేతలలో, జయః అస్మి = జయమును నేను, (వ్యవసాయినామ్) = నిశ్చయాత్మకులలో, అహమ్, వ్యవసాయః = నిశ్చయమును నేను, సత్త్వవతామ్ = సాత్త్విక పురుషులలో, సత్త్వమ్, అసి = సాత్త్విక భావమును నేను.

తా. కపటముతో నుండువారలలో ద్యూతము నేను. తేజో వంతులలో తేజస్సు నేను. జయశీలురలో జయము నేను. పురుష ప్రయత్నము చేయువారిలో నిశ్చయాత్మిక బుద్ధి నేను. సత్త్వ గుణశాలురగు పురుషులలో సత్త్వగుణము నేను.

శ్లో॥ వృష్ణీనాం వాసుదేవోఽ స్మి పాండవానాం ధనంజయః
మునీనామప్యహం వ్యాసః కవీనాముశనా కవిః 37

వృష్ణీనామ్ = వృష్ణి వంశజులలో, వాసుదేవః = వాసుదేవుడను నేను, పాండవానామ్ = పాండవులలో, ధనంజయః = అర్జునుడను నేను, మునీనామ్ = మునులలో, వ్యాసః = వేదవ్యాసుడను నేను, కవీనామ్ = కవులలో, ఉశనా, కవిః, అపి, అహమ్, అస్మి = శుక్రాచార్యుడను గూడ నేనే.

తా. వృష్ణివంశజులలో వాసుదేవుడను నేను. పాండు కుమారులలో ధనంజయుడను నేను. మునులలో వ్యాసమహర్షి నేను. కవులలో ఉశనసుడను (శుక్రాచార్యుడను) కవి నేను.

శ్లో|| దండో దమయతామస్మి నీతిరస్మి జిగీషతామ్
మౌనం చైవాస్మి గుహ్యానాం జ్ఞానం జ్ఞానవతామహమ్ 38

దమయతామ్ = శిక్షించువారిలో, దండః అస్మి = దండించు శక్తిని నేను, జిగీషితామ్ = జయేచ్ఛగలవారియొక్క, నీతిః అస్మి = నీతిని నేను, గుహ్యానామ్ = గోప్య విషయ రక్షణమున, మౌనమ్, అస్మి = మౌనమును నేను, చ = మరియు, జ్ఞానవతామ్ = జ్ఞానలయొక్క, జ్ఞానమ్ = తత్త్వజ్ఞానమును, అహమ్ ఏవ = నేనే.

తా. దమనము చేయు అధికారులలో దండము నేను. విజయాభిలాషులలో నీతి నేను. గోప్యమైన వానిలో మౌనము నేను. జ్ఞానవంతుల జ్ఞానము నేను.

శ్లో|| యచ్చాపి సర్వభూతానాం బీజం తదహమర్జున
న తదస్తి వినా యత్స్యాత్ మయా భూతం చరాచరమ్ 39

చ = మరియు, అర్జున = ఓ అర్జునా!, యత్ = ఏది, సర్వభూతానామ్ = సమస్త, చరాచర ప్రాణుల యొక్క, బీజమ్ = బీజమో, తత్, అపి, అహమ్ = ఆ బీజమును గూడ నేనే.

తా. సర్వ భూతములయుత్పత్తికి మూలకారణము నేను. చరాచర భూతములలో ఏ ఒకటియు నేను లేనిది లేదు. సర్వము నేనే. సర్వాత్మను నేనని భావము.

శ్లో|| నాంతోఽస్తి మమ దివ్యానాం విభూతీనాం పరంతప
ఏష తూద్దేశతః ప్రోక్తో విభూతేర్విస్తరో మయా 40

పరంతప = ఓ అర్జునా!, మమ = నా యొక్క, దివ్యానామ్ = దివ్యములైన, విభూతినామ్ = విభూతులకు, అంతః = అంతమే, న, అస్తి = లేదు, మయా = నా చేత, విభూతేః = విభూతుల యొక్క, ఏషః = ఈ, విస్తరః తు = విస్తృతి ఐతే, ఉద్దేశతః = సంక్షిప్తముగా, ప్రోక్తః = చెప్పబడినది

తా. నా విభూతులు దివ్యములైనవి. అనంతములుగ నున్నవి. ఈ చెప్పబడిన విభూతుల విస్తారము విభూతులలో ఒక భాగము మాత్రమే.

శ్లో॥ యద్యద్విభూతిమత్ సత్త్వం శ్రీమదూర్జితమేవ వా
తత్తదేవావగచ్ఛ త్వం మమ తేజోఽ౽ంశ సంభవమ్ 41

విభూతిమత్ = ఐశ్వర్యయుక్తము, శ్రీమత్ = కాంతియుతము, వా = మరియు, ఊర్జితమ్ = శక్తి యుక్తమగు, యత్ యత్ ఏవ = ఏయే, సత్త్వమ్ = వస్తువులు కలవో, తత్, తత్ = ఆయా వస్తువులు, మమ తేజోఽ౽ంశ సంభవమ్ = నా తేజము యొక్క అంశము నుండియే కలిగినవిగా, త్వమ్ = నీవు, అవగచ్ఛ = గ్రహింపుము.

తా. శ్రీమంతమైనది కాని, శక్తిమంతమయినది కాని జగత్తున నా విభూతినే చాటు ప్రతియొక్క పదార్థము నా తేజస్సులోని ఒక అంశము చేత సంభవించినదిగనే గ్రహించుము.

శ్లో॥ అథవా బహునైతేన కిం జ్ఞాతేన తవార్జున
విష్టభ్యాహమిదం కృత్స్నమ్ ఏకాంశేన స్థితో జగత్ 42

అథవా = (ఒకవేళ), అర్జున = అర్జునా!, ఏతేన = ఈ (ఇట్లు), బహునా, జ్ఞాతేన = ఎక్కువగా తెలిసికొనుట వలన, తవ, కిమ్ = నీకు (కలుగు) ప్రయోజనమేమి?, ఇదమ్, కృత్స్నమ్ = ఈ సమస్త, జగత్ = జగత్తును, అహమ్ = నేను (నా యోగశక్తి యొక్క), ఏకాంశేన = ఒక్క అంశతోడనే, విష్టభ్య = ధరించి, స్థితః = స్థితమైయున్నాను.

తా. ఈ విధముగా బహు విషయములను తెలిసికొనుట వలన ప్రయోజనము శూన్యము. లోకములన్నియు నా యందలి స్వల్పభాగమున మాత్రమే యున్నవి. నేననంతుడను. నా స్వరూపమునకు అంతులేదని భావము.

ఇట్లు
శ్రీ పరమహంస పరివ్రాజకాచార్యులును,
బ్రహ్మర్షి సద్గురు **శ్రీశ్రీశ్రీ శివానంద భగవత్పూజ్యపాద** శిష్యులును నైన
బ్రహ్మర్షి సద్గురు **శ్రీశ్రీశ్రీ స్వామి రామానంద పరమహంస** వారిచే
రచింపబడిన గీతామృతమను టీక యందు
**విభూతి యోగ**మను దశమాధ్యాయము సమాప్తము.

ఓం శ్రీకృష్ణ పరమాత్మనే నమః

ఏకాదశాధ్యాయము

# విశ్వరూప సందర్శన యోగము

**అర్జున ఉవాచ:**

శ్లో॥ మదనుగ్రహాయ పరమం గుహ్యమధ్యాత్మసంజ్ఞితం
యత్త్వయోక్తం వచస్తేన మోహోఽయం విగతో మమ 1

మదనుగ్రహాయ = నన్ను అనుగ్రహించుట కొరకు, పరమమ్ = మిక్కిలి శ్రేష్ఠమైనదియు గుహ్యమ్ = గోప్యమైనదియు, అధ్యాత్మ సంజ్ఞితమ్ = అధ్యాత్మ విషయికమైనదియు అగు యత్, వచః = ఏ వచనము(లు), త్వయా = నీచేత, ఉక్తమ్ = చెప్పబడినదో (వో), తే = ఆ వచనముల చేత, మమ = నా, అయమ్ = ఈ, మోహః = మోహము, విగతః = తొలగినది

తా. అర్జునుడు కృష్ణభగవానునితో నిట్లనెను. ఓకృష్ణా! నన్ను అనుగ్రహించుటకు నీచే చెప్పబడినదియు, అత్యంత రహస్యమైనదియు అయిన అధ్యాత్మ తత్త్వముచే నా యజ్ఞానము తొలగిపోయినది.

శ్లో॥ భవాప్యయౌ హి భూతానాం శ్రుతౌ విస్తరశో మయా
త్వత్తః కమలపత్రాక్ష మాహాత్మ్యమపి చావ్యయమ్ 2

హి = ఏలనన, కమలపత్రాక్ష = కమల పత్రముల వంటి నేత్రములుగల ఓ కృష్ణా! త్వత్తః = నీ వలన, భూతానామ్ = ప్రాణుల యొక్క, భవాప్యయౌ = ఉత్పత్తి ప్రళయములు, విస్తరశః = విశదముగా, మయా = నా చేత, శ్రుతౌ = వినబడినవి, చ = మరియు, అవ్యయమ్ = శాశ్వతమైన మహాత్మ్యమ్, అపి (శ్రుతమ్) = మహాత్మ్యము గూడ వినబడినది

తా. భూతముల యొక్క ఉత్పత్తి నాశములను, విస్తరించి నీవు చెప్పగా వింటిని. ఓ కమలపత్రాక్షా, కృష్ణా! అక్షయమైన నీ మహాత్మ్యమును కూడ నీ వలన వింటిని.

శ్లో॥ ఏవమేతద్యథాత్థ త్వమాత్మానం పరమేశ్వర
ద్రష్టుమిచ్ఛామి తే రూపమైశ్వరం పురుషోత్తమ 3

పరమేశ్వర = ఓ పరమేశ్వరా! (కృష్ణా), త్వమ్ = నీవు, ఆత్మానమ్ = నిన్నుగూర్చి, యథా = ఎట్లు (ఏ విధముగా), ఆత్థ = చెప్పియుంటివో, ఏతత్ = ఇది, ఏవమ్ (ఏవ) = అంతయు సత్యమే పురుషోత్తమ = ఓ పురుషోత్తమా! తే = నీయొక్క, ఐశ్వరమ్, రూపమ్ = షడ్గుణైశ్వర్య సంపన్నమైన

నీ దివ్యరూపమును, ద్రష్టుమ్ = ప్రత్యక్షముగా చూచుటకు,ఇచ్ఛామి = కుతూహలపడుచున్నాను.

తా. ఓ పరమేశ్వరా! ఇది యిట్లని నిష్కర్షగా నీవాత్మ గురించి చెప్పినట్లు దివ్యశక్తి సంపన్నమగు ఈశ్వర సంబంధమైన నీ రూపమును చూడకోరుచున్నాను.

శ్లో॥ మన్యసే యది తచ్ఛక్యం మయా ద్రష్టుమితి ప్రభో
యోగేశ్వర తతో మే త్వం దర్శయాత్మానమవ్యయమ్ 4

ప్రభో = ఓ ప్రభూ!, మయా = నాచేత, తత్ = దానిని (నీ దివ్యరూపమును), ద్రష్టుమ్ = చూచుటకు, శక్యమ్, ఇతి = సాధ్యమేయని, మన్యసే, యది = నీవు భావించుచున్నచో, తతః = అయితే, యోగేశ్వర = ఓ యోగేశ్వరా!, త్వమ్ = నీవు, అవ్యయమ్ = శాశ్వతమైన, ఆత్మానామ్ = నిన్ను (నీ రూపమును), మే = నాకు, దర్శయ = చూపించుము

తా. ఓ యోగేశ్వరా! కృష్ణా! నేను నీ దివ్యరూపమును చూడదగుదునని నీవు తలంచెదవేని యెన్నటికి నాశములేని ఆత్మ స్వరూపమును నాకు చూపుము.

**శ్రీ భగవానువాచ:**

శ్లో॥ పశ్య మే పార్థ రూపాణి శతశోఽథ సహస్రశః
నానావిధాని దివ్యాని నానావర్ణాకృతీని చ 5

పార్థ = ఓ పార్థా!, అథ = ఇప్పుడు, మే = నాయొక్క, శతశః, సహస్రశః = వందలు, వేయి కొలది గల (అసంఖ్యాకములైన), నానావిధాని = నానా విధములైన, చ = మరియు, నానావర్ణాకృతీని = నానా వర్ణము (వన్నె) లతో, ఆకృతులతో ఉన్న, దివ్యాని = అలౌకికములైన, రూపాణి = రూపములను,పశ్య = చూడుము

తా. "ఓ అర్జునా! నానా వర్ణములలో వివిధములైన ఆకారములు గలిగి వందల కొలదిగను, వేలకొలదిగను నున్న నానా విధములైన నా దివ్యరూపములు చూడు" మని శ్రీ కృష్ణ భగవానుడు పలికెను.

శ్లో॥ పశ్యాదిత్యాన్ వసూన్ రుద్రానశ్వినౌ మరుతస్తథా
బహూన్యదృష్టపూర్వాణి పశ్యాశ్చర్యాణి భారత 6

భారత = ఓ అర్జునా!, ఆదిత్యాన్ = అదితియొక్క ద్వాదశ పుత్రులను, వసూన్ = అష్ట వసువులను, రుద్రాన్ = ఏకాదశ రుద్రులను, అశ్వినౌ = అశ్వినీ కుమారులను, మరుతః = 49

మంది మరుత్తులను, పశ్య = చూడుము, తథా = అట్లే, బహూని = అనేకములైన, అదృష్ట పూర్వాణి = మునుపు (లోగడ) ఎన్నడును చూడనట్టి, ఆశ్చర్యాణి = ఆశ్చర్యకర రూపములను పశ్య = చూడుము.

తా. భరత కులోద్భవా ! అర్జునా ! ద్వాదశాదిత్యులను, అష్ట వసువులను, ఏకాదశ రుద్రులను, అశ్వినీ దేవతలను, మరుద్గణములనే కాక, యింకను మున్నెన్నడు చూచి యెరుగని ఆశ్చర్యకరములగు పెక్కు భూతములను చూడుము.

శ్లో॥ ఇహైకస్థం జగత్ కృత్స్నం పశ్యాద్య సచరాచరమ్
మమ దేహే గుడాకేశ యచ్చాన్యద్ద్రష్టు మిచ్ఛసి 7

గుడాకేశ = ఓ అర్జునా!, అద్య = నేడు (ఇప్పుడు), ఇహ, మమ దేహే = ఈ నా దేహమునందు ఏకస్థమ్ = ఒకేచోట స్థితమైయున్న, సచరాచరమ్ = చరాచరములతో గూడియున్న, కృత్స్నమ్, జగత్ = సంపూర్ణ జగత్తును, పశ్య = చూడుము, చ = ఇంకను, అన్యత్ = ఇతరమైన, యత్ = దేనిని, ద్రష్టుమ్ = చూచుటకు, ఇచ్ఛసి = కోరుకొనుచున్నావో వాటినన్నింటినీ చూడుము

తా. ఓ అర్జునా ! నా స్వరూపము నొక భాగమున మాత్రమే యున్న ఈ సమస్త చరాచర రూపజగత్తునే కాక, నా దేహమున నీవు చూడదలచిన యితరములైన వానిని గూడ చూడుము.

శ్లో॥ న తు మాం శక్యసే ద్రష్టుమనేనైవ స్వచక్షుషా
దివ్యం దదామి తే చక్షుః పశ్యమే యోగమైశ్వరం 8

తు = కాని, మామ్ = నన్ను (ఈ నా రూపమును), అనేన = ఈ, స్వచక్షుషా = (ప్రాకృతములైన) చర్మచక్షువులతో, ద్రష్టుమ్ = చూచుటకు, ఏవ = నిస్సందేహముగా, న, శక్యసే = సమర్థుడవు కావు (అశక్తుడవు), (అతః) = ఇందువలన, తే = నీకు, దివ్యమ్ = దివ్యమైన, చక్షుః = దృష్టిని, దదామి = ఇచ్చెదను, మే, ఐశ్వరమ్, యోగమ్ = నా దివ్య యోగశక్తిని, పశ్య = చూడుము

తా. కాని నీవీ సామాన్య నేత్రములతో నన్ను చూడజాలవు. కావున నీకు దివ్యనేత్రము నిచ్చుచున్నాను. నీవా దివ్యనేత్రము ద్వారా ఈశ్వర సంబంధమైన యోగమాయా ప్రాభవమును చూడుము.

**సంజయ ఉవాచ:**

శ్లో॥ ఏవముక్త్వా తతో రాజన్ మహాయోగేశ్వరో హరిః
దర్శయామాస పార్థాయ పరమం రూపమైశ్వరమ్ 9

రాజన్ = ఓ రాజా!, మహాయోగేశ్వరః = మహా యోగేశ్వరుడును, హరిః = పాపములను హరించువాడును అగు భగవానుడు, ఏవమ్ = ఈ విధముగా, ఉక్త్వా = పలికి, తతః = అనంతరము, పార్థాయ = అర్జునునకు, ఐశ్వరమ్ = షడ్గుణైశ్వర్య సంపన్నమైన, పరమమ్, రూపమ్ = (తన) పరమ దివ్యరూపమును, దర్శయామాస = చూపెను

తా. సంజయుడు ధృతరాష్ట్రునితో నిట్లనెను. ఓ రాజా! నిరతిశయమగు యోగశక్తి సంపన్నుడగు విష్ణు స్వరూపుడైన కృష్ణుడు పార్థునకు పరమేశ్వర సంబంధమగు తన దివ్యరూపమును చూపెను.

శ్లో॥ అనేకవక్త్రనయనం అనేకాద్భుత దర్శనమ్
అనేకదివ్యాభరణం దివ్యానేకోద్యతాయుధమ్ 10

శ్లో॥ దివ్యమాల్యాంబరధరం దివ్యగంధానులేపనమ్
సర్వాశ్చర్యమయం దేవమ్ అనంతం విశ్వతోముఖమ్ 11

అనేకవక్త్రనయనమ్ = అనేకములైన ముఖములతో నేత్రములతో ఒప్పుచున్నదియు, అనేకాద్భుత దర్శనమ్ = పెక్కు అద్భుత దృశ్యములను కలిగియున్నదియు, అనేక దివ్యాభరణమ్ =అనేకములగు దివ్యాభరణములను ధరించియున్నదియు, దివ్యానేకోద్యతాయుధమ్ = అనేకములైన దివ్యాయుధములను చేపట్టియున్నదియు, దివ్యమాల్యాంబరధరమ్ = దివ్యములైన మాలలను వస్త్రములను ధరించియున్నదియు,దివ్యగంధానులేపనమ్ = దివ్యములైన చందన పరిమళములను దశదిశల గుబాళింప జేయుచున్నదియు,సర్వాశ్చర్యమయమ్ = సర్వాశ్చర్యకరమైనదియు, అనంతమ్ = అనంతమైనదియు,విశ్వతోముఖమ్ = సర్వత్ర ముఖశోభలను విరజిమ్ముచున్నదియు అగు,దేవమ్ = ఆ దేవదేవుని విరాట్ రూపమును (అర్జునుడు దర్శించెను)

తా. అర్జునునకు చూపబడిన యీ దివ్యరూపమనేక ముఖములు, అనేక నేత్రములు కలిగి ఆశ్చర్య జనకములైన అనేక దృశ్యములతో అద్భుతముగానుండెను. ఆ దివ్యరూపమనేక దివ్యాభరణములు, అనేక దివ్యాయుధములు కలిగి యొప్పుచున్నది. ఇంకను నాయాత్మ స్వరూపము దివ్యములైన పుష్పమాలలు, వస్త్రములు ధరించి దివ్యగంధముల పూతలచే అందరకు ఆశ్చర్యము కలిగించుచు సర్వత్ర వ్యాప్తమై యంతము కానరాక వెలుగుచున్నది.

శ్లో॥ దివి సూర్యసహస్రస్య భవేద్యుగపదుత్థితా
యది భాః సదృశీ సా స్యాత్ భాసస్తస్య మహాత్మనః 12

దివి = ఆకాశమునందు, సూర్య సహస్రస్య = వేలకొలది సూర్యులయొక్క, భాః = కాంతి పుంజము (కాంతులు), యుగపత్ = ఒక్కుమ్మడిగా, ఉత్థితా, భవేత్ = ఉదయించినచో (వెల్లివిరిసినచో), సా = ఆ కాంతిపుంజము, తస్య = ఆ , మహాత్మనః = విరాట్ పురుషుని యొక్క, భాసః = కాంతులకు, సదృశీ = సమానమైనది, యది = బహుశా, స్యాత్ = అగునేమో ? (అయినను సమానము కాదని భావము)

తా. విశ్వాత్మకుడైన పరమాత్మ జ్యోతిరూపమున వెలుగుచున్నాడు. ఆ ప్రకాశము దుర్నిరీక్ష్యమై, అంతరిక్షమున నొక్కమారుగ వేలకొలది సూర్యులుదయించెనేని ఎట్టి కాంతి కలుగునో అట్టి కాంతికి సమానమగును. ఆత్మ ప్రకాశము ఉపమాన రహితమని తెలియనగును. అనగా అద్వయమని భావము.

శ్లో॥ తత్రైకస్థం జగత్ కృత్స్నం ప్రవిభక్తమనేకధా
అపశ్యద్దేవదేవస్య శరీరే పాండవస్తదా 13

తదా = అప్పుడు, అనేకధా = పెక్కు విధములుగా, ప్రవిభక్తమ్ = వేర్వేరుగా వివిధ, బ్రహ్మాండములుగా విభక్తమైయున్న, కృత్స్నమ్ = సమస్త జగత్తును, దేవదేవస్య = దేవదేవుడైన విరాట్ పురుషునియొక్క, తత్ర, శరీరే = ఆ శరీరమునందు, ఏకస్థమ్ = కేంద్రీకృతమై యున్నట్లు, పాండవః = అర్జునుడు, అపశ్యత్ = చూచెను

తా. విశ్వరూపుడైన పరమాత్మ రూపము విశ్వముకంటె నధికమై అనంతముగా నున్నది. అనంతముగానున్న ఆత్మరూపమున, సకల చరాచర జగత్తు స్వల్ప భాగమునందే యనేక విధములుగా వేరుగా నున్నట్లు అర్జునుడు చూచెను.

శ్లో॥ తతః స విస్మయావిష్టో హృష్టరోమా ధనంజయః
ప్రణమ్య శిరసా దేవం కృతాంజలిరభాషత 14

తతః = ఆ పిమ్మట, సః, ధనంజయః = ఆ అర్జునుడు, విస్మయావిష్టః = ఆశ్చర్యచకితుడై, హృష్టరోమా = పులకిత గాత్రుడై, దేవమ్ = ఆ విరాట్ పురుషునకు, శిరసా, ప్రణమ్య = సాష్టాంగముగా నమస్కరించి, కృతాంజలిః = అంజలి ఘటించినవాడై, అభాషత = భాషించెను

తా. పరమాత్మ యొక్క విశ్వరూపమును సందర్శించి విస్మయ సంతోషములు పెనకొనగా శిరస్సువంచి నమస్కరించి దోసిలియొగ్గి కృష్ణునితో నిట్లనెను.

**అర్జున ఉవాచ:**

శ్లో॥ పశ్యామి దేవాంస్తవ దేవ దేహే సర్వాంస్తథా భూతవిశేషసంఘాన్
బ్రహ్మాణమీశం కమలాసనస్థం ఋషీంశ్చ సర్వానురగాంశ్చ దివ్యాన్ 15

దేవ = ఓ పరమేశ్వరా!, తవ దేహే = నీ దేహ (విరాట్ స్వరూప) మునందు, సర్వాన్, దేవాన్ = సకల దేవతలును, తథా = అట్లే, భూత విశేష సంఘాన్ = వివిధ ప్రాణి సముదాయములను, కమలాసనస్థమ్ = కమలమునందు ఆశీనుడైయున్న, బ్రహ్మాణమ్ = బ్రహ్మను, ఈశమ్ = శంకరుని, చ = మరియు, సర్వాన్, ఋషీన్ = సమస్త ఋషులను, చ = మరియు, దివ్యాన్ = దివ్యములైన, ఉరగాన్ = సర్పములను, పశ్యామి = చూచుచున్నాను.

తా. అర్జునుడు కృష్ణునితో నిట్లనెను. ప్రభో! నీ శరీరమున (విరాట్ స్వరూపము) సమస్త దేవతలను, నానా విధములైన స్థావర జంగమ భూతములను చూచుచున్నాను. ప్రజలు యొక్క శుభాశుభ గతులకు కారణ భూతుడయి పృథివీరూప కమలమును ఆసనముగా కలిగిన చతుర్ముఖ బ్రహ్మను, వశిష్ఠాది బ్రహ్మర్షులను, దివ్యములైన వాసుకి మున్నగు సర్పములను చూచుచున్నాను.

శ్లో॥ అనేక బాహూదరవక్త్రనేత్రం
పశ్యామి త్వాం సర్వతోఽనంతరూపమ్
నాంతం న మధ్యం న పునస్తవాదిం
పశ్యామి విశ్వేశ్వర విశ్వరూప 16

విశ్వేశ్వర = ఓ జగన్నాథా, అనేక బాహూదర వక్త్రనేత్రమ్ = అనేకములైన బాహువులును, ఉదరములును, ముఖములును, నేత్రములును గలవాడవును, సర్వతః = అంతటను, అనంతరూపమ్ = అనంతములైన రూపములుగలవాడవును అయిన, త్వామ్ = నిన్ను, పశ్యామి = చూచుచున్నాను, విశ్వరూప = ఓ విరాట్ రూపా!, తవ = నీ యొక్క, ఆదిమ్ = ఆదిని, న పశ్యామి = చూడ (తెలిసికొన) లేకున్నాను, మధ్యమ్ = మధ్యమును, న = చూడకున్నాను, పునః = మరియు, అంతమ్ = అంతమును, న = చూడకున్నాను

తా. విశ్వాకారుడవై విశ్వమంతకును ప్రభువైయున్న ఓ కృష్ణా! అనేకమైన బాహువులతోను, ఉదరములతోను, వదనములతోను నేత్రములతోను ఒప్పియున్న నిన్ను అన్ని వైపుల అనంతముగా వ్యాపించియున్న రూపము కలవానిగా చూచుచున్నాను. నీవప్రమేయుడవు. అనంతుడవు. కాన నీ స్వరూపమునకు ఆది మధ్యాంతములు లేవు.

శ్లో॥ కిరీటినం గదినం చక్రిణం చ
తేజోరాశిం సర్వతో దీప్తిమంతమ్
పశ్యామి త్వాం దుర్నిరీక్ష్యం సమంతాత్
దీప్తానలార్క ద్యుతిమప్రమేయమ్ 17

కిరీటినమ్ = కిరీటమును ధరించినవాడవు,గదినమ్ = గదను చేపట్టిన వాడవును, చ = మరియు,చక్రిణమ్ = చక్రమును చేబూనిన వాడవును అయి, సర్వతః = అన్ని దిశలయందును,తేజోరాశిమ్ = తేజోరాశియు, దీప్తిమంతమ్ = ప్రకాశించుచున్న వాడవు,దీప్తానలార్కద్యుతిమ్ = ప్రజ్వలితాగ్ని వలెను, జ్యోతిర్మయుడైన,సూర్యుని వలెను వెలుగొందుచు,దుర్నిరీక్ష్యమ్ = చూచుటకు శక్యముగాని వాడవును,సమంతాత్ = అంతటను, అప్రమేయమ్ = అప్రమేయ స్వరూపుడవును అయి ఉన్న, త్వామ్ = నిన్ను,పశ్యామి = చూచుచున్నాను

తా. కిరీటధారివై గదా చక్రముల ధరించి దిశలన్నిటిని కాంతిమంతములుగా జేయు తేజోరాశివి. అంతట వ్యాపించి అప్రమేయుడవై చూడ శక్యముగానివాడవు. ప్రకాశమానుడై యున్న సూర్యునివలె చూడనలవికాక యున్నావు. వెలుగుచున్న అగ్నివలెనున్న నిన్ను చూచుచున్నాను.

శ్లో॥ త్వమక్షరం పరమం వేదితవ్యం
త్వమస్య విశ్వస్య పరం నిధానమ్
త్వమవ్యయః శాశ్వతధర్మగోప్తా
సనాతనస్త్వం పురుషో మతో మే 18

త్వమ్ = నీవు, వేదితవ్యమ్ = తెలిసికొనదగిన, పరమమ్, అక్షరమ్ = పరమ అక్షరుడవు (పరబ్రహ్మ పరమాత్మవు), త్వమ్ = నీవే, అస్య, విశ్వస్య = ఈ విశ్వమునకు, పరమ్, నిధానమ్ = పరమాశ్రయుడవు, త్వమ్, (ఏవ) = నీవే, శాశ్వతధర్మగోప్తా = సనాతన ధర్మమును పరిరక్షించువాడవు, త్వమ్ (ఏవ) = నీవే, అవ్యయః = నాశరహితుడవు, సనాతనః, పురుషః = సనాతన పురుషుడవు అని, మే, మతః = నా నిశ్చయము

తా. ముముక్షువులైన వారలకు తెలియదగినవాడవు నీవే. సమస్త జగత్తుకు మూలమైన నిరతిశయ పరబ్రహ్మవు నీవే. అవ్యయుడవై శాశ్వత ధర్మమును రక్షించుచు, సనాతనుడవనియు, పరమ పురుషుడవనియు కీర్తింపబడువాడవు నీవే.

శ్లో॥ అనాదిమధ్యాంతమనంతవీర్యం
అనంతబాహుం శశిసూర్యనేత్రమ్
పశ్యామి త్వాం దీప్తహుతాశవక్త్రం
స్వతేజసా విశ్వమిదం తపంతమ్ 19

అనాదిమధ్యాంతం = ఆది మధ్యాంత రహితుడవును, అనంతవీర్యమ్ = అనంతమైన సామర్థ్యము గలవాడవును, అనంత బాహుమ్ = అపరిమితమైన బాహువులు గలవాడవును, శశి సూర్యనేత్రమ్ = సూర్య చంద్రులను నేత్రములుగా గలవాడవును, దీప్తహుతాశ వక్త్రమ్ = ప్రజ్వలితాగ్ని వలె ప్రకాశించుచున్న ముఖముగలవాడవును, స్వతేజసా = నీ తేజస్సుతో, ఇదమ్ = ఈ, విశ్వమ్ = విశ్వమును, తపంతమ్ = తపింపజేయుచున్నవాడవును అగు, త్వామ్ = నిన్ను, పశ్యామి = చూచుచున్నాను.

తా. ఓ కృష్ణా! నీవాదిమధ్యాంత రహితుడవు. నీ శక్తి సామర్థ్యములనంతములు. లెక్క పెట్టుటకు మితిమీరియున్న బాహువులతో చంద్రసూర్యులే నేత్రములుగా గలిగియున్నావు. నీవు ప్రజ్వలించుచున్న అగ్నిహోత్రుడు ముఖముగా గలవాడవై యున్నావు. తేజః ప్రతాపమున ఈ జగత్తుకు తాపము గలుగ జేయుచున్న నిన్ను నేను చూచుచున్నాను.

శ్లో॥ ద్యావాపృథివ్యోరిదమంతరం హి
వ్యాప్తం త్వయైకేన దిశశ్చ సర్వాః
దృష్ట్వాద్భుతం రూపముగ్రం తవేదం
లోకత్రయం ప్రవ్యథితం మహాత్మన్ 20

మహాత్మన్ = ఓ మహాత్మా!, ఇదమ్ = ఈ , ద్యావాపృథివ్యోః= దివి నుండి భువి వరకు గల, అంతరమ్ = ఆకాశము, చ = మరియు, సర్వాః, దిశః = అన్ని దిశలును, ఏకేన, త్వయా, హి = నీ ఒక్కని చేతనే, వ్యాప్తమ్ = వ్యాప్తములైనట్టి, తవ = నీ యొక్క, ఇదమ్ = ఈ, అద్భుతమ్ = అద్భుతమైన, ఉగ్రమ్ = భయంకరమైన, రూపమ్ = రూపమును, దృష్ట్వా = చూచి, లోకత్రయమ్ = ముల్లోకములును, ప్రవ్యథితమ్ = వ్యథితములైనవి (భయకంపితములైనవి)

తా. ఓ మహాత్మా! కృష్ణా! సమస్త దిశలును, అంతరిక్షమునకు భూతలమునకు మధ్యనున్న భాగమంతయు నీవొక్కనిచేతనే వ్యాపించియున్నది. భయంకరమును, అద్భుతమునునైన నీ రూపము చూచి ముల్లోకములు కంపించుచున్నవి.

శ్లో॥ అమీ హి త్వాం సురసంఘా విశంతి
కేచిద్భీతాః ప్రాంజలయో గృణంతి
స్వస్తీత్యుక్త్వా మహర్షిసిద్ధసంఘాః
స్తువంతి త్వాం స్తుతిభిః పుష్కలాభిః 21

అమీ = ఇదిగో, ఆ, సురసంఘాః, హి = దేవతలందరును, త్వామ్ = నీలో, విశంతి = ప్రవేశించుచున్నారు, కేచిత్ = కొందరు, భీతాః = భీతులై, ప్రాంజలయః = అంజలి ఘటించిన వారై, గృణంతి = (నీ నామ గుణములను) కీర్తించుచున్నారు, మహర్షిసిద్ధసంఘాః = మహర్షులు, సిద్ధుల సమూహములు, స్వస్తి, ఇతి = స్వస్తి వచనములను (జయమగుగాక – అని), ఉక్త్వా = పలికి, పుష్కలాభిః = పుష్కలములైన, స్తుతిభిః = ఉత్తమోత్తమ స్తోత్రములతో, త్వామ్ = నిన్ను, స్తువంతి = స్తుతించుచున్నారు.

తా. భూభారమును తీసివేయుటకు మనుష్య రూపమున అవతరించి యుద్ధము చేయుచున్న మనుష్యులవలె ఆకారములుకల ఈ దేవతా సంఘములు నిన్ను శరణు పొందుచున్నవి. అందు కొందరు భయభ్రాంతులై ప్రాంజలులగుచు నిన్ను వేడుకొనుచున్నారు. మహర్షులు, సిద్ధులు జగత్తుకు శ్రేయస్సు కలుగవలెనని పలికి పరిపూర్ణములైన స్తోత్రములచే నిన్ను స్తుతి చేయుచున్నారు.

శ్లో॥ రుద్రాదిత్యా వసవో యే చ సాధ్యా
విశ్వేఽ శ్వినౌ మరుతశ్చోష్మపాశ్చ
గంధర్వ యక్షాసుర సిద్ధసంఘాః
వీక్షంతే త్వాం విస్మితాశ్చైవ సర్వే 22

రుద్రాదిత్యాః చ = ఏకాదశ రుద్రులును, ద్వాదశాదిత్యులును, వసవః = అష్ట వసువులును, సాధ్యాః = సాధ్యులును, విశ్వే = విశ్వేదేవతలును, అశ్వినౌ, చ = అశ్వినీ కుమారులును, మరుతః, చ = మరుద్గణములును, ఊష్మపాః, చ = పితరులును, గంధర్వ యక్షాసుర సిద్ధసంఘాః = గంధర్వులును, యక్షులును, అసురులును, సిద్ధులును, యే = ఎవరెవరు గలరో, (తే) సర్వే = (వారు) అందరును, విస్మితాః = సంభ్రమాశ్చర్యములకు లోనైనవారై, త్వామ్, ఏవ = నిన్నే, వీక్షంతే = చూచుచున్నారు

తా. ఏకాదశ రుద్రులు, ద్వాదశాదిత్యులు, అష్టవసువులు, సాధ్యులు, విశ్వే దేవతలు, అశ్వినీ

దేవతలు, మరుద్గణములు, పితృదేవతలు, గన్ధర్వులు, యక్షరాక్షసులు, సిద్ధసమూహములు, నిన్ను సాశ్చర్యముగా చూచుచున్నారు.

శ్లో॥ రూపం మహత్తే బహువక్త్రనేత్రం
మహాబాహో బహుబాహూరుపాదమ్
బహూదరం బహుదంష్ట్రాకరాళం
దృష్ట్వా లోకాః ప్రవ్యథితాస్తథాహమ్ 23

మహాబాహో = ఓ మహాబాహూ (ఓ కృష్ణా !), బహువక్త్ర నేత్రమ్ = అనేకములైన వక్త్రములును, నేత్రములును గలదియు, బహుబాహూరు పాదమ్ = అసంఖ్యాకములైన బాహువులు, తొడలు, పాదములు గలదియు, బహూదరమ్ = పెక్కు ఉదరములు గలదియు, బహుదంష్ట్రా కరాళమ్ = పెక్కు కోరలచే భయంకరమైనదియు అగు, తే, మహత్, రూపమ్ = నీ మహారూపమును, దృష్ట్వా = చూచి, లోకాః = లోకములన్నియును, ప్రవ్యథితా = భయకంపితములు అగుచున్నవి, తథా = అట్లే, అహమ్, అపి = నేనును వణికిపోవుచున్నాను

తా. మహా బాహువైన ఓ కృష్ణా! ఈ నీ రూపము విశేషమైనది. అనేక ముఖములు నేత్రములు కలది. పెక్కు చేతులు, పెక్కు గర్భములు, పాదములు కలిగియున్నది. పెక్కు కోరలు కల్గి భయంకరమైనది. ఇట్టి రూపమును చూచి నేను వ్యథ చెందుతున్నాను. అట్లే లోకములును భీతిచెంది వ్యథ పొందుచున్నవి.

శ్లో॥ నభఃస్పృశం దీప్తమనేకవర్ణం
వ్యాత్తాననం దీప్తవిశాలనేత్రమ్
దృష్ట్వా హి త్వాం ప్రవ్యథితాంతరాత్మా
ధృతిం న విందామి శమం చ విష్ణో 24

హి = ఏలనన, విష్ణో = ఓ మహావిష్ణూ!, నభఃస్పృశమ్ = ఆకాశమును స్పృశించుచున్న, దీప్తమ్ = మిక్కిలి ప్రకాశించుచున్న, అనేకవర్ణమ్ = రంగురంగుల వన్నెలను కలిగియున్న, వ్యాత్తాననమ్ = విస్తరించిన ముఖములతో ఒప్పుచున్న, దీప్తవిశాల నేత్రమ్ = కాంతులను విరజిమ్ము విశాల నేత్రములు గల, త్వామ్ = నిన్ను (నీ రూపమును), దృష్ట్వా = చూచి, ప్రవ్యథితాంతరాత్మా (అహమ్) = మిక్కిలి తత్తర పడుచున్న నేను, ధృతిమ్, చ = ధైర్యమును, శమమ్, చ = శాంతిని, న, విందామి = పొందలేకున్నాను

తా. విష్ణుమూర్తివై యున్న ఓ కృష్ణా! నీ రూపమాకాశమంటుచు దీప్తిమంతములైన అనేక వర్ణములు కలిగి, కాంతిమంతములై పెద్ద కన్నులతోను, తెరువబడియున్న ముఖములతోను భయంకరమైయున్న నిన్ను చూచి నా యంతరాత్మ క్షుభితమగుచున్నది. ధైర్యమును వహింపజాలకున్నాను.

శ్లో॥ దంష్ట్రాకరాళాని చ తే ముఖాని
దృష్ట్వైవ కాలానలసన్నిభాని
దిశో న జానే న లభే చ శర్మ
ప్రసీద దేవేశ జగన్నివాస 25

జగన్నివాస = ఓ జగన్నివాసా! దంష్ట్రా కరాళాని = భయంకరములైన కోరలుగలవియు, చ = మరియు, కాలానల సన్నిభాని = ప్రళయాగ్ని జ్వాలలవలె భీతి గొల్పునవియు అగు, తే, ముఖాని = నీ ముఖములను, దృష్ట్వా = చూచి, దిశః, న జానే = దిక్కులను తెలిసికొనలేకున్నాను, చ = మరియు, శర్మ, ఏవన, లభే = నెమ్మదిని (శాంతిని) పొందలేకున్నాను, దేవేశ = ఓ దేవాధిదేవా! ప్రసీద = అనుగ్రహింపుము.

తా. భయంకరములైన కోరలు కలిగి కాలాగ్నివలె లోకములను నాశనము చేయబూనిన నీ ముఖములను జూచినంతనే దిక్కుల తెలియనివాడనయి శాంతిని పొందలేకున్నాను. జగత్తుకు ఆధారభూతుడవు. ఓ కృష్ణ నీవే దేవతలను కూడ శాసించువాడవు. ప్రసన్నుడవగుము.

శ్లో॥ అమీ చ త్వాం ధృతరాష్ట్రస్య పుత్రాః
సర్వే స హైవావనిపాలసంఘైః
భీష్మోద్రోణః సూతపుత్రస్తథాసౌ
సహాస్మదీయైరపి యోధముఖ్యైః 26

శ్లో॥ వక్త్రాణి తే త్వరమాణా విశంతి
దంష్ట్రాకరాళాని భయానకాని
కేచిద్విలగ్నా దశనాంతరేషు
సందృశ్యంతే చూర్ణితైరుత్తమాంగైః 27

అమీ = ఇదిగో, ధృతరాష్ట్రస్య పుత్రాః = ధృతరాష్ట్రుని కుమారులు, సర్వే, ఏవ = అందరును, అవనిపాల సంఘైః, సహ = రాజసముదాయములతో గూడినవారై, త్వామ్ = నీలో (ప్రవిశంతి)

= ప్రవేశించుచున్నారు, చ = మరియు, భీష్మః = భీష్ముడును, ద్రోణః = ద్రోణుడును, తథా = అట్లే, అసౌ = ఈ, సూతపుత్రః = సూతపుత్రుడైన కర్ణుడును, అపి = మరియును, అస్మదీయైః = మన పక్షమునకు చెందిన, యోధముఖ్యైః, సహ = ముఖ్య యోధులతో గూడ, తే = నీయొక్క, దంష్ట్రా కరాళాని = భయంకరములైన కోరలతో గూడి, భయానకాని = భీతిని గొల్పు, వక్త్రాణి = నోళ్ళతో, త్వరమాణాః = త్వరపడుచున్నవారై, విశంతి = ప్రవేశించుచున్నారు, కేచిత్ = కొందరు, చూర్ణితైః = నుగ్గునుగ్గు గావింపబడిన, ఉత్తమాంగైః = శిరస్సులతో, దశనాంతరేషు = దంతముల మధ్య, విలగ్నాః = చిక్కుకొని వ్రేలాడుచున్నవారై, సదృశ్యంతే = కనపడుచున్నారు

తా. ధృతరాష్ట్రుని పుత్రులగు దుర్యోధనాదులందరు రాజ సమూహములతో కూడ, కృష్ణా! దంష్ట్రలచే వికారముగా కనుపించుచు మిక్కుటముగా భయమును గొల్పు నీ ముఖములందు వేగముగా వచ్చి పడుచున్నారు. ఆ తీరున భీష్మద్రోణ కర్ణులును మన పక్షము వారైన ధృష్టద్యుమ్నాది యోధవీరులును నీ ముఖములందు పడుచున్నారు. కొందరచ్చట చూర్ణము చేయబడిన శిరస్సులు కలిగి నీ కోరల మధ్య చిక్కుకొన్నవారై కనుపించుచున్నారు.

శ్లో॥ యథా నదీనాం బహవో౽ంబువేగాః
సముద్రమేవాభిముఖా ద్రవంతి
తథా తవామీ నరలోకవీరా
విశంతి వక్త్రాణ్యభివిజ్వలంతి 28

యథా = ఏ విధముగా, నదీనామ్ = నదీనదముల యొక్క, బహవః = అనేకములైన, అంబువేగాః = వేగముగా ప్రవహించుచున్న జలములన్నియును, సముద్రమ్ = సముద్రమునకు, అభిముఖాః, ఏవ = అభిముఖముగానే, ద్రవంతి = పరుగులు తీయుచు అందు ప్రవేశించునో, తథా = అట్లే, అమీ = ఈ, నరలోకవీరాః = శ్రేష్ఠులైన సమరయోధులు (నరలోక వీరులు), తవ = నీయొక్క, అభివిజ్వలంతి = మిక్కిలి జ్వలించుచున్న, వక్త్రాణి = ముఖములను (ముఖములయందు), విశంతి = ప్రవేశించుచున్నారు

తా. నదీ ప్రవాహములు మిక్కిలి వేగముతో సముద్రము వైపుకు ప్రవహించుచున్నట్లు మనుష్య లోకమందలి యీ వీరులందరు మండుచున్న నీ ముఖములందు పడుచున్నారు.

శ్లో॥ యథా ప్రదీప్తం జ్వలనం పతంగా
విశంతి నాశాయ సమృద్ధవేగాః
తథైవ నాశాయ విశంతి లోకాః
తవాపి వక్త్రాణి సమృద్ధవేగాః 29

యథా = ఏ విధముగా పతంగాః = మిడుతలు, నాశాయ = మోహవశమున తమ నాశము కొరకు, ప్రదీప్తమ్ = ప్రజ్వలించుచున్న, జ్వలనమ్ = అగ్నిని (అగ్నిలో), సమృద్ధవేగాః = మిక్కిలి వేగముగా, విశంతి = ప్రవేశించునో, తథా, ఏవ = ఆ విధముగానే, లోకాః, అపి = లోకములన్నియును, నాశాయ = తమ నాశమునకై, తవ = నీ యొక్క, వక్త్రాణి = ముఖములను (ముఖములయందు), సమృద్ధ వేగాః = మిక్కిలి వేగము గలవై (వేగముగా), విశంతి = ప్రవేశించుచున్నవి

తా. రెక్కలపురుగులెగురుచు వచ్చి మండుచున్న అగ్నిలో పడుచు నాశము చెందునట్లు వీరందరు నశించుటకై అతివేగముతో నీ ముఖముల పడుచున్నారు.

శ్లో॥ లేలిహ్యసే గ్రసమానః సమంతాత్
లోకాన్ సమగ్రాన్ వదనైర్జ్వలద్భిః
తేజోఽభిరాపూర్య జగత్ సమగ్రం
భాసస్తవోగ్రాః ప్రతపంతి విష్ణో 30

విష్ణో = ఓ మహావిష్ణూ!, సమగ్రాన్ = సమగ్రములైన, లోకాన్ = లోకములను, జ్వలద్భిః = ప్రజ్వలించుచున్న, వదనైః = ముఖములతో, గ్రసమానః = కబళించుచున్న వాడవై, సమంతాత్ = అన్నివైపుల నుండి, లేలిహ్యసే = మాటిమాటికిని ఆస్వాదించుచున్నావు, తవ = నీయొక్క, ఉగ్రాః = భయంకరములైన, భాసః = కాంతులు, సమగ్రమ్, జగత్ = సమస్త జగత్తును, తేజోభిః = తేజస్సులతో, ఆపూర్య = నింపి, ప్రతపంతి = తపింపజేయుచున్నవి.

తా. జ్వాలలచే దీప్యమానములైన ముఖములతో సమస్త లోకములను కబళించుచు ఆస్వాదించుచున్నావు. విష్ణు స్వరూపా! కృష్ణా! నీ తేజస్సుచే సమస్త జగత్తున నిండియున్న నీ యొక్క మహోగ్రకాంతులు లోకములను తపింప జేయుచున్నవి.

శ్లో॥ ఆఖ్యాహి మే కో భవానుగ్రరూపో
నమోఽస్తు తే దేవవర ప్రసీద
విజ్ఞాతుమిచ్ఛామి భవంతమాద్యం
న హి ప్రజానామి తవ ప్రవృత్తిమ్ 31

దేవవర = ఓ పరమాత్మా!, తే = నీకు, నమః, అస్తు = నమస్కారము, ప్రసీద = ప్రసన్నుడవు కమ్ము, ఆద్యమ్ = ఆది పురుషుడవైన, భవంతమ్ = నిన్ను, విజ్ఞాతుమ్ = విశదముగా తెలిసికొనుటకు ఇచ్ఛామి = కోరుచున్నాను, హి = ఏలనన, తవ, ప్రవృత్తిమ్ = నీ ప్రవృత్తిని, న, ప్రజానామి = ఎరుంగకున్నాను (కనుక), ఉగ్రరూపః, భవాన్ = ఉగ్రరూపుడవైన నీవు, కః = ఎవరవో, మే = నాకు, ఆఖ్యాహి = తెలుపుము

తా. ఉగ్రరూపుడవగు నీవెవరవో నాకు తెలియజెప్పుము. దేవతాశ్రేష్ఠుడవైన ఓ కృష్ణా! నీకు నమస్కరించుచున్నాను. ప్రసన్నుడవగుము. ఆది పురుషుడవగు నిన్ను తెలియగోరుచున్నాను. నీ ప్రవృత్తిని తెలియలేకున్నాను.

**శ్రీ భగవానువాచ:**

శ్లో॥ కాలోఽస్మి లోకక్షయకృత్ ప్రవృద్ధో
లోకాన్ సమాహర్తుమిహ ప్రవృత్తః
ఋతేఽపి త్వాం న భవిష్యంతి సర్వే
యేఽవస్థితాః ప్రత్యనీకేషు యోధాః 32

లోకక్షయకృత్ = సర్వలోకములను తుదముట్టించునట్టి, ప్రవృద్ధః = విజృంభించిన కాలః, అస్మి = మహాకాలుడను, ఇహ = ఇప్పుడు, లోకాన్ = (ఈ) లోకములను, సమాహర్తుమ్ = రూపుమాపుటకై, ప్రవృత్తః = పూనుకొనియున్న వాడను, ప్రత్యనీకేషు = శత్రుపక్షములయందు యే, యోధాః = ఏ వీరులు, అవస్థితాః = కలరో, (తే) = వారు, సర్వే = అందరును, త్వామ్, ఋతే, అపి = నీవు యుద్ధము చేయకున్నను, న, భవిష్యంతి = మిగిలియుండరు

తా. శ్రీకృష్ణ భగవానుడిట్లర్జునితో అనెను. ఓ అర్జునా! నేను లోకక్షయము గావింప వృద్ధిపొందిన కాలపురుషుడను. లోకులను సంహరింప బూనితిని. శత్రుపక్షమందలి ఈ వీరులందరును, నీ ప్రయత్నము లేకపోయినను మరణించువారే.

శ్లో॥ తస్మాత్ త్వముత్తిష్ఠ యశో లభస్వ
జిత్వా శత్రూన్ భుంక్ష్వ రాజ్యం సమృద్ధమ్
మయైవైతే నిహతాః పూర్వమేవ
నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్ 33

తస్మాత్ = అందువలన, త్వమ్ = నీవు, ఉత్తిష్ఠ = (యుద్ధము చేయుటకై) లెమ్ము, యశః = కీర్తిని, లభస్వ = పొందుము, శత్రూన్ = శత్రువులను, జిత్వా = జయించి, సమృద్ధమ్ = సర్వ సంపదలతో తులతూగుచున్న, రాజ్యమ్ = రాజ్యమును, భుంక్ష్వ = అనుభవింపుము, ఏతే = వీరందరును పూర్వమ్, ఏవ = ఇంతకు ముందే, మయా, ఏవ = నా చేతనే, నిహతాః = చంపబడిరి, సవ్యసాచిన్ = ఓ సవ్యసాచీ! అర్జునా! నిమిత్త మాత్రమ్, భవ = నీవు నిమిత్త మాత్రుడవు కమ్ము.

తా. ఆ కారణమున యుద్ధమునకు లెమ్ము. శత్రువులను జయించి కీర్తినిగాంచుము. సర్వసంపదలు కలిగిన యీ రాజ్యముననుభవింపుము. నీ ప్రతిపక్షులందరు నాచే పూర్వమే చంపబడిరి. ఓ అర్జునా! వారి మరణమునకు నిమిత్త మాత్రముగా నుండుము.

శ్లో॥ ద్రోణం చ భీష్మం చ జయద్రథం చ
కర్ణం తథాన్యానపి యోధవీరాన్
మయా హతాంస్త్వం జహి మా వ్యథిష్ఠా
యుధ్యస్వ జేతాసి రణే సపత్నాన్ 34

మయా = నాచేత, హతాన్ = చంపబడిన, ద్రోణమ్, చ = ద్రోణుని, భీష్మమ్, చ = భీష్ముని, జయద్రథమ్, చ = సైంధవుని, కర్ణమ్, చ = కర్ణుని, తథా = అట్లే, అన్యాన్ = తదితరులైన, యుద్ధవీరాన్ అపి = యుద్ధ వీరులను గూడ, త్వమ్ = నీవు, జహి = వధింపుము, మా, వ్యథిష్ఠాః = భయపడవలదు, రణే = యుద్ధమునందు, సపత్నాన్ = శత్రువీరులను, జేతాసి = తప్పక జయింపగలవు, యుధ్యస్వ = (కనుక) యుద్ధము చేయుము

తా. ద్రోణుడు, భీష్ముడు, జయద్రథుడు, కర్ణుడు, మరి యితరములైన యోధ వీరులును నాచే పూర్వమే మరణించిరి. వ్యథ జెందకుము. యుద్ధమున పగవారిని జయించెదవు. యుద్ధము చేయుము.

**సంజయ ఉవాచ:**

శ్లో॥ ఏతచ్ఛ్రుత్వా వచనం కేశవస్య
కృతాంజలిర్వేపమానః కిరీటీ
నమస్కృత్వా భూయ ఏవాహ కృష్ణం
సగద్గదం భీతభీతః ప్రణమ్య 35

కేశవస్య = శ్రీకృష్ణునియొక్క, ఏతత్ = ఈ, వచనమ్ = మాటలను, శ్రుత్వా = విని, కిరీటీ = అర్జునుడు, కృతాంజలిః = అంజలి ఘటించినవాడై, వేపమానః = వణికిపోవుచున్నవాడై, నమస్కృత్వా = నమస్కరించి, భూయః, ఏవ = మరల, భీతభీతః = మిక్కిలి భయగ్రస్తుడై, ప్రణమ్య = నమస్కరించి, కృష్ణమ్ = కృష్ణునితో, సగద్గదమ్ = గద్గద స్వరముతో, అహ = పలికెను.

తా. సంజయుడిట్లనెను. శ్రీ కృష్ణుని పలుకులు విని అర్జునుడు నమస్కరించి ముకుళిత కరకమలుడై మిక్కిలి భయపడుచు కంపించిన శరీరముతో గద్గదస్వరమున నిట్లనెను.

**అర్జున ఉవాచ:**

శ్లో॥ స్థానే హృషీకేశ తవ ప్రకీర్త్యా
జగత్ప్రహృష్యత్యనురజ్యతే చ
రక్షాంసి భీతాని దిశో ద్రవంతి
సర్వే నమస్యంతి చ సిద్ధసంఘాః 36

హృషీకేశ = ఓ అంతర్యామీ! తవ = నీ నామ గుణ ప్రభావములను, ప్రకీర్త్యా = బాగుగా కీర్తించుటచే (కీర్తించుచు), జగత్ = విశ్వమంతయును, ప్రహృష్యతి = మిక్కిలి హర్షించుచున్నది, చ = మరియు, అనురజ్యతే = అనురాగముతో పొంగిపోవుచున్నది, భీతాని = భయగ్రస్తులైన, రక్షాంసి = రాక్షసులు, దిశః = నలుదిక్కులకును, ద్రవంతి = పారిపోవుచున్నారు, చ = మరియు, సర్వే = సమస్తమైన, సిద్ధసంఘాః = సిద్ధ సముదాయముల వారును, నమస్యంతి = ప్రణమిల్లుచున్నారు, స్థానే = ఇది సముచితము,

తా. హృషీకేశ! నీ మహాత్మ్యమును కీర్తించి లోకము సంతోషించుటయే కాక నీయందనురాగము కలదగుచున్నది. రాక్షసులు భీతులై దిక్కుల వెంటబడుచున్నారు. కపిలాది సిద్ధసమూహములు నమస్కరించుచున్నారు. లెస్సగానున్నది.

శ్లో॥ కస్మాచ్చ తే న నమేరన్ మహాత్మన్
గరీయసే బ్రహ్మణోஉప్యాదికర్త్రే
అనన్త ! దేవేశ ! జగన్నివాస !
త్వమక్షరం సదసత్ తత్పరం యత్ 37

మహాత్మన్ = ఓ పరమాత్మా!, బ్రహ్మణః, అపి = సృష్టికర్తయైన బ్రహ్మకును, ఆదికర్త్రే = (నీవు) మూల కారకుడవు, చ = మరియు, గరీయసే, తే = సర్వ శ్రేష్ఠుడవునైన నీకు (సిద్ధాదులందరును), కస్మాత్, న, నమేరన్ = నమస్కరింపక ఎట్లుండగలరు? (తప్పక నమస్కరింతురు), అనంత! దేవేశ! = ఓ అనంతా! దేవాధిదేవా!, జగన్నివాస = ఓ జగన్నివాసా! యత్ = ఏది, సత్ = 'సత్' అయి ఉన్నదో, అసత్ = 'అసత్' అయి ఉన్నదో, తత్పరమ్ = వాటికంటెను పరమైన (శ్రేష్ఠమైన), అక్షరమ్ = శాశ్వతమైన సచ్చిదానంద పరమాత్మ తత్త్వము గలదో, ఎ(తత్) = (అది), త్వమ్ (ఏవ, అపి) = నీవే

తా. మహాత్మా ! కృష్ణా! దేవతలకు సైతము శాసకుడవైన నీవే జగత్తుకు నివాస స్థానమైన వాడవును, అనంతుడవునై యున్నావు. బ్రహ్మకు కూడ ఆదికారణమయి గొప్పవాడవగు నీకు వారందరును నమస్కరించుదురు. నీవే అక్షరమగు పరబ్రహ్మవని వేదాంతమున చెప్పబడుచున్నది. సత్ అనియు అసత్ అనియు వేదవిదులచే చెప్పబడు ప్రకృతి కంటె అతీతుడైన వాడవు నీవే.

శ్లో॥ త్వమాదిదేవః పురుషః పురాణః
త్వమస్య విశ్వస్య పరం నిధానమ్
వేత్తాసి వేద్యం చ పరం చ ధామ
త్వయా తతం విశ్వమనంతరూప 38

అనంతరూప = ఓ అనంతరూపా! త్వమ్ = నీవు, ఆదిదేవః = ఆది దేవుడవు, పురాణః, పురుషః = సనాతన పురుషుడవు, త్వమ్ = నీవు, అస్య = ఈ, విశ్వస్య = జగత్తునకు, పరమ్, నిధానమ్ = పరమాశ్రయుడవు, వేత్తా, చ = సర్వజ్ఞుడవు, వేద్యమ్, చ = సర్వ వేద్యమైనవాడవు, పరమ్, ధామ, అసి = పరంధాముడవు, త్వయా = నీ చేత, విశ్వమ్ = జగత్తు, తతమ్ = పరిపూర్ణమైయున్నది.

తా. ఓ కృష్ణా! నీవు జగత్తుకు స్రష్టవు కనుక ఆదిదేవుడవు. సర్వభూతముల యొక్క శరీరమను పురమున నుండువాడవు కాన పురుషుడవు. చిరకాలము నుండి యిట్లున్న వాడవు కనుక పురాణ

పురుషుడవు. సర్వభూతాంతరాత్మవై వెలుగుచుండువాడవు కాన జగత్తుకు గొప్ప నిధివి. జ్ఞానరూపుడవయి సర్వమును తెలియువాడవు నీవే. వేద్యమగు సర్వము నీయందే యుద్భవించి మరల నీయందే లయమగు చుండుటచే వేద్యము కూడనీవే. అనంతరూపములతో విశ్వవ్యాప్తమై యున్నవాడవు నీవే. మహాత్ములు పొందదగిన మోక్షధామము నీవే.

శ్లో॥ వాయుర్యమోఽగ్నిర్వరుణశ్శశాంకః
ప్రజాపతిస్త్వం ప్రపితామహశ్చ
నమో నమస్తేఽస్తు సహస్రకృత్వః
పునశ్చ భూయోఽపి నమో నమస్తే 39

త్వమ్ = నీవు, వాయుః = వాయుదేవుడవు, యమః = యముడవు, అగ్నిః = అగ్నివి, వరుణః = వరుణుడవు, శశాంకః = చంద్రుడవు, ప్రజాపతిః = ప్రజాపతియైన బ్రహ్మవు, ప్రపితామహః, చ = బ్రహ్మకును జనకుడవు, తే = నీకు, సహస్రకృత్వః నమః నమః = వేలకొలది నమస్కార పరంపరలు, అస్తు = అగుగాక, తే = నీకు, భూయః, అపి = మరల గూడ, పునః, చ = ఇంకను, నమః నమః = నమస్కారములు

తా. వాయుదేవుడు, యమాగ్ని వరుణ చంద్రులు, కశ్యపాది ప్రజాపతులు, బ్రహ్మకు కూడ కారణమైనవాడవు, సర్వమూ నీవై యున్నావు. అట్టి మహాత్ముడవైన నీకు వేలకొలది పర్యాయములు నమస్కారములు. మరల మరల నీకు నమస్కరించుచున్నాను.

శ్లో॥ నమః పురస్తాదథ పృష్ఠతస్తే
నమోఽస్తు తే సర్వత ఏవ సర్వ
అనంతవీర్యామితవిక్రమస్త్వం
సర్వం సమాప్నోషి తతోఽసి సర్వః 40

అనంతవీర్య = అనంతమైన సామర్థ్యము కలవాడా! తే = నీకు, పురస్తాత్ = ముందుగా ఉండియు, అథ = మరియు, పృష్ఠతః = వెనుకనుండియు, నమః = నమస్కారములు, సర్వ = సర్వాత్మా, తే = నీకు, సర్వతః, ఏవ = అన్నివైపుల నుండియు, నమః అస్తు = నమస్కారము(లు), అమితవిక్రమః = అపరిమితమైన పరాక్రమము గలవాడవైన, త్వమ్ = నీవు, సర్వమ్, సమాప్నోషి = జగత్తునందంతటను వ్యాపించియున్నవాడవు, తతః = ఈ విధముగా నీవే, సర్వః, అపి = సర్వరూపుడవు.

తా. ఓ కృష్ణా! ఎదుటను, వెనుకను, ఇచటనచట ననక సర్వత్రయున్న నీకిదే నమస్కారము. అనంతములై, సాత్త్విక బలసంపదలు కలిగి, అమిత పరాక్రమశాలివై సర్వమావరించి యున్నావు. కావున సర్వమయి ఉన్నావు.

శ్లో॥ సఖేతి మత్వా ప్రసభం యదుక్తం
హే కృష్ణ ! హే యాదవ ! హే సఖేతి
అజానతా మహిమానం తవేదం
మయా ప్రమాదాత్ ప్రణయేన వాఽపి 41

శ్లో॥ యచ్చాపహాసార్థ మసత్కృతోఽసి
విహారశయ్యాసనభోజనేషు
ఏకోఽథ వాప్యచ్యుత ! తత్సమక్షం
తత్ క్షామయే త్వామహమప్రమేయమ్ 42

తవ = నీయొక్క ఇదమ్ = ఈ, మహిమానమ్ = మహిమను, అజానతా = ఎరుగనివాడనైన, మయా = నాచేత (నేను), సఖా, ఇతి = మిత్రుడవని, మత్వా = తలంచి, ప్రణయేన, వా = చనువుచేగాని, ప్రమాదాత్, అపి = పొరపాటున వలన గాని, హే కృష్ణా = ఓ కృష్ణా! హే యాదవా = ఓ యాదవా! హే సఖే, ఇతి = ఓ మిత్రమా! అనిగాని, యత్ = ప్రసభమ్ = తొందరపాటుగా , ఉక్తం, చ = పలుకుట జరిగి యుండవచ్చును, అచ్యుత = ఓ కృష్ణా! యత్ = ఏది (నాద్వారా), అపహాసార్థమ్ = పరిహాసమునకుగాని, విహార, శయ్యా ఆసన భోజనేషు = ఆహార విహారముల యందుగాని, శయ్యాసనములపై ఉన్నప్పుడు గాని, ఏకః = ఏకాంతమునగాని, అథవా = లేక, తత్ సమక్షమ్ అపి = మిత్రుల మధ్యగాని, అసత్కృతః, అపి = నీవు కించపరచబడి ఉండవచ్చును, తత్ = ఆ అపరాధములు అన్నింటికిని, అప్రమేయమ్ = అప్రమేయ స్వరూపుడవైన, త్వామ్ = నీవు, క్షామయే = క్షమింపుమని వేడుకొనుచున్నాను.

తా. అజ్ఞానుడనై నీ మహిమను తెలియజాలక స్నేహితుడవని భావించి యనాలోచితముగా కృష్ణా! అనియు, యాదవా! అనియు, మిత్రమా అనియు ప్రమాదముచే కాని లేక ప్రణయముచే కాని చేసిన యపరాధము మన్నింపుము. ఓ కృష్ణా! నీతో కలిసి పవ్వళించిన సమయమున, విహారకాలమున, భోజన కాలమున పరిహాసమునకై ప్రత్యక్షముగను, మరికొన్ని వేళల పరోక్షముగాను నిన్ను పరాభవించితిని. నా యపరాధముల లెక్కగొనక క్షమించవలెనని అప్రమేయుండవగు నిన్ను వేడుకొనుచున్నాను.

శ్లో॥ పితాఽసి లోకస్య చరాచరస్య
త్వమస్య పూజ్యశ్చ గురుర్గరీయాన్
న త్వత్సమోఽస్త్యభ్యధికః
కుతోఽన్యో లోకత్రయేఽప్యప్రతిమప్రభావ 43

అప్రతిమప్రభావ = సాటిలేని ప్రభావముగలవాడా, త్వమ్ = నీవు, అస్య, చరాచరస్య = ఈ చరాచర ప్రాణులతో గూడిన, లోకస్య = జగత్తునకు, పితా = తండ్రివి, చ = మరియు, గరీయాన్ = సర్వశ్రేష్ఠుడవు, గురుః = గురుడవు, పూజ్యః, అసి = పూజ్యుడవు, లోకత్రయే, అపి = ముల్లోకముల యందును, త్వత్సమః = నీతో సమానుడు, అన్యః = మరియొకడు, న, అస్తి = లేదు, అభ్యధికః = అధికుడు, కుతః = ఎట్లుండును?

తా. చరాచర రూపమైన ఈ లోకమునకు నీవు జనకుడవు. మిక్కిలి గొప్ప గురువు యగుటచే పూజనీయుడవు కూడ. అందుచే నీకు సముడైన వాడేలేడు. ఇంక నధికుడైన వాడెట్లుండును. ముల్లోకములందును ప్రభావమున నీవసమానుడవు.

శ్లో॥ తస్మాత్ ప్రణమ్య ప్రణిధాయ కాయం
ప్రసాదయే త్వామహమీశమీడ్యమ్
పితేవ పుత్రస్య సఖేవ సఖ్యుః
ప్రియః ప్రియాయార్హసి దేవ సోఢుమ్ 44

దేవ = ఓ దేవాధిదేవా! తస్మాత్ = అందువలన, అహమ్ = నేను, కాయమ్ = శరీరమును, ప్రణిధాయ = నీ పాదములకడ ఉంచి, ప్రణమ్య = నమస్కరించి,ఈడ్యమ్ = స్తవనీయుడవు, ఈశమ్ = పరమేశ్వరుడవును అయిన, త్వామ్ = నిన్ను, ప్రసాదయే = (నన్ను అనుగ్రహించుటకై) ప్రార్థించుచున్నాను, పుత్రస్య = పుత్రుని (తప్పును), పితా, ఇవ = తండ్రివలెను, సఖ్యుః = సఖుని (దోషమును), సఖా, ఇవ = సఖునివలెను, ప్రియాయాః = భార్య (అపరాధము) ను, ప్రియః, ఇవ = భర్తవలెను, త్వమ్ = నీవు, సోఢుమ్ = (నా అపరాధములను అన్నింటిని) సహించు (క్షమించు) టకు, అర్హసి = తగినవాడవు.

తా. ఓ కృష్ణా! అప్రమేయుండవు. సర్వభూతేశుడవు, స్తోత్రార్హుండవునగు నీకు చాగిలపడి మ్రొక్కి ప్రసన్నుడవగుమని నిన్ను ప్రార్థించుచున్నాను. అపరాధమును లెక్కగొనక తండ్రి కుమారుని

మన్నించినట్లు, మిత్రుడు మిత్రుని మన్నించినట్లును, ప్రియుడు ప్రియురాలి తప్పిదమును సరకుగొననట్లును, ఓ కృష్ణా ! నీవు నా యపరాధమును క్షమింపనర్హుడవు.

శ్లో॥ అదృష్టపూర్వం హృషితోఽస్మి దృష్ట్వా
భయేన చ ప్రవ్యథితం మనో మే
తదేవ మే దర్శయ దేవరూపం
ప్రసీద దేవేశ ! జగన్నివాస 45

అదృష్టపూర్వమ్ = ఇంతకుముందెన్నడును చూడనట్టి విశ్వరూపమును, దృష్ట్వా = చూచి, హృషితః, అస్మి = సంతుష్టుడనైతిని, చ = మరియు, మే, మనః = నా మనస్సు, భయేన = భయముతో, ప్రవ్యథితమ్ = కలత చెందినది, తత = ఆ, దేవరూపమ్, ఏవ = చతుర్భుజ శోభితమైన విష్ణురూపమునే, మే = నాకు, దర్శయ = చూపుము, దేవేశ = ఓ దేవాధిదేవా! జగన్నివాస = ఓ జగన్నివాసా! ప్రసీద = ప్రసన్నుడవు కమ్ము

తా. మున్నెన్నడును జూచి యెరుగని విశ్వరూపమును జూచి ఆనందము నందితిని. భీతుడను కూడనయినందున నా మనస్సు మిగుల వ్యధ జెందినది. కనుక ఓ దేవ దేవా! జగదాధారా! నా యందు ప్రసన్నుడవగుము. మఱియు పరిచితమైన వాసుదేవ రూపమునే నాకు చూపుము.

శ్లో॥ కిరీటినం గదినం చక్రహస్తమ్
ఇచ్ఛామి త్వాం ద్రష్టుమహంతథైవ
తేనైవ రూపేణ చతుర్భుజేన
సహస్రబాహో ! భవవిశ్వమూర్తే ! 46

విశ్వమూర్తే = ఓ విశ్వరూపా!, అహమ్ = నేను, కిరీటినమ్ = కిరీటము గలవాడవును, గదినమ్ = గదను ధరించిన వాడవును, చక్రహస్తమ్ = చక్రపాణివియును అగు, త్వామ్ = నిన్ను, తథా, ఏవ = అట్లే, ద్రష్టుమ్ = చూచుటకై, ఇచ్ఛామి = కోరుకొనుచున్నాను,(అతః) = (అందువలన), సహస్రబాహో = ఓ పరమాత్మా! తేన చతుర్భుజరూపేణ ఏవ = చతుర్భుజరూపము గలవాడవు, భవ = కమ్ము,

తా. సహస్ర బాహువులు కలిగి విశ్వరూపుడవైన ఓ కృష్ణా! పూర్వమువలె చతుర్భుజాకారుడవగుము. కిరీటధారివై గదా చక్రముల ధరించియున్న నిన్ను చూడకోరుచున్నాను.

**శ్రీ భగవానువాచ :**

శ్లో॥ మయా ప్రసన్నేన తవార్జునేదం
రూపం పరం దర్శితమాత్మయోగాత్
తేజోమయం విశ్వమనంతమాద్యం
యన్మే త్వదన్యేన న దృష్టపూర్వమ్ 47

అర్జున = ఓ అర్జునా! ప్రసన్నేన = నీయెడ ప్రసన్నుడనైన, మయా = నాచేత, ఆత్మయోగాత్ = నా యోగశక్తి ప్రభావమున, ఇదమ్ = ఈ , పరమ్ = శ్రేష్ఠమైన , తేజోమయమ్ = తేజోమయమైన, ఆద్యమ్ = అన్నింటికిని ఆదియైన, అనంతమ్ = అపరిమితమైన, యత్ = ఏదైతే, త్వదన్యేన = నీవుతప్ప మరియెవ్వరి చేతను, నదృష్టపూర్వమ్ = ఇంతకుముందు చూడబడలేదో అట్టి, మే = నాయొక్క, విశ్వమ్, రూపమ్ = విశ్వరూపము, తవ = నీకు, దర్శితమ్ = చూపబడినది.

తా. శ్రీ కృష్ణభగవానుడు పార్థునితో నిట్లనెను. ఓ అర్జునా! నీయెడల ప్రసన్నుడనగు నేను నా యోగశక్తిచే నీకీ విశ్వరూపమును చూపితిని. తేజోమయమైన ఈ విశ్వరూపము అనంతమైనది. నీవు తప్ప మరెవ్వరును నా యీ విశ్వరూపమునెన్నడును చూచి యెఱుగరు.

శ్లో॥ న వేదయజ్ఞాధ్యయనైర్న దానైః
న చ క్రియాభిర్న తపోభిరుగ్రైః
ఏవం రూపః శక్య అహం నృలోకే
ద్రష్టుం త్వదన్యేన కురుప్రవీర 48

కురుప్రవీర = కురువీరులలో శ్రేష్ఠుడవైన ఓ అర్జునా! నృలోకే = మానవ లోకమున, ఏవమ్, రూప = ఇట్టి విశ్వరూపుడనైన, అహమ్ = నేను, త్వదన్యేన = నీవుతప్ప మరి ఎవ్వరి చేతను, వేద, యజ్ఞ అధ్యయనైః = వేద పఠనముల ద్వారాను, యజ్ఞాదుల ద్వారాను, ద్రష్టుమ్ = చూచుటకు, న శక్యః = శక్యముగాను, దానైః = దానముల ద్వారా, న (శక్యః) = శక్యము గాను, క్రియాభిః, చ = ఇతర క్రియల ద్వారాను, న (శక్యః) = శక్యము గాను, ఉగ్రైః, తపోభిః చ = తీవ్ర తపశ్చర్యల ద్వారా కూడా, న (శక్యః) = శక్యము గాను.

తా. కురువంశమున గొప్ప వీరుడవగునో అర్జునా! ఇట్టి దివ్యరూపముకల నన్నీమనుష్య లోకమున నీవొక్కడివే చూడ గలిగితివి. నా యీ రూపమితరులకు చూడశక్యముకాదు. వేదవేత్తలైనను,

యజ్ఞములొనర్చిన వారైనను, అధ్యయన పరులైనను, దాతలైనను, శ్రౌతస్మార్తాది కర్మానుష్ఠాన పరులైనను, తపమాచరించిన వారైనను నా యీ రూపము చూడనోపరు.

శ్లో॥ మా తే వ్యథా మా చ విమూఢభావో
దృష్ట్వా రూపం ఘోరమీదృఙ్మమేదమ్
వ్యపేతభీః ప్రీతమనాః పునస్త్వం
తదేవ మే రూపమిదం ప్రపశ్య 49

మమ = నాయొక్క, ఈదృక్ = ఈ విధమైన, ఇదమ్, ఘోరమ్ = ఈ భయంకర, రూపమ్ = రూపమును, దృష్ట్వా = చూచి, తే = నీకు, వ్యథా = వ్యాకులపాటు, మా = వలదు, చ = మరియు, విమూఢభావః = మోహముకూడ, మా = వలదు, త్వమ్ = నీవు, వ్యపేతభీః = భయ రహితుడవై, ప్రీతమనాః = ప్రసన్న చిత్తుడవై, తత్ = ఆ, మే = నాయొక్క, ఇదమ్, రూపమ్ ఏవ = ఈ చతుర్భుజ రూపమునే, పునః = మరల, ప్రపశ్య = దర్శింపుము.

తా. అర్జునా! నా యీ ఘోరరూపము చూచి వెతజెందకుము. మూఢత్వము వదలుము. నిర్భయుడవై చిరకాల పరిచితమైన నా యీ చతుర్భుజాకారమును చూడుము. ప్రసన్నమానసుడవగుము.

**సంజయ ఉవాచ:**

శ్లో॥ ఇత్యర్జునం వాసుదేవస్తథోక్త్వా
స్వకం రూపం దర్శయామాస భూయః
ఆశ్వాసయామాస చ భీతమేనం
భూత్వా పునః సౌమ్యవపుర్మహాత్మా 50

వాసుదేవః = వాసుదేవుడు (శ్రీకృష్ణుడు), అర్జునమ్ = అర్జునుని గూర్చి (అర్జునునితో), ఇతి, ఉక్త్వా = ఈ విధముగా పలికి, భూయః = అనంతరము, తథా = అదే విధముగా, స్వకమ్, రూపమ్ = తన చతుర్భుజ రూపమును, దర్శయామాస = దర్శింపజేసెను,చ = మరియు, పునః = తర్వాత, మహాత్మా = మహాత్ముడైన శ్రీకృష్ణుడు, సౌమ్యవపుః, భూత్వా = సౌమ్య స్వరూపుడై (ప్రసన్నమైన తన కృష్ణ రూపమును దాల్చి), భీతమ్, ఏవమ్ = భయపడుచున్న ఈ అర్జునుని, ఆశ్వాసయామాస = ఓదార్చెను.

తా. సంజయుడు ధృతరాష్ట్రునితో నిట్లనెను. ఓ రాజా! అర్జునునితో వాసుదేవుడిట్లు పలికి మరల తన చతుర్భుజాకారమును చూపెను. మహాత్ముడగు కృష్ణుడావిధముగా రమణీయమైన దేహమును

ధరించి భీతిజెందిన పార్థుని శాంత చిత్తునిజేసెను.

**అర్జున ఉవాచ:**

శ్లో॥ దృష్ట్వేదం మానుషం రూపం తవ సౌమ్యం జనార్దన
ఇదానీమస్మి సంవృత్తః సచేతాః ప్రకృతిం గతః 51

జనార్దన = ఓ కృష్ణా!, తవ = నీయొక్క, ఇదమ్, సౌమ్యమ్ = ఇట్టి సౌమ్యమైన, మానుషమ్, రూపమ్ = మానవాకృతిని, దృష్ట్వా = చూచి, ఇదానీమ్ = ఇప్పుడు (నేను), సచేతాః, సంవృత్తః, అస్మి = కుదుటపడిన మనస్సు గలవాడనైతిని (మరియు), ప్రకృతిమ్, గతః = నా సహజస్థితిని పొందితిని.

తా. జనార్దనా! రమణీయమైన నీ మానుషాకారమును జూచి యిప్పుడు నా మనస్సు భ్రాంతిని వదలి సహజమైన ప్రశాంతత కల్గియున్నది యని అర్జునుడు పలికెను.

**శ్రీ భగవానువాచ:**

శ్లో॥ సుదుర్దర్శమిదం రూపం దృష్టవానసి యన్మమ
దేవా అప్యస్య రూపస్య నిత్యం దర్శనకాంక్షిణః 52

మమ = నాయొక్క, యత్, రూపమ్ = ఏ చతుర్భుజ రూపమును, దృష్టవాన్, అసి = నీవు చూచియుంటివో, ఇదమ్ = ఈ రూపము, సుదుర్దర్శమ్ = దర్శించుటకు దుర్లభమైనది, దేవాః, అపి = దేవతలు కూడ, నిత్యమ్ = సదా, అస్య, రూపస్య = ఈ రూపము యొక్క, దర్శనకాంక్షిణః = దర్శన కాంక్షతో నిరీక్షించుచుండువారే.

తా. అర్జునునితో శ్రీకృష్ణుడిట్లు పలికెను. ఓ అర్జునా! నీవు చూచిన నా యీ విశ్వరూప మెవరికిని చూడశక్యము కానిది. దేవతలు కూడ నిత్యమీవిశ్వరూపమును చూడగోరుదురు.

శ్లో॥ నాహం వేదైర్న తపసా న దానేన న చేజ్యయా
శక్య ఏవంవిధో ద్రష్టుం దృష్టవానసి మాం యథా 53

యథా = ఏ విధముగా,మామ్ = నన్ను (నా చతుర్భుజ రూపమును) దృష్టవాన్, అపి = చూచియుంటివో, ఏవంవిధః = ఈ విధమైన రూపముగలవాడనగు, అహమ్ = నేను, వేదైః = వేదముల ద్వారా, ద్రష్టుమ్ = చూచుటకు, న, శక్యః = శక్యముగాను, తపసా = తపస్సుచే, న (శక్యః) = శక్యముగాను, దానేన = దానము చేతను, న (శక్యః) = శక్యముగాను, ఇజ్యయా, చ = యజ్ఞాచరణము ద్వారాగూడ, న (శక్యః) = శక్యముగాను.

తా. నా విశ్వరూపమును నీవు చూచినట్లు చూచుటకు, వేదములచేకాని, తపోదాన యజ్ఞములాచరించినను ఇతరులకు లభించునది కాదు.

శ్లో॥ భక్త్యా త్వనన్యయా శక్య అహమేవంవిధోఽర్జున
జ్ఞాతుం ద్రష్టుం చ తత్త్వేన ప్రవేష్టుం చ పరంతప 54

తు = అయితే, పరంతప = ఓ పరంతపా!, అర్జున = ఓ అర్జునా!, అనన్యయా, భక్త్యా = అనన్యభక్తి ద్వారా, ఏవంవిధః = ఇట్టి విశ్వరూపుడనైన, అహమ్ = నేను, ద్రష్టుమ్ = చూచుటకును, తత్త్వేన, జ్ఞాతుమ్ = తత్త్వజ్ఞానము ద్వారా ఎరుంగుటకును, చ = అట్లే, ప్రవేష్టుమ్, చ = అందు ఏకీభావస్థితిని పొందుటకును, శక్యః = సాధ్యుడనగుదును.

తా. ఇంద్రియములను తపింపజేయు అర్జునా! ఈ విధముగా నన్ను తెలియుటగాని యథార్థరూపమున నన్ను చూచిచేరుటకాని అనన్యభక్తి కలవానికి సాధ్యమగును.

వి. అనన్యభక్తి: *'స్వస్వరూపాను సంధానం భక్తిరిత్యభిధీయతే'* *(వివేక చూడామణి)*

తనను తన రూపమున కలుపుట భక్తియనబడును. జగత్తు ఆత్మేతరము కాదనియు, ఆత్మయే యనియు తెలిసి సర్వమాత్మయను జ్ఞానమనన్యభక్తియనబడును.

ప్రవేష్టుం = ప్రవేశించి, ద్రష్టుం = చూచి, జ్ఞాతుం = తెలుసుకొనుటయే అనన్యభక్తి .

*శ్లో: బ్రహ్మనాడీ ముఖేరంధ్రం సూక్ష్మం పరమగోచరమ్*
*తస్మిన్ ప్రతిష్ఠితమ్ సర్వమ్ విశ్వం సహచరాచరమ్* *(ఉత్తరగీత)*

*శ్లో: తస్యాంతే సుషిరగ్ం సూక్ష్మం తస్మిన్ సర్వమ్ ప్రతిష్ఠితమ్*
*(మంత్రపుష్పమ్, మహానారాయణోపనిషత్)*

బ్రహ్మనాడిగా పిలువబడే సుషుమ్నా ముఖమందు సూక్ష్మమైన రంధ్రం గలదు. ఆ స్థలం భ్రూమధ్యమైయున్నది. అచ్చట చరాచర విశ్వమంతయూ ప్రతిష్ఠింపబడియున్నది.

*శ్లో: భ్రువోర్మధ్యే ప్రాణమావేశ్య సమ్యక్ సతం పరం పురుషముపైతి దివ్యమ్* *(8-10)*

అనగా ప్రాణాయామం ద్వారా తన ప్రాణాన్ని భ్రూమధ్యమందుగల సూక్ష్మరంధ్రమందు ప్రవేశింపజేసి, బ్రహ్మ తేజస్సును చూచి, ఆ తేజస్సునందే ఈ సకల విశ్వము సంభవించుచున్నదని యోగి తెలుసుకొనుటయే అనన్యభక్తి.

శ్లో॥ మత్కర్మకృన్మత్పరమో మద్భక్తః సంగవర్జితః
నిర్వైరః సర్వభూతేషు యః స మామేతి పాండవ 55

పాండవ = ఓ పాండవా! యః = ఎవడైతే, మత్కర్మకృత్ = నా కొరకై కర్తవ్య కర్మలను ఆచరించునో, మత్పరమః = మత్పరాయణుడగునో, మద్భక్తః = నాయందు భక్తిశ్రద్ధలు కలవాడగునో, సంగవర్జితః = ప్రాపంచిక విషయములయందు ఆసక్తి రహితుడగునో, సర్వభూతేషు = సమస్త ప్రాణులయందును, నిర్వైరః = వైరభావము లేనివాడగునో

సః = అట్టి అనన్యభక్తియుక్తుడు

మామ్ = నన్ను

ఏతి = పొందును

తా. నన్ను పొందుటకు తగిన కర్మ నాచరించుచు, నన్నే పరమ ప్రాప్యమైన పరమ పదముగ నమ్మి, నన్నే ధ్యానించుచు, బంధుమిత్ర కళత్రాదులందు సంగభావ వర్జితుడగుచు, ఏ ప్రాణియందును వైరభావము లేకయున్న వాడు నన్ను చేరును.

వి. 'మత్కర్మకృత్' మత్కర్మయన నన్ను (ఆత్మను) పొందుటకు తగిన కర్మ.

*శ్లో. 'అయంతు పరమోధర్మః యద్యోగే నాత్మ దర్శనమ్' (భారతం శాంతిపర్వమ్)*

యోగనిష్ఠచే నాత్మను దర్శించుటయే పరమ ధర్మము. ఆ కారణమున 'మత్కర్మ' యన యోగమని భావము. యోగము చేతనే ఆత్మానుసంధానమునకు అవకాశము కలదు. కనుక యోగియే భక్తుడు. యోగముచే మనస్సు నిశ్చలమై ఏకాగ్రమగును. ఏకాగ్రత కల్గిన బాహ్యవస్తు జ్ఞానరహితుడగును. అప్పుడాత్మేతర వస్తువుల యెడ సంగము కలుగుటకు అవకాశములేదు. ఆత్మస్థుండగు యోగి సర్వత్ర ఆత్మనే దర్శించును. అట్టి యోగి సర్వ భూతములందు నిర్వైరుడై యుండును.

ఇట్లు
శ్రీ పరమహంస పరివ్రాజకాచార్యులును,
బ్రహ్మర్షి సద్గురు **శ్రీశ్రీశ్రీ శివానంద భగవత్పూజ్యపాద** శిష్యులును నైన
బ్రహ్మర్షి సద్గురు **శ్రీశ్రీశ్రీ స్వామి రామానంద పరమహంస** వారిచే
రచింపబడిన గీతామృతమను టీక యందు
**విశ్వరూప సందర్శన యోగ**మను ఏకాదశాధ్యాయము సమాప్తము.

ఓం శ్రీకృష్ణ పరమాత్మనే నమః

ద్వాదశాధ్యాయము

# భక్తి యోగము

**అర్జున ఉవాచ:**

శ్లో॥ ఏవం సతతయుక్తా యే భక్తాస్త్వాం పర్యుపాసతే
యే చాప్యక్షరమవ్యక్తం తేషాం కే యోగవిత్తమాః 1

ఏవమ్ = పూర్వోక్తరీతిగా, త్వామ్ = సగుణరూప పరమేశ్వరుడవైన నిన్ను, సతతయుక్తాః = నిరంతరము యోగనిష్ఠాపరులై ఉపాసించునట్టి, యే, భక్తాః = ఏ అనన్య భక్తులు గలరో, చ = మరియు, యే = ఎవరైతే, అక్షరమ్ = నాశరహితుడవైన, అవ్యక్తమ్, అపి = నిరాకార సచ్చిదానంద ఘనపరబ్రహ్మవగు నిన్ను, పర్యుపాసతే = మిక్కిలి ఏకాగ్రచిత్తులై భజింతురో, తేషామ్ = ఆ రెండు విధములైన ఉపాసకులలో, యోగవిత్తమాః = అత్యుత్తమ యోగవిదులు, కే = ఎవరు?

తా. అతీతాధ్యాయాంతమందలి శ్లోకమున చెప్పబడినట్లు నిరంతరము యోగ నిష్ఠాపరులై అనన్యభావమున పరమాత్మవగు నిన్ను భజించుచు, ఓ కృష్ణా! ఉపాసనచేయు యోగులలోను, నిరస్తోపాధికమయి యున్నందున అవ్యక్తముగానున్న బ్రహ్మను సేవించు యోగులలోను నెవరధికముగా యోగము తెలిసినవారగుదురు?

**శ్రీభగవానువాచ:**

శ్లో॥ మయ్యావేశ్య మనో యే మాం నిత్యయుక్తా ఉపాసతే
శ్రద్ధయా పరయోపేతాః తే మే యుక్తతమా మతాః 2

మయి = నాయందు, మనః, ఆవేశ్య = మనస్సును ఏకాగ్రమొనర్చి, నిత్యయుక్తాః = నిరంతరము యోగ సాధనలో నిమగ్నమై, ఏ = ఏ భక్తులు, పరయా, శ్రద్ధయా = అత్యంత భక్తిశ్రద్ధలతో, ఉపేతాః = కూడినవారై, మామ్ = సగుణరూప పరమేశ్వరుడనైన నన్ను, ఉపాసతే = ఉపాసింతురో, తే = వారు, మే = నాకు, యుక్తతమాః = యోగులలో అత్యుత్తములని భావింపబడుదురు.

తా. పరమేశ్వరుడనైన నాయందు సర్వాత్మభావమున సమాహిత చిత్తులై అత్యంత శ్రద్ధతో సర్వభూతములందు నిగూఢముగానున్న పురుషుడే యాత్మయని సర్వకాలము నుపాసించుచున్నవారు యోగసత్తములని నా అభిమతమని శ్రీకృష్ణ భగవానులు చెప్పిరి.

వి. సగుణోపాసన యనగా నామరూపాత్మకముతో కూడిన సాకారోపాసన కాదు.

శ్లో॥ సవై శరీరే ప్రధమః సవై పురుష ఉచ్యతే
ఆదికర్తా సభూతానాం బ్రహ్మాగ్రే సమవర్తతః (శృతి)

నిర్గుణ పరబ్రహ్మయే మొమ్మొదటనొక శరీరమును దాల్చును. ఆ శరీరమే సర్వభూతములకు ఆదికర్తయూ, పురుషుడని అందురు

శ్లో॥ ఆకాశ శ్శరీరం బ్రహ్మ .................. (తైత్తరీయోపనిషత్)

బ్రహ్మయొక్క శరీరము ఆకాశమే.

శ్లో॥ చిత్తాకాశం చిదాకాశం ఆకాశం తు తృతీయకమ్
ద్వాభ్యాం శూన్యతరం విద్ధి చిదాకాశం వరాననే (యోగవాశిష్ఠమ్)

సంకల్ప వికల్పములతో కూడుకొనియున్నది చిత్తాకాశం. పంచభూతములలోనిది భూతాకాశం చిత్+ఆకాశం = ప్రకాశవంతమైన ఆకాశమే చిదాకాశం. ఈ మూడింటిలో మొదటి రెండు శాశ్వతమైనవి కావు. ఇక మూడవదియగు ప్రకాశ రూపమగు చిదాకాశమే శాశ్వతమైనది. ఇదియే సగుణ బ్రహ్మ. ఈ తేజోరూపంలోనున్న చిదాకాశాన్ని యోగులు మాత్రమే చూడగలరు.

శ్లో॥ జ్యోతిషామపి తత్జ్యోతి తమసః పరముచ్యతే (13-17)

శ్లో॥ యోఽన్తసుఖో యోఽన్తరారామో తదాఽన్తర్జ్యోతిరేవయః
సయోగి బ్రహ్మ నిర్వాణం బ్రహ్మభూతోధి గచ్ఛతి (5-24)

కావున యోగసాధకులే సగుణోపాసకులు. వారే అనన్యభక్తులు. తదితరులు సాకారోపాసకులు మాత్రమే. అట్టియోగులు సాకారోపాసకుల కంటెను, మరియు నిర్గుణోపాసకుల కంటెను ఉత్తములని శ్రీకృష్ణ పరమాత్ముని అభిప్రాయం. ఎందుచేతననగా దేహాత్మ బుద్ధి గలవానికి అవ్యక్తోపాసన (నిర్గుణోపాసన) దుస్సాధ్యమని రాబోవు శ్లోకములలో (క్లేశోఽధికతరస్తేషాం) చెప్పబోవుచున్నారు. ఇక సాకారోపాసకులు నన్ను వ్యక్తిగా భావించి, అజ్ఞానులై నన్ను అవమానించుచున్నారని చెప్పుటచే ప్రాణమధన క్రియచే ఆత్మతేజస్సును దర్శించగల యోగులే సగుణోపాసకులు, అనన్యభక్తులు. అట్టివారే అందరికంటే తనకు ప్రియతములని వారి అభిప్రాయము.

శ్లో॥ యే త్వక్షరమనిర్దేశ్యమ్ అవ్యక్తం పర్యుపాసతే
సర్వత్రగమచింత్యం చ కూటస్థమచలం ధ్రువమ్ 3

శ్లో॥ సంనియమ్యేంద్రియగ్రామం సర్వత్ర సమబుద్ధయః
తే ప్రాప్నువంతి మామేవ సర్వభూతహితే రతాః 4

తు = కాని, యే = ఏ పురుషులు, ఇంద్రియగ్రామమ్ = ఇంద్రియ సముదాయమును, సంనియమ్య = పూర్తిగా వశపరుచుకొని,అచింత్యమ్ = మనస్సుకు, బుద్ధికి గోచరము కానివాడును, సర్వత్రగమ్ = సర్వవ్యాపియైనవాడును, అనిర్దేశ్యమ్ = అనిర్వచనీయమైన స్వరూపము గలవాడును, చ = మరియు, కూటస్థమ్ = సర్వదా ఒకేస్థితిలో ఉండువాడును, ధ్రువమ్ = నిత్యుడును, అచలమ్ = నిశ్చలుడును, అవ్యక్తమ్ = నిరాకారుడును, అయిన, అక్షరమ్ = శాశ్వతుడైన సచ్చిదానంద ఘనబ్రహ్మను, పర్యుపాసతే = ఏకీభావముతో ఉపాసింతురో, సర్వభూతహితేరతాః = సకల ప్రాణులకు హితము చేయగోరువారు, సర్వత్ర సమబుద్ధయః = అన్నిటియందును సమభావము గలవారును అయిన, తే = వారు (యోగులు), మామ్, ఏవ = నన్నే, ప్రాప్నువంతి = పొందుదురు.

తా. సర్వత్రవ్యాపించి యున్నదియు, ఇదమిత్థమని నిర్దేశించుటకు శక్యము కానిదియు, ఇంద్రియములకు గోచరము కాదు కనుక అవ్యక్తమయినదియు కాన చింతించుటకు సైతము శక్యము కానిదియు, సర్వత్ర వ్యాపించి పరిపూర్ణమై యుండుటచే అచలమైనదియు, కావుననే స్థిరమై సత్యమైన బ్రహ్మనుపాసన చేయువారు సర్వేంద్రియములను నిగ్రహించి, దైవముచే సంప్రాప్తములైన యిష్టానిష్టములయందు సమభావము కలవారగుచు, సర్వభూతములకు హితమాచరించుటయందు తత్పరులైనవారు నన్నే పొందుదురు.

వి. *'యేత్వక్షర'* అను శ్లోకమున అక్షరం అవ్యక్తం అను శబ్దములు శుద్ధసత్త్వోపాధిగల కూటస్థునకే వర్తించునని తెలియనగును. ఏలనన. . . గార్గి యాజ్ఞవల్క్య సంవాదమున గార్గిని నిర్గుణ బ్రహ్మను గురించి ప్రశ్నించుట తగదని చెప్పుటచేతను, *'అక్షరాత్పరతః పరం'* అనుట చేతను, అక్షరుడన కూటస్థుడనియు, పర శబ్దము నిర్గుణ పరబ్రహ్మమనియు భావము. కనుక తురీయమున గల సచ్చిదానంద రూపమే బ్రహ్మమనియు అక్షర మనియు చెప్పబడినది.

శ్లో॥ క్లేశోఽధికతరస్తేషాం అవ్యక్తాసక్తచేతసామ్
అవ్యక్తా హి గతిర్దుఃఖం దేహవద్భిరవాప్యతే 5

తేషామ్ = ఆ, అవ్యక్తాసక్తచేతసామ్ = సచ్చిదానంద ఘన నిరాకార బ్రహ్మమునందు, ఆసక్తచిత్తులైన వారికి, క్లేశః = సాధనయందలి శ్రమ, అధికతరః = మిక్కిలి అధికము, హి = ఏలనన, దేహవద్భిః = దేహాభిమానము గలవారిచేత, అవ్యక్తా, గతిః = అవ్యక్త పరబ్రహ్మప్రాప్తి దుఃఖమ్, అవాప్యతే = కష్టసాధ్యమే.

తా.	సర్వత్ర వ్యాపించి అవ్యక్తముగా నున్న నిర్గుణ బ్రహ్మయందు మనస్సును లగ్నము చేయువారికి కష్టమధికతరమైనది. అనగా అవ్యక్తమగు బ్రహ్మమునుపాసించుట సులభతరము కాదని భావము అందుచే అటువంటి అవ్యక్తమైన నిర్గుణ బ్రహ్మపదము దేహాభిమానముగల వారిచే పొందుట శక్యము కాని పని. కాన అక్షర బ్రహ్మోపాసనకంటె సగుణ బ్రహ్మోపాసన కర్తవ్యము.

శ్లో॥ యే తు సర్వాణి కర్మాణి మయి సన్న్యస్య మత్పరాః
అనన్యేనైవ యోగేన మాం ధ్యాయంత ఉపాసతే 6

శ్లో॥ తేషామహం సముద్ధర్తా మృత్యుసంసారసాగరాత్
భవామి నచిరాత్ పార్థ మయ్యావేశితచేతసామ్ 7

యే, తు = ఎవరైతే, మత్పరాః = మత్పరాయణులై, సర్వాణి, కర్మాణి = సమస్త కర్మలను, మయి, సన్న్యస్య = నాకు సమర్పించి, మామ్, ఏవ = సగుణరూప పరమేశ్వరుడనైన నన్నే, అనన్యేన, యోగేన = అనన్యభక్తియోగము ద్వారా, ధ్యాయంతః = నిరంతరము చింతన చేయుచు, ఉపాసతే = ఉపాసింతురో, పార్థ = ఓ అర్జునా!, తేషామ్ = అట్టి, మయి, ఆవేశిత చేతసామ్ = నాయందే లగ్నమైన చిత్తము గలవారికి, అహమ్ = నేను, నచిరాత్ = శీఘ్రముగా, మృత్యుసంసారసాగరాత్ = మృత్యురూప సంసార సాగరము నుండి, సముద్ధర్తా = ఉద్ధరించువాడను, భవామి = అగుదును.

తా.	పరమేశ్వరుడనైన నాయందు సర్వకర్మలనర్పించి నన్నే తమకు ప్రాప్యమైన పరమపదముగా నెంచి ఆత్మ భావమున నన్ను చింతించుచున్న వారు నాయందు తమ చిత్తమును జొప్పించి యుందురు కాన అచిరకాలములో సంసారసాగరమున బడనీయక వారిని ఉద్ధరించువాడనై యుందును.

వి.	'సర్వాణి కర్మాణి మయి సన్న్యస్య' సర్వ కర్మలను నేను చేయుచున్నాను అనే కర్తృత్వ భావనను వదలిన యోగి తన యాత్మ రూపమున స్థితప్రజ్ఞుడగును. అట్టి యాత్మస్థుండగు యోగి జన్మ మరణ ప్రవాహమున బడుట యెట్లు కలుగును. దేహోపాధి నశించినంత ఆత్మ పరమాత్మయందు చేరును.

శ్లో॥ మయ్యేవ మన ఆధత్స్వ మయి బుద్ధిం నివేశయ
నివసిష్యసి మయ్యేవ అత ఊర్ధ్వం న సంశయః 8

మయి = (కనుక) నాయందే, మనః, ఆధత్స్వ = మనస్సును లగ్నము చేయుము, మయి, ఏవ = నాయందే, బుద్ధిమ్ = బుద్ధిని, నివేశయ = నిమగ్నమొనర్పుము, అతః, ఊర్ధ్వమ్ = ఆ పిమ్మట, మయి, ఏవ = నాయందే, నివసిష్యసి = నివసించెదవు, సంశయః, న = ఇందేమాత్రము సంశయము లేదు.

తా. సర్వాత్మ నగు నాయందు నీవు మనోబుద్ధులనుంచుము. అటులైన దేహపాతానంతరము నిస్సంశయముగా నాయందే యుందువు. అనగా సర్వాత్మగా నుందువు.

వి. *శ్లో॥ యత్ర యత్ర మనోయాతి తత్ర తత్ర పరంపదమ్*
*తత్తదేవ పరంబ్రహ్మ సర్వత్రసమవస్థితమ్* *(ఉత్తరగీత)*

సర్వాత్మ యగు వాసుదేవుడే సర్వజగత్తు అని భావించువాడు సమాహితచిత్తుడై సర్వదా ఉండును. కావున వాని మనస్సు జగత్తున ఎందేని సంచరించినను అయ్యది వానికి పరబ్రహ్మ రూపమే కనుక వాడెల్ల కాలముల సమాహిత చిత్తుడే. ఆత్మ సకలోపాధులందు సమముగా నున్నది. ఆత్మస్థానమగు బుద్ధిగుహయందు మనోబుద్ధులనుంచుటచే చిదాత్మ దర్శనసిద్ధి కలుగును. యోగముచే ప్రాణవాయువును భ్రూమధ్య స్థానమున అనగా బుద్ధిగుహయందు నిశ్చల మొనర్చుటయే ఆత్మయందు మనోబుద్ధులుంచుట. అట్లు మనోబుద్ధుల నాత్మయందు స్థిరముగానుంచగల యోగి బ్రహ్మయే యగును. *'బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి'* అను ప్రమాణమున ఆ యోగి బ్రహ్మవేత్త కనుక బ్రహ్మమే.

శ్లో॥ అథ చిత్తం సమాధాతుం న శక్నోషి మయి స్థిరమ్
అభ్యాసయోగేన తతో మామిచ్ఛాప్తుం ధనంజయ 9

అథ = ఒకవేళ, చిత్తమ్ = చిత్తమును, మయి = నాయందు, స్థిరమ్ = స్థిరముగా, సమాధాతుమ్ = నిలుపుటకు, న, శక్నోషి = సమర్థుడవు కానిచో, తతః = అట్టి స్థితిలో, ధనంజయ = ఓ అర్జునా! అభ్యాసయోగేన = అభ్యాస యోగము ద్వారా మామ్, ఆప్తుమ్ = నన్ను పొందుటకు, ఇచ్ఛ = కోరుము (యత్నింపుము)

తా. ఓ అర్జునా! పరమాత్మయందు చిత్తము నిశ్చలము జేయజాలవేని, చిత్తవృత్తి నిరోధమును కలిగించి ఆత్మ దర్శనము చేయించు యోగమును అభ్యసించుచు నన్ను చేరుటకు యత్నింపుము.

శ్లో॥ అభ్యాసేప్యసమర్థోఽసి మత్కర్మపరమో భవ
మదర్థమపి కర్మాణి కుర్వన్ సిద్ధిమవాప్స్యసి 10

అభ్యాసే, అపి = అభ్యాసమునందును, అసమర్థః, అసి = అసమర్థుడవైనచో, మత్కర్మపరమః భవ = మత్పరాయణుడవై కర్మలనాచరింపుము, మదర్థమ్ = నా కొరకై, కర్మాణి = కర్మలను, కుర్వన్, అపి = చేయుచును, సిద్ధిమ్ = నా ప్రాప్తిరూప సిద్ధిని, అవాప్స్యసి = పొందెదవు.

తా. యోగాభ్యాసము చేయనసమర్థుడవైనచో నాయనుగ్రహ కారణములయిన కర్మల నాచరింపుము.

నా నిమిత్తమై కర్మల నాచరించిన సిద్ధిని బడయగలవు.

vi. ‘తచ్చింతనం, తత్కథనం అన్యోన్యం తత్ప్రబోధనమ్’ అనుటచే భగవానుని గూర్చి చింతించుట, ఇతిహాస పురాణముల ద్వారా భగవానుని గూర్చి ఒకరికొకరు చెప్పుకొనుట, భగవద్విషయములు తెలియజెప్పుట వంటివి జ్ఞానాభ్యాస కర్మలు, అట్టి కర్మలే మత్కర్మలు.

శ్లో॥ అథైతదప్యశక్తోఽసి కర్తుం మద్యోగమాశ్రితః
సర్వకర్మఫలత్యాగం తతః కురు యతాత్మవాన్ 11

అథ = ఒకవేళ, మద్యోగమ్ = నా ప్రాప్తిరూప యోగమును, ఆశ్రితః = ఆశ్రయించిన వాడవై, ఏతత్ = ఈ ఉపర్యుక్త సాధనను, కర్తుమ్, అపి = చేయుటకును అశక్తః, అసి = అసమర్థుడవైనచో, తతః = అట్టి స్థితియందు, యతాత్మవాన్ = మనో బుద్ధ్యాదులను వశపరుచుకొన్నవాడవై, సర్వకర్మఫల త్యాగమ్ = సకల కర్మఫల త్యాగమును, కురు = చేయుము.

తా. నాయందు పరాభక్తిని కలిగించు అభ్యాసయోగ మాచరింపనశక్తుడవైన, ఆత్మ నిగ్రహము కలిగి అనాసక్త బుద్ధితో సర్వకర్మల నాచరించుచు ఫలాపేక్షారహితుడవై యుండుము.

శ్లో॥ శ్రేయో హి జ్ఞానమభ్యాసాత్
జ్ఞానాద్ధ్యానం విశిష్యతే
ధ్యానాత్కర్మ ఫలత్యాగః
త్యాగాచ్ఛాంతిరనంతరమ్ 12

అభ్యాసాత్ = తత్త్వము నెరుంగక చేయు అభ్యాసము కంటెను, జ్ఞానమ్ = జ్ఞానము (శాస్త్రజ్ఞానము), శ్రేయః = శ్రేష్ఠమైనది, జ్ఞానాత్ = అనుభవ రహిత శాస్త్రజ్ఞానము కంటెను, ధ్యానమ్ = పరమేశ్వర స్వరూప ధ్యానము, విశిష్యతే = శ్రేష్ఠమైనది, ధ్యానాత్ = ధ్యానము కంటెను, కర్మఫలత్యాగః = సకల కర్మఫల త్యాగము (శ్రేష్ఠము), హి = ఏలనన, త్యాగాత్ = త్యాగము వలన, అనంతరమ్ = వెంటనే, శాంతిః = పరమశాంతి, (లభ్యతే) = లభించును.

తా. ఆత్మానాత్మా వివేక రహితముగా చేయు కేవలాభ్యాసముకంటె తత్త్వమును శాస్త్రమూలమున తెలియుట మేలు. కేవలమైన శాస్త్రజ్ఞానము కంటె పరతత్త్వమును ధ్యానము చేయుట విశేష ఫలదము. ఫలాపేక్షచే చేయు ధ్యానముకంటె సర్వాత్మభావముతో ప్రకృతి వశంబున చేయు కర్మల ఫలమపేక్షింపక త్యాగశీలుడై యుండుట మేలు. అట్టి ఫలత్యాగము వెంటనే శాంతినిచ్చును.

శ్లో॥ అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవ చ
నిర్మమో నిరహంకారః సమదుఃఖసుఖః క్షమీ 13

శ్లో॥ సంతుష్టః సతతం యోగీ యతాత్మా దృఢనిశ్చయః
మయ్యర్పితమనోబుద్ధిః యో మద్భక్తః స మే ప్రియః 14

యః = ఏ పురుషుడు, సర్వభూతానామ్ = సకల ప్రాణుల యందును, అద్వేష్టా = ద్వేషభావమును కలిగియుండడో, మైత్రః, చ = స్వార్థ రహితమైన ప్రేమను కలిగియుండునో కరుణః = హేతు రహిత దయాళువో, ఏవ = అట్లే, నిర్మమః = మమతా రహితుడో, నిరహంకారః = అహంకార లేనివాడో, సమదుఃఖసుఖః = సుఖదుఃఖముల ప్రాప్తియందు సమభావము కలిగియున్నవాడో, క్షమీ = క్షమాగుణము కలవాడో, యోగీ = యోగియై, సతతమ్, సంతుష్టః = సర్వదా సంతుష్టుడైయుండువాడో, యతాత్మా = శరీరేంద్రియ మనస్సులను వశపరచుకొన్నవాడో, దృఢనిశ్చయః = నాయందే నిశ్చయబుద్ధి గలవాడో, మయి = నాయందే, అర్పిత మనోబుద్ధిః = మనోబుద్ధులను అర్పించినవాడో, సః = అట్టి, మద్భక్తః = నా భక్తుడు, మే, ప్రియః = నాకు ఇష్టుడు.

అవ॥ సమ్యగ్దర్శన పరులగు యోగీశ్వరుల లక్షణములను కృష్ణభగవానులు చెప్పుచున్నారు.

తా. మహాత్ములు తమకు పీడను కలుగజేయు ప్రాణులను కూడ ద్వేషించరు. సర్వభూతములను మిత్ర భావమున జూతురు. కావున దుఃఖితుల జూచి దయార్ద్రులగుదురు. అనాత్మయగు దేహమందు మమకారముంచరు. అహంకార వర్జితులయి ప్రాప్తములయిన సుఖదుఃఖాదులందు సమభావము కలిగి యుందురు. శీతాతపాది ద్వంద్వముల సహించుచు క్షమాశీలురయి నిత్యమాత్మయందు రమించుదురు. ఆత్మారాముడగు యోగి, నిత్యము సంతుష్టుడై యుండును. మనస్సును బాహ్యమున వ్యాపింపనీయక ఆత్మ సంయమము కలిగియుందురు. సర్వము బ్రహ్మయే యని నిశ్చయబుద్ధితో యుక్తాత్ములై యుందురు. అట్టివారు మనోబుద్ధులను నాకర్పించిన వారై, ఆత్మేతర విషయ సంకల్పములను చేయరని భావము. అట్టి భక్తుడు నా కిష్టుడు.

వి. 'మయ్యర్పిత మనోబుద్ధిః' మనస్సుకు సంకల్పించుట లక్షణము. మనస్సును పరమపదమందు లగ్నముచేసి పరమానంద సుఖమనుభవింప జేసినచో అల్పసుఖముల నిచ్చు ఇతర విషయముల వైపుకు పోనొల్లదు. అప్పుడే యోగి తన మనోబుద్ధులను ఈశ్వరునియందు అర్పించినవాడగును.

శ్లో॥ యస్మాన్నోద్విజతే లోకో లోకాన్నోద్విజతే చ యః
హర్షామర్షభయోద్వేగైః ముక్తో యః స చ మే ప్రియః 15

యస్మాత్ = ఎవని వలన, లోకః = ఏ ప్రాణియు, న, ఉద్విజతే = ఉద్వేగమునకు గురికాదో, చ= మరియు, యః = ఎవడు (స్వయముగా), లోకాత్ = ఏ ప్రాణివలనను, న, ఉద్విజతే = ఉద్వేగమును పొందడో, చ = అట్లే, యః = ఎవడు, హర్షామర్ష భయోద్వేగైః = హర్షము, ఈర్ష్య, భయము, ఉద్వేగము మొదలగు వాటినుండి, ముక్తః = ముక్తుడో, సః = అట్టి భక్తుడు, మే = నాకు, ప్రియః = ఇష్టుడు.

తా. సమ్యగ్దర్శన నిష్ఠాపరుడగు యోగి లోకమునకు తాపహేతువు కాడు. సర్వాత్మ భావముకల యోగి, క్షమాశీలుడై యుండును కాన సంతాప కారకులయిన లోకులు పెట్టు బాధలను సహించును. కాని తాపము జెందడు. కావున అట్టి మహాత్ముడు దేహాత్మ భావప్రధానమైన భయ క్రోధ సంతోషతాపాదికములచే నంటరానివాడై యుండును. అట్టివాడు నా కిష్టుడైన భక్తుడు.

వి. యోగి సర్వమాత్మయను భావన కలిగి యుండును. కావున ఎవరికైనను భయకారణ మెట్లగును. ద్వంద్వములయెడ సమత్వబుద్ధికల యోగి, సహిష్ణుతా శక్తి నలవరచుకొని, యోగ నిశ్చలుడై ఆత్మారాముడై యుండును. అట్టివాడే నాకు మిక్కిలి ప్రియుడని కృష్ణపరమాత్మ యెరింగించెను.

శ్లో॥ అనపేక్షః శుచిర్దక్షః ఉదాసీనో గతవ్యథః
సర్వారంభపరిత్యాగీ యో మద్భక్తః స మే ప్రియః 16

యః = ఏ పురుషుడు, అనపేక్షః = అపేక్ష లేనివాడో, శుచిః = బాహ్యాభ్యంతరములయందు శుచియైనవాడో, దక్షః = నిపుణుడో, ఉదాసీనః = పక్షపాత రహితుడో, గతవ్యథః = దుఃఖముల నుండి ముక్తుడో, సః = అట్టి, సర్వారంభ పరిత్యాగీ = సమస్త కర్మలయందును కర్తృత్వ అభిమానము లేనివాడైన, మద్భక్తః = నా భక్తుడు, మే = నాకు, ప్రియః = ఇష్టుడు.

తా. సర్వత్ర సమభావము కలిగిన మహాత్ములు బాహ్య వస్తువుల నపేక్షింపరు. నిత్యమాత్మరతులై యుందురు కాన పవిత్రులగుదురు. ఆత్మరతుడై యున్న యోగికి సర్వకార్యారంభములకు హేతువులైన సంకల్పములే కలుగవు కాన సర్వకర్మ పరిత్యాగియగును. కర్తవ్యములగు కృత్యములనేకములున్నచో కాల విలంబము లేక వెంటనే పరిష్కారముచేయ దక్షత కలిగి యుండును. అట్టి యోగి నా భక్తుడు. నాకిష్టుడును వాడే. వానికేవిధమగు బాధ యుండదు.

వి. కోరదగిన యాత్మస్థితి లభించిన యోగి ఇతరములైన కోరికలను తుచ్ఛములని తలచును. కాన కోరదగినదియే యుండదు. కావున అనపేక్షుడు. శుచిమున్నగు విశేషములు సమ్యగ్దర్శన పరుడైన యోగి యెడల సార్థకములు.

శ్లో॥ యో న హృష్యతి న ద్వేష్టి న శోచతి న కాంక్షతి
శుభాశుభపరిత్యాగీ భక్తిమాన్ యః స మే ప్రియః 17

యః = ఎవడు, న, హృష్యతి = ఇష్టప్రాప్తికి పొంగిపోడో, న, ద్వేష్టి = దేనినిగూడ ద్వేషింపడో, న, శోచతి = దేనికినీ విచారపడడో, న, కాంక్షతి = దేనినీ కోరడో, అట్లే, యః = ఎవడైతే, శుభాశుభ పరిత్యాగీ = శుభాశుభ కర్మలను పరిత్యజించిన వాడో, సః = అట్టి, భక్తిమాన్ = భక్తుడు, మే = నాకు, ప్రియః = ఇష్టుడు.

తా. సర్వాత్మ భావముకల యోగికి యిష్టానిష్టములుండవు. కావున ఇష్టప్రాప్తి మూలమైన హర్షము, అనిష్ట ప్రాప్తి మూలమైన ద్వేషము కలుగవని భావము. ఆ రీతిగ ప్రియవస్తు వియోగమున శోకించుటయు, అప్రాప్తమగు వస్తువును కాంక్షించుటయు నుండదు. సర్వము బ్రహ్మయే యని తలచుచు ఆత్మారాముడై శుభాశుభములను వదలినవాడే యగును. ఆ యోగి నాకు ప్రియభక్తుడు.

శ్లో॥ సమః శత్రౌ చ మిత్రే చ తథా మానావమానయోః
శీతోష్ణసుఖదుఃఖేషు సమః సంగవివర్జితః 18

శ్లో॥ తుల్యనిందాస్తుతిర్మౌనీ సంతుష్టో యేన కేనచిత్
అనికేతః స్థిరమతిః భక్తిమాన్ మే ప్రియో నరః 19

శత్రౌ, మిత్రే, చ = శత్రువులయందును, మిత్రులయందును, మాన అవమానయోః = మానావమానములయందును, సమః = సమభావము గలవాడును, తథా = అట్లే, శీతోష్ణ సుఖ దుఃఖేషు = శీతోష్ణములు, సుఖదుఃఖములు మొదలగు ద్వంద్వముల యందును, సమః = సమభావము కలిగియుండువాడును, చ = మరియు, సంగవివర్జితః = ఆసక్తి రహితుడును, తుల్యనిందాస్తుతిః = నిందాస్తుతులను సమానముగా భావించువాడును, మౌనీ = మనన శీలుడును, యేనకేనచిత్ = శరీర నిర్వహణకై ప్రాప్తించిన దానితోడనే, సంతుష్టః = తృప్తిపడు వాడును, అనికేతః = గృహాదులయందు ఎట్టి ఆసక్తియు లేనివాడును, స్థిరమతిః = స్థిరబుద్ధి గలవాడును, భక్తిమాన్, నరః = (ఐన) భక్తుడైనవాడు, మే = నాకు, ప్రియః = ఇష్టుడు.

తా. దేహాభిమానములేక పరబ్రహ్మమే తానుగా నుండగల యోగి, దేహనిమిత్తములగు మానావమానములను, శత్రుత్వ మిత్రత్వములను, శీతోష్ణాది ద్వంద్వములను ఓర్పుతో సహించును. దేహమందు సంగభావ రహితుడై యుండును. వికార శూన్యుడై సమభావమున ఆత్మయందచ్యుతుడై యుండునని భావము. నిత్యము బ్రహ్మయందు నిశ్చలస్థితి గలిగిన యోగి విద్యామూలములైన నిందాస్తుతులందు నిర్వికారుడై యుండి మౌన వ్రతమున నాత్మను చింతించుచు, ప్రారబ్ధవశమున లభ్యములయిన ఆహారాదులచే తృప్తిజెందును. బ్రహ్మభావమునుండి చ్యుతిని జెందక స్థిరమతియై స్థిరముగ నొక యింటనుండనొల్లని యోగి నా యెడల భక్తి కలవాడు. అట్టివాడు నాకిష్టుడు.

వి. 'నిమిషం నిమిషార్థం వా ...... అచలా
కేశవే భక్తిర్విభవైః కింప్రయోజనం' (ఉత్తరగీత)

అను వాక్యానుసారము స్వల్పకాలమైనను ఆత్మ ధ్యానమున ఉన్నవానికి బాహ్యవైభవములతో నిమిత్తములేదు. ప్రాణాయామపరుడగు యోగియే నిశ్చలాత్మస్థితియందుండగలడు. ఆత్మస్థితి లాభానంతరము శీతోష్ణాది ద్వంద్వ సహిష్ణుత కలిగి బాహ్యవస్తు సంగము నశించును కాన యోగనిష్ఠ కర్తవ్యమని భావము.

శ్లో॥ యే తు ధర్మ్యామృతమిదం యథోక్తం పర్యుపాసతే
శ్రద్ధధానా మత్పరమా భక్తాస్తేఽతీవ మే ప్రియాః 20

యే, తు = ఎవరైతే, శ్రద్ధధానాః = శ్రద్ధాయుక్తులై, మత్పరమాః = మత్పరాయణులై, యథా, ఉక్తమ్ = పైన తెల్పబడినట్టి, ఇదమ్ = ఈ, ధర్మ్య అమృతమ్ = ధర్మ్యామృతమును, పర్యుపాసతే = నిష్కామభక్తి భావముతో సేవింతురో, తే, భక్తాః = ఆ భక్తులు, మే = నాకు, అతీవ, ప్రియాః = మిక్కిలి ఇష్టులు.

తా. ఎవరు ధర్మరూపమైనదియు, అమృతత్వము (అమృతస్వరూపమైన ఆత్మతత్త్వమును) కలిగించునది కాన, ఈ అమృత స్వరూపమైన ఆత్మతత్త్వమును నాచే చెప్పబడినట్లు శ్రద్ధగలవారయి సేవించుచు నాయందు భక్తితాత్పర్యములు గలిగియుందురో వారు నా కత్యంత ప్రియులగుచున్నారు.

వి. దేహధారియగు జీవునకు ఆత్మనెరింగి స్వపదమును చేరుకొనుట ధర్మము. స్వపద ప్రాప్తికి గురూపదిష్టమార్గమందు శ్రద్ధ ఆవశ్యకము. ఆత్మపరమాత్మలకు భేదము లేకుండుట సహజమై యుండగా, భేదజ్ఞాన మజ్ఞానలక్షణము. ఆత్మయొక్క యథార్థస్థితిని స్వానుభవమున నెరింగిన తానే పరమాత్మ స్వరూపుడను అను స్థిరబుద్ధి కలుగును. ఈ జ్ఞానము యోగసిద్ధునకే కలుగును. ఆత్మజ్ఞాన నిష్ఠయే

**భక్తి యోగము**

భక్తి. భక్తి కలుగుటకు యోగమునే శరణు పొందవలెను.

ఇట్లు
శ్రీ పరమహంస పరివ్రాజకాచార్యులును,
బ్రహ్మర్షి సద్గురు **శ్రీశ్రీశ్రీ శివానంద భగవత్పూజ్యపాద** శిష్యులును నైన
బ్రహ్మర్షి సద్గురు **శ్రీశ్రీశ్రీ స్వామి రామానంద పరమహంస** వారిచే
రచింపబడిన గీతామృతమను టీక యందు
**భక్తియోగ**మను ద్వాదశాధ్యాయము సమాప్తము.

ఓం శ్రీకృష్ణ పరమాత్మనే నమః

త్రయోదశాధ్యాయము

# క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగము

**అర్జున ఉవాచ :**

శ్లో॥ ప్రకృతిం పురుషంచైవ క్షేత్రం క్షేత్రజ్ఞ మేవ చ
ఏతద్వేదితుమిచ్ఛామి జ్ఞానం జ్ఞేయఞ్చ కేశవ 1

తా. అర్జునుడు కృష్ణునిట్లు ప్రశ్నించెను.. ఓ కేశవా ! ప్రకృతియననేమి ? పురుషుడనయెవరు ?క్షేత్రమనగా నేమి ? క్షేత్రజ్ఞుడని యెవనినందురు ? జ్ఞానమననేమి ? ఏది జ్ఞేయమను విషయములను సమగ్రముగా తెలియగోరుచున్నాను.

వి. కొన్ని గ్రంథములందీ శ్లోకము చెప్పబడలేదు. ఏలయనగా గీతయందు సప్త శత శ్లోకములు (ఏడువందల శ్లోకములు) మాత్రమే కలవని చెప్పుట కలదు. ఈ శ్లోకమును గణనకు తీసి కొనిన ఏడువందల ఒక శ్లోకములు గీతయందుండును. ఈ శ్లోకమును వదలినను, గీతాభావమున లోపము కలుగబోదు. అందుచే ఈ శ్లోకము బహుగీతా గ్రంథములందు కానరాదు.

**శ్రీ భగవానువాచ :**

శ్లో॥ ఇదం శరీరం కౌన్తేయ క్షేత్రమిత్యభిధీయతే
ఏతద్యో వేత్తి తం ప్రాహుః క్షేత్రజ్ఞ ఇతి తద్విదః 2

కౌంతేయ! = ఓ అర్జునా! ఇదమ్, శరీరము = ఈ శరీరము, క్షేత్రమ్, ఇతి = 'క్షేత్రము' అని, అభిధీయతే = పిలువబడును, ఏతత్ = దీనిని గూర్చి, యః వేత్తి = ఎవరు తెలిసికొందురో, తమ్ = అతనిని, క్షేత్రజ్ఞః, ఇతి = 'క్షేత్రజ్ఞుడు' అని, తద్విదః = తత్త్వజ్ఞానులైన వారు, ప్రాహుః = పేర్కొందురు.

తా. శ్రీ కృష్ణభగవానుడర్జునునితో నిట్లనెను. ఓ అర్జునా ! ప్రాణేన్ద్రియ సంఘాతమైన ఈ దేహము కర్మఫలమునకు విషయమైనది. కాన ఈ శరీరము క్షేత్రమని పిలువబడుచున్నది. ఇట్టి శరీరమును, లేక క్షేత్రమును సమగ్రముగా తెలిసిన వానిని క్షేత్రజ్ఞుడని క్షేత్రజ్ఞతత్త్వమెరింగిన జ్ఞానులు పలుకుదురు. పరమేశ్వరునకు స్థానమైనది కనుక శరీరమునకు క్షేత్రమని పేరు.

శ్లో॥ క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి సర్వక్షేత్రేషు భారత
క్షేత్రక్షేత్రజ్ఞయోః జ్ఞానం యత్తత్ జ్ఞానం మతం మమ 3

భారత! = ఓ అర్జునా! సర్వక్షేత్రేషు = క్షేత్రములన్నింటిలో ఉన్న, క్షేత్రజ్ఞమ్ అపి = క్షేత్రజ్ఞుని (పరమేశ్వరుని) గూడ, మామ్ = నన్నుగా (నేనేయని), విద్ధి = ఎఱుంగుము, చ = మఱియు, క్షేత్ర క్షేత్రజ్ఞయోః = క్షేత్ర, క్షేత్రజ్ఞుల యొక్క (ప్రకృతి పురుషుల యొక్క), యత్, జ్ఞానమ్ = ఏ తత్త్వజ్ఞానము గలదో, తత్ = అది, జ్ఞానమ్ (ఇతి) = జ్ఞానము అని, మమ, మతమ్ = నా అభిప్రాయము.

తా. బ్రహ్మ మొదలు స్తంభ పర్యంతముకల సమస్త క్షేత్రములందుండి ఉపాధిగత దోషములంటక యున్న పరమేశ్వరుడనగు నేనే క్షేత్రజ్ఞుడను. క్షేత్ర క్షేత్రజ్ఞుల గూర్చి యథార్థముగా నెరుంగుట జ్ఞానమని నా భావము.

వి. క్షేత్రములనంతములయినను క్షేత్రజ్ఞుడొక్కడే. జలగత చంద్రుడు జలమందలి చాంచల్యముచే అనేక చంద్రులున్నట్లు కనిపించును. వాస్తవమునకు చంద్రుడొక్కడే. అట్లు క్షేత్రములు అనేకములు అయినను ఈశ్వరుడొక్కడే. *'నసభోఘట యోగేన సురాగన్ధేన లిప్యతే"* సురాపూర్ణమై యున్న ఘటముతో నాకాశమంటియున్నను నాకాశమునకు ఘటగత సురాగన్ధ మంటనట్లు సూక్ష్మాతి సూక్ష్మమై యున్న ఆత్మకు లేక క్షేత్రజ్ఞునకు క్షేత్రగత దోషములంటవని భావము.

శ్లో॥ తత్ క్షేత్రం యచ్చ యాదృక్చ యద్వికారి యతశ్చ యత్
స చ యో యత్ప్రభావశ్చ తత్సమాసేన మే శృణు 4

తత్ క్షేత్రమ్ = ఆ క్షేత్రము, యత్, చ = ఏదియో, యాదృక్, చ = ఎటువంటిదో, యద్వికారి = ఎట్టి వికారములు కలదో, యతః, చ, యత్ = దేని నుండి ఉత్పన్నమైనదో (అట్లే), సః, చ = ఆ క్షేత్రజ్ఞుడును, యః = ఎవరో, యత్ప్రభావశ్చ = ఎట్టి ప్రభావము గలవాడో, తత్ = దానిని (ఆ విషయములన్నింటిని), సమాసేన = సంక్షిప్తముగా, మే = నా నుండి, శృణు = వినుము.

తా. క్షేత్రమనగానేది? ఎట్టిది? ఏయే వికారములు కలుగును? ఎందువలన కలుగునను విషయమును, క్షేత్రజ్ఞుడన యెవడు? ఎట్టి ప్రభావము, లేక శక్తులు కలిగి యుండునను విషయము సంక్షేపముగా జెప్పుదును. వినుము.

శ్లో॥ ఋషిభిర్బహుధా గీతం ఛందోభిర్వివిధైః పృథక్
బ్రహ్మసూత్రపదైశ్చైవ హేతుమద్భిర్వినిశ్చితైః 5

ఋషిభిః = (ఈ క్షేత్ర క్షేత్రజ్ఞుల తత్త్వము) ఋషులచేత, బహుధా = అనేక విధములుగా, గీతమ్ = వివరింపబడినది, వివిధైః ఛందోభిః = వివిధములైన వేదమంత్రములద్వారా, పృథక్ = వేర్వేఱుగా, (గీతమ్) = (తెలుపబడినది), చ = అట్లే, వినిశ్చితైః = నిశ్చయాత్మకములైన, హేతుమద్భిః

= సహేతుకములైన, బ్రహ్మసూత్ర పదైః, ఏవ = బ్రహ్మసూత్రపదముల ద్వారాకూడ, (గీతమ్) = చెప్పబడినది.

తా. క్షేత్ర క్షేత్రజ్ఞుల స్వరూప నిర్ణయము వశిష్ఠాది మహర్షులు యుక్తి యుక్తములై సంశయమును పోగొట్టగలిగి నిర్ణయమును తెలుపు బ్రహ్మ సూత్రవాక్యములందును, నానా విధములైన వేదములందును స్పష్టము చేసిరి.

శ్లో॥ మహాభూతాన్యహంకారో బుద్ధి రవ్యక్తమేవ చ
ఇన్ద్రియాణి దశైకం చ పంచ చేన్ద్రియగోచరాః 6

మహాభూతాని = పంచ మహాభూతములు (పృథివ్యాపస్తేజో వాయురాకాశములు), అహంకారః = అహంకారము, బుద్ధిః = బుద్ధి, చ = మరియు, అవ్యక్తమ్, ఏవ = మూలప్రకృతియు, చ = అట్లే, దశ, ఇంద్రియాణి = ఐదు జ్ఞానేంద్రియములు, ఐదు కర్మేంద్రియములు, ఏకమ్ = మనస్సు, చ = మఱియు, పంచ = ఐదు. ఇంద్రియ గోచరాః = ఇంద్రియ విషయములు (శబ్దస్పర్శరూపరసగంధములు)

శ్లో॥ ఇచ్ఛా ద్వేషః సుఖం దుఃఖం సంఘాతశ్చేతనా ధృతిః
ఏతత్ క్షేత్రం సమాసేన సవికారముదాహృతమ్ 7

ఇచ్ఛా = కోరిక, ద్వేషః = ద్వేషము, సుఖమ్ = సుఖము, దుఃఖమ్ = దుఃఖము, సంఘాతః = స్థూలశరీరము, చేతనా = చైతన్యము, ధృతిః = ధృతి, సవికారమ్ = ఉపర్యుక్త వికారములతో గూడినట్టి, ఏతత్ = ఇదియే, క్షేత్రమ్ = క్షేత్రస్వరూపమని, సమాసేన = సంగ్రహముగా, ఉదాహృతమ్ = చెప్పబడినది.

తా. సూక్ష్మములైన పృథివ్యాది పంచ మహాభూతములను, నేను, నాదియను భావములకు మూలమైయున్న యహంకారమును, నిశ్చయకారణమయిన బుద్ధియు, బుద్ధికి కారణమై, అవ్యక్తముగా నున్న ప్రకృతియు (ఈశ్వర మాయ), చైతన్యముతో కూడిన స్థూల శరీరము, త్వక్చక్షుశ్శ్రోత్ర జిహ్వాఘ్రాణేన్ద్రియములును, వాక్పాణి పాదపాయూపస్థలును, అను పది ఇన్ద్రియ గోచరములైన శబ్ద, స్పర్శ, రూప రస, గంధములును, మొత్తము ఇరువది నాలుగు తత్త్వములును, రాగద్వేషములు, సుఖదుఃఖములు, దేహేన్ద్రియాది సంహతియు, మనోవృత్తియు, ధృతియు, క్షేత్రమని వ్యవహరింపబడును.

వి. క్షేత్రము వికారవంతమైనది. కనుక నశించునదియే యగును. కావున వికారవంతమై నశ్వరమైన క్షేత్రము ఆత్మ యనదగదు. ఆత్మ, క్షేత్రముకంటె భిన్నము. క్షేత్రము కంటె క్షేత్రజ్ఞుడు వేరు. 'దేహాదన్యః పరోస్మ్యహమ్'

శ్లో॥ అమానిత్వమదమ్భిత్వం అహింసా క్షాన్తిరార్జవమ్
ఆచార్యోపాసనం శౌచం స్థైర్యమాత్మవినిగ్రహః 8

అమానిత్వమ్ = తానే శ్రేష్ఠుడనను భావము లేకుండుట, అదంభిత్వమ్ = డాంబికము లేకుండుట, అహింసా = ఏ ప్రాణినీ ఏ విధముగను హింసింపకుండుట, క్షాంతిః = క్షమాగుణము, ఆర్జవమ్ = మనోవాక్కులయందు సరళత్వము, ఆచార్యోపాసనమ్ = భక్తిశ్రద్ధలతో గురుజనుల సేవ, శౌచమ్ = బాహ్యాభ్యంతర శుద్ధి, స్థైర్యమ్ = అంతఃకరణ స్థిరత్వము, ఆత్మ వినిగ్రహః = మనస్సు, శరీరేంద్రియముల నిగ్రహము.

అవ. ఈ శ్లోకము మొదలుకొని యైదు శ్లోకములచే జ్ఞాన సాధనములు చెప్పబడినవి.

తా. తనను పొగడుకొనక యుండుట, తన గొప్పతనము ప్రకటించకుండుట, ప్రాణి మాత్రమును హింసింపకయుండుట, పరులు పెట్టు బాధను క్షమించి యూరకుండుట, కపటము లేక ప్రవర్తించుట, గురుదేవుని సేవించుట, శారీరక మానసిక మలములను పోగొట్టుకొనియుండుట, గురూపదిష్టమైన మోక్షమార్గమున శ్రద్ధతో నిష్ఠకలిగియుండుట, మనస్సునంతర్ముఖముచేసి ఇన్ద్రియార్థములను చింతించకుండుట.

శ్లో॥ ఇన్ద్రియార్థేషు వైరాగ్యమనహంకార ఏవ చ
జన్మమృత్యు జరావ్యాధి దుఃఖదోషానుదర్శనమ్ 9

ఇంద్రియార్థేషు = ఇహ పరలోక భోగముల యందును, వైరాగ్యమ్ = ఆసక్తి లేకుండుట, చ = మరియు, అనహంకారః, ఏవ = అహంకార రాహిత్యము, జన్మమృత్యుజరావ్యాధి = జన్మ, మృత్యు, జరా, రోగాదుల యందు, దుఃఖదోషాను దర్శనమ్ = దుఃఖ దోషములను గూర్చి పదే పదే తలంచుట.

తా. ఇన్ద్రియార్థములందిచ్ఛలేకుండుట, ఆత్మేతరమైన దేహాదులందు అహంబుద్ధి కలిగి కర్తృత్వ భోక్తృత్వములను తనపై నాపాదించుకొనకుండుట, జన్మ మృత్యుజరావ్యాధుల వలన కలుగు దుఃఖములను దోషములు దేహము యొక్క దుర్లక్షణముగా భావించుట.

శ్లో॥ అసక్తిరనభిష్వంగః పుత్రదారాగృహాదిషు
నిత్యం చ సమచిత్తత్వం ఇష్టానిష్టోపపత్తిషు 10

పుత్రదారా గృహాదిషు = భార్య పిల్లలు ఇల్లు మొదలగువానియందు, అసక్తిః = ఆసక్తి లేకుండుట, అనభిష్వంగః = మమతా రాహిత్యము, చ = మరియు, ఇష్టానిష్టోపపత్తిషు = ఇష్టానిష్ట వస్తుప్రాప్తినందు, నిత్యమ్ = నిరంతరము, సమచిత్తత్వం = సమభావముతో నుండుట.

తా. ఇన్ద్రియార్థములందు కించిత్తయినను ప్రీతి లేకుండుట, భార్యాపుత్రగృహాదులందు మోహము జెందక అనాసక్తుడయి యుండుట, ఇష్టానిష్టములు ప్రాప్తములైనపుడు నిత్యము సమచిత్తుడై యుండుట.

శ్లో॥ మయిచానన్య యోగేన భక్తిరవ్యభిచారిణీ
వివిక్తదేశ సేవిత్వం అరతిర్జన సంసది 11

మయి = పరమాత్మనైన నాయందు, అనన్య యోగేన = అనన్య యోగము (భగవంతుడే సర్వస్వమని భావించుట) ద్వారా, అవ్యభిచారిణీ, భక్తిః = ధృఢమైన నిశ్చలభక్తి, చ = మరియు, వివిక్తదేశ సేవిత్వమ్ = ఏకాంతమైన పవిత్ర ప్రదేశము నందు నివసించుట, జనసంసది, అరతిః = విషయాసక్తులైన మనుష్య సముదాయమునందు ఆసక్తి లేకుండుట.

తా. పరమేశ్వరుడైన నాయందు నిశ్చలభక్తితో అనన్య యోగమున నుండుట, ('వాసుదేవస్సర్వం' అని భావించుచు సర్వకాలములందు పరమాత్మను భజించుటయే అనన్య యోగము.) భయరహితమై శుచియైన ఏకాన్తస్థలమున నుండుట, ఆత్మభావనా విముఖమైన జనము మధ్యనుండుట కిష్టపడకుండుట.

శ్లో॥ అధ్యాత్మ జ్ఞాననిత్యత్వం తత్త్వజ్ఞానార్థదర్శనమ్
ఏతజ్ఞానమితిప్రోక్తం అజ్ఞానం యదతోన్యథా 12

అధ్యాత్మ జ్ఞాననిత్యత్వమ్ = అధ్యాత్మిక జ్ఞానమునందు నిత్య స్థితుడై ఉండుట, తత్త్వజ్ఞానార్థ దర్శనమ్ = తత్త్వజ్ఞానములకు ప్రతిపాద్యుడు భగవంతుడే యని యెరుంగుట, ఏతత్ = ఇది అంతయును (అమానిత్వము మొదలుకొని తత్త్వ జ్ఞానార్థ దర్శనము వరకు గలదంతయును), జ్ఞానమ్ = జ్ఞానము (జ్ఞాన ప్రాప్తికి సాధనములు), అతః = దీనికంటెను, అన్యథా = వేరుగా, యత్ = ఏది గలదో, (తత్) అజ్ఞానమ్ ఇతి = (అది) అజ్ఞానము అని, ప్రోక్తమ్ = చెప్పబడినది,

తా. ఆత్మతత్త్వచింతాపరుడయి నిత్యముండుట, తత్త్వ జ్ఞానముచే ప్రాప్యమయిన మోక్షము పరమార్థముగా భావించుట యనునవన్నియు జ్ఞానోపాయములు కనుక జ్ఞానమని చెప్పబడినది. చెప్పబడిన దానికంటె వేరైనదంతయు అజ్ఞానమని తెలియుము.

శ్లో॥ జ్ఞేయం యత్తత్ప్రవక్ష్యామి యత్ జ్ఞాత్వామృతమశ్నుతే
అనాదిమత్పరం బ్రహ్మ న సత్తన్నాసదుచ్యతే 13

యత్ = ఏదైతే, జ్ఞేయమ్ = తెలిసికొనదగినదో, యత్ = దేనిని, జ్ఞాత్వా = తెలిసికొని (మనుష్యుడు), అమృతమ్, అశ్నుతే = పరమానందమును పొందునో, తత్ = దానిని, ప్రవక్ష్యామి = చక్కగా తెలిపెదను, తత్ = అది (అతడు), అనాదిమత్ = సనాతనుడైన వాడును, పరమ్, బ్రహ్మ = పరబ్రహ్మము, న, సత్ = సత్తు కాదు, న, అసత్ = అసత్తు కూడా కాదు (సదసత్తులకు అతీతుడు), (ఇతి) ఉచ్యతే = అని చెప్పబడును.

తా. మానవుడేది తెలిసికొనిన అమృతభావమును పొందునో ఆజ్ఞేయమగు దానిని నీకు చెప్పెదను. జ్ఞేయము పరబ్రహ్మ. పరబ్రహ్మ ఆది శూన్యమైనది. ఆది లేనిది కనుక మధ్యభాగము లేనిదికూడ నగును. ఆది మధ్యలు లేనిది యంతము కలిగియుండుట ఎట్లు? కాన బ్రహ్మ ఆది మధ్యాన్త రహితము. జ్ఞేయమగు ఆ బ్రహ్మను సత్ అనికాని అసత్ అనికాని చెప్పుటకు వీలుపడదు. ఇన్ద్రియ గోచరమగు దానినే సత్ యని చెప్పవలయును. బ్రహ్మ ఇన్ద్రియాతీతమయినది కనుక సత్ అను శబ్దముచే వ్యవహరింపబడదు. *'బుద్ధిగ్రాహ్యమతీంద్రియమ్'* అను గీతావాక్యము బ్రహ్మను ఇంద్రియాతీతమైనదిగను, బుద్ధిగ్రాహ్యముగను చెప్పుచున్నది. ఇంద్రియాతీతమయినది కనుక బ్రహ్మ సత్ శబ్దవాచ్యమగుటకు వీలులేనట్లు, బుద్ధిగ్రాహ్యమైనందున అసత్ శబ్దముచే కూడ వ్యవహరింపబడుటకు వీలు లేదు. సత్ అనియు, అసత్ అనియు చెప్పజాలక అనిర్వాచ్యమనుచున్నారు.

శ్లో॥ సర్వతః పాణిపాదం తత్సర్వతోఽక్షిశిరోముఖమ్
సర్వతః శ్రుతిమల్లోకే సర్వమావృత్య తిష్ఠతి 14

తత్ = ఆ పరమాత్మ, సర్వతః = అంతట, పాణిపాదమ్ = చేతులును, పాదములును కలిగియున్నవాడు, సర్వతోఽక్షి శిరోముఖమ్ = అంతటను నేత్రములు, శిరస్సులు, ముఖములు గలవాడు, సర్వతః = అంతటను, శ్రుతిమత్ = చెవులుగలవాడు, యతః = ఎందువలననగా (అతడు), లోకే = లోకమునందు, సర్వమ్ = అంతటను, ఆవృత్య = వ్యాపించి, తిష్ఠతి = స్థితమైయున్నాడు.

తా. జ్ఞేయమగు బ్రహ్మ జగద్రూపమున విజృంభించి సర్వభూతముల రూపమున నున్నది. కనుక ప్రాణులయొక్క కరచరణములు సర్వత్ర ఉన్నవి కాన బ్రహ్మ 'సర్వతః పాణిపాదం' అని చెప్పబడుచున్నది. అట్లే నేత్రములు, శిరస్సు, ముఖములు కూడ సర్వదిక్కులను వ్యాపించియున్నవి. ఇట్లు సర్వత్ర వ్యాపించియున్నది జగన్మయమైన అద్వయమగు బ్రహ్మయే కావున 'సర్వతో ఉక్షి శిరోముఖం' అనియు బ్రహ్మయే చెప్పబడుచున్నది. ఈ విధముగా సర్వము వ్యాపించి యున్నది బ్రహ్మయే. అదియే జ్ఞేయమై యున్నది.

శ్లో॥ సర్వేన్ద్రియగుణాభాసం సర్వేన్ద్రియవివర్జితమ్
అసక్తం సర్వభృచ్చైవ నిర్గుణం గుణభోక్తృ చ 15

సర్వేంద్రియ గుణాభాసం = ఇంద్రియ గ్రాహ్య విషయములనన్నింటినీ ఎరింగినవాడు, సర్వేంద్రియ వివర్జితమ్ = (కాని) వాస్తవముగా ఇంద్రియ రహితుడు,చ = మరియు, అసక్తమ్ ఏవ = ఆసక్తి రహితుడైనను, సర్వభృత్ = సర్వ జగత్తును ధరించి పోషించువాడు, చ = అట్లే, నిర్గుణమ్ = గుణరహితుడైనను, గుణభోక్తృ, చ = గుణములను అనుభవించువాడు.

తా. పైన చెప్పబడినట్లు దేహ ప్రాణేన్ద్రియములను కలిగియున్నట్లున్నను, ఇన్ద్రియాదులందు సక్తముకాక, వాని గుణములతో సంబంధము లేక నిర్గుణమై యుండియు, ఉపాధి ద్వారా సుఖదుఃఖాదులను అనుభవించుచున్నట్లున్న చైతన్యము బ్రహ్మకంటె వేరు కాదు కాన భోక్తయగుచు సర్వజగదాధారమై యున్నది. ఇన్ద్రియములు ఈశ్వర సాన్నిధ్యమున క్రియావంతములగుచున్నవి. కాని యీశ్వరుడిన్ద్రియాదుల యెడ సంగము కలిగియుండలేదు.

శ్లో॥ బహిరన్తశ్చ భూతానామచరం చర మేవ చ
సూక్ష్మత్వాత్తదవిజ్ఞేయం దూరస్థం చాన్తికే చ తత్ 16

భూతానామ్ = చరాచర ప్రాణులన్నింటికి, బహిః, అంతః, చ = బయట, లోపల పరిపూర్ణుడై ఉండువాడు, చరమ్, అచరమ్, ఏవ = చరాచర రూపుడును అతడే, చ = మరియు, తత్ = అతడు, సూక్ష్మత్వాత్ = అతి సూక్ష్మ రూపుడగుట వలన, అవిజ్ఞేయమ్ = తెలిసికొన శక్యముగానివాడు, చ = అట్లే, అంతికే, చ = అతి సమీపమునందును, దూరస్థమ్, తత్, చ = దూరమునందును (ఉండువాడు) అతడే.

తా. సర్వ ప్రాణుల ఉపాధులకు బయట అవ్యక్తముగను లోపల ప్రత్యగాత్మ స్వరూపుడుగను, ఒకచో చరాత్మకముగను, నొకచో అచరాత్మకముగను నున్న బ్రహ్మ జ్ఞేయమైనది. సూక్ష్మాతి సూక్ష్మమగుటచే దూరస్థమగు వస్తువువలె అందరకు తెలియ శక్యముకాక యున్నది. కాని జ్ఞానులకు నెల్లప్పుడును

సమీపస్థమగు వస్తువువలె అపరోక్షానుభూతిచే తెలియదగియున్నది.

శ్లో॥ అవిభక్తం చ భూతేషు విభక్తమివ చ స్థితమ్
భూతభర్తృ చ తత్ జ్ఞేయం గ్రసిష్ణు ప్రభవిష్ణు చ 17

అవిభక్తమ్ = విభాగ రహితుడై పరిపూర్ణుడైయున్నను, భూతేషు = చరాచర ప్రాణుల రూపములలో, విభక్తమ్ = వేర్వేరుగా, ఇవ, స్థితమ్ = ఉన్నట్లు గోచరించువాడును, తత్, జ్ఞేయమ్ = తెలిసికొనదగిన ఆ పరమాత్మ, ప్రభవిష్ణు, చ = బ్రహ్మరూపములో సృష్టి చేయువాడును, భూతభర్తృ, చ = విష్ణురూపములో ప్రాణులను ధరించి, పోషించువాడును, గ్రసిష్ణు, చ = రుద్రరూపములో లయమొనర్చువాడును అయి ఉన్నాడు.

తా. సర్వవ్యాప్తమై అపరిచ్ఛిన్నముగా నున్న బ్రహ్మ, సమస్త ప్రాణులందు పరిచ్ఛిన్నమైనదివలె నున్నది. చరాచర భూతములయొక్క సృష్టి స్థితిలయములకు కారణమై సర్వప్రాణుల కావాసస్థానమైన బ్రహ్మ జ్ఞేయము.

శ్లో॥ జ్యోతిషామపి తజ్జ్యోతిః తమసః పరముచ్యతే
జ్ఞానం జ్ఞేయం జ్ఞానగమ్యం హృది సర్వస్య విష్ఠితమ్ 18

తత్ = ఆ పరబ్రహ్మ, జ్యోతిషామ్, అపి = జ్యోతిస్స్వరూపములన్నింటికిని, జ్యోతిః = పరంజ్యోతి, తమసః, పరమ్ = మాయాతీతుడు అని, ఉచ్యతే = చెప్పబడును, జ్ఞానమ్ = (ఆ పరమాత్మ) జ్ఞాన స్వరూపుడును, జ్ఞేయమ్ = తెలిసికొనదగినవాడును, జ్ఞానగమ్యమ్ = తత్త్వజ్ఞానము ద్వారా ప్రాప్యుడును మరియు, సర్వస్య, హృది = సకల ప్రాణుల హృదయముల యందును, విష్ఠితమ్ = విశేషముగా స్థితమైయుండువాడు.

తా. జ్యోతి రూపమున ప్రకాశించుచు సూర్యచంద్రాదుల కధిష్ఠానమై వెలుగునదియును, తమస్సు లేక అవిద్యకు దూరముగ నుండునదియు సర్వప్రాణుల బుద్ధిగుహయందు విశేషరూపమున నుండు బ్రహ్మమే జ్ఞానరూపముగను పరోక్షజ్ఞానముచే తెలియదగినదిగను, అపరోక్షానుభూతిచే సాక్షాత్కార యోగ్యమైనదిగను నున్నది.

శ్లో॥ ఇతి క్షేత్రం తథా జ్ఞానం జ్ఞేయం చోక్తం సమాసతః
మద్భక్త ఏతద్విజ్ఞాయ మద్భావాయోపపద్యతే 19

ఇతి = ఈ విధముగా, క్షేత్రమ్ = క్షేత్రమును గూర్చియు, తథా = అట్లే, జ్ఞానమ్ = జ్ఞానమును

గూర్చియు, చ = మరియు, జ్ఞేయమ్ = తెలిసికొనదగిన పరమాత్మ స్వరూపమును గూర్చియు, సమాసతః = సంక్షిప్తముగా , ఉక్తం = చెప్పబడినది, మద్భక్తః = నా భక్తుడు, ఏతత్, విజ్ఞాయ = దీనిని సమగ్రముగా తెలిసికొని,మద్భావాయ = నా స్వరూపమునే, ఉపపద్యతే = పొందును.

తా. ఈ విధముగా క్షేత్రస్వరూపమును, జ్ఞానస్వరూపమును, జ్ఞేయ స్వరూపమును సంక్షేపముగా చెప్పితిని. నా భక్తుడిది తెలిసికొని నన్నే చేరుచున్నాడు.అనగా మోక్షమును బొందునని భావము.

శ్లో॥ ప్రకృతిం పురుషం చైవ విద్ధ్యనాదీ ఉభావపి
వికారాంశ్చ గుణాంశ్చైవ విద్ధి ప్రకృతిసంభవాన్ 20

ప్రకృతిమ్ = ప్రకృతిని, చ = మరియు, పురుషమ్ = పురుషుని, ఉభా, ఏవ అనాదీ = ఈ రెండును ఆదిలేనివని, విద్ధి = ఎరుంగుము, చ = మరియు, వికారాన్, చ = రాగద్వేషాది వికారములను, గుణాన్, అపి = సత్త్వరజస్తమో గుణములనూ, ప్రకృతి సంభవాన్, ఏవ = ప్రకృతి నుండియే ఉత్పన్నములైన వానినిగా, విద్ధి = ఎరుంగుము.

తా. అర్జునా ! ప్రకృతి పురుషులిరువురును అనాదిగా ఉన్నవారే యని తెలియుము. ఈ రెండును ఈశ్వరుని ప్రకృతులనియు, జీవునకు కలుగు బుద్ధ్యాది వికారములును, సుఖ దుఃఖాది గుణములను త్రిగుణాత్మికయైన ప్రకృతి నుండి సంభవించునని తెలియుము. ఈ ప్రకృతికి పరమైనవాడే పరమాత్మ. కావున గుణాతీతుడని అసంగుడని చెప్పబడును.

శ్లో॥ కార్యకరణకర్తృత్వే హేతుః ప్రకృతిరుచ్యతే
పురుషః సుఖదుఃఖానాం భోక్తృత్వే హేతురుచ్యతే 21

కార్యకరణకర్తృత్వే = కార్యములను, కరణములను ఉత్పన్నము చేయుటలో, ప్రకృతిః, హేతుః, ఉచ్యతే = ప్రకృతియే హేతువుగా చెప్పబడును, సుఖదుఃఖానామ్, భోక్తృత్వే = సుఖదుఃఖములను అనుభవించుటలో, పురుషః = జీవాత్మయే, హేతుః, ఉచ్యతే = హేతువుగా చెప్పబడుచున్నది.

తా. కార్యమనగా శరీరము. కరణమనగా భోగోపకరణములగు ఇంద్రియములు. అనగా క్షేత్రమని తాత్పర్యము. కార్యకారణాత్మకమైన క్షేత్రమును ఉత్పత్తి చేయునది ప్రకృతి. ఈ క్షేత్రమునందు క్షేత్రజ్ఞుడగు జీవుడు లేక పురుషుడు ప్రకృతి సంభవములైన సుఖదుఃఖాదులనుభవించును. ఇట్లు సుఖదుఃఖానుభవమునకు పురుషుడు హేతువగును.

శ్లో॥ పురుషః ప్రకృతిస్థో హి భుంక్తే ప్రకృతిజాన్ గుణాన్
కారణం గుణసంగోఽస్య సదసద్యోనిజన్మసు 22

ప్రకృతిస్థః = ప్రకృతియందు స్థితుడైన, పురుషః, హి = పురుషుడే, ప్రకృతిజాన్ = ప్రకృతినుండి ఉత్పన్నములైన, గుణాన్ = త్రిగుణాత్మకములైన పదార్థములను, భుంక్తే = అనుభవించును, గుణసంగః = గుణముల సాంగత్యమే, అస్య = ఈ జీవాత్మయొక్క, సదసద్యోని జన్మసు = ఉత్తమాధమ జన్మలకు, కారణమ్ = కారణము.

తా. అవిద్యా రూపమైన మాయయందున్న జీవుడు ప్రకృతి సంభవములైన గుణముల ననుభవించుచున్నాడు. సుఖదుఃఖాది గుణములందు సంగము కలిగి నేను సుఖిని, నేను పండితుడను మొదలగు ప్రకృతి ధర్మముల నాత్మయందారోపించుకొనుచున్నాడు. ఈ బలవత్తరమైన గుణ సంగభావమే దేవమానవ పశుపక్ష్యాది యోనులందు జన్మించుటకు కారణమగుచున్నది.

శ్లో॥ ఉపద్రష్టానుమంతా చ భర్తా భోక్తా మహేశ్వరః
పరమాత్మేతి చాప్యుక్తో దేహేఽస్మిన్ పురుషః పరః 23

అస్మిన్, దేహే = ఈ దేహమునందు, (స్థితః) అపి = స్థితుడైయున్నను, పురుషః = ఆత్మ, పరః, ఏవ = వాస్తవముగా పరమాత్మయే, ఉపద్రష్టా, చ = (అతడే) సాక్షియగుటచే 'ఉపద్రష్ట' అనియు, అనుమంతా = యథార్థముగా సమ్మతిని ఇచ్చువాడు అగుటవలన 'అనుమంత' అనియు, భర్తా = అన్నింటిని ధరించి పోషించువాడగుట వలన 'భర్త' అనియు, భోక్తా = జీవరూపముతో 'భోక్త' అనియు, మహేశ్వరః, చ = బ్రహ్మాదులకును ప్రభువగుటవలన 'మహేశ్వరుడు' అనియు, పరమాత్మ, ఇతి = శుద్ధ సచ్చిదానంద ఘనుడగుట వలన 'పరమాత్మ' అనియు, ఉక్తః = పేర్కొనబడెను.

తా. పరమ పురుషుని సాన్నిధ్యమున దేహేంద్రియాదులు వివిధములగు క్రియాశక్తులు కలవగుచున్నవి. వాస్తవమునకు దేహాదుల యొక్క క్రియలతో పరమాత్మకు ఏ విధముగను సంబంధము లేదు. అయినను లోకమున క్రియా భేదమునననుసరించి పరమపురుషుని బహునామములతో కీర్తించుట జరుగుచున్నది. దేహస్థుడగుచు పరమాత్మ సకల దేహవ్యాపారములను సమీపమునుండి ద్రష్టవలె పరిశీలించువాడు కావున ఉపద్రష్టయనియు అజ్ఞానముచే చేయబడు క్రియలందు సంతోషమును కూర్చువాడు కాన అనుమన్తయనియు, చైతన్యవంతములువలె నుండు దేహేంద్రియాదులను ధారణ చేయువాడు కనుక భర్తయనియు, చైతన్య స్వరూపముచే బుద్ధికి గోచరములగు సర్వ విషయములు

ఆత్మానుభుక్తములైనట్లు స్ఫురించును కాన భోక్తయనియు, సర్వభూతములకాత్మయై భూతముల శుభాశుభగతులకు కారణమైనవాడుగాన మహేశ్వరుడనియు జీవాత్మకంటె విలక్షణుడు కావున పరమాత్మయనియు, దేహమున భోక్తగా భావింపబడు జీవాత్మకంటె ఉత్తముడు కాన పరమ పురుషుడు లేక పురుషోత్తముడనియు ఆత్మ కీర్తింపబడును.

శ్లో॥ య ఏవం వేత్తి పురుషం ప్రకృతిం చ గుణైస్సహ
సర్వథా వర్తమానోఽపి న స భూయోఽభిజాయతే 24

ఏవమ్ = ఈ విధముగా, పురుషమ్ = పురుషుని, చ = మరియు, గుణైః సహ = త్రిగుణ సహితముగా, ప్రకృతిమ్ = ప్రకృతిని, యః = ఏ మనుష్యుడు, వేత్తి = యథార్థముగా తెలిసికొనునో, సః = అతడు, సర్వథా = అన్ని విధములుగా, వర్తమానః, అపి = కర్తవ్య కర్మలను చేయుచున్నను, భూయః = మరల, న అభిజాయతే = జన్మింపడు.

తా. ప్రకృతిని విక్రియావంతముగను, పురుషుని ప్రకృతికంటె విలక్షణమైన వానినిగను, అనగా వికార రహితుడనియు అసంగుడనియు తెలిసినవాడు గుణలక్షణములైన ఆయా క్రియ లాచరించుచున్నను, సంగవర్జితుడయి వికారవశుడు కాక యుండును. అట్టివాడు మరల జన్మించడు.

వి. 'క్షీయన్తే చాస్యకర్మాణి తస్మిన్ దృష్టేపరావరే' అను శృతి ననుసరించి పరాత్పరుని తెలిసికొనినవానికి కర్మలు బంధహేతువులు కావని భావన.

శ్లో॥ ధ్యానేనాత్మని పశ్యంతి కేచిదాత్మానమాత్మనా
అన్యే సాంఖ్యేన యోగేన కర్మయోగేన చాపరే 25

ఆత్మానమ్ = పరమాత్మను, కేచిత్ = కొందరు పురుషులు, ఆత్మనా = శుద్ధమైన సూక్ష్మబుద్ధితో, ధ్యానేన = ధ్యానయోగము ద్వారా, ఆత్మని = హృదయము నందు (హృదయముల యందు), పశ్యంతి = చూచెదరు, అన్యే = మరికొందరు, సాంఖ్యేన, యోగేన, చ = జ్ఞాన (సాంఖ్య) యోగము ద్వారాను మరియు, అపరే = మరికొందరు, కర్మయోగేన = కర్మయోగము ద్వారాన, పశ్యంతి = చూచెదరు (పొందెదరు).

తా. కొందరు ప్రత్యగాత్మ స్వరూపుడగు ఆత్మను ధ్యానించుచు పరిశుద్ధాంతఃకరణులయి బుద్ధియందు చూచుచున్నారు. మరికొందరు సాంఖ్యయోగముచే ఆత్మను దర్శించగలుగుచున్నారు. ముముక్షువులయ్యును విక్షేపావరణ శక్తులు గలవారైన కారణమున తత్త్వ విచారానర్హులగుదురు. అట్టివారు కర్మయోగము మూలమున జ్ఞానులయి ఆత్మసాక్షాత్కారము పొందగలుగుదురు.

వి. 'కర్మయోగేనచా పరే' కర్మయోగమనగా మనస్సునంతర్ముఖము చేయు కర్మద్వారా అంతఃకరణ శుద్ధి కలిగి ఈశ్వర ధ్యానార్హతను గడించునది. చిత్తవృత్తి నిరోధము కలిగించునది ప్రాణాయామము కాన ప్రాణాయామరూప యోగము ఆత్మ సాక్షాత్కారోపాయము. మనస్సును బహిర్ముఖము చేయు కర్మలు. ఆత్మ దర్శనోపాయములు కానేరవు. కాన ఆ కర్మలు బంధ హేతువులు. 'కర్మణాబధ్యతే జంతుః' కర్మ బంధ హేతువగుచు జనన మరణములను కలిగించును. 'ముముక్షుభిః ప్రాణజయః కర్తవ్యో మోక్ష హేతవే' అనుటచేత మోక్షార్థులకు ప్రాణజయ మవశ్య కర్తవ్యమని చెప్పబడినది. ఈ ప్రమాణద్వయముచే 'కర్మయోగేన' అనుచోట కర్మ శబ్దమునకు తత్త్వదర్శనోపాయమగు ప్రాణాయామరూప కర్మయని తెలియనగును. 'యోగయుక్తో విశుద్ధాత్మా విజితాత్మా జితేంద్రియః' యోగముచే అంతఃకరణ శుద్ధియు, మనోజయమును, ఇంద్రియ సంయమమును, కలుగునని చెప్పు ప్రమాణములు శిరోధార్యములు.

శ్లో॥ అన్యే త్వేవమజానంతః శ్రుత్వాన్యేభ్య ఉపాసతే
తేఽ పి చాతితరంత్యేవ మృత్యుం శ్రుతిపరాయణాః 26

తు = కాని, అన్యే = వీరికంటెను వేరైన మందబుద్ధులు, ఏవమ్ = ఈ విధముగా, అజ్ఞానంతః = తెలిసికొననివారై, అన్యేభ్యః = ఇతరుల నుండి (తత్త్వజ్ఞానులైనవారి నుండి), శ్రుత్వా = విని, ఉపాసనే = తదనుసారముగా ఉపాసింతురు, చ = మరియు, శ్రుతి పరాయణాః = శ్రవణ పరాయణులైన, తే, అపి = వారును, మృత్యుమ్ = మృత్యురూప సంసారమును, అతితరంతి, ఏవ = నిస్సందేహముగా దాటుదురు

తా. కొందరు ముముక్షువులు తత్త్వమును తెలియనివారయి ఇతరుల ద్వారా విని యాత్మ చింతారతులగుదురు. పెద్దల వలన తత్త్వ శుశ్రూషాపరులైన వారుకూడ జన్మ జరామృత్యుభయములతో కూడియున్న సంసారము నుండి తరించుచున్నారు.

శ్లో॥ యావత్సంజాయతే కించిత్ సత్త్వం స్థావరజంగమమ్
క్షేత్రక్షేత్రజ్ఞసంయోగాత్ తద్విద్ధి భరతర్షభ 27

భరతర్షభ = ఓ అర్జునా! స్థావరజంగమమ్ = చరాచరాత్మకమైన, సత్త్వమ్ = ప్రాణి, యావత్, కించిత్ = ఏదేది, సంజాయతే = పుట్టుచున్నదో, తత్ = అది (ఆ ప్రాణి సముదాయము), క్షేత్రక్షేత్రజ్ఞ సంయోగాత్ = క్షేత్ర క్షేత్రజ్ఞ సంయోగము వలననే, విద్ధి = (కలుగునని) ఎరుంగుము.

తా. భరతకుల శ్రేష్ఠా ! అర్జునా ! స్థావరముగా నున్న ప్రాణియైనను, జంగమమగు (తిరుగునట్టిది)

ప్రాణియైనను ఏ జీవునకైనను క్షేత్రక్షేత్రజ్ఞుల సంయోగము వలననే ఉత్పత్తి కలుగునని తెలియుము.

వి. క్షేత్రక్షేత్రజ్ఞులు ప్రకృతి పురుషులనబడుదురు. వీరిద్దరి సంయోగము సృష్టికి కారణము.

శ్లో॥ సమం సర్వేషు భూతేషు తిష్ఠంతం పరమేశ్వరమ్
వినశ్యత్స్వవినశ్యంతం యః పశ్యతి స పశ్యతి 28

యః = ఎవడు, వినశ్యత్సు = నశించుచున్నట్టి, సర్వేషు, భూతేషు = సమస్త చరాచర భూతములయందు, అవినశ్యంతమ్ = నాశరహితుడైన, పరమేశ్వరమ్ = పరమేశ్వరుని, సమమ్, తిష్ఠంతమ్ = సమభావముతో ఉన్నవానినిగా, పశ్యతి = చూచునో, సః = అతడే, పశ్యతి = (నిజముగా) చూచువాడు.

తా. ప్రాణులనేక విధములుగా నుండుటచే వానియందు గల భేదము కూడ వివిధమై యున్నది. ఈ భిన్న భిన్నములుగా నున్న భూతములందు పరమేశ్వరుడై యున్న ప్రత్యగాత్మ సమమై అనగా ఏకరూపమై యున్నది. సమస్త ప్రాణులు నశ్వరములై యున్నను వానియందవ్యయుడై యున్న పరమాత్మను చూచినవాడే సమ్యగ్దర్శన శీలుడని చెప్పనగును.

వి. 'కర్మణ్య కర్మయఃపశ్యేత్' అను శ్లోకమునకూడ సమ్యగ్దర్శనము స్తుతించబడినది. సర్వము ఆత్మయే యను భావము కలుగుటకు యోగమే శరణ్యము.

శ్లో॥ సమం పశ్యన్ హి సర్వత్ర సమవస్థితమీశ్వరమ్
న హినస్త్యాత్మనాత్మానం తతో యాతి పరాం గతిమ్ 29

హి = ఏలననగా, సర్వత్ర = (అతడు) అన్నింటియందును, సమవస్థితమ్ = సమభావముతో స్థితుడైన, ఈశ్వరమ్ = పరమేశ్వరుని, సమమ్, పశ్యన్ = సమానముగా చూచుచు, ఆత్మనా = తనద్వారా, ఆత్మానమ్ = తనను, న, హినస్తి = నాశమొందించుకొనడు, తతః = అందువలన (అతడు), పరామ్, గతిమ్ = పరమగతిని, యాతి = పొందును.

తా. బ్రహ్మ మొదలు స్థావరము వరకు నున్న సమస్త ప్రాణులందు తుల్య రూపమున నున్న పరమేశ్వరుని చూచువాడు ఆత్మను హింసించువాడు కాదు అనగా సమదర్శి ఆత్మహత్యా దోషమును పొందడు. సర్వత్ర సమభావమున నుండువాడు సర్వకాలములందీశ్వరుని సేవించువాడగును. అందుచేత పరమ పదమును పొందును.

వి. 'నహినస్త్యాత్మ నాత్మానం' దేహమే తానుగా భావించి అజ్ఞాని స్వయంకృతములైన ధర్మాధర్మముల మూలమున పలుమారులు దేహమును వదలి దేహాంతరము స్వీకరించును. ఇట్లు దేహములు నశించుటకు (మరణము) తానే కారణము కనుక ఆత్మహింసకు డగుచున్నాడు. జ్ఞాని అనగా సమ్యగ్దర్శన సమ్పన్నుడగు యోగి అజ్ఞానివలె దేహమునాత్మగా భావింపడు. ఆత్మను నిత్యమైనదిగను, నవ్యయమైనదిగను తలచును. కనుక యోగికి ఆత్మహత్యా దోషము కలుగదు.

శ్లో॥ ప్రకృత్యైవ చ కర్మాణి క్రియమాణాని సర్వశః
యః పశ్యతి తథాత్మానమ్ అకర్తారం స పశ్యతి 30

చ మరియు, యః = ఏ పురుషుడు, కర్మాణి = సర్వకర్మలు, సర్వశః = అన్ని విధముల, ప్రకృత్య, ఏవ = ప్రకృతి చేతనే, క్రియమాణాని = చేయబడుచున్నట్లు, పశ్యతి = చూచునో, తథా = అట్లే, ఆత్మానమ్ = ఆత్మను, అకర్తారమ్ = అకర్తనుగా (కర్తకానివానినిగా), పశ్యతి = భావించునో, సః = అతడు, (పశ్యతి) = (నిజముగా) చూచువాడు,

తా. పరమేశ్వర మాయకు ప్రకృతి యని పేరు. ప్రకృతి త్రిగుణాత్మకము.సత్త్వ రజస్తమో గుణముల లక్షణములు ప్రకృతి వికారములు. ఈ గుణముల మూలమున సర్వ కర్మలు ప్రకృతిచే చేయబడుచున్నవి. కావున సర్వ వ్యవహారములకు ప్రకృతిని కర్తగా భావించవలెను. కాని ఆత్మను కర్తగా భావించుట అజ్ఞానమగును. కనుక ఆత్మ కర్తకాదని గ్రహించినవాడే పరమార్థదర్శి. వాడే యోగి.

శ్లో॥ యదా భూతపృథగ్భావమ్ ఏకస్థమనుపశ్యతి
తత ఏవ చ విస్తారం బ్రహ్మ సంపద్యతే తదా 31

యదా = ఎప్పుడైతే ( ఏ క్షణమున), భూత పృథగ్భావమ్ = వేర్వేరుగా గోచరించుచున్న ప్రాణులన్నియును, ఏకస్థమ్ = ఒకే పరమాత్మయందు స్థితమైన వానినిగా, చ = మరియు, తతః, ఏవ = ఆ పరమాత్మనుండియే, విస్తారమ్ = విస్తరించుచున్న వానినిగా అనుపశ్యతి = (ఈ పురుషుడు) చూచునో, తదా = ఆ క్షణమునందే (అతడు),బ్రహ్మ = సచ్చిదానంద ఘనబ్రహ్మను సంపద్యతే = పొందును

తా. వివిధములుగ కనపడు భూతములన్నిటికి ఆధారమైనది ఏకరూపమయిన ఆత్మ. వైవిధ్యము ప్రకృతి గతమైయున్నది. ఆత్మయందు వైవిధ్యములేదు. ఆత్మయే జగద్రూపమున విస్తరించియున్నది. అందుచేతనే 'ఆత్మై వేదం సర్వం' యని చెప్పబడుచున్నది. ఇట్లు సర్వాత్మ భావముకల యోగి బ్రహ్మయే యగుచున్నాడు.

శ్లో॥ అనాదిత్వాన్నిర్గుణత్వాత్ పరమాత్మాయమవ్యయః
శరీరస్థోఽపి కౌంతేయ న కరోతి న లిప్యతే 32

కౌంతేయ = ఓ అర్జునా! అనాదిత్వాత్ = అనాదియగుటవలన, నిర్గుణత్వాత్ =నిర్గుణుడగుటవలనను, అవ్యయః = నాశరహితుడైన, అయమ్ పరమాత్మ = ఈ పరమాత్మ, శరీరస్థః, అపి = శరీరమునందున్నప్పటికిని, న, కరోతి = వాస్తవముగా ఏమియును చేయడు, న, లిప్యతే = లిప్యుడును కాడు.

తా. స్వయం ప్రకాశమై స్వయముగా సత్త (ఉనికి) కలిగియున్న ఆత్మకారణ రహితమైనది. కాన యాత్మ ఆది రహితమైనది. ఒక కారణముచే కలిగిన ప్రతి కార్యము వికృతి కలిగి నశించు స్వభావము కలిగియుండును. ఆత్మ అనాది యగుటచే అవ్యయమని కనుకనే శాశ్వతమయినదని చెప్పబడుచున్నది. ఆత్మ గుణవర్జితము. సగుణమైన వస్తువు గుణములు వ్యయమైనచో వికృతి జెందును. ఆది వర్జితుడయి, గుణవర్జితుడయిన పరమాత్మ శరీరస్థమై యున్నను, శరీరగత గుణదోషములనంటక యుండును.

వి. పరమాత్మ సర్వత్ర యుండువాడు కాన ప్రకృతిచే నిర్మితములగుచున్న శరీరములందు కూడ పరమాత్మ వ్యాపించియున్నాడు. అందువలన పరమాత్మ శరీరమున ప్రవేశించెననియు, నిష్క్రమించెననియు చెప్పుట వ్యవహారమునకు మాత్రమే రుచించును.

శ్లో॥ యథా సర్వగతం సౌక్ష్మ్యాత్ ఆకాశం నోపలిప్యతే
సర్వత్రావస్థితో దేహే తథాత్మా నోపలిప్యతే 33

యథా = ఏ విధముగా, సర్వగతమ్ = సర్వత్రా వ్యాపించిన, ఆకాశమ్ = ఆకాశము, సౌక్ష్మ్యాత్ = సూక్ష్మమగుటవలన, న, ఉపలిప్యతే = గుణదోషములచే లిప్తముకాదో, తథా = అట్లే , దేహే = దేహమునందు, సర్వత్ర, అవస్థితః = అంతటను వ్యాపించియున్నను, ఆత్మా = ఆత్మ (నిర్గుణమగుటచే), న, ఉపలిప్యతే = దేహముయొక్క గుణములతో లిప్తముకాదు.

తా. సర్వత్ర వ్యాపించియున్నను సూక్ష్మాతి సూక్ష్మమైనందువలన ఆకాశము దేనిని అంటక యున్నట్లు దేహమందు ఆపాద మస్తకము వ్యాపించి యున్నను, ఆత్మకు శరీర గత గుణదోషములతో సంసర్గము లేదని భావము.

శ్లో॥ యథా ప్రకాశయత్యేకః కృత్స్నం లోకమిమం రవిః
క్షేత్రం క్షేత్రీ తథా కృత్స్నం ప్రకాశయతి భారత 34

భారత = ఓ అర్జునా! యథా = ఏ విధముగా, ఏకః, రవిః = ఒకే సూర్యుడు, ఇమమ్, కృత్స్నమ్, లోకమ్ = ఈ సమస్త లోకమును, ప్రకాశయతి = ప్రకాశింపజేయునో, తథా = అట్లే , క్షేత్రీ = ఒకే ఆత్మ, కృత్స్నమ్, క్షేత్రమ్, ప్రకాశయతి = సర్వ ప్రాణులలో స్థితమైయుండి వాటిని ప్రకాశింపజేయును.

తా. సూర్యుడొక్కడే యీ లోకము నంతను ప్రకాశింపజేయు విధమున క్షేత్రజ్ఞుడగు పురుషుడే (ఆత్మ) క్షేత్రమునంతను ప్రకాశింప చేయుచున్నాడు.

వి. సూర్యునకు, లోకమునంతను ప్రకాశింపజేయుచున్నను, లోకము యొక్క హాని వృద్ధులతో ఏమాత్రము సంగములేనట్లు, శరీరస్థుడయి యున్న ఆత్మ, సమస్త దేహ వ్యాపారములతోను, దేహముయొక్క హాని వృద్ధులతోను సంబంధము లేక నిరంజనుడు, నిర్వికారుడై యుండును.

శ్లో॥ క్షేత్రక్షేత్రజ్ఞయోరేవమ్ అంతరం జ్ఞానచక్షుషా
భూతప్రకృతిమోక్షం చ యే విదుర్యాంతి తే పరమ్ 35

ఏవమ్ = ఈ విధముగా, క్షేత్ర, క్షేత్రజ్ఞయోః = క్షేత్రజ్ఞుల మధ్యగల, అంతరమ్ = భేదమును, చ = మరియు, భూతప్రకృతిమోక్షమ్ = కార్యసహిత ప్రకృతి నుండి ముక్తులగు ఉపాయములును, యే = ఏ పురుషులైతే, జ్ఞానచక్షుషా = జ్ఞాననేత్రముల ద్వారా, విదుః = తెలిసికొందురో, తే = అట్టి మహాత్ములు, పరమ్ = పరబ్రహ్మ పరమాత్మను, యాంతి = పొందుదురు.

తా. క్షేత్రమునకు, క్షేత్రజ్ఞునకు గల యథోక్త వైలక్షణ్యమును, భూతముల ప్రకృతి నుండి అనగా మాయనుండి బంధము కలుగకుండు విధమును అనగా యోగమును, శాస్త్రముల వలనను, గురూపదేశమువలనను వికసింపబడిన జ్ఞాన నేత్రము ద్వారా తెలిసినవారు పరమపదమును చేరుదురు.

ఇట్లు
శ్రీ పరమహంస పరివ్రాజకాచార్యులును,
బ్రహ్మర్షి సద్గురు **శ్రీశ్రీశ్రీ శివానంద భగవత్పూజ్యపాద** శిష్యులును నైన
బ్రహ్మర్షి సద్గురు **శ్రీశ్రీశ్రీ స్వామి రామానంద పరమహంస** వారిచే
రచింపబడిన గీతామృతమను టీక యందు
**క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగ**మను త్రయోదశాధ్యాయము సమాప్తము.

ఓం శ్రీకృష్ణ పరమాత్మనే నమః

చతుర్దశాధ్యాయము

# గుణత్రయ విభాగ యోగము

**శ్రీ భగవానువాచ:**

శ్లో॥ పరమ్ భూయః ప్రవక్ష్యామి జ్ఞానానాం జ్ఞానముత్తమమ్
యద్ జ్ఞాత్వా మునయః సర్వే పరాం సిద్ధిమితో గతాః 1

యత్, జ్ఞాత్వా = దేనిని తెలిసికొనినందువలన, సర్వే, మునయః = మునులందరును, ఇతః = ఈ సంసారము నుండి (ముక్తులై), పరామ్, సిద్ధిమ్ = పరమ సిద్ధిని, గతాః = పొందిరో అట్టి, జ్ఞానానామ్ = జ్ఞానములన్నింటిలోను, ఉత్తమమ్ = అత్యుత్తమమైనట్టి, పరమ్, జ్ఞానమ్ = పరమ జ్ఞానమును గూర్చి, భూయః = మరల (నేను), ప్రవక్ష్యామి = చెప్పెదను.

తా. శ్రీ కృష్ణపరమాత్మ అర్జునునితో నిట్లు పలికెను. అర్జునా! జ్ఞానములన్నిటను శ్రేష్ఠమై ఉత్తమ ఫలమునిచ్చు ఆత్మజ్ఞానమును మరల నీకు చెప్పెదను. ఉత్తమమైన ఆత్మతత్త్వ జ్ఞానము కలిగిన మునులందరు కర్మబంధ మోక్షరూపమగు సిద్ధిని పొందిరి.

వి. జ్ఞానములనేకములుగా నున్నవి. పరమార్థ జ్ఞానమే అన్నిటియందు ఉత్తమము.

శ్లో॥ ఇదం జ్ఞానముపాశ్రిత్య మమ సాధర్మ్యమాగతాః
సర్గేఽపి నోపజాయంతే ప్రలయే న వ్యథంతి చ 2

ఇదమ్, జ్ఞానమ్ = ఈ జ్ఞానమును, ఉపాశ్రిత్య = ఆశ్రయించి, మమ, సాధర్మ్యమ్ = నా స్వరూపమునే, ఆగతాః = పొందినవారు, సర్గే = సృష్ట్యాదియందు, న, ఉపజాయంతే = మరల ఉత్పన్నులు కారు, చ = మరియు, ప్రలయే, అపి = ప్రళయ కాలమునందును, న వ్యథంతి = వ్యాకులతనొందరు.

తా. యథోక్తమైనదియు, జ్ఞానసాధన మైనదియునగు యోగము నాశ్రయించి నన్ను చేరినవారికి సృష్టికాలమున కూడ పునర్జన్మ యుండదు. అట్లే ప్రళయ కాలమున మరల స్వపదచ్యుతియు కలుగనేరదు.

వి. *'బ్రహ్మవిత్ బ్రహ్మైవభవతి'* అను ప్రమాణముచే పరమాత్మను చేరిన వారు పరమాత్మయే కాన ఎన్నడును జన్మ మరణముల నొందరని భావము.

శ్లో॥ మమ యోనిర్మహత్ బ్రహ్మ తస్మిన్ గర్భం దధామ్యహమ్
సంభవః సర్వభూతానాం తతో భవతి భారత 3

భారత = ఓ అర్జునా! బ్రహ్మ మహత్ = మహద్బ్రహ్మరూపమైన నా మూలప్రకృతి లేక మాయ, మమ యోనిః = సకల భూతములకును యోని, అనగా జన్మస్థానము, అహమ్ = నేను తస్మిన్ = దానియందు, గర్భమ్ = చేతన సముదాయరూప గర్భమును (బీజమును), దధామి = ఉంచెదను, తతః = ఆ జడచేతన సంయోగము వలన, సర్వ భూతానామ్ = సకల, ప్రాణులయొక్క సంభవః, భవతి = ఉత్పత్తి జరుగును

తా. పరమేశ్వరుడనైన నాకు త్రిగుణాత్మకమైన ప్రకృతి (మాయ) సృష్టికి యుపకరణమైయున్నది. కావున సర్వభూతముల సృష్టి మాయచే జరుగుచున్నది. ఇచ్చట బ్రహ్మశబ్దమునకు నానా రూపములతో విజృంభించునట్టి మాయ అనియర్థము. అట్టి మాయ యందు నా యంశము నుంచిననే సకల భూతసృష్టి కలుగుచున్నది. అనగా ప్రకృతి స్వయంశక్తి లేనిదని భావము.

శ్లో॥ సర్వయోనిషు కౌంతేయ మూర్తయః సంభవంతి యాః
తాసాం బ్రహ్మ మహత్ యోనిః అహం బీజప్రదః పితా 4

కౌంతేయ = ఓ అర్జునా! సర్వయోనిషు = నానా యోనులయందు, యాః, మూర్తయః = ఏ ప్రాణులు, సంభవంతి = పుట్టుచున్నవో, తాసామ్ = వాటన్నింటికిని, మహద్బ్రహ్మ = మూలప్రకృతియే, యోనిః = జన్మను ఇచ్చెడి తల్లి, అహమ్ = నేను, బీజప్రదః = బీజమునుంచునట్టి , పితా = తండ్రిని.

తా. దేవ పితృ మనుష్యాది సకలజాతులందు ఉత్పత్తి నొందు భూతములన్నిటికిని ఉత్పత్తి స్థానము త్రిగుణాత్మకమైన మాయయే. ఆ మాయకు లేక ప్రకృతికి భూతముల నుత్పత్తి చేయు శక్తి నావలననే కలుగుచున్నది. అందుచే నన్ను 'జగత్పిత' యందురు. ఇట్లు భగవానుడర్జునునితో పలికెను.

శ్లో॥ సత్వం రజస్తమ ఇతి గుణాః ప్రకృతి సంభవాః
నిబధ్నంతి మహాబాహో దేహే దేహినమవ్యయమ్ 5

మహాబాహో = ఓ అర్జునా! సత్త్వమ్ = సత్త్వగుణము, రజః = రజోగుణము, తమః, ఇతి = తమోగుణము, అను, ప్రకృతి సంభవాః = ప్రకృతినుండి ఉత్పన్నములైన, గుణాః = మూడు గుణములు, అవ్యయమ్ = వినాశ రహితుడైన, దేహినమ్ = జీవాత్మను , దేహే = శరీరమునందు, నిబధ్నంతి = బంధించుచున్నవి.

తా. ప్రకృతి వలన అనగా ఈశ్వరమాయ వలన సత్త్వ రజస్తమో గుణములు కలుగును. సత్త్వాది గుణ లక్షణమగు ప్రకృతి క్షేత్రజ్ఞుని గుణముల మూలమున బంధించుచున్నట్లుండును.

వి. నిజమునకు క్షేత్రజ్ఞుడు ఈశ్వరునికంటె వేరు కాదు. కావున ఈశ్వరునివలె క్షేత్రజ్ఞుడును గుణాతీతుడే సందియము లేదు. అందుచేత 'సమేకం పరబ్రహ్మకోమోక్షః కాచ బంధనా' అను ప్రమాణము మోక్షబంధములు లేవనియు సర్వము పరబ్రహ్మమేయనియు చెప్పుచున్నది. కావున క్షేత్రజ్ఞుడవ్యయుడని చెప్పబడినది. వికారములేని వాడయ్యును వికారము కలిగినట్లుండుట మాయాకార్యము. కనుకనే 'బ్రహ్మణి జీవత్వం వీక్షమాణే న పశ్యతి' అను ప్రమాణము కలదు. బ్రహ్మకు జీవభావము విచారించగా లేదనియే గ్రహించవలెను. మాయా ప్రభావమును తొలగించుకొనుటకు యోగనిష్ఠయే శరణ్యము.

శ్లో॥ తత్ర సత్త్వం నిర్మలత్వాత్ ప్రకాశకమనామయమ్
సుఖసంగేన బధ్నాతి జ్ఞానసంగేన చానఘ 6

అనఘా = ఓ పాపరహితుడా, తత్ర = ఈ మూడు గుణములయందు, సత్త్వమ్ = సత్త్వగుణము, నిర్మలత్వాత్ = నిర్మలమగుట వలన, ప్రకాశకమ్ = ప్రకాశమును (జ్ఞానమును) ఇచ్చునది, అనామయమ్ = మరియు వికార రహితమైనది (కాని అది), సుఖసంగేన = సుఖ సాంగత్యముతో, చ = మరియు, జ్ఞానసంగేన = జ్ఞానాభిమానముతో, బధ్నాతి = జీవుని బంధించును.

తా. పాపరహితుడవైన ఓ అర్జునా ! సత్త్వ గుణము నిర్మలమయినదగుటచే సర్వమును ప్రకాశింపజేయుచు ఉపద్రవ రహితమై యున్నది. కాని ఈ సత్త్వ గుణముచే సుఖమందును, జ్ఞానమందును సంగభావము కలుగును. సంగము బన్ధ హేతువు.

శ్లో॥ రజో రాగాత్మకమ్ విద్ధి తృష్ణాసంగసముద్భవమ్
తన్నిబధ్నాతి కౌంతేయ కర్మసంగేన దేహినమ్ 7

కౌంతేయ = ఓ అర్జునా! రాగాత్మకమ్ = రాగాత్మకమైన, రజః = రజోగుణము, తృష్ణాసంగ సముద్భవమ్ = కామము, ఆసక్తుల నుండి ఉత్పన్నమైనదని, విద్ధి = ఎరుంగుము, తత్ = అది (ఆ రజోగుణము), దేహినమ్ = జీవాత్మను, కర్మసంగేన = కర్మలు, వాటి ఫలముల సాంగత్యముతో నిబధ్నాతి = బంధించును.

తా. రజోగుణముచే ఇన్ద్రియార్థములందు రాగద్వేషములు కలుగుచున్నవి. రజోగుణ ప్రభావము ప్రాపంచిక విషయములందు తృష్ణను కలుగజేసి, దేహిని కర్మయందు ప్రవృత్తుని జేయును. దేహి

కర్మసక్తుడయి బద్ధుడగుచున్నాడు. ఇట్లు బంధమునకు రజోగుణము కారణము.

శ్లో॥ తమస్త్వజ్ఞానజం విద్ధి మోహనం సర్వదేహినామ్
ప్రమాదాలస్యనిద్రాభిః తన్నిబధ్నాతి భారత 8

భారత = ఓ అర్జునా! సర్వదేహినామ్ = దేహాభిమానము గలవారినందరిని, మోహనమ్ = మోహింపజేయు, తమః, తు = తమోగుణమయితే, అజ్ఞానజమ్ = అజ్ఞానమునుండి ఉత్పన్నమైనదానినిగా, విద్ధి = తెలిసికొనుము, తత్ = అది (ఆ తమోగుణము), (దేహినమ్) = జీవాత్మను, ప్రమాద ఆలస్య నిద్రాభిః = ప్రమాద ఆలస్య నిద్రాదులతో, నిబధ్నాతి = బంధించును.

తా. భరతకులజుడవైన ఓ అర్జునా ! తమోగుణమజ్ఞానమున కలుగుచున్నది. ఇది సర్వ ప్రాణులను వివేక రహితులుగా జేయుచు మోహమున ముంచును. ఈ గుణము వలన కర్తవ్యములందు ఏమరియుండుట, కర్మాచరణయందు కోరిక యున్నను యథోక్త కాలమున చేయకుండుట, తరచుగ నిద్రావశుడై యుండుట అను లక్షణములు కలుగును. తమోగుణము ఈరీతిగా దేహికి బంధహేతువగుచున్నది.

శ్లో॥ సత్త్వం సుఖే సంజయతి రజః కర్మణి భారత
జ్ఞానమావృత్య తు తమః ప్రమాదే సంజయత్యుత 9

భారత = ఓ అర్జునా! సత్త్వమ్ = సత్త్వగుణము (జీవుని), సుఖే = సుఖమునందు, సంజయతి = నిమగ్నము చేయును, రజః = రజోగుణము, కర్మణి = కర్మయందు, (సంజయతి) = నిమగ్నమొనర్చును, తమః, తు = (అట్లే) తమోగుణమయితే, జ్ఞానమ్ = జ్ఞానమును, ఆవృత్య = కప్పివేసి, ప్రమాదే, ఉత = ప్రమాదాదులలోను, సంజయతి = ముంచివేయును.

తా. భరత వంశోద్భవుడగు ఓ అర్జునా ! సత్త్వగుణమువలన సుఖమందు సంగము కలుగును, రజోగుణమువలన కర్మాచరణయందు ప్రవృత్తి గలుగును. తమోగుణమువలన జ్ఞాన హీనుడయి కర్తవ్యములైన కార్యములనాచరించుటయందు ఏమరియుండును.

శ్లో॥ రజస్తమశ్చాభిభూయ సత్త్వం భవతి భారత
రజఃసత్త్వం తమశ్చైవ తమః సత్త్వం రజస్తథా 10

భారత = ఓ అర్జునా! రజః = రజోగుణమును (మరియు), తమశ్చ = తమోగుణమును, అభిభూయ = అణచివేసి, సత్త్వమ్ = సత్వగుణము (వృద్ధిచెందును), సత్త్వమ్ = సత్త్వగుణమును,

చ = మరియు, తమః = తమోగుణమును (అణచివేసి), రజః = రజోగుణము (వృద్ధిచెందును), తథా, ఏవ = అట్లే, సత్త్వమ్ = సత్త్వగుణమును, రజశ్చః = మరియు రజోగుణమును (అణచివేసి), తమః, భవతి = తమోగుణము వృద్ధిచెందును.

తా. సత్త్వ రజస్తమో గుణాత్మికయగు ప్రకృతి సత్త్వాది గుణముల ద్వారా సర్వకర్మలకు కర్తృత్వముకలదై యున్నది. ఒక సమయమున సత్త్వ గుణము రజోగుణమును, తమోగుణమును తక్కువగా జేసి తాను ప్రబలమై యుండును. అట్లే ఒక కాలమున రజోగుణము విజృంభించిన సత్త్వగుణమును తమోగుణమును మించి యుండును. ఆ విధముగనే ఒక కాలమున తమో గుణమధికమై సత్త్వగుణమును, రజోగుణమును తక్కువజేసి యుండును. ఈ విధముగా గుణముల మూలమున నానా విధ క్రియలు సంభవించుచున్నవి.

శ్లో॥ సర్వద్వారేషు దేహేఽస్మిన్ ప్రకాశ ఉపజాయతే
జ్ఞానం యదా తదా విద్యాత్ వివృద్ధం సత్త్వమిత్యుత 11

యదా = ఏ సమయమునందు, అస్మిన్, దేహే = ఈ దేహమునందు, సర్వ ద్వారేషు = అంతఃకరణేంద్రియములయందును, ప్రకాశః = చైతన్యము (మరియు), జ్ఞానమ్ = వివేకశక్తి, ఉపజాయతే = ఏర్పడునో, తదా = అప్పుడు, సత్త్వమ్, ఉత = సత్త్వగుణము, వివృద్ధమ్, ఇతి = వృద్ధిచెందినదని, విద్యాత్ = తెలిసికొనవలెను.

తా. శ్రోత్రాది సర్వేన్ద్రియములద్వారా విశేషముగా జ్ఞాన ప్రకాశము కలిగినచో అప్పుడు సత్త్వగుణము వృద్ధి పొందినట్లు తెలిసికొనవలయును. ఇన్ద్రియము లిన్ద్రియార్థములపై ప్రకాశము గావించుట సామాన్య విషయము కాన సత్త్వ గుణాతిశయముచే శ్రోత్రా దీన్ద్రియముల ద్వారా దూరశ్రవణాది జ్ఞానము ప్రకాశించునని తెలియనగును.

శ్లో॥ లోభః ప్రవృత్తిరారంభః కర్మణామశమః స్పృహా
రజస్యేతాని జాయంతే వివృద్ధే భరతర్షభ 12

భరతర్షభ = ఓ అర్జునా! రజసి = రజోగుణము, వివృద్ధే = వృద్ధియైనపుడు, లోభః, ప్రవృత్తిః = లోభము మరియు ప్రాపంచిక కర్మలయందు ప్రవృత్తి, కర్మణామ్, ఆరంభః = స్వార్థబుద్ధితో కర్మలయొక్క ఆరంభము, అశమః = అశాంతి (మరియు),స్పృహా = విషయభోగలాలస,ఏతాని = ఈ మొదలగునవి అన్నియును, జాయంతే = కలుగును.

తా. భరతకుల శ్రేష్ఠుడవైన ఓ అర్జునా! రజోగుణమభివృద్ధి చెందినప్పుడు పరద్రవ్యాభిలాష,

కర్మలాచరించవలెనను పూనిక, కర్మల నారంభించుట, అశాన్తి, ఆశ, అను లక్షణములు కలుగును.

శ్లో॥ అప్రకాశోఽ ప్రవృత్తిశ్చ ప్రమాదో మోహ ఏవ చ
తమస్యేతాని జాయంతే వివృద్ధే కురునందన 13

కురునందన = ఓ అర్జునా! తమసి = తమోగుణము, వివృద్ధే = వృద్ధియగుచున్నప్పుడు, అప్రకాశః = (అంతఃకరణేంద్రియములయందు) అప్రకాశము, అప్రవృత్తిః = కర్తవ్య కర్మలయందు విముఖత, చ = అట్లే, ప్రమాదః = వ్యర్థచేష్టలు, చ = మరియు, మోహః = నిద్రాది మోహవృత్తులు, ఏతాని, ఏవ = ఈ మొదలగునవి, జాయంతే = కలుగును.

తా. ఓ అర్జునా! విషయములను యథార్థ రూపమున గ్రహించలేకుండుట, కర్మారంభము చేయుటయందు ప్రవర్తించక యుండుట, కర్తవ్యములగు కృత్యము నెఱుగలేకుండుట, ఎఱిగియు చేయుటకిచ్ఛ లేక యుండుట యను లక్షణములు తమోగుణము వృద్ధియందున్నచో కలుగునని భావము.

శ్లో॥ యదా సత్త్వే ప్రవృద్ధే తు ప్రలయం యాతి దేహభృత్
తదోత్తమవిదాం లోకాన్ అమలాన్ ప్రతిపద్యతే 14

యదా = ఎప్పుడు, దేహభృత్ = మనుష్యుడు, సత్త్వే, ప్రవృద్ధే = సత్త్వగుణము వృద్ధి చెందుచున్నప్పుడు, ప్రలయం, యాతి = మృతిచెందునో, తదా, తు = అప్పుడైతే, ఉత్తమవిదామ్ = ఉత్తమకర్మలను ఆచరించువారు వెళ్ళునట్టి, అమలాన్ = నిర్మలమైన, లోకాన్ = స్వర్గాది దివ్యలోకములను, ప్రతిపద్యతే = పొందును.

తా. సత్త్వగుణమభివృద్ధి యందుండగా దేహి మరణము జెందినచో మహదాది తత్త్వ మెరిగినవారు పొందు నిర్మలమైన లోకముల కేగును.

శ్లో॥ రజసి ప్రలయం గత్వా కర్మసంగిషు జాయతే
తథా ప్రలీనస్తమసి మూఢయోనిషు జాయతే 15

రజసి = రజోగుణము వృద్ధి చెందుచున్నప్పుడు, ప్రలయం, గత్వా = మృతిచెందినవాడు, కర్మసంగిషు = కర్మాసక్తులైన మనుష్యులయందు, జాయతే = పుట్టును, తథా = అట్లే, తమసి = తమోగుణము వృద్ధి చెందునప్పుడు, ప్రలీనః = మరణించినవాడు, మూఢయోనిషు = పశుపక్షికీటకాది మూఢయోనులయందు, జాయతే = జన్మించును.

తా. రజోగుణము తదితర గుణములకంటె నధికముగా నున్న కాలమున మృతి జెందిన దేహి, కర్మాచరణ పరులైన వారిలో పుట్టును. అట్లే తమోగుణము వృద్ధియందుండగా మృతి జెందినవాడు పశుపక్ష్యాది జన్మల నందును.

శ్లో॥ కర్మణః సుకృతస్యాహుః సాత్త్వికం నిర్మలం ఫలమ్
రజసస్తు ఫలం దుఃఖం అజ్ఞానం తమసః ఫలమ్ 16

సుకృతస్య, కర్మణః = శ్రేష్ఠమైన కర్మకు, సాత్వికమ్ = సుఖ, జ్ఞాన, వైరాగ్యాది సాత్వికమైన, నిర్మలమ్, ఫలమ్ = నిర్మలమైన ఫలము లభించునని, ఆహుః = అందురు, తు = కాని, రజసః = రాజసకర్మకు, ఫలమ్ = ఫలము, దుఃఖమ్ = దుఃఖము అనియు, తమసః = తామస కర్మకు, ఫలమ్ = ఫలము, అజ్ఞానమ్ = అజ్ఞానము అనియు, ఆహుః = అందురు.

తా. సుకృత కర్మయనగా రజోగుణ తమోగుణములను నశింప జేయగలిగిన యోగనిష్ఠయని తెలియనగును. యోగనిష్ఠచే కామములుడిగి బ్రహ్మాభావన కలుగును.

*'యోగేన గత కామానాం భావనా బ్రహ్మాచక్షసే'* *(ఉత్తరగీత 1-9)*

అను ప్రమాణముచే యోగబుద్ధివలన కామములు నశించి, యోగులు బ్రహ్మాభావన చేయుదురని భావము. బ్రహ్మాభావనచే శాంతియు, శాంతివలన అక్షయ సుఖము కలుగును. *'నచాభావయతః శాంతిరశాంతస్య కుతస్సుఖమ్'* అను గీతా వాక్యమునకు భావమిదియేయని స్పష్టము. *'సాత్త్వికం నిర్మలంఫలం'* అనుట ఈశ్వరభావన వలన కలుగు శాంతియే సాత్త్విక ఫలమనుట. రజోగుణ ఫలము దుఃఖమనియు, తమోగుణ ఫలమజ్ఞానమనియు భావము.

శ్లో॥ సత్త్వాత్ సంజాయతే జ్ఞానం రజసో లోభ ఏవ చ
ప్రమాదమోహౌ తమసో భవతోఽజ్ఞాన మేవ చ 17

సత్త్వాత్ = సత్త్వగుణమునుండి, జ్ఞానమ్ = జ్ఞానము, సంజాయతే = కలుగును, చ= మరియు, రజసః = రజోగుణము నుండి, లోభః, ఏవ = నిస్సందేహముగా లోభము, చ= అట్లే, తమసః = తమోగుణమునుండి, ప్రమాదమోహౌ = ప్రమాద మోహములు, భవతః = కలుగును, మరియు, అజ్ఞానమ, ఏవ (భవతి) = అజ్ఞానము, కూడ కలుగును.

తా. సత్త్వగుణమతిశయించిన జ్ఞానోదయమగును, రజోగుణము విజృంభించిన పరద్రవ్యములందాశ కలుగును. తమోగుణము పొడసూపిన ప్రాప్తమయియున్న కర్తవ్యకార్యమందనిచ్ఛయు, విహితము కాని కార్యమందు ప్రబలమైన కోరికయు కలిగి, సత్యా సత్యములను తెలియలేక అజ్ఞానియై యుండును.

శ్లో॥ ఊర్ధ్వం గచ్ఛంతి సత్త్వస్థా మద్యే తిష్ఠంతి రాజసాః
జఘన్యగుణవృత్తిస్థా అధో గచ్ఛంతి తామసాః 18

సత్త్వస్థాః = సత్త్వగుణ ప్రధానులు, ఊర్ధ్వమ్, గచ్ఛంతి = స్వర్గాది ఊర్ధ్వలోకములను పొందుదురు, రాజసాః = రాజస పురుషులు, మద్యే = మధ్య (మానవ) లోకమున, తిష్ఠంతి = ఉందురు (జన్మింతురు), జఘన్యగుణవృత్తిస్థాః = తమోగుణకార్యములైన నిద్ర ప్రమాద ఆలస్యములందుస్థితమైనట్టి, తామసాః = తామస పురుషులు, అధః = అధోగతులను (అనగా పశు కీటకాది జన్మలను) (నరకములను), గచ్ఛంతి = పొందుదురు.

తా. సత్త్వగుణ సంపన్నులగు మహాత్ములు దైవీసంపద నాశ్రయించిన వారు కాన ఊర్ధ్వలోకములకు అనగా దేవలోకములకు పోవుదురు. రజోగుణ ప్రధానులై యున్నవారు మనుష్యలోకమున జన్మించెదరు. నిందాస్పదములైన తమోగుణ కార్యములగు నిద్రాలస్య ప్రమాదములందుండు తామసులు, లేక మూఢులు పతితులగుచున్నారు. అనగా పశుపక్ష్యాదులుగ జన్మించెదరని భావము.

శ్లో॥ నాన్యం గుణేభ్యః కర్తారం యదా ద్రష్టానుపశ్యతి
గుణేభ్యశ్చ పరం వేత్తి మద్భావం సోఽ ధిగచ్ఛతి 19

యదా = ఎప్పుడైతే, ద్రష్టా = ద్రష్టయైనవాడు, గుణేభ్యః = మూడు గుణములను తప్ప, అన్యమ్, కర్తారమ్ = మరియొక దానిని కర్తగా, న, అనుపశ్యతి = చూడడో, చ= మరియు, గుణేభ్యః = మూడు గుణముల కంటెను, పరమ్ = అతీతుడైన సచ్చిదానంద ఘనపరమాత్మను, వేత్తి = యథార్థముగా తెలిసికొనునో (అప్పుడు), సః = అతడు, మద్భావమ్ = నా స్వరూపమునే, అధిగచ్ఛతి = పొందును.

తా. జగత్తుకు కాని, జగత్తున జరుగు సర్వ వ్యవహారములకు కాని సత్త్వ రజస్తమోగుణములు కర్తలైయున్నవి. గుణములకంటె అన్యమైనది ఏదియు కర్తకాదని, ఆత్మను ద్రష్టగా అనగా సాక్షి మాత్రముగా చూడగలిగినవాడు పరమాత్మను గుణాతీతునిగా నెరుగును. అట్టివాడే జ్ఞాని. జ్ఞానమున నన్ను వాడు పొందును.

శ్లో॥ గుణానేతానతీత్య త్రీన్ దేహీ దేహసముద్భవాన్
జన్మమృత్యుజరాదుఃఖైః విముక్తోఽ మృతమశ్నుతే 20

దేహీ = పురుషుడు, దేహసముద్భవాన్ = శరీరముయొక్క ఉత్పత్తికి కారణములైన, ఏతాన్, త్రీన్, గుణాన్ = ఈ మూడు గుణములను, అతీత్య = అధిగమించినచో, జన్మమృత్యుజరాదుఃఖైః =

జన్మ, మృత్యు, వార్ధక్యముల వలన కలుగు వివిధ దుఃఖముల నుండి, విముక్తః = విముక్తుడై, అమృతమ్ = పరమానందమును (మోక్షమును), అశ్నుతే = పొందును.

తా. సత్త్వరజస్తమో గుణములు దేహోత్పత్తికి కారణములు. కావున గుణాతీతుడగు ఆత్మ గుణ లక్షణములగు జన్మమృత్యు జరాదుఃఖముల నంటక దూరముగానుండి అమృత భావమును పొందును.

**అర్జున ఉవాచ:**

శ్లో॥ కైర్లింగైః త్రీన్ గుణానేతాన్ అతీతో భవతిప్రభో
కిమాచారః కథం చైతాన్ త్రీన్ గుణానతివర్తతే 21

ప్రభో = ఓ ప్రభూ! ఏతాన్ = ఈ , త్రీన్, గుణాన్ = మూడు గుణములను, అతీతః = అధిగమించిన పురుషుడు, కైః, లింగైః = ఏయే లక్షణములతో (కూడి), భవతి = ఉండునో, చ= మరియు, కిమాచారః = ఎట్టి ఆచరణములను, భవతి = కలిగియుండును? ఏతాన్, త్రీన్, గుణాన్ =(మనుష్యుడు)ఈ మూడు గుణములను, కథమ్=ఎట్లు, అతివర్తతే =అధిగమించునో?

తా. అర్జునుడు శ్రీ కృష్ణభగవానునితో నిట్లనెను. ప్రభువైన ఓ కృష్ణా! సత్త్వాది గుణత్రయ ప్రభావమునకు వశుడు కాక గుణకార్యములకు ఆత్మ కర్తకాదని తెలిసిన పరమార్ధ జ్ఞానసమ్పన్నుడగు యోగి యెట్టి ఆచారము కలవాడగును? వాని లక్షణములేవి? గుణాతీతుడయి యుండుట యెట్లు?

**శ్రీ భగవానువాచ:**

శ్లో॥ ప్రకాశం చ ప్రవృత్తిం చ మోహమేవ చ పాండవ
న ద్వేష్టి సంప్రవృత్తాని న నివృత్తాని కాంక్షతి 22

పాండవ = ఓ అర్జునా! (ఏ పురుషుడైతే), ప్రకాశమ్, చ = సత్త్వగుణకార్యమైన ప్రకాశమూ, ప్రవృత్తిమ్, చ = రజోగుణకార్యరూపమైన ప్రవృత్తియు, మోహమ్, ఏవ = తమోగుణకార్యరూపమైన మోహము, సంప్రవృత్తాని = ఏర్పడినప్పుడు, న, ద్వేష్టి = వాటిని ద్వేషింపడో, చ = మరియు, నివృత్తాని = అవి తొలగిపోయినప్పుడు, న, కాంక్షతి = వాటిపై ఆరాటపడడో. . .

తా. శ్రీకృష్ణభగవానుడు అర్జునునితో ఇట్లనెను. పాండురాజ నందనుడవైన అర్జునా! ప్రకాశము, ప్రవృత్తి, మోహము, క్రమముగా సత్త్వరజస్తమో గుణలక్షణములు. సత్త్వ రజస్తమో గుణములు ప్రవృత్తములై యున్న కాలమున వాని లక్షణములు దేహమునందు గోచరమగును. అట్టివానిని సమ్యగ్దర్శియగు యోగి ద్వేషభావముతో చూడడు. వానియందసంగుడై ద్రష్టగామాత్ర వే యోగి యుండును. గుణాతీతుడగు యోగి నివృత్తములైన ఆ లక్షణములను మరలకోరడు. అనగా రాగద్వేష

వర్జితుడయి ద్రష్టవలె యుదాసీనుడై యుండును.

శ్లో॥ ఉదాసీనవదాసీనో గుణైర్యో న విచాల్యతే
గుణావర్తన్త ఇత్యేవ యోఽ వతిష్ఠతి నేంగతే 23

యః = ఎవడైతే, ఉదాసీనవత్ = ఉదాసీనుని (సాక్షి) వలె, ఆసీనః = స్థితుడైయుండునో, గుణైః = త్రిగుణములచే, న, విచాల్యతే = చలింపజేయబడడో (మరియు), గుణాః, ఏవ = గుణములే, వర్తంతే = ప్రవర్తించుచున్నవి, ఇతి = అని భావించి, యః = ఎవడు (సచ్చిదానంద ఘనపరమాత్మయందు ఏకీభావముతో), అవితిష్ఠతి = స్థితుడైయుండునో మరియు, న, ఇంగతే = ఆ స్థితినుండి ఎన్నడును చలింపడో.

తా. గుణాతీతుడగు యోగి గుణములు ప్రవృత్తములైనను వానితో సంగభావము లేక తటస్థునివలె నుండి లక్షణములగు సుఖదుఃఖాదులయందు అసక్తుడై కలత జెందడు. గుణములు కలుగుచున్నవని తెలియగలుగును, కాని చలింపడు. ఇదియే జీవన్ముక్త లక్షణము.

శ్లో॥ సమదుఃఖసుఖః స్వస్థః సమలోష్టాశ్మకాంచనః
తుల్యప్రియాప్రియో ధీరః తుల్యనిందాత్మసంస్తుతిః 24

స్వస్థః = ఎవడు నిరంతరము ఆత్మ భావమునందే స్థితుడై, సమదుఃఖసుఖ = సుఖదుఃఖములను సమానముగా భావించినవాడై, సమలోష్టాశ్మ కాంచనః = మట్టి, రాయి, బంగారములను సమానముగా భావించునట్టి, ధీరః = జ్ఞాని, తుల్య ప్రియాప్రియః = ప్రియ అప్రియములను సమానముగా చూచువాడును, తుల్యనిందాత్మ సంస్తుతిః = నిందాస్తుతులయందును సమానభావము కల్గియుండువాడును.

తా. గుణాతీతుడైన యోగి గుణలక్షణములైన ద్వంద్వములందు సమభావముననుండును. కావున ప్రాప్తములైన సుఖదుఃఖములు, ప్రియాప్రియములు, ఆత్మ నిందాస్తుతులు వానిని వికారము కలిగిన వానినిగా చేయజాలవు. యోగి స్వస్వరూపమున అచ్యుతమైన స్థితినిబొంది భయరహితుడై యుండును. జితేంద్రియుడగు యోగి మృత్తికను, కాంచనమును సమదృష్టితో జూచును. కాంచనముపై లోభము చెందడని భావము.

శ్లో॥ మానావమానయోస్తుల్యః తుల్యో మిత్రారిపక్షయోః
సర్వారంభపరిత్యాగీ గుణాతీతః స ఉచ్యతే 25

మానవమానయో, తుల్యః = మానావమానములను సమానముగ తలంచువాడును, మిత్రారి పక్షయోః తుల్యః = మిత్రులయెడను, శత్రువుల యెడను సమానముగా ఉండువాడును, సర్వారంభ పరిత్యాగీ = కర్మాచరణములయందు కర్తృత్వాభిమానము లేనివాడును అగు, సః = అట్టి పురుషుడు, గుణాతీతః = త్రిగుణములకు అతీతుడని, ఉచ్యతే = పేర్కొనబడును.

తా. గుణాతీతుడైన యోగి, ఇతరులు చేయు పూజావమానముల యెడ వికారము జెందక యుండును. అనగా పూజవలన హర్షమును, అవమానముచే క్రోధమును కలిగియుండడని భావము. అట్లే మిత్రులయెడ, శత్రువులయెడ సమముగా నుండును. సర్వకర్మలను పరిత్యజించి సదా ఆత్మరతుడై యుండుట గుణాతీతుని లక్షణము.

శ్లో॥ మాం చ యోఽవ్యభిచారేణ భక్తియోగేన సేవతే
స గుణాన్ సమతీత్యైతాన్ బ్రహ్మభూయాయ కల్పతే 26

చ = మరియు, యః = ఏ పురుషుడు, అవ్యభిచారేణ, భక్తియోగేన = అనన్య భక్తియోగము ద్వారా, మామ్, సేవతే = నన్ను నిరంతరము భజించునో, సః = అతడు కూడా, ఏతాన్, గుణాన్ = ఈ మూడు గుణములను, సమతీత్య = పూర్తిగా అధిగమించి, బ్రహ్మభూయాయ = సచ్చిదానంద ఘన ప్రాప్తికై, కల్పతే = అర్హుడగును.

తా. సర్వభూత మహేశ్వరుడనై వాసుదేవుడనగు నన్నెవరు సర్వకాలములయందు అవిచ్ఛిన్నమగు భక్తియోగముచే సేవించుదురో అట్టివారు గుణములను అతిక్రమింపగలిగి బ్రహ్మభావము పొందగలుగుచున్నారు.

వి. అవ్యభిచార భక్తియన... వాసుదేవుడే సర్వత్ర నానా జగద్రూపమున విస్తరించి యున్నవాడు, ఆత్మయేసర్వము, ఆత్మేతరమైనది కించిత్తయినను లేదు. ఈ తీరున సర్వము వాసుదేవుడే యను నిశ్చయ జ్ఞానమునకే అవ్యభిచార భక్తియని, అనన్యభక్తి యనియు పేరు. 'బ్రహ్మవిత్ బ్రహ్మైవభవతి' అను ప్రమాణ వాక్యార్థమును 'బ్రహ్మభూయాయ కల్పతే' యను మాటలలో ఈ శ్లోకమున వివరించిరి.

శ్లో॥ బ్రహ్మణో హి ప్రతిష్ఠాహమ్ అమృతస్యావ్యయస్య చ
శాశ్వతస్య చ ధర్మస్య సుఖస్యైకాంతికస్య చ 27

హి = ఏలనన, అవ్యయస్య = నాశరహితుడైనట్టి, బ్రహ్మణః, చ = పరబ్రహ్మకును, అమృతస్య, చ = అమృతత్త్వమునకును, శాశ్వతస్య, ధర్మస్య, చ = సనాతనమైన ధర్మమునకును, ఐకాంతికస్య, సుఖస్య = అఖండానందమునకును, అహమ్, ప్రతిష్ఠా = నేనే ఆధారమును.

తా. అమృతుడును, అవ్యయుడును నగు బ్రహ్మను నేనే. శాశ్వతమైన బ్రహ్మ స్థితిరూప ధర్మము, ఆ ధర్మముచే ప్రాప్యమగు అచ్యుతానందమును నేనే.

వి. ఐకాన్తిక సుఖమనగా అద్వితీయమైన బ్రహ్మస్థితి.

శ్లో॥ ఏకమేవాద్వితీయం యద్గురోః వాక్యేన నిశ్చితం
ఏతదేకాంత మిత్యుక్తం నమఠోనవనాన్తరమ్ (శృతి)

అను ప్రమాణముచే అద్వితీయమైన బ్రహ్మగా నుండుటయే ఐకాంతిక సుఖము.

ఇట్లు
శ్రీ పరమహంస పరివ్రాజకాచార్యులును,
బ్రహ్మర్షి సద్గురు **శ్రీశ్రీశ్రీ శివానంద భగవత్పూజ్యపాద** శిష్యులును నైన
బ్రహ్మర్షి సద్గురు **శ్రీశ్రీశ్రీ స్వామి రామానంద పరమహంస** వారిచే
రచింపబడిన గీతామృతమను టీక యందు
**గుణత్రయ విభాగ యోగ**మను చతుర్దశాధ్యాయము సమాప్తము.

ఓం శ్రీకృష్ణ పరమాత్మనే నమః

పంచదశాధ్యాయము

# పురుషోత్తమ ప్రాప్తి యోగము

**శ్రీ భగవానువాచ:**

శ్లో॥ ఊర్ధ్వమూలమధశ్శాఖమ్ అశ్వత్థం ప్రాహురవ్యయమ్
ఛందాంసి యస్య పర్ణాని యస్తం వేద స వేదవిత్ 1

ఊర్ధ్వమూలమ్ = ఆది పురుషుడైన పరమేశ్వరుడే మూలముగాను, అధశ్శాఖమ్ = క్రిందికి శాఖగానున్న, అశ్వత్థమ్ = సంసార రూపమైన అశ్వత్థ వృక్షము (రావిచెట్టు)ను, అవ్యయమ్ = శాశ్వతమైనదానినిగా, ప్రాహుః = పేర్కొందురు, ఛందాంసి = వేదములు, యస్య, పర్ణాని = దేనియొక్క ఆకులో, తమ్ = అట్టి సంసార రూప వృక్షమును, యః = ఏ పురుషుడు, వేద = (సమగ్రముగా) తెలిసికొనునో, సః = అతడు, వేదవిత్ = వేదార్థములను బాగుగా ఎరిగినవాడు.

తా. శ్రీకృష్ణభగవానుడు అర్జునునితో నిట్లనెను. అర్జునా! సంసారమను వృక్షమునకు కుదుటివేరు అనగా మూలము బ్రహ్మయే. భ్రూమధ్యస్థానమున నున్న పరమాత్మ శక్తి అధోముఖియై నాడీశతము ద్వారా వ్యక్తమగుచున్నది. కావున సంసారవృక్షము అధశ్శాఖమని చెప్పబడినది. అశ్వత్థమనగా శాశ్వతముగా నుండనిది. జ్ఞానము కలిగిన వెంటనే సంసారము నశించును. కావున అశ్వత్థం అని చెప్పబడినది. ఇట్టి సంసారము బ్రహ్మతత్త్వమెరుగనంత వరకు శమించునది కాదు. కావున అవ్యయమనియు, బ్రహ్మమునెరింగిన వెంటనే నశించునది కాన అశ్వత్థమనియు చెప్పబడినది. వృక్షము వృద్ధియగుటకు పర్ణములెట్లు తోడగునో అట్లే వేదోక్త కర్మానుష్ఠానము సంసారమును వృద్ధి జేయును. అందుచేత వేదములను పర్ణములుగా చెప్పిరి. సంసార వృక్షమిటువంటిదని తెలిసినవాడు వేదార్థమును తెలిసినవాడే యగును, సంసార వృక్షమును, తన్మూలమగు బ్రహ్మను తెలిసినవాడే సర్వజ్ఞుడని భావము.

వి. 'ఊర్ధ్వమూలం' అనుటచే సంసారమునకు ముఖ్య కారణము బ్రహ్మయే యనుట. శరీరమున ఊర్ధ్వ స్థానము భ్రూమధ్యస్థానము. ఇదియే తురీయ స్థానమని శృతి చెప్పుచున్నది. తురీయ స్థానమే ఈశ్వర స్థానము. దీనిని తురీయమనుటచే, స్థూల సూక్ష్మ కారణ దేహములనే దేహత్రయమును మాత్రమే సేవించుచున్న జీవుడు ఈశ్వరుని తెలియజాలడు. అనగా పరమార్థదర్శి కాజాలడని భావము. అందుచే ముముక్షువైన జీవుడు సంసారనాశము కొఱకు తురీయస్థానము చేరవలెను. ఇట్లు చేరుటకు యోగనిష్ఠ కలిగి యుండవలెను.

## పురుషోత్తమ ప్రాప్తి యోగము

శ్లో ॥ అయనే దక్షిణే ప్రాప్తే ప్రపంచాభి ముఖంగతః
అహంకారాభిమానేన జీవస్స్యాద్ధి సదాశివః (త్రిశిఖి బ్రాహ్మణోపనిషత్ -15)

శ్లో ॥ఉత్తరాభిముఖో భూత్వా స్థానాత్ స్థానాన్తరం క్రమాత్
మూర్ధ్న్యాధాయాత్మనః ప్రాణంయోగాభ్యాసస్థితశ్చరన్ (త్రిశిఖి బ్రాహ్మణోపనిషత్ -18)

అను శృతి వాక్యముల చేత... జీవునకు అధోగమనము సంసార హేతువనియు, యోగాభ్యాసమున జీవుడు ప్రాణశక్తిని ఊర్ధ్వముగా సంచరింపజేసి, మూర్ధస్థానమున అనగా శివస్థానమున ఉంచి తరించవలెననియు చెప్పబడినది. 'ఛందాంసి యస్యపర్ణాని' అనుటవలన పర్ణములవంటి ఛందస్సులను వదలినచో సంసారవృక్షము నశించిపోవుననియు, కనుక సంసార వృక్షమునకు మూలమైన బ్రహ్మయందు మనోబుద్ధులనర్పించవలయుననియు, 'వృక్షమూలేవసేత్' యను శృతి చేతను, 'నిస్త్రైగుణ్యోభవార్జున' అనుగీతా వాక్యము చేతను చెప్పబడెను.

శ్లో॥ అధశ్చోర్ధ్వం ప్రసృతాస్తస్య శాఖా గుణప్రవృద్ధా విషయప్రవాలాః
అధశ్చమూలాన్యనుసంతతాని కర్మానుబంధీని మనుష్యలోకే 2

తస్య = ఆ సంసార వృక్షమునకు, గుణప్రవృద్ధాః = త్రిగుణములనెడి జలములచే వృద్ధిపొందునట్టి, విషయప్రవాలాః = శబ్దాది భోగములనెడి చిగుళ్ళమధ్య, శాఖాః = దేవ మనుష్య తిర్యగ్యోనులలో జన్మించెడి ప్రాణులే, అధః, చ = క్రింది వైపునకును, ఊర్ధ్వమ్ = పై వైపునకు, ప్రసృతాః = సర్వత్ర వ్యాపించియుండును, మనుష్యలోకే = మానవలోకమునందు, కర్మానుబంధీని = (మనుజులను) కర్మానుసారముగా బంధించు, మూలాని (అపి) = అహంకార, మమకార వాసనలు అనెడి వేర్లు, ఊడలు గూడ, అధః, చ = క్రిందను, (ఊర్ధ్వం, చ) = (పైనను), అనుసంతతాని = అన్ని లోకములలో వ్యాపించి యున్నవి.

తా. సత్త్వరజస్తమో గుణములచే వృద్ధినొందిన విషయములే ప్రవాలములుగా గల శాఖలు అనగా లోకములు సంసారవృక్షమునకు ఊర్ధ్వభాగమున, అధోభాగమున వ్యాపించి యున్నవి. దేవాది లోకములకంటె అధోభాగమున అనగా మనుష్య లోకమున ధర్మాధర్మరూప సర్వకర్మల నాచరించుటకు కారణ భూతములైన వాసనలు, తత్ఫల రూపములైన కర్మలు ప్రవృత్తములగుచున్నవి. యథాకర్మ వాసనలు, తత్ఫల రూపములైన కర్మలు ప్రవృత్తములగుచున్నవి. 'యథాకర్మ యథాశ్రుతం' అను ప్రమాణమున ఆయా జీవుల కర్మ జ్ఞానముల ననుసరించి యాయాలోకములు ప్రాప్తములగుచున్నవి. ఊర్ధ్వాధోలోకములు చేరి వారివారి కర్మల ఫలము అనుభవించుచున్నారు. మనుష్యులు మొదలుకొని స్థావరముల వరకు గల ప్రాణిలోకమధో భాగమనియు, అట్లే బ్రహ్మ లోకమువరకు గల జగత్తు ఊర్ధ్వ

భాగమనియు చెప్పబడినది.

vi. పూర్వోక్త లక్షణములు కల సంసార వృక్షము సమూలముగా ఛేదింపబడుటకు జ్ఞాన ఖడ్గము ధరింపవలయును. ఆ జ్ఞానము యోగముచే సిద్ధించునని గీత చెప్పుచున్నది.

*శ్లో ॥ నహిజ్ఞానేన సదృశం పవిత్రమిహ విద్యతే*
*తత్స్వయం యోగ సంసిద్ధః కాలేనాత్మని విందతి* *(4-38)*

ఈ శ్లోకమున యోగమున సిద్ధి పొందిన యోగి స్వయముగా తాను తనలో జ్ఞానము కలవాడగునని తెలియ జెప్పెను.

శ్లో॥ న రూపమస్యేహ తథోపలభ్యతే నాంతో న చాదిర్న చ సంప్రతిష్ఠా
అశ్వత్థమేనం సువిరూఢమూలం అసంగశస్త్రేణ దృఢేన ఛిత్త్వా 3

అస్య = ఈ సంసార వృక్షముయొక్క, రూపమ్ = స్వరూపము (ఎట్లు వర్ణింపబడినదో), తథా = అట్లు, ఇహ = ఈ లోకమునందు (సంసారాసక్తి గలవారిచేత), న, ఉపలభ్యతే = తెలియబడకున్నది, (యతః) = ఏలనన, న, ఆదిః = (దీనికి) ఆదియులేదు, చ= మరియు, న, అంతః = అంతమూలేదు, చ = అట్లే, న, సంప్రతిష్ఠా = సరియైన స్థితియులేదు, (అతః) = ఇందువలన, ఏనమ్ = ఇట్టి, సువిరూఢమూలమ్ = అహంకార, మమకార వాసనలనెడి దృఢమైన మూలములుగల, అశ్వత్థమ్ = సంసారరూపమైన అశ్వత్థవృక్షమును, దృఢేన = నిశితమైన, అసంగశస్త్రేణ = వైరాగ్యమనెడి శస్త్రముచే, ఛిత్త్వా = ఛేదించి

తా. పై శ్లోకములలో చెప్పబడిన సంసారము మరుస్థలమందలి జలమువలె పరీక్షింపగా లేనిదేయగును. కావున సంసార రూపమెవనికిని బోధపడుటలేదు. సంసారము ఆది మధ్యాంతములు లేక యున్నది. పరమార్థదర్శియగు యోగి సంసారమును మిధ్యగా చూచును. జ్ఞానము కలుగు వరకు సంసారము సుప్రతిష్ఠితమై యుండును. ఆయీ సంసార వృక్షమును వైరాగ్య జ్ఞానములనెడు దృఢమైన శస్త్రముచే ఛేదించవలెను.

శ్లో॥ తతః పదం తత్ పరిమార్గితవ్యం యస్మిన్ గతా న నివర్తంతి భూయః
తమేవ చాద్యం పురుషం ప్రపద్యే యతః ప్రవృత్తిః ప్రసృతా పురాణీ 4

తతః = అనంతరము, యస్మిన్ = ఏ పరమపదమును, గతాః = పొందినవారు, భూయః = మరల, న, నివర్తంతి = తిరిగిరారో, చ = మరియు, యతః = ఏ పరమేశ్వరుని నుండి, పురాణీ = పురాతనమైన, ప్రవృత్తిః = సంసారవృక్ష పరంపర, ప్రసృతా = వ్యాపించియున్నదో,

తమ్, ఆద్యమ్, పురుషమ్, ఏవ = ఆ ఆదిపురుషుడగు నారాయణునే, ప్రపద్యే = శరణు పొందుదును, (ఇతి) = (అనుభావముతో), తత్, పదమ్ = ఆ పరమపదమును, పరిమార్గతవ్యమ్ = అన్వేషింపవలెను

తా. నిర్మలమగు వైరాగ్యజ్ఞానములచే సంసారమును ఛేదించి పరమపదము పొందవలెను. పరతత్త్వమును తెలిసినవారు మరల ఈ సంసారమున పడరు. పరమపురుషుడైన ఆది పురుషుని నేను శరణము పొందుచున్నాను. ఆ పరమ పురుషుని మూలమున మాయా కార్యమగు సంసారము చింతన కాలమునుండి ప్రవర్తించుచున్నది.

శ్లో॥ నిర్మానమోహా జితసంగదోషా అధ్యాత్మనిత్యా వినివృత్తకామాః
ద్వంద్వైర్విముక్తాః సుఖదుఃఖసంజ్ఞైః గచ్ఛంత్యమూఢాః పదమవ్యయం తత్ 5

నిర్మానమోహాః = దురభిమానమును, మోహమును జయించినవారును, జితసంగదోషాః = ఆసక్తి యనెడి దోషమును జయించినవారును, అధ్యాత్మ నిత్యాః = పరమాత్మ స్వరూపమునందే నిత్యస్థితులైనవారును, వినివృత్త కామాః = ప్రాపంచిక వాంఛల నుండి పూర్తిగా మరలినవారును, సుఖదుఃఖ సంజ్ఞైః = సుఖదుఃఖములను పేరుగల, ద్వంద్వైః విముక్తాః = ద్వంద్వముల నుండి విముక్తులైనవారును అగు, అమూఢాః = జ్ఞానులు, తత్, అవ్యయమ్, పదమ్ = శాశ్వతమైన ఆ పరమపదమును, గచ్ఛంతి = చేరుదురు.

తా. పరమ పదమును పొందుటకు అర్హులైనవారి లక్షణములను వర్ణించుచున్నాడు. మోక్షార్హులు మానమోహములను వదలి యుందురు. ఇన్ద్రియార్థములందు సంగబుద్ధి లేనివారు కాన కామాది దోషరహితులై యుందురు. సుఖదుఃఖాది ద్వంద్వములచే విడువబడినవారయి జ్ఞానము కలవారగుదురు. జ్ఞానులకు అవ్యయమయిన పరమపదము ప్రాప్యము.

శ్లో॥ న తద్భాసయతే సూర్యో న శశాంకో న పావకః
యద్గత్వా న నివర్తంతే తద్ధామ పరమం మమ 6

యత్ = ఏ పరమపదమును, గత్వా = పొంది, న, నివర్తంతే = (మనుష్యులు) ఈ లోకమునకు తిరిగిరారో, తత్ = అట్టి స్వయంప్రకాశ రూపమైన పరమపదమును, సూర్యః = సూర్యుడు, న, భాసయతే = ప్రకాశింప చేయజాలడు, శశాంకః = చంద్రుడు, న, (భాసయతే) ప్రకాశింపచేయజాలడు, పావకః = అగ్నియును, న, భాసయతే = ప్రకాశింపచేయజాలదు, తత్ = అదియే, మమ, పరమమ్, ధామ = నా పరంధామము.

తా. ఆ పరమ పదమును చేరిన వారెవరును తిరిగి సంసారమున పడరు. ఆ పరమ పదము స్వయం ప్రకాశము. సూర్యచంద్రాగ్నులలో నెవరును ఆ పరమపదమును ప్రకాశింపజేయలేరు.

'యేన సూర్యస్తపతి తేజసేద్ధః' (తైత్తిరీయ బ్రాహ్మణము)

'తస్యభాసా సర్వమిదం విభాతి' (కఠోపనిషత్ 2-2-15)

స్వయం ప్రకాశమగు పరమాత్మ తేజస్సు చేతనే సూర్యుడు ప్రకాశమానుడై యున్నాడు. దృశ్యమానమగు ఈ సర్వ ప్రపంచము కూడ ఆ పరమ పురుషుని తేజస్సు చేతనే ప్రకాశితమగుచున్నది.

శ్లో॥ మమైవాంశో జీవలోకే జీవభూతః సనాతనః
మనఃషష్ఠానీంద్రియాణి ప్రకృతిస్థాని కర్షతి 7

జీవలోకే = సర్వప్రాణుల దేహములలో ఉన్న, సనాతనః = సనాతనమైన, జీవభూతః = జీవాత్మ, మమ, ఏవ, అంశః = నా అంశయే (అదియే), ప్రకృతిస్థాని = ప్రకృతియందు స్థితములైన, మనఃషష్ఠాని, ఇంద్రియాణి = మనస్సును, ఐదు ఇంద్రియములను, కర్షతి = (శబ్దాది విషయముల ద్వారా తనవైపునకు) ఆకర్షించును.

తా. ప్రాణిలోకమున జీవలక్షణములు గల జీవుడు పరమాత్మనగు నాకంటె వేరుకాడు. కనుక సనాతనుడు. అనగా శాశ్వతుడు. అట్టి జీవుడు క్షేత్రమని చెప్పబడు శరీరమున జ్ఞానేంద్రియముల నైదింటితో కూడి ఆరవ ఇంద్రియమనబడు మనస్సు నాకర్షించి వర్తమాన శరీరము నుండి నూతన శరీర ధారణకు ఉత్క్రాంతి చెందుచున్నాడు.

శ్లో॥ శరీరం యదవాప్నోతి యచ్చాప్యుత్క్రామతీశ్వరః
గృహీత్వైతాని సంయాతి వాయుర్గంధానివాశయాత్ 8

వాయుః = వాయువు, ఆశయాత్ = గంధస్థానమునుండి, గంధాన్, ఇవ = గంధములను (వాసనలను) గ్రహించి తీసుకొనిపోయినట్లుగా, ఈశ్వరః, అపి = ప్రాణుల దేహములయందున్న జీవాత్మరూపంలోనున్న ఈశ్వరుడు, యత్ = ఏ శరీరమును, ఉత్క్రామతి = త్యజించునో, (తస్మాత్) = దానినుండి, ఏతాని = ఈ మనస్సును, ఇంద్రియములను, గృహీత్వా = గ్రహించి, చ= మరియు, యత్, శరీరమ్ = ఏ శరీరమును, అవాప్నోతి = పొందునో, (తస్మిన్) = దానియందు (ఆ శరీరమునందు), సంయాతి = చేరును.

తా. వాయువు పుష్పాశయమందలి సుగంధమును గ్రహించి ప్రయాణము చేయుచున్నట్లు ఈశ్వరాభిన్నుడగు జీవుడు ప్రాణము పోవు సమయమున (ఉత్క్రాన్తి సమయమున) మనస్సుతో సహా

ఇంద్రియములను తీసికొని వర్తమాన శరీరము నుండి నూతన శరీరమునకు పోవుచున్నాడు. ఈశ్వరుడు జీవుడు వేరు కానందున జీవుడీశ్వరశబ్దముచే చెప్పబడెను.

శ్లో॥ శ్రోత్రం చక్షుః స్పర్శనం చ రసనం ఘ్రాణమేవ చ
అధిష్ఠాయ మనశ్చాయం విషయానుపసేవతే 9

అయమ్ = ఈ జీవాత్మ, శ్రోత్రమ్ = చెవిని, చక్షుః = కంటిని, చ = మరియు, స్పర్శనమ్ = చర్మమును, చ = అట్లే, రసనమ్ = నాలుకను, ఘ్రాణమ్ = నాసికను, చ = మరియు, మనః = మనస్సును, అధిష్ఠాయ = అధిష్ఠించి, ఏవ = వీటిద్వారా, విషయాన్ = శబ్దాది విషయములను, ఉపసేవతే = అనుభవించును

తా. శరీరక్షేత్రస్థుడై క్షేత్రజ్ఞుడగు జీవుడు త్వక్ చక్షుశ్రోత్ర జిహ్వాఘ్రాణేంద్రియములైన పంచజ్ఞానేంద్రియములను, ఇన్ద్రియాధిష్ఠాతమయి షష్ఠేంద్రియమనబడు మనస్సును ఆశ్రయముగా గైకొని విషయోపభోగము చేయుచున్నాడు.

శ్లో॥ ఉత్క్రామంతం స్థితం వాపి భుంజానం వా గుణాన్వితమ్
విమూఢా నానుపశ్యంతి పశ్యంతి జ్ఞాన చక్షుషః 10

ఉత్క్రామంతమ్ = జీవుడు శరీరమును వదులుచున్నప్పుడును, వా = లేక, స్థితమ్ = శరీరమునందు స్థితుడై ఉన్నప్పుడును, వా = లేక, భుంజానమ్ = భోగములను అనుభవించుచున్నప్పుడును, గుణాన్వితమ్, అపి = అట్లే త్రిగుణములతో కూడి ఉన్నప్పుడును, విమూఢాః = అజ్ఞానులు, న, అనుపశ్యంతి = తెలిసికొనలేరు, జ్ఞానచక్షుషః = కేవలం జ్ఞానులే తమ జ్ఞాన నేత్రముల ద్వారా, పశ్యంతి = స్వస్వరూపమును తెలిసికొందురు

తా. జీర్ణదేహమునుండి దేహాంతరమును చేరుచుండగా కాని, లేక శరీరమందుండగా కాని, లేక గుణానుగతమైన ఫలములను అనుభవించుచుండగా కాని జీవుని తత్త్వవేత్తలగు వారే (జ్ఞాననేత్రం గలవారే) తెలిసికొనగలరు. కాని మూఢాత్ములైన వారెన్నటికిని జీవుని తెలిసికొనలేరని భావము.

శ్లో॥ యతంతో యోగినశ్చైనం పశ్యంత్యాత్మన్యవస్థితమ్
యతంతోఽప్యకృతాత్మానో నైనం పశ్యంత్యచేతసః 11

యోగినః = యోగులు, ఆత్మని = తమ హృదయములయందు, అవస్థితమ్ = స్థితమైయున్న, ఏవమ్ = ఈ ఆత్మతత్త్వమును, యతంతః = ప్రయత్నశీలురై, పశ్యంతి = ఎరుంగుదురు, చ =

కాని, అకృతాత్మనః = అంతఃకరణ శుద్ధి లేనివారైన, అచేతసః = అజ్ఞానులు, యతంతః, అపి = గట్టిగా ప్రయత్నించినను, ఏనమ్ = ఈ ఆత్మను, న, పశ్యంతి = తెలిసికొనజాలరు.

తా. యోగులు ప్రయత్నశీలురయి తమలోనున్న ఈశ్వరుని తెలిసికొనుచున్నారు. యోగుల ప్రయత్నమన యోగాభ్యాస రూప ప్రయత్నము. యోగనిష్ఠ ఎరుగనివారు అనగా సంస్కార మెరుగని బుద్ధి కలవారు ప్రయత్నించినను చిత్తగత మాలిన్యము నశించదు. కనుక అవివేకులై ప్రాపంచిక విషయరతులగుదురు. కావున ఆత్మను దర్శింపజాలరు.

వి. ప్రాణాయామముచే చిత్తము సంస్కరింపబడి మాలిన్య రహితమగును.

*శ్లో : ప్రాణాయామ విశుద్ధాత్మా యస్మాత్పశ్యతి తత్పరం*
*తస్మాన్నాతః పరం కించిత్ ప్రాణాయామాదితి శ్రుతేః* *(శృతి)*

అను ప్రమాణముచే ప్రాణాయామమున అంతఃకరణము శుద్ధమయి పరమాత్మను దర్శించగలుగునని తెలియును.

*'యోగయుక్తో విశుద్ధాత్మా విజితాత్మా జితేంద్రియః'* *(5-7)*

అను గీతావాక్యముచే యోగనిష్ఠ వలన అంతఃకరణ శుద్ధి, మనోనిగ్రహము, ఇంద్రియ జయము కలుగునని తెలియనగును. ప్రస్తుత శ్లోకమున *'యతంతోఽప్యకృతాత్మానో'* యను గీతావాక్యముచే యోగప్రయత్నము లేనిచో చిత్తశుద్ధి కలుగదని, యోగి కానియెడల వచ్చు అనర్థమును చెప్పియు, *'యోగయుక్తో విశుద్ధాత్మా'* అను వాక్యముచే యోగియైనచో కలుగు సమత్వ రూపలాభమును చెప్పియు యోగనిష్ఠ యత్యావశ్యకమని శ్రీకృష్ణభగవానుడు చెప్పుచున్నాడని భావము.

శ్లో॥ యదాదిత్యగతం తేజో జగద్భాసయతేఽఖిలం
యచ్చన్ద్రమసి యచ్చాగ్నౌ తత్తేజో విద్ధి మామకమ్ 12

యదాదిత్యగతమ్ = సూర్యమండలమునందున్న, యత్, తేజః = ఏ తేజస్సు, అఖిలమ్, జగత్ = సమస్త జగత్తును, భాసయతే = ప్రకాశింపజేయునో, చ= మరియు, యత్ = ఏ తేజస్సు, చంద్రమసి = చంద్రునియందును, యత్ = ఏది, అగ్నౌ = అగ్నియందును గలదో, తత్, తేజః = ఆ తేజస్సు, మామకమ్ = నాదేయని, విద్ధి = ఎరుంగుము.

తా. జగత్తునంతను ప్రకాశింపజేయు సూర్యుని తేజస్సు, చంద్రాగ్నులందు కల తేజస్సు పరమేశ్వరుడనగు నా యొక్క తేజస్సుగా నెఱుంగుము. సూర్యచంద్రాగ్నులును చైతన్య స్వరూపుడనగు

నా వలననే ప్రకాశించుచున్నారు.

శ్లో॥ గామావిశ్య చ భూతాని ధారయామ్యహమోజసా
పుష్ణామి చౌషధీః సర్వాః సోమో భూత్వా రసాత్మకః 13

చ = మరియు, అహమ్ = నేనే, గామ్, ఆవిశ్య = భూమిని ప్రవేశించి, ఓజసా = (నా) శక్తిద్వారా, భూతాని = సకల భూతములను, ధారయామి = ధరించి, పోషించుచున్నాను, చ = మరియు, రసాత్మకః = రసస్వరూపుడగు (అమృతమయుడగు), సోమః, భూత్వా = చంద్రుడనై, సర్వాః ఓషధీః = ఓషధులకు (వనస్పతులకు) అన్నింటికిని, పుష్ణామి = పుష్టిని చేకూర్తును

తా. పృథివి యందు ప్రవేశించి బలమువలన సర్వభూతములను ధరించుచున్నాను. పరమ పురుషుడనగు నేను రసస్వరూపుడగు చంద్రుడునయి భూమియందు ఉత్పన్నములగు ధాన్యాది సమస్తములైన ఓషధులను పోషించుచున్నాను.

శ్లో॥ అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః
ప్రాణాపాన సమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్ 14

అహమ్ = నేనే, ప్రాణినామ్ = సకల ప్రాణులయొక్క, దేహమ్, ఆశ్రితః = దేహములయందు ఉన్నవాడనై, ప్రాణాపాన సమాయుక్తః = ప్రాణాపానములతో గూడిన, వైశ్వానరో భూత్వా = వైశ్వానరాగ్నినై, చతుర్విధమ్ = నాలుగు విధములైన, అన్నమ్ = ఆహారమును, పచామి = జీర్ణింపజేయుదును

తా. సర్వ ప్రాణులందును జఠరాగ్నిరూపమున నుండి, వారు భుజించిన ఆహారమును పచనము చేసి ప్రాణాపానములతో కూడియున్న వాడనై ప్రాణులకు పుష్టిదాతనగుచున్నాను.

వి. *'ప్రాణాపాన సమాయుక్త'* అనగా *'ప్రాణాపానౌ సమౌకృత్వా నాసాభ్యంతర చారిణౌ'* అనుభవంతో గొంతులోపల ముక్కుకు ఎదురుగా గల భాగమందు ప్రాణాపానములను సమానము చేయు ప్రాణాయామ పరులకే నేను చతుర్విధ ఆహారమును పచనము చేయుదునని భగవానుడు చెప్పుచున్నాడని గ్రహించవలెను.

*శ్లో: దివారాత్రమవిచ్ఛిన్నం యామే యామే యదా తదా*
*అనేనాభ్యాస యోగేన వాయురభ్యసితో భవేత్*
*వాయురభ్యసితే వహ్నిః ప్రత్యహం వర్ధతే తనౌ*
*వహ్నౌవివర్ధమానేతు సుఖమన్నాది జీర్యతే*

*అన్నస్య పరిపాకేన రసవృద్ధి ప్రజాయతే*
*రసేవృద్ధిం గతే నిత్యం వర్ధంతే ధాతవస్తథా*
*ధాతూనామ్ వర్ధనేనైవ ప్రబోధమ్ వర్ధతేతనౌ*
*దహ్యంతే సర్వపాపాని జన్మకోట్యార్జితాని చ* (వరాహోపనిషత్ 5-4)

రాత్రింబవళ్ళు ఎడతెరపి లేకుండా ప్రాణవాయువుతో అభ్యసించువారికి అనగా ప్రాణాయామము చేయువారికి జఠరాగ్ని వృద్ధియై, భుజించు ఆహారము సులువుగా జీర్ణమగును. జీర్ణమైన పిదప అన్నరసము వృద్ధి చెంది ధాతుపుష్టి కలుగును. సప్తధాతువులు వృద్ధి చెందుటచే జ్ఞానము పెరుగుచున్నది. శతకోటి జన్మలలో కలిగిన పాపములన్నియు దహింపబడుచున్నవి.

శ్లో॥ సర్వస్య చాహం హృది సన్నివిష్టో మత్తః స్మృతిర్ జ్ఞానమపోహనం చ
వేదైశ్చ సర్వైరహమేవ వేద్యో వేదాంతకృద్వేదవిదేవ చాహమ్ 15

అహమ్ = నేనే, సర్వస్య, హృది = ప్రతిప్రాణియొక్క హృదయమునందు, సన్నివిష్టః = అంతర్యామిగా ఉన్నవాడను, చ = మరియు, మత్తః = నానుండియే, స్మృతిః = స్మృతి, జ్ఞానమ్ = జ్ఞానము, చ = మరియు, అపోహనమ్ = అపోహనము (సంశయము), (భవతి) = కలుగును, చ = మరియు, సర్వైః, వేదైః = వేదములన్నింటి ద్వారా, అహమ్, ఏవ = నేనే, వేద్యః = తెలిసికొనదగినవాడను, వేదాంతకృత్ = వేదాంతకర్తను, వేదవిత్, చ = వేదములను ఎరిగిన వాడను కూడ, అహమ్, ఏవ = నేనే

తా. సర్వభూతముల హృదయకుహరమున నున్న నా వలననే వారికి పూర్వానుభూతములైన వానిని స్మరించుశక్తి గలుగుచున్నది. పూర్వమజ్ఞాతములైయున్న వానిని తెలిసికొనుతెలివి, ఒకప్పుడు జ్ఞాతములై యున్న వానిని గూర్చి స్మృతి లేకపోవుట, పూర్వముకల జ్ఞానముకూడ ఒకప్పుడు మరుగుపడుట నా వలననే జరుగుచున్నవి. పరమాత్మనగు నేనే సమస్తవేదముల మూలమున తెలియదగియున్నాను. వేదాంతమును రచించినవాడను నేనే. వేదార్థమును తెలిసినవాడను నేనే.

శ్లో॥ ద్వావిమౌ పురుషౌ లోకే క్షరశ్చాక్షర ఏవ చ
క్షరః సర్వాణి భూతాని కూటస్థోఽక్షర ఉచ్యతే 16

లోకే = ఈ జగత్తునందు, క్షరః, చ = క్షరుడు (నశ్వరుడు) అనియు, అక్షరః = అక్షరుడు (నాశరహితుడు) అనియు, ఇమౌ, ద్వౌ, పురుషౌ, ఏవ = ఈ రెండు విధములగు పురుషులే

గలరు, సర్వాణి, భూతాని = సకల ప్రాణుల శరీరములును, క్షరః = నశ్వరములు, చ = మరియు, కూటస్థః = జీవాత్మ, అక్షరః = నాశరహితుడు అని, ఉచ్యతే = పేర్కొనబడుచున్నది.

తా. లోకమున క్షరుడనియు అక్షరుడనియు వ్యవహరింపబడు పురుషులిద్దరు కలరు. నశ్వరములగు భూతములు క్షర శబ్దముచే వ్యవహరింపబడును. క్షరుడనగా నొక కాలమున నుండి మరొక కాలమున నశించు దేహములు. అక్షరుడనగా జీవుడు లేక ప్రాణశక్తి. మాయాధీనుడై యుండువాడు కాన జీవుడు కూటస్థుడని యందురు. కూట శబ్దమునకు మాయ, వంచన, కుటిలతయని అర్థము. సంసార బీజమనంతముగా నుండుటచే జీవత్వ దశనుండి తొలగజాలడు కాన జీవునకక్షరుడగు పురుషుడని పేరు కలిగెను.

శ్లో॥ ఉత్తమః పురుషస్త్వన్యః పరమాత్మేత్యుదాహృతః
యో లోకత్రయమావిశ్య బిభర్త్యవ్యయ ఈశ్వరః 17

ఉత్తమః, పురుషః = (పై ఇద్దరి కంటెను) ఉత్తమ పురుషుడే, తు అన్యః = వేరైనవాడు యః = ఎవడైతే, లోకత్రయమ్, ఆవిశ్య = ముల్లోకములలో ప్రవేశించి, బిభర్తి = అందరిని భరించి, పోషించుచున్నాడో అతడే, అవ్యయః = నాశరహితుడు (శాశ్వతుడు), ఈశ్వరః = పరమేశ్వరుడు, పరమాత్మా, ఇతి = పరమాత్మ అని, ఉదాహృతః = పేర్కొనబడుచున్నాడు

తా. జీవాత్మ అవిద్యనుపాధిగా గ్రహించినవాడు. పరమాత్మ శుద్ధమాయను ఉపాధిగా గ్రహించినవాడు. కావున పరమాత్మను జీవునికంటె ఉత్తముడైన పురుషునిగా చెప్పియున్నారు. ముల్లోకములను వ్యాపించువాడు కాన నిరతిశయుడగు ఈశ్వరుడని స్తుతింపబడుచున్నాడు.

వి. క్షరాక్షర పురుషులకంటె భిన్నుడనుటచే ఉపాధి శూన్యుడనియు నిత్యశుద్ధ ముక్త స్వభావుడగు పరమాత్మయే సర్వత్ర నిండి సర్వపోషకుడై పురుషోత్తముడనియు కీర్తింపబడుచున్నాడు.

శ్లో॥ యస్మాత్ క్షరమతీతోఽహమ్ అక్షరాదపి చోత్తమః
అతోఽస్మి లోకే వేదే చ ప్రథితః పురుషోత్తమః 18

యస్మాత్ = ఏలనన, అహమ్ = నేను, క్షరమ్ = నశ్వరమైన జడవర్గక్షేత్రము కంటెను, అతీతః = పూర్తిగా అతీతుడను, అక్షరాత్, అపి = నాశరహితుడైన జీవాత్మకంటెను, ఉత్తమః = ఉత్తముడను, అతః = ఇందువలన, లోకే, చ = లోకమునందును, వేదే (చ) = వేదమునందును, పురుషోత్తమః = పురుషోత్తముడనని, ప్రథితః, అస్మి = ప్రసిద్ధుడనైతిని

తా. క్షరమను దేహముకంటెను, అక్షరమను జీవాత్మకంటెను, నిర్మల మాయోపాధికుడనగు నేను ఉత్తముడనై యున్నాను. ఇందువలన లోకమునందు వేదమునందు పురుషోత్తమ శబ్దముచే నన్ను చెప్పుకొనుచుందురు.

వి. *శ్లో : అవ్యక్తాత్పరః పురుషోవ్యాపకోసంగ ఏవచ*
*యంజ్ఞాత్వా ముచ్యతే జన్తు రమృతత్వంచ గచ్ఛతి* (శృతి)

పరమాత్మ అవ్యక్తముకంటె అతీతుడు. ఆత్మ తత్త్వమును తెలిసినవాడే ముక్తుడయి అమరత్వమును పొందుచున్నాడు.

శ్లో॥ యో మామేవమసమ్మూఢో జానాతి పురుషోత్తమమ్
స సర్వవిద్భజతి మాం సర్వభావేన భారత 19

భారత = ఓ అర్జునా!, యః, అసమ్మూఢః = ఏ జ్ఞానియైనవాడు, మామ్ = నన్ను, ఏవమ్ = ఈ విధముగా, పురుషోత్తమమ్ = పురుషోత్తమునిగా, జానాతి = తెలుసుకొనునో, సః = ఆ జ్ఞాని, సర్వవిత్ = సర్వజ్ఞుడు, సర్వభావేన = అన్ని విధముల నిరంతరము, మామ్ = వాసుదేవుడనైన నన్ను, భజతి = భజించును.

తా. మోహము జెందక యెవడీవిధముగా పురుషోత్తముడనని నన్ను తెలియగలుగునో వాడే సర్వజ్ఞుడు. సర్వమాత్మయను భావముతో పురుషోత్తముడనగు నన్ను సేవించును. పరమాత్మను సేవించజాలనివాడు మూఢుడని భావము.

శ్లో॥ ఇతి గుహ్యతమం శాస్త్రమ్ ఇదముక్తం మయానఘ
ఏతత్ బుద్ధ్వా బుద్ధిమాన్ స్యాత్ కృతకృత్యశ్చ భారత 20

అనఘ = ఓ పుణ్యపురుషా!, భారత = ఓ అర్జునా!, ఇతి = ఈ విధముగా, ఇదమ్, శాస్త్రమ్ = ఈ శాస్త్రము, మయా = నాచేత, ఉక్తమ్ = చెప్పబడినది, ఏతత్ = దీనిని (ఈ తత్త్వమును), బుద్ధ్వా = తెలిసికొని (మనుష్యుడు), బుద్ధిమాన్ = జ్ఞానియు, కృతకృత్యః, చ = కృతార్థుడును, స్యాత్ = అగును.

తా. పుణ్య జీవుడవయిన ఓ అర్జునా ! నాచే రహస్యాతి రహస్యమగు ఈ శాస్త్రము చెప్పబడినది. అత్యన్త రహస్యమయిన యీ శాస్త్రము తెలిసినవాడు బుద్ధిమంతుడగుచున్నాడు. ఈ విధముగా ఆత్మ తత్త్వము నెరిగినవాడు కృతకృత్యుడగుచున్నాడు.

vi. *'ఏతద్బుద్ధ్వా బుద్ధిమాన్ స్యాత్'* అనియు, *'స బుద్ధిమాన్ మనుష్యేషు'* అనియు, *'సర్వం కర్మాఖిలం పార్థ జ్ఞానే పరి సమాప్యతే'* అనియు జ్ఞానమును పొగడుచున్నాడు. అట్టి జ్ఞానము యోగముచే ప్రాప్యమగును. *'తత్స్వయం యోగసంసిద్ధః' (4-38)* అను గీతా ప్రమాణ వచనమునకు యోగనిష్ఠ కలిగిననే జ్ఞానసిద్ధి కలుగునని భావము.

ఇట్లు
శ్రీ పరమహంస పరివ్రాజకాచార్యులును,
బ్రహ్మర్షి సద్గురు **శ్రీశ్రీశ్రీ శివానంద భగవత్పూజ్యపాద** శిష్యులును నైన
బ్రహ్మర్షి సద్గురు **శ్రీశ్రీశ్రీ స్వామి రామానంద పరమహంస** వారిచే
రచింపబడిన గీతామృతమను టీక యందు
**పురుషోత్తమ ప్రాప్తి యోగ**మను పంచదశాధ్యాయము సమాప్తము.

ఓం శ్రీకృష్ణ పరమాత్మనే నమః

షోడశాధ్యాయము

# దైవాసుర సంపద్విభాగ యోగము

**శ్రీ భగవానువాచ:**

శ్లో॥ అభయం సత్త్వసంశుద్ధిః జ్ఞానయోగవ్యవస్థితిః
దానం దమశ్చ యజ్ఞశ్చ స్వాధ్యాయస్తప ఆర్జవమ్ 1

అభయమ్ = నిర్భయత్వము, సత్త్వసంశుద్ధిః =అంతఃకరణ శుద్ధి, జ్ఞానయోగ వ్యవస్థితిః = తత్త్వజ్ఞానప్రాప్తికై యోగమునందు నిరంతర దృఢస్థితి, చ = మఱియు, దానమ్ = సాత్త్విక దానము, దమః = ఇంద్రియ నిగ్రహము, యజ్ఞః = భగవంతుని, గురువులను, అట్లే దేవతలను పూజించుట, మఱియు అగ్నిహోత్రాది ఉత్తమ కర్మాచరణము, స్వాధ్యాయః = వేదశాస్త్రముల పఠన, పాఠనములు, భగవన్నామ గుణకీర్తనలు, తపః = స్వధర్మాచరణము నందలి కష్టములను ఓర్చుకొనుట, చ = మఱియు, ఆర్జవమ్ = శరీరేంద్రియ అంతఃకరణముల సరళత్వము.

అవ. దైవాసుర సంపద్విభాగముచే గ్రాహ్యాగ్రాహ్యముల తెలియజేయుటకు దైవీ సంపత్తును వివరించుచున్నాడు.

తా. శ్రీకృష్ణభగవానుడర్జునునితో నిట్లనెను. ఓ అర్జునా! నిర్భయముగ నుండుట, శుద్ధాంతఃకరణము కలిగి నిష్కపటభావముతో వ్యవహరించుట, శాస్త్రము ద్వారా కాని, గురుదేవుని ముఖమున కాని తత్త్వమును గ్రహించి అనుభవైకవేద్యము గావించుట అనగా యోగనిష్ఠయందు ఉండుట, అన్నాది వస్తు సంపదను యథాశక్తి పంచుట, బాహ్యేంద్రియముల నిగ్రహించుట, యజ్ఞములందు ప్రవర్తించుట, వేదాధ్యయనము చేయుట, తపస్సు నాచరించుట, ఋజుస్వభావమున నుండుట, దైవీసంపదగా గ్రహించవలెను.

వి. 'సత్త్వసంశుద్ధిః' అంతఃకరణ శుద్ధికి యోగమభ్యసింపవలెనని గీతా వచనమున తెలియును.

'ఉప విశ్వాసనేయుఞ్జ్యాత్ యోగమాత్మ విశుద్ధయే' 'జ్ఞానయోగ వ్యవస్థితిః' జ్ఞాన, యోగములందు నిష్ఠతో నుండుట.

'యోగ జ్ఞాన పరోనిత్యం స యోగీ న ప్రణశ్యతి' (త్రిశిఖిబ్రాహ్మణోపనిషత్-19)

ఈ ప్రమాణముచే జ్ఞానయోగములందు నిష్ఠకలిగిన యోగి, మోక్షమార్గము నుండి భ్రష్టుడు

కాదని భావము. శాస్త్రాచార్యుల ఉపదేశములచే ఆత్మతత్త్వ మెరింగి అట్టి నిశ్చయ జ్ఞానమున మనస్సు నేకాగ్రభావమున నిలుప ప్రయత్నించుటయే యోగము.

శ్లో॥ అహింసా సత్యమక్రోధః త్యాగః శాన్తిరపైశునమ్
దయా భూతేష్వలోలుప్త్వం మార్దవం హ్రీరచాపలమ్ 2

అహింసా = మనోవాక్కాయముల ద్వారా ఎవ్వరికిని ఏవిధముగను కష్టమును కల్గింపకుండుట, సత్యమ్ = యథార్థమైన భాషణము, అక్రోధః = తనకు అపకారము చేయువారిపైగూడ క్రోధము లేకుండుట, త్యాగః = కర్మాచరణమునందు కర్తృత్వాభిమానమును త్యజించుట, శాంతిః = చిత్తచాంచల్యము లేకుండుట, అపైశునమ్ = ఎవరినీ నిందింపకుండుట, భూతేషు, దయా = సకలప్రాణుల యెడలను నిర్హేతుక కృప, అలోలుప్త్వమ్ = ఇంద్రియ విషయ సంయోగమున్నను వాటిపై ఆసక్తి లేకుండుట, మార్దవమ్ = కోమలత్వము, హ్రీః = లోక, శాస్త్రవిరుద్ధ కార్యాచరణమునకు వెనుకాడుట (సిగ్గుపడుట), అచాపలమ్ = వ్యర్థ చేష్టలు చేయకుండుట

తా. ప్రాణి మాత్రమును హింసింపకుండుట, సత్యము పలుకుట, కోపమునకు గురికాకయుండుట, సన్న్యసించుట, అంతఃకరణము విషయాదులపై పోకుండుట, పరుల దోషమునెత్తి చూపకుండుట, దుఃఖితులైన ప్రాణులయెడ దయజూపుట, ఇంద్రియార్థములందు అనుచితమైన సంగభావము లేక యుండుట, క్రౌర్యము విడచుట, సిగ్గుతో నుండుట, ప్రయోజన శూన్యమయిన క్రియల నాచరించకుండుట.

శ్లో॥ తేజః క్షమా ధృతిః శౌచం అద్రోహో నాతిమానితా
భవన్తి సంపదం దైవీమ్ అభిజాతస్య భారత 3

తేజః = తేజస్సు, క్షమా = క్షమ, ధృతిః = ధైర్యము, శౌచమ్ = బాహ్యశుద్ధి, అద్రోహః = ఎవరిపైనను శత్రుభావము లేకుండుట, న, అతిమానితా = తాను పూజ్యుడనను అభిమానము లేకుండుట, భారతా! = ఓ అర్జునా! (పైన తెల్పబడిన గుణములన్నియును), దైవీమ్, సంపదమ్ = దైవీ సంపదతో, అభిజాతస్య = పుట్టినవాని యొక్క (లక్షణములు), భవంతి = అగును.

తా. ఉచిత క్రియలందు దక్షతతో ప్రవర్తించుట, పీడింపబడినను ఓర్మి కలిగి యుండుట, దేహేంద్రియములకు విఘాతము కలిగిన దైన్యము వహింపక ధైర్యముతో నుండుట, బాహ్యాభ్యంతరములందు శౌచము, ఇతరులకు అప్రియము కలుగజేయకుండుట, తానధికుడనని గర్వము లేకుండుట. దైవీ సంపదగా నెన్నుదురు.

శ్లో॥ దమ్భో దర్పోఽభిమానశ్చ క్రోధః పారుష్యమేవ చ
అజ్ఞానం చాభిజాతస్య పార్థ సంపద మాసురీమ్ 4

పార్థ! = ఓ పార్థ!, దంభః = డాంబికము (కపటము), దర్పః, చ = మొండితనము, అభిమానః = దురభిమానము, చ = మఱియు, క్రోధః = క్రోధము, పారుష్యమ్, చ = మాటలయందును, చేష్టలయందును కాఠిన్యము, అజ్ఞానమ్, ఏవ = అజ్ఞానము మొదలగునవి అన్నియును, ఆసురీమ్, సంపదమ్ = ఆసురీ సంపదతో, అభిజాతస్య = పుట్టినవాని (లక్షణములు), (భవంతి) = (అగును).

తా. పరిహార్యములగు ఆసురభావములను చెప్పుచున్నారు. తనను గొప్ప వానినిగా ప్రకటించుకొనుట, ధనాదుల మూలమున కలుగు గర్వము, తానధికుడని అభిమానము కలిగియుండుట, క్రోధమునకు వశుడగుట, క్రూరముగా ప్రవర్తించుట, కృత్యాకృత్యములను వివేకము లేకపోవుటచే విపరీతముగా గ్రహించుట, ఈ లక్షణములు ఆసురభావము కలవారలకు కలుగును.

శ్లో॥ దైవీ సంపద్వి మోక్షాయ నిబన్ధాయాసురీ మతా
మా శుచః సంపదం దైవీమభిజాతోఽసి పాండవ 5

పాండవ = ఓ అర్జునా!, దైవీ సంపత్ = దైవీ సంపద, విమోక్షాయ = ముక్తికొరకు (ముక్తిదాయకము), ఆసురీ = ఆసురీ సంపద, నిబంధాయ = బంధము కొరకు (బంధహేతువు) అని, మతా = భావింపబడును, (అతః) = కనుక, మా శుచః = శోకింపకుము, (యతః) = ఎందువలన అనగా (నీవు), దైవీమ్, సంపదమ్ = దైవీసంపదతో, అభిజాతః, అసి = పుట్టినవాడవు

తా. దైవీ సంపద మోక్షమునకు హేతువగును. ఆసురీ సంపద వలన బంధము కలుగును. ఓ అర్జునా ! నీవు పుట్టుకతో దైవీసంపద కలవాడవు కావున సంసార బంధము వలన భయపడవలదు.

శ్లో॥ ద్వౌ భూతసర్గౌ లోకేఽస్మిన్ దైవ ఆసుర ఏవ చ
దైవో విస్తరశః ప్రోక్తః ఆసురం పార్థ మే శృణు 6

పార్థ = ఓ అర్జునా!, అస్మిన్, లోకే = ఈ లోకమునందు, దైవః = దైవ లక్షణములుగల మానవ సముదాయము, ఆసురః, చ = అసుర లక్షణములుగల మానవ సముదాయము (అని), ద్వౌ, ఏవ = రెండు విధములగు, భూతసర్గౌ = ప్రాణుల (మానవ) సృష్టులు, (స్తః) = (కలవు), దైవః = దైవ లక్షణములుగల సృష్టి (అని), విస్తరశః = విస్తృతముగా, ప్రోక్తః = చెప్పబడినది,

ఆసురమ్ = అసుర సృష్టిని (వారి గూర్చి), మే = నా వలన, శృణు = వినుము.

తా. దైవసృష్టి యనియు, ఆసురసృష్టి యనియు ద్వివిధమగు భూతసృష్టి కలదు. ఈ రెండింటిలో దైవసృష్టిని గూర్చి యధికముగా నీకు జెప్పితిని. అర్జునా ! ఇక ఆసురమైన భూతసృష్టిని చెప్పుదును. వినుము.

శ్లో॥ ప్రవృత్తిం చ నివృత్తిం చ జనా న విదురాసురాః
న శౌచం నాపిచాచారో న సత్యం తేషు విద్యతే 7

ఆసురాః = అసుర స్వభావముగల, జనాః = మనుష్యులు, ప్రవృత్తిమ్, చ = (ధర్మ) ప్రవృత్తిని గాని, నివృత్తిమ్, చ = (అధర్మ) నివృత్తిని గాని, న విదుః = ఎరుంగరు, తేషు = వారిలో, శౌచమ్ = బాహ్యాభ్యంతర శుద్ధి, న, విద్యతే = ఉండదు, ఆచారః, చ = సత్కర్మాచరణమునూ, న = ఉండదు, సత్యమ్, అపి = సత్యభాషణము కూడ, న = ఉండదు

తా. అసుర భావములు కలవారు కృత్యాకృత్యముల వివేకము లేక కర్తవ్యమగు కార్యము చేయజాలరు. అనర్థ ప్రదములగు క్రియలనుండి మరలుట నెరుగరు. శౌచము, సదాచారము తెలియనివారై అశుచిగా నుండుటయే కాక కపటాత్ములై యనృతవాదులగుదురు.

వి. *'న శౌచం నాపిచాచారోనసత్యం'* శౌచమనగా ఇంద్రియ నిగ్రహము. *'శౌచమింద్రియ నిగ్రహమ్'* కావున వారలు ఇంద్రియాధీనులై విషయలంపటులగుదురు. సదాచారము నెరుంగరు. నివృత్తి కర్మనాచరించలేరు. కనుక బాహ్య సంసార కర్మల నాచరించుటయందే సక్తులగుదురు.

శ్లో॥ అసత్యమప్రతిష్ఠం తే జగదాహురనీశ్వరమ్
అపరస్పరసంభూతం కిమన్యత్ కామహైతుకమ్ 8

తే = వారు (ఆసురీ ప్రకృతిగల మనుష్యులు), జగత్ = జగత్తు, అప్రతిష్ఠమ్ = ఆశ్రయ రహితమనియు, అసత్యమ్ = సర్వథా అసత్యమనియు, అనీశ్వరమ్ = ఈశ్వరుడే లేడనియు, పరస్పర సంభూతమ్ = కేవలము స్త్రీ పురుష సంయోగము వలననే ఉత్పన్నమైనదనియు, కామ హైతుకమ్ = కామమే దీనికి కారణమనియు, అన్యత్, కిమ్ = ఇదితప్ప మరేమియు లేదనియు, ఆహుః = పలికెదరు.

తా. ఆసురీ సంపద కలవారు జగత్తు అనృతాలాపములతో కూడినదనియు, ధర్మాధర్మములతో నిమిత్తము లేదనియు, శుభాశుభ ఫలదాతయగు ఈశ్వరుడు లేడనియు చెప్పుచు, కామప్రేరితమైన స్త్రీ పురుష సంయోగముచే జగత్తు ఉత్పన్నమైనదని, ఇంతకంటె వేరుకాదని యందురని భావము.

శ్లో॥ ఏతాం దృష్టిమవష్టభ్య నష్టాత్మానోఽల్పబుద్ధయః
ప్రభవంత్యుగ్రకర్మాణః క్షయాయ జగతోఽహితాః 9

ఏతామ్, దృష్టిమ్ = ఈ మిథ్యావాదమును (నాస్తిక దృష్టిని), అవష్టభ్య = అవలంబించి, నష్టాత్మానః = తమ స్వభావమును కోల్పోయిన వారైన, (ఆత్మయొక్క అస్తిత్వమును విశ్వసింపనివారై) అల్పబుద్ధయః = మందబుద్ధులు, అహితాః = అందరికిని అపకారము చేయునట్టి, ఉగ్రకర్మణాః = క్రూరకర్మలను ఆచరించువారై, జగతః, క్షయాయ = జగత్తు యొక్క వినాశము కొరకే, ప్రభవంతి = సమర్థులగుచున్నారు.

తా. ఈ దృష్టితో ఆసురీ సంపద గలవారు కామభోగ లాలసులయి శరీరముకంటె విలక్షణమైన ఆత్మను తెలిసికొనజాలక మందబుద్ధి కలవారై యుందురు. అట్టివారు లోకక్షయ హేతువులగు ఉగ్రకర్మల నాచరించుచు జగత్తుకు శత్రువులగుచున్నారు.

శ్లో॥ కామమాశ్రిత్య దుష్పూరం దంభమానమదాన్వితాః
మోహాద్గృహీత్వాసద్గ్రాహాన్ ప్రవర్తంతేఽశుచివ్రతాః 10

దంభమాన మదాన్వితాః = దంభము, దురభిమానము, మదము మున్నగువానితోగూడిన వీరు, దుష్పూరమ్ = నింపశక్యముగాని (తనివితీరని), కామమ్, ఆశ్రిత్య = కోరికలను ఆశ్రయించి, మోహాత్ = అజ్ఞాన కారణముగ, అసద్గ్రాహాన్ = మిథ్యా సిద్ధాంతములను, గృహీత్వా = అవలంబించి, అశుచివ్రతాః = శాస్త్ర విరుద్ధములైన భ్రష్టాచారములను ఆచరించుచు, ప్రవర్తంతే = ప్రవర్తించెదరు

తా. ఆసుర భావము కలవారు కావున పాపాచరణులయి అజ్ఞానముచే అశుభములను ఈయ గలుగు నిర్ణయముల చేసి ఎన్నటికిని తృప్తినీయజాలని కామముల వెంటబడుచు దంభమాన మదములతో ప్రవర్తిల్లుదురు.

శ్లో॥ చింతామపరిమేయాం చ ప్రలయాంతాముపాశ్రితాః
కామోపభోగపరమాః ఏతావదితి నిశ్చితాః 11

ప్రలయాంతామ్ = మరణించు వరకును ఉండెడి, అపరిమేయామ్ = అంతులేని, చింతామ్ = చింతా పరంపరను, ఉపాశ్రితాః = ఆశ్రయించినవారై, కామోపభోగపరమాః = విషయభోగానుభవములందే మునిగియున్నవారై, చ = మరియు, ఏతావత్, ఇతి = ఇదియే నిజమైన సుఖమని, నిశ్చితాః = భావింతురు.

తా. ఆమరణము కామోపభోగమే జీవిత పరమావధిగా నిశ్చయించుకొని ఇంద్రియార్థములను సంపాదించవలయునను తృష్ణచే అంతులేని చింతలతో మోహితులై యుందురు.

శ్లో॥ ఆశాపాశశతైర్బద్ధాః కామక్రోధపరాయణాః
ఈహంతే కామభోగార్థమ్ అన్యాయేనార్థసంచయాన్ 12

ఆశాపాశశతైః = ఆశాపాశ పరంపరలచే, బద్ధాః = బంధింపబడినవారు, కామక్రోధ పరాయణాః = కామక్రోధములకు లోనైనవారై, కామభోగార్థమ్ = విషయ భోగముల నిమిత్తమై, అన్యాయేన = అక్రమ మార్గముల ద్వారా, అర్థసంచయాన్ = ధన సమూహములను ప్రోగుచేయుట కొరకు, ఈహంతే = ఆరాటపడుచుందురు

తా. అనంతములుగానున్న ఆశాపాశములు బంధములు కాగా కామక్రోధములకు చిక్కుకొందురు. అట్టివారు కామభోగముల నిమిత్తము, పాప కార్యములనాచరించి ధనమార్జించవలెననికోరుదురు.

శ్లో॥ ఇదమద్య మయా లబ్ధమ్ ఇమం ప్రాప్స్యే మనోరథమ్
ఇదమస్తీదమపి మే భవిష్యతి పునర్ధనమ్ 13

మయా = నాచేత, అద్య = ఈనాటికే (ఇప్పటికే), ఇదమ్ = ఇట్టి అభీష్ట వస్తువు(లు), లబ్ధమ్ = పొందబడినది(వి), ఇమమ్, మనోరథమ్ = ఇంకను ఇట్టి అభీష్టమునుగూడ, ప్రాప్స్యే = పొందగలను, మే = నాయొద్ద, ఇదమ్, ధనమ్ = ఈపాటి ధనము, అస్తి = కలదు, పునః, అపి = ఇంకను, ఇదమ్, భవిష్యతి = ఈ సంపద ఎంతో పెరుగును.

తా. ఇప్పుడు నా యీ కోరిక సఫలమైనది. మరియొక కోరిక కొలది దినములలో సిద్ధించును. నాకీ ధనము కలదు. ఇంకను ముందు కాలమున మరికొంత ధనము రాగలదు.

శ్లో॥ అసౌ మయా హతః శత్రుః హనిష్యే చాపరానపి
ఈశ్వరోఽహమహం భోగీ సిద్ధోఽహం బలవాన్ సుఖీ 14

అసౌ, శత్రుః = ఈ శత్రువు, మయా = నాచేత, హతః = చంపబడెను, చ = మరియు, అపరాన్, అపి = ఇతర శత్రువులనుగూడ, అహమ్, హనిష్యే = నేను వధింపగలను, అహమ్, ఈశ్వరః = నేనే సర్వాధిపతిని, భోగీ = సమస్త భోగములను అనుభవించువాడను, అహమ్, సిద్ధః = నేను సర్వ సిద్ధులు గలవాడను, బలవాన్ = నేను మిక్కిలి బలవంతుడను, సుఖీ = సుఖిని

తా. నాచే యీ శత్రువు మృతిజెందెను. తరువాత ఇంకను కొంతమంది శత్రువులను జంపి వేయుదును. నేను ప్రభువును. సకల భోగములను అనుభవించెదను. నేను బలవంతుడను, సుఖమనుభవించుదును. సర్వ మనోరథములు సిద్ధించినవి.

శ్లో॥ ఆఢ్యోఽ భిజనవానస్మి కోఽ న్యోఽ స్తి సదృశో మయా
యక్ష్యే దాస్యామి మోదిష్య ఇత్యజ్ఞానవిమోహితాః 15

శ్లో॥ అనేకచిత్తవిభ్రాంతాః మోహజాలసమావృతాః
ప్రసక్తాః కామభోగేషు పతంతి నరకేఽ శుచౌ 16

ఆఢ్యః (అహమ్) = నేను గొప్ప ధనవంతుడను, అభిజనవాన్, అస్మి = గొప్ప పరివారము గలవాడను, మయా, సదృశః = నాతో సమానుడైనవాడు, అన్యః = మరియొకడు, కః, అస్తి = ఎవడు కలడు?, యక్ష్యే = యజ్ఞములను చేయగలను, దాస్యామి = దానములను ఈయగలను, మోదిష్యే = యథేచ్ఛగా వినోదింపగలను, ఇతి = ఇట్లు, అజ్ఞాన విమోహితాః = అజ్ఞాన విమోహితులై, అనేక చిత్త విభ్రాంతాః = పెక్కురీతుల చిత్త భ్రమణములకు లోనై, మోహజాల సమావృతాః = మోహజాలమున చిక్కుకున్నవారై, కామభోగేషు = విషయ భోగముల యందు, ప్రసక్తాః = మిక్కిలి ఆసక్తులై (ఈ ఆసురీ సంపద గలవారు), అశుచౌ, నరకే = ఘోర నరకములయందు, పతంతి = పడుచుందురు

తా. నేను ధనాఢ్యుడను, సత్కులమున బుట్టితిని, నావంటి వాడెవడు కలడు, యాగములజేసి యితరులకు ధనమిచ్చుదును. సంతోషము వలన సుఖముగానుందును. ఈ రీతిగా పెక్కురీతుల అజ్ఞానము మూలమున తలపోయుచుందును.

పై జెప్పిన విధంబున మనంబున అనేక విధములుగా ఊహించుచు భ్రాంతిజెంది వివేక హీనులగువారు కామభోగ పరాయణులగుదురు. అట్టివారు కడకు దుఃఖహేతువై చూచుటకు జుగుప్సాకరమగు నరకమున పడుచున్నారు.

శ్లో॥ ఆత్మసంభావితాః స్తబ్ధా ధనమానమదాన్వితాః
యజంతే నామయజ్ఞైస్తే దంభేనావిధిపూర్వకమ్ 17

తే = వారు (ఈ అసుర లక్షణములు గలవారు), ఆత్మ సంభావితా = తమకు తామే గొప్పవారమని తలంచుకొందురు, స్తబ్ధాః = స్తబ్ధులై (గర్వోన్మత్తులై), ధనమాన మదాన్వితాః = సంపదలచే, దురభిమానముచే మదోన్మత్తులై విర్రవీగువారు, అవిధిపూర్వకమ్ = శాస్త్ర విరుద్ధముగా,

నామయజ్ఞైః = పేరుకు మాత్రమే, దంభేన = ఆడంబరముతో, యజంతే = యజ్ఞములను ఆచరింతురు

తా. తనయందు అధికత్వము ఆరోపించుకొని, పొగడుకొనుచు, ధనమూలమున మదాహం కారములు కలిగి పెద్దలకు నమస్కరింపక ఘనతను కోరి, విధివిధానమునాదరింపక నామ మాత్రమునకు యజ్ఞములను చేయుదురు.

శ్లో॥ అహంకారం బలం దర్పం కామం క్రోధం చ సంశ్రితాః
మామాత్మపరదేహేషు ప్రద్విషంతోఽభ్యసూయకాః 18

అహంకారమ్ = అహంకారము, బలమ్ = బలము, దర్పమ్ = దర్పము (మొండితనము), కామమ్ = కామము, క్రోధమ్ = క్రోధము (మొదలుగునవి), సంశ్రితాః, చ = ఆశ్రయించినవారై, అభ్యసూయకాః = అసూయతో ఇతరులను నిందించువారై, ఆత్మ పరదేహేషు = తమ శరీరములయందును, ఇతరుల శరీరములయందును, మామ్ = అంతర్యామిగా ఉన్న నన్ను, ప్రద్విషంతః = ద్వేషించుచుందురు.

తా. గుణదోష వర్జితుడయిన ఆత్మ తానై యున్నను, ఉపాధిగత గుణములచేతను, అవిద్య మానములైన గుణములను తనయందు ఆరోపించుకొనియు తనను విశిష్టమైన వానినిగా భావించి అహంకరించుచుండును. ఉపాధియగు దేహేంద్రియాదికమును తానుగా భావించుచు కామక్రోధ బలదర్పముల నాశ్రయించి యుందురు. అట్టివారు తమ దేహమందును, పరకాయములందును, సాక్షిమాత్రుడైయున్న పరమాత్మను సేవించక సాధువుల యెడ అసూయగానుందురు.

శ్లో॥ తానహం ద్విషతః క్రూరాన్ సంసారేషు నరాధమాన్
క్షిపామ్యజస్రమశుభాన్ ఆసురీష్వేవ యోనిషు 19

తాన్, ద్విషతః = అట్లు ద్వేషించువారైన, అశుభాన్ = పాపాత్ములను, క్రూరాన్, నరాధమాన్ = క్రూరులైన నరాధములను, అహమ్ = నేను, సంసారేషు = ఈ సంసారములయందు, అజస్రమ్ = ఎల్లప్పుడును, మాటిమాటికిని, ఆసురీషు = ఆసురీ, యోనిషు, ఏవ = యోనులయందే, క్షిపామి = పడవేయుదును.

తా. సర్వ ప్రాణులందు సాక్షిగా నున్న ఈశ్వరుని, సాధువులను, ద్వేషించు వారు క్రూరులు. అట్టివారే పురుషాధములు, అసుర భావములతో నిండిన ఆ క్రూరులను నీచ జన్మలందు పడవేయుదును.

వారశుభ కర్మాచరణులే యగుదురు.

శ్లో॥ ఆసురీం యోనిమాపన్నా మూఢా జన్మని జన్మని
మామప్రాప్యైవ కౌన్తేయ తతో యాంత్యధమాం గతిమ్ 20

కౌంతేయ = ఓ అర్జునా!, మూఢాః = ఈ మూఢులు, మామ్, అప్రాప్య, ఏవ = నన్ను పొందకయే, జన్మని, జన్మని = ప్రతిజన్మయందును, ఆసురీమ్, యోనిమ్ = ఆసురీయోనిని, ఆపన్నాః = పొందినవారై, తతః = దానికంటెను, అధమామ్, గతిమ్ = అతిహీనమైన గతిని (నరకమును), యాంతి = పొందుదురు

తా. అసుర భావములు కలిగి నన్ను తెలియ జాలరు కాన వివేక శూన్యులగువారెన్ని జన్మలకైను నన్ను చేరలేక యధములై హీనగతులను బొందుచున్నారు.

శ్లో॥ త్రివిధం నరకస్యేదం ద్వారం నాశనమాత్మనః
కామః క్రోధస్తథా లోభః తస్మాదేతత్త్రయం త్యజేత్ 21

కామః = కామము, క్రోధః = క్రోధము, తథా = అట్లే, లోభః = లోభము, ఇదమ్, త్రివిధమ్ = ఈ మూడువిధములైన, నరకస్య, ద్వారమ్ = నరక ద్వారములును, ఆత్మనః, నాశనమ్ = ఆత్మనాశనమునకు కారణమైనవి, తస్మాత్ = అందువలన, ఏతత్, త్రయమ్ = ఈ మూడింటిని, త్యజేత్ = త్యజింపవలెను

తా. కామము, క్రోధము, లోభము అను మూడును నరక హేతువులును, ఆత్మజ్ఞాన ప్రతిబంధకములును గాన ఈ మూడింటిని ముముక్షువు వదలవలెను.

శ్లో॥ ఏతైర్విముక్తః కౌంతేయ తమోద్వారైః త్రిభిర్నరః
ఆచరత్యాత్మనః శ్రేయః తతో యాతి పరాం గతిమ్ 22

కౌంతేయ = ఓ అర్జునా!, ఏతైః, త్రిభిః, తమోద్వారైః = ఈ మూడు నరక ద్వారముల నుండి, విముక్తః, నరః = బయటపడినవాడు, ఆత్మనః, శ్రేయః = తనకు శ్రేయస్కరమైన (శుభకర్మలనే), ఆచరతి = ఆచరించును, తతః = దానివలన (అతడు), పరామ్, గతిమ్ = పరమగతిని, యాతి = పొందును. అనగా నన్నే పొందును.

తా. ఓ అర్జునా ! నరకద్వారములైన కామక్రోధ లోభములను విడిచిన అనంతరమే నరుడు

తనకు శ్రేయోదాయకమగు మార్గమవలంబించి ఉత్తమగతిని పొందును.

శ్లో॥ యః శాస్త్రవిధిముత్సృజ్య వర్తతే కామకారతః
న స సిద్ధి మవాప్నోతి న సుఖం న పరాం గతిమ్ 23

యః = ఏ మనుష్యుడు, శాస్త్రవిధిమ్ = శాస్త్రోక్త విధులను, ఉత్సృజ్య = త్యజించి, కామకారతః = తన ఇష్టము వచ్చినట్లు (విశృంఖలముగా), వర్తతే = ప్రవర్తించునో, సః = అతడు, సిద్ధిమ్ = సిద్ధిని, న, అవాప్నోతి = పొందజాలడు, పరామ్, గతిమ్ = పరమగతిని, న = పొందజాలడు, సుఖమ్ = సుఖమును సైతము, న = పొందజాలడు

తా. కృత్యాకృత్యముల తెలుపు శాస్త్రమును ఆదరింపక కామప్రేరితుడయి కర్మ నాచరించుటచే యథోక్తమగు ఫలమునుగాని, సుఖమునుగాని పొందలేడు. అట్టివాడు పరమపదమునెట్లు పొందగలుగును ?

వి. శాస్త్రోక్తమైన మార్గమును అనుసరించినవానికే ఆత్మజ్ఞాన లాభమను సిద్ధి కలుగును. ఆత్మరతుడై ఉండుటయే సుఖము. ఆత్మరతి కలుగుటకు గురూపదేశమున శ్రద్ధాసక్తులు కలిగి యత్నించవలయును. అట్టి వానికే ఆత్మారాముడగుట సంభవించును.

శ్లో॥ తస్మాచ్ఛాస్త్రం ప్రమాణం తే కార్యాకార్యవ్యవస్థితౌ
జ్ఞాత్వా శాస్త్రవిధానోక్తం కర్మ కర్తుమిహార్హసి 24

తస్మాత్ = అందువలన, తే = నీకు, ఇహ = ఈ, కార్యాకార్య వ్యవస్థితౌ = కార్యాకార్య వ్యవస్థితియందు, శాస్త్రమ్, ప్రమాణమ్ = శాస్త్రమే ప్రమాణము, ఏవమ్, జ్ఞాత్వా = ఈ విషయమును ఎరిగి, శాస్త్రవిధానోక్తమ్ = శాస్త్ర మర్యాదను అనుసరించి చెప్పబడిన, కర్మ = కర్మలనే, కర్తుమ్ = చేయుటకు, అర్హసి = తగియున్నావు (ఆచరింపుము).

తా. కృత్యాకృత్యముల నిర్ణయమునకు శాస్త్రమును ప్రమాణముగా గ్రహించవలయును. శాస్త్రోక్త విధానమును తెలిసి కర్మనాచరించదగునని భగవానుడైన శ్రీకృష్ణుడర్జునునితో ననెను.

వి. 'శాస్త్రం ప్రమాణంతే'

శ్లో॥ ఉచ్ఛాస్త్రం శాస్త్రితంచేతి పౌరుషం ద్వివిధం స్మృతం
తదుచ్ఛాస్త్రమనర్థాయ పరమార్థాయశాస్త్రితమ్ (మైత్రేయ్యుపనిషత్ )

**శ్రీమద్భగవద్గీత**

అను ప్రమాణమున ఉచ్ఛాస్త్రమన అనర్థదాయకమగు కర్మలనాచరించుటను చెప్పు శాస్త్రము. శాస్త్రితమనగా పరమార్థ ప్రాప్త్యుపాయమును బోధించు శాస్త్రమే శాస్త్రమనియు భావము.

ఇట్లు
శ్రీ పరమహంస పరివ్రాజకాచార్యులును,
బ్రహ్మర్షి సద్గురు **శ్రీశ్రీశ్రీ శివానంద భగవత్పూజ్యపాద** శిష్యులును నైన
బ్రహ్మర్షి సద్గురు **శ్రీశ్రీశ్రీ స్వామి రామానంద పరమహంస** వారిచే
రచింపబడిన గీతామృతమను టీక యందు
**దైవాసుర సంపద్విభాగ యోగ**మను షోడశాధ్యాయము సమాప్తము.

ఓం శ్రీకృష్ణ పరమాత్మనే నమః

సప్తదశాధ్యాయము

# శ్రద్ధాత్రయ విభాగ యోగము

**అర్జున ఉవాచ:**

శ్లో॥ యే శాస్త్ర విధిముత్సృజ్య యజంతే శ్రద్ధయాన్వితాః

తేషాం నిష్ఠా తు కా కృష్ణ సత్త్వమాహో రజస్తమః 1

కృష్ణ = ఓ కృష్ణా!, యే = ఎవరైతే, శాస్త్రవిధిమ్ = శాస్త్ర విధానమును, ఉత్సృజ్య = త్యజించి, శ్రద్ధయా, అన్వితాః = భక్తిశ్రద్ధలు గలవారై, యజంతే = దేవ పూజాదికములను ఆచరింతురో, తేషామ్ = వారియొక్క, నిష్ఠా, తు = నిష్ఠ అయితే, కా = ఎట్టిది? (అది), సత్త్వమ్ = సాత్త్వికమా?, ఆహో = అథవా (లేక), రజః = రాజసమా? (లేక), తమః = తామసికమా?

తా. శాస్త్రవిధిననుసరించక శ్రద్ధావంతులై పూజలు చేయువారి నిష్ఠ,సత్త్వ రజస్తమో గుణములలో నేగుణము ననుసరించి యుండునను ప్రశ్నను పార్థుడు కృష్ణుని యడిగెను.

**శ్రీభగవానువాచ:**

శ్లో॥ త్రివిధా భవతి శ్రద్ధా దేహినాం సా స్వభావజా

సాత్త్వికీ రాజసీ చైవ తామసీ చేతి తాం శృణు 2

దేహినామ్ = మనుష్యుల యొక్క, స్వభావజా = స్వభావమును అనుసరించి ఏర్పడు, సా, శ్రద్ధా = శాస్త్రవిధిని పాటింపని, అట్టి శ్రద్ధ, సాత్త్వికీ, చ = సాత్త్వికమనియు, రాజసీ, చ = రాజసమనియు, తామసీ, ఇతి = తామసమనియు, త్రివిధా, ఏవ = మూడు విధములుగనే, భవతి = ఉండును, తామ్ = అట్టి శ్రద్ధను గూర్చి, (మత్తః) = నానుండి, శృణు = వినుము

తా. దేహధారులకు ప్రాక్తన కర్మలచే స్వభావ సిద్ధమయియున్న శ్రద్ధ సత్త్వ రజస్తమోగుణముల మూలమున మూడు విధములుగా నుండునని కృష్ణ భగవానుడర్జునునితో చెప్ప నారంభించెను. సత్త్వగుణ మూలకమైన శ్రద్ధను సాత్త్వికీ శ్రద్ధయనియు, రజోగుణ మూలమున కలిగిన శ్రద్ధను, రాజసీ శ్రద్ధ యనియు, తమోగుణము మూలమున కలిగిన శ్రద్ధను, తామసీ శ్రద్ధయనియు నందురు.

శ్లో॥ సత్త్వానురూపా సర్వస్య శ్రద్ధా భవతి భారత

శ్రద్ధామయోఽయం పురుషో యో యచ్ఛ్రద్ధః స ఏవ సః 3

భారత = ఓ అర్జునా!, సర్వస్య, శ్రద్ధా = ప్రతివ్యక్తియొక్క శ్రద్ధయు, సత్త్వానురూపా = వారి అంతఃకరణ రీతికి తగినట్లు, భవతి = ఉండును, అయమ్, పురుషః = ఈ పురుషుడు, శ్రద్ధామయః = ఏదేని ఒక శ్రద్ధను కలిగియే ఉండును, (అతః) = ఇందువలన, యః = ఏ పురుషుడు, యచ్ఛ్రద్ధః = ఎట్టి శ్రద్ధ కలవాడో, సః = అతడు, సః, ఏవ = తద్రూపము గలవాడేయగును.

తా. ఓ అర్జునా ! సమస్త ప్రాణులకు వారి వారి యన్తఃకరణములకు కల సంస్కారముల ననుసరించి శ్రద్ధ వేరు వేరుగా నుండును. సంసారమున బద్ధుడై యున్న జీవునకు కల శ్రద్ధ కనురూపముగా వాని ప్రవృత్తులుండును.

శ్లో॥ యజన్తే సాత్త్వికా దేవాన్ యక్షరక్షాంసి రాజసాః
ప్రేతాన్ భూతగణాంశ్చాన్ యే యజంతే తామసా జనాః 4

సాత్త్వికాః = సాత్త్విక పురుషులు, దేవాన్ = దేవతలను, యజంతే = పూజింతురు, రాజసాః = రాజస పురుషులు, యక్షరక్షాంసి = యక్షులను, రాక్షసులను, అన్యే, తామసాః జనాః = ఇతరులైన తామసా లక్షణములు గలవారు, ప్రేతాన్ = ప్రేతములను, భూతగణాన్, చ = భూతగణములను, యజంతే = పూజింతురు

తా. సత్త్వగుణ ప్రధానులు దేవతలను పూజించుదురు. రజోగుణ ప్రధానులు యక్షులను, రాక్షసులను పూజించుదురు. తమోగుణ ప్రధానులు ప్రేతములను సప్తమాతృకాది భూతగణములను పూజించుదురు. పూజాభేదముచే వారికి ఆయా శ్రద్ధలు కలవని తెలియుము.

శ్లో॥ అశాస్త్రవిహితం ఘోరం తప్యంతే యే తపో జనాః
దమ్భాహంకారసంయుక్తాః కామరాగబలాన్వితాః 5

శ్లో॥ కర్శయంతః శరీరస్థం భూతగ్రామమచేతసః
మాం చైవాంతఃశరీరస్థం తాన్ విద్ధ్యాసురనిశ్చయాన్ 6

దంభాహంకార సంయుక్తాః = దంభము, అహంకారములతో కూడియుండు వారు, మరియు కామ, రాగ, బలాన్వితాః = కోరికలు, ఆసక్తి కలిగియుండి బలగర్వితులైనవారు, యే, జనాః = ఏ మనుష్యులు, అశాస్త్ర విహితమ్ = శాస్త్ర విరుద్ధమైన (కేవలము మనస్సునకు తోచిన రీతిగా), ఘోరమ్, తపః = ఘోరమైన తపస్సును, తప్యంతే = ఆచరింతురో, శరీరస్థమ్ = శరీరముల యందున్న, భూతగ్రామమ్ = భూత సముదాయమును, చ = మరియు, అంతశ్శరీరస్థమ్ =

అంతర్యామిగానున్న, మామ్, ఏవ = పరమాత్ముడనైన నన్నే, కర్శయంతః = కృశింపజేయుచుందురు, తాన్, అచేతసః = అట్టి అజ్ఞానులను, ఆసుర నిశ్చయాన్ = ఆసుర స్వభావములు గలవారిని, విద్ధి = ఎరుంగుము.

తా. శాస్త్ర విహితము కానిదియు, తమకు నితరులకును పీడాకరమైన తపస్సును దంభాహంకారములు కలిగి కామరాగాతిశయముచే చేయువారును, వివేకము లేమిచే శరీరమందున్న ఇన్ద్రియజాలమును, శరీరము లోపలనున్న అన్తరాత్మ నైన నన్ను కృశింపజేయుచు తపస్సు నాచరించు వారాసురభావము గలవారని గ్రహించుము.

శ్లో॥ ఆహారస్త్వపి సర్వస్య త్రివిధో భవతి ప్రియః
యజ్ఞస్తపస్తథా దానం తేషాం భేదమిమం శృణు 7

సర్వస్య = ప్రతివ్యక్తిని, ఆహారః, అపి = (వాని వాని స్వభావమును అనుసరించి) ఆహారము గూడ, త్రివిధః = మూడు విధములుగా, ప్రియః, భవతి = ప్రియముగా ఉండును, తు = మరియు, తథా = అట్లే, యజ్ఞః = యజ్ఞము, తపః = తపస్సు, దానమ్ = దానము (అనునవి గూడ మూడు విధములు), తేషామ్ = వాటియొక్క, ఇమమ్, భేదమ్ = ఈ భేదమును వేర్వేరుగా, శృణు = వినుము.

తా. వారి వారి గుణ విశేషముల వలన సర్వజీవులకును ప్రియమైన ఆహారము, వారు చేయు యజ్ఞము, తపస్సు, దానము, త్రివిధములుగా నుండును.

శ్లో॥ ఆయుఃసత్త్వబలారోగ్యసుఖప్రీతివివర్ధనాః
రస్యాః స్నిగ్ధాః స్థిరా హృద్యా ఆహారాః సాత్త్వికప్రియాః 8

ఆయుఃసత్త్వబలారోగ్యసుఖప్రీతివివర్ధనాః = ఆయువు, బుద్ధి, బలము, ఆరోగ్యము, సుఖము, ప్రీతి, మున్నగు వాటిని అభివృద్ధి పరచునవి, రస్యాః = రసయుక్తములైనవి, స్నిగ్ధాః = స్నిగ్ధములైనవి అనగా చమురు గలవి, స్థిరాః = స్థిరముగా ఉండునవి, హృద్యాః = సహజముగ మనః ప్రీతికరములైన, ఆహారాః = ఆహార పదార్థములు, సాత్త్విక ప్రియాః = సాత్త్విక లక్షణములు గలవారికి ప్రియమైనవి.

తా. రసవంతములైనవియు, చమురు గలవియు, చిరస్థాయిగా నుండి బలవర్ధక మగునవియు, మనోహరములైనవియు, ఆయుష్యమును, బుద్ధిని, బలమును, ఆరోగ్యమును, సుఖసంతోషములను

వృద్ధిజేయు ఆహారములు సాత్త్వికులకు ప్రియములై యుండును.

శ్లో॥ కట్వామ్లలవణాత్యుష్ణ తీక్ష్ణ రూక్ష విదాహినః
ఆహారా రాజసస్యేష్టా దుఃఖశోకామయప్రదాః 9

కటు = చేదు, ఆమ్ల = పులుపు, లవణ = ఉప్పు, అత్యుష్ణ = మిక్కిలి వేడి, తీక్ష్ణ = కారము రూక్ష = మాడిన, విదాహినః = దాహకములైన పదార్థములును, దుఃఖశోక ఆమయప్రదాః = దుఃఖమును, చింతలను, రోగములను, కలిగించునట్టివియు అగు, ఆహారాః = ఆహార పదార్థములు, రాజసస్య = రాజస పురుషునకు, ఇష్టాః = ప్రియములైనవి

తా. కటువుగాను, పుల్లగాను, ఉప్పగాను మిక్కిలి వేడిగానునున్న యాహారములును, మిక్కిలి చురుకుగాను, రసములేక ఎండిపోయినవియు, మిక్కిలి మంటగా నుండునవియునగు ఆహారములు రాజసున కిష్టములగునను. ఈ ఆహారములు దుఃఖమును శోకమును కలిగించుచు, రోగములను కలుగజేయును.

శ్లో॥ యాతయామం గతరసం పూతి పర్యుషితం చ యత్
ఉచ్ఛిష్టమపి చామేధ్యం భోజనం తామసప్రియమ్ 10

యత్, భోజనమ్ = ఏ భోజనమైతే, యాతయామమ్ = వండిన పిదప ఒక జాము కాలము గడచినదియు, బాగుగా ఉడకనిదియు, గతరసమ్ = రసహీనమైనదియు, పూతి = దుర్గంధయుక్తమైనదియు, పర్యుషితమ్, చ = పాసిపోయినట్టిదియును, ఉచ్ఛిష్టం, చ = ఎంగిలియైనదియు, అమేధ్యమ్, అపి = అపవిత్రమైనదియు అగునో, తత్ = అట్టి భోజనము, తామసప్రియమ్ = తామస లక్షణములు గలవారికి ప్రియమైనది

తా. బాగుగా పక్వము కానిదియు, రసమింకినదియు, దుర్గన్ధము కలదియు, పక్వమయి రాత్రి గడచినదియు భుజించగా మిగిలినదియు, (ఎంగిలి) అపవిత్రమైనదియునగు ఆహారములు తామసులకు ప్రియములగును.

శ్లో॥ అఫలాకాంక్షిభిర్యజ్ఞో విధిదృష్టో య ఇజ్యతే
యష్టవ్యమేవేతి మనః సమాధాయ స సాత్త్వికః 11

యః, యజ్ఞః = ఏ యజ్ఞము, విధిదృష్టః = శాస్త్రోక్తమైనదో, యష్టవ్యమ్, ఏవ, ఇతి, మనః, సమాధాయ = ఇది నాకు కర్తవ్యమే, అని మనస్సున దృఢముగా నిశ్చయించుకొని,

అఫలాకాంక్షిభిః = ప్రతిఫలాపేక్ష లేనివారిచే, ఇజ్యతే = చేయబడునో, సః = ఆ యజ్ఞము, సాత్త్వికః = సాత్త్వికము.

తా. ఫలమందపేక్షలేక యజ్ఞము చేయుటయే విధియని తలచి సమాహితచిత్తుడై శాస్త్రోక్తరీతిని యజ్ఞము చేయువాడు సాత్త్వికుడు. ఆ యజ్ఞము సాత్త్విక మనబడును.

శ్లో॥ అభిసంధాయ తు ఫలం దమ్భార్థమపి చైవ యత్
ఇజ్యతే భరతశ్రేష్ఠ తం యజ్ఞం విద్ధి రాజసమ్ 12

తు = కాని, భరతశ్రేష్ఠ = ఓ అర్జునా!, యత్ = ఏది, దంభార్థమ్, ఏవ = (సరియైన నిష్ఠ లేకుండ) ఆడంబరము కొరకు ఆచరింపబడునో, చ = మరియు, ఫలమ్, అపి = ఫలమును గూడ, అభిసంధాయ = దృష్టిలో ఉంచుకొని, ఇజ్యతే = చేయబడునో, తమ్, యజ్ఞమ్ = అట్టి యజ్ఞమును, రాజసమ్ = రాజసమైనదిగా, విద్ధి = ఎరుంగుము.

తా. ఫలాపేక్షతో చేయు యజ్ఞము, దమ్భమునకై చేయు యజ్ఞము, రాజసమైనదని అర్జునా గ్రహింపుము.

శ్లో॥ విధిహీనమసృష్టాన్నం మంత్రహీనమదక్షిణమ్
శ్రద్ధావిరహితం యజ్ఞం తామసం పరిచక్షతే 13

విధిహీనమ్ = శాస్త్ర విధులను పాటింపనిదియును, అసృష్టాన్నమ్ = అన్నదాన రహితమైనదియు, మంత్రహీనమ్ = మంత్రహీనమైనదియు, అదక్షిణమ్ = దక్షిణలు లేనిదియు, శ్రద్ధావిరహితమ్ = శ్రద్ధ లేకుండ చేయబడునదియు అగు, యజ్ఞమ్ = యజ్ఞమును, తామసమ్ = తామసమైనదిగా, పరిచక్షతే = చెప్పుదురు.

తా. శాస్త్రవిహితము కానట్టియు, మన్త్రలోపము కలదియు, అన్నదాన రహితమైనదియు, శ్రద్ధరహితమైనదియు, యథోక్త దక్షిణాశూన్యమైనదియునైన యజ్ఞము తామస మనబడును.

శ్లో॥ దేవద్విజగురుప్రాజ్ఞపూజనం శౌచమార్జవమ్
బ్రహ్మచర్యమహింసా చ శారీరం తప ఉచ్యతే 14

దేవ, ద్విజ, గురు, ప్రాజ్ఞ పూజనమ్ = దేవతలను, బ్రాహ్మణులను, గురువులను, జ్ఞానులను పూజించుట, శౌచమ్ = పవిత్రత, ఆర్జవమ్ = ఋజుత్వము, (మనో వాక్కాయములయందు సరళత్వము కలిగియుండుట), బ్రహ్మచర్యమ్, చ = బ్రహ్మచర్య వ్రతమును పాటించుట, అహింసా = అహింసయు,

శారీరమ్, తపః = శారీరకమైన తపస్సు అని, ఉచ్యతే = చెప్పబడును

తా. దేవతలను, బ్రహ్మవేత్తలను, గురువులను, ప్రాజ్ఞులను పూజించుటయు ఇన్ద్రియ నిగ్రహము కలిగి ఋజుమార్గమవలంబించుటయు, బ్రహ్మచర్య వ్రతమాచరించుట, ప్రాణి మాత్రమును హింసింపకుండుటయు శారీరతపమని యనబడును.

శ్లో॥ అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియహితం చ యత్
స్వాధ్యాయాభ్యసనం చైవ వాఙ్మయం తప ఉచ్యతే 15

యత్ = ఏదయితే, అనుద్వేగకరమ్ = ఉద్వేగమును కల్గింపనిదియు, ప్రియహితమ్, చ = ప్రియమైనదియు, హితకరమైనదియు, సత్యమ్ = యథార్థమైనది అగు, వాక్యమ్ = భాషణమో, చ = ఆ విధముగానే, స్వాధ్యాయాభ్యసనమ్ = వేదశాస్త్ర పఠనములతో పరమేశ్వర ప్రాప్తికై చేయు, యోగాభ్యాసములతో కూడియున్నదో, (తత్) ఏవ = అదియే, వాఙ్మయమ్, తపః = వాక్కులకు సంబంధించిన తపస్సు అని, ఉచ్యతే = పేర్కొనబడును

తా. ప్రాణులకు కష్టము కలిగించనిదియు, ప్రియము హితమైన సత్యమును పలుకుటయు, వేదాధ్యయనము చేయుటయు, వాఙ్మయమగు తపస్సుగా చెప్పబడును.

శ్లో॥ మనఃప్రసాదః సౌమ్యత్వం మౌనమాత్మవినిగ్రహః
భావసంశుద్ధిరిత్యేతత్ తపో మానసముచ్యతే 16

మనఃప్రసాదః = మనః ప్రసన్నత, సౌమ్యత్వమ్ = శాంత స్వభావము, మౌనమ్ = భగవచ్చింతనము, ఆత్మవినిగ్రహః = మనో నిగ్రహము మరియు, భావసంశుద్ధిః = అంతఃకరణమునందలి భావముల పవిత్రత, ఇతి, ఏతత్, తపః = అనెడి ఈ విధమైన తపస్సు, మానసమ్ = మానసికమైనదిగా, ఉచ్యతే = చెప్పబడును.

తా. మనస్సు ప్రశాంతముగా నుండుట, సౌమనస్యము, మౌనవ్రతము, ఇన్ద్రియార్థములవైపు పోనీయక మనోనిరోధము కలిగియుండుట, అన్తఃకరణ పారిశుద్ధ్యము అనగా సంకల్పముచే కూడ పరులను వంచింపకుండుట మానసమైన తపస్సని యనబడును.

శ్లో॥ శ్రద్ధయా పరయా తప్తం తపస్తత్ త్రివిధం నరైః
అఫలాకాంక్షిభిర్యుక్తైః సాత్త్వికం పరిచక్షతే 17

అఫలాకాంక్షిభిః = ఫలాపేక్షలేనివారగు, యుక్తైః, నరైః = యోగులచేత, పరయా, శ్రద్ధయా

తప్తమ్ = అత్యంత శ్రద్ధతో చేయబడిన, తత్, త్రివిధమ్, తపః = అట్టి మూడు విధములైన (శారీరక, వాచిక, మానసిక) తపస్సును, సాత్త్వికమ్ = సాత్త్వికమని, పరిచక్షతే = పేర్కొందురు

తా. ఫలాభిసంధిలేక సమాహిత చిత్తులైనవారత్యన్త శ్రద్ధతో చేయు శారీర, వాఙ్మయ, మానసములను పేర త్రివిధమైన తపస్సు సాత్త్విక మనబడును.

శ్లో॥ సత్కారమానపూజార్థం తపో దంభేన చైవ యత్
క్రియతే తదిహ ప్రోక్తం రాజసం చలమధ్రువమ్ 18

యత్, తపః = ఏ తపస్సు, సత్కారమాన పూజార్థమ్ = ఇతరుల నుండి సత్కారములను, పూజలను, అందుకొనుటకును, చ, ఏవ = ఇతర స్వార్థ ప్రయోజనముల కొరకును, వా = లేక, దంభేన = దంభముతో, క్రియతే = చేయబడునో, అధ్రువమ్ = అనిశ్చితమైనదియు, చలమ్ = క్షణిక ఫలమును ఇచ్చునదియు అగు, తత్ = ఆ తపస్సు, ఇహ = ఇచ్చట, రాజసమ్ = రాజసమని, ప్రోక్తమ్ = చెప్పబడినది.

తా. మంచివాడనిపించు కొనుటకును, ఇతరులచే గౌరవ పూజలందుకొనుటకును, దమ్భభావమున చేయు తపస్సు రాజసమగును. ఈ రాజస తపస్సు శాశ్వతమైన ఫలము నీయజాలక యుండుట యేకాక నిశ్చితమగు ఫలము కూడ నీయదు.

శ్లో॥ మూఢగ్రాహేణాత్మనో యత్ పీడయా క్రియతే తపః
పరస్యోత్సాదనార్థం వా తత్తామసముదాహృతమ్ 19

యత్, తపః = ఏ తపస్సు, మూఢగ్రాహేణ = మొండిపట్టుదలతో కూడినదియు, ఆత్మనః = తన మనోవాక్కాయములకు, పీడయా = బాధ కల్గించునదియు, వా = లేక, పరస్య, ఉత్సదనార్థమ్ = ఇతరులకు కీడు కల్గించుటకును, క్రియతే = ఆచరింపబడునో, తత్ = అట్టి తపస్సు, తామసమ్ = తామసమైనదిగా, ఉదాహృతమ్ = పేర్కొనబడినది

తా. వివేకము లేక పోవుటచే కృత్యాకృత్యముల నెఱుగక యకృత్యమును కృత్యమని తలచి స్వశరీరమునకు పీడకలుగునట్లు కాని, పరులను నాశనము చేయుటకు కాని, చేయబడు తపస్సు తామసమని చెప్పబడును.

శ్లో॥ దాతవ్యమితి యద్దానం దీయతేఽనుపకారిణే
దేశే కాలే చ పాత్రే చ తద్దానం సాత్త్వికం స్మృతమ్ 20

దాతవ్యమ్ = దానము చేయుటయే కర్తవ్యము, ఇతి = అని (అనుభావముతో), యత్, దానమ్ = ఏ దానము, దేశే, చ = తగిన ప్రదేశముల యందును, కాలే, చ = దుర్భిక్షాది యుక్తకాలముయందును, పాత్రే, చ = పాత్రులైన వారికిని, అనుపకారిణే = ప్రత్యుపకారము ఆశింపక, దీయతే = నిష్కామ భావముతో ఇయ్యబడునో, తత్, దానమ్ = ఆ దానము, సాత్త్వికమ్ = సాత్త్వికమని, స్మృతమ్ = భావింపబడును.

తా. ఉపకారముచేయ అసమర్థుడైనను, సమర్థుడైనను ప్రత్యుపకారమపేక్షింపక ఈయవలెననియే దేశకాలపాత్రోచితముగా ఈయబడిన దానము సాత్త్విక మనబడును.

శ్లో॥ యత్తు ప్రత్యుపకారార్థం ఫలముద్దిశ్య వా పునః
దీయతే చ పరిక్లిష్టం తద్దానం రాజసం స్మృతమ్ 21

యత్, తు = ఏ దానమైతే, పరిక్లిష్టమ్, చ = మనఃక్లేశముతోడను, ప్రత్యుపకార అర్థమ్ = ప్రత్యుపకారము పొందుటకును, ఫలమ్, ఉద్దిశ్య వా, పునః = ఫలములను ఆశించియైనను గాని, దీయతే = ఇయ్యబడునో, తత్, దానమ్ = ఆ దానము, రాజసమ్ = రాజసమని, స్మృతమ్ = తలంపబడును.

తా. ప్రత్యుపకార వాంఛతో కాని లేక పరలోకమున సత్ఫలము కలుగవలెనని కోరి యీయబడు దానము రాజసమనబడును. ఫలాపేక్షచేతను, దానమువలన ధనము తరుగుచున్నది యను బాధచేతను చేసిన దానము రాజసమగును.

శ్లో॥ అదేశకాలే యద్దానం అపాత్రేభ్యశ్చ దీయతే
అసత్కృతమవజ్ఞాతం తత్తామసముదాహృతమ్ 22

యత్, దానమ్ = ఏ దానము, అసత్ కృతమ్ = సద్భావము లేకుండ (దానము పుచ్చుకొనువారియెడ సద్భావము లేకుండ), వా = (లేక), అవజ్ఞాతమ్ = తృణీకార భావముతో చేయబడునదియు, అదేశకాలే = దేశ, కాలోచితము కానిదియు, అపాత్రేభ్యః = పాత్రులు (యోగ్యులు) కానివారికి, దీయతే = ఇయ్యబడునో, తత్ = ఆ దానము, తామసమ్ = తామసమని, ఉదాహృతమ్ = పేర్కొనబడును.

తా. పుణ్యములైన దేశకాలములను చూడక అనాదరముతోను, అవజ్ఞతోను, అపాత్రుల కీయబడిన దానము తామసమనబడును.

శ్లో॥ ఓం తత్సదితి నిర్దేశో బ్రహ్మణస్త్రివిధః స్మృతః
బ్రాహ్మణాస్తేన వేదాశ్చ యజ్ఞాశ్చ విహితాః పురా 23

ఓమ్, తత్, సత్ = ఓమ్ తత్ సత్, ఇతి = అని, బ్రహ్మణః = సచ్చిదానంద ఘనబ్రహ్మకు, త్రివిధః = మూడు విధములగు, నిర్దేశః = నామనిర్దేశము, స్మృతః = చేయబడినది, తేన = ఆ పరమాత్మ చేతనే, పురా = సృష్ట్యాదియందు, బ్రాహ్మణాః, చ = బ్రాహ్మణాది సమస్త ప్రాణులును, వేదాః, చ = వేదములును, యజ్ఞాః = యజ్ఞాదులును, విహితాః = రచింపబడినవి.

తా. ఓం తత్ సత్ అను త్రివిధములైన నామములు బ్రహ్మను నిర్దేశించుచున్నవి. అనగా ఈ మూడును బ్రహ్మకు పర్యాయ పదములని భావము. ఆ బ్రహ్మచే బ్రహ్మవేత్తలగువారును, వేదములును, యజ్ఞములును నిర్మింపబడినవి. ఓంకారము బ్రహ్మకు వాచకమగునటుల తత్ సత్ శబ్దములుకూడ బ్రహ్మవాచకములని భావము.

శ్లో॥ తస్మాదోమిత్యుదాహృత్య యజ్ఞదానతపఃక్రియాః
ప్రవర్తంతే విధానోక్తాః సతతం బ్రహ్మవాదినామ్ 24

తస్మాత్ = అందువలన, బ్రహ్మవాదినామ్ = వేద మంత్రములను ఉచ్చరించువారియొక్క, విధానోక్తాః = శాస్త్రములయందు చెప్పబడిన, యజ్ఞదానతపఃక్రియాః = యజ్ఞములు, దానములు, తపస్సులు మొదలగు క్రియలు, సతతమ్ = (ఎల్లప్పుడును) సర్వదా, 'ఓమ్' ఇతి = 'ఓమ్' అని (ఈ పరమాత్మ నామమును), ఉదాహృత్య = ఉచ్చరింపబడుచునే, ప్రవర్తంతే = ఆరంభమగుచున్నది

తా. ఆకారణమున వేద పరాయణుల శాస్త్ర విహితములగు యజ్ఞదాన తపస్సులను క్రియలను ఓంకార ముచ్చరించుచు బ్రహ్మభావనతో నాచరించుదురు.

శ్లో॥ తదిత్యనభిసంధాయ ఫలం యజ్ఞతపఃక్రియాః
దానక్రియాశ్చ వివిధాః క్రియంతే మోక్షకాంక్షిభిః 25

మోక్షకాంక్షిభిః = మోక్షకాంక్షగలవారిచే, ఫలమ్, అనభిసంధాయ = ఫలము ఏ మాత్రము కోరబడకయే (లోక హితార్థమే), వివిధాః = వివిధములగు, యజ్ఞ తపః క్రియాః = యజ్ఞములు, తపశ్చర్యలు, చ = మరియు, దానక్రియాః = దానములును, తత్, ఇతి = 'తత్' అనగా ఇదియంతయును పరమాత్మదే అనుభావముతో, క్రియంతే = చేయబడును

తా. బ్రహ్మవాచకమగు 'తత్' అనుపద ముచ్చరించి కర్మఫలమందపేక్ష వదలి ముముక్షువులగువారు వివిధములైన యజ్ఞతపోదాన కార్యములను బ్రహ్మయందు మనస్సును లగ్నముచేసినవారై చేయుదురు.

శ్లో॥ సద్భావే సాధుభావే చ సదిత్యేతత్ప్రయుజ్యతే
ప్రశస్తే కర్మణి తథా సచ్ఛబ్దః పార్థ యుజ్యతే 26

పార్థ = ఓ పార్థా!, సద్భావే = సత్యభావమునందును, సాధుభావే, చ = శ్రేష్ఠభావమునందును (మంచిది అనుభావమునందును), సత్, ఇతి, ఏతత్ = 'సత్' అను ఈ పరమాత్మ నామము, ప్రయుజ్యతే = ప్రయోగింపబడుచున్నది, తథా = అట్లే, ప్రశస్తే, కర్మణి = ఉత్తమమైన కర్మయందును, 'సత్' శబ్దః = 'సత్' అను శబ్దము, యుజ్యతే = ప్రయుక్తమగుచుండును.

తా. సత్ అనుశబ్దము ఒక వస్తువు యొక్క ఉనికి యందును, సాధువుగా ప్రవర్తించుట యందును, వివాహాది శుభకర్మలందును, ఓ పార్థా! ప్రయోగింపబడుచున్నది.

శ్లో॥ యజ్ఞే తపసి దానే చ స్థితిః సదితి చోచ్యతే
కర్మ చైవ తదర్థీయం సదిత్యేవాభిధీయతే 27

యజ్ఞే, చ = యజ్ఞమునందును, తపసి, చ = తపస్సునందును, దానే, చ = దానమునందును (గల), (యా), స్థితిః = ఏ నిష్ఠ కలదో, (సా) స్థితిః, ఏవ = ఆ స్థితియందు, 'సత్' ఇతి = 'సత్' అని, ఉచ్యతే = పేర్కొనబడుచున్నది, చ = మరియు, తదర్థీయమ్, కర్మ = భగవత్ ప్రీత్యర్థమైన కర్మయును, ఏవ = నిశ్చయముగా, 'సత్' ఇతి = 'సత్' అని, అభిధీయతే = చెప్పబడును.

తా. యజ్ఞదాన తపస్సుల నాచరించుట ఈశ్వరుని అనుగ్రహము కొరకయి యున్నది. కనుక యజ్ఞమునందును. తపస్సునందును, దాన క్రియయందును, 'సత్' అను శబ్దము ఉపయోగింపబడును. ఈశ్వర నిమిత్తము చేయబడు సర్వకర్మయు సచ్ఛబ్ద వాచ్యమగుచున్నది.

శ్లో॥ అశ్రద్ధయా హుతం దత్తం తపస్తప్తం కృతం చ యత్
అసదిత్యుచ్యతే పార్థ న చ తత్ప్రేత్య నో ఇహ 28

పార్థ = ఓ అర్జునా!, అశ్రద్ధయా = అశ్రద్ధతో చేయబడిన, హుతమ్ = హోమము, దత్తమ్ = ఇయ్యబడిన దానము, తప్తమ్, తపః, చ = ఆచరింపబడిన తపస్సు, యత్, కృతమ్ = చేయబడిన ఏ శుభకర్మయును కలదో, (తత్) = (అది), 'అసత్' ఇతి = 'అసత్' అని, ఉచ్యతే = చెప్పబడును,

తత్ = ఆ హోమాదిక కర్మ, నో, ఇహ = ఈ లోకమునందు ఫలప్రదము కాదు, చ = మరియు, ప్రేత్య, న = మరణానంతరము కూడ ఫలప్రదము కాదు.

తా. శ్రద్ధారహితుడై యాచరించు హోమము, దానము, తపస్సు, మరి యే కార్యమైనను అసత్తని చెప్పబడును. కావున ఓ అర్జునా! అసత్కర్మాచరణచే ఈ లోకమున కాని, మరణానన్తరము కాని, ఫలము కలుగదని భావము.

ఇట్లు
శ్రీ పరమహంస పరివ్రాజకాచార్యులును,
బ్రహ్మర్షి సద్గురు **శ్రీశ్రీశ్రీ శివానంద భగవత్పూజ్యపాద** శిష్యులును నైన
బ్రహ్మర్షి సద్గురు **శ్రీశ్రీశ్రీ స్వామి రామానంద పరమహంస** వారిచే
రచింపబడిన గీతామృతమను టీక యందు
**శ్రద్ధాత్రయ విభాగ యోగ**మను సప్తదశాధ్యాయము సమాప్తము.

ఓం శ్రీకృష్ణ పరమాత్మనే నమః

అష్టాదశాధ్యాయము

# మోక్షసన్న్యాస యోగము

**అర్జున ఉవాచ:**

శ్లో॥ సన్న్యాసస్య మహాబాహో తత్త్వమిచ్ఛామి వేదితుమ్
త్యాగస్య చ హృషీకేశ పృథక్ కేశినిషూదన 1

మహాబాహో! = ఓ మహాబాహూ!, హృషీకేశ! = ఓ అంతర్యామీ!, కేశినిషూదన! = ఓ వాసుదేవా!, సన్న్యాసస్య, తత్త్వమ్ = సన్న్యాస తత్త్వమును, త్యాగస్య (తత్త్వమ్), చ = త్యాగ తత్త్వమును, పృథక్ = వేర్వేఱుగా, వేదితుమ్, ఇచ్ఛామి = (నేను) తెలిసికొన గోరుచున్నాను.

తా. మహా బాహుబలశాలివయి కేశియను రాక్షసుని సంహరించిన వాడవును ఇంద్రియాధీశుడవును అయిన ఓ కృష్ణా ! సన్న్యాసమననేమి? త్యాగమనగానేమి? ఈ రెండిటి తత్త్వమును వేరువేరుగా తెలియగోరుదును.

**శ్రీ భగవానువాచ:**

శ్లో॥ కామ్యానాం కర్మణాం న్యాసం సన్న్యాసం కవయో విదుః
సర్వకర్మఫలత్యాగం ప్రాహుస్త్యాగం విచక్షణాః 2

కవయః = (కొందరు) పండితులు, కామ్యానామ్ కర్మణామ్ = కామ్యకర్మల యొక్క, న్యాసమ్ (ఏవ) = త్యాగమునే, సన్న్యాసమ్ = సన్న్యాసమని, విదుః = భావింతురు, విచక్షణాః = విచక్షణా శీలురైన మరికొందఱు మాత్రము, సర్వకర్మఫల త్యాగమ్ = సమస్త కర్మల ఫలములను త్యజించుటనే, త్యాగమ్ = త్యాగమని, ప్రాహుః = పేర్కొందురు.

తా. కర్తవ్యములని శాస్త్ర విహితములగు కామ్యకర్మలను చేయక వదలుట సన్న్యాస మనబడును. కామ్యకర్మలను, స్వర్గాది పుణ్యలోక ప్రాప్తిరూప ఫలముకలదని చెప్పబడిన నిత్యనైమిత్తికాది సకలకర్మలను ఆచరించుచు, ఫలాపేక్షలేక నిష్కామబుద్ధితో చేయబడిన ఫలత్యాగమును విద్వాంసులు త్యాగమని చెప్పుదురు. త్యాగసన్న్యాస శబ్దములలో త్యాగభావము సామాన్యమైనది. అనగా త్యాగము ఈ రెండింటియందును గలదని భావము.

*శ్లో॥ త్యాగః ప్రపంచరూపస్య సచ్చిదాత్మావ లోకనాత్*
*త్యాగో హిమహతాం పూజ్యః సద్యో మోక్ష ప్రదాయకః (తేజబిందూపనిషత్)*

అను ప్రమాణముచే సచ్చిదానంద స్వరూపమగు నాత్మను దర్శించుచు జగదాది సర్వ విషయములు బుద్ధిగోచరములు కాకుండుటయే త్యాగమని తెలియుచున్నది. అట్టివాడే త్యాగి కాగలడు.

vi. *'సర్వకర్మ ఫలత్యాగం'* కామ్యకర్మలు బంధహేతువులు. అయినను కామ్య కర్మలను త్యజించరాదనియు, ఫలాపేక్షారహితులై సంగబుద్ధిలేక ఆచరించవలెననియు, శ్రీకృష్ణభగవానుని భావము. ఏలననగా .....

*'సర్వారంభాహిదోషేణ ధూమేనాగ్ని రివా వృతాః'* *(18-48)*

అను గీతా వచనముచే సర్వకర్మలును దోషభూయిష్ఠములని గ్రహించవలెను. ఇట్లుండుట కర్మలకు సహజమైన లక్షణము. కనుక సహజమైన కర్మ దోషయుక్తమైనను వదలకూడదని భావము.

*'సహజం కర్మ కౌంతేయ స దోషమపి న త్యజేత్'* *(18-48)*

అను గీతా వాక్యము ఈ భావమునే బోధించుచున్నది. కావున కర్మలను వదలకూడదనియు ఫలాపేక్షలేక సంగవర్జితులయి యాచరించవలెననియు భావము. కామ్య కర్మల ఫలమునే కాక, వేదములలో ఫలము విధింపబడని నిత్యనైమిత్తికాది కర్మలకు స్వర్గమే ఫలమని జైమిని మహర్షిచే పూర్వ మీమాంసలో చెప్పబడినది. మోక్షఫల మీయలేని నిత్యనై మిత్తికాది కర్మలను కూడ నాచరించుచు ఆయా కర్మల ఫలమును త్యజించుటకు త్యాగమని పేరు.

శ్లో॥ త్యాజ్యం దోషవదిత్యేకే కర్మ ప్రాహుర్మనీషిణః
యజ్ఞదానతపఃకర్మ న త్యాజ్యమితి చాపరే 3

ఏకే = కొందరు, మనీషిణః = విద్వాంసులు, కర్మ = ప్రతికర్మయు, దోషవత్ = దోషయుక్తమే (కనుక అది), త్యాజ్యమ్ = త్యజింప దగినదే, ఇతి = అని, ప్రాహుః = పలికెదరు, అపరే, చ = మరికొందరు, యజ్ఞ, దాన = యజ్ఞ, దాన, తపః కర్మ = తపస్సులను ఆచరించుట, న, త్యాజ్యమ్ = త్యజింపరానిది, ఇతి, (ఆహుః) = అని పేర్కొందురు,

తా. కర్మ బంధాపాదకమయినది కనుక కర్మను త్యజించవలెనని విద్వాంసులందురు. యజ్ఞదాన తపస్సులనెడి కర్మలను చేయవలెననియు త్యజింపదగినవి కావనియు కొందరు చెప్పుచున్నారు.

శ్లో॥ నిశ్చయం శృణు మే తత్ర త్యాగే భరతసత్తమ
త్యాగో హి పురుషవ్యాఘ్ర త్రివిధః సంప్రకీర్తితః 4

పురుషవ్యాఘ్ర! = ఓ పురుషశ్రేష్ఠా!, భరతసత్తమ! = ఓ అర్జునా!, తత్ర = సన్న్యాసము,

త్యాగము అను రెండు విషయములలో (మొదట), త్యాగే = త్యాగవిషయమున, మే = నాయొక్క, నిశ్చయమ్ = నిశ్చితాభిప్రాయమును, శృణు = వినుము, హి = ఏలనన, త్యాగః = త్యాగము, త్రివిధః = మూడు విధములుగా, సంప్రకీర్తితః = పేర్కొనబడినది

తా. కర్మ త్యాజ్యమని కొందరు, త్యజింపకూడదని కొందరు తలచుచున్నారు. సంశయగ్రస్తమయిన ఈ విషయమున శ్రీకృష్ణపరమాత్మ తమ నిశ్చయమును వినుమని అర్జునునితోనిట్లనెను. ఓపురుషశ్రేష్ఠా! త్యాగము త్రివిధమైయున్నది.

శ్లో॥ యజ్ఞదానతపఃకర్మ న త్యాజ్యం కార్యమేవ తత్
యజ్ఞో దానం తపశ్చైవ పావనాని మనీషిణామ్ 5

యజ్ఞదానతపః కర్మ = యజ్ఞ, దాన, తపస్సులను ఆచరించుట, న, త్యాజ్యమ్ = త్యజింపరానిది, తత్ = ఆ మూడును, కార్యమ్, ఏవ = అవశ్యము ఆచరింప వలసినవే. ఏలననగా, యజ్ఞః = యజ్ఞము, దానమ్ = దానము, చ = మరియు, తపః = తపస్సు, ఏవ = అను మూడు కర్మలే, మనీషిణామ్ = బుద్ధిమంతులను, పావనాని = పవిత్ర మొనర్చునవి.

తా. యజ్ఞము, దానము, తపస్సు అను త్రివిధములైన కర్మలు త్యజింపదగినవి కావు. చేయదగినవే. మనీషియైనవానికి ఈ కర్మలు పావనములగును. మనీషికాక చేయబడిన యజ్ఞదానతపః కర్మలు బంధహేతువులగును.

వి. మనీషి అనగా వివేకి. బుద్ధియోగమను ఉపాయముచే కర్మలను బన్ధాపాదకములు కానట్లు చేయగల యోగియే మనీషి. ఆయనే వివేకి.

*'కర్మజం బుద్ధి యుక్తాహి ఫలంత్యక్త్వా మనీషిణః'* *(2-51)*

అను గీతా వాక్య ప్రమాణమున బుద్ధియోగము నాశ్రయించినవారు కర్మఫల త్యాగ సమర్థులగుదురు కావున కర్మ ప్రాప్యమగు సంసారము నివృత్తమగును. అందుచే బుద్ధియుక్తులే మనీషులని చెప్పబడినది.

శ్లో॥ ఏతాన్యపి తు కర్మాణి సంగం త్యక్త్వా ఫలాని చ
కర్తవ్యానీతి మే పార్థ నిశ్చితం మతముత్తమమ్ 6

పార్థ = ఓ పార్థా!, ఏతాని = ఈ యజ్ఞ, దాన, తపః కర్మలును, తు = అట్లే, (అన్యాని), అపి, కర్మాణి = ఇతరములగు కర్తవ్య కర్మలును (అన్నియు), సంగమ్ = ఆసక్తిని, చ = మరియు,

ఫలాని = ఫలములను, త్యక్త్వా = త్యజించి, కర్తవ్యాని = తప్పక చేయదగినవి, ఇతి = అని, మే = నాయొక్క, ఉత్తమమ్ నిశ్చితమ్, మతమ్ = ఉత్తమమైన నిశ్చితమైన అభిప్రాయము.

తా. ఓ పృథా పుత్రా! పూర్వోక్తములైన యజ్ఞదాన తపః కర్మలు కర్తవ్యములనియే నా నిశ్చితాభిప్రాయము. కాని యా కర్మలందు సంగభావమును వదలి ఫలాపేక్షారహితులై యుండవలెను. అనగా కర్మఫలము బ్రహ్మార్పణ బుద్ధితో వదలవలెనని భావము.

శ్లో॥ నియతస్య తు సంన్యాసః కర్మణో నోపపద్యతే
మోహాత్తస్య పరిత్యాగః తామసః పరికీర్తితః 7

తు = కాని, నియతస్య = శాస్త్రవిహితమైన, కర్మణః, సన్న్యాసః = కర్మాచరణమును త్యజించుట, న, ఉపపద్యతే = ఉచితము కాదు, మోహాత్ = (కావున) మోహవశమున, తస్య పరిత్యాగః = దానిని పరిత్యజించుట, తామసః పరికీర్తితః = 'తామస త్యాగము' అని చెప్పబడును.

తా. ముముక్షువునకు మోక్షాపాదకమై శాస్త్రవిహితమైన కర్మ నియతముగా నాచరింపదగియున్నది. అట్టి కర్మను త్యజించుట యుక్తము కాదు. మోహవశమున కర్మత్యాగము చేసిన, ఆ త్యాగము మోహమూలమైనది కావున తామసమని చెప్పబడును.

శ్లో॥ దుఃఖమిత్యేవ యత్కర్మ కాయక్లేశభయాత్ త్యజేత్
స కృత్వా రాజసం త్యాగం నైవ త్యాగఫలం లభేత్ 8

(యః = ఎవడు), యత్, కర్మ = ఏ విధ్యుక్త కర్మాచరణమును, దుఃఖమ్, ఏవ, ఇతి = దుఃఖకారకమేయని తలంచి, కాయక్లేశ భయాత్ = శారీరిక క్లేశములకు భయపడి, త్యజేత్ = త్యజింతునో, సః = అతడు, రాజసమ్ = రాజస, త్యాగమ్ = త్యాగమును, కృత్వా = చేసి, త్యాగఫలమ్ = త్యాగఫలమును, న, ఏవ, లభేత్ = ఏవిధముగను పొందదు.

తా. కర్మనాచరించుట కష్టమనియు,శరీరశ్రమ కలుగుననియు, భయపడి నియతమైన కర్మ నాచరించుట మానిన ఆ త్యాగము రాజసమగును. కాన త్యాగఫలము శూన్యము.

శ్లో॥ కార్యమిత్యేవ యత్కర్మ నియతం క్రియతేఽర్జున
సంగం త్యక్త్వా ఫలం చైవ స త్యాగః సాత్త్వికో మతః 9

అర్జున = ఓ అర్జునా!, నియతమ్ = శాస్త్రవిహితమైన, యత్, కర్మ కార్యమ్, ఏవ = ఏ కర్మయైనను చేయదగినదే, ఇతి = అనెడి భావముతో, సంగమ్ = ఆసక్తిని, చ = మరియు, ఫలమ్

= ఫలమును, త్యక్త్వా = త్యజించి, క్రియతే = చేయబడునో, సః, ఏవ = అదియే, సాత్త్వికః, త్యాగః = సాత్త్విక త్యాగము, మతః = (అని) భావింపబడును

తా. ఓ అర్జునా ! మోక్షార్థి మోక్షప్రాప్తికరమగు కర్మనవశ్యమాచరింపలెననియే తలచి చేయును. కాని కర్మల ఫలమపేక్షింపడు. ఆ కర్మలందు సంగ భావమును కలిగి యుండడు. ఆ త్యాగము సాత్త్విక త్యాగమందురు.

శ్లో॥ న ద్వేష్ట్యకుశలం కర్మ కుశలే నానుషజ్జతే
త్యాగీ సత్త్వసమావిష్టో మేధావీ ఛిన్నసంశయః 10

(యః) = ఎవడు, అకుశలమ్, కర్మ = అకుశల కర్మ(ల)ను (శుభప్రదం కాని కర్మలను), న, ద్వేష్టి = ద్వేషింపడో, కుశలే = కుశల కర్మలయందు (శుభప్రదమగు కర్మలయందు), న, అనుషజ్జతే = ఆసక్తిని కలిగియుండడో, సః = అతడే, సత్త్వసమావిష్టః = శుద్ధ సత్త్వగుణ యుక్తుడు, ఛిన్నసంశయః = సంశయ రహితుడు, మేధావీ = బుద్ధిమంతుడు, త్యాగీ = నిజమైన త్యాగి.

తా. ఆత్మజ్ఞాని ద్వంద్వాతీతుడు. కాన రాగద్వేషములకు దూరుడు. శుభప్రదములైన కర్మలపై సంగభావము చూపడు. అశుభప్రదములగు కర్మలయందు ద్వేషము వహింపడు. ఫలాపేక్షారహితుడై సర్వకాలముల యందు నిర్మలాంతఃకరణుడగు ఆ త్యాగి మేధావి యగును. అనగా సర్వ సంశయముల విడనాడి స్వస్వరూపస్థితియే ఉత్తమమనియు, స్వస్వరూపాను సంధానమే నిశ్శ్రేయస సాధనమనియు నిశ్చితాత్ముడయి యుండును.

శ్లో॥ న హి దేహభృతా శక్యం త్యక్తుం కర్మాణ్యశేషతః
యస్తు కర్మఫలత్యాగీ స త్యాగీత్యభిధీయతే 11

హి = ఏలనన, కర్మాణి = కర్మలనన్నింటిని, అశేషతః = సంపూర్ణముగా, త్యక్తుమ్ = త్యజించుటకు, దేహభృతా = దేహధారియైన ఏ మనుష్యునకును, న, శక్యమ్ = సాధ్యముగాదు, (తస్మాత్) = అందువలన, యః = ఏ పురుషుడు, కర్మఫలత్యాగీ = కర్మఫలములను త్యజించువాడో, సః, తు = అతడే, త్యాగీ ఇతి = నిజమైన 'త్యాగి' యని, అభిధీయతే = పేర్కొనబడును.

తా. సర్వకర్మలు సహజముగా దోషభూయిష్ఠములైనను దేహాభిమానియగువాడు కర్మలను త్యజించలేడు. కావున వాడు కర్మల నాచరించువాడే యగును. అందుచే కర్మల నాచరించుచున్నను, యుక్తుడయి కర్మఫల త్యాగియైనచో త్యాగియనబడును.

వి. 'యుక్తః కర్మఫలం త్యక్త్వా శాంతిమాప్నోతి నైష్ఠికీమ్' (5-12)

అను గీతా వచనముచే యుక్తుడయి కర్మనాచరించవలయుననియు, సంగవర్జితుడయి కర్మ ఫలత్యాగియు కావలెననియు భావము. అట్టి త్యాగి పరమశాన్తిని పొందునని తెలియవలెను.

శ్లో॥ అనిష్టమిష్టం మిశ్రం చ త్రివిధం కర్మణః ఫలమ్
భవత్యత్యాగినాం ప్రేత్య న తు సన్న్యాసినాం క్వచిత్ 12

అత్యాగినామ్ = కర్మఫలత్యాగము చేయని వారియొక్క, కర్మణః = కర్మ(ల)కు, ఇష్టమ్ = మంచి, అనిష్టమ్ = చెడు, చ = మరియు, మిశ్రమ్ = మిశ్రమము (మంచి చెడులతో కలిసి యుండునది), (ఇతి) = అని, త్రివిధమ్, ఫలమ్ = మూడు విధములైన ఫలములను, ప్రేత్య = మరణానంతరము (అవశ్యముగా), భవతి = అగును (అనుభవింపవలసి యుండును), తు = అయితే, సన్న్యాసినామ్ = కర్మఫలములను పూర్తిగా త్యాగము చేసినవారికి (కర్మఫలానుభవము), క్వచిత్ = ఏ కాలమునందును, న (భవతి) = ఉండదు.

తా. ఫలార్థియై సంగభావమున కర్మలను ఆచరించువాడు కర్మజడుడు. అట్టివానికి కలుగు ఫలము అనిష్టమనియు, ఇష్టమనియు, మిశ్రమమనియు త్రివిధములు. కర్మఫల త్యాగము చేయని వాడగుటవలన మరణానంతరము ఈ త్రివిధ ఫలములలో నేదేని పొందుటకర్హుడు. కాని కర్మఫలత్యాగము చేసిన మహాత్మునకు ఈ కర్మఫలములంటవు.

వి. దుఃఖప్రదములైన స్థానములందు బడుట అనిష్టమగును. వాంఛితఫలప్రాప్తి యిష్టమైన ఫలము. వాంఛితము అనిష్టమైన దుఃఖము కూడ కలిగిన మిశ్రఫలము. కర్మఫల త్యాగము చేయక, అయుక్తుడై యున్న వాడీ ఫలములచే బద్ధుడగును. కర్మఫల త్యాగియై సన్న్యాసి యగు వానికి అనగా యుక్తాత్మునకు ఈ కర్మబంధము కలుగనేరదు. కర్మఫల త్యాగులకు జన్మ మరణములుండవని భావము.

శ్లో॥ పంచైతాని మహాబాహో కారణాని నిబోధ మే
సాంఖ్యే కృతాంతే ప్రోక్తాని సిద్ధయే సర్వకర్మణామ్ 13

మహాబాహో = ఓ మహాబాహూ!, సర్వకర్మణామ్ = సమస్త కర్మల యొక్క, సిద్ధయే = సిద్ధికి, ఏతాని, పంచ = ఈ ఐదును, కారణాని = హేతువులు (అని), కృతాంతే = కర్మలను అంతముచేయు ఉపాయములను తెలుపునట్టి, సాంఖ్యే = సాంఖ్యశాస్త్రము నందు, ప్రోక్తాని = చెప్పబడినది, (తాని) = (వాటిని), మే = నానుండి, నిబోధ = ఎరుంగుము.

తా. వేదాంతమున సర్వ కర్మసిద్ధికై ఐదింటిని కారణములుగా చెప్పిరి. ఓ అర్జునా ! నీవా కారణములను వినుము. నేను చెప్పుదును.

వి. 'సాంఖ్యేకృతాంతే' సాంఖ్యమన వేదాంతశాస్త్రము. ఈ శాస్త్రమున తెలియదగిన పదార్థములు చక్కగా చెప్పబడినవి కాన సాంఖ్య మనిరి. 'కృతాంత' మనగా కర్మ నాశనమగుచోటు. అనగా కర్మనాశహేతువైన ఆత్మజ్ఞానము 'సర్వం కర్మాఖిలం పార్థ జ్ఞానే పరిసమాప్యతే' అను గీతా మంత్రమున కర్మ అన్తమగుచోటు ఆత్మజ్ఞానమని చెప్పబడినది.

శ్లో॥ అధిష్ఠానం తథా కర్తా కరణం చ పృథగ్విధమ్
వివిధాశ్చ పృథక్ చేష్టా దైవం చైవాత్ర పంచమమ్ 14

అత్ర = ఈ విషయమున (కర్మ సంసిద్ధియందు), అధిష్ఠానమ్ = అధిష్ఠానము (శరీరము), చ = మరియు, కర్తా చ = కర్తయును (జీవుడు), పృథగ్విధమ్ = వివిధములైన, కరణమ్ = సాధనములును (ఇంద్రియములు), చ = మరియు, వివిధాః = వివిధములైన, పృథక్, చేష్టాః = వేర్వేరు చేష్టలు (ప్రాణాపానాది వాయు చేష్టలు), తథా, ఏవ = ఆ విధముగనే, పంచమమ్ = ఐదవదియగు, దైవమ్ = దైవము (ఇంద్రియాధిదేవత లేదా పూర్వజన్మ ప్రాక్తనకర్మ)

తా. సర్వమున కాశ్రయమైనది యధిష్ఠాన మనబడును. ఇచ్చట అధిష్ఠాన మనగా శరీరము. కర్త అనగా సుఖ దుఃఖాదులను అనుభవించుచు ఉపాధితో తాదాత్మ్యము పొందు జీవుడు. వివిధములైన కరణములు, నానా ప్రకారములైన ప్రాణాపానాది వాయుచేష్టలు, చక్షురాదీంద్రియాది దేవతలగు సూర్యాది దేవతలు సర్వ కర్మలకు కారణభూతులు.

శ్లో॥ శరీరవాఙ్మనోభిర్యత్ కర్మ ప్రారభతే నరః
న్యాయ్యం వా విపరీతం వా పంచైతే తస్య హేతవః 15

నరః = మానవుడు, శరీరవాఙ్మనోభిః = శరీరము వాక్కు మనస్సులతో, న్యాయ్యమ్, వా = శాస్త్రోక్త విధానమునగాని, విపరీతమ్, వా = తద్విపరీతముగా గాని, యత్, కర్మ = ఏ కర్మను, ప్రారభతే = ఆచరించునో, తస్య = ఆ కర్మకు, ఏతే, పంచ = ఈ ఐదును, హేతవః = హేతువులు

తా. మనోవాక్కాయములతో చేయు ప్రతికర్మకును, శాస్త్రచోదితమైన కర్మయైనను, శాస్త్ర విహితముకాని కర్మయైనను, పైన చెప్పబడిన అధిష్ఠానాది పంచకము కారణమని చెప్పబడుచున్నది.

శ్లో॥ తత్రైవం సతి కర్తారమ్ ఆత్మానం కేవలం తు యః
పశ్యత్యకృతబుద్ధిత్వాత్ న స పశ్యతి దుర్మతిః 16

తు = కాని, ఏవమ్, సతి = ఇట్లైనప్పటికిని, యః = ఏ పురుషుడు, అకృత్వ బుద్ధిత్వాత్ = విపరీత బుద్ధి కారణమున, తత్ర = ఆ కర్మ విషయములయందు, కేవలమ్ = కేవలుడు (శుద్ధ స్వరూపుడు ఐన), ఆత్మానమ్ = ఆత్మను, కర్తారమ్ = సమస్త కర్మలకు కర్తగా, పశ్యతి = చూచునో (తలంచునో), సః, దుర్మతిః = అట్టి మలినబుద్ధిగల అజ్ఞాని, న, పశ్యతి = యథార్థమును గ్రహింపజాలడు.

తా. ఈ విధముగ అధిష్ఠానము మొదలగు అయిదు ప్రతియొక కర్మకు కారణములగుచుండగా, అజ్ఞాన వశమున నేనే కర్తనని తలచువాడు వివేక రహితుడు. ఆత్మతత్త్వమెరుగజాలడు.

శ్లో॥ యస్య నాహంకృతో భావో బుద్ధిర్యస్య న లిప్యతే
హత్వాపి స ఇమాన్ లోకాన్ న హంతి న నిబధ్యతే 17

యస్య = ఏ పురుషునకు (అంతఃకరణమునందు), అహంకృతః = "నేనే కర్తను" అను, భావః = భావము, న = ఉండదో, యస్య = ఏ పురుషుని యొక్క, బుద్ధిః = బుద్ధి, న, లిప్యతే = (ప్రాపంచిక పదార్థములయందును, కర్మలయందును) అంటుకొనదో, సః = అట్టి పురుషుడు, ఇమాన్, లోకాన్ = ఈ లోకముల అన్నింటిని, హత్వా, అపి = హతమార్చినను, న, హంతి = (యథార్థముగా) చంపినవాడు కాడు, న, నిబధ్యతే = (ఎట్టి పాపముల చేతను) బంధింపబడడు

తా. వివేకముచే నెవడు "శరీరమున అధిష్ఠానాది పంచకము కర్మ నాచరించుచున్నది, నేను కర్తను కాను, సాక్షీ భూతుడను, ద్రష్టను" అని తలచుచు అసత్తగు దేహాదికమును అహంభావమున గ్రహించక, ద్రష్టయగు ఆత్మయే 'నేను' అను భావముతో గ్రహించునోవాడును, ఎవనిబుద్ధి అసత్తుతో కలసియుండదో వాడును, యుద్ధమున ఎదురైన వారినెల్ల చంపినను చంపని వాడే యగును. అట్టి యోగికి కర్మలు బంధహేతువులు కావు.

శ్లో॥ జ్ఞానం జ్ఞేయం పరిజ్ఞాతా త్రివిధా కర్మచోదనా
కరణం కర్మ కర్తేతి త్రివిధః కర్మసంగ్రహః 18

పరిజ్ఞాతా = జ్ఞాత, (తెలిసికొనువాడును), జ్ఞానమ్ = జ్ఞానము, జ్ఞేయమ్ = జ్ఞేయము (తెలిసికొనదగిన వస్తువు) అను, కర్మచోదనా = కర్మ ప్రేరణములు, త్రివిధా = మూడు విధములు,

కర్తా = కర్త, కరణమ్ = కరణము, కర్మ = క్రియ, ఇతి = అని, కర్మ సంగ్రహః = కర్మ సంగ్రహములు, త్రివిధః = మూడు విధములు.

తా. జ్ఞానము, (సర్వవస్తు విషయమైన సామాన్య జ్ఞానమిచ్చుట గ్రాహ్యము.) ఆ జ్ఞానముచే తెలియదగిన వస్తువు, పరిజ్ఞాత అనగా ఆ జ్ఞానముచే జ్ఞేయమగు వస్తువును తెలియువాడు అనగా ఉపాధితో సంగము కలిగిన జీవుడు. ఈ మూడును కర్మలకు ప్రవర్తకములై యుండును. అనగా నా క్రియల స్వరూప స్వభావములు పై మూడింటిని బట్టి యుండునని భావము. అట్లే కరణము అనగా ఇంద్రియములు, కర్మ అనగా చేయుకార్యము, కర్త అనగా ఇన్ద్రియాదులను వాని వాని కార్యములందు నియోగింపజేసిన జీవుడు, ఈ మూడింటి యందు కర్మ సంగృహీతమై యుండును.

శ్లో॥ జ్ఞానం కర్మ చ కర్తా చ త్రిధైవ గుణభేదతః
ప్రోచ్యతే గుణసంఖ్యానే యథావచ్ఛృణు తాన్యపి 19

గుణసంఖ్యానే = సాంఖ్య శాస్త్రమునందు, జ్ఞానమ్ = జ్ఞానము, చ = మరియు, కర్మ = కర్మ, చ = అట్లే, కర్తా = కర్త, గుణభేదతః = గుణభేదములను బట్టి, త్రిధా, ఏవ = మూడు విధములుగానే, ప్రోచ్యతే = చెప్పబడినవి, తాని, అపి = వానిని గూర్చియు, యథావత్ = సమగ్రముగా (వివరించెదను), శృణు = వినుము.

తా. కాపిల శాస్త్రమున సత్వరజస్తమో భేదములను బట్టి జ్ఞానము, కర్మ, కర్తయు త్రివిధములుగ నుండునని చెప్పబడినది. శాస్త్రోక్త రీతిగా వానిని గూర్చి చెప్పెదను వినుము.

శ్లో॥ సర్వభూతేషు యేనైకం భావమవ్యయ మీక్షతే
అవిభక్తం విభక్తేషు తత్ జ్ఞానం విద్ధి సాత్త్వికమ్ 20

యేన = (మనుష్యుడు) ఏ జ్ఞానముతో, విభక్తేషు = వేర్వేరుగా ఉన్న, సర్వభూతేషు = సమస్త ప్రాణులయందును, ఏకమ్ = ఒక్కడేయై ఉన్న, అవ్యయమ్ = శాశ్వతుడైన, అవిభక్తమ్ = అఖండముగా సమభావ స్థితుడై ఉన్న, భావమ్ = పరమాత్మ భావమును, ఈక్షతే = చూచునో, తత్, జ్ఞానమ్ = అట్టి జ్ఞానమును, సాత్త్వికమ్ = 'సాత్త్విక జ్ఞానము' గా, విద్ధి = ఎరుంగుము.

తా. వేరువేరుగా నున్న సర్వభూతములందును అఖండమై, అవ్యయమై యున్న ఆత్మను తెలిసికొను జ్ఞానము సాత్త్విక జ్ఞానమని తెలియుము. ఇట్లు సర్వభూతములందు ఆత్మను అఖండముగా జూచుట సమ్యగ్దర్శనము. ఇది రజస్తమోగుణముల సంబంధము లేక శుద్ధమైన సత్త్వగుణ లక్షణము.

శ్లో॥ పృథక్త్వేన తు యత్ జ్ఞానం నానా భావాన్ పృథగ్విధాన్
వేత్తి సర్వేషు భూతేషు తత్ జ్ఞానం విద్ధి రాజసమ్ 21

తు = కాని, యత్, జ్ఞానమ్ = (మనుష్యుడు) ఏ జ్ఞానము ద్వారా, సర్వేషు, భూతేషు = సమస్త ప్రాణులయందును, పృథగ్విధాన్ = వేర్వేరు విధములుగానున్న, నానాభావాన్ = వివిధ భావములను, పృథక్త్వేన = దేనికదే 'వేర్వేరు' అని, వేత్తి = ఎరుంగు (తలంచు)నో, తత్, జ్ఞానమ్ = ఆ జ్ఞానము, రాజసమ్ = 'రాజస జ్ఞానము' గా, విద్ధి = ఎరుంగుము.

తా. నానా విధముల దృశ్యమానమగు జగత్తున నానాత్వమును గ్రహింపజేయు జ్ఞానము రజోగుణ మూలమని తెలియవలెను.

వి. రాజసులు సర్వత్ర ఏకరూపముగనున్న పరబ్రహ్మను విషయ రూపమున జూతురు. విషయములు నానా విధములు. కావున నామరూప భేదమున పృథక్త్వ జ్ఞానము కలుగుచున్నది. ఈ జ్ఞానము రాజసమని చెప్పబడును.

శ్లో॥ యత్తు కృత్స్నవదేకస్మిన్ కార్యే సక్తమహైతుకమ్
అతత్త్వార్థవదల్పం చ తత్తామసముదాహృతమ్ 22

తు = కాని, యత్ = (మనుష్యుడు) ఏ జ్ఞానము ద్వారా, ఏకస్మిన్, కార్యే = ప్రకృతి కార్యరూపమైన శరీరమందు మాత్రమే, కృత్స్నవత్ = సర్వస్వము వలె, సక్తమ్ = ఆసక్తిని కల్గించునట్టిదియు, చ = మరియు, అహైతుకమ్ = హేతుబద్ధము కానిదియు, అతత్త్వార్థవత్ = తాత్త్వికముగా అర్థ రహితమైనదియు, అల్పమ్ = తుచ్ఛమైనదియు అగునో, తత్ = అట్టి జ్ఞానము, తామసమ్ = తామసము, అని, ఉదాహృతమ్ = పేర్కొనబడినది

తా. తమోగుణ ప్రధానమైయున్న జ్ఞానము తత్త్వార్థమును తెలుపలేక తుచ్ఛమగుచున్నది. అందుచే సహేతుకము కాకున్నను ప్రతిమాదికమును కాని లేక దేహమును కాని పూజించుచు నిదియే సర్వమని భావించి అందే సంగబుద్ధి కలిగియుండును. అట్టివాడు తామసుడు. తామసుడు తత్త్వార్థమును గ్రహించలేడు.

వి. *'ప్రతిమాస్వల్పబుద్ధీనాం సర్వత్ర విదితాత్మనామ్'* *(ఉత్తరగీత)*

ప్రతిమాపూజయే సర్వమని భావించినవాడు స్వల్పమైన బుద్ధికలవాడు. జ్ఞానికి సర్వత్ర ఆత్మదర్శనమగును.

శ్లో॥ నియతం సంగరహితం అరాగద్వేషతః కృతమ్
అఫలప్రేప్సునా కర్మ యత్తత్సాత్త్వికముచ్యతే 23

యత్ = ఏ, కర్మ = కర్మ, నియతమ్ = శాస్త్రవిహితమైనదియు, సంగరహితమ్ = కర్తృత్వాభిమానము లేనిదియు అగునో, అఫలప్రేప్సునా = ఫలాపేక్ష లేని పురుషుని చేత, అరాగద్వేషతః = రాగద్వేష రహితముగా, కృతమ్ = చేయబడినదియగునో, తత్ = అది (ఆ కర్మ), సాత్త్వికమ్ = 'సాత్త్విక కర్మ' అని, ఉచ్యతే = చెప్పబడును

తా. శాస్త్ర విహిత కర్మను ఫలాపేక్షయు, సంగబుద్ధియు లేక రాగద్వేష వర్జితుడయి చేసినచో ఆ కర్మ సాత్త్విక మనబడుచున్నది.

వి. *శ్లో॥ కార్యమిత్యేవ యత్కర్మ నియతం క్రియతేర్జున*
*సంగంత్యక్త్వాఫలం చైవసత్యాగః సాత్త్వికో మతః* *(18-9)*

అని చెప్పిన సాత్త్విక మనబడుచున్నది.

శ్లో॥ యత్తు కామేప్సునా కర్మ సాహంకారేణ వా పునః
క్రియతే బహులాయాసం తద్రాజసముదాహృతమ్ 24

తు = కాని, యత్, కర్మ = ఏ కర్మ అయితే, బహులాయాసమ్ = మిక్కిలి శ్రమతో గూడినదియో, పునః = అట్లే, కామేప్సునా = భోగలాలసుడైన పురుషుని చేతను, వా = లేక, సాహంకారేణ = అహంకారి చేతను, క్రియతే = చేయబడునో, తత్ = అది (ఆ కర్మ), రాజసమ్ = రాజసకర్మగా, ఉదాహృతమ్ = పేర్కొనబడును.

తా. అహంకారము గలిగి కామాభిలాషియై కేవలము దేహాభిమానముచే ఇన్ద్రియ తృప్తికై చేయు కర్మముక్తినీయజాలక ఆయాస ప్రదమని గ్రహించవలెను. కామ క్రోధములును, అహంకార మమకారములును రజోగుణ లక్షణములు. కాన కామాహంకారములతో చేయు కర్మ, రాజస మగుచున్నది.

వి. *శ్లో॥ యచ్చకర్మన బంధాయ సావిద్యాయాచ ముక్తయే*
*ఆయాసాయ పరం కర్మ విద్యా న్యాశిల్పనైపుణమ్* *(విష్ణుపురాణము)*

బంధా పాదకము కాని కర్మయే కర్మ యనబడును. ఆ కర్మ తప్ప యితర కర్మ ఆయాసకారి మాత్రమే.

శ్లో॥ అనుబంధం క్షయం హింసామ్ అనపేక్ష్య చ పౌరుషమ్
మోహాదారభ్యతే కర్మ యత్తత్ తామసముచ్యతే 25

యత్, కర్మ = ఏ కర్మ, అనుబంధమ్ = పరిణామమును, క్షయమ్ = నాశనమును, హింసామ్ = హింసను, చ = మరియు, పౌరుషమ్ = పురుష ప్రయత్నము, అనపేక్ష్య = ఆలోచింపక, మోహాత్ = కేవలము అజ్ఞానముతో, ఆరభ్యతే = చేయబడునో, తత్ = అది (ఆ కర్మ), తామసమ్ = తామసము అని, ఉచ్యతే = చెప్పబడును.

తా. ఒక కార్యమాచరించిన పిమ్మట కలుగు ఫలమును, అందుచే కలుగు శక్తి క్షయమును, ద్రవ్య క్షయమును, అందలి ప్రాణిహింసను, కర్మ సమాప్తికి ముఖ్యమైన పురుషకారమును లెక్కచేయక అవివేకముచే నారంభింపబడు కర్మ తామసమనబడును.

శ్లో॥ ముక్తసంగోఽనహంవాదీ ధృత్యుత్సాహ సమన్వితః
సిద్ధ్యసిద్ధ్యోర్నిర్వికారః కర్తా సాత్త్విక ఉచ్యతే 26

ముక్తసంగః = ఆసక్తిని త్యజించిన వాడును, అనహంవాది = అహంకార రహితముగా భాషించువాడును, ధృత్యుత్సాహ సమన్వితః = ధైర్యోత్సాహములు గలవాడును, సిద్ధ్యసిద్ధ్యోః = సిద్ధి – అసిద్ధులయెడ, నిర్వికారః = హర్షశోకాది వికారములకు లోనుకానివాడును, అయిన వాడు, సాత్త్వికః, కర్తా = సాత్త్విక కర్త అని, ఉచ్యతే = పేర్కొనబడును.

తా. సంగభావమును వదలి యనాత్మ యగు దేహమందహంభావము లేక సాత్త్వికములైన ధృత్యుత్సాహములతో కూడినవాడై, కార్యము సిద్ధించినను, సిద్ధించకపోయినను సమ భావమున నున్న కార్యకర్త సాత్త్వికుడనబడును.

వి. *'సంగం త్యక్త్వా ఫలాని చ'* అను గీతా వాక్యము, ఈ శ్లోక మందలి *'ముక్త సంగః' 'సిద్ధ్య సిద్ధ్యో ర్నిర్వికారః'* అను వాక్యాంశములు ఫల త్యాగము, అనాసక్త భావము ముముక్షువున కత్యావశ్యకములని చెప్పుచున్నవి.

శ్లో॥ రాగీ కర్మఫలప్రేప్సుః లుబ్ధో హింసాత్మకోఽశుచిః
హర్షశోకాన్వితః కర్తా రాజసః పరికీర్తితః 27

రాగీ = ఆసక్తిగలవాడును, కర్మఫలప్రేప్సుః = కర్మఫలములకై ఆరాటపడువాడును, లుబ్ధః = లోభియు, హింసాత్మకః = ఇతరులను కష్టపెట్టు స్వభావము కలవాడును, అశుచిః = అపవిత్ర

ప్రవర్తన గలవాడును, హర్షశోకాన్వితః = హర్షశోకములకు లోనగువాడు, రాజసః కర్తా = రాజసకర్త అని, పరికీర్తితః = చెప్పబడును

తా. రాగద్వేష వశుడయి పరద్రవ్యమందాశతో పరులను హింసించుచు శౌచములేక యుండువాడు రజోగుణ ప్రధానుడు. ఫలాపేక్షచే కర్మల నాచరించుట రజోగుణ లక్షణము. ఆ కర్మల కారణమున హర్షశోకములు కలుగుచున్నవి. కర్మ సఫలమైన హర్షము, విఫలమైన శోకము కలుగును. ఈ లక్షణములు కలవాడు రాజసకర్త.

శ్లో॥ అయుక్తః ప్రాకృతః స్తబ్ధః శఠో నైష్కృతికోఽ లసః
విషాదీ దీర్ఘసూత్రీ చ కర్తా తామస ఉచ్యతే 28

అయుక్తః = జితేంద్రియుడు కానివాడును, ప్రాకృతః = సుశిక్షితుడు కానివాడును, స్తబ్ధః = మూర్ఖుడును, శఠః = ధూర్తుడును, నైష్కృతికః = అకారణముగా ఇతరుల వృత్తులకు విఘాతము కలిగించువాడును, విషాదీ = నిరంతరము చింతాగ్రస్తుడును, అలసః = సోమరియును, చ = మరియు, దీర్ఘసూత్రీ = ఉపేక్షతో కాలము గడుపుచుండువాడును, అగువాడు, తామసః, కర్తా = తామసకర్త అని, ఉచ్యతే = పేర్కొనబడును.

తా. తామసుడగువాడు సమాహితచిత్తుడు కాక, జన్తు సామాన్య లక్షణములగు ఆహార నిద్రాభయమైధునముల కాలము గడుపుచు, ప్రాకృతుడై యుండును. గురు వృద్ధులకు చాగిలబడి నమస్కరింపడు. పరులకప్రియము గావించుట కిష్టపడును. కర్తవ్యములగు కృత్యముల నాచరించుటయందిష్టములేక యలసత వహించును. నేటి కృత్యముల నాచరించుటయందిష్టములేక యలసత వహించును. నేటి కృత్యములను భావికాలమున చేయనూహించును. తన దుర్దశను వ్యక్తముజేయ సిద్ధపడును. ఇట్టివాడు తామస కర్తయని చెప్పబడును.

శ్లో॥ బుద్ధేర్భేదం ధృతేశ్చైవ గుణతస్త్రివిధం శృణు
ప్రోచ్యమాన మశేషేణ పృథక్త్వేన ధనంజయ 29

ధనంజయ = ఓ ధనంజయా!, బుద్ధేః = బుద్ధికి, చ = మరియు, ధృతేః, ఏవ = ధృతికిని, గుణతః = గుణములను బట్టి, త్రివిధమ్, భేదమ్ = మూడు విధములగు భేదములు (గలవు), (మయా) = నాచేత, అశేషేణ = సంపూర్ణముగా, పృథక్త్వేన = వేర్వేరుగా, ప్రోచ్యమానమ్ = చెప్పబడుచున్న (వాటిని), శృణు = వినుము.

తా. ఓ అర్జునా బుద్ధియు, ధృతియు సత్త్వాది గుణత్రయ మూలమున త్రివిధములై యున్నవి. వీనిని వేరు వేరుగా వివరముగా చెప్పుదును. వినుము.

శ్లో॥ ప్రవృత్తిం చ నివృత్తిం చ కార్యాకార్యే భయాభయే
బన్ధం మోక్షం చ యా వేత్తి బుద్ధిః సా పార్థ ! సాత్త్వికీ 30

పార్థ = ఓ పార్థా!, యా = ఏ బుద్ధి, ప్రవృత్తిమ్ = ప్రవృత్తి మార్గమును, చ = మరియు, నివృత్తిమ్ = నివృత్తి మార్గమును, కార్యాకార్యే = కర్తవ్యమును, అకర్తవ్యమును, భయాభయే = భయ – అభయములను, చ = అట్లే, బంధమ్ = బంధమును, చ = మరియు, మోక్షమ్ = మోక్షమును, వేత్తి = యథార్థముగా ఎరుంగునో, సా, బుద్ధిః = అట్టి బుద్ధి, సాత్త్వికీ =సాత్త్విక బుద్ధి అని చెప్పబడును

తా. ప్రవృత్తి నివృత్తులను, కృత్యాకృత్యములను, భయప్రదమగు కార్యమును, బన్ధ మోక్షములను గ్రహించగల బుద్ధిని, ఓ అర్జునా! సాత్త్వికీ బుద్ధియందురు. బుద్ధియనగా వివేచనాపూర్వక నిశ్చయజ్ఞానము. ప్రవృత్తి పునర్జన్మకు కారణమైనది. నివృత్తి మోక్ష హేతువైనది.

శ్లో॥ యయా ధర్మమధర్మం చ కార్యం చాకార్యమేవ చ
అయథావత్ ప్రజానాతి బుద్ధిః సా పార్థ ! రాజసీ 31

పార్థ = ఓ పార్థా, యయా = ఏ బుద్ధి ద్వారా, ధర్మమ్, చ = ధర్మమును, అధర్మమ్, చ = అధర్మమును, కార్యమ్, చ = కర్తవ్యమును, అకార్యమ్, ఏవ = అకర్తవ్యమును, అయథావత్, ప్రజానాతి = (మనుష్యుడు) యథార్థముగా తెలిసికొనలేడో, సా, బుద్ధిః = ఆ బుద్ధి, రాజసీ = 'రాజస బుద్ధి' అని చెప్పబడును.

తా. ఓ పార్థా! ధర్మాధర్మములను, కార్యాకార్యములను, యథోక్తముగా గ్రహించలేని బుద్ధి రాజసి యని పిలువబడును.

శ్లో॥ అధర్మం ధర్మమితి యా మన్యతే తమసావృతా
సర్వార్థాన్ విపరీతాంశ్చ బుద్ధిః సా పార్థ ! తామసీ 32

పార్థ = ఓ పార్థా!, యా = ఏ బుద్ధి, తమసా, ఆవృతా = తమోగుణముచే కప్పబడినదై, అధర్మమ్ = అధర్మమును, ధర్మమ్, ఇతి = ధర్మమని, మన్యతే = తలంచునో, చ = మరియు, సర్వార్థాన్ = సమస్త పదార్థములను (విషయములను), విపరీతాన్, చ = వాటికి విరుద్ధముగా, మన్యతే = భావించునో, సా = అది, తామసీ, బుద్ధిః = 'తామస బుద్ధి' అని పేర్కొనబడును.

తా. తమోగుణావృత మగుటచే ఏ బుద్ధి సర్వార్థములను యథార్థమునకు భిన్నముగా గ్రహించుచు, అధర్మమును ధర్మమని పాటించునో ఆ బుద్ధి ఓ పార్థా! తామసి యందురు.

శ్లో॥ ధృత్యా యయా ధారయతే మనఃప్రాణేన్ద్రియక్రియాః
యోగేనావ్యభిచారిణ్యా ధృతిః సా పార్థ సాత్త్వికీ 33

పార్థ = ఓ పార్థా!, యయా = ఏ, అవ్యభిచారిణ్యా = ఇటునటు చలింపని, ధృత్యా = ధారణశక్తిచే (మనుష్యుడు), యోగేన = యోగము ద్వారా, మనఃప్రాణేంద్రియ క్రియాః = మనః ప్రాణేంద్రియ క్రియలను, ధారయతే = ధారణ చేయునో, సా = అది, సాత్త్వికీ, ధృతిః = సాత్త్విక ధృతియని చెప్పబడును

తా. ఓ పార్థా! యోగాభ్యాస పాటవమున వానివాని వ్యాపారముల నుండి మరలిన మనః ప్రాణేన్ద్రియములను ఏ ధృతిచే ఆత్మయందు నిరన్తరమవిచ్ఛిన్నముగ నిశ్చలము చేయునో ఆ ధృతిని సాత్త్వికీ ధృతి యందురు.

వి. ధృతి యనగా ధారణ. అనగా మనస్సును ఆత్మయందు నిశ్చలముగా నుంచుట. దీనిని మనఃస్థైర్యమందురు. సమాహితమై యుండుట యని భావము.

శ్లో॥ యయా తు ధర్మకామార్థాన్ ధృత్యా ధారయతేఽర్జున
ప్రసంగేన ఫలాకాంక్షీ ధృతిః సా పార్థ రాజసీ 34

తు = కాని, పార్థ = ఓ పార్థా!, అర్జున = ఓ అర్జునా!, ఫలాకాంక్షీ = కర్మఫలేచ్ఛగల మనుజుడు, యయా, ధృత్యా = ఏ ధృతిచేత, ప్రసంగేన = మిక్కిలి ఆసక్తితో, ధర్మకామార్థాన్ = ధర్మార్థకామ విషయములను, ధారయతే = ధారణ చేయునో, సా = అది, రాజసీ, ధృతిః = 'రాజస ధృతి' అని పేర్కొనబడును.

తా. ఓ అర్జునా! ధర్మార్థ కామములు కర్తవ్యములని తలచి, సంగభావమున ఫలాకాంక్షి యగుచు, ఏ ధృతి మూలమున ధర్మార్థ కామములను సాధించునో ఆ ధృతి రాజసి యగును.

శ్లో॥ యయా స్వప్నం భయం శోకం విషాదం మదమేవ చ
న విముంచతి దుర్మేధా ధృతిః సా పార్థ తామసీ 35

పార్థ = ఓ పార్థా!, దుర్మేధాః = దుర్మతియైన మనుష్యుడు, యయా, (ధృత్యా) = ఏ ధారణశక్తి ద్వారా, స్వప్నమ్ = నిద్రను, భయమ్ = భయమును, శోకమ్ = చింతను, చ =

మరియు, విషాదమ్ = దుఃఖమును, మదమ్, ఏవ = ఉన్మత్తతను, న, విముంచతి = విడిచిపెట్టడో అనగా ధారణ చేయుచుండునో, సా = అది, తామసీ, ధృతిః = 'తామస ధృతి' అని చెప్పబడును

తా. ఏ ధృతి మూలమున నిద్రను, భయ శోకములను, విషాద మదములను విడువక దుష్టబుద్ధి యగునో యా ధృతి తామసి యనబడును.

శ్లో॥ సుఖం త్విదానీం త్రివిధం శృణు మే భరతర్షభ
అభ్యాసాద్రమతే యత్ర దుఃఖాంతం చ నిగచ్ఛతి 36

శ్లో॥ యత్తదగ్రే విషమివ పరిణామేఽమృతోపమమ్
తత్సుఖం సాత్త్వికం ప్రోక్తమ్ ఆత్మబుద్ధిప్రసాదజమ్ 37

భరతర్షభ = ఓ అర్జునా!, ఇదానీమ్ = ఇప్పుడు, త్రివిధమ్ = మూడు విధములైన, సుఖమ్, తు = సుఖములను గూర్చియు, మే, (వచః) = నా మాటలను, శృణు = వినుము, యత్ర = ఏ సుఖమునందు సాధకుడు, అభ్యాసాత్ = ధ్యానాదుల అభ్యాసము వలన, రమతే = ఆనందించునో, చ = మరియు, దుఃఖాంతమ్ = దుఃఖాంతమును, నిగచ్ఛతి = పొందునో, యత్ = ఏ సుఖమైతే, అగ్రే = ప్రారంభ సమయమున, విషమ్, ఇవ = విషమువలె అనిపించినను, పరిణామే, తత్ = పరిణామమున అది, అమృతోపమమ్ = అమృత తుల్యముగా ఉండునో, (అతః) = (అందువలన), ఆత్మబుద్ధి ప్రసాదజమ్ = పరమాత్మకు సంబంధించిన విషయములలో నిమగ్నమగుటవలన కలుగునట్టి, తత్, సుఖమ్ = ఆ సుఖము, సాత్త్వికమ్ = 'సాత్త్విక సుఖము' అని, ప్రోక్తమ్ = చెప్పబడును

తా. ఏ సుఖము పొందుటకు మరల మరల యత్నించుచు రమించునో, దుఃఖము శమించునో ఆ సుఖము త్రివిధమై యున్నది. ఓ భరత కులసత్తమా! నేను నీకా సుఖము గూర్చి చెప్పెద వినుము. బ్రహ్మవిద్య కష్టసాధ్యము కావున బ్రహ్మవిద్య నభ్యసించువాడు ప్రథమముగా నా విద్య విషమువలె దుఃఖప్రదమైనదని భావించును. అభ్యాసము చేయగా చేయగా తత్ఫలముగా జ్ఞానవైరాగ్యములు కలిగి అమృత తుల్యమైన యానందమనుభవించును. ఆత్మరతమైన బుద్ధినైర్మల్యమును బొందిన పిమ్మట కలుగు సుఖము సాత్త్విక మనబడును.

వి. *'యత్తదగ్రేవిషమివ'* జ్ఞాన సంపాదన కష్టమయినది. ఆ కష్టమును సాధకుడు విషముగ భావించును.

*'దుఃఖే న లభతే జ్ఞానం'* *(శృతి)*

*'క్షురస్యధారా నిశితా దురత్యయా దుర్గం పదం తత్కవయో వదన్తి'* *(కఠోపనిషత్)*

అను ప్రమాణముచే బ్రహ్మవిద్య క్షురధారవలె (కత్తి అంచువలె) దుర్గమమయి యుండును. కాన కష్టమని వదలక జ్ఞాన సంపాదన ఆవశ్యకము.

శ్లో॥ విషయేంద్రియసంయోగాత్ యత్తదగ్రేఽ మృతోపమమ్
పరిణామే విషమివ తత్సుఖం రాజసం స్మృతమ్ 38

విషయేంద్రియ సంయోగాత్ = విషయేంద్రియ సంయోగము వలన, యత్, సుఖమ్ = ఏ సుఖము, (భవతి) = కలుగునో, తత్ = ఆ సుఖము, అగ్రే = ప్రారంభ సమయమున (భోగానుభవ సమయమునందు), అమృతోపమమ్ = అమృత తుల్యముగా గోచరించినను, పరిణామే = పరిణామమున, విషమ్, ఇవ = విషప్రాయమగును, (అతః) = (అందువలన), తత్ = అది, రాజసమ్ = 'రాజస సుఖము' అని, స్మృతమ్ = తలంపబడును.

తా. ఇన్ద్రియములకు ఇన్ద్రియార్థములతో సంబంధము కలిగి భోగములనుభవించు కాలమున ప్రాప్తమైన నాసుఖము ప్రథమముగ నమృతము వంటిదని తోచును. కాని కాలము గడచిన కొలది యా సుఖమే విషమువలె దుఃఖప్రదమగును. అట్టి సుఖము రాజసము.

శ్లో॥ యదగ్రే చానుబంధే చ సుఖం మోహనమాత్మనః
నిద్రాలస్యప్రమాదోత్థం తత్తామసముదాహృతమ్ 39

యత్, సుఖమ్ ఏ సుఖము, అగ్రే = అనుభవ సమయమున, చ = మరియు, అనుబంధే, చ = పరిణామమునందు, ఆత్మనః, మోహనమ్ = ఆత్మను మోహింపజేయునదియగునో, నిద్రాలస్యప్రమాదోత్థమ్ = నిద్ర, సోమరితనము, ప్రమాదము (మోహము) ల వలన ఉత్పన్నమగునో, తత్ = ఆ సుఖము, తామసమ్ = 'తామస సుఖము' అని, ఉదాహృతమ్ = పేర్కొనబడును.

తా. తమోగుణము వలన కలుగు నిద్రాలస్య ప్రమాదముల మూలమున లభించిన సుఖము సుఖానుభవ కాలమునను, అనన్తరకాలమునను ఆత్మకు మోహజనకమై యుండును. ఈ సుఖము తామస సుఖముగా చెప్పబడును.

శ్లో॥ న తదస్తి పృథివ్యాం వా దివి దేవేషు వా పునః
సత్త్వం ప్రకృతిజైర్ముక్తం యదేభిః స్యాత్ త్రిభిర్గుణైః 40

ప్రకృతిజైః = ప్రకృతినుండి ఉత్పన్నములైన, ఏభిః, త్రిభిః, గుణైః = ఈ మూడు గుణముల

చేత, ముక్తమ్ = విడువబడినది, యత్ = ఏది (ఏ ప్రాణి), స్యాత్ = అగునో, తత్, సత్త్వమ్ = ఆ ప్రాణి, పృథివ్యామ్, వా = భూమియందుగాని, దివి, వా = ఆకాశమునందుగాని, దేవేషు = దేవతలయందుగాని, పునః = మరి ఏ ఇతర లోకములయందుగాని, న, అస్తి = లేదు (ఉండదు)

తా. ప్రకృతి జన్యములైన సత్త్వ రజస్తమస్సులను గుణత్రయముచే సృష్టింపబడినదే సర్వప్రాణి జాలము. భూలోకమునకాని, స్వర్గాదిలోకమునకాని, దేవతలలోకాని, ప్రతి ప్రాణియు, ప్రాణరహితమైన ప్రతి వస్తువు, పై గుణత్రయముచే నిర్మింపబడినవనియే గ్రాహ్యము. గుణత్రయ రహితమగునది ఏ ఒకటి యెచ్చటను లేదని భావము.

శ్లో॥ బ్రాహ్మణక్షత్రియవిశాం శూద్రాణాం చ పరంతప
కర్మాణి ప్రవిభక్తాని స్వభావప్రభవైర్గుణైః 41

పరంతప = ఓ పరంతపా! (అర్జునా), బ్రాహ్మణ క్షత్రియ విశామ్ = బ్రాహ్మణ క్షత్రియ వైశ్యుల యొక్క, చ = అట్లే, శూద్రాణామ్ = శూద్రులయొక్క, కర్మాణి = కర్మలు, స్వభావప్రభవైః = వారివారి స్వభావములను అనుసరించి ఏర్పడిన, గుణైః = గుణములను బట్టి, ప్రవిభక్తాని = విభజింపబడినవి.

తా. ఈశ్వర ప్రకృతియైన త్రిగుణాత్మికమాయవలన పుట్టిన గుణములచే, బ్రాహ్మణాది జాతుల కర్మ లేర్పడినవి. బ్రాహ్మణ స్వభావమునకు సత్త్వగుణము కారణము. క్షత్రియ స్వభావమునకు సత్త్వమిశ్రమైన రజోగుణము కారణము. వైశ్య స్వభావము తమో మిశ్రమమైన రజోగుణము కారణము. శూద్రస్వభావమునకు రజోమిశ్రమమైన తమోగుణము కారణము. ఇట్లు సర్వము త్రిగుణాత్మిక ప్రకృతినుండి కలిగినదని భావము.

శ్లో॥ శమో దమస్తపః శౌచం క్షాంతిరార్జవమేవ చ
జ్ఞానం విజ్ఞానమాస్తిక్యం బ్రహ్మకర్మస్వభావజమ్ 42

శమః = శమము (మనో నిగ్రహము లేదా అంతరింద్రియ నిగ్రహము), దమః = దమము (ఇంద్రియ నిగ్రహము లేదా బాహ్యేంద్రియ నిగ్రహము), తపః = తపస్సు (ధర్మములను పాటించుటలో ఎదురగు కష్టములను సహించుట), శౌచమ్ = బాహ్యాభ్యంతరముల శుచిత్వము, క్షాంతిః = ఇతరుల అపరాధములను క్షమించుట, ఆర్జవమ్ = ఋజుమార్గ జీవనము, ఆస్తిక్యమ్ = వేదశాస్త్రములయందును, ఈశ్వరుని యందును, పరలోకాదుల యందును విశ్వాసము కలిగి యుండుట, జ్ఞానమ్ = వేదశాస్త్రముల అధ్యయనము, అధ్యాపనము, చ = మరియు, విజ్ఞానమ్

ఏవ = పరతత్త్వానుభవమూ (ఇవియన్నియును), బ్రహ్మకర్మ స్వభావజమ్ = బ్రాహ్మణుల స్వాభావిక కర్మలు

తా. శమము, దమము, తపస్సు, శౌచము, క్షాంతి(ఓర్మి), ఆర్జవము, జ్ఞానము, విజ్ఞానము, ఆస్తిక్యము, ఈ లక్షణములు బ్రాహ్మణులకు ప్రకృతి జన్యములైనవి.

శ్లో॥ శౌర్యం తేజో ధృతిర్దాక్ష్యం యుద్ధే చాప్యపలాయనమ్
దానమీశ్వరభావశ్చ క్షాత్రం కర్మ స్వభావజమ్ 43

శౌర్యమ్ = శౌర్యము, తేజః = తేజస్సు, ధృతిః = ధైర్యము, దాక్ష్యమ్, చ = దక్షత మరియు, యుద్ధే, అపి = యుద్ధమునందును, అపలాయనమ్ = వెన్నుచూపకుండుట, దానమ్, చ = దానము (ల) ను చేయుట మరియు, ఈశ్వర భావః = స్వామి భావము మొదలుగునవి అన్నియును, క్షాత్రమ్, స్వభావజమ్, కర్మ = క్షత్రియుల స్వాభావిక కర్మలు.

తా. శౌర్యము, తేజస్సు, ధృతి, దక్షత, యుద్ధము, ప్రాణరక్షణకై వెనుకంజ వేయకుండుట, దానము చేయుట, ప్రభువై యుండుట ఈ లక్షణములు క్షత్రియులకు ప్రకృతి సిద్ధములు.

శ్లో॥ కృషిగౌరక్ష్యవాణిజ్యం వైశ్యకర్మ స్వభావజమ్
పరిచర్యాత్మకం కర్మ శూద్రస్యాపి స్వభావజమ్ 44

కృషి, గౌరక్ష్య, వాణిజ్యమ్ = వ్యవసాయము, గోపాలనము, క్రయవిక్రయములయందు సత్య వ్యవహారము మొదలుగునవి అన్నియును, వైశ్యకర్మ స్వభావజమ్ = వైశ్యులకు స్వాభావికములైన కర్మలు, అపి = మరియు అట్లే, పరిచర్యాత్మకమ్ = అన్ని వర్ణముల వారిని సేవించుట, శూద్రస్య = శూద్రులకు, స్వభావజమ్, కర్మ = స్వాభావికములైన కర్మలు,

తా. వ్యవసాయము, పశుపోషణ, వర్తకము చేయుట స్వభావసిద్ధమైన వైశ్యకర్మ. అదే శూద్రునకు ప్రకృతి సిద్ధమగు లక్షణము పరిచర్య చేయుటయని తెలియవలెను.

శ్లో॥ స్వే స్వే కర్మణ్యభిరతః సంసిద్ధిం లభతే నరః
స్వకర్మనిరతః సిద్ధిం యథా విన్దతి తచ్ఛృణు 45

స్వే స్వే = తన తన, కర్మణి = కర్మలయందు, అభిరతః = తత్పరుడైన, నరః = మానవుడు, సంసిద్ధిమ్ = భగవత్ ప్రాప్తిరూప సిద్ధిని, లభతే = పొందును, స్వకర్మ నిరతః = తన స్వాభావిక కర్మయందు నిరతుడైనవాడు, యథా = ఎట్లు, సిద్ధిమ్ = పరమసిద్ధిని, విందతి = పొందునో, తత్

= ఆ విధులను, శృణు = (తెలుపుచున్నాను) వినుము.

తా. తమ తమ కర్మలందు తత్పరులైన నరులు మోక్షమార్గగాములగుదురు. నరుడే విధమున స్వకర్మరతుడై సిద్ధిని పొందునో ఆ విధమును చెప్పెదను వినుము.

శ్లో॥ యతః ప్రవృత్తిర్భూతానాం యేన సర్వమిదం తతమ్
స్వకర్మణా తమభ్యర్చ్య సిద్ధిం విందతి మానవః 46

యతః = ఏ భగవంతుని నుండి, భూతానామ్ = సమస్త ప్రాణులయొక్క, ప్రవృత్తిః = ఉత్పత్తి (జరుగుచున్నదో), యేన = ఏ భగవంతునిచే, ఇదమ్, సర్వమ్ = ఈ సమస్త జగత్తు, తతమ్ = వ్యాప్తమైనదో, తమ్ = ఆ పరమేశ్వరుని, స్వకర్మణా = తన స్వాభావిక కర్మాచరణము చేయుచూ, అభ్యర్చ్య = పూజించి, మానవః = మానవుడు, సిద్ధిమ్ = పరమసిద్ధిని, విందతి = పొందుచున్నాడు

తా. ఏ పరమ పురుషుడన్తర్యామియై సర్వభూతములకు జగత్తున ప్రవృత్తిని కలిగించుచున్నాడో, ఏ పరమాత్మ ప్రపంచమంతయు వ్యాపించియున్నాడో, అట్టి భూతమహేశ్వరుని యందు బుద్ధిని నిలిపి నిరతుడైనవాడు మోక్షగామి యగును.

శ్లో॥ శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్ స్వనుష్ఠితాత్
స్వభావనియతం కర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషమ్ 47

స్వనుష్ఠితాత్ = బాగుగా ఆచరింపబడిన, పరధర్మాత్ = ఇతరుల ధర్మము కంటెను, విగుణః (అపి) = గుణరహితమే అయినను, స్వధర్మః = స్వధర్మాచరణమే, శ్రేయాన్ = శ్రేష్ఠమైనది, (యస్మాత్) = ఎందువలన అనగా, స్వభావనియతమ్ = స్వభావమునకు అనుగుణమైన, కర్మ = స్వధర్మరూప కర్మ (ల) ను, కుర్వన్ = చేయుచు (మనుష్యుడు), కిల్బిషమ్ = పాపము (ల) ను, న, అప్నోతి = (ఏ మాత్రము) పొందడు,

అవ. బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులకు గుణమూలకములగు సహజ కర్మలను వివరించి యా యా కర్మలు బ్రాహ్మణాది వర్ణములవారికి బంధాపాదకములు కాని విధమును *'శ్రేయాన్ స్వధర్మో విగుణః'* అను శ్లోకము వలన శ్రీ కృష్ణ భగవానులు సూచించు చున్నారు.

తా. ఆత్మేతరములగు ఇన్ద్రియాదుల సుఖభోగములకై ఆచరించు కర్మలు పరధర్మములు. పరులకై చేయబడు కార్యములు నిర్దుష్టముగా నాచరింపబడినను భయావహములగుచున్నవని చెప్పబడుచున్నది.

కావున ఆత్మభావ ప్రాపకమగు పుణ్యకర్మను నిర్దుష్టముగా నాచరించలేక పోయినను మనస్సు ఆత్మాభిముఖమైనందున శ్రేయస్సును కలుగజేయును. అందుచేతనే స్వ+భావ+నియతం = స్వభావ నియతం అనగా ఆత్మ స్వరూపస్థితికి నియతమగు కర్మ నాచరించుచున్నవాడు. ఆ కర్మ (దోషరహితము కాకున్నను) లేదా దోషముతో కూడుకొన్ననూ పాపమును పొందదని భావము.

వి. స్వధర్మమన విస్మృతి పథమునబడిన యాత్మ భావమును గుర్తించుటకు మహర్షులచే విహితములగు ప్రాణాయామ, ప్రత్యాహార, ధ్యాన, సమాధులని గ్రహింపవలయును. పరధర్మమన ఆత్మేతరమగు దేహేన్ద్రియాదుల సుఖమునకై చేయు కార్యములు. అనగా ఇన్ద్రియ సుఖమునుకోరి చేయు కర్మాచరణ యని భావము. ఇన్ద్రియ సుఖము కోరిచేయు కార్యముల నెంత యథోక్తముగా చేసినను, ఇన్ద్రియసుఖావాప్తి, తద్ద్వారా దేహమే తానను అభిమానము వృద్ధిచెంది, జన్మ జరా మరణ రూప సంసార చక్రమున పడును. కావున పరధర్మము భయావహమని చెప్పబడినది. బ్రాహ్మణ ధర్మములైన అధ్యయన ధ్యానాది కార్యములును, ఇన్ద్రియ భోగార్థ మాచరించు కర్మలును అత్యంత శ్రద్ధాసక్తులతో పరిశుద్ధముగా చేయబడినను, భయంకరములై స్వర్గనరకాదులయందు సుఖదుఃఖావాప్తియు, యోగనిష్ఠలో నుండిన యెడల గుణవంతముగా యోగ మభ్యసించజాలకపోయినను యోగికి దుర్గతి కలుగదని భావము. అందువలననే స్వభావనియతమగు కర్మనాచరించుచున్న యోగి కిల్బిషమును పొందదని భగవానుడు చెప్పెను. ఆత్మ భావమును కలుగజేయు కర్మ, స్వధర్మము. స్వధర్మాచరణవలన శ్రేయస్సు కలుగును. ఇన్ద్రియార్థ తృష్ణచే చేయబడు కర్మ పరధర్మము కాన హానికరమని శ్రీకృష్ణ పరమాత్మ యుపదేశించెను.

శ్లో॥ సహజం కర్మ కౌంతేయ సదోషమపి న త్యజేత్
సర్వారంభా హి దోషేణ ధూమేనాగ్నిరివావృతాః 48

కౌంతేయ = ఓ కుంతీసుతా!, సహజమ్, కర్మ = సహజ (స్వాభావిక)మైన కర్మ, సదోషమ్, అపి = దోషయుక్తమైనను, (తత్) = (దానిని), న, త్యజేత్ = త్యజింపరాదు, హి = ఏలనన, అగ్నిః = అగ్ని, ధూమేన, ఇవ = పొగచే ఆవరింపబడినట్లు, సర్వారంభాః, దోషేణ = కర్మలన్నియును ఏదేని ఒక దోషము చేత, ఆవృతాః = ఆవరింపబడియే ఉండును.

తా. స్వభావ సిద్ధమగు కర్మను ఓ కున్తీపుత్రా! దోషయుక్తమైనను ఆచరించవలెనేకాని వదలకూడదు. అగ్నికి ధూమము సహజమై ఉన్నట్లు సర్వకర్మలును దోషముతో కూడియు 'స్వకర్మణా తమభ్యర్చ్య' అనినట్లు స్వకర్మచే ఆత్మార్చన చేయునుపాయము గ్రహింపవలయును.

వి. సర్వారంభములు అనగా సర్వకార్యములు కామమూలకములు.

## మోక్ష సన్న్యాస యోగము

'యద్బుద్ధికురుతే కర్మతత్తత్కామస్య చేష్టితమ్' (బృహదారణ్యకోపనిషత్)

అను ప్రమాణముచే సర్వకార్యములు కామము మూలముననే కలుగుచున్నవి. కావున అగ్నికి ధూమము సహజమైన విధమున సర్వకర్మలు కామదోషముచే కూడియున్నవి. అందువలననే కామమును జ్ఞానికి నిత్యవైరియని చెప్పుచున్నారు.

శ్లో॥ ఆవృతం జ్ఞాన మేతేన జ్ఞానినో నిత్యవైరిణా
కామరూపేణ కౌన్తేయ దుష్పూరేణానలేన చ (3-39)

అను గీతావాక్యమున కామమును దుష్పూరమగు అనలముగా పోల్చి చెప్పిరి. అనలమనగా 'చాలునని తృప్తి' నీయ జాలనిది. కామభోగము వలన జీవునకు కామతృష్ణ నశించదు. కనుక జ్ఞానికి శత్రువువలె నిత్యము పొంచియుండి జ్ఞానమును నశింపజేయును.

'కామ ఏషక్రోధఏష రజోగుణ సముద్భవః' (3-37)

అను గీతావాక్యప్రమాణమున కామక్రోధములు రజోగుణ లక్షణములు. ఈవిధముగా సర్వారంభములు గుణమూలకములయియున్నవి. కనుక గుణాతీతుడగు పరమాత్మతో తాదాత్మ్యమును పొందుటకు కర్మత్యాగ మావశ్యకమనుట సమంజసముకాదు. ఏలనన దేహి కర్మలను వదలజాలడు.

'నహి దేహభృతా శక్యం త్యక్తుం కర్మాణ్యశేషతః' (18-11)

అని గీతావచనము కావున కర్మ నాచరించుచున్నను, కర్మగత దోషము స్పృశింపకుండుటకు యోగనిష్ఠలో నుండవలెను.

'యోగస్థః కురు కర్మాణి' అనియు

'యోగః కర్మసు కౌశలం' అనియు గల గీతావాక్యముల భావమిదియే.

యోగస్థుడగుచు స్వకర్మ నాచరించిన యీశ్వరునర్చించిన వాడే యగుచున్నాడు.

శ్లో॥ అసక్తబుద్ధిః సర్వత్ర జితాత్మా విగతస్పృహః
నైష్కర్మ్య సిద్ధిం పరమాం సంన్యాసేనాధిగచ్ఛతి 49

సర్వత్ర = ప్రాపంచిక విషయములన్నింటి యందును, అసక్తబుద్ధిః = ఆసక్తి లేనివాడును, విగతస్పృహః = స్పృహ రహితుడును, జితాత్మా = అంతఃకరణమును జయించినవాడును, అగు పురుషుడు, సన్న్యాసేన = సాంఖ్య యోగము ద్వారా, పరమామ్ = అత్యంత శ్రేష్ఠమైన, నైష్కర్మ్య సిద్ధిమ్ = నైష్కర్మ్య సిద్ధిని, అధిగచ్ఛతి = పొందును.

తా. అన్నిటి యందును సంగభావ వర్జితుడయి యాత్మ సంయమము కలిగి యున్నచో ఇన్ద్రియార్థముల యందాశలేని వాడగును. ఇట్లు జితాత్ముడగు యోగి కర్మఫలత్యాగముచే నిరతిశయమగు నైష్కర్మ్య భావమును పొందగలుగును. నిష్క్రియుడగునాత్మగా నుండు స్థితియే నైష్కర్మ్య సిద్ధి కనుక ఇది పరమని చెప్పిరి.

వి. *'నైష్కర్మ్య సిద్ధింపరమాం'* *(శ్రుతి)*

అనుటచే పరమమగు నైష్కర్మ్య సిద్ధియే కాక సామాన్యమగు నైష్కర్మ్య స్థితికూడ కలదని భావము. నిద్రావస్థయందు కర్మలను చేయనివాడే యైనను ఆ నైష్కర్మ్యమును పరమమని చెప్పదగదు. అజ్ఞానావస్థలో కలిగిన నైష్కర్మ్యమును పరమమని చెప్పుట యుక్తము కాదు.

*శ్లో॥ యోగయుక్తో విశుద్ధాత్మా విజితాత్మా జితేన్ద్రియః*
*సర్వభూతాత్మ భూతాత్మా కుర్వన్నపి న లిప్యతే* *(5-7)*

అను గీతావాక్య ప్రమాణమున యోగయుక్తుడగువాడే మనోజయము కలిగి ఇన్ద్రియ నిగ్రహము కలవాడగును. అప్పుడు సర్వభూతముల ఆత్మ తానేయని నిశ్చయబుద్ధి కలుగును. అట్టి యోగి కర్మల నాచరించినను కర్మఫలభాగి కాజాలడు. కావున యోగి అన్నిటియందును అసక్తబుద్ధి కలవాడయి యుండును. అట్టినిర్మల బుద్ధితో కర్మాచరణ చేసినను ఫలాపేక్షలేని వాడగుటచే కర్మఫల త్యాగము చేసిన వాడగును. కావున పరమోత్కృష్టమని చెప్పబడు నైష్కర్మ్య సిద్ధిని బొందినవాడే యగుచున్నాడు.

శ్లో॥ సిద్ధిం ప్రాప్తో యథా బ్రహ్మ తథాప్నోతి నిబోధ మే
సమాసేనైవ కౌంతేయ నిష్ఠా జ్ఞానస్య యా పరా 50

కౌంతేయ = ఓ అర్జునా!, జ్ఞానస్య, యా, పరా, నిష్ఠా, సిద్ధిమ్ = జ్ఞానయోగము యొక్క పరానిష్ఠయైన నైష్కర్మ్య సిద్ధిని, యథా = ఏ విధముగా, ప్రాప్తః = పొందినవాడై, బ్రహ్మ = పరబ్రహ్మ పరమాత్మను, యథా = ఎట్లు, ఆప్నోతి = పొందునో, తథా = ఆ విధానమును, సమాసేన ఏవ = సంక్షిప్తముగానే, మే = నానుండి, నిబోధ = ఎరుంగుము.

తా. జ్ఞాననిష్ఠచే ఎట్లు నరుడు పరమాత్మ సాక్షాత్కారమును పొంది సమ్యగ్దర్శన నిష్ఠ కలవాడగునో ఆ నిష్ఠను సంక్షేపముగా చెప్పుదును. ఆ నిష్ఠచే యోగాభ్యాసపరుని చిత్తము శుద్ధమగును. శుద్ధాన్తః కరణుడీశ్వర ధ్యానాభిముఖుడై తత్త్వ జిజ్ఞాసాపరుడగును. తీవ్రమైన తత్త్వజిజ్ఞాస కలుగుట సిద్ధి యగును. సిద్ధి ప్రాప్త్యనన్తరము నిరన్తరము ఆత్మ చిన్తారతుడై పరమాత్మను పొందు విధమును సంక్షేపముగా చెప్పుదును.

శ్లో॥ బుద్ధ్యా విశుద్ధయా యుక్తో ధృత్యాత్మానం నియమ్య చ
శబ్దాదీన్ విషయాన్ త్యక్త్వా రాగద్వేషౌ వ్యుదస్య చ 51

శ్లో॥ వివిక్తసేవీ లఘ్వాశీ యతవాక్కాయమానసః
ధ్యానయోగపరో నిత్యం వైరాగ్యం సముపాశ్రితః 52

శ్లో॥ అహంకారం బలం దర్పం కామం క్రోధం పరిగ్రహమ్
విముచ్య నిర్మమః శాంతో బ్రహ్మభూయాయ కల్పతే 53

విశుద్ధయా = విశుద్ధమైన, బుద్ధ్యా = బుద్ధితో, యుక్తః = కూడినవాడై, లఘ్వాశీ = తేలికయైన సాత్త్వికాహారమును మితముగా భుజించువాడును, శబ్దాదీన్ = శబ్ద, స్పర్శ, రూపాదులైన, విషయాన్ = విషయములను, త్యక్త్వా = త్యజించి, వివిక్తసేవీ = పరిశుభ్రమైన ప్రదేశమున ఏకాంతముగా నివసించువాడును, ధృత్యా = సాత్త్విక ధారణ శక్తి ద్వారా, ఆత్మానమ్ = అంతఃకరణమును, ఇంద్రియములను, నియమ్య = సంయమమొనర్చి, యతవాక్కాయమానసః = మనోవాక్కాయ ములను అదుపులో ఉంచుకొనినవాడును, రాగద్వేషౌ = రాగద్వేషములను, వ్యుదస్య = సర్వదా త్యజించి, వైరాగ్యమ్ = దృఢవైరాగ్యమును, సముపాశ్రితః = ఆశ్రయించినవాడును, చ = మరియు, అహంకారమ్ = అహంకారమును, బలమ్ = బలమును, దర్పమ్ = దర్పమును, కామమ్ = కామమును, క్రోధమ్ = క్రోధమును, చ = మరియు, పరిగ్రహమ్ = పరిగ్రహమును, విముచ్య = పరిత్యజించి, నిత్యమ్ = నిరంతరము, ధ్యానయోగ పరః = ధ్యానయోగ పరాయణుడైనవాడును, నిర్మమః = మమతా రహితుడును, శాంతః = శాంతియుతుడును అయిన పురుషుడు, బ్రహ్మభూయాయ = సచ్చిదానంద ఘన పరబ్రహ్మమందు, అభిన్న భావముతో స్థితుడగుటకు, కల్పతే = పాత్రుడగును.

తా. కర్తవ్యమగు కృత్యమందు నిశ్చయము కలిగి ఏక రూపముగానున్న బుద్ధితో కూడిన యోగి, సాత్త్విక ధృతిచే దేహేంద్రియ సంఘాత రూపమగు శరీరమును నియమించి, మనోధర్మములగు రాగద్వేషములను, రాగద్వేష మూలములగు విషయములను వదలి ఏకాంత ప్రదేశమున నుండును. లఘువుగా భుజించువాడగును. మనోవాక్కాయములను సంయమము చేయును. అట్టి యోగి, వైరాగ్యము కలిగి చిత్తవృత్తిని నరికట్టుటకై యోగమును, ఆత్మ దర్శనమునకు ధ్యానమును నిష్ఠతో చేయుచు, ధ్యానయోగపరుడై దేహమందహంభావమును, మమకారమును, బలదర్పములను, కామక్రోధములను, బాహ్యవిషయ పరిగ్రహమును వదలి నిత్యశుద్ధ బుద్ధ ముక్తమైయున్న బ్రహ్మమయి యుండును.

'వ్యవసాయాత్మికా బుద్ధి రేకేహ కురునన్దన' (2-41)

యోగయుక్తునకు సర్వమాత్మయేయను స్థిర బుద్ధి కలుగును. అట్టిస్థిరబుద్ధియే విశుద్ధబుద్ధి యనబడును. అట్టి యోగి మనస్సు సర్వకాలముల ధ్యానయోగపరమై యుండును. ఆ యోగి అనాత్మయగు సర్వమును వదలిన వాడే యగును. 'ధ్యానయోగ పరః' ధ్యానమన ఆత్మ స్వరూపమును చింతించుట. యోగము ఆత్మ యందేకాగ్రమై యుండుటకు మనోవృత్తుల నిరోధమునకై చేయు ప్రాణాయామరూప యత్నము. ధ్యానయోగములను కర్తవ్యములని తలచి వాని యందు నిష్ఠకలిగి యున్నవాడు ధ్యానయోగపరుడు.

శ్లో॥ బ్రహ్మభూతః ప్రసన్నాత్మా న శోచతి న కాంక్షతి
సమః సర్వేషు భూతేషు మద్భక్తిం లభతే పరామ్ 54

బ్రహ్మభూతః = సచ్చిదానంద ఘనబ్రహ్మమునందు ఏకీభావ స్థితుడును, ప్రసన్నాత్మా = ప్రసన్నమైన మనస్సు గలవాడును అయిన యోగి, న, శోచతి = (దేనికిని) శోకింపడు, న, కాంక్షతి = దేనినీ కాంక్షింపడు, సర్వేషు భూతేషు = సమస్త భూతముల యందును, సమః = సమభావముగల యోగి, పరామ్, మద్భక్తిమ్ = నా పరాభక్తిని, లభతే = పొందును

తా. బ్రహ్మభావమును పొందిన యోగి ప్రశాంతాత్ముడై, లోకసామాన్యముగ విషాదమును పొందదగిన విషయమైకూడ విషాదమును పొందడు. స్వయముగా పరిపూర్ణుడు కావున దేనిని ఆర్థించడు. బ్రహ్మభూతుడగు ఆ యోగి సర్వభూతములందు నిగూఢముగా నున్న ఆత్మను దర్శించుచు, వైషమ్యమును చూడడు. అట్టి యోగి నాయందుత్తమ భక్తిని కలిగినవాడే యగును. సర్వభూతముల యందు పరతత్త్వమును దర్శించుటయే యుత్తమ భక్తియని తాత్పర్యము.

శ్లో॥ భక్త్యా మామభిజానాతి యావాన్ యశ్చాస్మి తత్త్వతః
తతో మాం తత్త్వతో జ్ఞాత్వా విశతే తదనంతరమ్ 55

భక్త్యా = ఆ పరాభక్తితో (ఆ బ్రహ్మభూతుడైన యోగి), మామ్ = పరమాత్ముడనైన నన్ను, (అహమ్) = (నేను), యః = ఎవరినో, చ = మరియు, యావాన్, అస్మి = ఎంతటి శక్తిగలవాడనో, తత్త్వతః = యథాతథముగ నా తత్త్వమును, అభిజానాతి = బాగుగా ఎరుంగును, తతః = అనంతరము, మామ్ = నన్ను, తత్త్వతః = యథార్థముగా, జ్ఞాత్వా = తెలిసికొని, తదనంతరమ్ = తత్ క్షణమే, విశతే = నాలో లీనమగును.

తా. భక్తుడు ఆ పరాభక్తిచే పరమేశ్వరుడనైన నన్ను యథార్థముగా నేనెంతవాడనో, ఎవడనో నా

ఉన్న రూపెరిగిన యనన్తరము నన్ను చేరును.

వి. 'యథావత్' (ఉన్నది యున్నట్లుగా) పరమాత్మను తెలిసినవాడు, జగత్తు ఆత్మేతరమైనది కాదనియు, దృశ్యమానమగు సర్వజగత్తు వాసుదేవుడే యనియు నిశ్చయ భావమున నుండును. అనగా విక్షేపశక్తి నశించును. కనుక

శ్లో॥ విక్షేపోయస్యనాస్త్యస్య బ్రహ్మవిత్త్వం నమన్యతే,
బ్రహ్మైవాయమితి ప్రాహుఃయతయః పారదర్శినః (వివేక చూడామణి)

అను ప్రమాణముననుసరించి విక్షేపముచే చలింపకయున్న బ్రహ్మవేత్తను బ్రహ్మవేత్తయనక, దివ్యజ్ఞాన సమ్పన్నులగు యతీశ్వరులు బ్రహ్మయే యనిరి. 'విశతే తదనన్తరమ్' అనునది వ్యవహారానుగుణముగ మాత్రమే చెప్పబడినది.

శ్లో॥ సర్వకర్మాణ్యపి సదా కుర్వాణో మద్వ్యపాశ్రయః
మత్ప్రసాదాదవాప్నోతి శాశ్వతం పదమవ్యయమ్ 56

మద్వ్యపాశ్రయః = మత్ పరాయణుడై నన్ను ఆశ్రయించిన కర్మయోగి, సర్వకర్మాణి = సమస్త కర్మలను, సదా = నిరంతరము, కుర్వాణః అపి = చేయుచునే, మత్ ప్రసాదాత్ = నా అనుగ్రహము వలన, శాశ్వతమ్ = సనాతనమైన, పదమ్ = పరమ పదమును, అవాప్నోతి = పొందును.

తా. అన్ని కాలములందును నన్ను ఆశ్రయించిన వాడనగా నిరన్తరము నాయందు మనోబుద్ధుల నుంచి నన్ను తలచువాడు, సర్వకర్మల నాచరించుచున్నను, నా అనుగ్రహముచే నిత్యమును, అవ్యయమునగు పరమపదమును బొందును.

శ్లో॥ చేతసా సర్వకర్మాణి మయి సన్న్యస్య మత్పరః
బుద్ధియోగముపాశ్రిత్య మచ్చిత్తః సతతం భవ 57

సర్వకర్మాణి = సమస్త కర్మలను, చేతసా = నిండు మనస్సుతో, మయి = నాయందు (నాకు), సన్న్యస్య = సమర్పించి, బుద్ధియోగమ్ = సమబుద్ధిరూప యోగమును, ఉపాశ్రిత్య = అవలంబించి, మత్పరః = మత్పరాయణుడవై, సతతమ్ = సంతతము, మచ్చిత్తః, భవ = నాయందే చిత్తము గలవాడవగుము.

తా. బుద్ధియోగము నాశ్రయించుటచే శుద్ధమైన చిత్తముకలవాడయి సర్వకర్మలను వదలినవాడే యగుచున్నాడు. ఆయోగి సర్వకాలములందును నాయందే చిత్తము కలవాడగుచు మత్పరుడయి యుండును.

వి. బుద్ధియోగమనినను, ప్రాణాయామ మనినను, యుక్తత యనినను, యోగమనినను, చిత్తశుద్ధి కలిగి ఏకాగ్రతను కలిగించు ఉపాయమని తెలియనగును. చిత్తము నిశ్చలమై నిర్మలమై యున్ననే ఆత్మను తెలియగలదు. బుద్ధి యుక్తుడనిన యోగబలముచే సమాహిత చిత్తుడైన యోగియని భావము.

శ్లో॥ మచ్చిత్తః సర్వదుర్గాణి మత్ ప్రసాదాత్ తరిష్యసి
అథ చేత్ త్వమహంకారాత్ న శ్రోష్యసి వినంక్ష్యసి 58

మచ్చిత్తః, త్వమ్ = నాయందు చిత్తమును నిల్పిన నీవు, మత్ ప్రసాదాత్ = నాయనుగ్రహము వలన, సర్వదుర్గాణి = సమస్త సంకటములను, తరిష్యసి = అనాయాసముగ దాటగలవు, అథ, చేత్ = అట్లుగాక, అహంకారాత్ = అహంకార కారణముగ, న, శ్రోష్యసి = నా వచనములను నీవు పెడచెవిన పెట్టినచో, వినంక్ష్యసి = నష్టముల పాలగుదువు (పరమార్థ పథము నుండి భ్రష్టుడవగుదువు)

తా. నన్ను చింతించుచు నా యనుగ్రహము అనగా అంతఃకరణ శుద్ధి ద్వారా దుర్గమములైన ప్రతిబంధకముల నతిక్రమించి పరమ పదమును పొందుదువు. అట్లు కానిచో పండితుడనను యహంకారముచే వినకుందువో సంసార చక్రమునబడి నశించుదువు.

శ్లో॥ యదహంకారమాశ్రిత్య న యోత్స్య ఇతి మన్యసే
మిథ్యైష వ్యవసాయస్తే ప్రకృతిస్త్వాం నియోక్ష్యతి 59

అహంకారమ్ = అహంకారమును, ఆశ్రిత్య = ఆశ్రయించి, న, యోత్స్యే = (నేను) యుద్ధము చేయను, ఇతి = అని, యత్, మన్యసే = ఏదైన తలంతువో, ప్రకృతిః = (నీ) స్వభావమే, త్వామ్ = నిన్ను, నియోక్ష్యతి = (యుద్ధము చేయుటకు) పురిగొల్పును.

తా. వాసుదేవుడనైన నేను చెప్పిన హితము నహంకారముచే లెక్కచేయక యుద్ధము చేయనని పట్టుదల కలిగియుందువేని నీ ఈ నిశ్చయము నిష్ఫలమగును. ఏలనన క్షత్రియ స్వభావము, నీవు తప్పక యుద్ధము చేయునట్లు నిన్ను ప్రేరేపించును.

శ్లో॥ స్వభావజేన కౌన్తేయ నిబద్ధః స్వేన కర్మణా
కర్తుం నేచ్ఛసి యన్మోహాత్ కరిష్యస్యవశోఽపి తత్ 60

కౌంతేయ = ఓ అర్జునా!, మోహాత్ = మోహ ప్రభావము వలన, యత్ = ఏ యుద్ధ కర్మను, కర్తుమ్ = చేయుటకు, న, ఇచ్ఛసి = నీవు ఇష్టపడకున్నావో, తత్, అపి = ఆ యుద్ధమును గూడ, స్వేన, స్వభావజేన = నీ (క్షత్రియ) స్వభావమునకు తగిన, కర్మణా = కర్మ (సంస్కారముల) చే, నిబద్ధః = బంధింపబడినవాడవై, అవశః, కరిష్యసి = అవశుడవై చేయుదువు

తా. ప్రతియొక మానవుడు స్వభావముచేతనే సిద్ధమయియున్న కర్మకు బద్ధుడగును. చేయవలదని యజ్ఞానముచే నిర్ణయించినను జీవుడు ప్రకృతి బద్ధుడై యుండును. కనుక తన కప్రియమైనను నా యా కర్మను చేయుచునే యుండును.

శ్లో॥ ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి
భ్రామయన్ సర్వభూతాని యన్త్రారూఢాని మాయయా 61

అర్జున = ఓ అర్జునా!, యంత్రారూఢాని = శరీరరూప యంత్రములను అధిరోహించిన, సర్వభూతాని = సమస్త ప్రాణులను, ఈశ్వరః = అంతర్యామియైన పరమేశ్వరుడు, మాయయా = తన మాయచే, భ్రామయన్ = (వారివారి కర్మలను అనుసరించి, వారిని) భ్రమింపజేయుచు, సర్వభూతానామ్ = సకల భూతముల యొక్క, హృద్దేశే = హృదయములయందు, తిష్ఠతి = స్థితుడైయుండును

తా. ఓ అర్జునా! సర్వప్రాణులకును హృదయ కమలములందు సర్వభూత నియామకుడై ఈశ్వరుడు కలడు. యంత్రమునందలి బొమ్మలు యన్త్రముతోపాటు తిరుగునటుల, ఈశ్వరుడు మాయాబలముచే సర్వభూతములను మోహమునముంచి ఆయా కర్మలచే బద్ధులగావించి జన్మపరంపరయందు భ్రమింపజేయుచున్నాడు.

వి. *బుద్ధౌ గుహాయాం సదసద్విలక్షణం*
*బ్రహ్మాస్తి సత్యం పరమద్వితీయం* *(వివేక చూడామణి)*

ఇందు బుద్ధిగుహయు, *'ఈశ్వరస్సర్వ భూతానాం హృద్దేశే అర్జున తిష్ఠతి'* అను గీతావాక్యమందలి హృద్దేశము శరీరమందు ఒకే ఒక స్థానమును బోధించునవై యున్నవి. హృద్దేశమనినను, బుద్ధిగుహయనినను ఒకటియేయని తెలియవలెను.

శ్లో॥ తమేవ శరణం గచ్ఛ సర్వభావేన భారత
తత్ప్రసాదాత్ పరాం శాంతిం స్థానం ప్రాప్స్యసి శాశ్వతమ్ 62

భారత = ఓ అర్జునా!, సర్వభావేన = అన్ని విధములుగా, తమ్, ఏవ = ఆ పరమేశ్వరునే, శరణమ్, గచ్ఛ = శరణుజొచ్చుము, తత్ ప్రసాదాత్ = ఆయన అనుగ్రహము వలన, పరామ్, శాంతిమ్ = పరమశాంతిని, శాశ్వతమ్, స్థానమ్ = శాశ్వతమైన పరమపదమును, ప్రాప్స్యసి = పొందగలవు.

తా. సర్వప్రాణుల హృదయ గుహలోనున్న ఈశ్వరుని సర్వాత్మ భావమున శరణు పొందుము. సర్వభూతాన్తరాత్మయగు ఈశ్వరుడు చిత్తమున ప్రసన్నుడై యున్నందున ఇహలోకమున ఉత్తమ సుఖమును పొందుదువు. అనన్తరము శాశ్వతమైన పరమ పదమును బొందుదువు.

వి. 'సర్వభావేన' అనుటచే సర్వమాత్మయే యనుభక్తిభావమున సేవించవలెను. 'తమేవశరణం గచ్ఛ' అనుటవలన మానవులకారాధ్య దేవుడు తీర్థక్షేత్రాదులందలి నామరూపాత్మక దేవతలు కాదనియు, సర్వభూతముల హృద్గుహలోనుండి సర్వవ్యవహారములకు కారణమైన ఈశ్వరుడే ధ్యేయుడును, ఆరాధ్యుడును నని తెలియుము. బుద్ధి గుహయందుకల పరమాత్మ యొక్క సాక్షాత్కారముచే శాంతి లభించును. పరోక్షానుభూతివలన అనగా శాస్త్రజ్ఞానమున ప్రయోజనములేదని తెలియుచున్నది.

*శ్లో॥ అనుభూతిం వినామూఢో వృధా బ్రహ్మణి మోదతే*
*ప్రతిబింబిత శాఖాగ్ర ఫలాస్వాదన మోదవత్* *(మైత్రేయ్యుపనిషత్)*

ప్రత్యక్షముగా ఆత్మ సాక్షాత్కార ఫలమే బ్రహ్మానందము. ప్రత్యక్షానుభూతి లేక కేవల శాస్త్రజ్ఞాని ప్రకటించు ఆనందము, జలగతమైన శాఖాగ్రఫల ప్రతిబింబము చూచి మూఢుడాస్వాదించు ఫల రసాస్వాదానందము వంటిదని శాస్త్రము మూఢానందమును గర్హించుచున్నది.

శ్లో॥ ఇతి తే జ్ఞానమాఖ్యాతం గుహ్యాద్గుహ్యతరం మయా
విమృశ్యైతదశేషేణ యథేచ్ఛసి తథా కురు 63

ఇతి = ఈ విధముగా, గుహ్యాత్, గుహ్యతరమ్ = పరమ గోప్యమైన, జ్ఞానమ్ = జ్ఞానము, మయా = నాచేత, తే = నీకు, అఖ్యాతామ్ = చెప్పబడినది, ఏతత్ = ఈ గోప్య జ్ఞానమును, అశేషేణ = సమగ్రముగా (పూర్తిగా), విమృశ్య = పరిశీలించి, యథా = ఏ విధముగా, ఇచ్ఛసి = నీవు కోరుకొనుచున్నావో, తథా = ఆ ప్రకారము, కురు = చేయుము.

తా. అర్జునా! నీ కత్యంత రహస్యమగు నాత్మజ్ఞాన ముపదేశించితిని. సమగ్రముగా దీనిని విమర్శించి నీ యిచ్చ వచ్చినట్లు చేయుము.

శ్లో॥ సర్వగుహ్యతమం భూయః శృణు మే పరమంవచః
ఇష్టోఽసి మే దృఢమితి తతో వక్ష్యామి తే హితమ్ 64

సర్వ గుహ్యతమమ్ = సమస్త గోప్య విషయములయందును పరమగోప్యమైన, మే, పరమమ్, వచః = సర్వశ్రేష్ఠమైన నా వచనములను, భూయః = ఇంకనూ, శృణు = వినుము, మే = నాకు, ధృఢమ్ = అత్యంతము, ఇష్టః, అసి = ఇష్టమైనవాడవు, తతః = అందువలన, ఇతి, హితమ్ = హితకరములైన ఈ నా వచనములను, తే = నీకు, వక్ష్యామి = చెప్పెదను

తా. ఆత్మతత్త్వము అతి రహస్యమైనది. అయినను నీవు నా కత్యన్త ప్రియుడవు, కావున నీకు హితమైన నాయీ యుత్తమములగు పలుకులను చెప్పెదను వినుము.

శ్లో॥ మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు
మామేవైష్యసి సత్యం తే ప్రతిజానే ప్రియోఽసి మే 65

మన్మనాః = నాయందే మనస్సు నిల్పినవాడవు, మద్భక్తః = నాయందు భక్తిగలవాడవు, మద్యాజీ = నన్ను పూజించువాడవు, భవ = కమ్ము, మామ్ = నన్ను (నాకు), నమస్కురు = నమస్కరింపుము, (ఏవమ్) = ఇట్లు చేయుటవలన, మామ్, ఏవ = నన్నే, ఏష్యసి = పొందెదవు, తే = నీకు (నీ కొరకై), సత్యమ్, ప్రతిజానే = సత్య ప్రతిజ్ఞ చేయుచున్నాను, (యతః) = ఏలనన, మే = నాకు, ప్రియః, అసి = నీవు మిక్కిలి ఇష్టమైనవాడవు.

తా. సర్వభూతాత్మనై యున్న నా యందు మనస్సు నుంచిన వాడవగుచు నా యందు భక్తి కలవాడవగుము. నన్ను పూజించుచు నన్నే నమస్కరించుచున్ననో సత్యముగా నన్నే చేరుదువు. నీవు నాకు ప్రియుడవు కావున ప్రతిజ్ఞ చేయుచున్నాను.

శ్లో॥ సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ
అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః 66

సర్వధర్మాన్ = సమస్త ధర్మములను (సర్వకర్తవ్య కర్మలను), పరిత్యజ్య = నాకు సమర్పించి, ఏకమ్ = సర్వశక్తిమంతుడను, సర్వాధారుడను, పరమేశ్వరుడను అయిన, మామ్, ఏవ = నన్నే, శరణమ్, వ్రజ = శరణుజొచ్చుము, అహమ్, త్వా = నేను నిన్ను, సర్వపాపేభ్యః = సమస్త పాపముల

నుండియు, మోక్షయిష్యామి = విముక్తుని గావించెదను, మా, శుచః = నీవు శోకింపకుము.

తా. సమస్తములైన పుణ్యాపుణ్య కార్యములను వదలి యద్వయుడనగు నన్నే శరణు పొందుము. బన్ధహేతువులగు ధర్మా ధర్మ కార్యములనుండి నీకు ముక్తిని కలుగజేయుదును. నీవు చింతించవలదు.

వి. *'సర్వ ధర్మాన్ పరిత్యజ్య' 'త్యజ ధర్మమధర్మం చ'* అను ప్రమాణ వాక్యము కూడ ముముక్షువునకు ధర్మాధర్మ కార్యములు లేక పుణ్యాపుణ్య కర్మలు త్యాజ్యములని చెప్పుచున్నది.

*శ్లో॥ ధర్మ రజ్జ్వా వ్రజే దూర్ధ్వం పాప రజ్జ్వా వ్రజేదధః*
*ద్వయం జ్ఞానాసినా ఛిత్వా విదేహః శాన్తి మృచ్ఛతి* *(భారతం శాంతిపర్వం)*

ధర్మాచరణ చేసిన ఊర్ధ్వలోకముల కేగును. అధర్మ కార్యముల నాచరించిన అధోలోకముల కేగును. కనుక జ్ఞాన నిష్ఠాపరుడయి, ధర్మాధర్మ కార్యముల బంధమును త్రెంచుకొని, యజుడును, నమరుడును నగును.

*శ్లో॥ నైవధర్మీ న చాధర్మీ న చైవ హి శుభాశుభీ*
*యఃస్యాదేకాసనేలీనః తూష్ణీం కించిదచిన్తయన్* *(భారతం శాంతిపర్వం)*

అను ప్రమాణము బాహ్యాన్తరేన్ద్రియ నిగ్రహమువలన పరమ పదమునందే చిన్త కలిగి, అన్య చిన్తలను విడనాడి, పరమాత్మను శరణు పొందుటను తెలుపుచున్నది.

*'అహం చిత్తే వ్యవస్థితః'* *(ఋభుగీత 9-40)*

అనుటచే సర్వధర్మములను నీవు వదలిన, నేను (అనగా ఆత్మ) చిత్తమునందే యుంటిని. కాన దుఃఖింపవలదు. చిత్తము విక్షేపరహితమై స్థైర్యము చెందుటకు యోగమభ్యసింపవలయును. *'సర్వధర్మాన్ పరిత్యజ్య'* అనగా అన్ని ఇంద్రియ కర్మలను విడిచిపెట్టుట. అన్ని ఇంద్రియంములు భ్రూమధ్యమునకు క్రింది భాగముననే యున్నవి. యోగి యోగాభ్యాస పాటవముచే భ్రూమధ్యము నందు తన ప్రాణశక్తిని నిలిపినచో సర్వ ఇంద్రియ ధర్మములను విడిచిన వాడగును.

*'మామేకం శరణం వ్రజ'* అనగా అద్వైతరూపంలో భ్రూమధ్యంలో 'నన్ను' చేరుట అని యర్థం.

*'అహం త్వా సర్వ పాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః'*

భ్రూమధ్యంలో చేరు యోగికి మోక్షము ఇంకొకరు ఇచ్చునది కాదు. తనకు తానే అమృత స్వరూపుడై సర్వ పాపముల నుండి విముక్తుడగును.

శ్లో॥ ఇదం తే నాతపస్కాయ నాభక్తాయ కదాచన
న చాశుశ్రూషవే వాచ్యం న చ మాం యోఽభ్యసూయతి 67

తే = (త్వయా) నీచే, ఇదమ్ = రహస్యమయమైన ఈ గీతోపదేశము, కదాచన = ఎప్పుడైనను (ఏ స్థితియందైనను), అతపస్కాయ = తపస్సంపన్నుడు కానివానికి, న, వాచ్యమ్ = చెప్పదగదు, అభక్తాయ, చ = భక్తి రహితునకును, న, వాచ్యమ్ = చెప్పదగదు, అశుశ్రూషవే = వినుటకు ఇచ్ఛలేనివానికి, న, వాచ్యమ్ = చెప్పదగదు, చ = మరియు, యః = ఎవడు, మామ్ = నన్ను, అభ్యసూయతి = దోషదృష్టితో చూచునో, తస్మై = వానికి (ఎన్నడును), న = (ఈ ఉపదేశమును గూర్చి) తెలుపరాదు.

తా. ఈ ఆత్మ తత్త్వము భక్తుడుకాని వానికి, తపోనిరతి లేని వానికి, ఆత్మ తత్త్వమును విన నిచ్ఛలేని వానికి, పరమాత్మనగు నాయొక్క అస్తిత్వమును విశ్వసింపక నన్ను దూషించువానికి చెప్పదగదు.

వి. *శ్లో॥ యస్యదేవే పరాభక్తి ర్యథా దేవే తథాగురౌ*
*తస్యైతే కథితా హ్యర్థాః ప్రకాశన్తే మహాత్మనః* *(శ్వేతాశ్వతరోపనిషత్)*

అను ప్రమాణము ననుసరించి గురుభక్తి, ఈశ్వర భక్తి కలవాడు తత్త్వోపదేశమున కర్హుడని భావము. అట్టి భక్తునకు పరమాత్మయొక్క సర్వజ్ఞత్వ, సర్వశక్తిమత్త్వాది గుణములందు విశ్వాసము కలదు. కావున వాడే ఈశ్వరుని శరణుపొందనర్హుడగును.

శ్లో॥ యఇమం పరమం గుహ్యం మద్భక్తేష్వభిధాస్యతి
భక్తిం మయి పరాం కృత్వా మామేవైష్యత్యసంశయః 68

యః = ఎవడైతే, మయి = నాయందు, పరామ్, భక్తిమ్, కృత్వా = పరమభక్తిని గలిగి, ఇమమ్ = ఈ, పరమమ్, గుహ్యమ్ = మిక్కిలి గోప్యమైన గీతోపదేశమును, మద్భక్తేషు = నా భక్తులయందు, అభిధాస్యతి = పదిలపరచునో, సః = అతడు, మామ్. ఏవ = నన్నే, ఏష్యతి = పొందును, అసంశయః = ఇందు సంశయమునకు తావేలేదు.

తా. ఉత్తమమైనదియు, రహస్యమైనదియు నగు పరతత్త్వమును ఎవడైనను నా భక్తులకు చెప్పిన యెడల, నాయందుత్తమ భక్తి కలవాడయి, నన్ను తప్పక పొందును. నిశ్చయము.

వి. *'పరమం గుహ్యం'* అనుటచే కేవల శాస్త్రజన్య జ్ఞానము కలవారి వలన నెరుంగుట అసంభవము. కాన ఆత్మారాముడగు యోగివలన నెరుంగదగినది.

*శ్లో॥ యథా ఖరశ్చన్దన భారవాహీ భారస్యవేత్తా న తు చన్దనస్య*
*తథైవ శాస్త్రాణి బహున్యధీత్య సారం న జానన్తి ఖరవద్వి చేతసః (ఉత్తరగీత)*

అను శ్లోకము కేవల శాస్త్రజ్ఞునకు గుహ్యాతి గుహ్యమైన తత్త్వము తెలియదని చెప్పుచున్నది. చన్దన భారమును మోయు గార్దభమునకు చన్దనసార మనుభవింప నర్హతలేనట్లు, బహు శాస్త్రజ్ఞుడైనను ఆత్మతత్త్వ మెరుకలేక యుండునని బోధించుచున్నది.

శ్లో॥ న చ తస్మాన్ మనుష్యేషు కశ్చిన్మే ప్రియకృత్తమః
భవితా న చ మే తస్మాత్ అన్యః ప్రియతరో భువి 69

మనుష్యేషు = మనుష్యులలో, మే = నాకు, తస్మాత్ = వానికంటెను, ప్రియకృత్తమః = మిక్కిలి ప్రియమును గూర్చువాడు, కశ్చిత్, చ = ఎవ్వడును, న = లేడు, చ = అట్లే, భువి = ఈ భూమండలమున, తస్మాత్ = వానికంటెను, మే = నాకు, ప్రియతరః = మిక్కిలి ప్రియమైనవాడు, అన్య = మరియొకడు, న, భవితా = ఉండబోడు.

తా. ఉత్తమ భక్తి సంపన్నుడగు వానికంటె నితరుడే ఒక్కడును నాకు మిక్కిలి ప్రీతి కలిగించువాడు లేడు. భూలోకమున నాకు వాని కంటే నధికముగా ప్రియుడైనవాడు ముందుకాలమున కూడ నుండడని భావము.

శ్లో॥ అధ్యేష్యతే చ య ఇమం ధర్మ్యం సంవాదమావయోః
జ్ఞానయజ్ఞేన తేనాహం ఇష్టః స్యామితి మే మతిః 70

యః = ఎవడైతే, ఇమమ్ = ఈ, ధర్మ్యమ్ = ధర్మయుక్తమైన, ఆవయోః = మన ఇరువురియొక్క, సంవాదమ్ = సంవాదరూపమైన గీతాశాస్త్రమును, అధ్యేష్యతే = పఠించునో, తేన, చ = వానిచేతను, అహమ్ = నేను, జ్ఞానయజ్ఞేన = జ్ఞానయజ్ఞము ద్వారా, ఇష్టః, స్యామ్ = పూజితుడను అగుదును, ఇతి = అని, మే, మతిః = నా అభిప్రాయము.

తా. ఆత్మతత్త్వ ప్రతిపాదకమై పరమ ధర్మ సమన్వితమైన మన సంవాదరూప గీతా శాస్త్రమును పఠించినవాడు జ్ఞాన యజ్ఞముచే నన్నారాధించిన వాడే యగును. కాన నాకు వాడు చాల యిష్టుడు. ఇది నా నిశ్చితాభిప్రాయము.

శ్లో॥ శ్రద్ధావాననసూయశ్చ శృణుయాదపి యో నరః
సోఽపి ముక్తః శుభాన్ లోకాన్ ప్రాప్నుయాత్ పుణ్యకర్మణామ్ 71

యః, నరః = ఏ నరుడైతే, శ్రద్ధావాన్ = శ్రద్ధగలవాడై, అనసూయః, చ = దోషదృష్టి లేనివాడై, శ్రుణుయాత్, అపి = (ఈ గీతాశాస్త్రమును) వినునో, సః, అపి = అతడును, ముక్తః = పాపవిముక్తుడై, పుణ్యకర్మణామ్ = పుణ్యకర్మలను ఆచరించువారియొక్క, శుభాన్, లోకాన్ = ఉత్తమ లోకములను, ప్రాప్నుయాత్ = తప్పక పొందును.

తా. శ్రీ కృష్ణార్జున సంవాద రూపమైన పరమ రహస్యమగు నాత్మతత్త్వమును శ్రద్ధగా, అసూయరహితుడై వినిన వాడు, పాప విముక్తుడగును. పుణ్యాత్ములు బోవు శుభప్రద లోకములకు బోవును.

శ్లో॥ కచ్చిదేతచ్ఛ్రుతం పార్థ త్వయైకాగ్రేణ చేతసా
కచ్చిదజ్ఞానసమ్మోహః ప్రణష్టస్తే ధనంజయ 72

పార్థ = ఓ పార్థా!, ఏతత్ = ఈ గీతాశాస్త్రము, త్వయా = నీచేత, ఏకాగ్రేణ, చేతసా = ఏకాగ్ర చిత్తముతో, శ్రుతమ్, కచ్చిత్ = వినుట జరిగినదా?, ధనంజయ = ఓ ధనంజయా!, తే = నీయొక్క, అజ్ఞాన సమ్మోహః = అజ్ఞాన జనితమైన మోహము, కచ్చిత్, ప్రణష్టః = పూర్తిగా తొలగిపోయినదా?

తా. శ్రీ కృష్ణ పరమాత్మ యర్జునుని సంబోధించి యిట్లనెను. ఓ పార్థా! నీవు సావధానముగా నేకాగ్రమగు చిత్తమును కలిగి నే చెప్పిన దంతయు వింటివా? ఇందువలన నీ కజ్ఞాన మూలముగా గల భ్రాన్తి నశించినదా?

**అర్జున ఉవాచ :**

శ్లో॥ నష్టో మోహః స్మృతిర్లబ్ధా త్వత్ప్రసాదాన్మయాచ్యుత
స్థితోఽస్మి గతసందేహః కరిష్యే వచనం తవ 73

అచ్యుత = ఓ అచ్యుతా!, త్వత్ ప్రసాదాత్ = నీ అనుగ్రహము వలన, మమమోహః = నా మోహము, నష్టః = (పూర్తిగా) తొలగినది, మయా = నాచేత, స్మృతిః = స్మృతి, లబ్ధా = పొందబడినది, గతసందేహః స్థితః అస్మి = సందేహములు తొలగినవాడనైతిని, అతః = కనుక, తవ, వచనమ్ కరిష్యే = నీ ఆజ్ఞను తలదాల్చెదను.

తా. అర్జునుడు శ్రీకృష్ణ భగవానునితో నిట్లనెను. ఓ అచ్యుతా! నీ అనుగ్రహముచే ఆత్మతత్త్వ విషయ స్మృతి కలిగినది. అందుచేత సకల సందేహములు నివృత్తియయినవి. నీ ఉపదేశముననుసరించి వర్తించెదను.

వి. *శ్లో॥ భిద్యతే హృదయగ్రన్థిః చిద్యన్తే సర్వసంశయాః*
*క్షీయన్తే చాస్య కర్మాణి తస్మిన్ దృష్టే పరావరే* (ముండకోపనిషత్)

*"తత్రకో మోహఃకః శోక ఏకత్వ మనుపశ్యతః"* (శృతి)

ఈ మంత్రములు తత్త్వదర్శికి సకల సంశయములు విచ్ఛిన్నములగు ననియు, సకల పాపములు నశించుననియు, ఇంత మాత్రమే కాక వీని కన్నిటికి మూలమగు అవిద్యయు నశించునని కూడ చెప్పుచున్నవి. కావున తత్త్వజ్ఞాన లాభానన్తరము పార్థునకు సకల సందేహములు నశించెనని భావము.

**సంజయ ఉవాచ:**

శ్లో॥ ఇత్యహం వాసుదేవస్య పార్థస్య చ మహాత్మనః
సంవాదమిమమశ్రౌషమ్ అద్భుతం రోమహర్షణమ్ 74

ఇతి = ఈ ప్రకారముగ, అహమ్ = నేను, వాసుదేవస్య = శ్రీకృష్ణునియొక్క, మహాత్మనః = మహాత్ముడైన, పార్థస్య, చ = అర్జునుని యొక్క, ఇమమ్ = ఈ, అద్భుతమ్ = అద్భుతమైన, రోమహర్షణమ్ = తనువును పులకింపజేయునట్టి, సంవాదమ్ = సంవాదమును, అశ్రౌషమ్ = వింటిని.

తా. సంజయుడు ధృతరాష్ట్రునితో నిట్లనెను. ఓ మహారాజ! ఈ విధముగా వాసుదేవునకును, అర్జుననకును మధ్య జరిగిన సంవాదమును వింటిని. ఇదిచాల అద్భుతముగానున్నది. ఆనందాతిశయముచే రోమాంచము కలుగుచున్నది. ఆనందాశ్చర్యములు కలుగుచున్నవని భావము.

శ్లో॥ వ్యాసప్రసాదాచ్ఛృతవాన్ ఏతద్గుహ్యమహం పరమ్
యోగం యోగేశ్వరాత్ కృష్ణాత్ సాక్షాత్ కథయతః స్వయమ్ 75

వ్యాసప్రసాదాత్ = వ్యాసభగవానుని కృపవలన (దివ్యదృష్టిని పొందినవాడనై), అహమ్ = నేను, ఏతత్ = ఈ, పరమ్, గుహ్యమ్ = పరమగోప్యమైన, యోగమ్ = యోగమును (అర్జుననకు), స్వయమ్ = స్వయముగా, కథయతః = చెప్పుచున్న (ఉపదేశించుచున్న), యోగేశ్వరాత్ = యోగేశ్వరుడైన, కృష్ణాత్ = శ్రీకృష్ణభగవానుని నుండి, సాక్షాత్ = ప్రత్యక్షముగా, శ్రుతవాన్ = వింటిని.

తా. వ్యాసమునీంద్రుల యొక్క అనుగ్రహముచే లబ్ధమైన జ్ఞాననేత్రము వలన, రహస్యాతి రహస్యమైన ఈ యోగవిద్యాత్మకమగు పరతత్త్వమును యోగేశ్వరుడైన కృష్ణ పరమాత్మ స్వయముగా చెప్పుచుండగా వింటిని.

శ్లో॥ రాజన్ సంస్మృత్య సంస్మృత్య సంవాదమ్ ఇమమద్భుతమ్
కేశవార్జునయోః పుణ్యం హృష్యామి చ ముహుర్ముహుః 76

రాజన్ = ఓ ధృతరాష్ట్ర మహారాజా!, కేశవార్జునయోః = శ్రీకృష్ణభగవానునకును అర్జుననకును మధ్య జరిగిన, ఇమమ్ = ఈ (పరమగోప్యమైన), పుణ్యమ్ = పవిత్రమైన, అద్భుతమ్, చ = అద్భుతమైనదియునగు, సంవాదమ్ = సంవాదమును (గీతను), సంస్మృత్య సంస్మృత్య = పదే పదే స్మరించుచు, ముహుర్ముహుః = మాటిమాటికిని (నిరంతరము), హృష్యామి = ఆనందించుచున్నాను.

తా. ఓ మహారాజా! శ్రీ కృష్ణార్జునులమధ్య జరిగిన పుణ్యమైన ఈ యద్భుత సంవాదమును విని, మరల మరల తలచుకొనుచు సంతోషించుచున్నాను.

శ్లో॥ తచ్చ సంస్మృత్య సంస్మృత్య రూపమత్యద్భుతం హరేః
విస్మయో మే మహాన్ రాజన్ హృష్యామి చ పునఃపునః 77

రాజన్ = ఓ రాజా!, హరేః = శ్రీకృష్ణునియొక్క, తత్, అతి, అద్భుతమ్ = అట్టి అద్భుతమైన, రూపమ్, చ = దివ్యరూపమునే, సంస్మృత్య సంస్మృత్య = పదే పదే స్మరించుట వలన, మే = నాకు, మహాన్, విస్మయః = అంతులేని ఆశ్చర్యము కలుగుచున్నది, (అహమ్) = నేను, పునః పునః = మాటిమాటికిని, హృష్యామి = ఆనందమున పొంగిపోవుచున్నాను,

తా. ఓ ధృతరాష్ట్ర మహారాజా! విశ్వరూప ప్రదర్శనావసరమున చూపబడిన శ్రీ కృష్ణపరమాత్మ యొక్క యత్యద్భుతమైన దివ్యరూపమును స్మరించుచు ఉన్న నాకత్యాశ్చర్యము కలుగుచున్నది. అత్యంతానంద భరితుడనగుచున్నాను.

శ్లో॥ యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః
తత్ర శ్రీర్విజయో భూతిః ధ్రువా నీతిర్మతిర్మమ 78

యత్ర = ఎచ్చటనయితే, యోగీశ్వరః కృష్ణః = యోగీశ్వరుడైన శ్రీకృష్ణ భగవానుడు (ఉండునో), యత్ర = ఎచ్చటనయితే, ధనుర్ధరః పార్థ = గాండీవ ధనుస్సును చేతబట్టిన అర్జునుడు (ఉండునో), తత్ర, శ్రీ = అచ్చట సిరిసంపదలును, విజయః = సర్వ విజయములును, భూతిః = సకలైశ్వర్యములును, ధ్రువా, నీతిః = దృఢమైన నీతియు, (భవంతి) = ఉండును, ఇతి = అని, మమ, మతిః = నా నిశ్చితాభిప్రాయము.

తా. యోగమాయకు ప్రభువగు శ్రీకృష్ణుదును, ధనుర్ధరుడైన పార్థుదును ఉన్న చోట సిరి, విజయము, సకల భూతులు, నీతియు కలుగునని నానిశ్చయము.

వి. *'యత్రయోగేశ్వరః'* అనుశ్లోకము ముఖ్యమైనది. మన పూర్వులగు విద్వాంసులు ఈ శ్లోకము యొక్క ప్రాధాన్యమును గమనించి, భారతీయులగు వారికి చిరస్మరణీయము చేయదలచిరి. సనాతన మతమునవలంబించువారు శుభాశుభ కర్మల చేయు సమయమున ఆదియందు దేవతా ప్రార్థన చేయుచు, ఈ శ్లోకమును చదువుకొందురు. కావున దీనియందు అమరసందేశమొకటి యుండి యుండవలయును. అది యిట్లుగా ఊహించదగును. యోగేశ్వరుడు శ్రీకృష్ణపరమాత్మ, యోగమనగా త్రిగుణముల యోగము. గుణత్రయాత్మికమగు ప్రకృతి యని భావము. మాయయని మరొకపేరు.

*'దైవీహ్యేషా గుణమయీమమ మాయా దురత్యయా'* *(7-14)*

అని శ్రీకృష్ణభగవానుడు మాయ గుణమయి అని చెప్పెను. మాయ, ప్రకృతి అను శబ్దములచే చెప్పబడునదియే యోగము. కనుకనే పరమాత్మ యోగేశ్వర, మహాయోగేశ్వర అను శబ్దములచే గీతయందు చెప్పబడెను. ఇచ్చట యోగేశ్వరుడగు కృష్ణుడన మాయాధీశుడు, పరమాత్మయని భావము. పార్థ శబ్దము వలన, ఈశ్వరుని కంటె నేను వేరని యన్యభావమున జీవత్వ దశ ననుభవించుచున్న అజ్ఞాని యగు జీవుడని గ్రాహ్యము. ధనుర్ధర శబ్దము వలన, సద్గురు ప్రసాదమున నజ్ఞాన దశనుండి, యనగా జీవభావమునుండి యాత్మ భావమును గ్రహించుటకు యోగనిష్ఠ కలిగియున్న సాధకుడని తెలియదగును. అందముగా నున్న కనుబొమలు ధనస్సును పోలియుండును. కాన భ్రూమధ్యస్థానమున దృష్టిని నిలిపి పట్టి, యోగమభ్యసించుచున్నవాడు ధనుర్ధరునివలె నున్నాడని శ్రీ వ్యాసమునీన్ద్రులు పాఠకులకు స్ఫురింపజేయుచున్నారు.

*శ్లో: ప్రణవో ధనుః శరోహ్యాత్మా బ్రహ్మతల్లక్ష్య ముచ్యతే*
*అప్రమత్తేన వేద్ధవ్యం శరవత్తన్మయో భవేత్* *(ముండకోపనిషత్)*

యోగసాధన చేయువాడు ప్రణవమును ధనుస్సుగా, తన ప్రాణమును బాణమువలె భ్రూమధ్యము వైపు ఎక్కుపెట్టి, బ్రహ్మమును లక్ష్యము గావించుకొని అప్రమత్తుడై శరమువలె తన్మయుడై బ్రహ్మైక్యము పొందునని భావము.

*శ్లో॥ యోమాం పశ్యతి సర్వత్ర సర్వం చ మయి పశ్యతి*
*తస్యాహం న ప్రణశ్యామి స చ మే న ప్రణశ్యతి'* *(6-30)*

## మోక్ష సన్న్యాస యోగము

యనుశ్లోకము ద్వారా యోగనిష్ఠాపరుడైన సాధకునకు పరమాత్మ అభయమిచ్చుచున్నాడు. కావున సాధకుడైన యోగికి 'యత్ర యోగేశ్వరః కృష్ణో' అనుశ్లోకమున చెప్పబడిన సిరి, విజయము మున్నగునవి కలుగుననుట నిశ్చయము. 'కామదం మోక్షదంచైవ' యోగ మహిమ వర్ణనాతీతము.

ఇతిశమ్. ఓం తత్ సత్

ఇట్లు
శ్రీ పరమహంస పరివ్రాజకాచార్యులును,
బ్రహ్మర్షి సద్గురు **శ్రీశ్రీశ్రీ శివానంద భగవత్పూజ్యపాద** శిష్యులును నైన
బ్రహ్మర్షి సద్గురు **శ్రీశ్రీశ్రీ స్వామి రామానంద పరమహంస** వారిచే
రచింపబడిన గీతామృతమను టీక యందు
**మోక్ష సన్న్యాస యోగ**మను అష్టాదశాధ్యాయము సమాప్తము.

# శ్లోకానుక్రమణిక


-- అ --

| | అ. | శ్లో. |
|---|---|---|
| అకీర్తించాపి భూతాని | 02 | 34 |
| అక్షరం బ్రహ్మ పరమమ్ | 08 | 03 |
| అక్షరాణామకారోస్మి | 10 | 33 |
| అగ్నిర్జ్యోతిరహః శుక్లః | 08 | 24 |
| అచ్ఛేద్యోఽయమదాహ్యోఽయమ్ | 02 | 24 |
| అజోఽపి సన్నవ్యయాత్మా | 04 | 06 |
| అజ్ఞశ్చాశ్రద్ధధానశ్చ | 04 | 40 |
| అత్ర శూరా మహేష్వాసా | 01 | 04 |
| అథ కేన ప్రయుక్తోయం | 03 | 36 |
| అథ చిత్తం సమాధాతుం | 12 | 09 |
| అథచేత్త్వమిమం ధర్మ్యం | 02 | 33 |
| అథ చైనం నిత్యజాతం | 02 | 26 |
| అథవా బహునైతేన | 10 | 42 |
| అథవా యోగినామేవ | 06 | 42 |
| అథ వ్యవస్థితాన్ దృష్ట్వా | 01 | 20 |
| అథైతదప్యశక్తోసి | 12 | 11 |
| అదృష్టపూర్వం హృషితోస్మి | 11 | 45 |
| అదేశకాలే యద్దానం | 17 | 22 |
| అద్వేష్టా సర్వభూతానాం | 12 | 13 |
| అధర్మం ధర్మమితి | 18 | 32 |
| అధర్మాభిభవాత్కృష్ణ | 01 | 41 |
| అధశ్చోర్ధ్వం ప్రసృతాస్తస్య | 15 | 02 |
| అధిభూతం క్షరో భావః | 08 | 04 |
| అధియజ్ఞః కథం కోత్ర | 08 | 02 |
| అధిష్ఠానం తథా కర్తా | 18 | 14 |
| అధ్యాత్మజ్ఞాననిత్యత్వం | 13 | 12 |
| అధ్యేష్యతే చ య ఇమం | 18 | 70 |

| | అ. | శ్లో. |
|---|---|---|
| అనంతవిజయం రాజా | 01 | 16 |
| అనంతశ్చాస్మి నాగానాం | 10 | 29 |
| అనన్యచేతాః సతతం | 08 | 14 |
| అనన్యాశ్చింతయంతో మామ్ | 09 | 22 |
| అనపేక్షః శుచిర్దక్షః | 12 | 16 |
| అనాదిత్వాన్నిర్గుణత్వాత్ | 13 | 31 |
| అనాదిమధ్యాన్తమనన్త | 11 | 19 |
| అనాశ్రితః కర్మఫలం | 06 | 11 |
| అనిష్టమిష్టం మిశ్రం చ | 18 | 12 |
| అనుద్వేగకరం వాక్యం | 17 | 15 |
| అనుబంధం క్షయం హింసాం | 18 | 25 |
| అనేకచిత్తవిభ్రాంతాః | 16 | 16 |
| అనేకబాహూదరవక్త్రనేత్రం | 11 | 16 |
| అనేక వక్త్రనయనం | 11 | 10 |
| అంతకాలే చ మామేవ | 08 | 05 |
| అన్తవత్తు ఫలం తేషామ్ | 07 | 23 |
| అన్తవన్త ఇమే దేహాః | 02 | 18 |
| అన్నాద్భవన్తి భూతాని | 03 | 14 |
| అన్యే చ బహవః శూరాః | 01 | 09 |
| అన్యే త్వేవమజానన్తః | 13 | 25 |
| అపరం భవతో జన్మ | 04 | 04 |
| అపరే నియతాఽహారాః | 04 | 30 |
| అపరేయమితస్త్వన్యాం | 07 | 05 |
| అపర్యాప్తం తదస్మాకం | 01 | 10 |
| అపానే జుహ్వతి ప్రాణం | 04 | 29 |
| అపి చేత్సుదురాచారో | 09 | 30 |
| అపి చేదసి పాపేభ్యః | 04 | 36 |

## శ్లోకానుక్రమణిక


| | అ. | శ్లో. |
|---|---|---|
| అప్రకాశోఽప్రవృత్తిశ్చ | 14 | 13 |
| అఫలాకాంక్షిభిర్యజ్ఞో | 17 | 11 |
| అభయం సత్త్వసంశుద్ధిః | 16 | 01 |
| అభిసంధాయ తు ఫలం | 17 | 12 |
| అభ్యాసయోగయుక్తేన | 08 | 08 |
| అభ్యాసేప్యసమర్థోసి | 12 | 10 |
| అమానిత్వమదంభిత్వం | 13 | 07 |
| అమీ చ త్వాం ధృతరాష్ట్రస్య | 11 | 26 |
| అమీ హి త్వాం సురసంఘాః | 11 | 21 |
| అయనేషు చ సర్వేషు | 01 | 11 |
| అయతిః శ్రద్ధయోపేతో | 06 | 37 |
| అయుక్తః ప్రాకృతః స్తబ్ధః | 18 | 28 |
| అవజానన్తి మాం మూఢాః | 09 | 11 |
| అవాచ్యవాదాంశ్చ బహూన్ | 02 | 36 |
| అవినాశి తు తద్విద్ధి | 02 | 17 |
| అవిభక్తం చ భూతేషు | 13 | 16 |
| అవ్యక్తాదీని భూతాని | 02 | 28 |
| అవ్యక్తాద్వ్యక్తయస్సర్వాః | 08 | 18 |
| అవ్యక్తోఽక్షర ఇత్యుక్తః | 08 | 21 |
| అవ్యక్తోఽయమచింత్యోఽయం | 02 | 25 |
| అవ్యక్తం వ్యక్తిమాపన్నం | 07 | 24 |
| అశాస్త్రవిహితం ఘోరం | 17 | 05 |
| అశోచ్యానన్వశోచస్త్వం | 02 | 11 |
| అశ్రద్ధధానాః పురుషాః | 09 | 03 |
| అశ్రద్ధయా హుతం దత్తం | 17 | 28 |
| అశ్వత్థః సర్వవృక్షాణాం | 10 | 26 |
| అసక్తబుద్ధిః సర్వత్ర | 18 | 49 |
| అసక్తిరనభిష్వంగః | 13 | 09 |
| అసత్యమప్రతిష్ఠం తే | 16 | 08 |
| అసౌ మయా హతశ్శత్రుః | 16 | 14 |
| అసంయతాత్మనా యోగో | 06 | 36 |
| అసంశయ మహాబాహో | 06 | 35 |
| అస్మాకం తు విశిష్టాయే | 01 | 07 |
| అహం క్రతురహం యజ్ఞః | 09 | 16 |
| అహంకారం బలం దర్పం | 16 | 18 |
| అహంకారం బలం దర్పం | 18 | 53 |
| అహమాత్మా గుడాకేశ | 10 | 20 |
| అహం వైశ్వానరో భూత్వా | 15 | 14 |
| అహం సర్వస్య ప్రభవో | 10 | 08 |
| అహం హి సర్వయజ్ఞానామ్ | 09 | 24 |
| అహింసా సత్యమక్రోధః | 16 | 02 |
| అహింసా సమతా తుష్టిః | 10 | 05 |
| అహోబత మహత్పాపం | 01 | 45 |


-- ఆ --


| | అ. | శ్లో. |
|---|---|---|
| ఆఖ్యాహి మే కో భవాన్ | 11 | 31 |
| ఆచార్యాః పితరః పుత్రాః | 01 | 34 |
| ఆఢ్యోభిజనవానస్మి | 16 | 15 |
| ఆత్మసంభావితాః స్తబ్ధాః | 16 | 17 |
| ఆత్మౌపమ్యేన సర్వత్ర | 06 | 32 |
| ఆదిత్యానామహం విష్ణుః | 10 | 21 |
| ఆపూర్యమణమాచలప్రతిష్ఠం | 02 | 70 |
| ఆబ్రహ్మభువనాల్లోకాః | 08 | 16 |
| ఆయుధానామహం వజ్రం | 10 | 28 |
| ఆయుః సత్త్వబలారోగ్యం | 17 | 08 |
| ఆరురుక్షోర్మునేర్యోగం | 06 | 03 |

| | అ. | శ్లో. |
|---|---|---|
| ఆవృతం జ్ఞానమేతేన | 03 | 39 |
| ఆశాపాశవతైర్బద్ధాః | 16 | 12 |
| ఆశ్చర్యవత్పశ్యతి | 02 | 29 |
| ఆసురీం యోనిమాపన్నాః | 16 | 20 |
| ఆహారస్త్వపి సర్వస్య | 17 | 07 |
| ఆహుస్త్వామృషయస్సర్వే | 10 | 13 |
| -- ఇ -- | | |
| ఇచ్ఛాద్వేషసముత్థేన | 07 | 27 |
| ఇచ్ఛా ద్వేషః సుఖమ్ | 13 | 06 |
| ఇతి గుహ్యతమం శాస్త్రమ్ | 15 | 20 |
| ఇతి తే జ్ఞానమాఖ్యాతమ్ | 18 | 63 |
| ఇతి క్షేత్రం తథా జ్ఞానమ్ | 13 | 18 |
| ఇత్యర్జునం వాసుదేవః | 11 | 50 |
| ఇత్యహం వాసుదేవస్య | 18 | 74 |
| ఇదమద్య మయా లబ్ధం | 16 | 13 |
| ఇదం తు తే గుహ్యతమమ్ | 09 | 01 |
| ఇదం తే నాతపస్కాయ | 18 | 67 |
| ఇదం శరీరం కౌంతేయ | 13 | 01 |
| ఇదం జ్ఞానముపాశ్రిత్య | 14 | 02 |
| ఇన్ద్రియస్యేన్ద్రియస్యార్థే | 03 | 34 |
| ఇన్ద్రియాణాం హ చరతామ్ | 02 | 67 |
| ఇన్ద్రియాణి పరాణ్యాహుః | 03 | 42 |
| ఇన్ద్రియాణి మనో బుద్ధిః | 03 | 40 |
| ఇన్ద్రియార్థేషు వైరాగ్యమ్ | 13 | 08 |
| ఇమం వివస్వతే యోగమ్ | 04 | 01 |
| ఇష్టాన్ భోగాన్ హి | 03 | 12 |
| ఇహైకస్థం జగత్కృత్స్నమ్ | 11 | 07 |
| ఇహైవతైర్జితః సర్గః | 05 | 19 |

| | అ. | శ్లో. |
|---|---|---|
| -- ఈ -- | | |
| ఈశ్వరస్సర్వ భూతానామ్ | 18 | 61 |
| -- ఉ -- | | |
| ఉచ్ఛైఃశ్రవసమశ్వానామ్ | 10 | 27 |
| ఉత్క్రామన్తం స్థితం | 15 | 10 |
| ఉత్తమః పురుషస్త్వన్యః | 15 | 17 |
| ఉత్పన్నకులధర్మాణామ్ | 01 | 44 |
| ఉత్సీదేయురిమే లోకాః | 03 | 24 |
| ఉదారాః సర్వ ఏవైతే | 07 | 18 |
| ఉదాసీనవదాసీనః | 14 | 23 |
| ఉద్ధరేదాత్మనాఽఽత్మనామ్ | 06 | 05 |
| ఉపద్రాష్టానుమన్తా చ | 13 | 22 |
| -- ఊ -- | | |
| ఊర్ధ్వం గచ్ఛన్తి సత్త్వస్థాః | 14 | 18 |
| ఊర్ధ్వమూలమధఃశాఖమ్ | 15 | 01 |
| -- ఋ -- | | |
| ఋషిభిర్బహుధా గీతమ్ | 13 | 04 |
| -- ఏ -- | | |
| ఏతచ్ఛ్రుత్వా వచనం | 11 | 35 |
| ఏతద్యోనీని భూతాని | 07 | 06 |
| ఏతన్మే సంశయం కృష్ణ | 06 | 39 |
| ఏతాన్న హన్తుమిచ్ఛామి | 01 | 35 |
| ఏతాన్యపి తు కర్మాణి | 18 | 06 |
| ఏతాం దృష్టిమవష్టభ్య | 16 | 09 |
| ఏతాం విభూతిం యోగం చ | 10 | 07 |
| ఏతైర్విముక్తః కౌన్తేయ | 16 | 22 |
| ఏవముక్తో హృషీకేశః | 01 | 24 |
| ఏవముక్త్వాఽర్జునః సంఖ్యే | 01 | 47 |

# శ్లోకానుక్రమణిక


| | అ. | శ్లో. |
|---|---|---|
| ఏవముక్త్వా తతో రాజన్ | 11 | 09 |
| ఏవముక్త్వా హృషీకేశమ్ | 02 | 09 |
| ఏవమేతద్యథాత్థ | 11 | 03 |
| ఏవమ్ పరమ్పరాప్రాప్తమ్ | 04 | 02 |
| ఏవం ప్రవర్తితం చక్రమ్ | 03 | 16 |
| ఏవం బహువిధా యజ్ఞాః | 04 | 32 |
| ఏవమ్ బుద్ధే పరం | 03 | 43 |
| ఏవం సతతయుక్తా యే | 12 | 01 |
| ఏవం జ్ఞాత్వా కృతం కర్మ | 04 | 15 |
| ఏషే తేఽభిహితా సాంఖ్యే | 02 | 39 |
| ఏషా బ్రహ్మీ స్థితిః పార్థ | 02 | 72 |
| -- ఓ -- | | |
| ఓమిత్యేకాక్షరం బ్రహ్మ | 08 | 13 |
| -- ఓం -- | | |
| ఓమ్ తత్సదితి నిర్దేశః | 17 | 23 |
| -- క -- | | |
| కచ్చిన్నోభయవిభ్రష్టః | 06 | 38 |
| కచ్చిదేతచ్ఛ్రుతం పార్థ | 18 | 72 |
| కట్వామ్లలవణాత్యుష్ణ | 17 | 09 |
| కథం న జ్ఞేయమస్మాభిః | 01 | 39 |
| కథం భీష్మమహం సంఖ్యే | 02 | 04 |
| కథం విద్యామహం | 10 | 17 |
| కర్మజం బుద్ధియుక్తా హి | 02 | 51 |
| కర్మణః సుకృతస్యాఽహుః | 14 | 26 |
| కర్మణైవ హి సంసిద్ధిమ్ | 03 | 10 |
| కర్మణోహ్యపి బోద్ధవ్యమ్ | 04 | 17 |
| కర్మణ్యకర్మ యః పశ్యేత్ | 04 | 18 |
| కర్మణ్యేవాధికారస్తే | 02 | 47 |
| కర్మ బ్రహ్మోద్భవం విద్ధి | 03 | 15 |
| కర్మేన్ద్రియాణి సంయమ్య | 03 | 06 |
| కర్శయన్తః శరీరస్థమ్ | 17 | 06 |
| కవిం పురాణమనుశాశితారమ్ | 08 | 09 |
| కస్మాచ్చ తే న నమేరన్ | 11 | 37 |
| కాంక్షన్తః కర్మణాం సిద్ధిమ్ | 04 | 12 |
| కామ ఏష క్రోధ ఏష | 03 | 37 |
| కామక్రోధవియుక్తానామ్ | 05 | 26 |
| కామమాశ్రిత్య దుష్పూరమ్ | 16 | 10 |
| కామాత్మానః స్వర్గపరాః | 02 | 43 |
| కామైస్తైస్తైర్హృతజ్ఞానాః | 07 | 20 |
| కామ్యానాం కర్మణాం | 18 | 02 |
| కాయేన మనసా బుద్ధ్యా | 05 | 11 |
| కార్పణ్యదోషోపహత | 02 | 07 |
| కార్యకారణ కర్తృత్వే | 13 | 20 |
| కార్యమిత్యేవ యత్కర్మ | 18 | 09 |
| కాలోస్మి | 11 | 32 |
| కాశ్యశ్చ పరమేష్వాసః | 01 | 17 |
| కిరీటినం గదినం చక్ర | 11 | 46 |
| కిరీటినం గదినం చక్రిణమ్ | 11 | 17 |
| కిం కర్మ కిమకర్మేతి | 04 | 16 |
| కిం తద్బ్రహ్మ | 08 | 01 |
| కిం పునర్బ్రాహ్మణాః | 09 | 33 |
| కుతస్త్వా కశ్మలమిదం | 02 | 02 |
| కులక్షయే ప్రణశ్యన్తి | 01 | 40 |
| కృపయా పరయాఽ విష్టో | 01 | 28 |
| కృషిగౌరక్ష్య వాణిజ్యం | 18 | 44 |
| కైర్లింగైః త్రీన్గుణానేతాన్ | 14 | 21 |

| | అ. | శ్లో. |
|---|---|---|
| క్రోధాద్భవతి సంమోహః | 02 | 63 |
| క్లేశోఽధికతరస్తేషామ్ | 12 | 05 |
| క్లైబ్యం మా స్మ గమః | 02 | 03 |
| క్షిప్రం భవతి | 09 | 31 |
| క్షేత్రక్షేత్రజ్ఞయోరేవమ్ | 13 | 34 |
| క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి | 13 | 02 |
| -- గ -- | | |
| గతిసంగస్య ముక్తస్య | 04 | 23 |
| గతిర్భర్తా ప్రభుఃసాక్షీ | 09 | 18 |
| గాణ్డీవమ్ స్రంసతే | 01 | 30 |
| గామావిశ్య చ భూతాని | 15 | 13 |
| గుణానేతానతీత్య | 14 | 20 |
| గురూనహత్వా హి | 02 | 05 |
| -- చ -- | | |
| చంచలం హి మనః | 06 | 34 |
| చతుర్విధా భజంతే | 07 | 16 |
| చాతుర్వర్ణ్యం మయా | 04 | 13 |
| చిన్తామపరిమేయాం చ | 16 | 11 |
| చేతసా సర్వకర్మాణి | 18 | 57 |
| -- జ -- | | |
| జన్మ కర్మ చ మే | 04 | 02 |
| జరామరణమోక్షాయ | 07 | 29 |
| జాతస్య హి ధ్రువో | 02 | 27 |
| జితాత్మనః ప్రశాన్తస్య | 06 | 07 |
| జ్ఞానయజ్ఞేన చాప్యన్యే | 09 | 15 |
| జ్ఞానవిజ్ఞానతృప్తాత్మా | 06 | 08 |
| జ్ఞానేన తు | 05 | 16 |
| జ్ఞానం కర్మ చ | 18 | 19 |

| | అ. | శ్లో. |
|---|---|---|
| జ్ఞానం తేఽహం సవిజ్ఞానమ్ | 07 | 02 |
| జ్ఞానం జ్ఞేయం పరిజ్ఞాతా | 18 | 18 |
| జ్ఞేయః స నిత్యసన్న్యాసీ | 05 | 03 |
| జ్ఞేయం యత్తత్ప్రవక్ష్యామి | 13 | 12 |
| జ్యాయసీ చేత్కర్మణస్తే | 03 | 01 |
| జ్యోతిషామపి | 13 | 17 |
| -- త -- | | |
| తతః పదం తత్పరిమార్గి | 15 | 04 |
| తచ్చ సంస్మృత్య | 18 | 77 |
| తతః శంఖాశ్చ భేర్యశ్చ | 01 | 13 |
| తతః శ్వేతైర్హయైర్యుక్తే | 01 | 14 |
| తతః స విస్మయావిష్టో | 11 | 14 |
| తత్త్వవిత్తు మహాబాహో | 03 | 28 |
| తత్ర తం బుద్ధి సంయోగమ్ | 06 | 43 |
| తత్ర సత్త్వం నిర్మలత్వాత్ | 14 | 06 |
| తత్రాపశ్యత్థితాన్పార్థ | 01 | 26 |
| తత్రైకస్థం జగత్కృత్స్నమ్ | 11 | 13 |
| తత్రైకాగ్రం మనఃకృత్వా | 06 | 12 |
| తత్రైవం సతి కర్తారమ్ | 18 | 16 |
| తత్క్షేత్రం యచ్చ | 13 | 03 |
| తదిత్యనభిసంధాయ | 17 | 25 |
| తద్బుద్ధయస్తదాత్మానః | 05 | 17 |
| తద్విద్ధి ప్రణిపాతేన | 04 | 34 |
| తపస్విభ్యోఽధికో | 06 | 46 |
| తపామ్యహమహమ్ వర్షమ్ | 09 | 19 |
| తమస్త్వజ్ఞానజం విద్ధి | 14 | 08 |
| తమువాచ హృషీకేశః | 02 | 10 |
| తమేవ శరణమ్ గచ్ఛ | 18 | 62 |

## శ్లోకానుక్రమణిక


| | అ. | శ్లో. |
|---|---|---|
| తస్మాచ్ఛాస్త్రం ప్రమాణం | 16 | 24 |
| తస్మాత్ప్రణమ్య | 11 | 44 |
| తస్మాత్త్వమింద్రియాణ్యాదౌ | 03 | 41 |
| తస్మాత్త్వముత్తిష్ఠ | 11 | 33 |
| తస్మాత్సర్వేషు కాలేషు | 08 | 07 |
| తస్మాదసక్తః సతతమ్ | 03 | 19 |
| తస్మాదజ్ఞానసంభూతమ్ | 04 | 42 |
| తస్మాదోమిత్యుదాహృత్య | 17 | 24 |
| తస్మాదస్య మహాబాహో | 02 | 68 |
| తస్మాన్నార్హా వయమ్ | 01 | 37 |
| తస్య సంజనయన్ హర్షమ్ | 01 | 12 |
| తం విద్యాద్దుఃఖసంయోగమ్ | 06 | 23 |
| తం తథా కృపయాఽఽవిష్టమ్ | 02 | 01 |
| తానహం ద్విషతః | 16 | 19 |
| తాని సర్వాణి సంయమ్య | 02 | 61 |
| తుల్యనిందాస్తుతిర్మౌనీ | 12 | 19 |
| తేజః క్షమా ధృతిః | 16 | 03 |
| తే తం భుక్త్వా | 09 | 21 |
| తేషామహమ్ | 12 | 07 |
| తేషామేవానుకమ్పార్థమ్ | 10 | 11 |
| తేషాం సతతయుక్తానాం | 10 | 10 |
| తేషాం జ్ఞానీ నిత్యయుక్తః | 07 | 17 |
| త్యక్త్వా కర్మఫలాసంగం | 04 | 20 |
| త్యాజ్యం దోషవదిత్యేకే | 18 | 03 |
| త్రిభిర్గుణమయైర్భావైః | 07 | 13 |
| త్రివిధా భవతి శ్రద్ధా | 17 | 02 |
| త్రివిధం నరకస్యేదం | 16 | 21 |
| త్రైగుణ్య విషయాః వేదాః | 02 | 45 |

| | అ. | శ్లో. |
|---|---|---|
| త్రైవిద్యా మాం సోమపాః | 09 | 20 |
| త్వమక్షరం పరమమ్ | 11 | 18 |
| త్వమాదిదేవః పురుషః | 11 | 38 |
| -- ద -- | | |
| దణ్డో దమయతామస్మి | 10 | 38 |
| దమ్భో దర్పోభిమానశ్చ | 16 | 04 |
| దంష్ట్రాకరాలాని | 11 | 25 |
| దాతవ్యమితి | 17 | 20 |
| దివి సూర్యసహస్రస్య | 11 | 12 |
| దివ్యమాలామ్బరధరమ్ | 11 | 11 |
| దుఃఖమిత్యేవ యత్కర్మ | 18 | 08 |
| దుఃఖేష్వనుద్విగ్నమనాః | 02 | 56 |
| దూరేణ హ్యవరం కర్మ | 02 | 49 |
| దృష్ట్వా తు పాణ్డవానీకమ్ | 01 | 02 |
| దృష్ట్వేదం మానుషం రూపమ్ | 11 | 51 |
| దేవద్విజగురు | 17 | 14 |
| దేవాన్భావయతాఽనేన | 03 | 11 |
| దేహీ నిత్యమవధ్యోయం | 02 | 30 |
| దేహినోస్మిన్యథా | 02 | 13 |
| దైవమేవాఽపరే | 04 | 25 |
| దైవీహ్యేషా గుణమయీ | 07 | 14 |
| దైవీ సంపద్విమోక్షాయ | 16 | 05 |
| దోషైరేతైః కులఘ్నానామ్ | 01 | 43 |
| ద్యావాపృథివ్యోరిదమ్ | 11 | 20 |
| ద్యూతమ్ ఛలయతామస్మి | 10 | 36 |
| ద్రవ్యయజ్ఞాస్తపోయజ్ఞాః | 04 | 28 |
| ద్రుపదో ద్రౌపదేయాశ్చ | 01 | 18 |
| ద్రోణం చ భీష్మం చ | 11 | 34 |

| | అ. | శ్లో. |
|---|---|---|
| ద్వావిమౌ పురుషౌ లోకే | 15 | 16 |
| ద్వౌ భూతసర్గౌ లోకే | 16 | 06 |
| -- ధ -- | | |
| ధర్మక్షేత్రే కురుక్షేత్రే | 01 | 1 |
| ధూమో రాత్రిస్తథా | 08 | 25 |
| ధూమేనాఽఽవ్రియతే | 03 | 38 |
| ధృత్యా యయా ధారయతే | 18 | 33 |
| ధృష్టకేతుశ్చేకితాన | 01 | 05 |
| ధ్యానేనాఽఽత్మని | 13 | 24 |
| ధ్యాయతో విషయాన్ | 02 | 62 |
| -- న -- | | |
| న కర్తృత్వం న కర్మాణి | 05 | 14 |
| న కర్మణామనారంభాత్ | 03 | 04 |
| న కాంక్షే విజయం కృష్ణ | 01 | 32 |
| న చ తస్మాన్మనుష్యేషు | 18 | 69 |
| న చ మత్స్థాని | 09 | 05 |
| న చ మాం తాని కర్మాణి | 09 | 09 |
| న చైతద్విద్మః | 02 | 06 |
| న జాయతే మ్రియతే | 02 | 20 |
| న తదస్తి పృథివ్యాం వా | 18 | 40 |
| న తద్భాసయతే సూర్యో | 15 | 06 |
| న తు మాం శక్యసే ద్రష్టుమ్ | 11 | 08 |
| న త్వేవాహం జాతు | 02 | 12 |
| న ద్వేష్ట్యకుశలం కర్మ | 18 | 10 |
| న ప్రహృష్యేత్ప్రియం | 05 | 20 |
| న బుద్ధిభేదం జనయేద్ | 03 | 26 |
| నభః స్పృశం | 11 | 24 |
| నమః పురస్తాదథ | 11 | 40 |
| న మాం కర్మాణి | 04 | 14 |
| న మాం దుష్కృతినో | 07 | 15 |
| న మే పార్థాస్తి | 03 | 22 |
| న మే విదుః సురగణాః | 10 | 02 |
| న రూపమస్యేహ | 15 | 03 |
| న వేదయజ్ఞాధ్యయనైః | 11 | 48 |
| నష్టో మోహః స్మృతిః | 18 | 73 |
| న హి కశ్చిత్ క్షణమపి | 03 | 05 |
| న హి దేహభృతా | 18 | 11 |
| న హి ప్రపశ్యామి | 02 | 08 |
| న హి జ్ఞానేన సదృశమ్ | 04 | 38 |
| నాత్యశ్నతస్తు | 06 | 16 |
| నాఽఽదత్తే కస్యచిత్పాపమ్ | 05 | 15 |
| నాన్తోఽస్తి మమ | 10 | 40 |
| నాన్యం గుణేభ్యః | 14 | 19 |
| నాఽసతో విద్యతే | 02 | 16 |
| నాస్తిబుద్ధిరయుక్తస్య | 02 | 66 |
| నాఽహం ప్రకాశః సర్వస్య | 07 | 25 |
| నాహం వేదైర్న తపసా | 11 | 53 |
| నిమిత్తాని చ పశ్యామి | 01 | 31 |
| నియతస్య తు సన్న్యాసః | 18 | 07 |
| నియతం కురు కర్మ | 03 | 08 |
| నియతం సంగరహితం | 18 | 23 |
| నిరాశీర్యతచిత్తాత్మా | 04 | 21 |
| నిర్మానమోహా | 15 | 05 |
| నిశ్చయం శృణు మే | 18 | 04 |
| నిహత్య ధార్తరాష్ట్రాన్ | 01 | 36 |
| నేహాభిక్రమనాశోఽస్తి | 02 | 40 |

## శ్లోకానుక్రమణిక


| | అ. | శ్లో. |
|---|---|---|
| నైతే సృతీ పార్థ | 08 | 27 |
| నైనం ఛిందంతి శస్త్రాణి | 02 | 23 |
| నైవ కించిత్కరోమీతి | 05 | 08 |
| నైవ తస్య కృతేనార్థో | 03 | 18 |
| -- ప -- | | |
| పంచైతాని మహాబాహో | 18 | 13 |
| పత్రం పుష్పం ఫలమ్ | 09 | 26 |
| పరస్తస్మాత్తు భావోఽన్యో | 08 | 20 |
| పరం బ్రహ్మ పరం ధామ | 10 | 12 |
| పరం భూయః ప్రవక్ష్యామి | 14 | 01 |
| పరిత్రాణాయ సాధూనామ్ | 04 | 08 |
| పవనః పవతామస్మి | 10 | 31 |
| పశ్య మే పార్థ రూపాణి | 11 | 05 |
| పశ్యాఽదిత్యాన్ | 11 | 06 |
| పశ్యామి దేవాంస్తవ | 11 | 15 |
| పశ్యైతాం పాండుపుత్రాణామ్ | 01 | 03 |
| పాంచజన్యం హృషీకేశో | 01 | 15 |
| పార్థ నైవేహ నాముత్ర | 06 | 40 |
| పితాఽసి లోకస్య | 11 | 43 |
| పితాఽహమస్య జగతో | 09 | 17 |
| పుణ్యో గంధః | 07 | 09 |
| పురుషః ప్రకృతిస్థో | 13 | 21 |
| పురుషః స పరః | 08 | 22 |
| పురోధసాం చ ముఖ్యం | 10 | 24 |
| పూర్వాభ్యాసేన తేనైవ | 06 | 44 |
| పృథక్త్వేన | 18 | 21 |
| ప్రకాశం చ ప్రవృత్తిం చ | 14 | 22 |
| ప్రకృతిం స్వామవష్టభ్య | 09 | 08 |
| ప్రకృతిం పురుషం చైవ | 19 | 19 |
| ప్రకృతేః క్రియమాణాని | 03 | 27 |
| ప్రకృతేంర్గుణసంమూఢాః | 03 | 29 |
| ప్రకృత్యైవ చ కర్మాణి | 13 | 29 |
| ప్రజహాతి యదా కామాన్ | 02 | 55 |
| ప్రయత్నాద్యతమానస్తు | 06 | 45 |
| ప్రయాణకాలే మనసా | 08 | 10 |
| ప్రలపన్విసృజన్ | 05 | 09 |
| ప్రవృత్తిం చ నివృత్తిం చ | 16 | 07 |
| ప్రవృత్తిం చ నివృత్తిం చ | 18 | 30 |
| ప్రశాంతమనసం హ్యేనం | 06 | 27 |
| ప్రశాంతాత్మా విగతభీః | 06 | 14 |
| ప్రసాదే సర్వదుఃఖానామ్ | 02 | 65 |
| ప్రహ్లాదశ్చాస్మి దైత్యానామ్ | 10 | 30 |
| ప్రాప్యపుణ్యకృతాం లోకాన్ | 06 | 41 |
| -- బ -- | | |
| బంధురాత్మాఽత్మనస్తస్య | 06 | 06 |
| బలం బలవతాం చాహం | 07 | 11 |
| బహిరన్తశ్చ భూతానామ్ | 13 | 15 |
| బహూనామ్ జన్మనామంతే | 07 | 19 |
| బహూని మే వ్యతీతాని | 04 | 05 |
| బాహ్యస్పర్శేష్వసక్తాత్మా | 05 | 21 |
| బీజం మాం సర్వభూతానామ్ | 07 | 10 |
| బుద్ధియుక్తో జహాతీహ | 02 | 50 |
| బుద్ధిర్జ్ఞానమసంమోహః | 10 | 04 |
| బుద్ధేర్భేదం ధృతేశ్చైవ | 18 | 29 |
| బుద్ధ్యా విశుద్ధయా యుక్తో | 18 | 51 |
| బృహత్సామ తథా | 10 | 35 |

| | అ. | శ్లో. |
|---|---|---|
| బ్రాహ్మణో హి ప్రతిష్ఠాహమ్ | 14 | 27 |
| బ్రహ్మణ్యాధాయ కర్మాణి | 05 | 10 |
| బ్రహ్మభూతః ప్రసన్నాత్మా | 18 | 14 |
| బ్రహ్మార్పణం బ్రహ్మహవిః | 04 | 24 |
| బ్రాహ్మణక్షత్రియవిశామ్ | 18 | 41 |
| -- భ -- | | |
| భక్త్యా తనన్యయా | 11 | 54 |
| భక్త్యా మామభిజానాతి | 18 | 55 |
| భయాద్రణాదుపరతమ్ | 02 | 35 |
| భవాన్ భీష్మశ్చ కర్ణశ్చ | 01 | 08 |
| భవాప్యయౌ హి భూతానామ్ | 11 | 02 |
| భీష్మద్రోణః ప్రముఖతః | 01 | 25 |
| భూతగ్రామః స ఏవాయం | 08 | 19 |
| భూమిరాపోనలో వాయుః | 07 | 04 |
| భూయ ఏవ మహాబాహో | 10 | 01 |
| భోక్తారం యజ్ఞతపసామ్ | 05 | 59 |
| భోగైశ్వర్యప్రసక్తానామ్ | 02 | 44 |
| -- మ -- | | |
| మచ్చిత్తః సర్వదుర్గాణి | 18 | 58 |
| మచ్చిత్తా మద్గతప్రాణాః | 10 | 09 |
| మత్కర్మకృత్ మత్పరమో | 11 | 55 |
| మత్తః పరతరమ్ నాన్యత్ | 07 | 07 |
| మదనుగ్రహాయ | 11 | 01 |
| మనః ప్రసాదః | 17 | 16 |
| మనుష్యాణామ్ సహస్రేషు | 07 | 03 |
| మన్మనాభవ మద్భక్తో | 09 | 34 |
| మన్మనా భవ మద్భక్తో | 18 | 65 |
| మన్యసే యది తచ్ఛక్యమ్ | 11 | 04 |

| | అ. | శ్లో. |
|---|---|---|
| మమ యోనిర్మహద్బ్రహ్మ | 14 | 03 |
| మమైవాంశో జీవలోకే | 15 | 07 |
| మయా తతమిదం సర్వమ్ | 09 | 04 |
| మయాధ్యక్షేణ ప్రకృతిః | 09 | 10 |
| మయా ప్రసన్నేన | 11 | 47 |
| మయి చానన్య యోగేన | 13 | 10 |
| మయి సర్వాణి కర్మాణి | 03 | 30 |
| మయ్యావేశ్య మనో | 12 | 02 |
| మయ్యాసక్తమనాః | 07 | 01 |
| మయ్యేవ మన అధత్స్వ | 12 | 08 |
| మహర్షయః సప్త పూర్వే | 10 | 06 |
| మహర్షీణామ్ భృగురహమ్ | 10 | 25 |
| మహాత్మానస్తు మామ్ | 09 | 13 |
| మహాభూతాన్యహంకారో | 13 | 05 |
| మా తే వ్యథా | 11 | 49 |
| మాత్రాస్పర్శాస్తు కౌన్తేయ | 02 | 14 |
| మానావమానయోస్తుల్యః | 14 | 25 |
| మాముపేత్య పునర్జన్మ | 08 | 15 |
| మా చ యోఽ వ్యభిచారేణ | 14 | 16 |
| మాం హి పార్థ వ్యపాశ్రిత్య | 09 | 32 |
| ముక్తసంగోఽ నహంవాదీ | 18 | 26 |
| మూఢగ్రాహేణాత్మనో | 17 | 19 |
| మృత్యుఃసర్వహరశ్చాహమ్ | 10 | 34 |
| మోఘాశా మోఘకర్మాణో | 09 | 12 |
| -- య -- | | |
| య ఇదం పరమం గుహ్యమ్ | 18 | 68 |
| య ఏవం వేత్తి హన్తారమ్ | 02 | 19 |
| య ఏవం వేత్తి పురుషమ్ | 13 | 23 |

## శ్లోకానుక్రమణిక


| | అ. | శ్లో. |
|---|---|---|
| యచ్చాపి సర్వభూతానామ్ | 10 | 39 |
| యచ్చావహాసార్థమస | 11 | 42 |
| యజంతే సాత్త్వికా దేవాన్ | 17 | 04 |
| యజ్ఞశిష్టామృతభుజః | 04 | 31 |
| యజ్ఞశిష్టాశినః సన్తః | 03 | 13 |
| యజ్ఞార్థాత్ కర్మణోఽన్యత్ర | 03 | 09 |
| యజ్ఞే తపసి దానే చ | 17 | 27 |
| యజ్ఞోదాన తపః కర్మ | 18 | 05 |
| యతతో హ్యపి కౌంతేయ | 02 | 60 |
| యతన్తో యోగినశ్చైనమ్ | 15 | 11 |
| యతః ప్రవృత్తిర్భూతానామ్ | 18 | 46 |
| యతేన్ద్రియ మనోబుద్ధిః | 05 | 28 |
| యతో యతో నిశ్చరతి | 06 | 26 |
| యత్కరోషి యదశ్నాసి | 09 | 27 |
| యత్తు కామేప్సునా కర్మ | 18 | 24 |
| యత్తు కృత్స్నవదేకస్మిన్ | 18 | 22 |
| యత్తు ప్రత్యుపకారార్థమ్ | 17 | 21 |
| యత్ర కాలేత్వనావృత్తిమ్ | 08 | 23 |
| యత్ర యోగేశ్వరః కృష్ణః | 18 | 78 |
| యత్రోపరమతే చిత్తమ్ | 06 | 20 |
| యత్సాంఖ్యైః ప్రాప్యతే | 05 | 05 |
| యథాకాశస్థితో నిత్యమ్ | 09 | 06 |
| యథా దీపో నివాతస్థో | 06 | 19 |
| యథా నదీనాం బహవః | 11 | 28 |
| యథా ప్రకాశయత్యేకః | 13 | 23 |
| యథా ప్రదీప్తం జ్వలనమ్ | 11 | 29 |
| యథా సర్వగతం సౌక్ష్మ్యాత్ | 13 | 32 |
| యథైధాంసి సమిద్ధోఽగ్ని | 04 | 37 |
| యదగ్రే చానుబంధే చ | 18 | 39 |
| యదహంకారమాశ్రిత్య | 18 | 59 |
| యదక్షరం వేదవిదో | 08 | 11 |
| యదా తే మోహకలిలమ్ | 02 | 52 |
| యదాదిత్యగతం తేజో | 15 | 12 |
| యదా భూతపృథగ్భావం | 13 | 30 |
| యదా యదా హి ధర్మస్య | 04 | 07 |
| యదా వినియతమ్ చిత్తమ్ | 06 | 18 |
| యదా సత్త్వే ప్రవృద్ధే తు | 14 | 14 |
| యదా సంహరతే చాయమ్ | 02 | 58 |
| యదా హి నేంద్రియార్థేషు | 06 | 04 |
| యది మామప్రతీకారమ్ | 01 | 46 |
| యది హ్యహం న వర్తేయ | 03 | 23 |
| యదృచ్ఛయా చోపపన్నమ్ | 02 | 32 |
| యదృచ్ఛాలాభ సంతుష్టః | 04 | 22 |
| యద్ జ్ఞాత్వా న పునర్మోహమ్ | 04 | 35 |
| యద్యదాచరతి శ్రేష్ఠః | 03 | 21 |
| యద్యద్విభూతిమత్సత్త్వమ్ | 10 | 41 |
| యద్యప్యేతే న పశ్యంతి | 01 | 38 |
| యయా తు ధర్మకామార్థాన్ | 18 | 34 |
| యయా ధర్మమధర్మం చ | 18 | 31 |
| యయా స్వప్నం భయమ్ | 18 | 35 |
| యస్త్వింద్రియాణి మనసా | 03 | 07 |
| యస్మాత్ క్షరమతీతోఽహమ్ | 15 | 18 |
| యస్మాన్నోద్విజతే లోకో | 12 | 15 |
| యస్య నాహంకృతో భావః | 18 | 17 |
| యస్య సర్వే సమారంభాః | 04 | 19 |
| యం యం వాపి స్మరన్ | 08 | 06 |

| | అ. | శ్లో. |
|---|---|---|
| యం లబ్ధ్వా చాపరం లాభమ్ | 06 | 22 |
| యం సన్న్యాసమితి ప్రాహుః | 06 | 02 |
| యం హి న వ్యథయన్తి | 02 | 15 |
| యః శాస్త్రవిధిముత్సృజ్య | 16 | 23 |
| యః సర్వత్రానభిస్నేహః | 02 | 57 |
| యాతయామమ్ గతరసమ్ | 17 | 10 |
| యా నిశా సర్వభూతానామ్ | 02 | 69 |
| యాన్తి దేవవ్రతా దేవాన్ | 09 | 25 |
| యామిమాం పుష్పితాం వాచామ్ | 02 | 42 |
| యావత్సంజాయతే కించిత్ | 13 | 26 |
| యావదేతాన్నిరీక్షేఽహమ్ | 01 | 22 |
| యావానర్థ ఉదపానే | 02 | 46 |
| యుక్తః కర్మఫలం త్యక్త్వా | 05 | 12 |
| యుక్తాహారవిహారస్య | 06 | 17 |
| యుంజన్నేవం సదాత్మానమ్ | 06 | 28 |
| యే చైవ సాత్త్వికా భావాః | 07 | 12 |
| యే తు ధర్మ్యామృతమిదం | 12 | 20 |
| యే తు సర్వాణి కర్మాణి | 12 | 06 |
| యే త్వక్షరమనిర్దేశ్యం | 12 | 03 |
| యే త్వేతదభ్యసూయన్తః | 03 | 12 |
| యేఽప్యన్యదేవతాభక్తాః | 09 | 23 |
| యే మే మతమిదం నిత్యమ్ | 03 | 31 |
| యే యథా మాం ప్రపద్యంతే | 04 | 11 |
| యే శాస్త్రవిధిముత్సృజ్య | 17 | 01 |
| యేషామర్థే కాంక్షితం నో | 01 | 33 |
| యేషాం త్వంతగతమ్ పాపమ్ | 07 | 28 |
| యేఽపి సంస్పర్శజా భోగాః | 05 | 22 |
| యోగోయుక్తో విశుద్ధాత్మా | 05 | 07 |
| యోగసన్న్యస్త కర్మాణమ్ | 04 | 41 |
| యోగస్థః కురు కర్మాణి | 02 | 48 |
| యోగినామపి సర్వేషామ్ | 06 | 47 |
| యోగీ యుంజీత సతతమ్ | 06 | 10 |
| యోత్స్యమానానవేక్షేఽహమ్ | 01 | 23 |
| యో న హృష్యతి న ద్వేష్టి | 12 | 17 |
| యోఽన్తః సుఖోఽన్తరారామః | 05 | 24 |
| యో మామజమనాదిం చ | 10 | 03 |
| యో మామేవమసంమూఢో | 15 | 19 |
| యో మాం పశ్యతి సర్వత్ర | 06 | 30 |
| యో యో యాం యాం తనుం | 07 | 21 |
| యోఽయం యోగస్త్వయా ప్రోక్తః | 06 | 33 |
| -- ర -- | | |
| రజస్తమశ్చాభిభూయ | 14 | 10 |
| రజసి ప్రలయం గత్వా | 14 | 15 |
| రజో రాగాత్మకం | 14 | 07 |
| రసోఽహమప్సు | 07 | 08 |
| రాగద్వేష విముక్తైః తు | 02 | 64 |
| రాగీ కర్మఫలప్రేప్సుః | 18 | 27 |
| రాజన్ సంస్మృత్య | 18 | 76 |
| రాజవిద్యా రాజగుహ్యం | 09 | 02 |
| రుద్రాణాం శంకరశ్చాస్మి | 10 | 23 |
| రుద్రాదిత్యా వసవో యే చ | 11 | 22 |
| రూపం మహత్తే బహువక్త్ర | 11 | 23 |
| -- ల -- | | |
| లభన్తే బ్రహ్మణనిర్వాణమ్ | 05 | 25 |
| లేలిహ్యసే గ్రసమానః | 11 | 30 |
| లోకేఽస్మిన్ ద్వివిధా | 03 | 03 |

## శ్లోకానుక్రమణిక


| | అ. | శ్లో. |
|---|---|---|
| లోభః ప్రవృత్తిరారమ్భః | 14 | 12 |
| -- వ -- | | |
| వక్తుమర్హస్యశేషేణ | 10 | 16 |
| వక్త్రాణి తే త్వరమాణాః | 11 | 27 |
| వాయుర్యమోఽగ్నిర్వరుణః | 11 | 39 |
| వాసాంసి జీర్ణాని యథా | 02 | 22 |
| విద్యావినయసంపన్నే | 05 | 18 |
| విధిహీనమసృష్టాన్నమ్ | 17 | 13 |
| వివిక్తసేవీ లఘ్వాశీ | 18 | 52 |
| విషయా వినివర్తన్తే | 12 | 59 |
| విషయేంద్రియ సంయోగాత్ | 18 | 38 |
| విస్తరేణాత్మనో యోగమ్ | 10 | 18 |
| విహాయ కామాన్యః సర్వాన్ | 02 | 71 |
| వీతరాగభయక్రోధాః | 04 | 10 |
| వృష్ణీనాం వాసుదేవోఽస్మి | 10 | 37 |
| వేదానాం సామవేదో స్మి | 10 | 22 |
| వేదావినాశినం నిత్యమ్ | 02 | 21 |
| వేదాహం సమతీతాని | 07 | 26 |
| వేదేషు యజ్ఞేషు | 08 | 28 |
| వ్యవసాయాత్మికా బుద్ధిః | 02 | 41 |
| వ్యామిశ్రేణేవ వాక్యేన | 03 | 02 |
| వ్యాసప్రసాదాచ్ఛ్రుతవాన్ | 18 | 75 |
| -- శ -- | | |
| శక్నోతీహైవ యః సోఢుమ్ | 05 | 23 |
| శనైః శనైరుపరమేత్ | 06 | 25 |
| శమో దమస్తపః శౌచమ్ | 18 | 42 |
| శరీరం యదవాప్నోతి | 15 | 08 |
| శరీరవాఙ్మనోభిర్యత్ | 18 | 15 |
| శుక్లకృష్ణే గతీ | 08 | 26 |
| శుచౌ దేశే ప్రతిష్ఠాప్య | 06 | 11 |
| శుభాశుభఫలైరేవమ్ | 09 | 28 |
| శౌర్యం తేజో ధృతిర్దాక్ష్యమ్ | 18 | 43 |
| శ్రద్ధయా పరయా తప్తమ్ | 17 | 10 |
| శ్రద్ధావాననసూయశ్చ | 18 | 71 |
| శ్రద్ధావాన్ లభతే | 04 | 39 |
| శ్రుతివిప్రతిపన్నా తే | 02 | 53 |
| శ్రేయాన్ ద్రవ్యమయాద్యజ్ఞాత్ | 04 | 33 |
| శ్రేయాన్ స్వధర్మో విగుణః | 03 | 35 |
| శ్రేయాన్ స్వధర్మో విగుణః | 18 | 47 |
| శ్రేయో హి జ్ఞానమభ్యాసాత్ | 12 | 12 |
| శ్రోత్రాదీనీన్ద్రియాణ్యన్యే | 04 | 26 |
| శ్రోత్రం చక్షుః స్పర్శనం చ | 15 | 09 |
| శ్వశురాన్ సుహృదశ్చైవ | 01 | 27 |
| -- స -- | | |
| స ఏవాయం మయా | 04 | 03 |
| సక్తాః కర్మణ్యవిద్వాంసః | 03 | 25 |
| సఖేతి మత్వా ప్రసభమ్ | 11 | 41 |
| స ఘోషో ధార్తరాష్ట్రాణామ్ | 01 | 19 |
| సతతం కీర్తయంతో | 09 | 14 |
| స తయా శ్రద్ధయా | 07 | 22 |
| సత్కారమానపూజార్థమ్ | 17 | 18 |
| సత్త్వం రజస్తమ | 14 | 05 |
| సత్త్వం సుఖే సంజయతి | 14 | 09 |
| సత్త్వాత్సంజాయతే జ్ఞానం | 14 | 17 |
| సత్త్వానురూపా సర్వస్య | 17 | 03 |
| సదృశం చేష్టతే స్వస్యాః | 03 | 33 |

| | అ. | శ్లో. |
|---|---|---|
| సద్భావే సాధుభావే చ | 17 | 26 |
| సమదుఃఖసుఖః స్వస్థః | 14 | 24 |
| సమం కాయశిరోగ్రీవమ్ | 06 | 13 |
| సమం పశ్యన్ హి సర్వత్ర | 13 | 28 |
| సమం సర్వేషు భూతేషు | 13 | 27 |
| సమః శత్రౌ చ మిత్రే చ | 12 | 18 |
| సమోఽహం సర్వభూతేషు | 09 | 29 |
| సర్గాణామాదిరన్తశ్చ | 10 | 32 |
| సర్వకర్మాణి మనసా | 05 | 13 |
| సర్వకర్మాణ్యపి | 18 | 56 |
| సర్వగుహ్యతమం భూయః | 18 | 64 |
| సర్వతః పాణిపాదమ్ తత్ | 13 | 13 |
| సర్వద్వారాణి సంయమ్య | 08 | 12 |
| సర్వద్వారేషు దేహేఽస్మిన్ | 14 | 11 |
| సర్వధర్మాన్ పరిత్యజ్య | 18 | 66 |
| సర్వభూతస్థమాత్మానమ్ | 06 | 29 |
| సర్వభూతస్థితం యో | 06 | 31 |
| సర్వ భూతాని కౌంతేయ | 09 | 07 |
| సర్వభూతేషు యేనైకమ్ | 18 | 20 |
| సర్వమేతదృతం మన్యే | 10 | 14 |
| సర్వయోనిషు కౌంతేయ | 14 | 04 |
| సర్వస్య చాహం హృది | 15 | 15 |
| సర్వాణీన్ద్రియకర్మాణి | 04 | 27 |
| సర్వేన్ద్రియగుణాభాసమ్ | 13 | 14 |
| సహజం కర్మ కౌంతేయ | 18 | 48 |
| సహయజ్ఞాః ప్రజాః | 03 | 10 |
| సహస్రయుగపర్యన్తమ్ | 08 | 17 |
| సంకరో నరకాయైవ | 01 | 42 |
| సంకల్పప్రభవాన్ కామాన్ | 06 | 24 |
| సంతుష్టః సతతం యోగీ | 12 | 14 |
| సంనియమ్యేన్ద్రియగ్రామమ్ | 12 | 04 |
| సంన్యాసస్తు మహాబాహో | 18 | 01 |
| సంన్యాసః కర్మయోగశ్చ | 05 | 02 |
| సాధిభూతాధిదైవం | 07 | 30 |
| సాంఖ్యయోగౌ పృథగ్బాలాః | 05 | 04 |
| సిద్ధిం ప్రాప్తో యథా | 18 | 50 |
| సీదన్తి మమ | 01 | 29 |
| సుఖదుఃఖే సమే | 02 | 38 |
| సుఖమాత్యన్తికమ్ | 06 | 21 |
| సుఖం త్విదానీమ్ | 18 | 36 |
| సుదుర్దర్శమిదం | 11 | 52 |
| సుహృన్మిత్రార్యుదాసీన | 06 | 09 |
| స్థానే హృషీకేశ | 11 | 36 |
| స్థితప్రజ్ఞస్య కా భాషా | 02 | 54 |
| స్పర్శాన్ కృత్వా | 05 | 27 |
| స్వధర్మమపి చావేక్ష్య | 02 | 31 |
| స్వభావజేన కౌంతేయ | 18 | 60 |
| స్వయమేవాత్మనాత్మానమ్ | 10 | 15 |
| స్వే స్వే కర్మణ్యభిరతః | 18 | 45 |
| -- హ -- | | |
| హతో వా ప్రాప్స్యసి స్వర్గమ్ | 02 | 37 |
| హన్తత తే కథయిష్యామి | 10 | 19 |
| హృషీకేశం తదా వాక్యమ్ | 01 | 21 |


అ. : అధ్యాయము శ్లో. : శ్లోకము

# పరమపద సోపానములు

1. ఈశ్వర ప్రసాదము, గురు ప్రసాదము, బుద్ధి ప్రసాదము ఈ మూడింటిలో ఏది లోపించిననూ పురుషునికి ముక్తి లభించదు.
2. మానవత్వము, ముముక్షుత్వము, మహా పురుషుని ఆశ్రయము, ఈ మూడునూ దైవానుగ్రహానికి హేతువులు.
3. పురుష ప్రయత్నము, ఈశ్వర అనుగ్రహము ఒకే నాణెమునకు గల రెండు పార్శ్వములవంటివి.
4. పురుష ప్రయత్నము ద్వారానే ఈశ్వరానుగ్రహము వ్యక్తమగును.
5. అదృష్టమంటూ ఒకటి లేదు, అది పూర్వపు పురుష ప్రయత్నమే.
6. అనాదిగా నున్న దైవము నేటి వరకు నిన్ను అనుగ్రహించక పోవుటకు కారణము . . నీ పురుష ప్రయత్న లోపమే.
7. గురుభక్తి లేనివాడు సాధన చేయలేడు. చేసిననూ అహంకారమే పెరిగి సాధన నిష్ఫలమగును.
8. దైవమందు అత్యంత భక్తి కలిగి, అంతే భక్తి తన గురునియందును గలవానికే జ్ఞానము కలుగును.
9. గురుస్మరణయే చిర స్మరణ.
10. ముల్లోకములలో అద్వైతానుభూతిని పొందవచ్చును, కాని గురువు ఎదుట కాదు.
11. శిష్యుని విత్తమును అపహరించు గురువులు అనేకులు. శిష్యహృత్తాపహారక గురువులు అరుదు.
12. గురు సన్నిధానమే నీ సాధన, జ్ఞానమునకు ప్రేరణ.
13. గురువును శంకించుట నిన్ను నీవు శంకించు కొనుటయే.
14. వేద, మంత్ర, యంత్రములలో గల సుఖములేవియూ గురుని అనుగ్రహమునకు మించినవి కావు.
15. కోటి యజ్ఞములు, సహస్ర కోటి గో, హయ దానములను చేసిననూ జ్ఞానము లేనిదే మోక్షము కలుగదు.
16. కోటి కొండల సువర్ణ దానము చేసిననూ ఆత్మతత్త్వము లేనిదే, అదియూ గురువు లేనిదే మోక్షము లేదు.
17. కులం, బలం, ధనం, క్షాత్రం, బంధువులు, సోదరులు ఎవ్వరునూ మరణ సమయములో నిన్ను రక్షింపలేరు. నీ గురువు తప్ప.
18. మాతృ, పితృ, ఆచార్య దేవో భవ– వ్యవహారము. న గురోరధికం కశ్చిత్ –పారమార్థికము.
19. సరియైన సాధకునకు యోగజ్ఞానములు రెండునూ ఒకటియే.

20. శివుడు కోపించిననూ గురువు రక్షించును. గురువే కోపించినచో రక్షించగలవారు లేరు. గురువు శిక్షించినా, రక్షించినా రక్షణ కొరకే.
21. యజ్ఞ యాగాదుల ద్వారా దేవతలను మెప్పించిననూ, గురువును మెప్పించలేరు. గురువును మెప్పించినచో దేవతలందరూ తృప్తినొందెదరు.
22. మనసునకు వశమగు ప్రార్థనలన్నియూ మనసులోనే లయమగును. ప్రాణమునకు వశమగు మనస్సు ఆత్మలో లయమగును.
23. రెండు విద్యలు – శబ్ద బ్రహ్మ, పరంబ్రహ్మ. శబ్ద బ్రహ్మయందు నిష్ఠ, పరంబ్రహ్మను ప్రాప్తింపజేయును.
24. అజ్ఞానము – చీకటి – తమస్సు – ఒకటియే.
జ్ఞానము – వెలుతురు – సత్యము – ఒకటియే.
25. ఓంకార నాదంలో శక్తి జనిస్తుంది. ఇతర అన్ని శబ్దములలో శక్తి వ్యయమగుతుంది.
26. పదార్థములో శక్తిని చూచుట జ్ఞానము. శక్తిని పదార్థముగా భావించుట అజ్ఞానము.
27. నిశ్వాసములో శక్తి పదార్థముగా మారుచున్నది. పైకి పోవు (ఉఛ్వాసము) శ్వాసలో పదార్థము శక్తిగా మారుచున్నది.
28. శరీరోత్పత్తికి మూల స్థానము భ్రూమధ్యమున ఉన్నది. విశాల విశ్వోత్పత్తికి మూలము కూడా భ్రూమధ్యములోనే ఉన్నది.
29. బంధమోక్షములకు కారణము మమ, నిర్మమ. మమ (నాది) బంధ హేతువు, నిర్మమ (నాది కాదు) మోక్షహేతువు.
30. ధ్యాన సముద్రములో లోతుగా ఈదుము. ముత్యములు లభించనిచో సముద్రమును నిందించకుము. నీ ఈతనే నిందించుకొనుము.
31. నీకు సాధ్యము కానిది లేదు – నీ మనోదౌర్బల్యమును పారద్రోలినచో.
32. మనస్సే బంధ మోక్షములకు మూలము. విషయాసక్తత బంధము, నిర్విషయ స్థితి మోక్షము.
33. వాసనలు రెండు : శుద్ధము, మలినము. శుద్ధము – జన్మ వినాశని. మలినము – జన్మ హేతువు.
34. మనసులు రెండు విధములు : శుద్ధము, అశుద్ధము. శుద్ధము కామ వివర్జితము, అశుద్ధము కామ సంకల్పము.
35. చిత్ = ప్రకాశము – బ్రహ్మము
చిత్తము = పదార్థము – ప్రకృతి
36. నీవు, నీ దైవము నీలోనే ఉన్నారు. నీవు క్రిందనున్నావు. నీ దైవము పైన ఉన్నది.

37. క్రిందినున్న నిన్ను పైన గల దైవమును చేర్చు సాధనయే అనన్య చింతన. అదియే యోగము.
38. పురుష ప్రయత్నము చేసినచో నీ యోగ క్షేమములను దైవమే చూచును. లేనిచో దైవము సాక్షిగానే చూచుచుండును.
39. నీకు అన్నియూ లోపములే – దైవప్రేమ లేనపుడు.
దైవమునకు ఒక్కటియే లోపము. అది నీ ప్రేమయే
40. బహిర్గతమగు మనస్సు విషయాసక్తము. అంతర్గతమగు మనస్సు నిర్విషయమగును.
41. ఊర్ధ్వ ప్రాణము – అంతర్ముఖ మనస్సు, అధో ప్రాణము – బహిర్ముఖ మనస్సు.
42. ప్రాణాయామము ఊర్ధ్వగతికి హేతువు. హఠయోగాదులు అధోగతికి హేతువులు.
43. వాయువశమున పూల వాసన ముక్కును చేరును. అట్లే యోగాభ్యాసరత చిత్తము ఆత్మను చేరును.
44. యోగము వలననే జ్ఞానము ప్రాప్తించును. ఆత్మతత్త్వ జ్ఞానము యోగమును వృద్ధి చేయును. యోగజ్ఞానములు రెండునూ గలవాడు ఎన్నటికినీ నశించడు.
45. మనో నిగ్రహమే ఇంద్రియ నిగ్రహము. ప్రాణ నిగ్రహమే మనో నిగ్రహము.
46. దేహ సంశుద్ధి లేనిదే చిత్త సంశుద్ధి కలుగదు. సర్వ నాడీ శుద్ధి కానిదే దేహ సంశుద్ధి కాదు. అది ప్రాణాయామము వలననే సాధ్యం.
47. సంసారములో ఇన్ని బాధలు లేవు. అహంకారమునకు దెబ్బ తగులుట ఒక్కటియే.
48. జ్ఞానాన్ని అనుసరించి లక్ష్యం ఉంటుంది. అజ్ఞానికి భౌతిక ప్రపంచమే లక్ష్యం. జ్ఞానికి బ్రహ్మపదమే లక్ష్యం.
49. దేహాత్మబుద్ధియే కోరికలకు మూలము. దీనికి విలక్షణముగా ఉండు వానికి కోరికలెక్కడివి ?
50. బ్రహ్మము, సత్యము, జ్ఞానము – ఈ మూడును ఒకటియే.
51. భక్తికి జ్ఞానము మూలము. జ్ఞానమునకు భక్తి ప్రధానము.
52. జ్ఞానము లేనిదే ప్రేమ కలుగదు. ప్రేమ లేనిదే సంపూర్ణ శరణాగతి కలుగదు.
53. దీనత్వము భగవంతుని దగ్గరకు చేర్చును. నిరహంకారము దీనత్వమునకు దారితీయును.
54. మనస్సు చలించుటయే కర్మ. మనో వాక్కాయ కర్మలన్నియూ మనశ్చలనమే.
55. త్రికరణ శుద్ధి అనగా మనశ్శుద్ధియే. మనశ్శుద్ధి ప్రాణాయామము వలననే కలుగును.
56. బ్రహ్మపదము నొందుటయే ధర్మము. జ్ఞానము బ్రహ్మపద సోపానము. ప్రాపంచిక ధర్మములు గౌణము (తక్కువ విలువ గలవి).
57. మనస్సును స్వాధీనము చేసుకొనుటకు ప్రాణమొక్కటియే సాధనము. ప్రాణ చలనము వలననే మనస్సు చలించుచున్నది కనుక.

## పరమపద సోపానములు

58. ప్రణవమును దీర్ఘముగా పైకి చరింపజేయుటచే మనో రాజ్యము జయింపబడును.
59. చంచల ప్రాణము – జీవుడు. నిశ్చల ప్రాణము – శివుడు.
60. బోధక గురువు శరీరిగనూ, ఆత్మగనూ ఉండును. బాధక గురువు కేవల శరీర ధారి.
61. దేహ వాసన, శాస్త్ర వాసన, లోక వాసన ఈ మూడునూ చిరకాల యోగాభ్యాసము చేతనే నశించును.
62. సుఖమునిచ్చు అంతర్ముఖమే పుణ్యము. దుఃఖమునిచ్చు బహిర్ముఖమే పాపము.
63. ధన, వయో, విద్యా వృద్ధులు ముప్వురునూ జ్ఞానవృద్ధుని శిష్య కింకరులే.
64. కట్టెలోగల అగ్ని మథనముచే బయల్పడును. యోగాభ్యాసముచే జ్ఞానదీపము వెలుగొందును.
65. తిలయందు తైలము, కట్టెయందు అగ్ని, పుష్పమందు సుగంధము ఉన్నట్లు ప్రకృతి యందు పరమాత్ముడు ఉన్నాడు.
66. ప్రాణవాయువు చలనము ద్వారా మనస్సు బహిర్ముఖమగుటయే కర్మ. ప్రాణాయామము ద్వారా మనస్సు అంతర్ముఖము అగుటయే కర్మయోగము.
67. అతీంద్రియావస్థే సర్వజ్ఞత్వము. ప్రాణవాయు నిగ్రహమే అతీంద్రియావస్థ (భ్రూమధ్యము నందు)
68. జ్ఞానము అనగా తెలుసుకొనుట కాదు. తెలుసుకొనుటకు వేరుగా ఏమియూ లేకపోవుట.
69. ప్రేమించుట అనగా మమకారము కాదు. మమకారము తొలగించుట.
70. జీవించుట అనగా నిశ్వాసము కంటే ఉచ్ఛ్వాసము అధికము. మరణించుట అనగా ఉచ్ఛ్వాసము కంటే నిశ్వాసము అధికము.
71. కోరికలే సంసారము. కోరికలకు మనశ్చలనమే మూలము.
72. మనస్సు ప్రాణచలనము వలన చలించుచున్నది. కనుక ప్రాణ చలనమును అరికట్టే ప్రాణాయామమే కోరికలను నశింపజేయును.
73. స్థూల దృష్టికి భగవంతుడు ఖండముగా, నామ రూపములుగా దోచును.
74. సూక్ష్మ దృష్టికి తాను అఖండముగా తేజోమయుడిగా కనిపించును.
75. మోక్షమనగా తాను కల్పించుకున్న ఇంద్రియ ప్రపంచ బంధము నుండి విడివడుట.
76. మాయలో పడుట అనగా తనలోగల దివ్యశక్తిని ప్రతీ శ్వాసలోనూ కోల్పోవుట.
77. ప్రాణాపానములనే రెక్కలను కట్టి జీవుడనే పక్షిని ఎగురకుండా భ్రూమధ్యమందు లయము చేయుటయే జన్మరాహిత్యము.
78. ఉల్లాసము – భౌతిక ప్రపంచములో పడి దుఃఖము నొందుటకు హేతువు. ఎడతెరిపిలేని పురుష ప్రయత్నము – శాశ్వత బ్రహ్మానందమునకు హేతువు.

## పరమపద సోపానములు

79. జగత్ప్రాణశక్తి, ఆది పరాశక్తి, మనలో గల ప్రాణశక్తి ఈ మూడునూ ఒకటే.
80. ఐహిక విద్యలకు ఇంతమంది గురువులు అవసరమైనపుడు బ్రహ్మ విద్యకు ఒక గురువు కూడా అవసరము లేదా ?
81. ముక్కు ద్వారా బైటకు వచ్చు గాలిని భ్రూమధ్యములో అణచుటయే ముక్తి.
82. క్రిందికి పోవు శ్వాసను పైకి పోవునట్లు చేయుటయే శ్వాసమీద ధ్యాస. అంతియే కాని శ్వాసను గమనించుట మాత్రం కాదు.
83. ఓంకార ధ్వని ద్వారా వాయు సంహారము కావాలి. కేవలం వాయు కుంభకము వలన కాదు.
84. ప్రాణాపానములు కలియుట చేతనే అద్వైత జ్ఞానము కలుగును. కేవలం వచనములతో కాదు.
85. సచ్చిదానంద స్వరూపముననుభవించుట సుఖము. సంసార విషయ సంకల్పమే దుఃఖము.
86. ఒకే భగవంతుడు అందరిలో ఉన్నప్పటికీ నిర్మలము, నిశ్చలము గలవానికి మాత్రమే గోచరించును.
87. నిర్మలము అనగా నీటిలో బురదను తొలగించుట. నిశ్చలము అనగా నీటిలోతరంగములు లేకుండా పోవుట.
88. వాయు సాధనయే మనస్సును నిర్మలము, నిశ్చలముగా చేయును.
89. ధ్యానము అనగా కళ్లు మూసికొని కూర్చొనుట కాదు. వాయు సాధన చేయుచూ నిర్విషయ స్థితి నొందుట.
90. వేదాంతి సోమరి కారాదు. సాధకుడు ఇహ పర కర్మలందు చైతన్యవంతుడై ఉండును.
91. అంతర్ముఖ వాయుసాధనయే సనాతన ధర్మము.
92. మతమనునది ఒకరి అభిప్రాయము కారాదు. సర్వ మానవాళి సమ్మతమే మతము.
93. సాధన ఆహారము కంటే ముఖ్యము. కావున రోజూ సాధన చేయుము.
94. రోగము ఔషధ సేవ ద్వారానే ఉపశమించును. భవ రోగము కూడా అద్వైతానుభూతి ద్వారానే ఉపశమించును. నేనే బ్రహ్మమునని భావించిననూ ఉచ్చరించిననూ సంసారము నశింపదు.
95. దేవుని కనుగొనుటకు కొత్త మార్గములేవియూ లేవు. ఉన్నవన్నచో అవియన్నియూ అవగాహనా లోపములే.
96. తనలో తన ఆత్మను చూచుట స్వధర్మము. అన్యముగా దైవమును భావించుట పరధర్మము.
97. సత్వము, తమస్సు బయటకు ఒకే విధముగా కనిపించును. సత్వములో చైతన్యము, జ్ఞానము,

ఆనందము ఉండును. తమస్సులో జడత్వము, బుద్ధి మాంద్యము, అలసత్వము ఉండును.

98. అన్నదోషము చిత్తమును మలినము చేయును. మలిన చిత్తమునకు జ్ఞానము కలుగదు.

99. అవివేకికి శాస్త్రము భారము. కోరికలు గలవానికి జ్ఞానము భారము. అశాంతునకు మనస్సే భారము. ఆత్మవేత్త కాని వారికి తన శరీరమే భారము.

100. ఆసనాది వ్యాయామములచే శరీరము తేలిక కావచ్చును. సూక్ష్మజ్ఞానము కలుగదు.

101. వాయు సాధనలో ప్రాణ మధనము వలన శరీరము మరియూ మనస్సు శుద్ధమై ఆత్మజ్ఞానం కలుగును.

– సద్గురు శ్రీ అంతర్ముఖానంద

పీఠాధిపతి, శ్రీస్వామి రామానంద

యోగ జ్ఞానాశ్రమం, కామన్నవలస

సమాప్తము